
సుందర కాండ

సుందర మకరందం



వక్త

ఆంధ్ర వాల్మీకి - కవి సార్వభౌమ

శ్రీ వాసుదాస స్వామి

అనువక్త - వాచవి

వనం జ్వాలా నరసింహారావు

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక విశిష్ట ప్రచురణ

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం

సుందర కాండ

మందర మకరందం

Srimadandhra Valmiki Ramayanam
Sundara Kaanda - Mandara Makarandam

వక్త

“ఆంధ్ర వాల్మీకి–కవి సార్వభౌమ”

శ్రీ వాసుదాస స్వామి

అనువక్త – వాచవి

వనం జ్వాలా నరసింహా రావు

‘దర్శనమ్’

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

సభక్తిపూర్వక సమర్పణమ్

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణం

'సుందర కాండ' మందర మకరందం

Srimadandhra Valmiki Ramayanam
Sundara Kaanda - Mandara Makarandam (Telugu)

వక్త : ఆంధ్ర వాల్మీకి, కవిసార్వభౌమ, **శ్రీ వాసుదాస స్వామి**

అనువక్త - వాచవి : **వనం జ్వాలా నరసింహారావు**

ప్రథమ ముద్రణ : జులై, 2004

ద్వితీయ ముద్రణ : ఆగస్ట్, 2009

తృతీయ ముద్రణ : ఆగస్ట్, 2018

ప్రతులు : వేయి

వెల : ₹ 300/- (మూడు వందలు)

అక్షరాలకూర్పు : **ఆరవేటి వెంకటసుబ్బయ్య**
98492 42028

టైటిల్ కవర్ డిజైన్ : **శ్రీరామోజు గణేశ్**

ముద్రణ : **సాయితిరుమల ప్రింటింగ్ ప్రెస్**
చిక్కడపల్లి, హైదరాబాద్

ప్రతులకు:

మరుమాముల వెంకటరమణశర్మ
'దర్శనమ్' ఆధ్యాత్మిక మాసపత్రిక
29-105/1/1, న్యూ విద్యానగర్,
నేరేడ్‌మెట్, సికిందరాబాద్ - 56.
94410 15469,
040-27220401

జయభేరి

1. మ్రొక్కెద రామచంద్రునకు మోడ్చెద గేలు సుమిత్ర పట్టికిన్
మ్రొక్కెద దద్విదేహ పతనూజకు శ్రీ రఘురాము దేవికిన్
మ్రొక్కెద ధర్మ వాసవ మరుద్గణ మారుత రుద్రపాళికిన్
మ్రొక్కెద సూర్య చంద్రులకు మ్రొక్కెద దామర సాప్తు సూతికిన్
2. జయము జయంబు రామునకు సారపరాక్రమ ధన్యమూర్తికిన్
జయము జయంబు! విద్విషద సహ్యాత రస్వి సుమిత్ర పట్టికిన్
జయము జయంబు దాశరథి సంపరి పాలితుడౌ వలీ ముఖో
చ్ఛయపతి సూర్యపుత్రునకు సాహస విక్రమ కీర్తి శాలికిన్
3. దాసుడ సర్వ సద్గుణ వితాన మనోహర రామ మూర్తికిన్
గోసల దేశ వల్లభునకున్ హత శత్రుడ వాయు పుత్రుడన్
నాసరి గారు సంగరమునన్ దశ కంఠులు వేవురేనియున్
వాసియడంతు రాల ద్రుమ పాళుల నే హనుమత్స మాఖ్యుడన్
4. అయోధ్యాపుర నేతారం, మిధిలాపుర నాయకీం
రాఘవాణా మలంకారం, వైదేహానా మలంక్రియామ్
రఘూణాం కులదీపంచ, ని మినాం కులదీపికామ్
సూర్య వంశ సముద్భూతం, సోమ వంశ సముద్భవమ్
5. పుత్రం దశరధ స్యాపి, పుత్రీం జనక భూపతే
వసిష్ఠాను మతాచారం, శతానంద మతానుగామ్
కౌసల్యా గర్భ సంభూతం, వేదగర్భోదితాం స్వయమ్
పుండరీక విశాలాక్షం, స్ఫురదిందీ వరేక్షణామ్
6. మత్త మాతంగ గమనం, మత్తహంస వధూగతామ్
సర్వలోక విధాతారం, సర్వలోక విధాయినీమ్
లోకాభి రామం శ్రీరామం అభి రామాంచ మైథిలీం
అన్యోన్య సదృశా వేతౌ త్రైలోక్య గృహదంపతీ

❖ ❖ ❖

విషయ సూచిక

❖ ❖ ❖

అభినందన చందనం

శ్రీ రామాయణం క్షీరధార. అందులో సుందరకాండ పంచదార. అందులోనూ శ్రీవాసుదాసస్వామి వారి "మందరం" మందార మకరంద మాధుర్యం. "కవికులగురువు-కాళిదాసు" అన్నట్లు:

"వృత్తమ్ రామస్య వాల్మీకీః, కృతి తౌ కిన్నెర స్వరౌ!
కింతత్? యేన మనోహర్తుమ్ అలంస్యాతాం నశ్రుణ్వతామ్'!"

(చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తూ వాల్మీకులవారిది. గానం చేసేవారు కిన్నెర గాత్రులైన కుశ-లవులు. ఇంతటి మహనీయమైన రామాయణంలో శ్రోతలను పరవశింప చేయని అంశమేముంటుంది?)

అలాగే ప్రతి అక్షరమూ మంత్రమయమైన శ్రీ సుందరకాండ ఇహపర శ్రేయస్సాధనంగా మన పెద్దలంతా సంభావించారు. మనం ఇదంతా వాస్తవమేనని విశ్వసిస్తున్నాం. ఆయా శుభాలను హాయిగా అనుభవిస్తున్నాం. శ్రీ వాసుదాసస్వామివారి "మందరం" (ఆంధ్ర వాల్మీకి రామాయణం) తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకుంది. కానీ కాలక్రమంలో అది మరుగున పడిపోతుందేమోనన్న భయం, అందోళనలతో, వనం జ్వాలానరసింహా రావు దానికి అనువక్తగా మనకు అందిస్తున్నాడు సరళమైన వాడుక భాషలో సాధ్యమైనంత లఘు కృతిలో. ఒక వైపు తన విధ్యుక్త ధర్మాలనూ, బాధ్యతలనూ నిర్వహిస్తూనే, వేరొక వైపు శ్రీరామ కైంకర్యాన్ని ఇలా చేయకలగడం చాలా సంతోషం. మూడు నెలల ఆయన అమెరికా పర్యటన ఆయనకు ఇది వ్రాయడానికి అవసరమైన సమయం లభించేటట్లు చేసింది.

యది క్షుణ్ణం, పూర్వైరితి జహతి రామస్యచరితం
గుణైరేతావద్భిః జగతి పునరణ్యో జయతి కః" - మురారిభట్టు.

అనన్యసామాన్యమైన సీతారాముల కథను ఎందరు ఎన్ని విధాలుగా మార్చి-మార్చి, కూర్చినా, దాని మాధుర్యం, ఇంకా-ఇంకా వృద్ధి పొందుతూనే వుంటుంది. వసివాడని పారవశ్యం అది. జ్వాలా నరసింహారావుకు ఆశీరాభినందన చందనాలను అందచేస్తున్నాను.

(స్వర్గీయ) పి.వి.ఆర్.కె.ప్రసాద్, ఐఎఎస్
(మాజీ) డైరెక్టర్ జనరల్
డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ
హైదరాబాద్

మంగళతోరణం

శ్రీ సుందర కాండ ఒక మహా మంత్ర భాండాగారం

శ్రీ సుందరకాండ ఒక మహా మంత్ర భాండాగారం. చక్కదనానికి సంకేతం. మనస్సును మురిపించేదే నిజమైన సౌందర్యం. శాబ్దిక పారమ్యాన్ని నింపుకున్న రామాయణంలోని ప్రతి అక్షరమూ మధురాతి మధురమేకాదు?.. మహా మంత్రాక్షరాలతో నిక్షిప్తమైన అక్షయ నిధానం. శ్రవణ స్మరణాదుల మాత్రం చేత అంతఃకరణ శుద్ధి, ఆశయ సిద్ధి, సద్బుద్ధి లభిస్తాయట! వింటేనే చాలు సర్వతో భద్రమన్నారు. అలాంటి వాల్మీకి భగవానుని అనుగ్రహ ప్రసాదమైన రామాయణంలో సారభూతమైనదీ, సర్వారిష్ట నివారకమైనదీ, సర్వాభీష్ట ఫల ప్రదానమైనదీ శ్రీ సుందరకాండ. రామాయణంలో ప్రతికాండకూ అందలి కథా విశేషాన్ని బట్టీ, ఇతివృత్తాన్నిబట్టీ వాల్మీకుల వారు పేరు పెట్టారు. కానీ సుందరకాండ మాత్రం ఈ నియమానికి కట్టుబడినట్లు కనిపించదు, లోతుకు వెళ్లితే తప్ప. “ఏమిటీ ఆ సౌందర్యం” అంటే, “అందులో సుందరం కానిదేమున్నది” అంటారు విజ్ఞులు.

సుందరకాండలో ప్రస్తావించబడిన ప్రతి అంశమూ సౌందర్యమయమే అన్నారు. శ్రీరాముడు 96 అంగుళాల పొడవైన మహా చక్కనివాడు. సీతమ్మ అపురూప సౌందర్యరాశి. అశోకవనమూ–మధువనమూ అతిలోక సుందరమైనవే. ప్రతి శ్లోకంలోనూ పల్లవిస్తూ లయలతో హృయలొలికే గాయత్రీ మంత్రాక్షరాలు అద్భుత సుందర బంధురాలైన శబ్దమాలికలు. ఆద్యంతాలూ కనిపించే వానరాలు సుందర అరవిందాలు. ఇక కావ్యమా? నిరుపమాన సౌందర్యనిధానం. ఆదికావ్యం. పదపదం అక్షర రమ్యం. దివ్యం. ఇక సుందరకాండ ధ్వని, అర్థ సామర్థ్యాలతో చదువరిని మంత్రముగ్ధుడిని చేయగల ఫణితితో నిండినది.

సముద్రతరణం – లంకాగమనం – సీతాన్వేషణం – శ్రీరామ నివేదనం– ఇవన్నీ కలిస్తే సుందరకాండ! జరిగిన ఇతివృత్తం యావత్తూ దినద్వయం లోపే. శబ్దాను ప్రాసలతోనూ, అంత్య ప్రాసలతోనూ మార్దంగిక వైభవంగా సాగుతాయి శ్లోకలతలు. “చంద్రోదయ వర్ణన” (ఐదవ సర్గ) ఒక్కటి చాలు.... పదవిన్యాసాన్ని

తిలకించడానికి. అర్థ సౌందర్యం – రస సౌందర్యం – కథా నాయికా నాయకులైన శ్రీ సీతారాముల సౌందర్య విశేషాలు (జీవాత్మ–పరమాత్మల సౌందర్యాలు)– ఆచార్యుడైన హనుమత్ సౌందర్యం–మహావిశిష్టమైన లంకా నగర సౌందర్యం– లంకానగర ప్రమదావన సౌందర్యం – లోక రావణుడైన రావణ రాజసవీర సౌందర్యం – హనుమంతుడి సమయోచిత బుద్ధిబల సౌందర్యం – వాల్మీకి మహత్తర కవితా శిల్ప సౌందర్యం, ఆదిమధ్యాంతాలూ నింపుకున్నది కాబట్టే, దీనిని వాల్మీకి "సుందరకాండ" అన్నారు. "సుందరః" అంటే హరి అని అర్థం. హరి అంటే నారాయణుడూ కావచ్చు – కోతీ కావచ్చు. శ్రీమన్నారాయణుడైన శ్రీరాముడు, అరివీర పరాక్రముడూ – అంజనీ సూనుడూ అయిన ఆంజనేయుడు కోతి రూపంలో దర్శనీయులౌతారు ఇందులో.

ఇందులో అద్భుతమైన సాముద్రిక, సాగరిక, జలాంతర్గత, వాయు, వియత్తల, స్వప్న, ధర్మ, దౌత్య, రాజనీతి శాస్త్రాల రహస్యాలు ప్రచ్ఛన్నంగా ఉండడం గొప్ప విశేషం. కంటికి కనిపించే అవయవ సంపుటిని బట్టి కంటికి కనిపించని అవయవ విశేషాలను పసిగట్టి, వ్యక్తి తత్త్వాన్నీ, ఔన్నత్యాన్నీ వ్యక్తపరిచే సునిశిత కౌసల్యం ఇందులో నిక్షిప్తం చేయబడినందున, "వైఖరీ విద్యాపారంగతులకు" ఇదొక ప్రమాణ గ్రంథం.

మంత్రశాస్త్రమే సుందరకాండ. ఇది గాయత్రీ బీజ సంయుతం. దీనికి విశ్వామిత్రుడు ఋషి. వాల్మీకి మహా ఋషి. ఆంజనేయుడు మంత్రాధి దేవత. సర్వారిష్ట నివారణ ఫలం. ఆద్యంతాలూ "త" కార, "స" కారాలతో సుసంపన్నమైన మహా మంత్ర వనం సుందర నందనం! "త", "థ", "స", "న", "ర" ల పట్టు అంతా ఈ అక్షరాలలో విధేయంగా అణగి వుంది. "రామ", "సీత", "హనుమ", "దశరథ", "భరత", "శత్రఘ్ను", ఇవన్నీ పేర్లుగా కనిపించినా, నిజానికి మంత్ర మూలికలు... మహిమాన్విత మంత్ర మాలికలు. అందువల్లనే దీనిని శ్రద్ధగా చదువుతారు. నియమంగా పారాయణం చేస్తారు. నిష్ఠగా శ్రవణం చేస్తారు. ఇవేవీ సాధ్యపడక పోయినా, పరోక్షంగా సుందరకాండను ప్రాచుర్యంలోకి తెస్తారు.

వావిలికొలను సుబ్బారావుదాసు అని (వాసుదాసు) ఒక మహా.... మహానుభావులు మన తెలుగు గడ్డపై అవతరించి, వాల్మీకి రామాయణాన్ని మందరం పేరుతో యధావిధేయంగా, ఛందోబద్ధంగా మూల మంత్రాలనూ, మంత్రాక్షరాలనూ సైతం రమ్యత, పారమ్యతలకు విఘాతం కలుగని రీతిలో తెలుగులోనికి అనువదించి ఆంధ్ర వాల్మీకి అన్న గౌరవాన్ని సంపాదించుకున్నారు. వ్యాస భాగవతాన్ని మరిపించిన పోతన భాగవతం వలె, వాల్మీకాన్ని ఆంధ్ర వాల్మీకి రామాయణం మరిపించి తెలుగువారిని మురిపించింది. శ్రీవారి అవతారకాలంలోనే నాలుగైదు పర్యాయాలు ప్రచురణ పొంది, విశేషమైన ప్రాచుర్యాన్ని పొందగలిగింది 100 ఏండ్ల క్రితమే! ఊహాతీత ప్రతిభావిరాజిగా వాసుదాసుగారు రామ భక్తుల హృదయారవిందాలలో సుప్రతిష్ఠులైనారు. వందేళ్లు పైగా కావొస్తూంది. కాలవిరామం పెరిగిపోతోంది. క్రమంగా వాసుదాసస్వామి వారు జనహృదయాలకు దూరంగా జరిగిపోతున్నారేమో అనిపిస్తున్న తరుణంలో, అశేష తెలుగు హృదయాలకు మరోమారు ఆయన్ను గుర్తు చేసే దిశగా ఆయన రాసిన వాల్మీకి తెలుగు అనువాదంలోని సుందరకాండను పాఠకులకు అందించే ప్రయత్నమే ఇది. "అవసరమైన సమయాలలో యధాయోగ్యంగా అవతరిస్తారన్నమాట" నిజమేనని గుర్తుచేస్తూ, ఇదిగో, ఈ "సుందర మందర మకరందం" పదారవిందమై కరారవిందమౌతోంది.

వాసుదాసు గారు ఆంధ్ర వాల్మీకులుగా లబ్ధ ప్రతిష్ఠులైనారు. మహనీయమైన మందర రామాయణాన్ని అనేకానేక విశేషాలతో, పద్య-గద్య- ప్రతిపదార్థ-తాత్పర్య-ఛందోలంకార విశేష సముచ్ఛయంతో నిర్మించి వేలాది పుటలలో కూర్చి మనకు అందించారు. రామాయణ క్షీరసాగరాన్ని మందరం మథించి మన కందరకూ ఆప్యాయంగా అందించింది. కానీ దానిని ఆస్వాదించే తీరికా, ఓపికా లేని జీవులమైపోయాం మనం. భాష, శైలి, అర్థం, తాత్పర్యం, కాలక్రమంలో పరిణామం చెందాయి. సూక్ష్మంలో మోక్షం కావాలంటున్నారు నేటి తరం పఠితులూ, పండితులూ కూడా. ఆత్మ తృప్తికీ, స్ఫూర్తికీ, మనశ్శాంతికీ, సర్వబాధోపశమనానికీ ఇది దివ్య రసమయ పానీయం. అందువల్లనే ఇందులో శ్లోకాలూ, పద్యాలూ దాదాపు కనిపించవు. సాహితీ పిపాసులకూ, సౌందర్యా రాధకులకూ, ఆస్తిక భావుకులకూ ఇది హృద్యమైన నైవేద్యం కాగలదని భావిస్తున్నాను.

ఇంతలో ఒక వింతగా, మా వనం జ్వాలానరసింహారావు గారి దృష్టిలో ఒక దివ్య అనుభూతి తళుక్కున మెరిసింది. ఆవేళ భద్రాద్రిలో, శ్రీసీతారామచంద్ర స్వామివారి దివ్యదర్శనంతో (27-12-2002) వాసుదాసుగారు ఆయనను ఆవహించారో, ఏమోగాని, "మందరం" మనమందరం చదవాలనీ, అందులోని అందమైన సుందరకాండను తొలుత మన తెలుగు సోదరులందరికీ సమాదరంగా అందించాలనీ ఆయన భావించారు. అంతే, తేజస్వి, మధురమనస్వి, వాచస్వి, ఏకసంతగ్రాహి, తన తండ్రిగారూ అయిన స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారు మందరాన్ని ఎన్నోసార్లు పారాయణం చేసారనీ, ఆ స్ఫూర్తి తనను నడిపిస్తోందనీ విశ్వసించారు. రామాయణం సుందరకాండతోనే ప్రారంభించాలంటారు కదా! ఉద్యమించారు శ్రీజ్వాల. **"పలికెడిది భాగవతమట! పలికించెడు వాడు రామభద్రుండట"** అని పోతనగారు వినమ్రతగా భాగవత పాఠకులకు విన్నవించుకున్నట్లే, జ్వాల కూడా వాసుదాసస్వామివారికి "అనువక్తగా", ఆమహానుభావుని శ్రీరామాయణ అభివ్యక్తీకరణకు తాను ముగ్ధుడైనాడట. తాను స్వయంగా అనుభవించిన ఆ అమృత రసాస్వాదనాన్ని తన తెలుగు సోదరులచేత అనుభవింపచేసే "వాచవి"ని మాత్రమేనని విజ్ఞాపన చేసుకున్నాడు.

శ్రీ వనం జ్వాలా నరసింహారావు ప్రజారంగంలోనూ, పాత్రికేయ రంగంలోనూ, పాలనా విధాన శిక్షణా రంగంలోనూ సుప్రసిద్ధులు. సనాతనాన్నీ, అధునాతనాన్నీ సమర్థంగా సమాదరించే సమవర్తి. పాతవన్నీ పనికిరావనీ, క్రొత్తవన్నీ గొప్పవనీ నమ్మే ఈనాటి తరాన్ని మృదువుగా మందలించి, మంచిదన్నది సర్వదా-సర్వథా ఆదరణీయమేనన్న విశ్వాసాన్ని శ్వాసించే సరళ హృదయ సౌజన్యం ఆయనది. ఆనాటి అయోధ్యా వాసులకు రామభూతం ఆవహించిందని అందంగా వాల్మీకులన్నారు. ఈ వేళ వాసుదాసస్వామివారు జ్వాలా గారిని ఆవహించి, తనకు నచ్చిన రీతిలో, తమ మందరానికి మొదలుగా సుందరంతో మకరందవ్యాఖ్య అందించమని ఆదేశించారో, ఏమో గానీ, జ్వాలాగారు హృదయంగమంగా ఆ పని చేశారు.

ఇది వాసుదాసస్వామివారి సుందరకాండ మందర వ్యాఖ్యకు సారభూతమైన మకరందం. అందుకే దీనిని సుందర మందర మకరందం అన్నారు వారు.

తెలుగు, ఆంగ్లభాషలలో అనర్గళమైన వాగ్వైఖరి వారిది. అలవోకగా పురాణాలలోని పద్య–గద్యాలను అనువద్యంగా వల్లించగల మేధ వారిది. వాసుదాసస్వామివారి అనుగ్రహ ప్రసాదాన్ని ప్రతి తెలుగువారి ప్రాసాదంలో భద్రంగా అందించాలని వారి తపన. దానికి తొలి తొలకరి రూపమే ఈ సుందరకాండ మందర మకరందం.

ఆత్మతృప్తికీ, స్ఫూర్తికీ, మనశ్శాంతికీ, సర్వబాధోపశమనానికీ ఇది దివ్య రసమయ పానీయం. సాహితీ పిపాసులకూ, సౌందర్యారాధకులకూ, ఆస్తికభావుకులకూ ఇది హృద్యమైన నైవేద్యం కాగలదని భావిస్తున్నాను. ఈ కైంకర్యం ద్వారా జగత్ప్రథమ మంగళ నామధేయుడైన రామచంద్రుడి పరిపూర్ణానుగ్రహానికి పాత్రులు అవుతున్న జ్వాలాగారిని హార్దికంగా అభినందిస్తున్నాను. నాకు సహచరుడూ, పొరుగువాడూ, మనసెరిగిన "మధు" మయ హృదయుడూ, ఏకాదశీ, పునర్వసుల సంగమ సమయంలో పౌత్రుడ్ని చేతికెత్తుకున్న తాత ఆయన. ఇది అంతం కాదు, ఆరంభం మాత్రమే కావాలని ఆకాంక్షిస్తున్నాను. మిగిలిన కాండలను ఇలాగే అందించే శక్తి, సమయ, సామర్థ్యాలను జ్వాలా గారికి అనుగ్రహించాలని శ్రీ సీతారామచరణ కమలాల మ్రోల శరణాగతి సమర్పిస్తూ ఆశిస్తున్నాను. రామరహితమైన జన్మ వ్యర్థం అని నొక్కి చెప్పిన ఆనాటి అయోధ్యావాసుల శ్రీపాదాలకు తలవంచి నమస్కరిస్తున్నాను.

చిలకపాటి విజయరాఘవాచార్యులు
ఆధ్యాత్మికవేత్త

❖ ❖ ❖

ముందుగా నా మాట

మా పొరుగునున్న శ్రీమాన్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు లేచింది మొదలు నిద్రపోయేదాక రామనామం తప్ప దేనిమీద మనస్సు పోనీయడు. ప్రతినిత్యం రామాయణ పారాయణం చేస్తూ వుంటాడు. నా కంటే వయస్సులో చిన్నవాడైనా, జ్ఞానవృద్ధుడు. నా నిత్య కృత్యాలు చాలావరకు ఆయనకు నచ్చవు. నేనంటే మాత్రం ఇష్టం. ఆయన ఉదయం అనుష్ఠానం చేసుకుంటుంటే, చనిపోయిన మా నాన్న స్వర్గీయ వనం శ్రీనివాసరావుగారు గుర్తొచ్చేవారు. నాన్నగారు వాసుదాసు గారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణం, మందరం అన్ని కాండల్నీ, కనీసం పాతికసార్లకు పైగా పారాయణం చేసినవారు. వాసుదాసుగారూ ఆయన శిష్యులు సుబ్బదాసుగారూ (దాసశేషుడు) ఖమ్మం జిల్లాలోని వనంవారి కృష్ణాపురం గ్రామంలో వున్న మా ఇంట్లో వారి పాదాలు మోపి మా ఇంటిని పావనం చేసారు చాలా సంవత్సరాల కింద. నేనూ మా నాన్నగారితో నా చిన్నతనంలో తెనాలి దగ్గర అంగలకుదురులోని వారి ఆశ్రమానికి వెళ్లాను ఒకటి-రెండు సార్లు.

మా శ్రీమతికి మా నాన్న గారి పూజ-పునస్కారాల వారసత్వం వచ్చింది. నాకంతగా అబ్బ లేదు. ప్రక్కనున్న విజయరాఘవ గారినీ, ఆయన భక్తి సంబంధమైన మాటలను ఎప్పుడూ వింటుంటే ఆమె: "మీరు అన్న గారి మార్గంలోనన్నా పోతారు, లేదా, ఆయన మీ దారికన్నా వస్తారు" అనేది, మేమిద్దరం చర్చించుకుంటుంటే. అదే నిజమైంది కొద్ది రోజుల్లో. నేను రామాయణం చదువుతాను, మీ దగ్గరుంటే ఇవ్వండి, అయితే వాసుదాసు గారు వ్రాసిన ఆంధ్రవాల్మీకి రామాయణం మాత్రమే కావాలన్నాను. అలా అడగటానికీ, అదే కావాలంటానికీ, ప్రత్యేక కారణం ఏమీ లేదు. కాకపోతే నా చిన్న తనంలో, మా నాన్న గారు "మందరం" పారాయణం చేస్తుంటే చూశాను కనుక అది మాత్రమే రామాయణమేమో అనుకున్నాను. అయితే నేను రామాయణం చదువుతానంటే ఆయన కొన్నాళ్ళు నమ్మలేదు. నేనూ గట్టిగా అడగనూలేదు. ఆయన ఇవ్వనూ లేదు. నేను ఆలోచన వచ్చిన వెంటనే చదవటమూ జరగలేదు.

మళ్ళీ నిత్య జీవితం. దైనందిన చర్యలు. మధ్యలో మా జిల్లాలోనే వున్న భద్రాచల రాముడినీ, పొరుగు రాష్ట్రంలో ఉన్న శ్రీరంగనాధ స్వామినీ, దర్శించుకొనే భాగ్యం కలిగింది, డిసెంబర్ 2002-జనవరి 2003లో. "శ్రీ రామావతార సమయంలో శ్రీ సీతారాముల దర్శనం ఏదోవిధంగా కలగందే ఈ జన్మలో శ్రీరంగనాధుని (శ్రీరంగం) దర్శనం కలగనే కలగదు" అన్నారు విజయరాఘవ గారు. జనవరి 15, 2003న తన ఇంట్లోకి పిల్చి, స్నానం చేసి రమ్మని, వాసుదాసుగారి శ్రీమదాంధ్రవాల్మీకి రామాయణం సుందరకాండ మందరం నా చేతిలో పెట్టారు. రామాయణం మొత్తం చదవడం తర్వాత, ముందిది చదవమన్నారు. ఎందుకంటే, రామాయణం పఠనమో, పారాయణమో సుందరకాండతోనే మొదలెట్టాలన్నారు. అవునేమోననుకుని చదవడం ప్రారంభించాను.

సరిగ్గా పది రోజుల్లో ఆసాంతం చదివాను. ఏ రోజుకారోజు, వీలున్నప్పుడల్లా చదివేవాడిని. చదివిన విషయ సారాంశం ఎప్పటికప్పుడు బడి పిల్లాడిలా, విజయరాఘవ గారికి అప్పచెప్పేవాడిని. వశిష్ఠుడి నోట బ్రహ్మర్షి అంటేనే విశ్వామిత్రుడు ఒప్పుకున్నాడట! నేను చదువుతున్నానన్న నమ్మకం ఆయనకు కలిగితేనే నాకెందుకో తృప్తనిపించేది. పదిరోజుల్లో చదవడం గొప్ప కాదు. నన్ను ప్రేరేపించి, ప్రోత్సహించి చదివించిన ఆయన గొప్పతనం అది. వాల్మీకి సంస్కృతంలో వ్రాసిన ఇరవైనాలుగు వేల శ్లోకాలను ఎప్పుడంటే అప్పుడు ప్రతిపదార్థంతో సహా అప్పచెప్పగల సమర్థుడాయన!

ఆరువందల డెబ్బై పేజీల పద్య-గద్య-ప్రతిపదార్థ తాత్పర్య సహిత సుందరకాండ మందరాన్ని చదవడానికైనా, పారాయణం చేయడానికైనా, నా లాంటి చాలామందికి తీరికా, ఓపికా వుండదేమో అనిపించింది. తెలుగు భాషలో కనీస ప్రావీణ్యత వున్నవారికి అర్థమయ్యే రీతిలో వాసుదాసుగారి సుందరకాండ మందరాన్ని, ఆయనే "వక్తగా", నేను కేవలం "వాచవిగా-అనువక్తగా" సంక్షిప్తీకరించి నలుగురికీ అందించగలిగుతే బాగుంటుందేమో అనుకున్నాను

కొన్ని పేజీలు వ్రాసిన తర్వాత విజయరాఘవగారు చూసారు. సుందర హనుమంతుడిని అర్థం చేసుకున్న దాఖలాకు నేను వ్రాసిన కొన్ని పేజీలు

నిదర్శనమని వ్యాఖ్యానించారు. "బాగుంది, పెద్దల ఆదరాభిమానాలకు, ఆమోద-ప్రమోదాలకు పాత్రం కాగలదు" అంటూనే, మనం మాట్లాడే శిష్ట వ్యావహారిక భాషలో వ్రాయడం వల్ల మరింత శోభిస్తుందని ఓ చురక తగిలించారు. ఇంతలో అనుకోకుండా సిన్సినాటి (అమెరికా) లో వుంటున్న మా అమ్మాయి కిన్నెర దగ్గరకు మా ఆవిడతో సహా వెళ్లాల్సి వచ్చింది, మనుమరాలు పుట్టబోయేముందర మా అమ్మాయికి తోడుగా వుండేటందుకు. అక్కడ మళ్ళీ మొదలెట్టి ఓ నెల రోజుల వ్యవధిలో శ్రీరామానుగ్రహం వల్ల పూర్తి చేసాను. అయితే, అసలు-సిసలు శిష్ట వ్యావహారిక భాష అన్ని చోట్లా వాడలేక పోయాను. పూర్తయిన తర్వాత (స్వర్గీయ) భండారు పర్వతాల రావు గారినీ, విజయ రాఘవాచార్యులు గారినీ వ్రాసిన దానిని ఆమూలాగ్రంగా చదివి, తప్పులు సరిదిద్ది, ఒప్పులు చేసి ఇవ్వమని అడిగాను. ఆకాశవాణి న్యూస్ ఎడిటర్ ఆర్ వి వి కృష్ణారావు గారిని అభిప్రాయం అడిగాను. అందరూ అందించిన సూచనలు ఇందులో అవసరమయినంతమేరకు పొందుపర్చబడ్డాయి. మూడవ ముద్రణ అచ్చు తప్పులను సరిదిద్దిన కొమరగిరి శ్రీరామచంద్రమూర్తి గారికి ప్రత్యేక ధన్యవాదాలు.

విజయారాఘవాచార్యుల గారి శైలే వేరు. ఆయన నేను వ్రాసి-టైపు చేసిన ప్రతిని నాకు తిరిగిస్తూ ఏమన్నారో, ఆ అన్నదాన్ని యథాతథంగా వ్రాస్తున్నాను.

*"కల్యాణ మిత్ర వరేణ్యా! ఆమూలాగ్రంగా చదవమన్నారు, చదివాను. తప్పులు సరిదిద్ది, ఒప్పులు చేసి ఇవ్వరా? అన్నారు... **'న కశ్చిన్నా పరాధ్యతి?'**.... తప్పు చేయని వాడెవ్వడు? అన్నది సీతమ్మ రామయ్యతో.... కాకి బ్రతికి పోయింది, కన్ను మాత్రం ఒకటి పోయింది, రాక్షస స్త్రీలూ బ్రతికి పోయారు సీతమ్మ దయవల్ల హనుమంతుడి పిడి గ్రుద్దుల బారినుండి, నేనేమని తప్పులు సరిదిద్దేది?....దద్దమ్మలా సరిదిద్దేది?....నా వల్ల కాని పని అది.... మంత్రముగ్ధమైన మాధుర్య మందర మకరందంలో మీరు మరింత నింపిన మధురిమలను మాత్రం ఆస్వాదించాను. అక్కడక్కడా తొంగి చూస్తోన్న అచ్చుతప్పులను చేతనైనంతలో కత్తిరించాను. ఒప్పులతో ముచ్చటించాను.*

పెద్దల వల్ల విన్నవీ, చదివి తెలుసుకున్నవీ కొన్ని అక్కడక్కడా చేర్చాను. వెరసి ఒప్పులన్నీ మీవి, తప్పులన్నీ నావి. ***'కర్తాకారయితాశ్చైవ. . .. సమభాగినః'*** *అన్న న్యాయం ప్రకారం రామానుగ్రహం కలగినిదే, ఈ పని జరిగేది కాదు. మీ జీవిత యానంలో ఇదొక రసోదయమ, నవోదయం, శుభోదయం, జయం–జయం, జ్వాలావిజయాయ మంగళం....శ్రీమత్ ముక్తిపుర వైకుంఠ రామాయ మంగళం, విజయలక్ష్మీ సమేత జ్వాలానృసింహాయ మంగళం, వాసుదాస సేవితాయ, దాస శేష పూజితాయ, వాగ్విదాం వరాయ దాస హనుమదాయ మంగళం–నమోస్తు రామాయ స లక్ష్మణాయ దేవ్యై చతస్యై జనకాత్మజాయై నమోస్తు".*

వనం జ్వాలా నరసింహా రావు

❖ ❖ ❖

చిన్నా-పెద్దా-అందరికీ కృతజ్ఞతలు

ఎందరో సహృదయులు, అందరికీ కృతజ్ఞతలు. ఈ సుందరకాండ మందర మకరందం వ్రాయడానికి వాడిన కలం కానీ, కాగితం కానీ, టైపు చెసిన కంప్యూటర్లు కానీ నావి కావు. అలాంటప్పుడు రాసింది నేను మాత్రమేనని, రాసిన విషయమంతా నా కృషివల్లనే జరిగిందని ఎలా అనగలను? నేనేంటి? ఆంధ్రవాల్మీకి రామాయణం సుందరకాండ మందరం చదవడమేంటి? చదివిన తర్వాత మందర మకరందం గా మలచడమేంటి? తెలుగు సాహిత్యంలో, రచనా వ్యాసంగంలో అంతో, ఇంతో ప్రవేశం వున్న మాట కొంత వాస్తవమే అయినప్పటికీ, ఆంధ్రవాల్మీకి సుందరకాండను మందర మకరందంగా మలిచే శక్తి నాకు కలగడమేంటి?

ఇదంతా బహుశా ఏదో అద్భుత, అజ్ఞాత, అప్రమేయ శక్తి నాతో కావాలనే చేయించి వుంటుంది! ఆ శక్తే నన్ను మూడు నెలలు ఈ పనికొరకై అమెరికా పంపించి వుంటుంది! నేను అమెరికా ఒహాహియో రాష్ట్రంలోని సిన్సినాటి లో వున్న మా అమ్మాయి ఇంట్లో వున్నప్పుడు, ఆ శక్తే మా అమ్మాయి కిన్నెర, అల్లుడు గారు కిషన్ లో జొరబడి, వాళ్ల ద్వారా, ఆ ఇంట్లో నాకు అనువైన వాతావరణం కలిగించి వుంటుంది! వ్రాయడానికి అవసరమైన కాగితాలు, అన్ని రకాల పెన్నులూ వాళ్లతో ఇప్పించి వుంటుంది ఆ శక్తే! వ్రాసిన దానిని నేనే స్వయంగా కంప్యూటర్ ద్వారా తెలుగులో టైపు చేసుకునేందుకు అవసరమైన సాఫ్ట్ వేర్ ను అల్లుడిగారి ద్వారా తెప్పించిందీ ఆ శక్తేనేమో! ఇంగ్లీష్ లోనే సరీగ్గా కంప్యూటర్ వాడకం అప్పటికి ఇంకా రాని నాతో 300 పేజీలకు పైగా టైపు చేయించింది ఆ శక్తేనేమో! ఎప్పటికప్పుడు కంప్యూటర్ ప్రింట్లు మా అల్లుడు గారి ద్వారా తీయించి ఇచ్చింది ఆ శక్తేనేమో! ముందుగా అమ్మాయి కిన్నెరకు, అల్లుడు కిషన్ కూ, చిన్న వారైనా కృతజ్ఞతలు. అల్లరి చేయకుండా నన్ను వాళ్ల ఇంట్లో వ్రాసుకోనిచ్చిన వాళ్ల పిల్లలు, మా మనుమడు యష్విన్, మనుమరాలు మేథ కు కూడా థాన్క్స్.

నా వ్రాత ప్రతి అయిన మరునాడే, దాన్ని పిట్స్‌బర్గ్‌లోని వెంకటేశ్వరస్వామి పాదాల దగ్గర పెట్టే అవకాశం దొరికేవిధంగా అక్కడకు తీసుకుని పోయేందుకు

తోడ్పడిన సిన్సినాటిలోని గన్నంరాజు దంపతులకు కృతజ్ఞతలు. మొదటి రెండు ముద్రణలకు కవర్ పేజీ డిజైన్ చేసిన (స్వర్గీయ) బాపుగారికి కృతజ్ఞతలు. ఈ ముద్రణ కవర్ పేజీ డిజైన్ చేసిన గణేష్‌కు కృతజ్ఞతలు. అనుకున్న రోజే (ఆగస్టు 8, 2003–నా పుట్టిన రోజు) మొదటి ముద్రణ పుస్తకావిష్కరణ చేసిన గౌరవనీయులు (స్వర్గీయ) పి వి ఆర్ కె ప్రసాద్ గారికి కృతజ్ఞతలు. వీరందరిరితో ఈ పని చేయించింది కూడా ఆ అదృశ్య శక్తేనేమో!

(అప్పట్లో) పొరుగునున్న విజయరాఘవగారికీ, (స్వర్గీయ) భండారు పర్వతాలరావు గారికీ, ఆర్.వి.వి కృష్ణారావు గారికీ, (స్వర్గీయ) తిలక్ గారికీ, భండారు శ్రీనివాసరావు గారికీ, మొదటి రెండు ముద్రణలు చేసిన దేవులపల్లి అజయ్ గారికీ, మూడవ ముద్రణకు ప్రోత్సహించిన దర్శనం శర్మగారికీ నా కృతజ్ఞతలు.

మా పిల్లలు ప్రేమ మాలిని, ఆదిత్య, అల్లుడు విజయగోపాల్, కోడలు పారుల్, వాళ్ల పిల్లలు మిహిర, అన్ష్, కనక, ఇరాలకు కూడా థాన్క్స్.

ప్రత్యక్షంగా, పరోక్షంగా తోడ్పడిన మరెందరికో ధన్యవాదాలు.

చివరిగా, కానీ, ముఖ్యంగా,

మా నాన్న గారు ఇప్పుడు జీవించి వుంటే బహుశా ఆయన కంటే ఈ విషయంలో సంతోషించే వారెవరూ వుండరు! ఆయన బ్రతికున్నప్పుడు నేనెట్లా వుండాలని కోరుకున్నాడో అలా కొంతవరకూ వున్నానంటానికి ఈ పుస్తకమే నిదర్శనం.

నన్నింత వాడిని చేసిన నా తండ్రి, తల్లి, స్వర్గీయ వనం శ్రీనివాసరావు గారికీ, స్వర్గీయ వనం సుశీలమ్మగారికీ, వారి ద్వారా ముత్తవరం శ్రీసీతారామచంద్ర స్వామి వారికీ ఈ పుస్తకం అంకితం.

వనం జ్వాలా నరసింహారావు

❖ ❖ ❖

నివేదన

ఎంత చదివినా తనివి తీరనిది రామాయణం. ధర్మానికి ప్రతిరూపమైన రామాయణం ప్రపంచభాషలన్నింటిలోకి అనువదించబడిందంటే దాని గొప్పతనం సులువుగానే మనం గ్రహించవచ్చు. కవి అనిపించుకున్న ప్రతివ్యక్తి ఏదో ఒకరకంగా రామాయణకథని తమ తమ జ్ఞానానికి అనుగుణంగా రాసినవారే!

సుందరుడైన రామచంద్రుని కథ సుందరకాండ. సుందరమైన సీతమ్మ కథ సుందరకాండ. సుందరుడైన హనుమంతుడు గానం చేసిన గాథ సుందరకాండ. తక్కిన కాండలకు లేని ఎన్నో ప్రత్యేకతలు ఉన్న, పారాయణానికి యోగ్యమైన కథ సుందరకాండ. వాల్మీకి రామాయణానికి హృదయస్థానమైనది, కుండలిని యోగసాధన, గాయత్రీ మంత్రం నిక్షిప్తం చేయబడింది సుందరకాండ. అందుకే పాఠకులకే కాక సాధకులకూ నిత్య పఠనీయమైనది, అనుసరణీయమైనది.

'ఆర్షకవి' వాసుదాసుగారి రామాయణానికి అనువక్త–వాచవిగా నిలిచిన **శ్రీ వనం జ్వాలా నరసింహారావు** గారి కలం నుండి జాలువారిన రామాయణం మందర మకరందంను గత పుష్కరకాలంగా 'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రికలో ధారావాహికగా ప్రచురితమవుతూ, పాఠకుల హృదయాలను రంజింపజేస్తోంది. ఈ పరంపరలో భాగంగా గ్రంథరూపంలో తీసుకురావాలనే ఉద్దేశ్యంతో **'బాలకాండ', 'అయోధ్యకాండ'**లను ఇదివరకే ప్రచురించా. ఇప్పుడు **'సుందరకాండ'**ను గ్రంథరూపంలో వెలువరిస్తున్నాం.

సులువైన భాషలో, సామాన్యుడు సైతం చదువుకునేలా, చదువుతున్నకొద్దీ ఆసక్తిని కలిగించేలా ఉన్న కథనం ప్రత్యేక ఆకర్షణగా చెప్పవచ్చు. విస్తృతమైన, వర్ణనాత్మకమైన రామాయణాన్ని మందర వ్యాఖ్యాసహితంగా వెలయించిన **వనం జ్వాలానరసింహారావు** గారి రచన ఆసాంతం హృద్యంగా, మనోజ్ఞంగా సాగుతుంది.

ప్రత్యేకంగా 'దర్శనమ్'పై వున్న ఆత్మీయానురాగంతో తన రామాయణ రచననంతా ప్రచురణకు అవకాశం కల్పించిన విఖ్యాత రచయిత, ధార్మికవేత్త **శ్రీ వనం జ్వాలా నరసింహారావు** గారికి జీవితాంతం ఋణపడి వుంటాను.

ఇప్పుడు ముద్రణ పొందుతున్న ఈ గ్రంథం కూడా పాఠకులను విశేషంగా ఆకట్టుకుంటుందని భావిస్తున్నాను.

ఈ అక్షర యజ్ఞంలో భాగస్వాములైన మా 'దర్శనమ్' సబ్ ఎడిటర్ **బాలసుబ్రహ్మణ్యం,** చక్కని ముఖచిత్రాన్ని అందించిన **శ్రీరామోజు గణేశ్,** ఈ పుస్తకానికి అక్షర కూర్పు నందించిన **ఆరవేటి వెంకటసుబ్బయ్య**, ఎల్లవేళలా తన తోడ్పాటు నందిస్తున్న సహధర్మచారిణి **రుక్మిణి**కి, తక్కువ సమయంలోనే అందంగా ముద్రించి ఇచ్చిన **లక్ష్మీ నర్సు** గారలకు ధన్యవాదాలు.


ఈ 'దర్శనమ్' ధార్మిక యజ్ఞంలో నాకు ఆశీరానుగ్రహాన్ని అందిస్తున్న గురుదేవులకు, మా పితృదేవులు **కీ.శే. మరుమాముల రాజమౌళి శర్మ**గారికి, మాతృమూర్తి **మరుమాముల అన్నపూర్ణమ్మ**, సోదరుడు **శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మ**గారలకు నమస్సుమనస్సులు.

శ్రీ విళంబి ఆషాఢ
శు॥ పౌర్ణమి
తేది: 27-07-2018.

(మరుమాముల వెంకటరమణశర్మ)
సంపాదకులు
'దర్శనమ్' ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

❖ ❖ ❖

అంకితం



నాన్న-అమ్మ

స్వర్గీయ వనం శ్రీనివాసరావుగారు – వనం సుశీలగారు

(ఆగస్ట్ 14, 1982న తీసిన ఫొటో)

శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం...సుందరకాండ

శ్రీ రామాయణం క్షీరధార. వాసుదాసుగారి శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం, మందరాలన్నీ, మందార మకరంద మాధుర్యాలే. కవికులగురువు కాళిదాసు అన్నట్లు." చరిత్ర మా రాముడిది. రచన సాక్షాత్తు వాల్మీకుల వారిది. గానం చేసినవారు కిన్నెర గాత్రులైన కుశలవులు. ఇంతటి మహనీయమైన రామాయణ కావ్యంలో, శ్రోతలను పరవశింప చేయని అంశం అనేదేదీ లేదు".

భగవద్గీత, శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్రం, శ్రీ రామాయణం భారతీయ సంస్కృతీ రూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మ-జ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య-వ్యంగార్థాలతో శ్రీ మద్రామాయణం ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని-అర్థ ప్రతిపాదిత మహా మంత్రపూతం. గాయత్రీ బీజసంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ-పారాయణ మాత్రంగా అంతఃకరణ శుద్ధి అవుతుంది.

వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా, పూర్వ కాండలతో సహా ఉత్తరకాండను కూడా కలిపి తెనిగించిన ఏకైక మహాకవి కీర్తి శేషులు వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు. ఆ మహానుభావుడి ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరాలన్నీ, తెలుగునేల నాలుగు చెరగులా విశేష ప్రాచుర్యాన్ని ఏనాడో సంతరించుకున్నాయి. కానీ, కాలక్రమంలో అవన్నీ మరుగున పడిపోతున్నాయి. రామాయణానికి రచయిత ఒక్కడే. వాల్మీకి మహర్షి తప్ప ఇతరులెవరికీ రామాయణం రచయిత అని చెప్పుకునే హక్కులేదనే అనాలి. వాసుదాసుగారు కూడా వ్యాఖ్యాతననే అంటారు తన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి.

వాల్మీకి రామాయణ క్షీరసాగర మథనాన్ని చేసి "మందర" మకరందాలనూ, రమా రామ పారమ్య పీయూషాలనూ, నాలుగు చెరగులా పంచి, ఆ మథనంలో ఆవిర్భవించిన శ్రీ సీతారాముల తత్వాన్ని, వేద వేదాంగేతిహాస స్మృతి శ్రుతి శుభంగా అన్వయించి, ఆంధ్రుల హృదయ కేదారాలను ప్రపుల్లం చేసిన పరమ భాగవతోత్తములు "ఆంధ్ర వాల్మీకి" వాసుదాస స్వామి. "రామ భక్తి సామ్రాజ్యం యే మానవుల కబ్బెనో మనసా! ఆ మానవుల సందర్శనం అత్యంత

బ్రహ్మానందమే" అన్న త్యాగరాజ స్వామి వారి కీర్తనకు సాకార దివ్య స్వరూపులు వాసుదాస స్వామి. ఆంధ్ర వాల్మీకి వాసుదాస స్వామి అవతరించి వున్న కాలంలో, వారి దర్శన–అనుగ్రహ భాషణా సౌభాగ్యమబ్బిన వారు, "శ్రీ మద్రామాయణం–మందరం" పారాయణపరులై, తమ పరంపరకు శ్రీ వాసుదాస స్వామి గారి దివ్య స్మృతులను అందించి తరించారు. వాల్మీకి సంస్కృత రామాయణాన్ని అందరికంటే మొట్ట మొదలు ఆంధ్రీకరించి, పదే–పదే రామాయణ పఠన పాఠన శ్రవణాదుల పట్ల ఆంధ్రులకు అత్యుత్సాహాన్ని కలిగించి, "రామ భక్తి సామ్రాజ్యం" అంటే, ఆంధ్ర దేశమే సుమా, అనిపించిన నిరుపమ రామ భక్తులు వాసుదాస స్వామివారు.

ఇరవై నాలుగు గాయత్రీ మంత్రాక్షరాలలో నిబంధించబడిన మంత్ర మంజూష వాల్మీకి మహర్షి రచించిన శ్రీమద్రామాయణం. మహా మహానుభావులూ, మహా విద్వాంసులూ కీర్తి శేషులు శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు (వాసుదాసు) గారు, వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందో యతులను ఆయా స్థానాలలో నిలిపి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ–పారమ్యాన్నీ, తొలుత నిర్వచనంగా ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, తదనంతరం, "మందరం" అని దానికి విశేష ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠక లోకం మందరాన్ని అపారంగా అభిమానించింది–ఆదరించింది.

వాసుదాసుగారి కీర్తికి ఆలవాలమైంది ఆంధ్ర వాల్మీకి రామాయణం. ఆంధ్ర భాషలో అంతకుముందు రామాయణానికి యధా మూలాలు లేవని, అర్థ పూర్తి కలిగి, కావ్య–ఇతిహాస గౌరవ పాత్రమై, సర్వజన పఠనీయమై, ప్రామాణికమై, మూలానుసరమైన రామాయణం తెలుగులో వుండడం లోకోపకారంగా భావించి, రచించించారీ గ్రంథాన్ని వాసుదాసుగారు. ఎనిమిదేళ్లలో రామాయణాన్ని తొలుత నిర్వచనంగా ఆంధ్రీకరించి, అలనాటి కడప మండలంలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామికి అంకితం చేసారు . ఆయన రచించిన నిర్వచన రామాయణం, ఆయన జీవిత కాలంలోనే, నాలుగైదు సార్లు ముద్రించబడింది. ఆంధ్ర వాల్మీకి రామాయణం బాలకాండలో, తన స్వవిషయం గురించి ప్రస్తావిస్తూ

వాసుదాసుగారు, సంస్కృత రామాయణాన్ని శ్రీరామచంద్రుడి కుమారులైన కుశ–లవులు లోకానికి ప్రకటించినట్లే, తనకూ ఆయన కుమారుడిగా, అలాంటి అధికారం వుందని, అయితే సంకల్పించడం మాత్రమే తన వంతని– నిర్వహించడం శ్రీరాముడి వంతని, పూర్తిచేయించే భారం ఆయన భుజాలపైనే వేస్తున్నానని, ఆయన వలదన్నా వదలనని చెప్పుకుంటారు.

వాసుదాసుగారు రచించిన ఆంధ్ర వాల్మీకి రామాయణానికి తెలుగులో సరైన వ్యాఖ్యానముంటే, సంస్కృతం రానివారికి చక్కగా అర్థమవుతుందని మిత్రులంటారాయనతో. మూల గ్రంథం రాయడంకంటే వ్యాఖ్యానం రాయడం కష్టమనుకుంటారాయన మొదట్లో. బాగా ఆలోచించిన తర్వాత, (శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణం) "మందరం" పేరుతో గొప్ప వ్యాఖ్యానం రాసారు వాసుదాసుగారు. వాస్తవానికి అదొక గొప్ప ఉద్గ్రంథం. సరికొత్త విజ్ఞాన సర్వస్వం. మందరం" అంటే, క్షీరసాగరాన్ని మథించడంలో కవ్వంగా ఉపయోగించిన మందర పర్వతమే గుర్తుకొస్తుంది సాధారణంగా ఎవరికైనా. కాని, వాసుదాసుగారి శ్రీపాద సంబంధులకు మాత్రం, "మందరం" అంటే, మొదట గుర్తుకొచ్చేది, ఆంధ్ర వాల్మీకి రామాయణం మందరమే. వాల్మీకి విరచితమైన రామాయణాన్ని శ్రీవారు, "క్షీరవారాసి"గా సంభావించి, దానిని మథించిన తమ "మేథ" అందించిన మకరందాలను– మధురిమలను, ముచ్చటగా "మందరం" అని పేర్కొన్నారు. సహృదయ నైవేద్యంగా–అనుభవైక వేద్యంగా వచ్చిన రచనలకు అసాధ్యంగా– నిగమ గోచరంగా భావించబడిన రామాయణానికి "మందరం" అని నామకరణం చేయడంలో తను కొంతవరకే న్యాయం చేయగలిగానని అంటారాయన. ఇందులోంచి చిలికిన కొద్దీ ఎన్నో దివ్య రసాయనాలు ఉద్భవిస్తాయని, భావితరాలవారు ఇందుకు పూనుకోవాలని కూడా సూచించారు వాసుదాసుగారు.

వాసుదాసుగారు, తాను రచించిన నిర్వచన రామాయణంలో సంస్కృత రామాయణంలో వున్న ప్రతి శ్లోకానికొక పద్యం వంతున రాసారు. మందరంలో తను రాసిన ప్రతి పద్యానికి, ప్రతి పదార్థ తాత్పర్యం సమకూర్చారు. ఒక్కో పదానికున్న వివిదార్థాలను విశదీకరించారు. భావాన్ని వివరణాత్మకంగా

విపులీకరించారు. ఆయన మందరాలలోని శ్రీరామాయణ వ్యాఖ్యానంలో "జ్ఞాన పిపాసి" కి విజ్ఞాన సర్వస్వం దర్శనమిస్తుంది. ఇక ఆయన రాసిన నిర్వచన రామాయణంలో సాధారణంగా అందరూ రాసే చంపక మాలలు, ఉత్పల మాలలు, సీస-ఆటవెలది-తేటగీతి-కంద-శార్దూలాలు, మత్తేభాలు మాత్రమే కాకుండా, తెలుగు ఛందస్సులో వుండే వృత్తాలన్నిటినీ, సందర్భోచితంగా ప్రయోగించారు. వాటిలో, "మత్తకోకిలము", "పంచ చామరం", "కవిరాజ విరాజితము", "తరలము", "ప్రహరణకలిత", "సుగంధి", "ఉత్సాహం", "మనోహరిణి", "వనమయూరము", "తోటకము" , "మానిని" , "ఇంద్రవంశము", "లయగ్రాహి", "తోదకము", "మాలిని", "కలితాంతము", "మధురగతిరగడ", "వనమంజరి", "కమల విలసితము", "వసంతమంజరి", "మంజుభాషిణి", "స్రగ్ధర", "వసంతతిలక", "మాలి", "కరిబృంహితము", "చారుమతి", "వృషభగతిరగడ", "స్రగ్విని", "మనోరంజని", "తామరసం", "పద్మనాభ వృత్తం", "అంబురుహ వృత్తం", "మందాక్రాంత"లాంటివెన్నో వున్నాయి. ద్విపదలూ వున్నాయి. దండకం కూడా వుందో సందర్భంలో. ఎక్కడ ఎందుకు ఏ విధంగా ఛందో యతులను ఉపయోగించారో కూడా వివరించారు. వీటికి తోడు అనేక వ్యాకరణ విషయాలను అవసరమైన ప్రతి చోటా పాఠకులకు అర్థమయ్యే రీతిలో విపులంగా తెలియచేశారు.

వాసుదాసుగారి ఆంధ్ర వాల్మీకంలోని ప్రతి కాండకొక ప్రత్యేకతుంది. ప్రతికాండ ఒక్కోరకమైన విజ్ఞానసర్వస్వం. ప్రతి కాండలోని, ప్రతి పద్యానికి, ప్రతి పదార్థం ఇస్తూ, చివరకు తాత్పర్యం రాస్తూ, అవసరమైన చోట నిగూఢార్థాలను-అంతరార్థాలను-ఉపమానాలను ఉటంకిస్తూ, సాధ్యమైనంత వరకు ఇతర గ్రంథాల్లోని తత్సంబంధమైన అంశాలను పేర్కొంటారు కవి. ప్రత్యుత్తరం కోరి చదవాల్సిన విషయాలన్నింటికీ సోదాహరణంగా జవాబిస్తారు. శ్రద్ధగా చదువుకుంటూ పోతే-అర్థం చేసుకునే ప్రయత్నం చేసుకుంటూ చదువగలిగితే, ప్రతి కాండలో ఆ కాండ కథా వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం దర్శనమిస్తుంది. ఒక సారి ధర్మశాస్త్రం లాగా, ఇంకో సారి రాజనీతి శాస్త్రం లాగా, మరో చోట ఇంకో శాస్త్రం లాగా బోధపడుతుంది. ప్రతికాండ ఒక భూగోళ శాస్త్రం-ఖగోళ శాస్త్రం-సాంఘిక, సామాజిక, ఆర్థిక,

సామాన్య, నీతి, సంఖ్యా, సాముద్రిక, కామ, రతి, స్వప్న, పురా తత్వ శాస్త్రం లాగా దర్శనమిస్తుంది. బహుశా, క్షుణ్ణంగా చదివితే, ఇంకెన్నో రకమైన శాస్త్ర విషయాలు గోచరిస్తాయి. అసలు–సిసలైన పరిశోధకులంటూ వుంటే, మందరం ఏ ఒక్క కాండ మీద పరిశోధన చేసినా, ఒకటి కాదు–వంద పీహెచ్‌డీలకు సరిపోయే విషయ సంపద లభ్యమవుతుంది. డాక్టరేట్‌తో పాటు, అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి. పాదరసం నుండి బంగారం చేసే రహస్యమైన విషయాలలాంటి అనేకమైనవి తెలుసుకోవచ్చు, పరిశోధనా దృక్పదంతో చదివితే. ప్రతి కాండ చివర వాసుదాసుగారు రాసిన ఆఖరు పద్యంలో, ఆ కాండలో వున్న మొత్తం పద్యాలెన్నో తెలియచేసే పంక్తులుంటాయి.

ఆంధ్ర వాల్మీకిరామాయణం రాయడానికి ప్రేరణ–స్ఫూర్తి, భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన సంకల్పం ద్వారానే తనకు లభించిందంటారు వాసుదాసుగారు. పోతనను కరుణించిన శ్రీరామచంద్రమూర్తి, ఆయనతో భాగవతాన్ని తెనిగింపచేసి భవ బంధ విముక్తుడిని చేసాడని, అందుకే, పలుకు పలుకులో తేనెలొలికించి, వ్యాస భాగవతాన్ని మరిపించగలిగాడని వాసుదాసుగారి అభిప్రాయం. ఆ విధంగానే, శ్రీరాముడి కరుణ తనపైన కూడా ప్రసరించిందని వాసుదాసుగారు భావించి వుండాలి. తద్రూపమే ఆంధ్ర వాల్మీకం. వాల్మీకాన్ని ఆమూలాగ్రంగా పరిశోధించిన పరమ భాగవతోత్తముడు వాసుదాసస్వామి. 108సార్లు వాల్మీకి సంస్కృత రామాయణాన్ని పఠించి– పారాయణం చేసి, పట్టాభిషేకాలు, సామ్రాజ్య పట్టాభిషేకం నిర్వహించిన ఏకైక మహానుభావుడు వాసుదాసస్వామి.

తనకంటే ముందు కాలంనాటి పూర్వ కవులెవరు, రామాయణాన్ని (పూర్వ కాండలు, ఉత్తరకాండ కలిపి) సంపూర్ణంగా తెనిగించలేదని గ్రహించిన వాసుదాసుగారు, అన్ని కాండలను తెనిగించి, విశేషించి తెలుగు పాఠకలోకానికి ఆవిష్కరించాలని సంకల్పించుకున్నారు. వాల్మీకిరామాయణాన్ని సమగ్రంగా, యథామూలంగా పలికినవారు పూర్వ కవులందూ – నేటి (ఆయన కాలం నాటి) కవులందూ లేరు. నేటి (ఆయన కాలంనాటి) రామాయణాలలో మూలానుసరణంగా వుంది, సమగ్రం కాదు. సమగ్రమయింది మూలాను

సరణం కాదు. తమ అభిప్రాయాలను, ఇతరుల అభిప్రాయాలను మూలంగా చేర్చిపెడితే, అది వాల్మీకి పలికిందెలా అవుతుంది?" అని ప్రశ్నించాడు వాసుదాసుగారు.

భగవత్ చరిత్రలెన్నో వుండగా రామాయణ రచనకే ఎందుకు పూనుకున్నావని అడిగినవారికి తనదైన శైలిలో జవాబిచ్చారు వాసుదాసుగారు. జనన-మరణ రూపకమైన సంసార బంధం నుండి విముక్తి చేసేది రామ కథేనని, భగవత్ సాయుజ్యం పొందేందుకు రామాయణ రచన చేసానని అంటారాయన. పూర్వం కొందరు రాసారుకదా, మరల ఎందుకు రాస్తున్నావంటే, "ఎవరి పుణ్యం వారిదే. ఒకరి పుణ్యం మరొకరిని రక్షించదు" అని జవాబిస్తూ, శ్రీరాముడి అనుగ్రహం కొరకు రామాయణాన్ని రచించి వాగ్రూపకైంకర్యం చేయదల్చానంటారు వాసుదాసుగారు. భారద్వాజ గోత్రీకుడు, ఆపస్తంబ సూత్రుడు, గోల్కొండ వ్యాపారి శాఖీయుడయిన వావిలికొలను సుబ్బరావుగారు, కడప జిల్లా – జమ్మలమడుగులో 1863లో జన్మించి 1939లో పరమపదించారు. ఎఫ్.ఎ చదువు పూర్తిచేసి, ప్రొద్దుటూరు తాలూకా కార్యాలయంలో చిరుద్యోగిగా చేరి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ హోదాకెదిగారు. ఆ విధంగా 1893-1904 మధ్య కాలంలో పదకొండేళ్లు రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేసారు మొదట్లో. కందుకూరి వీరేశలింగం పంతులు గారి తర్వాత, మద్రాస్ (నేటి చెన్నై) ప్రెసిడెన్సీ కళాశాలలో ఆంధ్ర పండితులుగా 1904-1920 మధ్యకాలంలో పనిచేసారు. వాసుదాసుగారి తర్వాత ఆ పదవిని అలంకరించింది అక్కిరాజు ఉమాకాంతం గారు. కళాశాలలో చేరక ముందే, పినతండ్రి మీద తనకున్న కృతజ్ఞతకు గుర్తుగా, "శ్రీకుమారాభ్యుదయం" అనే ప్రబంధ గ్రంథాన్ని రచించి, ఆయనకు అంకితమిచ్చి శాశ్వత స్వర్గ సుఖాన్ని కలిగించారాయనకు. ఆయన రచించిన ఆ ప్రబంధం, నాటి కవి పండితులను ఆశ్చర్య పరిచింది. ఆయన ప్రతిభకది తొలి హారం.

ఆంధ్ర పండితుడిగా పనిచేస్తున్న రోజుల్లోనే, భార్యా వియోగం కలగడంతో, వాసుదాసుగారు భక్తి-యోగ మార్గం పట్టారు. జీర్ణ దశలో వున్న ఒంటిమిట్ట రామాలయాన్ని సముద్ధరించాలన్న సంకల్పంతో, బిక్షాటనచేసి లభించిన ధనంతో ఆలయాన్ని అభివృద్ధి చేసారు. ఆంధ్ర వాల్మీకి రచనాకాలం 1900-1908

మధ్య కాలంలో. గాయత్రీ మంత్రం, రామ షడక్షర మంత్రం మూలంలో వున్నట్లే, అనువాదంలో కూడా నిక్షిప్తం చేసారాయన. వాల్మీకంలో వున్న బీజాక్షరాలన్నీ, ఇందులోనూ యథాస్థానంలో చేర్చబడ్డాయి. విడిగా వాసుదాసుగారు, గాయత్రీ రామాయణం, శ్రీరామనుతి కూడా రాసారు. ఆంధ్ర వాల్మీకం అనువాదమైనా, స్వంత రచన–స్వతంత్ర రచన అనిపించుకుంది.

వావిలికొలను సుబ్బరావుగా పండిత పదవీ విరమణ చేసిన అనంతరం, తన జీవితమంతా, భక్తి మార్గంలోనే గడిపారు. ఈ నాటికీ క్రమం తప్పకుండా గుంటూరు జిల్లా తెనాలి దగ్గరున్న అంగలకుదురు నుంచి ప్రచురించబడుతున్న "భక్తి సంజీవని" అనే భక్తి–జ్ఞాన–కర్మ యోగాలను తెలిపే ఆధ్యాత్మిక మాసపత్రిక సంస్థాపక సంపాదకులుగా–వాసుదాసుగా–ఆంధ్ర వాల్మీకిగా–కవి సార్వభౌమగా ప్రసిద్ధికెక్కారు. అంగలకుదురులోని శ్రీ కోదండ రామ సేవక ధర్మ సమాజం స్థాపించింది ఆయనే. కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయాన్ని పునరుద్ధరించి, ఈ నాటికీ దర్శనీయమైన రీతిలో శాశ్వత కైంకర్యం చేసిన వాసుదాసుగారు, వాఙ్మయ ప్రపంచంలోని భక్త కవులలో తనకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు."సత్కవి మిత్రుడను" అని చెప్పుకున్న ఆయనకు, తిరుపతి వేంకటకవులు, కొక్కొండ వేంకట రత్నం పంతులు, వేదం వేంకటరాయ శాస్త్రులు మొదలైన ప్రసిద్ధ కవులందరూ స్నేహితులే.

వాసుదాసుగారు "కౌసల్యా పరిణయం" అనే ప్రబంధం, "సుభద్రా విజయం" అనే నాటకంతో పాటు, "హిత చర్యలు", "ఆధునిక వచన రచనా విమర్శనం", "పోతన నికేతన చర్చ", "పోతరాజు విజయం", "రామాశ్వమేధం", "ఆంధ్రవిజయం" కూడా రాసారు. "ఆర్యకథానిధులు" అన్న పేరుతో ఆయన రాసిన సులభ వచన గ్రంథాలు తెలుగువారందరికి అత్యంత ఆదరణీయమైనాయి. "సులభ వ్యాకరణం" తెలుగు వ్యాకరణాన్ని నిజంగానే సులభం చేసింది. ఆయన రచించిన "కృష్ణావతార తత్త్వం" ప్రశస్త కృతిపాండిత్యంతో, ఆధ్యాత్మిక భావనతో, పాఠకులలో ఆంధ్ర భాషాభిమానాన్ని ఉద్దీపించచేసి–తాను తరించి, ఇతరులను తరింపచేసిన ధన్యాత్ముడు, మహామనీషి వావిలికొలను సుబ్బరావుగారు.

ఆంధ్ర వాల్మీకిరామాయణం తర్వాత రచించబడిన పలు గద్య-పద్య రామాయణాలకు విశేష ప్రాచుర్యం లభించినా, ఆ రోజుల్లోనూ-ఈ రోజుల్లోనూ, వాసుదాసుగారి రామాయణానికి ప్రాచుర్యం లభించినా తగినంత గుర్తింపు ఎందుకు లభించలేదనేది జవాబు దొరకని ప్రశ్న. "ఆదికవి-ఆంధ్ర వాల్మీకి", యథాతథంగా మంత్రమయం చేస్తూ, ఛందోయతులను ఆయా స్థానాలలో నిలిపి తెనిగించిన వాల్మీకానికి రావాల్సినంత మోతాదులో, ఎందుకు గుర్తింపు రాలేదు? వ్యాస మహాభారతాన్ని మొదట తెనిగించిన నన్నయను "ఆదికవి" గా పిలిచినప్పుడు, వాల్మీకి రామాయణాన్ని యథావాల్మీకంగా పూర్వ కాండలతో కలిపి ఉత్తరకాండను కూడా మొట్టమొదట తెనిగించిన వాసుదాసుగారు కూడా "ఆదికవే" కదా? నన్నయంతటి గొప్పవాడే కదా. వాస్తవానికి సరైన పోషకుడో-ప్రాయోజకుడో వుండి వుంటే, వాసుదాసుగారి ఆంధ్రవాల్మీకిరామాయణం, ఎప్పుడో-ఏనాడో నోబెల్ సాహిత్య బహుమతికో, జ్ఞానపీఠ పురస్కారానికో నోచుకుని వుండేది. ఏ మాత్రం మన తెలుగువారు ప్రయత్నం చేసినా, ఆ మహానుభావుడికి భారతరత్న-జ్ఞానపీఠ ఆవార్డులతో పాటు నొబెల్ బహుమానం వచ్చేది. ఇప్పటికైనా ఆ ప్రయత్నం చేస్తే మంచిదేమో.

వాసుదాసుగారు ఆంధ్ర వాల్మీకిగా లబ్ద ప్రతిష్టులయ్యారు. మహనీయమైన "మందర" రామాయణాన్ని అనేకానేక విశేషాలతో, పద్య-గద్య-ప్రతి పదార్థ-తాత్పర్య-ఛందోలంకార విశేష సముచ్ఛయంతో, నిర్మించి, వేలాది పుటలలో మనకందించారు. రామాయణ క్షీర సాగరాన్ని "మందరం" మథించి, మనకందరికీ ఆప్యాయంగా అందించింది. అయితే, దానిని ఆస్వాదించే తీరికా-ఓపికా లేని జీవులమైపోయాం మనం. భాష, శైలి, అర్థం, తాత్పర్యం కాలక్రమంలో పరిణామం చెందుతున్నాయి. "సూక్ష్మంలో మోక్షం" కావాలంటున్నారు నేటి తరం పఠితులూ, పండితులూ.

కాలం గడిచిపోతున్నది. వాసుదారుగారు మారిపోతున్న తరాలకు గుర్తురావడం కూడా కష్టమైపోతున్నది. వారి "ఆర్యకథానిథుల" తోనూ, "హితచర్యల" పరంపరలతోనూ, పరవశించిపోయిన ఆనాటి తెలుగు పాఠక మహనీయులు క్రమంగా తెరమరుగవుతున్నారు. మళ్లీ-మళ్లీ జ్ఞాపకం

చేసుకోవాల్సిన, మరువలేని మహనీయుడు, ప్రాతఃస్మరణీయుడు వాసుదాసస్వామి.

నారాయణా! కరుణా!
ధీనా! దీనార్తిహరణ ధీమజ్జనర
జ్ఞానియా! యపపర్గ వి
ధానక్షమ! యొంటిమిట్ట దశరథరామా!
మందరం... వ్యాఖ్యానారంభం
శ్రీ రామచంద్ర ప్రభో పాహి పాహి.

❖ ❖ ❖

రామాయణంలో ఏముంది.... ఆంధ్ర వాల్మీకి రామాయణం ఎందుకు చదవాలి?

శ్రీమదాంధ్ర వాల్మీకి రామాయణానికి వాసుదాసుగారి పీఠిక

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. వేద వేదాంత అర్థోపబృంహితంబులు. ఈ మూడింటిలో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రథమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. శ్రీమద్రామాయణం–ఉత్తర కాండ 94వ సర్గలో చెప్పినట్లు రామాయణాన్ని చక్కగా తెలిసినవారు–అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. (రామాయణ తత్వాన్ని తనకు తెలిసినంతవరకు ఆంధ్ర వాల్మీకంలో చెప్ప సాహసించానని, తన ఆ సాహసానికి క్షమించమని వాసు దాసు గారు పాఠకులకు విజ్ఞప్తి చేశారు).

మన పూర్వీకులకు తెలియని నాగరికతలు లేవు. మన పూర్వులు ఏ కారణం వల్ల ఆర్యులయ్యారు? వారు ఎటువంటి గుణాలు కలిగి, ఎటువంటి మహోన్నత స్థితిలో వుండే వారు? వారి నాగరికత విధానం ఎటువంటిది? వారి కులాచార ప్రవర్తనలెలావుండేవి? రాజుకు–ప్రజలకు మధ్య ఐకమత్యం ఎలా వుండేది? భార్యా–భర్తలు, సోదరులు, తల్లితండ్రులు, పుత్రులు పరస్పరం ఎలా ప్రవర్తించేవారు? సుఖ–దుఃఖాల విషయంలో స్త్రీ–పురుషులు ఏ విధమైన నడవడి గలవారు? వారికి దేవుడంటే ఎలాంటి ఆలోచన వుండేది? దైవాన్ని వారెలా ఆరాధిస్తుండే వారు? ఇలాంటి లౌకిక విషయాలను తెలుసుకోవాలనుకునే వారికి శ్రీ రామాయణాన్ని మించి తెలిపే గ్రంథం ఎక్కడా లేదు.

జననమరణ చక్రబంధంలో ఇరుక్కొని, పరిభ్రమిస్తూ, ఆ బాధ తొలగించుకునేందుకు పారలౌకిక చింత కలిగి, నిరామయమై–నిత్యమై–నిర్మలమైన పరమపదానికి పోవాలనుకునే కోరికగల వారికి, కరతలామలకంగా సుఖమైన మార్గాన్ని బోధించగల గ్రంథం శ్రీ రామాయణం తప్ప మరొకటి లేదు.

కాలక్షేపానికి చదవడానికైనా శ్రీ రామాయణం లాంటి పుస్తకం ఇంకోటి లేదు. ఏ విధంగా చదివినా, చదివిన తర్వాత, సమయాన్ని సద్వినియోగం చేశామన్న తృప్తినిచ్చేది రామాయణమే. శ్రద్ధా భక్తులతో చదివినవారికి కల్పవృక్షంలా కోరిన కోరికలు తీర్చేదీ రామాయణమే. కాబట్టి, ఇహ–పరలోకాల్లో సుఖపడాలనుకునేవారికి, శ్రీ రామాయణ పఠనం అవశ్య కర్తవ్యం.

భరతఖండంలో శైవులని, వైష్ణవులని, శాక్తేయులని భిన్న మతాల వారున్నారు. అయితే వీరిలో కొందరు వైష్ణవులకు శైవుడంటే ఇష్టం లేకపోవడం, అలానే నారాయణుడి పేరంటే నే ముఖం చిట్లించుకునే శైవులుండడం అందరికీ తెలిసిందే. ఐనప్పటికీ, శ్రీ సీతారాముల పేరు విన్న ప్రతి ఆర్యుడు మనస్సులోనైనా భక్తితో నమస్కారం చేసుకోవాల్సిందే. ఇలా సీతారాములు సార్వజనీన సం పూజ్యులు కావడానికి కారణమేంటి? హరిశ్చంద్రుడిలాంటి సత్యాత్ములు, ధర్మరాజు లాంటి ధర్మాత్ములు, దమయంతి–సావిత్రి లాంటి పతివ్రతలు లేరా? వారి మీద ఎంత గౌరవం వున్నా లోకులు వారిని పూజించడం లేదే? మరి, సీతారాములలో విశేషమేమిటంటే, వారు అవతారమూర్తులు కావడమే! ఎవరెవరు–ఏఏ పేరుతో పిలిచినా, భగవంతుడనేవాడు ఒక్కడే అని ఆర్యుల నమ్మకం. భిన్న–భిన్న రూపాల్లో దర్శనమీయడం భవత్కేళా విశేషం. అలాంటి భగవంతుడే, శ్రీరాముడుగా, లోకరక్షణార్థం జన్మించాడన్న నమ్మకమే, లోకులందరు ఒకేవిధంగా శ్రీ సీతారాములను అర్చన చేయడానికి కారణమైంది. ప్రత్యక్షానుభవమున్న భక్తులే దానిలోని గూడార్థాన్ని వెల్లడిచేయగల సమర్థులు–శక్తిమంతులు. అలాంటివాడైన వాల్మీకి మహర్షి ఆ అవతార రహస్యాన్ని, తాను గ్రంథస్థం చేసిన శ్రీ రామాయణంలో, "కంఠోక్తి ఘోషించినాడు".

"శ్రీ రామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్ర అనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్ర అనీ అర్థం. దంపతుల మాదిరిగా, వారి "అభిధానంబులు అనపాయంగా" వుండినట్లే, తత్త్వమెరిగిన మహాత్ముడు వాల్మీకి మహర్షి, తను రచించిన ఆది కావ్యానికి శ్రీ రామాయణం అని పేరు పెట్టాడు. ఇందులో సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని "సీతాయాశ్చరితం

మహత్తు" అని వెల్లడిచేశాడు. ఈ చిత్రం గ్రంథం పేరులోనే కాకుండా, గ్రంథమంతా కనపడుతుంది. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకే మో వాస్థవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీరాముడు భగవంతుడేనన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. రామాయణాన్ని చదివేవారందరు, ఈ అర్థాన్ని మనస్సులో పెట్టుకొని, ఇందులోని ప్రతి అంశాన్ని-ప్రతి వాక్యాన్ని హెచ్చరికతో శోధించాలి. ఇలా ఆసక్తిగా శోధించిన వారికి-పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణానికి-ఇతర రామాయణాలకు (ఆ మాటకొస్తే, ఏ భాషలో వున్న ఏ గ్రంథాలకు) గల తారతమ్యం, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది. కవి హృదయాన్ని తెలుసు కోకుండా, ఆయన శైలిని అనుసరించకుండా చదివినవారికి, అందులోని సారాన్ని అర్థం చేసుకోలేక, ఆ శక్తి హీనతను వాల్మీకి దోషంగా భ్రమించి సంతోష పడవచ్చు.

శ్రీ రామాయణం మహాకావ్యం. పుట్టుకతోనే కాకుండా గుణంలో కూడ అదే మొదటిది. దానిలోని గుణాలు, రహస్యాలు తెలుసుకోవాలంటే వాల్మీకికి గాని, సర్వజ్ఞుడికిగాని మాత్రమే సాధ్యమవుతుంది. అనంత కల్యాణగుణ విశిష్టుడైన భగవంతుడిని, దయావంతుడని-సర్వజ్ఞుడని-సర్వ శక్తిమంతుడని, ఏవో కొన్ని గుణాలు వర్ణించి సంతసించడానికి, రామాయణం చదివిన వారు, వారి వారి శక్తికొలది కొన్ని గుణాల వరకు అర్థం చేసుకోవచ్చు. వాస్తవానికి, అర్థం చేసుకునే ప్రయత్నం చేసినా కొద్దీ, శ్రీమద్రామాయణంలో ఉత్తమోత్తమ మహాకావ్య లక్షణాలెన్నో వున్నాయి. వర్ణనలెన్నో వున్నాయి. రామాయణం గానం చేసినా, పఠించినా మనోహరంగా వుంటుంది. లోకంలో కొన్ని కృతులను పాడుతుంటే శ్రావ్యంగా వుంటాయిగాని, మామూలుగా చదువుతుంటే, నీరసంగా అనిపిస్తాయి. కొన్నేమో, చదవడానికి ఇంపుగా వున్నా, రాగానికి- తాళానికి అనువుగా వుండవు. రామాయణం అలాంటి కోవకు చెందింది కాదు. చదివినా, పాడినా మధురమే. ఆ విషయం గ్రంథంలోనే వుంది. ఆ ప్రకారమే కుశలవులు పాడారు కూడా.

రామాయణంలో శృంగారం లాంటి నవ రసాలున్నాయి. అందులో శృంగార రసం "సంభోగ శృంగారం". సీతారాముల కల్యాణం తర్వాత అయోధ్యలో వారు అనేక ఋతువులు ప్రియంగా గడిపిన వర్ణన ఉదాహరణగా తీసుకోవచ్చు. భార్యాభర్తల పరస్పర అనురాగం ఇంతకన్నా మించి వర్ణించడం ఎవరితరం కాదు. వాల్మీకి శ్లోకాల (ఆంధ్ర వాల్మీకి పద్యాల) భావం మాత్రమే కాకుండా, అందులోని కొన్ని పదాలు ఎంత అర్థ గాంభీర్యం గలవిగా-రసవంతంగా వుంటాయో చెప్పలేము. వాల్మీకి వాక్యామృత రసాన్ని నిరంతరం ఆస్వాదన చేసిన భవభూతి వర్ణించినట్లు ఇందులో హాస్యం (శూర్పణఖ-త్రిజటల వృత్తాంతం), కరుణ (ఇష్ట వియోగం వల్ల అనిష్ట సంభవం, దశరథుడి చావు), వీర (లక్ష్మణుడి వృత్తాంతం), రౌద్రం (రావణుడి వృత్తాంతం), భయానక (మారీచాది వృత్తాంతం), బీభత్సం (కబంధ-విరాధుల వర్ణన), అద్భుతం (రావణ యుద్ధంలో), శాంతం (శబరి వృత్తాంతం) రసాలను కనుగొన వచ్చు.

ఇక అలంకారాల విషయానికొస్తే, శబ్దాలంకారాలని, అర్థాలంకారాలని రెండు రకాలున్నాయి. రామాయణంలో శబ్దాలంకారాలు తరచుగా కనబడవు. అంత్యానుప్రాసలు కొన్ని చోట్ల వున్నాయి. శ్రీమద్రామాయణం స్వభావోక్త్యలంకారాలకు పుట్టిల్లు. స్వభావోక్తులు దేశకాలవక్తృ స్వభావాలను అనుసరించి చెప్పబడ్డాయి. వర్షాన్ని వర్ణన చేసిన సందర్భంలో మన ఎదుట వర్షం కురుస్తున్నట్లే వుంటుంది. హేమంతాన్ని వర్ణిస్తుంటే, మనకు మంచులో తడుస్తున్నామా అనిపిస్తుంది. అడవులలో జరిగినవి, మనమెప్పుడూ చూడనివి-విననివి చదువుతుంటే, మన కళ్లకు కట్టినట్లే వుంటుంది. తన వర్ణనా చాతుర్యంతో వాల్మీకి, పాఠకులను, తన చేతిలో బొమ్మలా చేసి, ఇష్టమొచ్చినట్లు ఆడుకుంటాడు. ఆయన ఏ విషయాన్ని వర్ణించినా అది మన కళ్ల ఎదుట జరిగిన భావం కలుగుతుంది. ఇక ఉపమాన అలంకారాల విషయానికొస్తే, వాల్మీకి కాళిదాసుకే గురువనిపిస్తాడు. రావణ వధానంతరం రాముడు సీతతో అన్న మాటలకు అర్థం వెతుకుతే, ఆ ఉపమానంలో, సీత నిర్దోషురాలనీ-శంక అనే దోషంతో బాధ పడినవాడు రాముడనీ స్పష్టంగా తెలుస్తుంది. అలానే, రావణుడు సీతను అపహరిస్తున్నప్పుడు రాసిన శ్లోకం

కూడా. దానర్థం: సీత లోకమాత అయినందున ఆమెను రావణుడు పట్టుకోవడం తల్లిని పట్టుకోవడమంత మహా ఘోరమైన కార్యమని. ఇంద్రజిత్తు మరణం తర్వాత వాడి సేనలకు పట్టిన గతిని వర్ణిస్తూ రాసిన శ్లోకం మరో చక్కటి ఉదాహరణ.

వాల్మీకి మరో ప్రత్యేకత "ఉత్ప్రేక్ష". లంకలో– అశోక వనంలో ఒక "వంక" పారుతుంటుంది. దాని తీరంలో వున్న చెట్ల కొమ్మలు నీళ్లలో వేలాడుతుండడం వల్ల, నీరు వెనక్కు పోతుంటుంది. ఈ సామాన్య విషయాన్ని వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) ఎలా ఉత్ప్రేక్షించినాడో చదివి తీరాల్సిందే. "ఆ పర్వతం పైనుండి కిందకు పారుతున్న సెలయేరు, చూడడానికి, మగడి తొడపై నుండి కోపంతో దిగిపోతున్న స్త్రీలా వుంది. వేలాడుతున్న కొమ్మలు ప్రవాహాన్ని అడ్డగించడంతో, వెనుదిరుగుతున్న నీటి కదలిక సన్నివేశం, బంధువుల బుజ్జగింపులకు సమాధానపడి–శాంతించి, మగడి వద్దకు మరలిపోతున్న ఆడదానిలా వుంది" అన్న అర్థం వస్తుంది ఆ శ్లోకానికి–పద్యానికి. అలానే ఆయన వాడిన శ్లేషాలంకారాలు.

శ్లేషాలంకారానికి చక్కటి ఉదాహరణ వాల్మీకి నోట వెలువడిన ప్రథమ శ్లోకం.

"మానిషాద ప్రతిష్ఠాం త్వ! మగ మ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునాదేక! మవధీః కామమోహితం"

వేదాన్య విషయంలో కలిగిన ఈ ఆదిమ శ్లోకానికే నిషాద పరంగా ఒక అర్థం, భగవత్ పరంగా రెండో అర్థం వున్నాయి. ఆంధ్ర వాల్మీకంలో దీన్ని ఇలా పద్యంగా మలిచారు కవి.

"తెలియు మా నిషాదుండ ప్రతిష్ఠ నీక
ప్రాప్తమయ్యేడు శాశ్వతహాయనముల
గ్రౌంచ మిథునంబునందు నొక్కండు నీవు
కామమోహిత ముం జంపు కారణమున"

"ఒక బోయవాడు క్రౌంచ మిథునంలో వున్న మగ పక్షిని చంపడం, ఆడ పక్షి అది చూసి దుఃఖించడం, పరమదయామయుడైన వాల్మీకి అది చూసి,

బోయవాడు చేసిన అధర్మ కార్యానికి కోపగించి అతడిని ఈ శ్లోకంలో శపించడంజరిగింది. ఇదే రామాయణ ఉత్పత్తికి కారణమైన శ్లోకం కావడంతో నాంది శ్లోకం అయింది. కాబట్టి దీనికి భగవత్ పరంగా ఒక అర్థం వుంది. రామాయణంలోని ఏడు కాండల అర్థం–కథ ఇందులో సూక్ష్మంగా సమర్థించబడింది.

లక్ష్మణుడు రాముడితో అరణ్యాలకు వెళ్లే ముందర తల్లికి నమస్కారం చేసినప్పుడు, సుమిత్రా దేవి కుమారుడికి చేసిన బోధనను తెలియచేసే శ్లోకానికి పండితులు అనేక అర్థాలను చెప్పారు. అందులో సార్వజనీన సమ్మతమైనవి–ప్రధానమైనవి మూడర్థాలు. సంగ్రహంగా అవి:

మొదటిది: "ఇదివరకు నీవు రాముడికి కుడిచేతిలా, వెలుపల ప్రాణంలా వుండేవాడివి. ఆ భక్తితోనే ఇప్పుడు ఆయన వెంట అడవులకు పోతున్నావు. ఇదివరకు రాముడు మహారాజ కుమారుడు. పట్టణంలో అనేక భోగాలను అనుభవిస్తుండే వాడు. నువ్వూ అలానే సుఖానికి హాని లేకుండా అన్నను కొలుస్తుండే వాడివి. ఇక మీద అలా కాదు. చేయబోయేది సకల దుఃఖ నిలయ కాననవాసం. అదికూడా ఒక రోజు కాదు. 14 సంవత్సరాలు. పరివారంతో కాదు–ఒంటరిగా. నువ్వే పరిచారకుడవు. అలాంటి కష్ట కాలంలో నీకు విసుగు కలగవచ్చు. జ్ఞాత వెంట నేనెందుకు కష్టాల పాలు కావాలని అనుకుంటావేమో. అలా భావించ వద్దు. అడవిలో వున్నా, పట్టణంలో వున్నా, ధనికుడైనా, దరిద్రుడైనా తండ్రి ఎలా పూజనీయుడో, పితృసమానుడైన రాముడలానే. తండ్రిమీద ఎలాంటి గౌరవం వుంచాలో అలాంటిదే శ్రీరాముడి మీదుంచు. అలానే, నామీద నీకెలాంటి గౌరవం వుందో అలాంటిదే సీత మీదుంచు. అడవిని దుఃఖాలయంగా భావించ వద్దు. సుఖమైన అయోధ్యగా భావించు. సుఖ దుఃఖాలు మనఃకల్పితాలు. నీ మనస్సు నీ వశంలో వుంటే ఎక్కడున్నా నీకు సుఖ దుఃఖాలు సమానమే".

రెండోది: అదే "రాముడ యెరుంగుమీ దశరథుడు నిజము" అన్న సుమిత్ర మాటలకు మరో అర్థం రాముడు అడవులకు పోయిన తర్వాత ఆయన తండ్రి జీవించడని– అది నిజమని. "నీ తండ్రి ఎప్పుడు మరణించునో అప్పుడు నా

గతేంటి? ఇక్కడే మో కైక ప్రభుత్వం. ఆమెకు నా మీద ద్వేషమన్న సంగతి నీకు తెలిసిందే. నీ తండ్రి లేకుండా, రాముడు లేకుండా, నువ్వూ లేకుండా నన్ను కైక ఇక్కడ వుండనిస్తుందా? కాబట్టి నేను పుట్టిల్లు చేరాల్సినదాన్నే. అక్కడ నాకు ప్రతిష్టేముంటుంది? దశరథుడి భార్య అన్న గౌరవం నశించింది. అక్కడివారు మన రాజు కూతురు పుట్టింటికి వచ్చిందని నన్ను-నా తండ్రిని చులకనగా అంటారు. అలాంటప్పుడు అయోధ్య గతి ఏమందువా? అయోధ్యే అడవి కాగలదు"

మూడోది: "కుమారా-నేనెందుకు జ్ఞాతైన రాముడి వెంట అడవికి పోయి ప్రాణాపాయానికి లోనుకావాలనీ, నన్నెవ్వరు పొమ్మన్నారనీ, నాకై నేను చెట్టు కొట్టి మీద వేసుకొనడమెందుకనీ, నేను పోతే కలిగే లాభమేమిటనీ, పోకపోతే నష్టమేంటనీ సందేహిస్తున్నావేమో! అలాంటి ఆలోచనలు చేయవద్దు. లక్ష్మీనారాయణు లుండే స్థలమే వైకుంఠం. అడవియే వైకుంఠం. అలాంటి ఏకాంత సేవ దొరకడం దుర్లభం. కాబట్టి-నాయనా, తదేక ధ్యానంతో భగవత్ సేవను అరణ్యంలో చేసుకో" అని బోధించెను.

ఇలా నానార్థాల పద్యాలను అన్వయించేందుకు ఆంధ్ర వ్యాకరణ సూత్రాలను సమయోచితంగా అనుసంధానం చేసుకోవాలి.

అలంకార శాస్త్రంలో ఎన్ని అలంకారాలు చెప్పబడ్డాయో, అవన్నీ వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి)రామాయణంలో వున్నాయి. వాల్మీకి అసమాన కవితా చాతురి వర్ణనాతీతం. మరొక్క ఉదాహరణ చిత్రాలంకార ఉపయోగం. రావణుడు సీతాదేవిని అపహరించిన తర్వాత, శ్రీరాముడు ప్రియా వియోగానికి దుఃఖిస్తూ, అడవిలో జనులెవ్వరూ వుండకపోవడంతో, కళ్లకు కనిపించే పక్షి- వృక్ష-మృగాలను సంబోధించుకుంటూ పోతూ-పోతూ, రావణుడు జటాయువుతో యుద్ధం చేసిన స్థలానికి సమీపంలో వున్న ప్రస్రవణగిరిని చూస్తాడు. చూసి "ఓ పర్వతరాజా! నా వల్ల ఒంటరిగా, రమ్యమైన ప్రదేశంలో విడువబడిన సర్వాంగ సుందరైన సీత నీ చేత చూడబడెనా" అన్న ప్రశ్న వేసిన శ్లోకం (పద్యం) చక్కటి చిత్రాలంకారం. వృక్షాలకు-నదులకు వలె కాకుండా, కొండలకు ప్రతిధ్వని ఇచ్చే గుణం వుంది. దీన్ని మనస్సులో పెట్టుకున్న కవి ఈ శ్లోకాన్ని

(పద్యాన్ని) రచించారు. ప్రతిధ్వనిలో మనం అన్న మాటలే మనకు తిరిగి వినపడ్తాయి. "నీవు చూశావా?" అంటే "నీవు చూశావా?" అని ప్రతిధ్వని వస్తుంది. అలా వినబడిందని రాస్తే సారస్యం లేదనుకున్న వాల్మీకి ప్రతిధ్వనిగా వినపడిన శ్లోకాన్ని " ఓ రాజశ్రేష్ఠుడా! రమ్యవనదేశమందు నీ చేత ఒంటరిగా విడువబడిన సర్వాంగ సుందరి నా చేత చూడబడె" అని అర్థం వచ్చేట్లు రాశారు. ఇలా ప్రశ్న-జవాబు ఒక్క వాక్యంగానే వుంటే చిత్రాలంకారం అవుతుంది. ఇంత దీర్ఘంగా ఊహించి రాసిన కవి ఇంతవరకూ ఒక్క వాల్మీకే. అలంకారాల వరకెందుకు? సాధారణ విషయాన్ని చెప్పాల్సి వచ్చినప్పుడు కూడా ఏదో ఒక చమత్కారాన్ని కనబరిచేవాడు.

వాల్మీకి రామాయణంలోని పాత్రలు-పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్హమైనవిగా వుంటాయి. దశరథుడి మృతి గురించి కైక భరతుడికి చెప్తూ, "ఎల్ల భూతములకు నెయ్యదిగతి నీదు తండ్రి యట్టిగతికి దనయ యరిగె" అని అంటుంది. తానేదో ఘనకార్యం సాధించినట్లు కైక చెప్పిన పద్ధతిలో, తన భర్త చావు గురించి, తన కుమారుడితో ఏ తల్లైనా చెప్తుందా? ఇదే వాల్మీకిలోని ప్రత్యేకత. ఇదే వార్తను భరతుడు శ్రీరాముడితో మరోలా చెప్తాడు. "నిను దలంచియ యేడ్చుచున్.... నీదు దర్శన కాంక్షియై..... ..... జనకు డక్కట యస్తమించెను జాల నిన్నె స్మరించుచున్" అని దీనోక్తిగా అంటాడు. వినాశ కాలానికి నోటినుంచి విపరీత వాక్యాలే వస్తాయి. శుభ వాక్యాలు, అశుభ వాక్యాలుగా అవుతాయి.

మరో సందర్భంలో, మొట్టమొదట వానరుల మీదకు యుద్ధానికి పొమ్మని ధూమ్రాక్షుడుని ఆజ్ఞాపించాడు రావణాసురుడు. ఆజ్ఞాపిస్తూ, *"నీవు వధార్థమై మదవ నేచరయుక్తుడు రాముమీదికిన్"* అంటాడు. రావణుడి కోరిక రామాదులను చంపటానికే అయినా, *"నువ్వు చావడానికి"* అన్న విపరీతార్థం వచ్చింది ఆయన మాటల్లో. శ్రీరామచంద్రుడు ఎలా "ఆత్మవంతుడో" అలానే కుంభకర్ణుడు "వపుష్మంతుడు". అతడిది సహజ శక్తి. వరబలం కాదు. కేవలం దేహం మీదే దృష్టి నిలిపేవాడి కుండే పెద్దదేహముందతడికి. బలం,

తాగుబోతుదనం, నిద్దురబోతుదనం, తిండిబోతుదనం లాంటి గుణాలన్నీ పరిపక్వదశకొచ్చి వాడిలో నిలిచాయి. ఇలాంటి వాడు, తను రాముడి మీదకు యుద్ధానికి పోతానని రావణుడితో అంటాడు. ఆయన చెప్పిన మాటల్లోనూ విపరీతార్థం స్పష్టంగా స్ఫురిస్తుంది. "…. బోదు హతుడుగాగ, రామవిభుడక్షయంబుగ రమణి సీత బొంద గలుగును…" అని కుంభకర్ణుడుతో అనిపించాడు వాల్మీకి.

పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో. అలాంటప్పుడు, ఆయన భగవంతుడే అయితే, తనకు జరగాల్సిన పట్టాభిషేకం ఆఖరు క్షణంలో విఘ్నమైనప్పుడు సీతతో "…చెలియ యువరాజు నన్నిష్ట చేయురేడు" (… *"ధ్రువ మద్యైవ మాం రాజా, యౌవరాజ్యే భిషేక్ష్యతి"*) అని ఎందుకు చెప్పాడన్న సందేహం కలగొచ్చు. వాల్మీకి ఆ సందర్భంలో రాసిన శ్లోకార్థాన్ని పరిశీలించడానికి ముందు, అదే విషయం ప్రస్తావిస్తూ, అంతకు పూర్వం జాగ్రత్తగా చెప్పిన రామ వాక్యాలను అర్థం చేసుకోవాలి. శ్లోకంలో బాహ్యార్థం స్పష్టంగా తెలుస్తూనే వుంది. అంతరార్థంలో రాముడు చెప్పిందేంటి? తన పట్టాభిషేకం గురించి తల్లి-తండ్రి ఆలోచిస్తున్నారని అంటాడు. ఇది వాస్తవం. ఏమని ఆలోచిస్తున్నది-పట్టాభిషేకం చేయాలనా? వద్దనా?-అనేది విశదపర్చలేదు. అలానే మిగతా సందర్భాలలో చెప్పిన రామ వాక్యాలన్నీ పరిశీలించుకుంటూ పోతే-అర్థం చేసుకుంటూపోతే ఆయన అవతార ప్రయోజనం గురించి తెలుసుకోవచ్చు. ఉదాహరణకు సీతతో అన్న " …నా యర్థవృద్ధికై తొందరపెట్టు బతిని.." అన్న రామ వాక్యాలనే తీసుకోవచ్చు. అర్థ వృద్ధి అంటే లోకాభిప్రాయం ప్రకారం "పట్టాభిషేకం-ధన వృద్ధి". అయితే రాముడి అభిప్రాయం వేరు. "నా ప్రయోజనం గురించి" అంటే, తాను రావణవధాది కార్యాలు చేసే ప్రయోజనం గురించి అని అర్థం. ఇదే అర్థాన్ని వచ్చేటట్లు శ్రీరాముడు మునులతో కూడా అంటాడు తన మనస్సులో మాటగా.

రాముడి మనస్సులో వున్న అర్థం రావణవధాదికమే. సర్వసముడగు

భగవంతుడని పేరుపొందిన రాముడు, తల్లిదండ్రులమీద ద్వేష బుద్ధిగలవాడు ఎలా అవుతాడు? కాడు. కాబట్టి వారిపై నున్న సదభిప్రాయంతోనే ఒకచోట "సభ యెట్టిదో దూత యట్టివాడ"ని చెప్ప బడింది ఆయన మాటలుగా సీతకు. ఆయన అవతార ప్రయోజనం నెరవేరాలంటే, పట్టాభిషేకం చేసుకుని రాజుగా అయోధ్యలో వుండకూడదు. అరణ్యాలకు పోవాలి. ఆ పని జరగాలంటే పట్టాభిషేకం విఘ్న కారి. కాబట్టి జరగబోయేదేంటటే, "... చెలియ యువరాజు నన్నిష్ట చేయురేడు" (... "ధ్రువ మద్యైవ మాం రాజా, యౌవరాజ్యే భీషేక్ష్యతి"). దానర్థం "రాజు ఇప్పుడు నన్ను యువరాజు చేయడు" అని.

వాల్మీకి రామాయణమనే "కలశార్ణవం"లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి–విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు. ఒకే విషయం, ఒకటి కంటె ఎక్కువ సార్లు చెప్పితే, ఒక్కోసారి ఒక్కోరకమైన విశేషంతో చెప్పబడుతుంది. ఇలాంటి చిత్రాలు అనేకం వుంటాయి.

సుందరకాండలో సీతాదేవి హనుమంతుడిని ప్రశ్నించిన వాక్యాలు ఇంకో ఉదాహరణ. "కౌసల్యయు సుమిత్ర కపివరా! భరతుండు, కుశలులే?... భరతుండు.. యక్షౌహిణీసేన నంపునయ్య?" అని అడుగుతుంది సీత హనుమంతుడిని. ఎక్కడి పంప? ఎక్కడి పంచవటి? ఎక్కడి అయోధ్య? ఎక్కడి క్షేమ సమాచారం? ఎక్కడి సేన రావడం? ఈ సందేహాలన్నీ పాఠకులకు కలగొచ్చు. అయితే ఉత్తర కాండ చదివినవారికి, భాతృవత్సలుడైన భరతుడు, దూతలద్వారా శ్రీరామాదుల సమాచారాన్నంతా, వారు పంచవటి విడిచి పోయిందనక తెలుసుకుంటుండేవాడని స్పష్టంగా తెలుస్తుంది.

వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణం "ధ్వనికావ్యం". కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో

సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. రుతు వర్ణనలలో ధ్వని స్ఫురిస్తుంది. ఉదాహరణకు, సుందరకాండలోని "తతో రావణ నీతాయాః సీతాయా..." (తరువాత రావణాసుర, వరనీత ధరాత్మజాత...") అన్న శ్లోకానికి ఆచార్య పరమైన అర్థం ధ్వని. అలానే మరో శ్లోకంలో గురువు ఎలాంటివాడై వుండాలో ఆ లక్షణాలను వివరించబడింది. ఇలాంటి అర్థ బాహుళ్యం గల శ్లోకాలు వందల కొద్దీ వున్నాయి.

శ్రీ రామాయణ అంతరార్థాన్ని పెద్దలు ఇలా చెప్పుకుంటారు: భగవంతుడు ఒక్కడే పురుషుడు. తక్కినదంతా స్త్రీ మయం అన్న నియమం ప్రకారం, సీతే జీవుడు. ఆ జీవుడు భగవంతుడిని ఆశ్రయించి వున్నంతవరకు ఎలాంటి ఆపదా కలగదు. కర్మవశాన దుర్బుద్ధితో, మాయా మయమైన ప్రకృతి పదార్థాల (మాయ జింక) మీద ఆసక్తి కలిగితే, మోక్ష సాధనానికి విరుద్ధమైన అలాంటి బుద్ధి మళ్లీ పుట్టకుండా చేయడానికి భగవద్వియోగం కలుగుతుంది. వెంటనే దేహ ప్రాప్తి (లంక) కలుగుతుంది. అందులోని రావణ–కుంభకర్ణులు అహంకార–మమకారాలు. ఏకాక్షి ప్రభృతులు ఇంద్రియాలు. అనుభవంతో బుద్ధిమంతులు కావల్సినవారు, వాటికి చిక్కి అవస్థ పడుతున్నప్పుడు, జీవుడికి వివేకం కలిగి–పరితపించడం ప్రారంభించి, తన మీద భగవంతుడికి దయ కలుగుతోందా– తన దగ్గరకు చేర్చుకుంటాడా, అని విలపిస్తారు (సీతా విలాపం). తనను ఆశ్రయించిన జీవుడు ఇలా అజ్ఞానం వల్ల కష్ట దశలో పడిపోయెగదా అని అత్యంత దయాళుడైన భగవంతుడు బిడ్డకొరకు తండ్రి దుఃఖించినట్లు, జీవుడికంటే ఎక్కువగా పరితపిస్తాడు (రామ విలాపం). జీవుడికి ధైర్యం కలగడానికి, భగవంతుడికి తనపై అనురాగం వుందని చెప్పి భయపడ వద్దని తెలియచేయడానికి ఆచార్యుడిని (హనుమంతుడు) పంపుతాడు. ఆచార్యుడు అక్కడకు (లంకకు) పోయి అతడి చేష్టలన్నీ తెలుసుకొని, ధైర్యం చెప్పి, మరల భగవంతుడితో జీవుడు అనన్య భక్తుడనీ–ఆయనే దిక్కని నమ్మినాడనీ (నియత–యక్షత), కాబట్టి భగవంతుడే కాపాడాలనీ వేడుకుంటాడు. భగవంతుడు ప్రతిబంధకాలను అణచివేసి, చిత్తశుద్ధి పరీక్షించి (సీత అగ్ని ప్రవేశం) మరల తన దగ్గర చేర్చుకుంటాడు. దానర్థం, అనన్యాసక్తుడై, దృఢ నిశ్చయంతో, జీవుడు

భగవంతుడిని సేవిస్తుంటే, అతడికి కావల్సిందంతా భగవంతుడే నెరవేరుస్తాడు. సుందర కాండ చదివేటప్పుడు పాఠకులు తమను సీత గాను, శ్రీరాముడిని భగవంతుడి గాను భావిస్తే ఈ అర్థం స్పష్టంగా తెలుసుకోవచ్చు.

వాల్మీకి రామాయణంలో, సాధారణంగా, సర్గ మొదట్లో- చివర్లో, మొదలు చెప్పిన కథనే సంగ్రహంగా తిరిగి చెప్పడం జరిగింది. ఇది కాకుండా, యజ్ఞాలు-శకునాల లాంటివి చెప్పవలసి వచ్చినప్పుడు, వర్ణించిన విషయాన్నే మరల వర్ణించాల్సి వస్తే, పూర్వోక్త శ్లోకాలనే మళ్లీ చెప్పడం జరిగింది. వీటినే పునరుక్తులు అనవచ్చు. ఇలాంటిది ఆ కవి కవితా విశేషమే గాని మరొకటి కాదు. రావణుడు రాముడిని గురించి అనుకున్న శ్లోక పాదంలో, రాముడు తనను అదే విషయం గురించి అనుకున్న శ్లోకంలో "....మానుషం మన్యే రామం దశరథాత్మజం" అన్న పదాలుంటాయి. "విదితం", "ఆత్మానం" అన్న పదాలు మారతాయి. రావణుడు మనుష్యుడి చేతిలో చావడం విధి. కాబట్టి తన విరోధి (రాముడు) మనిషి అని అనుకోకుండా భగవంతుడని నమ్మితే చావు రాదు. ఇక సమర్థుడైన నర్తకుడు తాను ధరిస్తున్న పాత్రను ఉచిత రీతిగా నటించడానికి, తన్ను-తాను మరిచినట్లు, మనుష్య వేషం వేసి నటిస్తున్న రాముడు చేయాల్సిన పనిమీదున్న ఆసక్తితో తనను తాను మరిచి పోయాడు. ఉభయుల అభిప్రాయం ఒకటే కావడంతో రాముడి చేతిలో రావణుడు చచ్చాడు-రాముడు రావణుడిని చంపగలిగాడు. ఇలాంటివే ఒకే తరహాలో వున్న, సుగ్రీవుడు రాముడితో-లక్ష్మణుడితో చెప్పిన వాక్యాలు.

కొన ఊపిరితో వున్న జటాయువుని, శ్రీరాముడు సీతాదేవి వార్తను అడుగుతుండగానే అతడు ప్రాణాలను విడిచాడు. ఇలాంటి సందర్భంలో ఎవరికైనా, బతికుంటే ఏం చెప్పేవాడో కదా అనిపిస్తుంది. ఇలాంటిది నివారించేందుకు, సంపాతి అంగదాదులతో, రావణుడి వృత్తాంతాన్ని చెప్పే సందర్భాన్ని ఎంచుకున్నాడు వాల్మీకి. అక్కడా-ఇక్కడా ఉమ్మడి వాక్యాలున్నాయి. అర్థం మారింది. జటాయువు చెప్పని రావణుడి వూరు-పేరు ఇక్కడ సంపాతితో చెప్పించాడు కవి. వాల్మీకి మహర్షి "కవితౌత్కృష్ట్యానికి" వేరే దృష్టాంతం అవసరమా? శ్రీరాముడు శరభంగుడితోను, సుతీక్ష్ణుడితోను ".. నీ వనమున

వాసయోగ్య మగు పట్టెది చెప్పుము" అని భగవంతుడిలా పలికి, వెంటనే మనుష్య భావంతో మాట్లాడే చమత్కారం వాల్మీకి రామాయణం ప్రత్యేకత. ఇలాంటివెన్నో వున్నాయిందులో. చదివే పాఠకులు, ఈ అద్భుత విశేషాలను స్వయంగా ఆస్వాదించవచ్చు.

శ్రీ రామాయణంలోని కవితా చమత్కృతిని విశదీకరించాలంటే, ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఇంతెందుకు! కాళిదాసు, భవభూతి అంత గొప్ప వాళ్లు కావడానికి రామాయణమే కారణం. వాళ్లు రామాయణాన్ని ఎన్ని సార్లు చదివారో గాని, వారి కవితా వల్లి "వాల్మీకి వాక్సుధాసేచనం"లో జీవించి, వృద్ధి పొందిందనడం నిర్వివాదం. శ్రీ విశిష్టాద్వైతం మతోద్ధారకుడైన శ్రీ రామానుజాచార్యులు పద్దెనిమిది పర్యాయాలు గురు ముఖంగా రామాయణాన్ని పఠించి వ్యాఖ్య రాశారు. ఒక్కసారి కూడా గ్రంథమంతా చదవకుండా, సంస్కృత భాష తెలియకపోయినా, "పూర్వ పక్షం" రాసేవారెందరో వున్నారు ! వారెలాంటి ప్రాజ్ఞులో కదా!

"ఒక్క ఏరునో-నదినో చూసిన మాత్రాన అదెంత గొప్పగా వుందో అనుకుంటాం. అలానే కాళిదాసు లాంటి వారిని గొప్ప కవులంటాం. అలాంటప్పుడు అన్ని నదులకు ఆధారమైన సముద్రాన్ని ఏమనాలి? అలానే, కాళిదాసాదులకు జీవనదమైన రామాయణాన్ని ఏమని వర్ణించాలి? మన మతంలో వున్న ఏదో ఒక సుగుణాన్ని గ్రహించి, దాన్నే విస్తరించి చెప్పుతూ, అన్య మతాలు ప్రసిద్ధికెక్కినట్లే, ఉపమా విషయం, కాళిదాసునివలె ఇతర కవుల ఇతర గుణాలను ఒక్కొక్కదానిని ఇందుండి గ్రహించి, దానిని తమ చిన్న కావ్యాలలో విశేషంగా చొప్పించి ప్రసిద్ధులయ్యారు". ఆర్యమతంలా, వాల్మీకి రామాయణం గొప్పదై, పామరులకు ఇందులోని అన్ని విషయాలను అర్థం చేసుకోవడం దుస్సాధ్యం కావడంతో, పిల్ల మతాలలాగా ఇతర గ్రంథాలు ప్రసిద్ధికెక్కాయి. మహర్షైన-మహా యోగైన వాల్మీకెక్కడ? ఇప్పటి (అప్పటి) కవులెక్కడ?

కాళిదాసు రచనలోని "అస్మాన్ సాధు విచిం త్యేత్యాది" శ్లోకాలలోని విశేషాలను, వాల్మీకి రామాయణం "అహం వేద్మి మహాత్మానం...., ఇయం

సీతా మమ సుతా...." (ఏ నెరుంగుదు రాజేంద్ర !......, ఈ సీత నాదు కూతురు, నీ సహధర్మచరి, దీనినిం గైకొనుమా....") శ్లోకాలలోని, ప్రతి పద సారస్యాన్ని నిశితంగా పరిశీలించితే, కాళిదాసు వాల్మీకి శిష్యుడని తెలియడమే కాకుండా, గురు శిష్యుల తారతమ్యం స్పష్టంగా బయట పడుతుంది. కాళిదాసు "విక్రమోర్వశీయం" నాలుగో అంకం శ్లోకంలోని ఒక్క పదం తప్ప మిగతా దంతా, వాల్మీకి రామాయణంలో ఇంతకుముందు రాసిందే. ఇరువురి శ్లోకాలలోని ఉమ్మడి వాక్యాలిలా వున్నాయి: "... .... క్షితిభృతాంనాథ! దృష్టా సర్వాంగసుందరీ రామా! రమ్యవనోద్దేశే, మయా విరహితా త్వయా". "కచ్చిత్" కు బదులుగా "సర్వక్షితి" అన్న ఒక్క పదాన్ని చొప్పించాడు కాళిదాసు. ఇలా వాల్మీకి రామాయణం నుంచి కాళిదాసు లాంటి వారు గ్రహించినవి ఎన్నో వున్నాయి. వేదవ్యాసుడంతటి వాడు వాల్మీకి శ్లోకాలను అనువదించగా లేంది, వేరేవారి సంగతి చెప్పాలా !

ఎవరికైనా సత్కవి కావాలని కోరికుంటే, వారువాల్మీకి రామాయణాన్ని అనేక పర్యాయాలు, శ్రద్ధగా-భక్తితో పఠించాల్సిందే.

శ్రీమద్రామాయణం గొప్ప ధర్మశాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ-లోభ-పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి.

సత్ ప్రభు లక్షణం తెలుసుకోవాలంటే, రామ-దశరథుల రాజ్య పాలనా విధానంలో దొరుకుతుంది. ఆర్య ప్రభువులు ఏ పని చేసినా ప్రజల అనుమతి లేకుండా చేయలేదు. తాము ప్రభుత్వం నడిపేది ప్రజలకొరకేనని, వారిని సుఖ పెట్టడానికేనని వారు భావించేవారు. ప్రత్యక్షంగానైనా-పరోక్షంగానైనా ప్రజలకు హాని కలిగించే పనేదీ చేయరు. శ్రీరాముడి పట్టాభిషేకం గురించి దశరథుడు చేసిన (అయోధ్య కాండ) ఉపన్యాసం ఇందుకో ఉదాహరణ. ప్రజల దగ్గర

పన్నులు తీసుకుంటూ, వారి కష్టాలు తొలగించకపోతే నరకంలోకి పోతామని వారి నమ్మకం (అరణ్య కాండ).

ప్రభువైన వాడు ధర్మాన్ని ఆధారంగా చేసుకొని, వేగులవారి ద్వారా, ప్రజల కష్ట సుఖాలను తెలుసుకోవాలి. ప్రజలు ఇష్టపడని గుణాలు తనలో వుంటే, ఎంత నష్టమైనా-కష్టమైనా అవి మానుకోవాలి. ఆ విషయంలో రాజు అంతఃకరణం చెప్పింది ముఖ్యం కాదు. ఇతరులను సంతోష పెట్టడానికి తనెందుకు దుఃఖపడాలని అనకూడదు. ఈ విషయంలో రాముడే ప్రమాణం.

శ్రీరాముడు పట్టాభిషేకం జరిగిన తర్వాత ఒక నాడు వేగులవాడైన భద్రుడిని నగరంలో- పల్లెల్లో వార్తలేంటని, తమను గురించి ప్రజలేమనుకుంటున్నారని అడిగాడు. జవాబుగా వాడు, తనను లోకులందరూ ప్రశంసిస్తున్నారని చెప్తే, అంతటితో తృప్తి పడలేదాయన. ఉన్నదున్నట్లు-విన్నది విన్నట్లు అసలు విషయాలన్నీ చెప్పమంటాడు రాముడు. భద్రుడప్పుడు లోకుల పొగడ్తల మాటలు ముందు చెప్పి తర్వాత, "తామసుడగు రాక్షసు గృహసీమను జిరకాల మట్లు చెరబడిన సతిన్, రాముడు రోయక కూడెడి, గాముకులగు వారి కెందు గన్నులు గలవే" అని ప్రజలు వారికి తోచినట్లనుకుంటూన్నారని అంటాడు. అతడు చెప్పిన మాట సత్యమని ఇతరులతో దృఢపర్చుకొని, భరతాదులను పిలిపించి, లక్ష్మణుడితో లంకలో జరిగిన సంగతంతా చెప్పి, ".. అపవాదము దుస్సహమై, తపియింపగ జేసె నన్ను.... .... విడిచెద మిమ్మెల్లర, నే విడిచెద నా ప్రాణమేని, విమల యశము కై...." అంటూ, సీతను వాల్మీకాశ్రమానికి పంపాడు రాముడు. ఒకడిపైన ఇంతకంటే అసత్యమైన అపవాదం పడుతుందా? అలాంటి అపవాదాన్ని పోగొట్టుకోవడానికి ఇంతకంటే స్వార్థ పరిత్యాగం చేసిన వాడుంటాడా? కాబట్టి, ప్రతి మనిషి, తనను చూసి ఇతరులు తప్పు తోవలో ప్రవర్తించకుండేట్లు, లోకోపకారమైన మార్గాన్నే అనుసరించాలి.

సత్ ప్రభువు ప్రజల సుఖ దుఃఖాలను అనుదినం విచారించాలి. సీతా వియోగానంతరం, లక్ష్మణుడు తిరిగొచ్చేంతవరకు, నాలుగు రోజులు, కొలువు దీర్చలేదు రాముడు. దానికి "మర్మనికృంతన మైన బాధ" పడుతూ లక్ష్మణుడితో వెంటనే కొలువు తీర్చమని చెప్పి పరితపించాడు.

అలాంటి అనురాగం గల ప్రభువు విషయంలో, ప్రజలు కూడా అలానే వుండేవారు. అతడితో అడవులకు పోవడానికి, ప్రాణాలైనా పరిత్యజించడానికి అంగీకరించారు. ప్రభువు తానెంత గొప్పవాడైనా, తక్కువ వారితో కూడా కలిసి-మెలిసి వుండాలి. దీన్నే సౌశీల్యం అంటారు. గుహుడికి రాముడిని చూడగానే తటాలున కౌగలించు కోవడానికి వాళ్లిద్దరి మధ్య ఎంత స్నేహం వుండాలో కదా? అలానే రాజు ఎంత తెలిసినవాడైనా, మంత్రుల ఆలోచనలను-సలహాలను తిరస్కరించకూడదు. వారు చెప్పింది విని, వారితో తాను చేయదల్చుకుంది, సరైందని నమ్మే విధంగా సమాధానం ఇవ్వాలి. విభీషణుడు శరణు చొచ్చినప్పుడు జరిగిన సంగతి ఇందుకొక ఉదాహరణ. ఇంతెందుకు? రాముడి గుణగణాలను చక్కగ అర్థం చేసుకుంటే, రాజుకుండవలసిన సద్గుణాలే కాకుండా, సాధారణంగా ప్రతి పురుషుడికి వుండాల్సిన, సత్యం-దయ-ఇంద్రియ నిగ్రహం-పితృభక్తి-ఏక పత్నీనియమం-సౌభ్రాత్రం-దైవ భక్తి- దేవతారాధనం-నిత్య కర్మానుష్ఠానం విపులంగా ఆయనలో వున్నాయని తెలుసుకోవచ్చు.

ఇక ఉత్తమ స్త్రీల లక్షణాలన్నీ కలిగున్నవారిగా సీత, కౌసల్య, సుమిత్రల గుణాలను బట్టి, నీచ స్త్రీల లక్షణాలున్న వారిగా కైకేయి, శూర్పణఖల గుణాలను బట్టి తెలుసుకోవచ్చు. రావణాసురుడు చెడిపోవడానికి ఎన్నో కారణాలు కనిపిస్తాయి రామాయణంలో. ఇంద్రియాలను జయించ లేకపోవడం, అసత్యాలు పలకడం, వేగుల వారు లేకపోవడం-వున్న వారికి సరైన జీతాలు ఇవ్వక పోవడం, తన పరిసరాలో జరుగుతున్న వృత్తాంతాలను తెలుసుకోలేక పోవడం, విన్న ప్రతి విషయాన్నీ నమ్మడం-నిజా, నిజాలు మంత్రులపైన పడవేయడం, తన మేలుకోరి చెప్పగలవారికి-జ్ఞాన హీనతతో చెప్పేవారికి మధ్య తేడా తెలుసుకోలేక పోవడం, ఎవరినీ నమ్మక పోవడం, మూర్ఖత్వం లాంటి పలు దుర్గుణాలు వున్న రావణుడు సమూలంగా నాశనమయ్యాడు. పైన పేర్కొన్న విషయాలన్నీ, శూర్పణక, మారీచుడు, విభీషణుడు చెప్పిన మాటల్లో బయట పడుతుంది. రాముడితో యుద్ధమెందుకు చేయవలసి వచ్చిందో-యుద్ధ కారణమేంటో తన భటులకే తెలియనీయక వంచన చేసి, వారి ప్రాణాలను తీసిన (రావణాసురుడి లాంటి) ప్రభువు ఎలాంటి వాడో రామాయణం చదువుతే అర్థమవుతుంది.

ఇలాగే, రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చర్యల వలన భాతృ ధర్మం, సుగ్రీవుడి చర్యల వలన మిత్ర ధర్మం, హనుమంతుడి చర్యల వలన భృత్యు ధర్మం తెలియ చేయబడ్డాయి రామాయణంలో. అరణ్య వాసానికి పోయేటప్పుడు శ్రీరాముడు తల్లి కౌసల్యతో (అయోధ్య కాండ) అన్న మాటల్లో సతీ ధర్మం ఏమిటో తెలుసుకోవచ్చు. ఆ విషయం "... ... వారిజనేత్రకు భర్తృసేవ సద్గతి సమకూర్చు దల్లి......., ... భర్తృహిత కారిణివై చరియింపు మంగనా..." అన్న ఆంధ్ర వాల్మీకి పద్యాల్లో స్పష్టంగా తెలుస్తుంది. అలానే అనసూయ సీతకు హితోపదేశం చేసిన ఘట్టం చదివితే సతీ ధర్మం గురించి తెలుసుకోవచ్చు.

పితృ భక్తిని తెలుసుకోవాలంటే, అయోధ్య కాండలోని "....... పుత్ర లబ్ధికై పనిగొని తల్లి తండ్రి పడు పాటులకుం బ్రతి సేయ నౌనె? యింపున దల జూచి నీళ్లు కడుపుంగని యన్నము పోసిపెట్టి యెండను జడి గాలి బ్రోతురు దినంబును వారల తుల్యులే యొరుల్" అన్న రాముడి వాక్యాలను చదవాలి.

మిత్రధర్మాన్ని గురించి "సులభము మిత్రుల జేర్చుట, కలసిన మరి మైత్రి చెడక కాపాడుటయే బలితపు గష్టము మది చం, చల మగుటను బ్రీతి చెడును స్వల్పంబున కేన్" అన్న సుగ్రీవుడి మాటల్లో తెలియచేయబడింది. న్యాయవాది ధర్మాన్ని హనుమంతుడి వాక్యాలలోను, కన్యాజనకత్వాన్ని" జననీ వంశమువారిని, జనకు కులమువారి స్వపతి సంతతి వారిన్ దనయా ! కన్యక సంశయ, మున ద్రోయు సదా యకీర్తి ముంచునొ యనుచున్" అన్న ఉత్తర కాండ పద్యాలలోను తెలుసుకోవచ్చు. సుందర కాండలోని "కోపి తునుము గురువులనేన్, గోపి కడుం గరకులాడు గుణవంతులనేన్, గోపి యొనర్పగ జాలని, పాపం బేదైన గలదే భావింపగన్" అన్న పద్యంలో కోపి లక్షణం ఏంటో తెలుసుకోవచ్చు.

రామాయణంలో సకల ధర్మాలున్నాయి. ఇందులో వున్న ధర్మాలే మిగిలిన అన్ని గ్రంథాలలోనూ కనబడతాయి. ఇందులో లేని ధర్మాలు మరింకే దాంట్లోను కనిపించవు. రామాయణంలో సూత్రప్రాయంగా చెప్పిన ఎన్నో విషయాలను వ్యాసమహర్షి తన గ్రంథాలలో పేర్కొన్నాడు. ఉదాహరణకు "నాళీక జంఘుని" కథ. ఇలానే రామాయణంలో సూక్ష్మంగా చెప్పబడిన ధర్మాలను, కథలు-కథలుగా

కల్పించి వ్యాస భగవానుడు ఇంతకు నాలుగింతలు గ్రంథాన్ని తయారు చేశాడు. భగవద్గీతంతా కూడా రామాయణ సారమేనని గ్రహించాలి.

శ్రీమద్వాల్మీకి రామాయణం మంత్రనిధానం. ఇందులో అనేకానేక మంత్రాలు ఉద్ధరించబడి వున్నాయి. అందువల్లే, వాల్మీకి రామాయణం పారాయణం చేసేవారు, "అంగన్యాస కరన్యాసాదులతో" యథావిధిగా చదివి, వారి వారి కోరికలు నెరవేర్చుకుంటారు. సద్భావంతో సుందర కాండ పారాయణం చేసి కార్య సిద్ధిని పొందనివారు ఇంతవరకు లేరు. ఉత్తర కాండలో చెప్పినట్లు, రామాయణమంతా గాయత్రీ స్వరూపమే. గాయత్రిలోని 24 అక్షరాలను, ప్రతి వేయి శ్లోకాలకు ఒక అక్షరం చొప్పున శ్లోకం ఆరంభంలో చెప్పబడింది. ఏడు కాండలలో ఏడు వ్యాహృతులు వివరించడం జరిగింది. ఈ గాయత్రీ విధానాన్ని నారదుడే స్వయంగా వాల్మీకి మహర్షికి, రామాయణంతో పాటే ఉపదేశించాడు. "తపస్స్వాధ్యాయ నిరతం, తపస్వీ వాగ్విదాంవరమ్, నారదం పరిపప్రచ్ఛ, వాల్మీకిర్మునిపుంగవమ్" అని గాయత్రిలోని మొదటి అక్షరంతో శ్లోకాన్ని ప్రారంభించి, "జనశ్చ శూద్రోపి మహత్త్వ మీయాత్" అని గాయత్రి కడపటి అక్షరంతో సర్గను ముగించాడు వాల్మీకి. అంధ్ర వాల్మీకంలో, మూలంలో వున్నట్లు "తపమున స్వాధ్యాయంబున, నిపుణుని... ..... తమి గావించెన్" అన్న పద్యంతో ప్రారంభించి, "యథావిధి విన్న బఠింప నారయన్" అని ముగించబడింది.

సంస్కృత మూలంలో మాదిరిగానే, ఆంధ్ర వాల్మీకంలో, ప్రణవం-ప్రణవార్థం సముద్ధరించబడి వున్నాయి. ఉదాహరణకు, ఆంధ్ర వాల్మీకంలోని, "అగ్రవర్తియై శ్రీరాము... నువిద తను మధ్య..... మహిత కోదండ..... డోలి....ప్రేమ" అన్న పద్యంలోని మొదటి మూడు పాదాల ప్రథమాక్షరాలు (అవుమ) కలిపితే, నాల్గవ పాదం ప్రథమ-అంత్య అక్షర (ఓమ) స్వరూపం వస్తుంది. ఇలా మంత్రార్థమంతా మూలంలో వలె వుంటుంది. ఇలా, షడక్షరి, అష్టాక్షరి, ద్వయము లాంటి మంత్రాలు కూర్చబడ్డాయి. పరిశోధకులకు ఇవి కనుగొనడం తేలిక.

ఆంధ్ర వాల్మీకంలోని ఈ పద్యం చదువుతే సాంఖ్య శాస్త్ర రహస్యం గురించి కూడా తెలుసుకోవచ్చు.

“శ్రీమహిజాధవుండు జడ చేతనజీవనధాత సద్గరీ
యో మరభూరుహంబు సమ దారివిదారణశీలి భక్తవా
రామృతదాత సంభృతశ రాసకరాంబుజు దొంటిమిట్టశ్రీ
రాము డమాయవర్తనుడు రక్తి గ్రహించుత మన్నమస్కృతుల్

చివరి పాదంలోని మొదటి అక్షరం “రా” అంటే సంఖ్యాశాస్త్రం ప్రకారం 2కు సమానం. ఈ అక్షరం తర్వాత రెండు అక్షరాలను వదిలి చదివితే “మాయ” వుంటుంది. సాంఖ్య శాస్త్రం ప్రకారం మాయ 15కు సమానం. మొదటి అక్షరం తర్వాత 15 అక్షరాలు వదిలి చదివితే “నమః” వుంటుంది. ఇలా అన్నీ కలిపి చదివితే “రామాయనమః” ఏర్పడుతుంది. ఇలాగే కాండాది పద్యాలలో ద్వయము, షడక్షర నియమం కనిపిస్తాయి. కాండాంత పద్యాలలో “రామషడక్షరి” చొప్పించబడి వుంది. వాస్తవానికి సంస్కృత మూలంలో కొన్ని శ్లోకాలు అభేద్యంగా, వాటి స్వరూపాలు ఊహకందకుండా వుండడంతో తెనిగించడం అంత తేలికైన విషయంగా కనిపించలేదు.

ఇంద్రజిత్తును లక్ష్మణుడు చంపగలిగాడు. “రామ” అన్న రెండక్షరాలే “తారక మంత్రం” కదా ! దానినే సర్వజ్ఞుడు శివుడు పార్వతికి ఉపదేశించాడు.

కామ్యార్థమైనా, మోక్షార్థమైనా, రామాయణం పారాయణం చేసినవారి కోరికలు నెరవేర్చే శక్తి, రామాయణానికి వుండడానికి కారణం, అది భగవత్ కథ కావడానికి అదనంగా సర్వజ్ఞుడైన వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) కూర్చిన బీజాక్షరాల మహాత్మ్యమే. ఉదాహరణకు ఒక దృష్టాంతం తీసుకుందాం. సుందర కాండను అందరు పారాయణం చేస్తారు కదా! అలా చేసినవారి కోరికలు నెరవేరడం కూడా సహజమే కదా! ఆ కాండంలో ప్రథమాక్షరం “త”. చివరి అక్షరం కూడా “త”. “తరువాత రావణాసుర....” తో మొదలయ్యి, “తతభవద్దుఃఖమునకు....శాంతి సీత” తో ముగుస్తుంది. సుందర కాండలో ప్రతి సర్గ మొదటి అక్షరం “స” కారంతోనో, “త” కారంతోనో వుంటుంది. అలా కాకపోతే ఆ శ్లోకంలో “సీత” అన్న శబ్దంకాని, దాని పర్యాయ పదం కాని వుంటుంది. అది కూడా కుదరనప్పుడు, రెండో శ్లోకం మొదటి అక్షరం “స” కాని, “త” కాని తప్పకుండా వుంటుంది. ఈ “స”, “త” లు “సీత” అన్న

పదాన్ని సూచించడం స్పష్టంగా తెలుస్తోంది. సుందర కాండకు అధిష్టాన దేవత సీత. ఈ సకార-తకార మహిమ ప్రకారం సీత అంటే "ఓం" అని అర్థం కూడా. బీజాక్షర మహిమ కూడా వుంది. ఇప్పుడు చెప్పిన దాని కంతా పారాయణం చేస్తున్న వారే సాక్షులు. హనుమంతుడు ఆమె పేరు చెప్పాల్సి వచ్చినప్పుడల్లా, ఆమె వున్న దిక్కుకు నమస్కరించి మరీ ప్రస్తావించేవాడు. ఇలా రామాయణంలో ఎన్ని రహస్యాలున్నాయన్న సంగతి ఎవరికన్నా తెలుసునా?

శ్రీమద్రామాయణం వేదంతో సమానమైందే కాకుండా వేదమే అనాలి. వేదమే అయినప్పుడు, వేదంతో సమానమైందని ఎలా అనవచ్చునంటే, వేదంలోని వర్ణాలనే, అనులోమ-విలోమాలుగా మార్చి, వేద ప్రసిద్ధమైన రామ కథను చెప్పడంవల్ల ఇది వేదమే అయింది. వేదాల్లోని అర్థాలున్నందువల్ల వేదంతో సమానమైంది. అందువల్లనే, వేద పఠనం అవశ్యంగా చేయాల్సిన కార్యక్రమాల్లో, రామాయణ పఠనం నియమితమైంది. "రామాయణం వేదసమం, శ్రాద్ధేషు శ్రావయే ద్బుధః" అని రామాయణంలోనే చెప్పబడింది.

శతకోటి, అంటే 24 గాయత్రీ బీజాక్షరాలతో కూడిన 24,000 గ్రంథాల రామాయణంలోని ప్రతి అక్షరానికి మహా పాతకాలను నాశనం చేయగల శక్తిగలదని కొందరంటారు. కొందరేమో, శతకోటి రామాయణాన్ని వాల్మీకి సంగ్రహంగా చెప్పాడంటారు. ఇలాంటి మహిమ రామాయణంలో వుండడానికి కారణమేంటో ఆలోచించాలి. వాల్మీకి సూత్రాన్ననుసరించి, రామాయణం వేద స్వర సముద్ధృతంగా-సర్వశ్రుతులందున్నట్లుగా తెలుస్తోంది. వాల్మీకి రచించిన 24,000 శ్లోకాలలో, యజుర్వేదంలోని 1,29,290 పదాలే కాకుండా, రుగ్వేదం, సామవేదం, అధర్వ వేదాలలోని పదాలు కూడా అనులోమ-విలోమంగా కూర్చబడిందన్న రహస్యం తెలుసుకోవచ్చు. యజుర్వేదానికి ప్రాముఖ్యం ఇవ్వడానికి కారణం, శ్రీరాముడు యజుర్వేది కావడమే.

యజుర్వేద సంహితా ప్రమాణం ఆధారంగా, రామాయణంలోని ఏడు కాండలంటే, సౌమ్యము, ప్రాజాపత్యము, వైశ్వదేవము, ఆగ్నేయము, ఆగ్నేయ బ్రాహ్మణము, సౌమ్య బ్రాహ్మణము, కామ్యకము. అదే విధంగా ప్రశ్నలు 44. అందులో మొదటి కాండలో 8, రెండులో 6, మూడులో 5, నాలుగులో 7,

ఐదులో 7, ఆరులో 6, ఏడవ కాండలో 5 ప్రశ్నలున్నాయి. అనువాకాలు 651, పనసలు 2,198, పదాలు 1,29,290, అక్షరాలు 2,53,868 వున్నాయి. ఈ విధంగా యజుర్వేదంలోని కాండల, ప్రశ్నల, అనువాకాల, పదాక్షరాల నిర్ణయం జరిగింది. శ్రీమద్రామాయణంలోని కాండలలో వేదాక్షరాలు ఎలా వున్నాయో పరిశీలించితే, బాల కాండ ప్రధమ సర్గ నుంచి ఐదో సర్గ వరకు రెండో శ్లోకం దాకా, నారదుడు ఉపదేశించిన విధానం రాసి, తర్వాతనే బ్రహ్మ ప్రత్యక్షం కావడంతో కథా భాగం వుంది. బాల కాండ 5 సర్గ 3వ శ్లోకం నుంచి, అయోధ్య కాండ 115వ సర్గ వరకు యజుర్వేదం. అయోధ్య కాండ 116వ సర్గ మొదలు, అరణ్య కాండ 74వ సర్గ వరకు ఋగ్వేదం. అరణ్య కాండ 75వ సర్గ మొదలు సుందరకాండ 48వ సర్గ వరకు సామవేదం. సుందర కాండ 49వ సర్గ మొదలు ఉత్తర కాండ 36వ సర్గ వరకు అథర్వ వేదం. ఉత్తర కాండ 37వ సర్గ మొదలు చివర వరకు ఉపనిషత్తు–అంటే శాంతి. ఈ విధంగా 647సర్గలలో 23,635 శ్లోకాలు, 7,76,794 అక్షరాలున్నాయి. అక్షరాల సంఖ్యలో కొంచెం తేడా రావడానికి కారణం వేదాలలో వర్ణముల పదాలు విశేషంగా వుండడం వల్ల ఇవి సరి చూసుకుంటే, వేద వర్ణాల లెక్కకు, రామాయణ వర్ణాల లెక్కకు సరిపోతాయి. రామాయణం వేదం కాబట్టే, నిరంతర అధ్యాయనపరుడైన వాల్మీకి, కొన్ని చోట్ల వేద పరిభాషా పదాలను, వేద సంజ్ఞలను ప్రయోగించాడు. ఈ సంకేతాలన్నింటినీ తెలుసుకోగలిగితే సందేహాలకు తావులేకుండా వాల్మీకి రామాయణ సారాన్ని గ్రహించగలుగుతారు.

రామాయణం ఒక మహత్తరమైన సాంఖ్య శాస్త్రం. “కాదినవాది సూత్రాల” ప్రకారం అక్షరాల కొచ్చే సంఖ్యలను బట్టి చూస్తే, రామాయణంలో కొన్ని చిత్రాలు కనిపిస్తాయి.

రా + మ = 2+5 =	**7**
అవతార సంఖ్య	**7**
రామాయణ కాండ సంఖ్య	**7**
యుద్ధం జరిగిన రోజుల సంఖ్య	**7**
రామాయణ యుద్ధంలో ముఖ్యమైన పురుషుల సంఖ్య	**7**

(రామ, లక్ష్మణ, హనుమ, విభీషణ, రావణ, కుంభకర్ణ, ఇంద్రజిత్తులు)

పారాయణం చేసే వారికి ముఖ్యంగా నియమిత మైన సర్గల సంఖ్య 7. వ్యాహృతులు 7. ఇలా ఈ ఏడవ సంఖ్య మహిమ అద్భుతం. "శ్లోక శతై" అని వాల్మీకి చెప్పినట్లు, బాల కాండం మొదటి సర్గ మొదటి శ్లోకం (తప స్స్వాధ్యాయ...) లోని అక్షరాల కొచ్చే సంఖ్యలను కూడితే 100 వస్తుంది. ఈ 100 సంఖ్య ప్రథమ సర్గలోని శ్లోకాల సంఖ్య. రామాయణంలోని సప్త సంఖ్యా నియమాన్ని గ్రహించిన వ్యాస భగవానులు నిజ రచిత గ్రంథానికి "జయ" అని పేరు పెట్టాడు. "జయ" అంటే 18. భారతంలోని పర్వాలు 18. యుద్ధం జరిగింది 18 రోజులు. రణశూరులు 18 మంది. భగవద్గీతలో 18 అధ్యాయా లున్నాయి. ఇలా ఆలోచిస్తే, మహర్షులందరి మార్గాలు ఒక్కటేననిపిస్తుంది.

సీతారాముల వియోగం గురించి, కలిసి వుండడం గురించి అయోధ్యా కాండలో చెప్ప బడింది. మిగిలిన కాండలలో కొంత కాలమన్నా వియోగం గురించి చెప్పబడింది. కాబట్టి "సీత, రామ" నామాల సంఖ్యలు కలిపితే (సీత=67 + రామ=52) 119 వస్తుంది. అయోధ్య కాండలో 119 సర్గలున్నాయి. ఇలాంటి చిత్రాలు ఎన్నెన్నో వాల్మీకి రామాయణంలో నిక్షేపం చేశాడు.

శ్రీరాముడు సామాన్య ధర్మాలన్నీ ఎలా అనుష్టించింది, కష్టకాలంలో ఎలా ప్రవర్తించింది, సుఖ కాలంలో ఎలా నడచుకుంది, ఎలాంటెలాంటి వారి మీద ఏ విధమైన అభిప్రాయంతో మెలిగేవాడనేదీ, వీటి కారణాలేంటి అన్న విషయాలన్నీ చర్చించాల్సినవే. రాముడి పైనా, ఆయన తమ్ములపైనా ఏక పత్నీవ్రతం విషయంలో కూడా విరుద్ధాభిప్రాయాలను వెలిబుచ్చిన వారున్నారు. అసలా మాటకొస్తే " దుష్టులు వెలిచవి (జారత్వం) మరగిన భ్రష్టులు లేరప్పురమున రాష్ట్రమునందున్" అని బాలకాండలో చెప్పినట్లు, దశరథుడు పాలించిన అయోధ్యలో ప్రతి మనుష్యుడు ఏక పత్నీవ్రతుడే. అలాంటప్పుడు రాముడు అనేక పత్నీకుడని ఎలా చెప్పారు? అలాంటి రాముడు వాల్మీకి వర్ణించిన శ్రీరాముడు మాత్రం కాడు. ఒక్క వాల్మీకే యథార్థ చరిత్రను వర్ణించాడు. మిగిలిన వారందరూ, రాముడి పరత్వాన్ని వర్ణించినవారే. ఇలానే వాలి వధ విషయంలో కూడా రాముడి గుణం దోషరహితమే. శ్రీరాముడు సంధ్యావందనం,

దేవతార్చన, విగ్రహారాధన, వ్రతానుష్టానం లాంటి నిత్య కర్మలన్నీ శ్రద్ధగా చేసేవాడు.

రామాయణ గ్రంథమేమో చాలా గొప్పది. రాసిన కవేమో బ్రహ్మర్షి. ఇందులోని మర్మాలేమో మెండుగా వున్నాయి. రాసిందేమో సంస్కృత భాషలో. చదివినా కొద్దీ విశేషాలు కనిపిస్తాయి. నేనా కించిజ్ఞుడను–చంచల చిత్తుడను–శక్తి హీనుడను. అందుకే దోషాలు దండిగా వుంటాయి. పాఠకులు ఆంధ్ర వాల్మీకి రామాయణాన్ని దయతో చదివి నన్ను ధన్యుడిని చేయండి. భగవద్ధ్యానంలో ఆసక్తిగల భక్తులందరూ దీన్ని భగవంతుడికి నివేదించబడిన ప్రసాదంలా ఈ కృతిని భావించమని ప్రార్థన.

చివరగా: "తప్పైనను నొప్పైనను, దెప్పుచునో మెచ్చుకొనుచొ, దీనిన్ శ్రద్ధన్ దప్పక సకలము జదివెడు, నప్పుణ్యాత్ముల కొనర్తు సాష్టాంగనతుల్" (వావిలికొలను సుబ్బారావు, కీలక సంవత్సరం, మాఖ శుద్ధ 11, తిరువళిక్కేణి)

❖ ❖ ❖

వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణానిదే కావ్యాలలో అగ్రస్థానం

శ్రీ సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్నుల చరిత్రను, వీరు ఆచరించిన ధర్మాలను అన్ని లోకాలకూ శాశ్వతంగా చెప్పేందుకు, శత కోటి గ్రంథాత్మకమైన ప్రబంధంగా, ఓ బృహత్ గ్రంథాన్ని రచించి నారదుడికి, ఇతర మహర్షులకు ఉపదేశించాడు బ్రహ్మదేవుడు. అంతటితో ఆగకుండా భూలోక వాసుల కొరకై శ్రీరామ భక్తుడైన వాల్మీకికి ఉపదేశించమని నారదుడిని ఆదేశించాడు. వాల్మీకి రచించిన రామాయణం బ్రహ్మ ప్రేరేపించినదే.

వాల్మీకి సంస్కృతంలో రచించిన శ్రీమద్రామాయణం కావ్యాలలో అగ్రస్థానంలో నిలిచింది. శ్రీమద్రామాయణంలో నాయిక సాక్షాత్తు శ్రీదేవైన సీతా దేవి. నాయకుడు మహావిష్ణువైన శ్రీరామచంద్రమూర్తి. వీరిరువురు త్రేతాయుగంలో దుష్ట శిక్షణ-శిష్ట రక్షణ చేసి, ధర్మ సంస్థాపన చేసేందుకు అవతరించారు. ఇహ-పర సాధకంబులైన "స్వధర్మాలలో, స్త్రీ ధర్మం సీతని, పురుష ధర్మం శ్రీరామచంద్రమూర్తని లోకానికుపదేశించాడు వాల్మీకి.

శ్రీరామచంద్రుడు బాలుడుగా వున్నప్పుడు జరిగిన సంగతులు తెలిపేది "బాల కాండ". ఇందులోనే సీతాకల్యాణ ఘట్టం అత్యంత మనోహరంగా రాసారు వాల్మీకి కవి. "కాండం"అంటే జలం...అంటే నీరు. శ్రీ రామాయణం మహార్ణవంగా చెప్పడంవల్ల, అందులోని జలం కాండమన్నారు. శ్రీ రామాయణంలోని బాల కాండలో శ్రీరామచంద్రమూర్తైన విష్ణువే "జగజ్జనన కారణభూతుడు" అని బోధపడుతుంది. జననం మొదలు ఇరవై అయిదు ఏళ్లు వచ్చేవరకూ రాముడు చేసిన చర్యలు ఈ కాండలో వున్నాయి. పన్నెండో ఏట పెళ్లైనప్పటినుండి పట్టాభిషేకం ప్రయత్నం జరిగే వరకు చెప్పుకోదగ్గ విశేషం ఏమీలేదు. బాల కాండ వృత్తాంతమంతా 12 సంవత్సరాల కాలంలో జరిగింది.

రామాయణ రచనకు పూనుకున్న వాల్మీకి మహర్షి, భగవద్విషయాన్ని బోధించే యోగ్యతలున్న గురువు దొరకలేదనే నిర్వేదంతో శుష్కించి, తన ఆశ్రమానికి వచ్చిన నారదుడికి సాష్టాంగ నమస్కారం చేసి: "గుణవంతుడు, అతివీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చల

సంకల్పుడు, సదాచారం మీరనివాడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరికున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శనుడు, ఆత్మవంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్నవాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో?" అని పదహారు ప్రశ్నలు వేస్తాడు. వాస్తవానికి ఈ గుణాలన్నీ వున్నవాడు శ్రీరామచంద్రుడే! అందుకే ఆయన చరిత్రను మనకందించాడు వాల్మీకి మహర్షి.

బాల కాండలో శ్రీ మహావిష్ణువు భూమిపై అవతరించాల్సిన కారణం, అయోధ్య కాండలో స్థితి కారణం, అరణ్య కాండలో మోక్షమిచ్చే అధికారం, కిష్కింధ కాండలో గుణ సంపత్తి, సుందర కాండలో సర్వ సంహార శక్తి, యుద్ధ కాండలో వేదాంత వేద్యత్వం, ఉత్తర కాండలో సృష్టికి హేతువు లాంటి విషయాలను చెప్పడం జరిగింది. రామాయణంలో చెప్పబడిన పరతత్వం శ్రీరామచంద్రమూర్తిగా అవతరించిన విష్ణువేనని స్పష్టమవుతుంది. ఇటువంటి పరతత్వాన్ని స్థాపించి, పరమాత్మ అనుభవించే ఉపాయం శరణాగతని అర్థం చేసుకోవాలి. శరణాగతికి ముఖ్య ఫలం, భగవత్ సన్నిధానంలో చేరి, భగవంతుడికి సేవ చేయడమే. శరణాగతికి పురుష కారం అవశ్యం. పురుష కారానికి కావాల్సిన ముఖ్య గుణం శరణాగతుడి పట్ల దయ. రామాయణంలో పురుష కారం ప్రధానమైంది. శరణాగతుని అనుష్టించు అధికారికి శేషత్వం పారతంత్ర్యం స్వరూపం. భరతుడి చర్య వలన పారతంత్ర్యం స్పష్టంగా కనిపిస్తుంది. శత్రుఘ్నుడి చర్యలు భాగవత పారతంత్ర్యాన్ని తెలియచేస్తుంది. మనం సదా జపం చేయాల్సింది రామాయణమే.

రామావతారం పూర్ణావతారమే. అంటే ప్రకృతి సంసర్గం లేదు. శరీరం అప్రాకృతం. ప్రకృతి గుణాలు ఆయన్ను బాధించవు. రామచంద్రమూర్తి శోకించాడని వాల్మీకి రాసిందీ అసత్యం కాదు. నిజంగానే శోకం కలిగిందాయనకు. అయితే శోకం కలిగింది తన కొచ్చిన కష్టానికి కాదు. తమకు దుఃఖాలొచ్చాయని మనుష్యులు దుఃఖిస్తారు. తనకై, తన ఆప్తులకు దుఃఖం కలిగిందికదానని, తన మూలాన వీరికింత దుఃఖం ప్రాప్తించిందికదానని, వారి దుఃఖాన్ని ఆపాల్సిన తానే వారి దుఃఖానికి కారణమయ్యానని మాత్రమే

రాముడు శోకించాడు. అలానే, సీతాదేవి విషయంలోనూ దుఃఖించాడు శ్రీరాముడు. తనను నమ్మి అడవులకు వచ్చిన సీతను, రాక్షసుడు ఎత్తుకుపోతే, తనను వదిలిన బాధతో, అమెకెంత దుఃఖం కలిగిందని రామచంద్రమూర్తి దుఃఖించాడు. వియోగంవల్ల తమకు కలిగిన నష్టానికి దుఃఖించే వాళ్లు మనుష్యులు. జీవులకు కలిగిన నష్టానికి దుఃఖించేవాడు భగవంతుడు. శ్రీరామ చరిత్ర అంటే మహాపురుష చరిత్రే. అందుకే దీనివలన ఎన్నో లాభాలున్నాయన్న భావన బాల కాండ మొదటి పద్యం లోనే వివరించబడింది.

శ్రీ రామాయణం, భారతం, భాగవతం అద్వితీయమైన గీర్వాణ భాషా గ్రంథాలు. ఈ మూడింటిలో ఆద్యమైంది శ్రీ రామాయణ కావ్యం. కావ్యాలలోకెల్లా ప్రధమంగా ఉత్పన్నమైంది కావడంతో ఆదికావ్యమైంది. రామాయణాన్ని చక్కగా తెలిసినవారు–అర్థం చేసుకోగలిగిన వారు మాత్రమే లోకానికి అందలి విషయాలను వివరించ సమర్థులు. అందరికీ అది సాధ్యమయ్యేది కాదు. "శ్రీరామాయణం" అంటే, లక్ష్మీరమణుడైన శ్రీమన్నారాయణుడి మాయా మానుషావతారమైన శ్రీరామ చరిత్రనీ, శ్రీ లక్ష్మీదేవి అవతారమైన సీతాదేవి చరిత్రనీ అర్థం. సీతాదేవి మహాత్మ్యాన్ని విశేషించి చెప్పడంవల్ల వాల్మీకి మహర్షే, శ్రీ రామాయణాన్ని "సీతాయాశ్చరితం మహత్తు" అని వెల్లడిచేశాడు. శ్రీరామచంద్రుడు మనుష్యుడివలె నటిస్తుంటే, వాల్మీకేమో వాస్థవార్థం చెప్తూ, ఆయన సాక్షాత్తు భగవంతుడే అంటాడు. రాముడి చర్యల ద్వారా, రాముడి వాక్కుల ద్వారా తాను చెప్పదల్చుకున్న దాన్ని సిద్ధాంతీకరించాడు వాల్మీకి. శ్రీరాముడు భగవంతుడేనన్న అర్థం, హారంలోని సూత్రంలాగా, రామాయణంలోని ఏడు కాండల్లోనూ వ్యాపించి వుంది. రామాయణాన్ని చదివేవారందరు, ఈ అర్థాన్ని మనస్సులో పెట్టుకొని, ఇందులోని ప్రతి అంశాన్ని–ప్రతి వాక్యాన్ని హెచ్చరికతో శోధించాలి. ఇలా ఆసక్తిగా శోధించిన వారికి–పరీక్షించిన వారికి మాత్రమే, వాల్మీకి రామాయణంలోని గొప్పదనం తెలుస్తుంది.

వాల్మీకి రామాయణంలోని పాత్రలు–పాత్రధారుల వాక్కులు, ఆయా పాత్రల చిత్త వృత్తి గుణాలను తెలియచేసేవిగా, సందర్భోచితంగా, వారున్న అప్పటి స్థితికి అర్హమైనవిగా వుంటాయి. పాత్ర గుణ మహాత్మ్యానికి అసంగతమైన వాక్యాలు ఆయా పాత్రల నోటినుంచి వెలువడవు. శ్రీరాముడు భగవంతుడన్న

అభిప్రాయం వాల్మీకి పదే పదే చెప్పుకుంటూ పోయాడు రామాయణంలో. వాల్మీకి రామాయణమనే "కలశార్ణవం" లో రత్నాలను వెదికేవారు, మొట్టమొదటగా తెలుసుకోవాల్సింది వాల్మీకి శైలి–విధానం. అది తెలుసుకోలేక వెతకడం మొదలుపెట్టితే, చీకట్లో తారాడినట్లే. ఒక విషయం గురించి చెప్పాల్సిందంతా ఒకచోట చెప్పడు. కొన్ని సందర్భాలలో ఆ విషయానికి సంబంధించిన ప్రస్తావనే వుండదు. అదే విషయం మరెక్కడో సూచన ప్రాయంగా వుండొచ్చు. ఒక్కోసారి విపులంగా విశదీకరించబడి వుండొచ్చు. ఆయన చేసిన వర్ణనలను బట్టి, ప్రయోగించిన పదజాలాన్ని బట్టి, పాఠకులు ఊహించుకోవచ్చు.

వాల్మీకి (ఆంధ్ర వాల్మీకి) రామాయణం "ధ్వని కావ్యం". కావ్యానికి ప్రధానమైంది ధ్వని. కావ్యానికి ప్రాణం ధ్వని. ధ్వని లేని కావ్యం శవంతో సమానం. రామాయణంలో ధ్వని విశేషంగా వుంది. కావ్యమంతా ధ్వన్యర్థం వుండడమే కాకుండా, పలు శ్లోకాలకు విడిగా ధ్వన్యర్థం వుంది. శ్రీమద్రామాయణం గొప్ప ధర్మ శాస్త్రం. ఇందులో సర్వ విధాలైన, అన్ని రకాల ధర్మాల గురించి వివరంగా చెప్పబడింది. రాజ ధర్మం, ప్రజా ధర్మం, పతి ధర్మం, సతీ ధర్మం, భాతృ ధర్మం, పుత్ర ధర్మం, భృత్యు ధర్మం, మిత్ర ధర్మం లాంటి అన్ని ధర్మాలను గురించి చక్కగా తెలుపబడి వుంది. లాభ–లోభ–పక్షపాత బుద్ధి లేకుండా, న్యాయం మీదే దృష్టి నిలిపి వాదించే న్యాయవాది ధర్మం కూడా చెప్పబడింది. వీటితో పాటు కథా సందర్భానుసారంగా, అంతరాంతరాలలో ఎన్నో నీతులు చెప్పబడ్డాయి. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల చర్యల వలన భాతృ ధర్మం, సుగ్రీవుడి చర్యల వలన మిత్ర ధర్మం, హనుమంతుడి చర్యల వలన భృత్యు ధర్మం తెలియ చేయబడ్డాయి రామాయణంలో. రామాయణంలో సకల ధర్మాలున్నాయి. ఇందులో వున్న ధర్మాలే మిగిలిన అన్ని గ్రంథాలలోనూ కనబడతాయి. ఇందులో లేని ధర్మాలు మరింకేదాంట్లోను కనిపించవు.

ఇలా వాల్మీకి రామాయణంలో ఒకటి కాదు...వందల...వేల రకాల వ్యావహారిక, ప్రాపంచిక, ధర్మ, అర్థ, కామ, మోక్ష సంబంధమైన అనేకానేక విషయాలు వుండడం వల్ల దానిని మించిన గ్రంథం మరోటి లేదని అంటారు.

❖ ❖ ❖

వాసుదాసుగారు సుందరకాండ ఎందుకు చదవాలి?

వాల్మీకి కోకిల ఆలపించిన ఆనంద మయ కావ్యగానం

భగవద్గీత, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం, శ్రీరామాయణాలు భారతీయ సంస్కృతీరూపాలు. సనాతన ధర్మ ప్రతిపాదకాలు. వీటి మౌలిక తత్వాలు ధర్మజ్ఞానాలు. ఈ రెండింటినీ వాచ్య వ్యంగార్థాలతో "శ్రీమద్రామాయణం" ఆవిష్కరిస్తోంది. వాల్మీకి ఆదికవి. రామాయణం ఆదికావ్యం. ఇది ధ్వని-అర్థ ప్రతిపాదిత మహామంత్రపూతం. గాయత్రీబీజ సంయుతం. ఔపనిషతత్వసారం. స్మరణ-పారాయణ మాత్రంగా అంతఃకరణం శుద్ధి అవుతుందట!.

ధర్మ-జ్ఞానాలు, కాళ్లూ-కళ్లవంటివట. ఈ రెండూ లేకపోతే, కుంటి-గ్రుడ్డి వాడవుతాడు మానవుడు. మానవ జీవితంలో వీటి ఆవశ్యకతను రామాయణం విశదీకరిస్తోంది. ఈ మహాకావ్యం వాచ్యార్థంలో ధర్మాన్ని చెప్పుతుంది. వ్యంగార్థంలో బ్రహ్మాన్ని ధ్వనిస్తుంది. మనిషిగా పుట్టిన వాడు బాహ్యంగా ధర్మాన్ని ఆచరించాలి. ఆంతర్యంగా జ్ఞానాన్ని కలిగి వుండాలి. శ్రీరాముడు బాహ్యంగా నరుడై, ధర్మానికి నిలువెత్తు దీపమైనాడు. మూర్తీభవించిన ధర్మమైనాడు. అంతర్గతంగా పర బ్రహ్మమైనాడు. మన జీవితాలూ అంతే! బాహ్యమూ-అంతరమూ అని రెండు విధాలు కదా! ప్రవర్తనలో బాహ్యంగా ధర్మాన్ని ఆచరిస్తూ, అంతర్గతంగా బ్రహ్మాన్ని ఉపాసిస్తూ, జ్ఞాన-భక్తి-వైరాగ్యాలను నిచ్చెన మెట్లుగా చేసుకుని, పరతత్వాన్ని సాధించాలి. ఇదే రామాయణ సారం. దీనికి లక్ష్యం శ్రీరాముడు కాగా, హనుమ ఆచార్యుడుగా లక్ష్య సాధనమని పెద్దలు చెప్తారు. రామాయణంలో అందమైన కాండ "సుందరకాండ". నిజానికది "హనుమత్కాండ". ఆద్యంతాలూ హనుమంతుడు ఆచార్యుడుగా దర్శనమిచ్చే అద్భుతకాండ "సుందరకాండ".

బాలకాండ వృత్తాంత మంతా 12ఏళ్లు-అయోధ్య కాండ 12 ఏళ్లు-అరణ్య కాండ 13 ఏళ్లకు పైన-కిష్కింధ కాండ సుమారు 9 నెలలు-యుద్ధ కాండ 22 రోజులు-ఉత్తర కాండ సుమారు 11 వేల ఏళ్ల నిడివితో నిండుగా నడిచాయి. కానీ "సుందరకాండ" వృత్తాంత మంతా రోజున్నరలోనే గడచిందట! ఎంత ఆశ్చర్యం!

తేట తేట తేనెలోని తీయందనాన్ని, చల్లని వెన్నెలలోని సుఖ శీతల మధురిమల్ని కలబోసి వాల్మీకి కోకిల ఆలపించిన ఆనంద మయ కావ్యగానమే సుందరకాండ. శబ్ద–అర్థ–భావ–రస సౌందర్యాలను పరస్పరాశ్రయంగా సురుచిర భద్రంగా నింపుకొన్న రసమయ పేటి ఇది. ఇది ఒక అమృత భాండం. జీవ–జీవన సౌందర్య కాండం. బాధల మధ్య బోధలనూ, వ్యక్తుల మధ్య సాధనా సిద్ధులనూ సిద్ధపరచి, అందించిన మంత్రమయ అక్షయ అక్షర భాండం సుందరకాండం. సుందరకాండలో సుందరం కానిదేమిటట? అంటే..ఏమీ లేనే లేదు..అని పెద్దలు తేల్చేశారు.

ఇందులో హనుమ మహాయోగి. మహాజ్ఞాని. "విశిష్టవశిష్ఠుడు". మహాచార్యుడు. అంతటి వాడు లంకకు వెళ్లేటప్పుడు శ్రీరామచంద్రుడి భద్ర ముద్రికను (ఉంగరాన్ని), తిరిగి వచ్చేటప్పుడు సీతమ్మ చూడామణిని చక్కగా ధరించి సముద్రాన్ని సునాయాసంగా దాటి వచ్చాడు. ఈ భవ సాగరాన్ని దాటడానికి విష్ణు చిహ్నాలైన శంఖ–చక్ర ధారణం అలాగే తోడ్పడుతుంటాయి. శ్రీసుందరకాండలో సౌందర్యమనేది రాశీభూతమైంది. మంత్ర పూతమైన రస సౌందర్యం–భగవత్ సౌందర్యమైన శ్రీరామ సౌందర్యం–ఆచార్య సౌందర్యమైన శ్రీహనుమ సౌందర్యం–అశోక, మధు వనాల ఉద్యాన వన సౌందర్యం–మహా విశిష్టమైన లంకా నగర సౌందర్యం –లంకలో కామినీ భోగినీ జన సౌందర్యం–రావణుడి వీర సౌందర్యం–హనుమ సాధనా సౌందర్యం–ఆదికవి వాల్మీకి మహనీయ రమణీయ మాధుర్యమైన కవితా శిల్పసౌందర్యం...... వీటన్నింటినీ కలబోసిన మహాసౌందర్యం, శ్రీ "సుందర" సౌందర్యం.

"శ్రాద్ధేశు దేవ కార్యేశు పఠేత్ సుందరకాండమ్" – పితృ కార్యా లలోనూ, దేవ కార్యాలలోనూ సుందరకాండ అవశ్య పఠనీయ మన్నారు. సుందరకాండ మహామంత్రమనీ, దీనికి ఆంజనేయ స్వామి మంత్రాధి దేవతనీ, సర్వారిష్ట నివారణ దీని ఫలమనీ ఆర్షవాక్యం. ధర్మార్థ కామాలూ, సత్వ రజోస్తమోగుణాలూ– అనే మూడింటి వల్ల కలిగే ఫలాన్ని పొందాలన్నా, సాంసారిక, మానసిక కష్టాలనుండి దాటాలన్నా, శుభాన్నిచ్చే సుందరకాండను పఠించాలంటారు. ఇది ఇలా వుంచితే అద్భుతమైన దివ్య గాయత్రీ మంత్ర నర్తనం ఆద్యంతాలూ

దర్శనమిస్తూందీకాండలో. అందువల్లనేమో "యేనరా కీర్త యిశ్యన్తి నా? స్తి తేశామ్ పరాభవ " అన్నారు రామాయణాన్ని. సర్వత్ర "త"కార, "స"కారాలు ఆది మధ్యాంతాలూ మనకు ధ్వనిస్తుంటాయి. దేహ–గేహ–గ్రహాది బాధల నుండి సద్యః రక్షణ కల్పించే మహామంత్ర రాజ విరాజితం కనుకనే శ్రీసుందరకాండ అన్ని సంప్రదాయాల వారికి విశేషంగా ఆదరణీయమైంది.

ఇక ప్రస్తుతానికొస్తే, వాల్మీకి మహర్షి రామాయణాన్ని అనుగ్రహించారు. ముందు విన్నవించుకున్నట్లు దీనినిండా 24గాయత్రీ మంత్రాక్షరాలను భద్రంగా నిక్షిప్తం చేసారు. మహా మహానుభావులూ, మహావిద్వాంసులూ, సుందర మందర(రామాయణం) నిర్మాతా అయిన, శ్రీమాన్ వావిలికొలను సుబ్బారావు దాసు గారు (వాసుదాసు) వాల్మీకి రామాయణాన్ని యధాతధంగా మంత్రమయం చేస్తూ, ఛంధః యతులను ఆయా స్థానాలలో నిల్పి, వాల్మీకాన్ని తెనిగించారు. వాల్మీకి రామాయణానికి తుల్యమైన స్థాయినీ, పారమ్యాన్నీ, ఆంధ్ర వాల్మీకి రామాయణానికి అందించి, "మందరం" అని దానికి ప్రాచుర్యాన్ని కలిగించారు. ఆంధ్ర పాఠకలోకం అపారంగా మందరాన్ని అభిమానించింది. ఆదరించింది. శ్రీరామానుగ్రహ ప్రాప్తమయింది. కాలం గడచి పోతున్నది. వాసుదాసు గారు మారిపోతున్న తరాలకు గుర్తురావటం కూడా కష్టమై పోతున్నది. వారి "ఆర్యకధానిధుల" తోనూ, "హితచర్యల" పరంపరల తోనూ పరవశించి పోయిన ఆనాటి తెలుగు పాఠక మహనీయులు క్రమంగా తెరమరుగవుతున్నారు.

ఆంధ్ర వాల్మీకి రామాయణం తరువాత వచ్చిన ఎన్నో గద్య–పద్య రామాయణాలకు విశేష ప్రాచుర్యం లభిస్తున్న భూత–వర్తమాన రోజుల్లో "ఆదికవి", "ఆంధ్ర వాల్మీకి" యధాతథంగా మంత్రమయం చేస్తూ ఛంధః యతులను ఆయా స్థానాల్లో నిలిపి తెనిగించిన వాల్మీకానికి ఎందుకంతకన్నా ప్రాచుర్యం రాకూడదని అనిపించింది. వ్యాస మహాభారతాన్ని తెనిగించిన నన్నయ ఆదికవైతే, వాల్మీకి రామాయణాన్ని యధా వాల్మీకంగా పూర్వకాండలతో సహా ఉత్తరకాండను కూడా మొదట తెనిగించిన శ్రీ వావిలికొలను సుబ్బారావు దాసు (వాసుదాసు) కూడా ఆదికవే కదా! నన్నయంతటి గొప్పవాడే కదా! ఆయన ఆంధ్ర వాల్మీకి రామాయణం, నిజానికి సరైన పోషకుడో, ప్రాయోజకుడో

వుండి వుంటే ఏ నాడో నొబెల్ సాహిత్య బహుమతికో, తదుపరి జ్ఞానపీఠ పురస్కారానికో నోచుకుని వుండేది. ఏ మాత్రం మన తెలుగువారు ప్రయత్నం చేసినా ఆయనకు భారత రత్న, జ్ఞానపీఠ అవార్డులు వచ్చి వుండేవి ఎప్పుడో...ఏనాడో! "మందరం" మనమందరం చదవాలనీ, అందులోని అందమైన సుందరకాండను తొలుత తెలుగు పాఠకులందరికీ సమాదరంగా అందించాలనీ భావించి వాసుదాసు గారు రచించిన సుందరకాండ మందరాన్ని ఆయనే "వక్త" గా, నేను కేవలం "వాచవి" గా, "అనువక్త" గా సంక్షిప్తీకరించడం జరిగింది. దాని సారాంశమే ఈ పరిశోధనా వ్యాస పరంపర.

శ్రీరామ ముద్రికనిచ్చి చూడామణి తీసుకున్న హనుమంతుడు

సుందరకాండ ఎందుకు చదవాలి? ఎందుకు పారాయణం చేయాలి? శ్రీమద్రామాయణం చదవ దల్చుకున్న వారు సాధారణంగా సుందరకాండ తోనే ఎందుకు ప్రారంభించాలి? సుందరకాండ చదివే ముందు నేను యీ ప్రశ్న వేసుకోలేదు. అయితే పూర్తిగా చదివిన తరువాతా, చదువుతున్నప్పుడూ, ఈ ప్రశ్న వేసుకుంటూ, జవాబు వెతుక్కుంటూ, పోవాలి. ఎందుకు చదవాలనే విషయం దానంతడదే బోధపడుతుంది. సుందరకాండ వృత్తాంతమంతా కేవలం ఒకటిన్నర రోజుల్లోనే జరిగింది. కథ విషయాని కొస్తే, హనుమంతుడు సముద్రాన్ని లంఘించడం, లంకకు చేరడం, సీతాదేవి కోసం వెతకడం, ఆమెను చూడడం, రామ లక్ష్మణుల సమాచారం చెప్పడం, శ్రీరామ ముద్రికనిచ్చి-చూడామణిని తీసుకో పోవడం, లంకా దహనం, మరలిపోయి శ్రీ రాముడికి సీతమ్మ సందేశాన్నివ్వడం-ఇంతే!. ఈ మాత్రం దానికి పెద్ద పుస్తకమేమీ అవసరం లేదు. ఇంకొంచెం లోతుకు పోతే అసలు సుందరకాండ వృత్తాంత ఇలా సాగుతుంది:

సీతాదేవిని వెతుక్కుంటూ కిష్కిందకు చేరిన శ్రీరాముడు వాలిని చంపి, సుగ్రీవుడిని వానర రాజ్యానికి రాజును చేస్తాడు. బదులుగా సీతాదేవిని వెతికించి పెట్టానని సుగ్రీవుడు వాగ్దానం చేస్తాడు. ఆ తర్వాత కథే సుందరకాండ. నలు దిక్కులకూ పోయిన వానర బృందంలో ఒకటి, దక్షిణ దిక్కుగా పోతుంది.

సాక్షాత్తూ యువరాజు అంగదుడి నేతృత్వంలోని బృందమది. జాంబవంతుడి ప్రేరణతో మహేంద్ర పర్వతాన్ని ఎక్కి, అక్కడనుండి లంక కెళ్ళాలన్న సంకల్పంతో సిద్ధపడ్డ హనుమంతుడి ప్రయాణ సంభ్రమంతో మొదలవుతుందీ కాండ. సముద్రాన్ని లంఘించి ఎలా ప్రయాణం చేస్తున్నాడన్న వర్ణనతో కథ శుభారంభ మౌతుంది. హనుమంతుడికి సహాయం చేయాలనుకొని సముద్రుడు "మైనాకుడిని" పంపుతాడు. సమయాభావం వల్ల ఆయన ఆతిథ్యాన్ని స్వీకరించ లేనని సున్నితంగా తిరస్కరించి, ఆయనకు నచ్చ చెప్పి ముందుకు సాగిపోతాడు. దేవతల ప్రేరణతో అడ్డుపడ్డ నాగమాత "సురస"ను జయిస్తాడు. తనకున్న అణిమాది అష్టసిద్ధులతో చిన్న ఆకారంగా మారి, ఆమె కోరినట్లు ఆమె నోట్లో దూరి, సురక్షితంగా బయటకొస్తాడు. ఆ తర్వాత హింస్రకైన "సింహిక"ను వధించి, ప్రయాణాన్ని సాగించి లంకకు చేరుకుంటాడు. ఇదంతా కేవలం ఎనిమిది గంటల్లో జరిగింది.

లంకా నగరం చేరిన హనుమంతుడు ఉద్యానవనంలో విహరిస్తూ, ముందున్న కార్యం గురించి పలు విధాలుగా ఆలోచిస్తాడు. లంక ప్రవేశిస్తూ అడ్డగించిన లంకాధి దేవత–లంఖిణిని, జయించి, లంకా వినాశానికి నాంది పల్కుతాడు. లంకలో చిన్న పిల్లిలా దిగి, తర్వాత చిన్నకోతి ఆకారంలో యధేచ్ఛగా సంచరించి సీతాదేవికై వీధీ–వీధీ గాలిస్తాడు. మండోదరిని చూసి సీతాదేవేనని భ్రమపడుతాడు ఓ సమయంలో. రావణ–రాక్షస స్త్రీల మధ్య వెతుకుతాడు. రావణ గృహంలో వెతుకుతాడు. అక్కడే పుష్పక విమానాన్ని చూస్తాడు. రావణ అంతఃపురం చూసి అంతఃపుర స్త్రీల మధ్య సీతున్నదేమోనని అక్కడా వెతుకుతాడు. సీతాదేవి ఎక్కడా కనిపించక పోవటంతో, విచారంతో, మళ్ళీ–మళ్ళీ వెతుకుతూ, అశోకవనానికి చేరుకుంటాడు బుద్ధి మతాం వరిష్టుడైన హనుమంతుడు.

హనుమంతుడి ప్రయత్నం ఫలించి, వెతుకుతున్న సీతాదేవి అశోకవనంలో కనిపిస్తుంది. ఆమే సీతని నిశ్చయించు కోవడానికి, కొన్ని ఆధారాలు చూసుకుంటాడు. అవే ప్రత్యక్ష–పరోక్ష నిదర్శనాలు. ఆమె స్థితికి దుఃఖిస్తాడు. రాక్షస స్త్రీల బెదిరింపులు–రావణుడి బెదిరింపు మాటలు–సీత రావణుడిని

నిందించడం, పరుషపు మాటలనటం-ఆయన ఆగ్రహించడం-మళ్లీ రాక్షస స్త్రీల బెదిరింపులు- ఇవన్నీ వింటాడు చెట్టు చాటునుండి హనుమంతుడు. సీతాదేవి భయపడి శ్రీరాముడిని తల్చుకుంటూ దుఃఖించడం-త్రిజట స్వప్న వృత్తాంత కూడా వింటాడు. సీతాదేవి మరణించే ప్రయత్నం చేస్తుంటే ఆమెతో ఎలా మాట్లాడాలా అని ఆలోచిస్తాడు హనుమంతుడు.

సీతాదేవి వినేటట్లు శ్రీరాముడి కథను ప్రస్తావించి ఆయన్ను ప్రశంసిస్తూండగా ఆయన ఉనికి తెలుస్తుందామెకు. ఆ తర్వాత ఆమెతో సంభాషించడం, ఒకరి విషయాలు ఇంకొకరికి చెప్పుకోవడం, కుశల వార్తలడగడం జరుగుతుంది. సందేహాలు తీర్చుకున్న సీత, రామ లక్ష్మణుల చిహ్నాలేంటని అడగడం, హనుమంతుడు ఆమెకు నచ్చే రీతిలో చక్కగా శ్రీరాముడి దివ్యమంగళ విగ్రహాన్ని వర్ణించి చెప్పడం, ఆ తర్వాత కథ. శ్రీ రామ ముద్రికను హనుమంతుడిచ్చినప్పుడు నర్మ గర్భితంగా మాట్లాడిన సీతకు, ధైర్యం చెప్తాడు హనుమంతుడు. తన మీద నమ్మకం కుదిరిందనుకున్న హనుమంతుడు సీతను తన వీపు మీద కూర్చోబెట్టుకుని శ్రీ రాముడి దగ్గరకు తీసుకెళ్తానంటాడు. ఆమె నిరాకరిస్తే, ఆమెను కల్సినట్లు గుర్తుగా ఏమన్నా ఇవ్వమంటాడు. కాకాసుర వృత్తాంతాన్ని చెప్పి, చూడామణి నిచ్చి, హనుమంతుడిని ఆశీర్వదించి సెలవిస్తుంది వెళ్ళి రమ్మని సీతాదేవి.

శత్రువుల బలా-బలాలు తెల్సుకోదల్చిన హనుమంతుడు, వెంటనే తిరిగి పోకుండా, అశోక వనాన్ని పాడు చేసి కయ్యానికి కాలు దువ్వుతాడు. రావణుడికి కోపం వచ్చి పంపిన కింకరులను మట్టుపెట్తాడు. హనుమంతుడు జయఘోశ చేస్తూ ప్రతీకారంగా పంపబడిన చైత్య పాలకులను చంపుతాడు. జంబుమాలి వధ, మంత్రి పుత్రుల చావు, సేనానాయకుల మృతి, అక్ష కుమారుడి వధ వెంట-వెంట జరుగు తాయి. ఇంద్రజిత్ బ్రహ్మాస్త్రానికి కట్టుబడ్డ హనుమంతుడిని తాళ్ళతో కట్టేయటంతో, బ్రహ్మాస్త్ర బంధనం వీడిపోతుంది. రావణుడికి తన వృత్తాన్తాంతా చెప్పి, లంకకు వచ్చిన కారణం చెప్తాడు హనుమంతుడు. రావణుడికి బుద్ధి చెప్తుంటే కోపించిన ఆయన హనుమంతుడుని దండించమన్నప్పుడు విభీషణుడి బోధతో తోక కాల్చి పంపమంటాడు రావణాసురుడు.

ఆ తర్వాత, లంకా దహనం చేస్తాడు హనుమంతుడు. సీతాదేవిని పునర్దర్శించి మళ్ళీ సెలవు తీసుకుని, గంట సేపట్లోనే సముద్రాన్ని లంఘించి, మహేంద్రాద్రి పై దిగుతాడు హనుమంతుడు. వానర మిత్రులను కలిసి లంకకు పోయివచ్చిన విధమంతా "దండకం" లాగా చెప్తాడు హనుమంతుడే వక్తగా. మధువనంలో విచ్చలవిడిగా విహరించిన వానరులతో కిష్కిందకు చేరుకుని, శ్రీరాముడికి సీతాదేవి స్థితిని వివరిస్తాడు. చూడామణినిస్తాడు. దు:ఖిస్తున్న శ్రీరాముడిని ఓదారుస్తాడు సుగ్రీవుడు. శ్రీరాముడికి హనుమంతుడు సీతా సందేశం వినిపిస్తాడు. కథ అయిపోతుంది. కాకపోతే ఇది టూకీగా. ఈకథంతా వ్రాసినా 40-50 పేజీలకన్నా ఎక్కువుండ కూడదు కదా! అయినా ఎన్దుకింత పెద్ద గ్రంథమైంది మరి? కేవలం కథ చెప్పటం మాత్రమే కాకుండా ఆయా సందర్భాల్లో చేసిన వర్ణనలనేకం. మహేంద్ర పర్వతం వర్ణన, హనుమంతుడి గమనవేగ వర్ణన, మైనాకుడి వృత్తాంతం, లంక వెలుపలి ఉద్యానవన వర్ణన, లంకా నగర వర్ణన, చంద్ర వర్ణన, రావణుడి అంతఃపుర వర్ణన, రాక్షస స్త్రీల వర్ణన, పుష్పకవిమాన వర్ణన, రావణుడి వర్ణన, అశోకవన వర్ణన, సీతాదేవి దుఃఖ వర్ణన, సీతా రామచంద్రుల వర్ణన, శ్రీరాముడి విరహ తాప వర్ణన, కాకాసుర వృత్తాంతం, చూడామణి వర్ణన, రావణుడి సభలో రావణుడి వర్ణన, రాక్షస విలాప వర్ణన, అరిష్టాద్రి వర్ణన, మధువన వర్ణనలతో మరింత నిడివైంది సుందరకాండ.

సకల శాస్త్రాల సంగమం సుందరకాండ మందరం

వాల్మీకి రామాయణాన్ని యధాతథంగా గాయత్రీ మంత్రమయం చేస్తూ, చందః యతులను ఆయా స్థానాల్లో నిలిపి తెనిగించారు వాసుదాస స్వామి. శ్లోకానికో పద్యం వ్రాసారు. ప్రతి పద్యానికి ప్రతి పదార్థ తాత్పర్యం ఇచ్చారు. ఒక్కో పదానికున్న వివిదార్థాలను విశదీకరించారు. భావాన్ని వివరణాత్మకంగా విపులీకరించారు. 1461 పద్యాలతో ఆయన చేసిన శ్రీరామాయణం సుందరకాండ వ్యాఖ్యానంలో "జ్ఞాన పిపాసి"కి విజ్ఞాన సర్వస్వం దర్శన మిస్తుంది. ఆయన పద్యాలలో సాధారణంగా అందరూ వ్రాసే చంపకమాలలు, ఉత్పల మాలలు, సీస పద్యాలు, ఆటవెలది-తేటగీతులు, కంద, శార్దూలాలు, మత్తేభాలు

మాత్రమే కాకుండా తెలుగు ఛంధస్సులో ఉండే వృత్తా లన్నింటినీ సందర్భోచితంగా ప్రయోగిస్తారు. ఆ వృత్తాలలో ఉత్సాహం, పంచచామరం, తరలం, లయగ్రాహి, చారుమతి, మధురగతి రగడ, వృశభగతి రగడ, మానిని, సుగంధి, స్రగ్విని, మనోరంజని, మణిమంజరి, మత్తకోకిలం, తామరసం, ద్విపద, పద్మనాభ వృత్తం, అంబురుహ వృత్తం ఉన్నాయి. ఆయా సందర్భాలలో, సందర్భోచితంగా, ఆయా వృత్తాలను ఎంతో హృద్యంగా మలిచారాయన. ఉదాహరణకు, రామ కార్యార్థిగా సముద్రాన్ని లంఘించిన హనుమంతుడికి "పంచచామర" సేవ చేస్తారు కవి. లంకా తీరాన్ని చూసినప్పుడు హనుమంతుడికి కలిగిన ఉత్సాహాన్ని "ఉత్సాహ" వృత్తంలో వర్ణిస్తారు. సుందరకాండ విషయాన్నంతా సంగ్రహంగా, హనుమంతుడు వక్తగా, ఆయన లంకకు పోయి వచ్చిన విధమంతా తన వానర మిత్రులకు చెప్పడానికి ఏకంగా ఓ "దండకాన్ని" వ్రాస్తారు. సుమారు 200 పంక్తులున్న ఈ "దండకం" చదువుతే, సుందరకాండ పూర్తిగా చదివినట్లే! శ్రుత్యర్ధ రహస్యం చెప్తూ "ద్విపద" వ్రాస్తారు కవి. ఇలానే మిగిలిన వృత్తాలు కూడా.

ఇంతకీ సుందరకాండ ఎందుకు చదవాలి? మళ్ళీ వేసుకుందాం ఈ ప్రశ్న. వాసుదాసు గారు తన తొలి పలుకుల్లోనే చెప్పారీ విషయాన్ని గురించి. సుందరకాండ పఠించేవారు ప్రత్యుత్తరం కోరి చదవ వలసిన విషయాలు: (సుందరకాండ అంతం లో కూడ ఇదే విషయం మళ్ళీ చెప్పారాయన)....బద్ధ జీవ తారతమ్యం, జీవాత్మ-పరమాత్మల సంబంధం, జీవాత్మ తరణోపాయం, శిష్య-ఆచార్య లక్షణాలు, జీవాత్మలకు సేవ్యుడెవరు?, ఆత్మావలోకన పరుడైన యోగి లక్షణం, ఉపాయానికీ-ఉపేయానికీ భేదం, యోగికీ-ప్రపన్నుడికీ భేదం.

ఈ ముఖ్య విషయాలన్నింటికీ ప్రత్యుత్తరం సుందరకాండలో దొరుకుతుందా? అని ప్రశ్నించు కుంటే – ఎన్ని సార్లు చదివితే అంత వివరంగా సమాధానాలు దొరుకుతాయి. వాటిని అన్వయించు కోవడమే మనం చెయ్యాల్సిన పని. సుందరకాండ ఆసాంతం, ప్రతి పద్యానికీ ప్రతి పదార్ధం ఇస్తూ, చివరిలో తాత్పర్యం చెప్తూ, అవసరమైన చోట అంతరార్ధమిస్తూ, ఉపమానాలను ఉ టంకిస్తూ, వీలైనంత వరకూ ఇతర గ్రంథాల్లోని సందర్భాలను ప్రస్తావిస్తారు

కవి. ప్రత్యుత్తరం కోరి చదవాల్సిన విషయాలన్నింటికీ సోదాహరణంగా జవాబు చెప్తారు.

చదువుకుంటూ పోతుంటే, అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే, ఇది కేవలం సుందరకాండ కథ వృత్తాంతమే కాకుండా, సకల శాస్త్రాల సంగమం లాగా స్ఫురిస్తుంది. ఒక చోట ధర్మ శాస్త్రం లాగ, మరోసారి రాజనీతి శాస్త్రం లాగా వేరే చోట ఇంకో విధంగాను తోస్తుంది. ఇదో భూగోళ శాస్త్రం - సాంఘిక, సామాజిక, ఆర్థిక, సామాన్య, నైతిక శాస్త్రం - సంఖ్యా శాస్త్రం - సాముద్రిక శాస్త్రం - కామ శాస్త్రం - రతి శాస్త్రం - స్వప్న శాస్త్రం - పురాతత్వ శాస్త్రం. చదివితే, అర్థం చేసుకుంటే ఇంకెన్నో శాస్త్రాలు గోచరిస్తాయి. అసలు-సిసలైన పరిశోధకులంటూ ఉంటే, ఒక్క సుందరాకాండ మందరం మీద పరిశోధనలు చేస్తే చాలు-ఒకటి కాదు, వంద పీహెచ్‌డీలు పొందవచ్చు. డాక్టరేట్ తో పాటు అద్భుతమైన రహస్యాలు అవగతమౌతాయి. కాండ లోని చివరి పద్యం ఆయన "అంబురుహ" వృత్తం లో వ్రాసారు. "క్ష్మా రమణీ శరజాబ్జ భవానన సార సాహిత.....సర్వ సౌఖ్య విధాయకా" అన్న ఆ పద్యానికి ప్రతిపదార్థ తాత్పర్యం వ్రాస్తూ-అందులోని ఓ అర్థాన్ని విలోమంగా చూస్తే, 1461 అవుతుందంటారు నిరూపణతో! దాని అర్థం-తన సుందరకాండలో 1461 పద్యాలున్నవనే. ఇందులోని ప్రతి పద్యం పైన, ఒక్కో పద్యం లోని ప్రతి పంక్తి పైనా, ఆసక్తి-చేవ ఉన్న పరిశోధకులు, పరిశోధనా వ్యాసాలు వ్రాయగలిగితే, తెలుగు సాహిత్యంలో పీహెచ్డీలకు గిరాకీ పెరుగుతుందనడం లో అతిశయోక్తి లేదు. తెలుగు విశ్వవిద్యాలయం వారు ఆలోచించాల్సిన విషయమిది.

"త్రిజట" స్వప్న వృత్తాంతం చెప్పే సమయంలో, ఉన్నట్లుండి, సీతాదేవి ఎడమ భుజం, ఎడమ తొడ అదిరాయి. త్రిజట ముందుగా తనకు కల వచ్చిందని చెప్తుంది. ఆ తర్వాత దానికనుగుణంగా సాముద్రిక చిహ్నాలను-శుభ శకునాలను గురించి చెప్తుంది. అంతకంటే బహిరంగ శకునం చెప్పడానికి, వాసుదాసు గారు, చంపకమాలలో వ్రాసిన వృత్త ప్రతిపదార్థ తాత్పర్యంలో ఎంతో భావం ఇమిడి వుంది. అదీ ఆయనే వివరిస్తారు. అందులోని ముఖ్య విషయం మూడు విధాలైన కావ్యాల గురించి-వాటి గుణ గణాల గురించి.

"ఉత్తమం-మధ్యమం-అధమం" అని కావ్యాలను మూడు రకాలుగా విభజించ వచ్చు. కావ్యానికి "ధ్వని" ప్రాణం. శబ్దార్థాలు "శరీరం" లాంటివి. అంటే, వాచ్యార్థం కంటే ధ్వన్యర్థం ఎందులో అధికంగా వుంటుందో అదే ఉత్తమ కావ్యం అనాలి. అసలు ధ్వనే లేకపోతే దాన్ని అధమ కావ్యం అంటారు. కథల పుస్తకాల్లాంటివి చిత్రకావ్యాలంటారు. ధ్వన్యర్థం ఒక సారి పదానికీ, ఒక సారి వాక్యానికీ, ఇంకో సారి ప్రబంధ సమష్టి పైనా వుంటుంది. అనాదిగా భగవత్ సంబంధమున్న జీవుడు, సంసారంలో చిక్కుకొని, బాధలు పడ్తుంటే, చూడలేని ఆచార్యుడు, వాడిని ఉద్ధరించడానికి చేసే ప్రయత్నమే సుందరకాండలోని ధ్వన్యర్థం. ఈ అర్థాన్ని కాండ మొదట్లోనే "తరువాత రావణాసుర వరనీత ..." అనే పద్యంలో సూచించడం జరిగింది. ఇది మొదటి "సర్గ" లో వివరంగా వుంది. లంకను "దశ-ఇంద్రియ" అధిష్టితమైన "దేహం" తోనూ, రావణ-కుంభకర్ణులను "అహంకార-మమకారాల" తోనూ, ఇంద్రజిత్తు లాంటి వారిని "కామ-క్రోధాలు" తోనూ, సీతాదేవిని వీటన్నింటిలో బంధించబడ్డ "చేతనుడు" గానూ, విభీషణుడిని "వివేకం" గానూ సూచించడం జరిగిందీ కాండలో. లంకలో శ్రమపడ్తున్న సీతంటే, సంసారంలో కష్టపడ్తున్న జీవుడనీ, అట్టి జీవుడికి, భగవత్ ప్రేరణతో, జ్ఞానాన్ని ఉపదేశించేందుకు వచ్చిన వాడే "ఆచార్యుడు"అనీ-అతడే హనుమంతుడనీ కూడా సూచించబడింది.

వరుస క్రమంలో సుందరకాండలోని అంతరార్థాలను పఠిస్తూ పోతే, పైన చెప్పబడిన విషయాలు వివరంగా తెలుస్తాయి. ఆ తెలుసుకోవడం లోనే సుందరకాండ ఎందుకు చదవాలనే ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. ఆరంభం నుండి సుఖాంతం వరకూ సుందరకాండ మందరంలో జరిగిన కథ క్లుప్తంగా జరిగిన కథ చదువుకుంటూ పోతే మరిన్ని వివరాలు బోధపడ్తాయి.

హనుమ సదాచార్యుడు .... సీత ఆత్మ స్వరూపిణి

సీతాన్వేషణలో భాగంగా, ప్రయాణ సన్నాహంలో వున్న హనుమంతుడు, గురువుకూ, ఇష్ట దేవతలకూ నమస్కరిస్తాడు. కార్యారంభంలో ఇలా విధిగా నమస్కరించడం ఆచార్య లక్షణమనీ, ఉత్తమ గుణమనీ దీనర్థం. ఆయన సముద్రాన్ని లంఘిస్తుంటే, వాయువు చల్లగా వీచిందట. అంటే భగవత్ కైంకర్యం

చేసే వారికి దేవతలు సైతం సహాయం చేస్తారనేందుకు ఇదో నిదర్శనం. అదే విధంగా భగవత్ కార్యం చేయాలన్న ఆసక్తి వుండి కూడా చేయలేని వాడు, చేస్తున్న వారిని ప్రేరేపించి, వారితో ఆ కార్యాన్ని విజయవంతంగా చేయించాలనే విషయం, సముద్రుడు, మైనాకుడు, హనుమంతుడికి చేసిన సహాయం ద్వారా బోధ పడ్తుంది.

భగవత్ సేవకులకు దేవతలు సహాయపడ్తారు కానీ, ఒక్కోసారి, శ్రేయస్కర కార్యాలకు విఘ్నాలెక్కువ ఎదురవుతాయి. "శ్రేయాంస బహు విఘ్నాని" అని కదా ఆర్యోక్తి! సంసారాన్ని తరించేందుకు, అత్మావలోకన పరుడై యోగాభ్యాసం చేస్తున్న వ్యక్తిని చూసి, ఇతడు చెడిపోతున్నాడనే అనవసర భయం తోనో, ప్రేమ తోనో, అతడి బంధువులు తమ వైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తారు. ఇదే సముద్రుడు, మైనాకుడి ద్వారా చేయించిన పని. అయితే, ఇది విఘ్నమే! ముముక్షువైన యోగిని, భాగవతుడిని, దేవతలు పరీక్షించేందుకు విఘ్నాలు కలిగిస్తారు. ఇట్టి వాటిని లక్ష్య పెట్టక, విఘ్నాలు కలిగించే వారికి మంచి మాటలు చెప్పి, సమాధాన పర్చి, హనుమంతుడి లాగా భక్తి తోనే తప్పించు కొని పోవాలి. అదే నిష్ట దూత లక్షణం, ఆచార్య లక్షణం. రాక్షసిసింహిక లేక అంగారక హనుమంతుడికి అడ్డు పడుతుంది. దీన్నే ముముక్షువైన యోగికి దుష్ట గ్రహ భూతాలవల్ల, దుష్ట జనుల వల్ల కలిగే బాధలతో పోల్చుకోవాలి. ఇలా విరోధ భావం కల వారి మీద జాలి, దయ, గౌరవం చూపాల్సిన పని లేదు. హనుమంతుడి లాగా వాళ్లను చంపడమే సరైన మార్గం.

మొదట్లో లంకను చూసినప్పుడు, వానర వీరుల్లో, లంకలో ప్రవేశించ గలవారు నలుగురు మాత్రమే వున్నారనుకుంటాడు హనుమంతుడు. ఆ తర్వాత ఆ సంఖ్యను తొమ్మిదికి పెంచుతాడు. చివర్లో వానరుల్లో ప్రతివాడూ తన కంటే బలవంతుడేనంటాడు. దీనర్థం...కార్య భారం తెలియని మూర్ఖులు మొదట్లో తమనీ, తమవారినీ ఎక్కువగా అంచనా వేసుకుంటారని, చివరకు వెల్లికిల పడ్తారనీ అర్థం. ఆలోచనాపరులు, కార్య భారం తెలిసిన వారు, కార్య దక్షులు, ఇది మనం చేస్తామా, లేదా? మనవల్ల జరుగుతుందా? అని మొదట్లో జంకు తారు. ఎలాగూ ఈపని చేయక తప్పదనుకొని కొంచెం, కొంచెం చేయడం

మొదలెట్టి క్రమేపీ ధైర్యం తెచ్చుకుంటారు. కార్యాన్ని సాధిస్తారు. ఇన్ని ఆలోచనలు చేసినప్పటికీ, హనుమంతుడొక్కడే రాక్షసులందర్నీ జయించి, లంకా దహనం చేసి వచ్చాడు కదా! ఇది దూత లక్షణమే! దౌత్య నీతి హనుమంతుడి మరొక ప్రజ్ఞా వైభవం.

లంకలో ప్రవేశించే హనుమంతుడికి అలంకరించుకున్న స్త్రీ లాగా కనిపిస్తుంది రావణ పట్టణం. ఇక్కడ లంకా నగరాన్ని స్త్రీగా వర్ణించడమంటే, లంకాధి దేవత "లంకిణి" రాక సూచిండమే! లంకాధి దేవతను జయిస్తాడు. "లంక" అంటే "దేహం" అని అర్థం. హనుమంతుడు లంకను జయించాడంటే, తనలో వున్న "ఆత్మ"ను వెతికే వాడు, మొదలు దేహ భ్రాంతిని జయించాలన్న అర్థం స్ఫురిస్తుంది. దేహ భ్రాంతిని జయించని వాడికి "ఆత్మావలోకనం" లేదు. దేహ–ఆత్మ బేధాన్నీ, సంబంధాన్నీ అర్థం చేసుకోలేక పోవడమే మన కడకండ్లకు కారణం. దేహం వేరు, ఆత్మ వేరు అనే సత్యం అంత సులభంగా అర్థమయ్యేది కాదు. లంకిణిని జయించిన హనుమంతుడు, రాక్షస సంచారం లేని ప్రదేశం ద్వారా లంకా ప్రవేశం చేసాడు. ఇలా ప్రవేశించాలన్నది "రాజనీతి".

ఇలా చేయడం వెనుక "ముముక్షు" వైన "యోగి" చర్య ఎలా వుండాలో సూచించ బడింది. ఆత్మావలోకన పరుడు సత్య విక్రముడై వుండాలి. "సత్యం" అంటే, అహింస...సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం అనే "యమము"లన్నింటికీ ఉప లక్షణం. ఆత్మ, సత్యం వల్ల, తపస్సు వల్ల, జ్ఞానం వల్ల, బ్రహ్మచర్యం వల్ల లభిస్తుంది. ఇవన్నీ హనుమంతుడిలో వున్నాయి. కాబట్టి సత్యం అనేది అన్నింటికీ ఉప లక్షణం. బలహీనులకు ఆత్మ అనుభూతి లభించదు. దేహమే ఆత్మనే భ్రాంతివల్ల ఇది జరుగుతుంది. "లంక" అనే దేహం ప్రకృతి పరిణామం. అది కామ రూపిణి. లంక శబ్దానికి "రంకుటాల" అనే అర్థం కూడా వుంది. ఈ జీవుడిని ఈ జన్మలో అనుసరించిన దేహం, మరో జన్మలో మరో జీవుడిని ఆశ్రయిస్తుంది. అంటే ఈ దేహం రంకుటాల లాంటిది. తపస్సుతో దేహాన్ని గెలవాలే కాని సౌమ్య మార్గంలో సాధ్యం కాదు. నశించేది దేహం. దేహానికి "నవ" ద్వారాలున్నాయి. ఆత్మలో మనస్సు ప్రవేశించడానికి ఈ ద్వారాలు పనికి రావు.

హనుమంతుడు లంకను జయించాడంటే....యోగి దేహాన్ని జయించినట్లే. దేహం వశ పడినంత మాత్రాన ఆత్మావలోకనం లభించదు. హనుమంతుడు సీత కొరకై వెతుకుతున్నప్పుడు మండోదరిని చూసి సీతని భ్రమిస్తాడు. అంటే, ఆయన అన్వేషణలో, శోధించే సమయంలో, కనిపించిన ఆత్మ తేజస్సు లాంటి తేజస్సును "ఆత్మ" అని భ్రమించ కూడదు. మున్ముందు మరింత హెచ్చరికతో, నిష్కాముడై, జితేంద్రుడై వెతకాలి. ఇలా వెతుకుతుంటే, స్వప్రయత్నం ద్వారానే కార్యం సాధ్యమౌతున్నదనే భావనుంటే, అది తొలగి పోయే వరకు, ఆత్మ దర్శనం కలగదు. ఆందుకే కార్య సిద్ధికై, సీత–రామ–లక్ష్మణులకు, మ్రొక్కి ముందుకు సాగాడు. కాబోయే సీతా దర్శనానికీ, జరిగిన రామ దర్శనానికీ, సుగ్రీవుడే కారణం కనుక ఆయనకూ నమస్కరించాడు. హనుమంతుడు సంపాతి (జటాయువు సోదరుడు) మాటలందు నమ్మకంతో రావణుడి అంతః పురంలో సీతను వెతికినట్లే, సాధకుడు గురు వాక్యం మీద నమ్మకంతో, దేహంలో ఆత్మాన్వేషణ చేయాలి. కనపడక పోతే, ప్రయత్న లోపం జరిగిందనుకొని, నిరుత్సాహ పడకుండా, కనిపించేంత వరకూ వెతకాల్సిందే! ఆచార్యానుగ్రహం వల్లనే ఆత్మ దర్శనం కలుగుతుంది. ఇక్కడ హనుమ సదాచార్యుడు కాగా, సీత ఆత్మ స్వరూపిణి. అంటే జీవాత్మ అన్నమాట. శ్రీరాముడు "పరమ ఆత్మ" కద! ఈ జీవాత్మ–పరమాత్మలను కలిపిన ఘటికుడు హనుమంతుడు.

అలా వెతుకుతున్నప్పుడు కనిపించింది, తాను వెతుకుతున్నదేనని నిశ్చయించు కోవడానికి తగిన కారణాలనూ వెతుక్కోవాలి. సీతాదేవి విషయంలో హనుమంతుడు ఇలానే చేస్తాడు. సీతాదేవిని చూసి తనలో తానే తర్కించుకున్న హనుమంతుడు, ఆమె తపస్సు చేసుకుంటున్న స్త్రీ లాగా వుందనీ, కుదుట పడని శ్రద్ధ ఆమెలో కనిపించిందనీ, సందేహం కలిగించే స్మృతివలె వుందనీ భావిస్తాడు. ఆమె జితేంద్రియత్వాన్నీ, భోగవిరాగాన్నీ, కుదుట పడని శ్రద్ధనీ, నిశ్చయ జ్ఞానాన్నీ, బుద్ధి నిష్కల్మశాన్నీ స్ఫురిస్తున్నాయీ వర్ణనలు. సీతాత్వానికి ఏ విధమైన హాని లేదు. కానీ...ఆమె సీతే అని తెలుసుకోలేని లోపం ఆ మూడుఢిదే. ఆత్మావలోకమవడానికి ముందర, ఆత్మ జ్యోతి లాగా కనిపించిన వెలుతురుని చూసి భ్రమ పడ కూడదు. అదే ఆత్మని సంతోషిస్తే, భ్రష్టుడవుతాడు. ఆచార్య లక్షణం ఏదో శాస్త్రాలు చెప్పిన పద్ధతిలో ఆలోచించి, స్వబుద్ధితో తర్కించి, వూహించి, నిశ్చయించు కోవాలి. అదే చేస్తున్నాడు హనుమంతుడు.

స్మరణ మాత్ర సంతుష్టుడు రాముడు....ప్రణతి ప్రసన్న జానకి

సీతాదేవి వున్న స్థితికి దుఃఖించిన హనుమంతుడు, అందరిలాగ కర్మానుభవానికై పుట్టని సీతకే కష్టాలొస్తే, ఇతరుల సంగతేంటనుకుంటాడు. అయినా, సర్వం కాలాధీనమనుకొని, అదే నీతిని మనస్సులో వుంచుకొని, దుఃఖ-సంతోషాల పాలు పడకూడదనుకుంటాడు. సీతకే యిన్ని కష్టాలొచ్చాయి, మనమెంతనుకుని, మనస్సు పరితాప పడ్డా, బుద్ధి వ్యాకుల పడనీయ కూడదనుకుంటాడు హనుమంతుడు. సీతారాములిద్దరూ సమానంగా సేవించాల్సిన వారేనని హనుమంతుడు గ్రహిస్తాడు. దాన్నీ తర్కించి నిర్ధారించుకుంటాడు. సీత-రాముడు వయస్సులో ఎలా ఈడూ-జోడో, శీలం లోనూ, ప్రవర్తన లోనూ, వంశాధిక్యత లోనూ అంతే. సాముద్రికం ప్రకారం, సార్వభౌమత్వ చిహ్నాలు రాముడికున్నాయి. అట్టి వాడికి భార్య కాగల దానికి ఏ చిహ్నాలుండాలో అవన్నీ సీతకున్నాయి. సూర్యవంశంలో ప్రసిద్ధికెక్కిన వాడి కొడుకు రాముడైతే, చంద్రవంశంలో జగత్ప్రసిద్ధికన్న జనకుడి కూతురు జనని-జానకి. "స్మరణ మాత్ర సంతుష్టుడు" రాముడు. అంటే స్మరణ చేస్తే సంతోషించి అనుగ్రహించే వాడు రాముడు. "ప్రణతి ప్రసన్న జానకి" ప్రణామం చేతనే ప్రసన్నమయ్యేది మైథిలి. అంటే ఒక్క నమస్కారం చేస్తే చాలు సంతోషించేది సీత. ఇలాంటి అపురూప దాంపత్యం లోకంలో ఎక్కడైనా వుందానని ఆశ్చర్య పోతాడు హనుమంతుడు. భక్తులకు సీత-రాములిరువురూ సేవ్యులే. జగన్మాత "శ్రీదేవి"- జగన్నాయకుడు "విష్ణువు". ఒకరున్న చోటే రెండోవారు కూడా ఉ ంటారు. వీరిరువురి తోనే ప్రపంచమంతా వ్యాపించి వుంది. ఈశత్వం ఇద్దరిలో సమానమే. సర్వదా ఏకశేశులే! (ఒకేమాటలో ఇరువురినీ తెలిపేదే ఏకశేశం). ఇలా "సర్వకారణత్వం, సర్వవ్యాపకత్వం, సర్వనియంతృత్వం" లక్ష్మీనారాయణుల్లో, సీతా-రాముల్లో వుంది. ఇరువురిలో, "ఉపాయత్వం, ఉ పేయత్వం" వున్నాయి. అందుకే సీతారాములిరువురూ సమానంగా సేవించాల్సిన వారే. అయితే, రామచంద్రమూర్తి చేసే కార్యాలన్నింటికీ మూలకారణం సీతాదేవే! చేసేవాడు రాముడు...చేయించేది సీత. నిగ్రహానుగ్రహాల రెండింటి లోనూ ఇదే నియమం.

భగవంతుడు అనేక కోటి బ్రహ్మాండ నాయకుడు. అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు నాయకి లక్ష్మీదేవి. ఈ అనంత కోటి బ్రహ్మాండాలు ఆమె మూలాన్నే నామరూపాలై, స్థితిగలవై వున్నాయి. అట్టి ఈమెకు ముల్లోకాలు ఒక లెక్కేగాదు. అయితే లక్ష్మీదేవి (సీతాదేవి), భగవంతుడి సహధర్మచారిణిగా, భగవత్ సంకల్పానుసారంగా, తదాజ్ఞానవశవర్తియై, ఆయనకు పరతంత్రగా వుంటుంది. సీతాదేవి వృత్తాంత మంతా ఏకమై, అనన్యమై, భగవత్ ప్రాప్తి ఎప్పుడా, ఎప్పుడా అని ఎదురు చూస్తుండే పరమ భక్తురాలి, ప్రపన్నురాలి చరిత్రే!

లంకలో స్త్రీలు నాలుగు రకాలు. ఈ లోకంలోనూ ఇలాంటి నాలుగు తెగల (రకాల) మనుష్యులే కనపడ్తారు. వారు:

★ పాపంలో పుట్టి, పాపంలో పెరిగి ఇంద్రియ పరమార్థమదేనని నమ్మి వాటికి దాసులై పరలోక చింత లేనివారు

★ ఉత్తమ వంశంలో పుట్టికూడా, స్వధర్మాన్ని వీడి, కామానికి దాసులై, ఇంద్రియ సుఖాలకు అలవాటు పడ్డవారు

★ ఉత్తమ జన్మెత్తినప్పటికీ, సంసార సుఖంలో పడి, కామంలో ఇరుక్కుపోయి, దారీ-తెన్నూ తెలుసుకోలేక, సంసారం నుండి తప్పించుకొనే మార్గం కానరాక, రక్షించే నాథుడు లేక పరితపించే వారు

★ ఏదో చిన్న పాపం చేసి, సంసారంలో పడ్డామనుకుంటూ, నిర్వేదంలో పడి, దీన్నుండి తప్పించే వాడు భగవంతుడే తప్ప, వేరేవాడులేడని విశ్వసించి, తక్కిన ఉపాయాలన్నీ వదిలి, పరమ భక్తినీ-ప్రపత్తినీ ఆశ్రయించే వారు

సీతాదేవి తాను చెరనుండి తప్పించుకోవటమే కాకుండా, తన లాగా దుఃఖిస్తున్న ఇతర స్త్రీలను (దేవ-గంధర్వ-నాగ) కూడా విడిపించింది. నాలుగో రకంవారు (పైనచెప్పిన) తాము తరించి ఇతరులను తరింప చేస్తారు. సీతాచర్య నేర్పేదిదే! ఇతర ఉపాయాలను వెతక్కుండా, దేహాభిమానం, స్వాతంత్ర్యం వదిలి, స్వరక్షణాభారం భగవంతుడి మీద వేసి, "అన న్యార్హ శేశత్వం-అనన్య శరణత్వం-అనన్య భోగత్వం" అనే అకారత్రయ సంపూర్తిని కలిగి, సంసారంలో

వుండే తరించేందుకు "ప్రపత్తితోనో, పరమ భక్తితోనో" సాయుజ్యాన్ని పొందవచ్చని, సీతాదేవి చరిత్ర వలన మనం తెలుసుకోవచ్చు. అంటే, భగవత్ప్రాప్తి కోరేవాడు, ఆయన అనుగ్రహం కొరకు, సీతాదేవి లాగా, సర్వకాల సర్వావస్థలందు భగవన్నామాన్ని ఉచ్చరిస్తూ, స్వధర్మాన్ని వదలకుండా వుండటం తప్ప వేరే మార్గం లేనే లేదు. సీతాదేవి చర్య వలన మనం నేర్చుకున్న విషయాలను, ఆచరణలో పెట్టితే, జన్మాంతరంలోనే ముక్తి లభిస్తుందనడంలో సందేహం లేదు. సీతాదేవి శ్రీరాముడినొక్కడినే చూడాలనుకుంటుంది. ఆయనొక్కడిపైనే ధ్యాస వుంచింది. అంటే "ఏకాగ్ర భక్తి-ఏక భక్తి-అనన్యత్వాన్ని" గురించి చెప్పడమే ఇది. అలానే, భక్తుడు దేవతలెందరున్నా, తన ఇష్టదైవాన్నే నమ్మి, "ఏక భక్తి-ఏకాగ్ర భక్తి" కలవాడై వుంటాడు. భక్తులు, ప్రపన్నులు, తమ కెన్ని కష్టాలొచ్చినా, విశ్వాసం వదలకుండా, భగవంతుడు రక్షించే దాకా, తమ "భక్తి, ప్రపత్తులే" తమకు రక్ష అని భావిస్తారు. భగవంతుడి పైనే భారం వేసి, అతడొక్కడే తమను రక్షించగల సమర్థుడని గట్టిగా విశ్వసిస్తారు.

యాచకులు లేని దాతలు, రోగులు లేని వైద్యులు లేనట్లే, ప్రపంచం లేకపోతే భగవంతుడు లేనేలేడు. ప్రకృతి వల్ల తప్ప, భగవంతుడిని తెల్సుకునే మరో మార్గమే లేదు. ఆ భగవంతుడి శక్తే "లక్ష్మి". ఆమే "మాయ". ఆమే "ప్రకృతి". ఆమె చిద్విలాసమే ప్రపంచం. భగవంతుడు, ప్రపంచం, వేరు-వేరు కాదు. లక్ష్మి అనుగ్రహిస్తేనే ప్రపంచాన్ని దాటుతాం. భగవదనుగ్రహానికి నోచుకుంటాం. ఆమెను వశపర్చుకోవడానికీ, అనుగ్రహాన్ని పొందడానికీ నమస్కారమే సాధనం కాని, బలాత్కారమో, ధన, విద్యాబలాలో మాత్రం కానే కాదు. ఎప్పుడెప్పుడు విష్ణువు అవతారమెత్తుతాడో, అప్పుడన్ని సమయాల్లో శ్రీదేవి ఆయనకు సహాయంగా రావాల్సిందే. ఆయన దేవతలందు అవతారమెత్తితే, ఈమె దేవత్వాన్ని, మనుష్యుల్లో ఎత్తితే మనుష్య స్త్రీగా అవతరిస్తుంది. విష్ణు దేహానికి అనురూపమైన దేహాన్ని ధరిస్తుంది. అందుకే శ్రీదేవి నిత్యానపాయిని. ఆమె "అనన్య". అంటే, చీకటి-వెలుతురు లాగా అన్యం కాకుండా వుంటుంది. ఇంతే "జీవాత్మ-పరమాత్మ"ల అనన్యత్వం. జీవుడు "పరమాత్మ" అంశ. ముముక్షువగు బద్ధ జీవుడు (సీతాదేవి శ్రీ రాముడి పట్ల ఎటువంటి అభిప్రాయం

కలిగి, ప్రవర్తించి, లంక నుండి విముక్తు రాలైందో) పరమాత్మ విషయంలో విశ్వాసం వుంచి, ప్రవర్తించి విముక్తుడు కావాలి.

లంకలో వున్న సీతాదేవి రాక్షస స్త్రీలతో పడ్డ బాధల్లాంటివే, దేహంలోని "బద్ధజీవుడు" సంసారమనే ఇంద్రియాలలో పడేటి బాధలు కూడా. రావణుడు కానీ, రాక్షస స్త్రీలు కానీ, సీతను బెదిరించారే కాని, చంప లేక పోయారు. అదే విధంగా, "జీవాత్మ"ను ఏవీ చంప లేవు. బాధించ గలుగుతాయి. సీతాదేవి లాగా బద్ధ జీవులు"ప్రారబ్ధ" మని, దృఢ చిత్తంతో, భగవంతుడే రక్షిస్తాడని అమిత విశ్వాసంతో వుండాలి. సీతాదేవి ఇంద్రియాలకు లోబడలేదని, భగవంతుడి మీదే విశ్వాసం వుంచిందని ధృవ పడుతోంది. తర్వాత జీవుడు చేయాల్సిన భగవధ్యానం, సీతా విలాప రూపంలో మున్ముందు విశదమౌతుంది.

సీతా విలాపం ముముక్షువైన ప్రపన్నుడి విలాపమే

రాక్షస స్త్రీలు బెదిరిస్తుంటే, నీచ రాక్షస స్త్రీలకు, మనుష్య స్త్రీలకు పొత్తనేది కుదరదని వెక్కెక్కి ఏడుస్తూ జవాబిస్తుంది సీతాదేవి. దీనర్థం....రాక్షస స్థానంలో "ప్రకృతి", మనుష్య స్థానంలో "జీవాత్మ" వుందని గ్రహించడమే! మనుష్యులకు, రాక్షసులకు విజాతీయ భేదమున్నట్లే, అచేతనమైన "దేహాని"కీ, చేతనమైన "ఆత్మ"కు తారతమ్యం వుంటుంది. ఆ దుఃఖం లో, సీతాదేవి, మరిదినీ, అత్తగారినీ, తన మీద దయ లేదా అని దీనంగా ప్రశ్నిస్తుంది. అయినా అప్పటికప్పుడు ఏమీ జరగలేదంటే, దీనర్ధం, బంధువులెవ్వరూ, ఎంత ఆప్తులైనా, "ఆత్మ"ను వుద్ధరించలేరనే!

గొప్ప వ్రతం చేయబూని, పూర్తి చేయనందువల్ల, వ్రతఫలం దక్కకుండా పోయి, భర్తతో ఎడబాటు కలిగిందనీ, వ్రతం పూర్తి చేస్తే ఆ పుణ్యఫలం వల్ల, తన భర్త తనను రక్షించే వాడేమోనని అనుకుంటుంది సీత. దీన్నిబట్టి, స్త్రీల పాతివ్రత్యం, నోముల ఫలం, వారి భర్తలు తమను రక్షించేవిగా చేస్తున్నాయనీ, అట్టి ఫలం లేక పోతే, భర్తలున్నా రక్షించ లేరనీ అర్ధం చేసుకోవాలి. "ఆడదాని అదృష్టం" అన్న నానుడి ఇందుకే ఏర్పడి వుండవచ్చు. ఆడది నిర్భాగ్యురాలైతే, మగవాడు ఎంత పుణ్యాత్ముడు, సమర్థుడు అయినప్పటికీ, ఆ స్త్రీకి సుఖం లేదు. లోకంలో కొందరు దరిద్రులు గానూ, కొందరు ధనవంతులు గానూ,

దుఃఖంతో కొందరు, సుఖిస్తూ కొందరు వున్నారు. ఇవి వారి-వారి పాప-పుణ్య ఫలాలు. బాగు పడటానికి, చెడిపోవటానికీ, వారి-వారి పూర్వ కర్మలే కారణం.

సీతా విలాప రూపంలోని పై ఆలోచనలకర్థం....భగవత్ సాక్షాత్కార మయ్యేంత వరకు సంసార బాధ తొలగదనే! ప్రకృతి బంధం మన ప్రయత్నంతో తొలగేది కాదు. భవదనుగ్రహం తోనే తొలగాలి. ఒక దేహంలో "జీవాత్మ-పరమాత్మ" లిరువురూ వుంటారు. జీవాత్మ సంసారంలో మునిగి, ఈశ్వరుడిని చూడలేక, మోహంతో దుఃఖిస్తుంది. ఎప్పుడైతే, జీవాత్మ, పరమాత్మను దర్శిస్తుందో, అప్పుడే దాని శోకం తొలగిపోతుంది. ఇందులో "ఆత్మగుణం, దేహగుణం" కలిపి చెప్పడం వల్ల, "సగుణ బ్రహ్మ"మే సేవించ తగినదనీ, అట్టి దానిని సాక్షాత్కరింప చేసుకొనగలవారే "పుణ్యాత్ములనీ, మోక్షార్హులనీ" అర్థం చేసుకోవాలి. పూర్వ జన్మ పాపం వల్ల కూడా ఇలా అనుభవిస్తున్నానని సీత అంటుందో సారి. అంటే, ఆమె కర్మ వశాత్తు పుట్టిందని కాదు. ఆమాట రాక్షస స్త్రీలను ఉద్దేశించి చెప్పబడింది. భక్తుడు తన సర్వస్వం ధారపోసినా, భగవంతుడు కనపడకపోతే నాస్తికుడి లాగా భగవంతుడు లేడనుకోకూడదు. తనలోనే ఏదో లోపం వుందనుకోవాలి. మనుష్యులు సుఖమయినా, దుఃఖమయినా, "ప్రారబ్ధాన్ని" అనుభవించాల్సిందే కాని, బలాత్కార మరణంతోనో, ఇంకే విధంగానో దాన్ని తప్పించుకోలేరు. "యద్యద్భవ్యం భవతు భగవన్! పూర్వకర్మానురూపమ్"అంటారు కులశేఖరాళ్వార్.

రాక్షస స్త్రీలు పెట్టే బాధలను సహించలేని సీతాదేవి, శ్రీరాముడిని తల్చుకొని అదే పనిగా విలపిస్తుంది. నేలమీద పడి పొర్లాడుతూ, పిచ్చెత్తినట్లు, పిశాచం పట్టినట్లు, ఒళ్లు తెలీకుండా, మనస్సు దిగ్భ్రమ చెందిన దానిలాగా, ఏడ్చేది. ఇదంతా భక్త-ప్రపన్నుల స్తితి. భక్తి అమితంగా పెరిగిపోతే, భక్తుడు దేహాభిమానాన్ని విడిచి నేలపైపడి పొర్లాడుతాడు. పిచ్చి పట్టినట్లు, దయ్యం పట్టినట్లు, వంటిమీద గుడ్డలున్నదీ, లేనిదీ తెలీకుండా ప్రవర్తిస్తాడు. దీన్ని బట్టి భక్తుడి మనస్సు భగవంతుడి మీదుండాలికాని సుఖ-సౌఖ్యాల మీదకాదు.

శ్రీరాముడిని తల్చుకుని దుఃఖించిన సీత, ఆయన తనను ఉపేక్షించడానికి కారణం, ఆయనకు దయాగుణం లేకపోవడం కాదనీ, ఆయన దయ తన

మీద రాక పోవడానికి తన దురదృష్టమే కారణమై వుండాలనీ అనుకుంటుంది. ఇలాంటి భావన నిజమైన భక్తుడికే కలుగుతుంది. భగవత్ కటాక్షం తనకు కలగలేదని భగవంతుడిని తప్పు పట్టడు. ఆ యోగ్యత తనకింకా కలగలేదనే అనుకుంటాడు. తనలోని లోపాలను సరిదిద్దుకొని, శాయశక్తులా అన్ని ప్రయత్నాలూ చేస్తాడు. అయినా తను పూర్ణభక్తి సంపాదించు కున్నానని గానీ, భగవంతుడే కఠినుడై అనుగ్రహించ లేదనిగానీ అనుకోడు. ఎవడు పూర్ణ భక్తుడనని అనుకుంటాడో, వాడు నిజమైన భక్తుడు కాదు. నిజమైన భక్తుడు, ఇంకా–ఇంకా, భాగవత సేవ ఏమీ చేయలేకపోయానే! అనుకుంటాడు. భగవత్ సేవ చేసినందుకు తృప్తి పొందడు. ఇంకా అలానే చేస్తూనే వుంటాడు. ఇది భక్తుడి స్వభావం. "జీవాత్మ"లు భగవంతుడిని సేవించడం తమ మేలుకొరకే గాని, ఆయన్ను వుద్ధరించడానికి కాదు. "జీవాత్మ"లు సేవించనంత మాత్రాన ఆయనకు వచ్చిన లోటేమీ లేదు. జీవాత్మలు భగవంతుడి విషయంలో ఎన్ని అపచారాలు చేసినా, భగవంతుడట్లా చేయడు. అందుకే, పరమ భక్తులు, ప్రపన్నులు చేయాల్సిందల్లా, భగవత్ చరిత్ర తప్ప వేరేదాని పై దృష్టి నిలపకపోవటమే. దేహ సుఖాలు కోరకూడదు. భగవంతుడే రక్షిస్తాడన్న దృఢ విశ్వాసం కలిగి, తన యోగక్షేమాలకై, తాను పాటుపడకూడదు. స్వతంత్ర బుద్ధి మానాలి.

దేహం భగవంతుడుండే ఆలయమన్న భావనతో అలంకరించుకోవచ్చు. భగవదర్పణం అనుకుంటూ మంచి ఆహారం తీసుకోవచ్చు. స్వబుద్ధి, స్వప్రయోజనం మటుకు నిశిద్ధం. సన్యాసుల్లాగా దేహాన్ని శుష్కింప చేసుకుని, తపస్సు చేయడం కంటే, గృహస్థ మార్గమే వుత్తమం. అయితే, దానికంటే ఇది కష్టమైన పని. ఇలా వుండ లేనివాడే సన్యాసి అవుతాడు. సన్యాసులకు కలిగే బ్రహ్మలోక ప్రాప్తి కంటే వీరికి భగవత్ సాయుజ్య ప్రాప్తి తొందరగా లభిస్తుంది.

సీతావిలాపం, ముముక్షువైన ప్రపన్నుడి విలాపం, ఒకటేనని చెప్పుకున్నాం. సంసార సాగరాన్ని తరించే మార్గం తెలియక, నిర్వేదంతో తనను ఆశ్రయించిన జీవులను రక్షించడానికి, భగవంతుడు "ఆచార్యు"లను పంపుతాడని కూడా చెప్పుకున్నాం. ఇట్టి భగవత్సహాయం, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దేహాభిమానాన్ని పూర్తిగా వదిలిపెట్టి, తన కొరకే (భగవంతుడి) మాన–ప్రాణాలను

పోగొట్టుకోటానికి సిద్ధపడే పరతంత్రులకు మాత్రమే లభిస్తుంది. స్వప్రయత్నంతో, దేహంపై ఏ మాత్రం అభిమానమున్నా, ఆ సహాయం రాదు. సీతాదేవి తనను, రాక్షసులు ఏం చేసినా, చేసుకోమని చెప్పి, దేహాభిమానాన్ని విడిచి, నిద్రాహారాలు మాని, ఏకాగ్రతతో, బుద్ధి పూర్వకంగా, తన దేహాన్నీ-ప్రాణాన్నీ, రామచంద్రమూర్తికే సమర్పించాలనుకొని, నిరాశతో ఎప్పుడైతే మరణించాలనుకొని సిద్ధపడిందో, అప్పుడే హనుమంతుడి ద్వారా "ఆచార్య" లాభ ప్రాప్తి కలిగింది.

హనుమంతుడు (ఆచార్యుడు) తాను చూస్తున్న స్త్రీ, సీతాదేవేనని (శిష్యుడు) నిశ్చయించుకోవడానికి, స్వతంత్ర-పరోక్ష-ప్రత్యక్ష-పరస్పర సంబంధం లేని, సాక్ష్యాలు ఆధారంగా చేసుకుంటాడు. ప్రత్యక్ష సాక్ష్యం....శరీరం పైన కనిపించిన సాముద్రిక చిహ్నాలు. సాముద్రిక శాస్త్రంలో చెప్పబడిన ఉత్తమ స్త్రీ, లక్షణాలన్నీ ఆమెలో వున్నాయనుకొంటాడు. ఇన్ని విధాలైన ప్రత్యక్ష-పరోక్ష నిదర్శనాల వల్ల, ఈమే సీతనీ, రామచంద్రమూర్తి సందేశం వినే అర్హత ఈమెకే వుందనీ, హనుమంతుడు తీర్మానించు కుంటాడు. అదేవిధంగా "ఆచార్యుడు" కూడా, తన శిష్యుడిగా స్వీకరించ దలచిన వాడిని, ప్రత్యక్ష-పరోక్షనిదర్శనాల ద్వారా, భగవత్తత్వ రహస్యం ఉపదేశించడానికి అర్హుడా-కాడా? అని పరీక్షించాలని దీనర్థం.

ప్రశస్త వాక్కు గల ఆంజనేయుడే హనుమంతుడు

హనుమంతుడు నిజంగా రామదూతే అయితే, తనకు ప్రియమైన శ్రీరాముడి గుణ-గణాలు వర్ణించమని సీతాదేవి హనుమంతుడిని అడుగుతుంది. భగవత్ గుణానుభవంలో అభిలాష వుండి, భగవద్గుణాను సంధానం చేస్తూ, శిష్యుడికి, భగవత్ గుణాలను వర్ణించి చెప్పేవాడే నిజమైన "గురువు-ఆచార్యుడు". అట్లా చేయకపోతే వారిని నమ్మకూడదు. దగ్గరకు రానీయ కూడదని దీనర్థం. హనుమంతుడు ప్రత్యక్ష, పరోక్ష నిదర్శనాలతో, సీతాదేవిని పరీక్షించి (ఆచార్యుడు-శిష్యుడిని) చూసుకున్నట్లే, సీతాదేవి కూడ హనుమంతుడుని (శిష్యుడు-ఆచార్యుడిని) ప్రత్యక్షంగా పరీక్షిస్తుంది మొదట. అంటే శిష్యుడిని

గురువు పరీక్షించినట్లే, గురువును కూడా శిష్యుడు పరీక్షించాలి. వీధిన పోయే ప్రతివాడినీ నమ్మి "ఆచార్యుడి"గా రానీయకూడదు.

శ్రీరామ, లక్ష్మణుల చిహ్నాలేంటని సీతాదేవి హనుమంతుడుకి వేసిన ప్రశ్న ఒక విషమ ప్రశ్న. అందులో రెండు భాగాలున్నాయి. చేతుల విషయం ఎవరైనా చెప్పొచ్చు...అందరికీ కనిపిస్తాయి కాబట్టి. "తొడలెలా వుంటాయి?" అనికూడా అడుగుతుంది సీత. అంటే మర్మాంగాలను గురించి ఆరా తీస్తున్నదన్న మాట. దీంట్లో గురువును పరీక్షించే తీరు కనిపిస్తుంది. జవాబు చెప్పేటప్పుడు ఔచిత్యం కనబరుస్తాడా? లేదా? అని పరీక్షించ దల్చింది. దీనర్థం..."ఆచార్యుడు", భగవత్ తత్వాన్ని ఆమూలాగ్రంగా, రహస్యాలతో సహా తెలిసిన వాడై వుండాలని!

సీతమ్మ రాముడి తొడలు ఎలా వుంటాయనీ, లక్ష్మణుడి తొడలు ఎలా వుంటాయనీ, అడగడమేంటి? తప్పుకదా! అనిపించడం సహజం. విశేషించి పర పురుషుడుని, అందునా అసలే పరిచయం లేని వాడిని అలా అడగడమేంటి? ఇదొక విషమ పరీక్ష హనుమంతుడికి. ఆమెకు రామలక్ష్మణుల స్వరూపం తెలుసు. కాబట్టి అడిగింది. హనుమంతుడు చెప్పేదానిలో ఆ వివరాలు సరిపోతే ఆమె నమ్మగలగుతుంది. అదలా వుంచుదాం. కంటికి కనిపించే అవయవాలను వర్ణించి చెప్పవచ్చు. కంటికి కనిపించని మర్మావయాలను ఎలా వర్ణించడం? తెలిసే అవకాశం లేదే? ఒకవేళ చూడడం సంభవించినా, స్త్రీ ముందు వివరించి చెప్పడం ఔచిత్యం కాదుకదా? హనుమంతుడు బుద్ధిమంతులలో శ్రేష్ఠుడు... సాముద్రిక శాస్త్రవేత్త. ఆ శాస్త్రం వ్యక్తుల రూపురేఖా విలాసాలను చెప్పి, వాటి ఫలితాలను ఇస్తుంది. ఏ ఏ జాతులవారు ఎలా వుంటారనేది సర్వావయ పరిణామాలను బట్టి విశ్లేషిస్తుంది. సాముద్రిక శాస్త్రజ్ఞాని హనుమంతుడైనందున, కంటికి కనిపించే అవయవాల పరిణామాలను బట్టి, పొందికను బట్టి, కంటికి కనిపించని (మర్మ) అవయవాలను వర్ణించగలుగుతాడు. సీతమ్మ ఉద్దేశ్యం కూడా అదేనేమో! రామలక్ష్మణుల ముఖాలనూ, బాహువులనూ, వక్షస్థలాలనూ, గమనించిన వాడు, మిగిలినవాటిని చెప్పగలడా? లేదా? అని. అంటే, ఈ దూత చూసిందే వల్లిస్తాడా? లేక చూసిన దానిని బట్టి, ఇంగిత జ్ఞానంతో, తదుపరి ఆలోచన చేయగలడా? లేదా? అని గ్రహించడానికే, హనుమంతుడుని

ప్రశ్నించింది సీత. జయశీలుడైన హనుమంతుడు పరీక్ష నెగ్గాడు. సీతకు విశ్వాసపాత్రుడైనాడు.

జవాబుగా హనుమంతుడు మొదలు శ్రీరాముడి ఆత్మ గుణాలను వర్ణించి, తర్వాత దేహ గుణాలను వర్ణిస్తాడు. "తేజస్సు, యశస్సు, శ్రీ" ల వల్ల వ్యాపించినవాడు శ్రీరాముడు అంటాడు. బ్రహ్మచర్య నిష్ట గలవాడంటాడు. రాముడిని వర్ణించిన హనుమంతుడు, ఆయన్ని గురించి చాలా నిగూఢంగా చెప్తాడు. స్పష్టంగా చెప్పి వుండేవాడే కాని, అలా చెప్తే చెప్పడం తెలియని వాడనీ, అడవి మనిషనీ, సీత భావించి వుండేది. "లింగం, వృశణం" గురించి కూడా చెప్పాడు. ఔచిత్యం పాటించక పోతే, "ఇటువంటి వాడు రామ దూతగా వుండజాలడు" అని సీతాదేవి తీర్మానించేదే! అసలామె ప్రశ్న వేసింది కూడా హనుమంతుడెలా చెప్తాడని తెలుసుకునేందుకే!

రామచంద్రమూర్తి దూతగా వచ్చానని చెప్పిన తర్వాత, ఆమె నమ్మిందని నిర్ణయానికి వచ్చిన తర్వాత, తన జన్మ వృత్తాంతాన్ని, తనను గురించిన విషయాలనీ కూడా వివరించి చెప్తాడు హనుమంతుడు సీతాదేవికి. ఇలా చెప్పటంలో కూడ ఎంతో అర్థం వుంది. స్నేహం చేయటానికి, కలసి మెలసి వుండడానికి, కులహీనుడితో, ఆచార హీనుడితో, సదాశ్రయం లేనివాడితో కుదరదు కాబట్టి, తన విషయం చెప్పుకొన్నాడు. కులం, గుణం, ఊరు, నిజమైన పేరు, దాచేవాడు ఆచార్యుడిగా పనికి రాడు. శిష్యుడు కూడా గురువు వంశాదులను, పుట్టు పూర్వోత్తరాలను, విచారించాలని కూడా దీని భావన."ఆచార్య కృత్యం" కూడా హనుమంతుడి మాటల్లో వ్యక్తమౌతుంది. శిష్యుడికి భగవంతుడి విశయమంతా వివరంగా చెప్పి, భయపడొద్దనీ, భగవంతుడే స్వయంగా వచ్చి తీసుకో పోతాడనీ, ఆ సమయానికై వేచి వుండాలనీ అంటాడు. శిష్యుడు మాత్రం సదాచారం, భక్తి విశ్వాసాలు కలిగి వుండాలని కూడ ఆయన మాటల్లో స్ఫురిస్తుంది. గురు పరంపర కూడా చెప్తాడు. శిష్యులు కాదల్చుకున్న వారు ఆచార్యులమని వచ్చేవారిని, పరీక్షించు కోవాలనే అర్థం కూడా వుంది.

సీతమ్మ హనుమంతుడిని తన జన్మ వృత్తాంతం చెప్పమని అడగలేదు. రాముడి రూప విశేషాలను మాత్రమే చెప్పమని అడిగింది. దాంతో పాటు తన

జన్మ వృత్తాంతాన్నీ చెప్పాడు హనుమంతుడు. అడగందే చెప్పడం దేనికి? అనిపించవచ్చు. కానీ హనుమంతుడు "ఆంజనేయుడు" కదా! అంటే ప్రశస్త వాక్కు కలవాడని అర్థం. వ్యర్థంగా ఏదీ మాట్లాడడు. అసలు కారణమేంటంటే, తాను రామ దూతననీ, సామాన్యమైన సగటు వాడిని కాదనీ, సమర్థుడననీ సీతమ్మను నమ్మించ చేయడం ప్రధానం ఇక్కడ. నమ్మదగిన వాడినీ, విశ్వాసపాత్రుడునీ, అని సీతమ్మకు రూఢి చేయాలని భావించడం! తనను ఈ మహా కష్టం నుండి తప్పించగలవాడని, శ్రీరాముడిని రప్పించి తనను ఆయనతో కూర్చగల సమర్థుడని విశ్వాసాన్ని పాదుకొల్పడానికే తన వైనం చెప్పాడు హనుమంతుడు. రామాయణం "ధ్వని కావ్యం". అంతరాంతరాలలో దాగివున్న పరమార్థాలను ఆంధ్ర వాల్మీకి ఎంతో సులభంగా, సుందరంగా మనకు అందించాడాయన మన అదృష్టం వల్ల!

ఇవన్నీ అయిన తర్వాత, సీతాదేవికి తన మాటల్లో ఇంకా పిసరంత సందేహముంటే, దాన్ని కూడా పోగొట్ట దల్చి, "శ్రీరామముద్రిక" ను ఇస్తాడు సీతమ్మకు. అంటే, సీతాదేవి సందేహం తీరిందని, శ్రద్ధ కలిగిందని, నమ్మకం కలిగిన తర్వాతనే ఉంగరం ఇచ్చాడు హనుమంతుడు. దీన్ని బట్టి సంశయంతో వున్నవారికి, శ్రద్ధలేని వారికి, "రామ మంత్రం" ఉపదేశించ కూడదని అర్థం చేసుకోవాలి. అదే విధంగా శిష్యుడు ఇది చెప్పమని అడగ కూడదు. గురువనుగ్రహిన్చిందే స్వీకరించాలి. ఈ విధంగా "సీత–ఆంజనేయుల" చర్య వలన "శిష్య లక్షణం, గురు లక్షణం, ముముక్షు హిత చర్య, భగవత్ మంత్ర ప్రాప్తం" చెప్పడం జరిగింది.

"రామముద్రిక"ను చూసిన సీతాదేవికి, సాక్షాత్తు, శ్రీరామచంద్రుడే ఎదురుగా వచ్చినట్లు, భావనాతిశయం వల్ల ఆయన ఆకారం స్పష్టంగా కనిపించింది. భగవన్మూర్తి ధ్యాన, సోపాన మార్గాన్ని తెలుపుతున్న దీచర్య. ఇది శిష్యుడి ఉత్తర కార్యం. భగవన్మూర్తి ఇలా ఎదురుగా వచ్చి నిల్చున్నట్లు అనిపించిందాకా భగవంతుడిని ఉపాసించాల్సిందే!

భగవత్ ప్రాప్తికి భగవంతుడే సాధనం

సీతను తన వీపు మీద ఎక్కించుకొని ఆకాశ మార్గంలో శ్రీరాముడి దగ్గరకు తీసుకు పోతాను రమ్మని ఆమెను కోరుతాడు హనుమంతుడు. "మగవాడిని–రాముడిని" తప్ప మరెవ్వరినీ తాకననీ–లక్ష్మణ, సుగ్రీవులతో కూడిన రామచంద్రమూర్తినే లంకకు తీసుకొచ్చి, రావణుడిని చంపి, తనను తీసికొని పొమ్మని, ఆయనతో చెప్పమని అంటుంది జవాబుగా. తను చెప్పిన ఈ "ఉపాయం" తప్ప తక్కినవన్నీ వదిలేయమనీ, దుఃఖంలో వున్న తనను కృతార్థురాలిని చేయమనీ, ప్రార్థిస్తుంది.

హనుమంతుడు వెంట రానని సీతాదేవి చెప్పటంలో ఎంతో గూడార్థముంది. "మగవాడిని–రాముడిని" (మగవానిని రాముని తప్ప నింకనెవ్వరిని స్పృశింప నొల్ల) తప్ప అన్యులను తాకననటంలో అర్థం:శ్రీరామచంద్రుడొక్కడే పురుషుడని, తక్కిన వారందరూ స్త్రీలని అనుకోవాలి. "భగవంతుడు, వాసుదేవుడు" మాత్రమే పురుషుడు. తక్కిన బ్రహ్మాదులతో కూడిన ప్రపంచమంతా స్త్రీ మయమే! స్త్రీ–స్త్రీ తో కలిస్తే ఆనందం లేదు కదా! అంతే "జీవాత్మ". భగవంతుడితో సాయుజ్యం పొందితేనే ఆనందమ్ కలుగుతుందికాని, బ్రహ్మాదులతో సాయుజ్యం కల్గితే మళ్లీ పుట్టాల్సిందే...మళ్లీ దుఃఖించాల్సిందే!

సీతాదేవి మరో అభిప్రాయంలో "ఆత్మనిక్షేపం, పారతంత్ర్యం" స్పష్టంగా చెప్పడం జరిగింది. "ప్రపన్నులు" తప్ప తక్కిన "ముముక్షువు" లందరూ, భగవత్ ప్రాప్తికి, "భక్తో, కర్మయోగమో, జ్ఞాన యోగమో, అష్టాంగ యోగమో", ఏదో ఒకటి సాధనంగా స్వీకరిస్తారు. ప్రపన్నుడు ఈ సాధనాలేవీ ఆశించడు. భగవత్ ప్రాప్తికి భగవంతుడే సాధనమనీ, ఆయనే వచ్చి తనను తీసుకోపోవాలనీ భావిస్తాడు. ప్రపన్నుడు భగవంతుడిని తప్ప మరే సాధనం కోరడు. ఒకవేళ కోరినా, భగవత్ ప్రాప్తి తప్ప మరే ఫలం కోరినా, భగవంతుడిని తప్ప మరే దేవతను ఆశ్రయించినా, ప్రపత్తి చెడుతుంది, ఫలించదు. హనుమంతుడు వెంట సీతాదేవి వెళ్లుంటే, ఆమెను రామచంద్రమూర్తి భ్రష్టురాలివైనావని స్వీకరించి ఉండడు. కాబట్టి "ప్రపన్నులు" అన్ని విధాలుగా "అనన్య" లై వుండాలి.

"భక్తుడికీ, ప్రపన్నుడికీ" భగవంతుడు తన పాలిట వున్నాడను కోవటానికి అనేక నిదర్శనాలు అనుభవ పూర్వకంగా తెలుస్తాయి. వాటిని బట్టి తక్కినవి ఊహించుకోవచ్చు. శ్రీరామచంద్రమూర్తి తక్కిన అందరు దేవతలకంటే గొప్పవాడని తెల్సుకోగలుగుతాడు. ఇట్టి ఉత్తమోత్తమ దేవతను సాధించే "ప్రవృత్తి"నే ఉత్తమోత్తమ "ఉపాయ"మని గ్రహించి దృఢ చిత్తంతో, అనన్యుడిగా వుండాలి. అందుకే సీత అంటుంది...తక్కిన అన్ని ఉపాయాలూ వదలమని, గుహలో వున్న భగవంతుడిని తాను వెతుక్కుంటూ పోలేను, ఆయన్నే ఇక్కడకు రప్పించమని. "శిశ్యుడు-ఆచార్యు"డిని కోరడమే యిది. హనుమంతుడు జవాబులో "ఆచార్య కృత్యం" అంటే ఏమిటో కూడా వుంది.

హనుమంతుడుతో, శ్రీరామలక్ష్మణులకు సందేశ వార్తలను పంపుతూ సీతాదేవి, తనకు బదులుగా తన నమస్కారమని తన తరఫున రాముడికి మ్రొక్క మని అంటుంది. తనను రక్షించమని అడిగానని మాత్రం చెప్పవద్దని కోరుతుంది. ఇదివరకు తన్ను రక్షించమని కోరి మహాపరాధం చేసాననుకుంటుంది. ప్రపన్నురాలు అలాంటి కోరికలు కోరరాదు. భగవత్ కృత్యం ఆయనకు నేర్పి "దురహంకారి" నైనా ననుకుంటుంది సీత. అంటే ఆయనపై "విస్మృతి" దోషం ఆరోపిన్చినట్లే! ఆయన రక్షిస్తాడన్న విషయంలో విశ్వాసం లేనట్లే! ఆయన సొత్తు కాపాడుకున్నా, పోగొట్టుకున్నా, బలవంత పెట్టేందుకు తనెవరనుకుని, దోష నివృత్తి కొరకు, ప్రాయశ్చిత్తంగా "నమస్కరిస్తున్నా" నని మాత్రమే చెప్పమంటుంది.

రామచంద్రమూర్తి సైన్యంతో వచ్చి, యుద్ధంలో బల-పరాక్రమాలను ప్రదర్శించి, రావణుడిని చంపి, తనను అయోధ్యకు తీసుకొని పోతేనే "కీర్తికరం" అంటుంది సీత హనుమంతుడితో. అప్పుడే తను "వీరపత్ని"నన్న బిరుదుకు అర్హురాలినని కూడా అంటుంది. ఈ విధంగా సీత కోరరాని కోరికేమీ కోరలేదు. "పరమ భక్తులు, ప్రపన్నులు" భగవంతుడే స్వయంగా వచ్చి, తమను పిల్చుకోపోవాలని కోరుకుంటారు కాని, దూతలతో పిలిపించు కోవటానికి ఇష్టపడరు. సీత చెప్పిన "ఉపాయం" గొప్పదైనా, "ఉపేయం" కూడా గొప్పదే! ఉపేయం గొప్పదైతే, దాన్ని సాధించే ఉపాయం కూడ గొప్పగానే వుండాలి.

"ఉపేయం" రామచంద్రమూర్తి....దాని సాధనోపాయం రామచంద్రమూర్తి రావడమే!

భగవంతుడు ఎల్లవేళలా జ్ఞాపకం వుండడానికి సీతాదేవి "చూడామణి"నుంచుకున్నట్లే, ఓ పతకం కానీ, మరేదైనా చిహ్నం కానీ శరీరం పైన ధరించాలెప్పుడూ. శరీరం ధర్మసాధనం, భగవత్ సాధనం కద! దాని పని భగవంతుడి స్మరణకే! దేహం లేక పోతే భగవత్ స్మరణే లేదు. భగవంతుడిని స్మరిస్తేనే గాని భగవత్ ప్రాప్తి లేదు. భగవత్ ప్రాప్తికై దేహ ధారణ చేయాలేకాని, మనమే దేహాన్ని విడిచిపెట్ట కూడదు. దానిని "అన్య ప్రాకృత" విషయాల్లో వినియోగించ కూడదు. దేహం పోయే లోపల భగవత్ ప్రాప్తి కలిగే ఉపాయాన్ని వెతుక్కోవాలి. అట్టి దేహం మీద సీతాదేవి, సర్వాభరణాలు వదిలి "చూడామణి"ని మాత్రం ప్రాణపదంగా వుంచుకుంది. దాన్నీ రామార్పణం చేసి,హనుమంతుడికి తన గుర్తుగా యిచ్చి, "సర్వస్వ నిక్షేపం" చేసిందయింది.

అశోక వనాన్ని పాడుచేసిన హనుమంతుడి ఘోర, భయంకర రూపాన్ని చూసిన, రాక్షస స్త్రీలు, ఆయన్ను గురించి సీతాదేవిని అడిగినప్పుడు, తనకు తెలియదని అబద్ధం చెప్పుతుంది. అయినా అసత్య దోషం ఆమెకు తగలదు. ప్రతిమనిషి, ప్రతినిత్యం, పాటించాల్సిన "యమము" లలో ముఖ్యమయినవి అయిదు. అవి: "అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం". చివరి నాలుగింటికి "అహింస" తల్లి. సత్యాదులు దాని బిడ్డలు. నిజం చెప్పడం వల్ల నిరపరాధికి, నిష్కారణంగా హింస జరిగితే, జరుగుతుందనుకుంటే, సత్యం చెప్ప రాదు. అసత్యమాడవచ్చు. దురుద్దేశం లేని హాస్యమాడేటప్పుడు, స్త్రీల విషయంలో, వివాహ కాలంలో, ప్రాణాపాయ సమయంలో సర్వస్వం కోల్పోయేటప్పుడు అసత్యం చెప్తే పాపం తగలదు. సత్యం చెప్తే హాని జరుగుతుందనుకుంటే, అసత్య మాడవచ్చునే కాని, ఆడాలన్న నిర్బంధం మాత్రం లేదు. హనుమంతుడు, సీతాదేవికి ప్రత్యుపకారం కోరని ఉపకారి. నిరపరాధి. సత్యం చెప్తే, ఆయనకు, తనకు, ప్రాణహాని కలుగుతుందని భయపడింది సీతాదేవి.

ఇంద్రజిత్తు హనుమంతుడిని, "బ్రహ్మాస్త్రం"తో బంధించిన తర్వాత, రాక్షసులు, తాళ్లతో, పగ్గాలతో తిరిగి కట్టేయగానే, బ్రహ్మాస్త్ర బంధాలు తెగిపోయాయి. బ్రహ్మాస్త్ర బంధాలు మరో బంధాలతో కలిస్తే, ఆ బంధాలు విడిపోతాయి! దీనర్థం: ప్రపత్తి చేసినవాడు, దాని మీద విశ్వాసం లేక పోతే, ప్రపత్తికి సహాయ పడుతుందని వేరే సాధనాన్ని వుపయోగిస్తే, "ప్రపత్తి" చెడిపోతుంది. ప్రపత్తి లో వున్న అపాయం ఇదే! ఇతర "ఉపాయాల"ను అది సహించదు.

అనంతకోటి బ్రహ్మాండానికి "పరబ్రహ్మం" ఒక్కడే!

బ్రహ్మాస్త్ర బంధాలు వీడిపోయి, తాళ్లతో, పగ్గాలతో కట్టబడిన హనుమంతుడు, కొలువు కూటంలో వున్న రావణాసురుడికి, "నయానా–భయానా" బుద్ధి చెప్తూ, "కాళరాత్రి" అనే పదం వాడుతాడు. రావణుడి వశమందున్న జానకీదేవి, "ఉత్తమ స్త్రీ" అనీ, ఆమె లంకనంతా పాడు చేసేందుకు వచ్చిన "కాళరాత్రి" అనీ అంటాడు. ప్రళయ కాలంలో కాళరాత్రి ఏవిధంగా లోకాన్నంతా నాశనం చేస్తుందో అట్లాగే సీతాదేవి, లంకనంతా నాశనం చేయ బోతున్నదనీ, ఆమె రావణుడి మెడలో తగులుకున్న "యమపాశమని" చెప్తూ, లంకను కాపాడు కోవాలన్నా, రావణుడికి బ్రతకాలని ఆశ వున్నా, ఆమెను వదిలి పెట్టడమొక్కటే మార్గమని సలహా ఇస్తాడు. "కాళరాత్రి" అంటే, ప్రళయ కాలంలో సర్వసంహారం చేసే "భగవంతుడి" శక్తి. ఈమే "విష్ణుశక్తి", భగవంతుడి మహామాయ. ఆయన ఆజ్ఞానుసారమే నడుస్తుంది. ఆయన సంకల్పం ప్రకారమే పనిచేస్తుంది. "మహావిష్ణువు క్రీడా శరీరం", "బ్రహ్మాదులకు అగోచరం". ఎవరైతే విష్ణువును భజిస్తారో, వారే "మహామాయ"ను దాటగలరు. ఇతర "ఉపాయాలు" ఎన్నైనా దాటలేరు. ఈ "విష్ణుశక్తే" లోక కల్యాణంకొరకు, "సత్వ"గుణాన్ని అంగీకరించి, "లక్ష్మి, శ్రీ, భూమి, రుక్మిణి, సీత" లాంటి రూపాలు సంతరించుకొని అవతరిస్తుంది. సంహార సమయంలో "తమో" గుణాన్ని పూనుతుంది. అప్పుడే "కాళరాత్రి" లాంటి పేర్లను ధరిస్తుంది.

హనుమంతుడు రావణుడితో, శ్రీరాముడు సమస్త ప్రపంచాన్ని తన శక్తితో, "సంహరించ గలడనీ, సృష్టించ గలడనీ", ఆయనతో రావణుడికి పోలికే లేదనీ

అంటాడు. ఇది కేవలం భయ పెట్టడానికి చెప్పిన మాటలేం కావు. యదార్థం కూడా. "సృష్టించేవాడు బ్రహ్మ, సంహరించేవాడు రుద్రుడు" అనుకుంటారందరు. అయితే ఇవి రామ కార్యాలుగా హనుమంతుడు చెప్పటంలో అతిశయోక్తి లేదు....తగిన కారణం వుంది. అనంతకోటి బ్రహ్మాండానికి "పరబ్రహ్మం" ఒక్కడే! అతనికి సమానుడూ, అధికుడూ ఎవరూ లేరు. గడ్డిపోచ కదలాలన్నా ఆయనే కారణం. ఆయనే సృష్టికొక అధికారిని, సంహరించడానికొక అధికారిని నియమించాడు. "బ్రహ్మ, రుద్రులు" నిమిత్త మాత్రులు. భగవంతుడైన "విష్ణుమూర్తి", రజోగుణం విశేషంగా వుండే జీవులందు ప్రవేశించి వారితో సృష్టి కార్యాన్నీ, తమోగుణం వున్నవారిలో ప్రవేశించి సంహార కార్యాన్నీ, సత్వగుణం వున్నవారిలో ప్రవేశించి రక్షించే పనినీ చేస్తాడు. అందుకే సమస్త ప్రయోజకర్త వాస్తవానికి ఆ "భగవంతుడే"! అతడే విష్ణువు. ఆ విష్ణువే శ్రీరామచంద్రుడిగా అవతారమెత్తాడు.

రాక్షసులు హనుమంతుడి తోక కాల్చిన సంగతి తెల్సిన సీత, తాను పతివ్రత నైతే, "అగ్ని" దేవుడు హనుమంతుడి పట్ల చల్ల పడాలని ప్రార్థిస్తుంది. అలా సీతాదేవి మాట మాత్రంగా అడిగితే, అగ్ని ఆంజనేయుడిపట్ల చల్లబడింది. ఎంతటి మహాత్ములైన పురుషులకు కూడా సాధ్య పడనిదీ, పతివ్రతలైన స్త్రీలకు సాధ్య పడుతుందని దీనివలన తెలుస్తున్నది. ఇదొక అగ్నిపరీక్ష. సీతమ్మకే కాదు...రాముడికి కూడా. "నేనే పతివ్రతనైతే...నాకు తపశ్శక్తి వుంటే.... అదృష్టవంతురాలినైతే..... తార ఉత్తమురాలైతే ....సుగ్రీవుడు సత్యవంతుడైతే.... ఇవన్నీ నిజమైతే" అగ్ని తన సహజ స్వభావాన్ని ఉపసంహరించుకోవాలి. అంతేకాదు...చల్లబడిపోవాలి. అందరిపట్ల అన్ని విషయాలలో కాదు. కేవలం హనుమంతుడి పట్ల మాత్రమే చల్లబడమంది ఆ తల్లి. అంతే చక్కగా చల్లబడ్డాడు. ఆమె అన్న మాటలన్నీ సత్యం అని నిరూపించేశాడు అగ్నిదేవుడు. రామాయణంలో ఇదొక అత్యంత ఆశ్చర్యకరమైన సన్నివేశం. మరొక రహస్యం కూడా వుందిక్కడ. "శీతోభవ" అని సీతమ్మ ఆజ్ఞాపిస్తే అగ్ని విధేయుడై చల్లబడ్డాడు హనుమంతుడి విషయంలో. మరి అలాంటప్పుడు "దగ్ధోభవ దశానన" అని అగ్నిని ఆజ్ఞాపిస్తే రావణుడు బూడిద అయ్యేవాడు కద! అందువల్లనే ఆ తల్లి అన్నది.... "నాకు శ్రీరాముడి ఆజ్ఞ లేదు. అందుకే శపించడం లేదు" అని. రావణుడికి గుండె

పగిలేంత దిగులు పట్టుకుంది దీనివల్ల. అంతేకాదు...ముమ్ముందు సీత అగ్నిప్రవేశం చేయాల్సివచ్చే సమయంలో అగ్ని సీతమ్మను దహింపలేడనే విషయం కూడా ఋజువైంది.

"అష్టాక్షరి" మంత్రంలో "ప్రణవం, నమస్సు, నారాయణ పదం" వున్నాయి. "ప్రణవం" అంటే జీవాత్మ పరమాత్మకే వుపయోగ పడాలనీ, ఆయన సేవకే వినియోగపడాలనీ అర్థం. "నమస్సు" అంటే స్వాతంత్ర్య రాహిత్యాన్నీ, పారతంత్రాన్నీ తెలుపుతుంది. "నారాయణపదం" భగవత్ ప్రియమైన భాగవత సేవను తెల్పుతుంది. భాగవత సేవ భగవత్ ప్రీతికరం. "ప్రణవం"... లక్ష్మణుడు...యావజ్జీవితం అన్నకు శుశ్రూష చేసాడు. సర్వవిధ సేవలు చేసాడు. లక్ష్మణుడిని వాల్మీకి మహర్షి "లక్ష్మణుడు...లక్ష్మీవర్ధనుడు అని సంబోధిస్తాడు. లక్ష్మి అంటే సిరిసంపదలని మనం భావిస్తాం. అలాంటి సిరిసంపదలను లక్ష్మణుడు ఎప్పుడైనా కోరుకున్నాడా? అనుభవించాడా? వాటికోసం ఆరాటపడ్డాడా? అంటే లేదనే సమాధానం వస్తుంది. కాని లక్ష్మి అంటే సేవచేసే భాగ్యం అని మన పెద్దలు తేల్చేశారు. కాబట్టి లక్ష్మణుడు లక్ష్మీవర్ధనుడు. అంటె అతడు భగవదతారమైన శ్రీరాముడి సేవానిరతుడనీ, భగవత్ కైంకర్యాన్ని అవిచ్ఛన్నంగా సాగించే "కైంకర్య లక్ష్మీవర్ధనుడు" అనీ, అర్థం చేసుకోవాలి. "నమస్సు"...భరతుడు...కేవలం పరతంత్రుడై రాముడులేని అయోధ్యలో, వానప్రస్థుడి లాగా ఉన్నాడు. "నారాయణపదం"...శత్రుఘ్నుడు...రామ పరతంత్రుడై, భాగవతుడైన భరతుడికి ప్రీతిగా ప్రవర్తించాడు. ఈ మూడింటినీ ఒక్క సీతాదేవి అనుష్టించి చూపింది. పతి సేవ చేసే స్త్రీనని అగ్నిహోత్రుడికి తెలిపి రామకైంకర్యాన్ని స్థిరపర్చింది. రావణుడిని దగ్ధం చేయననీ, హనుమంతుడి వెంట రాననీ చెప్పి తన పారతంత్ర్యాన్ని ప్రకటించింది. రామదాసుడగు హనుమంతుడికి అపాయం లేకుండా చేసి భాగవత ప్రీతిని కనపర్చింది.

లంకాదహనం చేసిన హనుమంతుడు, ఆ మంటల్లో తగులుకొని సీత కూడా నశించే వుంటుందని భయపడ్డాడు. జానకి అశోకవనంలో వున్నదన్న ఆలోచన లేక, తెలివి తక్కువగా క్రూరమైన పని చేసానని కుమిలి పోతాడు. అయితే, రామానుగ్రహానికి పాత్రురాలై, సత్య వాక్య సంపద వల్ల సమస్త లోకాలనే

జయించే శక్తి గలదై, పాతివ్రత్య మనే తపస్సు చేస్తున్నదైన సీతాదేవి తల్చుకుంటే అగ్నిహోత్రుడినే దహించ గలదని మళ్లీ అనుకుంటాడు. ఇలా అనుకుంటూనే, సీతాదేవి వున్న ప్రదేశానికి పోయి, "శింశుపా వృక్షం" కింద క్షేమంగా వున్న ఆమెకు నమస్కరిస్తాడు. అంటే...సీతాదేవి మాత్రమే క్షేమంగా వుండడమే కాకుండా, ఆమెను ఆశ్రయించిన కారణం వల్ల, శింశుపా వృక్షం, అశోక వృక్షాలతో సహా వాటి చుట్టు ప్రక్కలున్న చెట్లు కూడా కాలిపోక, విరిగిపోక నిల్చి వున్నై. సీతారాములనాశ్రయించిన వారే కాకుండా, వారిని ఆశ్రయించిన వారు కూడా చెక్కు చెదరరనే సత్యాన్ని ఈ సన్నివేశం నిర్ధారిస్తున్నది. విభీషణుడే కాకుండా, ఆయన వెంట వచ్చిన వారందర్నీ రక్షిస్తాడు శ్రీరాముడు. విష్ణు భక్తులను ఆశ్రయించిన పశు, పక్ష్యాదులు, మనుష్యులు కూడా వారి వెంట విష్ణుని పరమపదానికి పోతారు.

సీత రక్షించినా, రాముడు రక్షించినా ఒకటే!

లంక నుండి తిరిగొచ్చిన హనుమంతుడు, తనరాక కొరకు ఎదురు చూస్తున్న వానరుల మనస్సు కుదుట పడేటట్లు రెండే-రెండు మాటలు చెప్తాడు ఆరంభంలో: "చూచితి-సీత" నని. ఆ తర్వాత తాను లంకకు పోయి వచ్చిన విధమంతా, అంతవరకు సుందరకాండలో జరిగిన విషయమంతా, సంగ్రహంగా నివేదించాడు ("దండకం"గా వ్రాసారు వాసుదాసుగారు). ఆ దండకం లో "త్రిజట" వాక్యాలను నమ్మి, రాక్షస స్త్రీలు సీతాదేవిని శరణాగతి కోరినట్లు, ఆమె వారికి అభయ ప్రదానం చేసినట్లు చెప్పాడు. అయితే, తననే రక్షించుకోలేని సీతాదేవి, తనను చెరనుండి తప్పించమని హనుమంతుడుని కోరుకున్న సీతాదేవి, ఇతరులనెట్లు రక్షించగలదన్న సందేహం కలగొచ్చు.

సీతాదేవి తనను తాను కాపాడుకోలేక హనుమంతుడుని ప్రార్థించడం జరగలేదు. అలా అనుకోవడం సమంజసం కాదు. లంకంతా సీతాదేవి పాతివ్రత్యం అనే తపస్సుతో దగ్ధమైందనీ, రామచంద్రమూర్తి నిమిత్త మాత్రుడేననీ, హనుమంతుడు చెప్పాడు. తనను తాను రక్షించుకున్నా, హనుమంతుడు రక్షించినా, రామచంద్రమూర్తికి అపకీర్తి వస్తుందని ఆ ప్రయత్నం మానుకుంది సీతాదేవి.

సీతాదేవి అభయప్రదానం చేస్తూ రక్షించ గలిగినా, ఆ అధికారం తనకున్నదని స్వతంత్రించి చెప్పకూడదు కదా! అంటే సీతాదేవిలో "ఉపాయం" వుందేకాని, "ఉపేయం" లేదన్న సందేహం రావడం కూడా సబబు కాదు. లక్ష్మీనారాయణులు, సీతారాములు, పరస్పర భిన్నులు కారు. లక్ష్మీదేవి భగవంతుడి కరుణా శక్తే! లక్ష్మి రక్షించినా, నారాయణుడు రక్షించినా, సీత రక్షించినా, రాముడు రక్షించినా ఒకటే! రాముడు లేని కరుణ (సీత) రక్షించలేదు. కరుణ (సీత) లేని రాముడూ రక్షించలేడు. కృప రక్షించిందంటే రాముడు రక్షించినట్లే! సీత, లక్ష్మి, కరుణ, కృప, దయ: ఇవన్నీ పర్యాయ పదాలే! అందుకే భక్తులు, లక్ష్మీవిశిష్ట నారాయణుడినీ, సీతావిశిష్ట రాముడినీ ఉపాసించాలని శాస్త్రాలు చెప్పుతున్నాయి. ఒకరి పేరు చెప్పితే రెండవ వారున్నట్లే! సీతతో పనిలేదు....రాముడు చాలుననీ, లేక, రాముడితో పనిలేదు....సీత చాలుననీ అనరాదు. ఎండలేని సూర్యుడు, వెన్నెల లేని చంద్రుడు, అలల్లేని సముద్రాన్ని అనుభవించలేము.

"అహం" భగవంతుడైతే...."అహంత" లక్ష్మీ దేవి అవుతుంది. సీతాదేవి అనుగ్రహించిన వారిని రాముడూ అనుగ్రహించినందు వల్ల ఆమెలో "ఉపాయత్వం" వున్నదనీ, రాక్షస స్త్రీలను ఆమె కాపాడినందు వల్ల ఆమెలో "ఉపేయత్వం" (స్వతంత్ర రక్షణ శక్తి) వుందనీ తెలుసుకోవాలి.

హనుమంతుడు కిష్కిందకు వస్తూనే, రామ, లక్ష్మణ, సుగ్రీవులను చూస్తూ, శ్రీరామచంద్రమూర్తితో, సీతను గురించి సర్వస్వం తెలియ చెప్పే విధంగా, మూడే-మూడు మాటలంటాడు. "నియత-ప్రాణయుక్త-దేవి" అన్న ఆ మూడు మాటలు వింటూనే, సుగ్రీవుడు రామకార్యం ఫలించిందనీ, తన మాట చెల్లించు కున్నాననీ సంతోషిస్తాడు. "నియత": అంటే పాతివ్రత్య నియమం కలదనీ, "ప్రాణయుక్త": అంటే జీవించి వున్నదనీ, "దేవి": అంటే సీతాదేవి అనీ ఆ మూడు మాటలకర్థం. సీతాదేవి ప్రాణాలతో బ్రతికున్నా, శీలం చెడిందయితే చచ్చిన దానితో సమానమైంది కనుక, "శీలం" కలదని (నియత) మొదట అంటాడు. శీలం కలిగిన విషయం నిజమే! చనిపోతే శీలం వున్నా లాభం ఏమిటి? కాబట్టి జీవించే వున్నది (ప్రాణయుక్త) అంటాడు. "దేవి" శబ్దం తనకు

సీతాదేవి మీదున్న భక్తి, గౌరవం చెప్పడానికే! ఆమె మీద హనుమంతుడుకి ఎంత గౌరవం, భక్తీ వున్నాయంటే, శుభ కార్యాలకు పనికిరాని దక్షిణ దిశ కూడా, సీతాదేవి వున్న కారణాన, ఆయనకు వందనీయమయింది. శ్రీరాముడికి, సీత గురించి చెప్పే ముందర, సీతాదేవున్న దక్షిణ దిశగా తిరిగి, వినయంగా శిరస్సు వంచి, నమస్కరించిన తర్వాతనే రాముడితో మాట్లాడుతాడు హనుమంతుడు.

హనుమంతుడు సీతాదేవి ఇచ్చిన చూడామణిని, శ్రీరాముడికి ఇచ్చినప్పుడు, దాన్ని చూసి, అమితంగా దుఃఖించిన రాముడు, అంత దుఃఖంలో కూడా, తనను సీత దగ్గరకు తీసుకు పొమ్మంటాడే కాని, ఆమెనెందుకు తీసుకు రాలేదనికానీ, తీసుకు రమ్మని కానీ అనడు. ఇక హనుమంతుడు రామచంద్రమూర్తికి సీతా వృత్తాంతమే చెప్పాడు కాని, తను పడ్డ కష్టాలను ఒక్కటైనా చెప్పలేదు. చెప్పితే ఆత్మ స్తుతవుతుంది కద!

అందుకే–ఇందుకే, చదవాలి సుందరకాండ. ఈ విషయాలన్నీ ఇంకా వివరంగా తెలుసు కోవాలంటే, తప్పక చదవాలి సుందరకాండను. మళ్లీ–మళ్లీ చదవాలి. అనన్య సామాన్యమైన హనుమత్కాండ ఇది. చదివిన కొద్దీ–ఆస్వాదించిన కొద్దీ, అనేక ప్రశ్నలు, తీరు–తీరు సమాధానాలు పుట్టుకొస్తాయి. సుందరకాండ ఎందుకు చదవాలని మొదలెట్టి, పూర్తిగా చదివిన వారికి, ఇన్నాళ్లూ ఎందుకు చదవకుండా వున్నామా అన్న వెలితి క్షణంలో పోతుంది. చదవాలనే జిజ్ఞాస వున్నవారికి, చదివితేనే తెలుస్తుంది ఎందుకు చదవాలనే విషయం.

సుంరరకాండ "పీఠిక"లో, శ్రీ వాసుదాస స్వామి గారు చెప్పినట్లు, సంస్కృత రామాయణం అర్థం గ్రహించి, పారాయణం చేస్తే సర్వ శ్రేయస్కరం. అలా కాకుండా, మూలమందున్న విషయ సారాంశమంతా వున్న "ఆంధ్రవాల్మీకి రామాయణం, సుందరకాండ మందరం" పారాయణం చేసినా అంతే శ్రేయస్కరం. ఇది అనుభవపూర్వకంగా ఎందరో మహానుభావులు, మాన్యులు, సామాన్యులు, ధీమాన్యులు కూడా నిర్ధారించిన వాస్తవం. అందుకే చదవాలి వాసుదాస స్వామివారి మందరం మనమందరం...మనం అందరం!

"అర్థం తెలియని చదువు వ్యర్థం....అర్థం తెలీక పోతే మనసు రంజిల్లదు" అని శ్రీ వాసుదాసు గారు అన్నట్లు, సుబోధమగు ఈ గ్రంథాన్ని ఈరీతిలో–" సుందరకాండ మందర మకరందం"– పఠించినా సత్ఫలితాలు శ్రేయ పరంపరలు కలుగుతాయి. ఇది చదివిన వారికి భగవంతుడైన శ్రీరామచంద్రుడు మేలు చేయాలని శ్రీ సీతారాముల చరణ కమలాల మ్రోల సాగిలపడి వేడుకొంటున్నాను.

సుందర హనుమంతుడు నిజంగా సుందరుడే

శ్రీమద్రామాయణంలోని ఏడు కాండలలో సుందరకాండ ఉత్తమోత్తమమనీ, సకలాభీష్ట ప్రదమనీ ఆర్యుల విశ్వాసం. అందుకే శ్రద్ధా భక్తులతో ప్రతిరోజు పారాయణం చేస్తూ కృతార్థులవుతున్నారనే సంగతి అందరికీ తెలిసిందే. సుందరకాండ పారాయణం చేస్తే, వ్యాధులు, కారాగృహ బంధనాలు, గ్రహపీడలు, సంతానం లేమితనం, దారిద్ర్య సంబంధమైన కష్టాలు తొలగిపోవడంతో పాటు భక్తి–ముక్తి కలుగుతుంది. ఇది మూఢ విశ్వాసం కానేకాదనీ, సహేతుకమనీ ధృవపడింది.

రావణాది రాక్షసుల మూలాన, హీనస్థితి చెందుతున్న ధర్మాన్ని వుద్ధరించడానికీ, రాక్షస సంహారం చేయడానికీ, శ్రీమన్నారాయణుడు, శ్రీరామచంద్రమూర్తిగా అవతరించిన విషయం వాల్మీకి స్పష్టంగా తెలియచేసాడు.

ఇతర దేవతలందరికంటే, అన్ని అవతార మూర్తులకంటే శ్రీరాముడిలో వాత్సల్యం, అభయ ప్రదానగుణం, సౌశీల్యం, కారుణ్యం, సత్యసంధత విశేషంగా వున్నాయి. శ్రీరామచంద్రమూర్తి శీఘ్రంగా అభీష్టాలను ప్రసాదిస్తాడనీ, సీతమ్మ అంతకంటేననీ అందరి నమ్మకం."స్మరణమాత్ర సంతుష్టాయ" అనే శ్రీరామ కవచంలోని వాక్యాలను గుర్తుచేసుకోవాలి. ఇట్టి శ్రీరామచంద్రుడి కంటే గూడా ప్రేమస్వరూపిణి సీతాదేవి క్షిప్రప్రసాదిని. అంటే అప్పటికప్పుడే అనుగ్రహించగల అనురాగమయి సీతమ్మ.

రావణాసురుడు దేవతా స్త్రీలను, మానవ స్త్రీలను చెరపట్టి పతివ్రతలను చెరుస్తూ దుఃఖ పెడ్తుంటే శ్రీమహాలక్ష్మి సహించలేక పోయింది. ఆకారణాన

వేదస్వరం నుండి వేదవతిగా–అయోనిజగా జన్మించి రావణాసురుడిని శపిస్తుంది. మళ్లీ అయోనిజై సీతగా పుట్టి శ్రీరాముడిని పెళ్లాడి ఆయనతో అడవులకు వెళ్తుంది. రావణాసురుడిని చంపేందుకు ఒక కారణం కావాల్సినందున, జింకను పట్టి తెమ్మని భర్తను కోరుతుంది. రావణుడి చేతికి చిక్కి వాడిని చంపగలిగిన శక్తి వున్నప్పటికీ, తాను ఆ పని చేయక, భర్తతో అతడినీ–అతడి వారందర్నీ చంపించి ముల్లోకాలకు ఆనన్దం కలిగిస్తుంది.

ఇక ఉత్తర కాండలో ప్రస్తావించబడిన విషయానికొస్తే.....రామాజ్ఞ ప్రకారం లక్ష్మణుడు సీతాదేవిని వాల్మీకి ఆశ్రమ సమీపంలో వదులుతాడు. ఏటివొడ్డున ఆమె ఒంటరిగా దుఃఖిస్తుంటే చూసిన వాల్మీకి శిష్యులు ఆయనకీ విశయం తెలియచేస్తారు. తన యోగదృష్టితో జరిగిందంతా తెలుసుకొన్న వాల్మీకి పాదుకలైనా ధరించక, పరుగున పోయి సీతను పూజించి తన వెంట తీసుకునివచ్చి ముని భార్యలకప్పగిస్తాడు. సీతాదేవి మహిమను, అమెపై పడ్డ నిందను గ్రహించిన వాల్మీకికి అంతులేని పరితాపం కలుగుతుంది. ఆ పతివ్రతా శిరోమణిపై నింద వేయడం సరికాదనీ, ఆమె వృత్తాంతాన్ని జగద్విదితం చేయాలనీ, నిందను తొలగించాలనీ వాల్మీకి సంకల్పిస్తాడు. తన సంకల్పాన్ని కార్య రూపం ధరింపచేసే విధానాన్ని నారదుడి వల్ల రహస్యంగా ఉపదేశం పొంది, రామాయణంగా రచించి, సీతాదేవి పుత్రులతో సభల్లో పాడించి, ఆమెను పరీక్షకు నిలువచేసి, ఆమెకు కల్గిన అపకీర్తిని తొలగిస్తాడు వాల్మీకి మహర్షి. సీత అవతారమూర్తని ముల్లోకాలలో ప్రసిద్ధం చేసాడు. ఆమెను లోకపావని అని సంభావిస్తాడు.

రామాయణం ఏడు కాండలు పూర్తిగా శ్రద్ధగా చదివిన వారికి స్ఫురించే విషయం రాముడిపై వాల్మీకికున్న అపార భక్తి–గౌరవాలు. అంతకు మిక్కిలిగా సీతపై వున్న భక్తి భావన. అందుకే సీతను అధికరించి చెప్పబడిన సుందరకాండ అన్ని విధాలుగా సుందరంగానూ, సారవంతంగానూ తీర్చిదిద్దుతాడు వాల్మీకి. "పరాశర సంహిత"లో చెప్పినట్లు, సుందర హనుమంతుడు నిజంగా సుందరుడే. సీత అతి రూపవతి, త్రిలోక సుందరి. అందుకే, సుందరులనధికరించి చెప్పిన కాండ సుందరకాండగా పిలువబడ్తున్నది. భగవత్ సౌందర్యం కూడా వర్ణించబడింది సుందరకాండలో.

గజేంద్రుడికి మోక్షం ప్రసాదించిన భగవంతుడిని, రాక్షసుల బాధలనుండి తమను విముక్తులను చేయమని దేవతలు ప్రార్థిస్తే, ఆయన శ్రీరామచంద్రమూర్తిగా భూమిపై అవతరిస్తాడు. అనంత కళ్యాణగుణాలన్నీ శ్రీరాముడిలో వున్నాయని రామాయణంలోని ప్రతి కాండలో వర్ణిస్తాడు వాల్మీకి. జగత్సంహారకశక్తి ఒక్క శ్రీరాముడి లోనే కలదని సుందరకాండలో చెప్పబడింది. భగవంతుడగు శ్రీమహావిష్ణువు తన మాయ చేత ఎన్నోరూపాలు ధరించగలడనీ, వహించగలడనీ రామాయణంలో చెప్పడం జరిగింది.

"అర్థ పంచక జ్ఞానం" "ఆచార్యుల" ద్వారానే కలుగుతుందని హనుమంతుడి చర్య వలన బోధపడ్తుంది. ప్రాప్యమగు బ్రహ్మ స్వరూపం, జీవాత్మ స్వరూపం, ఉపాయ స్వరూపం, ఫల స్వరూపం, విరోధి స్వరూపమనే అర్థ పంచక జ్ఞానం సుందరకాండలో నిరూపించబడింది.

దశ-ఇంద్రియ అధిష్ఠితమైన దేహమే లంక. ఆహంకార, మమకారాలు రావణ-కుంభకర్ణులు. ఇంద్రజిత్తు, ఇతరులు కామ, క్రోధాలు. వీటిలో బంధించబడిన చేతనుడే సీత. వివేకమే విభీషణుడు. భగవంతుడు తన్ను రక్షిస్తాడో లేడో అన్న సందేహంతో పరితపిస్తున్న చేతనుడికి అర్థ పంచక జ్ఞానాన్ని కలిగించి ఉద్దీపింప చేసిన విధానం హనుమంతుడి చర్యవలన విశదమవుతుంది.

సంసారాన్ని తరించగోరి, ఆత్మవిచారం చేసే యోగికి అవసరమైన అభ్యాసాదివిధం హనుమంతుడి చర్యవలన తెలుసుకోవచ్చు. హనుమత్స్వరూపే మనస్సు. యోగానికి ఎనిమిది అంగాలు: "యమము, నియమము, ఆసనము, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం- సమాధి". వీటిలో మొదటి అయిదు బాహ్యాంగాలు.

"అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం" అనేవి యమములు. "శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయం, ప్రణిదానం" అనేవి నియమములు. పద్మాసనాదులే ఆసనాలు. శ్వాసబంధమే ప్రాణాయామం. ఇంద్రియాలను విషయాలలో వ్యాపించనీయక లోనికి ఆకర్షించి చిత్తంలో నిలపడమే ప్రత్యాహారం.

“యమ–నియమములు”హనుమంతుడికు వుండడం సుప్రసిద్ధం. అభ్యాసమందు ప్రాణాయామం కంటే ప్రత్యాహారం కష్టసాధ్యం. ప్రాణాయామ దశలో, తానింత లావు–పొడవు కలవాడినన్న స్థూల దేహజ్ఞానముండవచ్చు. ప్రత్యాహార దశకు చేరుకునేటప్పటికి, దేహం అతి స్వల్పమైనట్టుగ భావించి, దేహసంధులన్నీ తొలగించి, సడలించిన గాని, ప్రత్యాహారం సాధ్యం కాదు. ఉదాహరణకు హనుమంతుడు పిల్లి ఆకారంలోకి మారడం. అదేవిధంగా ఎంత మెల్లగా మనస్సును లోనికి ప్రవేశింప చేయాలన్న పట్టుదల వున్నప్పటికీ, ఏదో ఒక ప్రతిబంధకం అడ్డుపడే అవకాశం వుంది. ఉదాహరణకు లంకా రాక్షసి.....దాన్ని జయిస్తేనేగాని ఆత్మ దర్శనం సాధ్యపడదు. ఆత్మసాక్షాత్కారం పొందిన పెద్దల ద్వారానూ.....ఉదాహరణకు సంపాతి, శ్రుతివలన, ఆత్మ హృదయగుహలో వున్నట్లు తెలుసుకోవచ్చు. అయినప్పటికీ దానిని కనులారా కనుగొనాలంటే,హనుమంతుడు చేసిన రీతిలో, రాత్రి వేళ ఆయన శ్రమించిన రీతిలో, మరల–మరల శ్రమించాల్సి వుంటుంది. ఇలాంటప్పుడు కూడా భ్రాంతి (మండోదరి) దర్శనం లాంటి విఘ్నాలు సంభవించవచ్చు. ఈ గండాలన్నీ గడిస్తేనేగాని ఆత్మదర్శనం కలగదు. అదేమాదిరిగా, సీతాసంభాషణ, లంకా దహనం, వానరులతో సీతావృత్తాంతం చెప్పడం, సీతాదేవిపై భక్తి, ఇవన్నీ సాధకులకు అనుభవ గోచరాలు.

సీతాదేవికున్న ఒకే ఒక కోరిక, రామసమాగమం. అది అనన్యసాధ్యం. రాముడు ఎట్లాగైనా తన్ను రక్షిస్తాడని ఆమె నమ్మకం. అందుకే హనుమంతుడు ప్రాధేయపడినా ఆయనతో వెళ్లడానికి ఇష్ట పడకుండా వుంటుంది. అంగీరించలేదు కూడా.

యోగ మార్గంలో సంచరించేవారికి ప్రధమ విఘ్నం తన హితులు–సన్నిహితుల వల్లనే కలుగుతుంది. దాన్నే “సాహాయిక రూప విఘ్నం”అంటారు. అది విఘ్నమే కాబట్టి అభ్యాసి దాన్ని ఆమోదించ కూడదు, అంగీకరించనూ కూడదు. ఉదాహరణకు మైనాకుడి చరిత్ర. ఆ పరీక్షలో నెగ్గిన తర్వాత, అభ్యాసి శుద్ధ శక్తిని పరీక్షించేందుకు దేవతలే విఘ్నం కలిగిస్తారు. ఉదాహరణకు సురస వృత్తాంతం. దానికీ లోను కాకూడదు. ఇది కూడా గెల్చిన తర్వాత భూత

గ్రహాలు పీడిస్తాయి (సింహిక వృత్తాంతం). ఇట్టి యోగసిద్ధిని హనుమంతుడు పరభక్తి సాధనంగా చేసుకున్నాడు.

సుందరకాండలో ప్రధమాక్షరం "త" (తతో రావణీతాయా). కడపటి అక్షరం కూడ "త" (తతో మయా వాగ్భిరదీ నభాషిణా). ఇది "తత్" అనే దాన్ని బోధిస్తుంది.

అదే విధంగా సుందరకాండలో ప్రతి సర్గలో మొదటి అక్షరం "స"కారమో, "త"కారమో వుంటుంది. లేదా "సీత" శబ్దం కాని, పర్యాయ పదం కాని వుంటుంది. అదీ తప్పితే రెండవ శ్లోకం మొదటి అక్షరం "స–త" తప్పదు. ఈ "స–త"లు "సీత"ని సూచించడం స్పష్టంగా తెలుస్తోంది. సీతే కద సుందరకాండకు అధిష్టాన దేవత. వీటిని పర్యాలోచించి చూస్తే, సుందరకాండ పఠనం వల్ల భుక్తి–ముక్తి కలుగుతుంది అని అర్థమవుతుంది. కాకపోతే శ్రద్ధ–భక్తి వుండాలి. ఇహ పర సాధనానికిది మార్గాన్ని సుగమం చేస్తుంది.

సంస్కృత రామాయణం అర్ధం గ్రహించి పారాయణం చేస్తే సర్వ శ్రేయస్కరం. ఆంధ్రవాల్మీకి రామాయణం పారాయణం చేసినా అంతే శ్రేయస్కరం. అయితే, అర్ధం తెలియని చదువు వ్యర్థం. అర్ధం తెలీక పోతే మనసు రంజిల్లదు. మనసు రంజిల్లక పోతే భక్తి కుదరదు.

అందుకే సుబోధకమగు ఈ గ్రంథాన్ని ఈరీతిలో పఠించే వారికి కూడా సత్ఫలితాలు కలుగుతాయి. మూలమందున్న విషయ సారమంతా దీంట్లో కూడా వుంది. ఇది చదివిన వారికీ, పారాయణం చేసినవారికీ, భగవంతుడు సకల శ్రేయస్సులు ఒసంగుననీ, తద్వారా దైవభక్తి లోకంలో వర్ధిల్లుననీ..... శ్రీరామచరణానందుడు, భక్తచరణ పరచరణుడు, వాసుదాసస్వామి, భగవంతుడినీ, శ్రీరామచంద్రుడినీ ప్రార్థించారు.

వాసుదాసు తొలిపలుకులు

సుందరకాండలో వివరించబడిన రెండు ప్రధాన విషయాలు: సీతాదేవిలో కనిపించిన ప్రేమ, ప్రవృత్తి. ఓడ నడిపేవాడికి ధనరూపంలో కూలి ఇచ్చినట్లే, శ్రద్ధాభక్తులనే కూలిని భగవంతుడికియ్యాలి. సంసారాన్ని దాటాలన్న కోరికున్నవారికి ఇది అత్యంత ఆవశ్యం. ఆ కూలివ్వకపోతే భగవంతుడు నావను

దాటించడు. సంసారమనే నావను దాటితే లాభమేమిటని ప్రశ్నించే వారికి, దొరికే జవాబు మోక్షమనే సుఖం.

హనుమంతుడు "మహాయోగి-మహాజ్ఞాని" అనే విషయం నిర్వివాదం. అంతటి ఘనుడు కూడా, లంక వెళ్లేటప్పుడు రామ ముద్రికను, వచ్చేటప్పుడు సీతమ్మ చూడామణిని తోడుంచుకుని మరీ సముద్రాన్ని దాటుతాడు. లంకలో వున్నంత సేపూ భగవత్ దాస్యం "యోగ-జ్ఞానాల" కంటే కూడా గొప్పదని నమ్మాడు. "దాసుడ రామచంద్రునీ" కని, రహస్యంగా అనకుండా, దిక్కులు మారుమ్రోగేటట్లు చాటి చెప్పాడు. "రామదాసుడ"నని ఎప్పుడు హనుమంతుడు అన్నాడో, అప్పుడే, హనుమంతుడుకి చల్లదనం కలిగించాలని అగ్నిహోత్రుడిని అజ్ఞాపిస్తుంది సీతమ్మ తల్లి. తన స్వభావం మానుకోలేనని రామచంద్రుడితో సముద్రుడనగలిగాడు కానీ, సీత అడిగినప్పుడు కాదనే ధైర్యం అగ్నిహోత్రుడికి లేకపోయింది. రామబాణం కంటే కూడా, సీతాదేవి వాక్కు అమోఘమనే అర్థం దీనివలన స్పష్టమవుతోంది.

"శ్రీరామదాసోహ"మనే షడక్షర మంత్రం హనుమంతుడికి లంకలో ఎలాంటి బాధలు కలగకుండా రాక్షసులను జయించడానికి తోడ్పడింది. అందుకే, శ్రీరామదాసోహమని ఎవరన్నప్పటికీ, వారిని సంసారసాగరం దాటించి రామపాద సన్నిధికి చేర్చగలదా మంత్రం. షడక్షరమంత్ర మహిమ తెలుసుకోవడం ఎవరి తరమూకాదు.

"శ్రీ-సీత" శబ్దాలను పరిశోధన చేస్తే, దేవతల్లో, మనుష్యులలో, పశు, పక్ష్యాదులలోని మగవారి పేర్లన్నీ విష్ణుమూర్తివిగానూ, ఆడవారి పేర్లన్నీ లక్ష్మీదేవివి గానూ విశదమవుతుంది. లక్ష్మీనారాయణులు, సీతారాములు, ఇరువురూ సమానులే. లోకంలో పురుష వాచకాలన్నీ "రామ" అనీ, స్త్రీ వాచకాలన్నీ "సీతాదేవి"అనీ, ముల్లోకాల్లో వీరిరువురికంటే వేరైందేదీలేదనీ తెలుసుకోవాలి.

చేతనాత్మక తత్వాన్నీ, లక్ష్మీనారాయణుల సమత్వాన్నీ, చిద-చిదీశ్వర తత్వాలను, మూడింటినీ కూడ, "శ్రీ-సీత" శబ్దాలను పరిశోధిస్తే విశదమవుతుంది. ఈమూడింటి ఏకీభావం, ఇంతకంటే పరమైన మహాత్మ్యం కలిగిందేదీ లేదన్న విషయం కూడా బోధపడ్తుంది. భగవంతుడంటే "ఆనందం-నిశ్చయం" అనే

శ్రుత్యర్థం కూడ సీత శబ్దం బోధిస్తుంది. అంటే, "స"కారానికి, స్త్రీ లింగ రూపం "సీ" కాబట్టీ, "సీ" శబ్దానికి భగవతి–లక్ష్మీదేవి అనే అర్థం కూడా స్ఫురిస్తుంది. అలాగే "త"కారానికి "నిశ్చయ"మనే భావం, "త"శబ్దానికి "దయ" అనే అర్థం ఏర్పడుతోంది. సీతాదేవి ఎంతటి దయావతో రామాయణం చదివేవారికి వేరే చెప్పాల్సినపనిలేదు.

సీతా శబ్దం లాగానే, "స"కార, "త"కార శబ్దాలతో, "సతీ"–" సత్"–"సేతు"–"సత్య" అనేవి కూడా వున్నాయి. వీటికీ సీతాదేవికీ సంబంధం వుండవచ్చు కదా! సతీ శబ్దం సాధారణంగా పతివ్రతకు పేరు. అలానే దర్శన మాత్రాన్నే పాపాలు పోగొట్టేది "సతి". ఇది సామాన్య సతుల లక్షణం. అందు సీతాదేవి ఎట్టి సతియో రామాయణం చదివేవారికి చెప్పాల్సిన పనిలేదు. ఒక్కసారి ఆమె కటాక్షం మనమీద పడ్డా, ఆమె దర్శనం మనకొక్కసారి కలిగినా, మన పాపాలన్నీ నశించి, కృతకృత్యులమవుతామన్న విషయంలో సందేహం ఏమాత్రం లేదు. ఆమె దర్శన ప్రాప్తి లేనప్పుడు అట్టి పుణ్యాత్మురాలి చరిత్ర పఠించినా సర్వపాపాలు హరించి పోతాయికదా! అందుకే చదవాలి సుందరకాండ.

నీళ్లు వృధాగా పోకుండా రెండొడ్డుల నడుమ అడ్డంగా నిర్మించే కట్టను "సేతువు" అంటారు. కట్టలు నిర్మించే ఉద్దేశ్యం నీళ్లు వ్యర్థం కాకుండా పైర్లు వృద్ధి చేసుకోవటమే కదా? అదే విధంగా సీతాదేవిని మనం ఆశ్రయిస్తే, మన జన్మ ప్రవాహాలు వ్యర్థమై పోకుండా ఫలవంతమయ్యేటట్లు చేసి, ఐహిక సుఖాలు కలిగిస్తాయి. "సేతు"వుకు మరో అర్థం…ఈ ఒడ్డున వున్నవారు ఆవలి ఒడ్డుకు పోవటానికి అవసరమైన నిరపాయ సదుపాయం. సీతాదేవి కూడా, భగవత్ ప్రాప్తి కోరి, తనను ఆశ్రయించే వారికి సేతువు లాంటిదే. కాబట్టే ఆమెను పురుషకారంగా భక్తులు–ప్రపన్నులు ఆశ్రయిస్తారు. పురుషకారం అంటే మన యోగ్యతలతో నిమిత్తం లేకుండానే, స్వామి వారికి, మనల్ని గురించి మంచి మాటలు చెప్పి మేలు చేయడమన్నమాట!

ఇక "సత్య" పాదంలోని "స"కారానికి "జీవుడ"నీ; "త"కారానికి "పరబ్రహ్మమ"నీ; "య"కారానికి ఈ రెండింటినీ చేర్చే శక్తి అయిన "లక్ష్మి"అనీ అర్థం. కాబట్టి లక్ష్మీదేవే "జీవాత్మ"ను, "పరమాత్మ"తో చేరుస్తుందని అర్థం.

మనకు గోచరించేది జీవుల తోను, ప్రకృతి తోను వుండే "చిదచిద్విష్ఠం". ఈ రెంటికీ అంతర్యామి ఈశ్వరుడు. ఆయన మన కంటికి కనిపించడు. అయినా మనం చేరవలసింది ఆయన్నే. చేరేదెట్లా అనేదే ప్రశ్న. ఆయనో గృహస్తుడి లాంటి వాడు. జీవ, ప్రకృతులే గృహం. ఆ గృహంలో ఆయన తన ఇష్టులతో, శిష్టులతో సంతోషంగా కాలక్షేపం చేస్తుంటాడు. గృహ కృత్యాలను ఆయన భార్య నిర్వహిస్తుంది. పతివ్రత కాబట్టి ఆమె తన భర్తకు, ఏ విచారం కలుగకుండా, ఆనందంగా కాలం గడిపే అవకాశం కలిగిస్తుంది. అట్టి భార్యే లక్ష్మీదేవి. భర్తను విడిచి పెట్టకుండా సర్వదా ఆయనకు ఆనందం కలిగించే రీతిలో వ్యవహరిస్తుంటుంది. ఆయన అభిమతానికి అనురూపంగా ప్రవర్తిస్తుంటుంది. ప్రపంచ వ్యవహారం నిర్వహిస్తుంది కూడా. "జీవ,ప్రకృతులు" ఆమె ఆజ్ఞానుసారం వర్తించేవే. ఇందు "జీవులు" బిడ్డలు. ఇల్లు, ఇంటి చుట్టూ వున్న తోటలోని వినోద వస్తువులే "ప్రకృతి". బిడ్డలు తోటలో ఆడుకున్నంత సేపు ఆమె తన పనిలో నిమగ్నమై వుంటుంది. బిడ్డలు ఆటలు చాలించి ఆకలితో ఎప్పుడొస్తారో అప్పుడు అమ్మ, వారిని లోనికి పిల్చి, తగిన ఆహారం ఇస్తుంది. ఇవన్నీ గ్రంథాల్లో స్పష్టంగా చెప్పిన విషయాలే. బిడ్డలు మళ్లీ ఆటలకు పోకుండా మాతా, పితల సేవలో దిగితే, వారిని తండ్రికి అప్పగించి, ఆ సేవలోనే వుంటుంది. బిడ్డలకు అపాయం కలగకుండా అవసరమైన వారిని ఏర్పాటుచేసే బాధ్యత తండ్రిది. ఇదే "అంశావతారం". ఒకవేళ ఆ అపాయం కష్ట సాధ్యమైన కార్యమైతే స్వయంగా తానే బయలుదేరి, భార్య దగ్గర తగు పరికరాలను తీసుకొని, అవసరమైన వేషం ధరించి, అపాయాన్ని తప్పించి, వేషం మార్చుకుంటాడు. ఇదే "పూర్ణావతారం".

భర్తకొరకు వచ్చి ఆయన్ను కలవదల్చుకున్న వారెవరైనప్పటికీ, భార్య అనుగ్రహించి తలుపు తీసి, దారి చూపేవరకు ప్రవేశించలేరు. ఈ తలుపు తానైనా తీస్తుంది....లేదా....భర్త పంపిన వారితోనైనా చేయిస్తుంది. అలా పంపబడినవాడే "ఆచార్యుడు". మనం స్వశక్తితో ఎంత కాలమైనా, ఎన్ని కల్పాలకైనా లోనికి పోలేం. మన ఏడ్పులు విని, ఆమె మనస్సు కరిగి తలుపులు తీస్తేనే మనం లోపలికి పోగలుగుతాం. ఇంతకు మించి వేరే మార్గం లేదు.

"తలుపులు" అనే నామ రూపాలతో వ్యాపించి ఉన్న దాన్నే "మాయ"అనీ, "ప్రకృతి" అనీ, "కర్మ"అనీ, రకరకాలుగా పిలుస్తారు. ఇదంతా శ్రీదేవి చిద్విలాసం. కాబట్టి భగవత్ ప్రాప్తి కోరేవారికి శ్రీదేవి అనుగ్రహం అనివార్యం. భగవంతుడు పంపిన ఆచార్యుడు కూడా, ఈమె అనుగ్రహం లేందే ఏపనీ చేయలేడు. బయటకు పోనూలేడు, లోనికి రానూలేడు. కాకపోతే, శ్రీదేవి భర్త సంకల్పం ప్రకారమే సమస్త కార్యాలు చేస్తుందే కాని ఆయన ఆజ్ఞను అతిక్రమించి ఏమీ చేయదు.

కావున భగవత్ సంకల్పమే "శ్రీ" ...."శ్రీ"యే భగవత్ సంకల్పం. భగవత్ సంకల్పం, ఆ వ్యవహారం అంతా ఈమె మూలాన్న జరగాల్సిందే. భగవత్ కరుణాస్వరూపిణైన ఈ శక్తినే సాత్వికులు "శ్రీ"అనీ, "లక్ష్మి"అనీ కొలుస్తారు. రామ కటాక్ష ప్రాప్తికి సీతానుగ్రహం అవశ్యం.

సుందరకాండ పఠించే వారు ప్రత్యుత్తరం కోరి చదవ వలసిన కొన్ని ముఖ్య విషయాలు:

★ బద్ధ జీవ తారతమ్యం

★ లంకలోవున్న రాక్షస స్త్రీలు

★ చెరనుండి తప్పించుకోదలచీ ఆ పని చేయలేని దేవతా స్త్రీలు

★ కర్మవశాత్తు లంకకు చేరి, అందు లగ్నం కాక, ప్రసన్నయై భగవత్ సహాయంతో తప్పించుకున్న సీత

★ యధేచ్ఛగా లంక ప్రవేశించి, అందులో చిక్కుకోకుండా, దాన్నే దగ్ధం చేసిన హనుమంతుడు (వీరు మహాత్ములు–ఋషులు)

పైన వివరించబడిన నాలుగు విధాలైన జీవాత్మలు సుందరకాండ లో కనిపిస్తారు.

★ జీవాత్మ–పరమాత్మలకు గల సంబంధం సీతారాముల సంబంధం లాంటిది

★ జీవాత్మ తరణోపాయం....ఇది సీతాదేవి చర్య వలన అర్థమవుతుంది.

★ శిష్య–ఆచార్య లక్షణాలు....ఇది సీత–ఆంజనేయ చర్యవలన తెలుస్తుంది.

★ జీవాత్మలకు సేవ్యుడు నిర్విశిష్ట రాముడా? సీతావిశిష్ట రాముడా?.....ఇది హనుమంతుడి చర్యవలన విశదమవుతుంది.

★ ఆత్మావలోకన పరుడైన యోగి లక్షణం హనుమంతుడి చర్యవలన తెలుస్తుంది.

★ సీతాదేవి ఉపాయమా? ఉపేయమా?....రెండూనా?

★ యోగికి, ప్రపన్నుడికి భేదమేంటి?

ఈ ముఖ్య విషయాలన్నింటికీ ప్రత్యుత్తరం సుందరకాండలో దొరుకుతుంది. ఎన్నిసార్లు సుందరకాండ చదివితే అంత వివరంగా సమాధానాలు దొరకుతాయి. ఇక సీతా, హనుమంతులను విడిచినవారికి రామచంద్రుడి అనుగ్రహ ప్రాప్తం కలుగదు. సుందరకాండ ఈ ఇరువురి చరిత్రే. అందుకే పలువురి ఆదరణకు నోచుకున్నది. పారాయణ రూపంలో జనావళిచే ఆదరించబడుతున్నది. వారి, వారి అభీష్టాలను నెరవేర్చి సంతోషపెట్టేదీ సుందరకాండ. సుందరకాండను వాసుదాస స్వామి శ్రీరామచంద్రమూర్తికి విన్నవించేటందుకు ఆయన్ను సంబోధిస్తూ: "శ్రీదేవికి నివాస స్థానమైనవాడా! సంసార సాగరాన్ని దాటేందుకు "గురువు" అనే గొప్ప పడవను నడిపేవాడా! అట్టి సాగరాన్ని దాటేందుకు కావాల్సిన శ్రద్ధా భక్తులను అనుగ్రహించువాడా! శాశ్వత సుఖాన్నిచ్చేవాడా! జానకీదేవి హృదయకమలములందు నివసించేవాడా!" అని అంటారు.

సంసారి చేతనుడిని ఉద్ధరించేందుకు ఆచార్యుడు చేసే ప్రయత్నం, దూత కృత్యం, పతివ్రతా లక్షణం, వివరంగా సుందరకాండలో చెప్పడం జరిగింది.

❖ ❖ ❖

సర్గ-1

సుందరకాండ పారాయణ కథా ప్రారంభం
మహేంద్ర పర్వతంపై విహరించిన హనుమంతుడు

మంత్ర మాతృక అయిన గాయత్రీ మంత్ర దివ్య విన్యాసం ఆద్యంతాలూ నింపుకున్న ఇంపైన కాండ సుందరకాండ. ఈ కాండ "త" కారంతో మొదలై, "త" కారంతోనే ముగుస్తుంది. "తరువాత రావణాసుర" అనే పద్యంతో వాసుదాసు గారి సుందరకాండ మొదలవుతుంది. శిష్యుడున్న చోటు వెతికే ఆచార్య స్వరూపం ఇందులో విశదీకరించడం జరిగింది. భగవదనుజ్ఞ లేకుండాఎవరు కూడా ఆచార్యత్వం నెరపలేరన్న విషయం కూడా ఇందులో స్పష్టం చేయడం జరిగింది. అదే విధంగా దూత అనేవాడు, తన స్వామి చెప్పిన మాటలను తెలియచేయడంతో పాటు, శత్రువులు నిరోధించినప్పటికీ, ఎదుర్కొని, విజయవంతంగా తిరిగొచ్చి తాను చేసిన పనులను నివేదించగల వాడై వుండాలనే వ్యంగార్థాన్ని ఇది ధ్వనిస్తుంది. ఇందులో గురు లక్షణాలూ చెప్పబడ్డాయి. హనుమంతుడికి భగవదనుజ్ఞ వుందనడానికి గుర్తు, శ్రీరాముడు ఆయనకిచ్చిన తన ముద్రికే!

"శ్రుతి, స్మృతి, సదాచారం, స్వప్రియం, శీలం" అనేవి ధర్మ నిర్ణయానికి ప్రామాణికాలు. రావణుడి అంతఃపురంలో ఎందరో స్త్రీలను చూసినప్పటికీ హనుమంతుడి మనస్సు చలించదు. లంకాదహనం, అక్షకుమారాది వధ, గురుచారణ మార్గంలో జరిగినవని అనడంలో అర్థం: దూత కృత్యం ధర్మ మార్గానికి అవిరోధంగా చేయడమే! హనుమంతుడికి రామాజ్ఞ వుంది. అది రామాజ్ఞ కాబట్టి వేదానుశాసనమే! ఇలా ఎన్ని రకాలుగానో, హనుమంతుడిలో పరిపూర్ణమైన ఆచార్య లక్షణాలు కలవన్న విషయం తెలియచేస్తూ, అట్టి వాడికే శిష్యాన్వేషణ ఫలిస్తుందన్న సంగతి చెప్పడం జరిగింది. సుందరకాండలో శిష్య లక్షణమూ చెప్పడం జరిగింది. శిష్యుడి ప్రథమ లక్షణం "సీత" లాగా వుండడమే!

జాంబవంతుడి ప్రేరణతో వానరులతో కూడి హనుమంతుడు మహేంద్ర పర్వతాన్ని ఎక్కుతాడు. అక్కడినుండి లంకకు వెళ్లాలన్నదే ఆయన సంకల్పం.

దానిని కార్యరూపంలోకి తేవడానికి సిద్ధపడ్డాడు హనుమంతుడు. రామదూత, శత్రు సంహారకుడైన హనుమంతుడు, రావణుడు అపహరించిన సీతాదేవిని లంకలో వెతికేందుకు ఆకాశ మార్గాన అక్కడకు ప్రయాణమవుతాడు. రావణ నీత అయిన సీతను అన్వేషించేందుకు సిద్ధపడుతున్నాడప్పుడు. సీతాదేవిలాంటి పతివ్రతా శిరోమణి పాద దర్శనం కలిగినా తాను కృతకృత్యుడైనట్లేనని ఆంజనేయుడి భావన. దీనివలన సీతా మహాత్మ్యం, హనుమంతుడి భక్తి, వినయాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. భక్త ప్రపన్నులకు సీతారాములిద్దరూ సేవ్యులే కదా!

హనుమంతుడు తాను పయనించాల్సిన మార్గాన్ని ఒకసారి తేరిపార చూశాడు. తల, మెడ నిక్కపొడిచి, మదించిన కోడెనాగు లాగున్న హనుమంతుడు అత్యంత సుందరాకారుడిలాగా కనిపించాడప్పుడు. ఏ కాలంలో, ఏ దేశంలో, ఎవ్వరికీ సాధ్యపడని ఓ ఘనకార్యం చేయాలన్న తలంపు హనుమంతుడి మనస్సులో కలిగింది. వానర శ్రేష్ఠుడైన హనుమంతుడు దీర్ఘంగా ఆలోచిస్తూ ముందుకూ, వెనుకకూ తిరుగుతాడు. పక్షులను బెదిరించాడు. జంతువులను అదిలించాడు. రొమ్ము, నుదురుతో తాకుతూ చెట్లను పడేశాడు. కొండను పూగేట్లు చేశాడు. విజృంభించిన సింహం మాదిరి సంచరించాడు.

నలుపు, తెలుపు కలబోసిన వర్ణ చిత్రంలాగా, ఆకుపచ్చతో సహా వివిధ రంగులతో వృద్ధి చెందిన లోహాదులతోనూ, కాంతివంతమైన ఆభరణాలతోనూ, అలంకరణ చేసుకున్న యక్షులు, కిన్నరులు, దేవతలు, దేవతాస్త్రీల గుంపులతోనూ, మనోహరమై, మదించిన గజసమూహాలు ఎల్లవేళలా సంచరించే ఆ మహేంద్ర పర్వతంపైన హనుమంతుడు విచ్చలవిడిగా తిరుగుతూ ప్రకాశించాడు.

సూర్యుడికి, ఇంద్రుడికి, వాయుదేవుడికి, బ్రహ్మకు, ఇతర దేవతలకు అణకువతో నమస్కరించి ప్రయాణానికి సన్నాహమవుతాడు హనుమంతుడు. సూర్యుడు ఆయనకు విద్యా గురువైనందున తొలుత నమస్కరిస్తాడు. రాక్షసులతో యుద్ధానికి పోతున్నాడు కాబట్టి రాక్షస విరోధి ఇంద్రుడికి ఆ తర్వాత నమస్కరిస్తాడు. బలం, వేగం కలగాలని తండ్రి వాయుదేవుడికి నమస్కరిస్తాడు.

బ్రహ్మాస్త్రాల బాధ కలగకుండా వుండాలని బ్రహ్మదేవుడికి ప్రార్థనా పూర్వకంగా నమస్కరిస్తాడు. దీనర్థం కార్యారంభంలో గురువుకూ, ఇష్టదేవతకూ, విధిగా నమస్కరించాలని భావన. పురుషకారాన్ని ప్రార్థిస్తూ, పెద్దలకు నమస్కరిస్తూ, అలా అందరం చేయాలని మనకు నేర్పుతున్నాడు హనుమంతుడు.

గురుదేవతలతో పాటు ప్రత్యక్ష దేవతైన తండ్రికి నమస్కరించాలని భావించి దక్షిణ ముఖంగా వున్న హనుమంతుడు తూర్పు తిరిగి ఆ పని చేస్తాడు. సుభ కార్యాలన్నీ తూర్పు, ఉత్తరం తిరిగి మాత్రమె చేయాలనీ, అశుభ కార్యం దక్షిణ ముఖమై చేయాలనీ దీనర్థం. నిద్రలో తలగడకు ఉత్తరం నిషిద్ధం కాగా దక్షిణం ప్రశస్తం.

ఈ విధంగా హనుమంతుడు రామకార్యం సాధించదలచి సముద్రాన్ని దాటేందుకు నిశ్చయించు కుంటాడు. వానరులందరూ చూస్తుండగా పౌర్ణమి నాటి సముద్రం లాగా అంతు లేనంతగా తన దేహాన్ని పెంచాడు.

మితిమీరిన శరీరంతో, సముద్రాన్ని దాటుతున్నానన్న గర్వంతో, హనుమంతుడు రెండు చేతులతో, కాళ్లతో పర్వతాన్ని ఊగించాడు. కదలని ఆ పర్వతం హనుమంతుడి బలానికి చెదిరింది. ఆ ఉగిసలాటకు పర్వతం మీదున్న చెట్ల పూలు కొండ మీద రాలడంతో పర్వతం పూలకొండ మాదిరిగా అందంగా కనిపించింది. సువాసనలు వెదజల్లాయక్కడ. కపి నాయకుడి పీడనకు గురైన ఆ పర్వతం మదించిన మత్తగజం కన్నీళ్లు (మదం) కారుస్తున్నట్లుగా కనిపించింది. గడ-గడ లాడుతున్న ఆ కొండ మధ్యలోని పొరల చాటునుండి బయటపడ్డ వెండి బంగారాలు ఒకటి తర్వాత మరొకటి కనిపించ సాగాయి. మండే అగ్నిహోత్ర జ్వాలలు పొగలు కక్కినట్లే ఆ పర్వతం కూడా పెద్ద పెద్ద బండలను బయట పడేసింది.

గడ-గడ వణకుతున్న ఆ కొండ గుహల్లోకి అడవి మృగాలు కలవరపడి ఏడ్చిన ధ్వనులు భూమ్యాకాశాలను దద్దరిల్ల చేసాయి. పర్వత చరియల్లోనూ, చుట్టుపక్కల ప్రదేశాలలోనూ, తిరుగాడే పాములు పడగలు విప్పి, కాటేస్తే అగ్నితో సమానమైన ఆ విషప్రభావానికి రాతిగుండ్లు వేయితునకలై ఎగిరిపడ్డాయి. ఆ పర్వతంలోని ఔషధులు కూడా అణచలేక పోయే మోతాదులో వుందా

పాముల క్రూరమైన విషం. ఆ కొండ ఎక్కడ బద్దలవుతుందో అన్న భయంతో అక్కడ వుంటున్న వారు, తాగుతున్న మద్యాన్ని మధ్యలోనే వదలి, ఎక్కడి వస్తువులు అక్కడే పడేసి, హడావిడిగా పరుగెత్తారు. హారాలు, కంకణాలు, భుజకీర్తులు, కాలి అందెలు, పూదండలు, కడియాలతో సహా, శరీరం మీద వున్నవి తప్ప మిగిలినవన్నీ వదిలేసి పోయారు.

తమ ఆడువారు తోడు రాగా, మత్తులో వున్న వీరందరూ, వళ్ళు మరచి ఆకాశానికి ఎగిరారు. స్త్రీలు ఆకాశ వీదిలో తమ ప్రియులతో కలసి, పరాచకాలాడుతూ, నవ్వుతూ, శరీరాలు మరచి, అక్కడ జరుగుతున్న భయానక దృశ్యానికి అబ్బురపడుతూ, కార్యసాధకుడైన హనుమంతుడిని చూసారు. శ్రేష్ఠులైన విద్యాధరులు గుంపులు-గుంపులుగా ఆకాశంలో నిలుచుని, ఆ క్షణంలో పర్వతమున్న భంగిమను చూసారు ఆశ్చర్యంగా.

ఆంజనేయుడు రామకార్యార్థమై, వానరార్థమై, పర్వతాకారంలో అసాధ్యమైన సముద్రాన్ని దాటి ఆవలి ఒడ్డుకు పోయే ప్రయత్నంలో ఉన్నాడని సిద్ధులు, చారణులు, విద్యాధరులకు చెప్పారు. సీతకై సముద్రాన్ని దాటడం కేవలం రాముడి కొరకే కాదు....వానరుల ప్రాణ రక్షణ చేయడం కూడా వుంది. దేహాన్ని అమితంగా పెంచిన హనుమంతుడు ఒక్కసారిగా వళ్ళు విదిలించి, వెంట్రుకలు రాల్చి, వర్షాకాల మేఘం లాగా దిక్కులు పిక్కటిల్లేట్లు గర్జిస్తాడు. గరత్మంతుడు పామును విదిలించినట్లు తన తోకను విదిలించాడు. హనుమంతుడి తోక గరత్మంతుడు పట్టుకున్న పాములాగా ఆయన వీపుమీద మెరుస్తున్నదప్పుడు.

ఉదయిస్తున్న సూర్యచంద్రుల కలిమిడిని పోలిన హనుమ కళ్లు

హనుమంతుడు సముద్రాన్ని దాటేందుకు ఉద్యుక్తుడయ్యాడు. బలమైన తన రెండు చేతులు కదలకుండా పట్టుకొని, భుజాలు, మెడముడుచుకుంటాడు. మోకాళ్లు సగంవరకు ముందుకు వంచి రెండుకాళ్లు ఒకే చోటుంచి, కనురెప్పలు పైకెత్తి, దూరంపైన దృష్టినిలిపాడు. పర్వతానికి కాళ్లను బిగదన్ని, శ్వాసబిగించి,

లంకచేరాలన్నకోరికతో, చేయాల్సిన పనికి తగిన పరాక్రమం తనకున్నదా అని ఆలోచించి, కార్యం సాధిస్తానన్న ధైర్యంతో సముద్రాన్ని దాటేందుకు సన్నద్ధమయ్యాడు. (కష్టమైనపనికుద్యమించేవాడి సన్నాహాన్ని ధ్వనింపచేస్తున్నాడు హనుమంతుడు)

అక్కడున్న వానరముఖ్యులతో, సంతోషంగా తన పౌరుషాన్ని, బలాన్ని తెలియచేస్తూ, వాయువేగ సమానమైన శ్రీరామబాణం లాగా లంకలో ప్రవేశిస్తానంటాడు హనుమంతుడు. అక్కడ సీత కనిపించకపోతే, రావణుడిని బంధించి తెస్తాననీ, ఏవిధంగానైనా సీతను తోడ్కొని వస్తాననీ అంటాడు హనుమంతుడు.

ఒకవేళ వెళ్లేది తానొక్కడే కనుక, సీతాదేవిని లంకలో వెతకడం ఆలస్యమైతే, లంకనే ఇక్కడకు తెస్తానంటాడు. అడ్డమొస్తే రావణుడిని పాతిపెట్తానని కూడా చెప్తాడు. ఇక తాను పోయివస్తాననీ, కార్యసాధకుడనై తిరిగి వస్తాననీ అంటూ హనుమంతుడు వానరులవద్ద సెలవు తీసుకుంటాడు.

కపులవద్ద సెలవు తీసుకున్న హనుమంతుడు, తనను తానే గరుత్మంతునితో పోల్చుకుంటూ, చివాలున ఎగిరి వేగంగా పయనించడం ప్రారంభించాడు. ఆ వేగానికి కొండమీదున్న చెట్లు, వాటిమీదున్న పూలతో, పక్షులతో సహా, ఆకాశానికెగిరి, దూరప్రయాణానికి వెళ్తుండే బంధువులను సాగనంపడానికా అన్నట్లు, హనుమంతుడితో కూడి కొంతదూరం పోయాయి. అలా పయనిస్తున్న ఆంజనేయుడి తొడల వేగానికి విరిగిపోయిన మద్దిచెట్లగుంపులు, సేనానాయకుడిని అనుసరిస్తూ పోయే సైనికుల్లా ఆయనతో పోసాగాయి. విస్తారంగా పూచిన చెట్లకొమ్మలు, తన్ను అనుసరించి వస్తుంటే, ఆ సమూహంతో హనుమంతుడు పూలకొండలా ఆశ్చర్యకరంగా కనిపించాడప్పుడు.

ఇంద్రుడు రెక్కలు త్రుంచేస్తుంటే ఆయన వేగానికి భయపడ్డ కొండలు సముద్రంలో ఎలా పడిపోయాయో, అదే రీతిలో, బరువైన కొన్ని చెట్లు సముద్రంలో పడ్డాయి. మేఘాన్ని పోలి వున్న హనుమంతుడప్పుడు, మొగ్గలతో, మొలకలతో కూడిన పూలు తనమీద పడటంతో, రాత్రి సమయంలో మిణుగురు పురుగులతో ప్రకాశిస్తున్న కొండమాదిరి కనిపించాడు. ఇక వేగంగా కదల్లేని ఇంకొన్ని చెట్లు

వాటిపైనున్న పూలను రాల్చాయి. నీళ్లు అడ్డం వచ్చే వరకు హితులను సాగనంపి, కన్నీళ్లు కారుస్తూ, వెనుతిరిగే బంధువులలాగా ఆ పూలు అలా నీళ్లల్లోపడ్డాయి.

(బంధువులను, హితులను సాగనంపుతూ వీడ్కోలు పలికేవారు నీళ్లు అడ్డం వచ్చేవరకే పోవాలని, ఆ పైన పోగూడదనీ శాస్త్రం చెప్తుంది)

బరువైన చెట్లు ముందుగా సముద్రంలో పడిపోగా, తేలికైన వాటి పూలు గాలిలోకి ఎగిరి, హనుమంతుడి తోకతో కదిలిపోయి, వేలసంఖ్యలో సముద్రంలో రాలిపోయాయి. పూలతో నిండిన సముద్రం ఆ సమయంలో, నక్షత్రాలతో ప్రకాశిస్తున్న ఆకాశం మాదిరి కనిపించింది. ఇక హనుమంతుడప్పుడు పూలతో కప్పబడి వుండడంతో మెరుస్తున్న మేఘాన్ని జ్ఞప్తికి తెచ్చాడు. హనుమంతుడి వేగానికి ఆయనమీదున్న పూలు సముద్రంలో ఒకటివెంట మరొకటి రాలుతుంటే, ఆ సన్నివేశం, నక్షత్రాలు ఉదయించేవేళ ప్రకాశించే ఆకాశాన్ని పోలివుంది.

చేతులు చాచి ఆకాశంలో దూసుకెళ్తున్న పంచముఖ ఆంజనేయుడు పర్వత గుహలోంచి తల బయటకు చాచి ప్రాకుతున్న "పంచశీర్షయివోరగమా" (ఐదు తలల పామా!) అన్నట్లున్నాడు. అలలతో నిండిన సముద్రాన్ని రివ్వున దాటి ఆకాశాన పోతున్న హనుమంతుడు, ఆకాశ, సాగరాలను తాగుతూ పోతున్నాడా అనిపించింది. అంటే ఆయన వేగానికి ఆ రెండూ దాటిపోతున్నాయి. మండేకొండల మాదిరిగా వున్న హనుమ కళ్లు, ఒకేసారి ఉదయిస్తున్న సూర్య, చంద్రుల కలిమిడిని పోలి గుండ్రంగా, పింగళవర్ణంగా వున్నాయి. ఎర్రటికాంతితో వున్న హనుమంతుడి ముఖమ్మీదున్న ముక్కు అంతకంటే ఎర్రగా, సంధ్యాకాలపు సూర్యబింబంలా వుంది. ఇట్లా పోతున్న ఆంజనేయుడు తోకను ఆడించినప్పుడల్లా అది ఆకాశంలో ప్రకాశిస్తున్న ఇంద్రుడి జండాను జ్ఞప్తికి తెచ్చేదిగా వుంది.

కోరలు వెలుపల ప్రకాశిస్తుండగా, తోక తనను గుండ్రంగా చుట్టుకోగా, హనుమంతుడా సమయంలో, పరివేశం మధ్యనున్న సూర్యుడిలాగా కనిపించాడు. ఎరుపెక్కిన పిరుదుల నిక్కుతో, ఎర్రని ధాతువులు నిండిన పర్వతంలాగా అనిపించాడు. వడిసేలతో రాయి రువ్వుతే ఎలా పోతుందో, అలానే పోతున్న హనుమంతుడి చంకల నుండి వీస్తున్న గాలి మేఘపు వురుముల్లా భయంకరంగా ధ్వనించింది.

ఉత్తరం నుండి దక్షిణం వైపు పయనిస్తున్న తోకచుక్కలాగా, ఆంజనేయుడు పెద్ద తోకతో, ప్రకాశిస్తున్న దేహంతో, జంకూ, గొంకూ, భయంలేకుండా లంకవైపు ప్రయాణం కొనసాగించాడు. (ఇక్కడ తోకచుక్క ప్రస్తావన తేవడమంటే లంకకు త్వరలో జరుగనున్న అరిష్టం గురించి సూచన మాత్రంగా చెప్పడమే) ఏనుగు మాదిరి దీర్ఘకాయుడై ఆకాశానవున్న ఆయన రూపంనీడ, క్రింద నీళ్లల్లో పడటంతో, హనుమంతుడు సగం నీళ్లల్లో, సగం బయటా నడిచే పడవలాగా వున్నాడప్పుడు. హనుమంతుడు పయనిస్తున్న సాగరమార్గమంతా ఆయన తొడల వేగంతో తలక్రిందులై, తారుమారై, పిచ్చిపట్టినదానిలాగా కనిపించింది. ఆకాశన్నంటుతున్న అలలను హనుమంతుడు తన దేహంనుండి వీస్తున్న గాలితో తన్నుకుంటూ పోసాగాడు.

హనుమంతుడి కదలికతో వీస్తున్నగాలి, మేఘాల కదలికతో వెలువడ్తున్న గాలీ, రెండూ కలవడంతో, సముద్రం కలవరపడింది. అలలసమూహాన్ని లాగుతున్నాడా, లేక, భూమ్యాకాశాలకు ఎల్లలు ఏర్పాటు చేస్తున్నాడా అన్న రీతిలో సాగుతున్నది ఆంజనేయుడి ప్రయాణం. మేరునగమంత ఎత్తుకు ఎగుస్తున్న అలలను హనుమంతుడు లెక్కించుకుంటూ పోతున్నాడా అనిపించింది. ఆయన వేగానికి వెలువడ్తున్న వాయువు సముద్రపు నీటిని తెల్లని తుంపర, తుంపరలుగా ఆకాశానికి ఎగజిమ్ముతుంటే, అవి శరత్కాల మేఘాల్లా కనిపించసాగాయి.

మనిషి వంటిమీదున్న దుస్తులు తీసేస్తే అవయవాలన్నీ కనిపించినట్లే, హనుమంతుడి ఉల్లంఘన వేగానికి సముద్రపునీళ్లన్నీ ఆకాశంలోకి ఎగిరిపోవడంతో, అందులో వుండే తాబేళ్లు, మొసళ్లు, చేపలు, ఇతర జలచరాలు, బయటకు కనిపించసాగాయి. ఆకాశంలో పోతున్న హనుమంతుడిని గరుత్మంతుడనుకుని, నీటిలో వున్న పాములు కలవరపడి మూర్ఛపోయాయి. సముద్రంలో పడ్తున్న ఆయన నీడ పది ఆమడల వెడల్పు, ముప్పై ఆమడల పొడవుండి, దట్టమైన మేఘం పొరలాగా హనుమంతుడి వెంటనే పోసాగింది. నిరాధారంగా వెళ్తున్న హనుమంతుడు రెక్కల పర్వతం లాగా కనిపించాడు. ఆయన పయనిస్తున్న మార్గమంతా, మధ్య పల్లంలాగా, ఇటు, అటు మెరకలాగా, దోసె

మాదిరిగా కనిపించింది. పక్షుల నడుమ గరుత్మంతుడిలాగా పోతున్న హనుమంతుడు పెనుగాలివలె మేఘాలను చెదరగొట్టసాగాడు. ఆయన ఆకర్షణకు గురైన మేఘాలు, తెలుపు, ఎరుపు, నలుపు రంగుల కలయికయ్యాయి. మబ్బుల్లో దోబూచులాడే చందమామ లాగా కొంతసేపు కనిపిస్తూ, మరికొంతసేపు కనిపించకుండా వున్నాడు హనుమంతుడు. ఆయన మీదప్పుడు దనుజులు, గంధర్వులు, దేవతలు పూలవర్షం కురిపించారు. సూర్యుడు తన తాపాన్ని తగ్గించాడు. రామకార్యం నిర్వహించటానికి అనువుగా, హనుమంతుడికి శ్రమ కలుగకుండా వుండేందుకు, వాయువు చల్లగా వీచింది. (భగవత్కైంకర్యం చేసేవారికి దేవతలందరూ సహాయం చేస్తారనేందుకు ఇదో నిదర్శనం)

ఇలా జంకూ, గొంకూ, భయం లేకుండా సముద్రాన్ని దాటుతున్న హనుమంతుడిని చూసి దేవతలు భళీ-భళీఅనిమెచ్చుకున్నారు. మునులు శ్లాఘించారు. సై-సై అంటూ దేవతా సమూహం స్తుతించింది.

మేలు చేసేవారికి మేలు చేయాలన్నదే సనాతనధర్మం

ఇక్ష్వాకువంశ గౌరవం కోరే సముద్రుడు, రామకార్యార్థమై వెళ్తున్న హనుమంతుడికి ఏవిధంగా సాయపడగలనా అని ఆలోచిస్తాడు. తాను రామకార్యం చేయలేకపోయినా, చేసే మహానుభావులకైనా తోడ్పడాలి గదా! అని భావిస్తాడు. ఏం చేయాలన్న ఆలోచనలో పడ్డాడు. ఇక్ష్వాకువంశీయుడైన సగర చక్రవర్తి ద్వారా తాను వృద్ధి చెందిన విషయాన్ని గుర్తు చేసుకున్నాడు. పరాక్రమించి పోతున్న ఆంజనేయుడికి కష్టం కలుగకుండా చూడడమే మేలనుకుంటాడు. పుండరీకాక్షుడైన రామచంద్రుడి దూతకు సహాయం చేయకపోతే, సముద్రుడికి దయ-బుద్ధి, లేదనుకుంటారనీ, లోకనిందకు గురవుతాననీ భయపడ్డాడు. భగవత్కార్యానికి తోడ్పడేశక్తి వుండికూడా అలా చేయకపోతే అపకీర్తి పాలవుతానని ఆందోళన చెందుతాడు. హనుమంతుడికి ఒకింత బడలిక తీర్చే ఉద్దేశ్యంతో, ఆ తర్వాత తక్కిన ప్రయాణం సులభంగా చేయకలుగుతాడన్న ఆశయంతో, తనలో దాగివున్న మైనాక పర్వతాన్ని ఆ పనికొరకు పురమాయిస్తాడు సముద్రుడు. మైనాకుడు మేనకకు కొడుకు... హిమవంతుడికి జన్మించాడు.... పార్వతికి తోబుట్టువు.

"నీకొక వార్త చెప్తా విను" అని బంగారు శిఖరాల మైనాకుడితో అంటాడు సముద్రుడు. పాతాళంనుండి భూలోకానికి రాకుండా రాక్షసులను అడ్డుకునేందుకు, మైనాక పర్వతాన్ని ఉక్కు గుండులాగ వుంచాడింద్రుడనీ, ఏ ప్రక్కకైనా పక్షిలాగా ఎగిరిపోయే సామర్థ్యం మైనాకుడికుందనీ గుర్తుచేసాడు సముద్రుడు.

"శ్రీరామచంద్రమూర్తి కార్యార్థిగా అనితరసాధ్యమైన పనిచేయడానికై ఆకాశమార్గాన పోతున్నాడు హనుమంతుడు. ఇక్ష్వాకువంశంలో పుట్టినవారు నాకు పూజ్యులు. స్నేహంవల్ల, సౌమ్యభావంవల్ల, నీవు నాకొక సహాయం చెయ్యాలి. చేయాల్సినపని సకాలంలో చేయకపోతే దుష్టుడని సత్పురుషులు కోప్పడుతారు. కాబట్టే సహాయం చేయాలి. హనుమంతుడు మనకు అతిథి, పూజ్యుడు. నీవు నీటిలో నుండి లేచి, ఆయనకు ఎదురేగి, బడలిక తీరేటట్లు నీ నెత్తిన ధరించు. నీవిట్లాచేస్తే, ఆయనకు కొంత బడలిక తీరుతుంది. తక్కిన సముద్రాన్ని సులభంగా దాటిపోగలడు. రామచంద్రుడి మంచి నడవడి, భార్యావియోగం, లంకకు వెళ్లే ఆంజనేయుడి శ్రమ ఆలోచించి సంతోషంగా నీటినుండి బయటకురా" అంటాడు మైనాకుడితో. (ఈ సంభాషణ సారాంశం: భగవత్కార్యం చేసే ఆసక్తి వుండి కూడా చేయలేని వాడు, చేస్తున్నవారిని ప్రేరేపించి, వారితో ఆ కార్యాన్ని విజయవంతంగా చేయించాలనీ, అతిథిని వేరేవిధంగా సత్కరించలేని వారు మంచిమాటలతోనూ, కూర్చోడానికి ఆసనం ఇవ్వడం ద్వారానూ, దాహానికి మంచినీళ్లు ఇవ్వడంద్వారానూ ఆదరించాలని అర్థం). సముద్రుడి మాటలకు స్పందించాడు మైనాకుడు. మేఘాలను చీల్చుకుంటూ వస్తున్న సూర్యుడిలాగా, నీటిని రెండు భాగాలు చేసి పైకొచ్చాడు. శతసూర్యకాంతితో తన దారికి అడ్డంగా నిల్చిన మైనాకుడిని గమనించి, హుంకరించి, ఆకాశమార్గంలోనే ఢీకొన్నాడు హనుమంతుడు. హనుమ దెబ్బకు, విలపిస్తూ, శోషిల్లి పడిపోయాడు మైనాకుడు. పిడుగుపాటులాగా తగిలిన హనుమంతుడి దెబ్బకు కొంతదూరం వరకూ కొట్టుకుపోయిన మైనాకుడు, లోలోన మటుకు సంతోషించాడు. ఆయన బలాన్ని తెలుసుకున్నందుకు పొంగిపోయాడు. ప్రీతిగా హనుమంతుడితో ఇలా అన్నాడు:

"వాయునందనా! ఎలాంటి అసాధ్యమైన పనికిపూనుకున్నావయ్యా! నీశక్తిని పొగడ ఎవరితరం? నీ బలం, వేగం చూసి మెచ్చుకున్నాను. నా బంగారు శిఖరంమీద నీ శ్రమ తగ్గేంతవరకు నిలిచి, ఆ తర్వాత నీ ఇష్టమొచ్చినట్లుపో. నీ మీద నాకు ప్రేమ కలగటానికి కారణం, మేలు చేసేవారికి, మేలు చేయాలన్న సనాతన ధర్మమే సుమా. సముద్రుడు నీ మేలు కోరి నన్నెంచుకున్నాడు. దానికి కారణముంది. రఘువంశంలో పుట్టిన సగరుడనే రాజువల్ల వృద్ధిచెంది సాగరుడన్న పేరు తెచ్చుకున్నాడు సముద్రుడు. ఆ వంశంలో జన్మించిన శ్రీరామచంద్రమూర్తి కార్యార్థివై పోతున్న నీకు సహాయపడాలని భావించాడు. నీకు సాయపడితే వారికి చేసినట్లే కదా! సాగరుడు కృతజ్ఞుడన్న గౌరవం పొందగోరి నన్ను పిల్చి నీ గురించి చెప్పి, నాకు నిన్ను చూపాడు. రామకార్య ధురంధరుడవగుటచే పుణ్యాత్ముడైన నీవు నూరు యోజనాల సముద్రాన్ని దాటే ప్రయత్నంలో వున్నావనీ, నిన్ను నా శిఖరంపై కొంతసేపుంచుకొని, నీ సేదతీర్చితే, మిగిలిన ప్రయాణం కష్టం లేకుండా చేస్తావనీ, సముద్రాన్ని దాటగలవనీ నాతో సముద్రుడన్నాడు."

"వాయునందనా, ఆయన ప్రేమతో చెప్పినందువల్ల నీ కొరకై నేనొచ్చాను. నీవిక్కడ కాసేపాగి, ఫలాలు, కందమూలాలు తిని, అలసట తీరేవరకు విశ్రాంతి తీసుకో. తర్వాత మిగిలిన దూరాన్ని వేగంగా, సులభంగా, పోవచ్చు. కొత్తవారైనా సత్పురుషులకు ప్రేమతో పూజించి కైంకర్యాలు చేస్తే మంచిదని పెద్దలంటారు. అతిథి గుణవంతుడైతే కొత్త, పాత అన్న మీమాంస చేయకూడదు. అదలా వుండగా నేను నిన్ను పూజించడానికి మరో కారణముంది. మహాత్ముడూ, బలంలో భయంకరుడూ అయిన వాయుదేవుడికి నీవు కొడుకువి. నీ యోగ్యత నాకు తెలిసినా, తెలియకపోయినా, నీ తండ్రి యోగ్యతవల్ల, నేను నిన్ను పూజించదల్చాను. అట్టి మహానుభావుడి కొడుకైన నీవు మాకు అతిథివి కాబట్టి నేనిచ్చే అతిథి సత్కారాలు స్వీకరించు. ఎట్టివాడైనా అతిథి పూజ్యుడేకద! వారిలో సజ్జనుడు మరీ పూజ్యుడు. సద్వంశ ప్రసూతుడు మరీ-మరీ పూజ్యుడు. ఈ మూడు నీలో వున్నందువల్ల నాకు నీవు పూజ్యుడవు. ధర్మం ఇట్టిదని తెలియకపోయినా, తెల్సుకోదల్చినవారికీ, ధర్మం చక్కగా తెలిసినవారికీ అతిథి

పూజ్యుడే. అలాంటప్పుడు నీ వంటి సాధుపురుషుడు పూజ్యుడని చెప్పాల్సిన పనేలేదు. మన ఇరువురి సంబంధం ఇదే కాదు. నేనూ నీకు కావాల్సిన వాడినే. కొత్త వాడిని కాను. నీవు వాయువేగ, మనోవేగాలతో పోగలవు. నిన్ను నేను పూజిస్తే వాయుదేవుడిని పూజించినంత" అని మైనాకుడు హనుమంతుడితో విన్నవిస్తాడు.

"నేను నిన్ను పూజించటానికి ఇంకో కారణం కూడా వుంది. పూర్వకాలంలో కొండలకు రెక్కలుండేవి. వాటి సహాయంతో వేగంగా ఆకాశంలో సంచరించేవి. అప్పుడవి తమ తలలమీద పడతవేమోనని మునులు, దేవతలు భయపడేవారు. ఇది విన్న ఇంద్రుడు తన వజ్రాయుధంతో పర్వతాల రెక్కలు నరుకుతూ, నా రెక్కలు కూడా నరికేందుకు వచ్చాడు. నీ తండ్రి వాయుదేవుడప్పుడు నన్ను చిమ్ముకుంటూ వచ్చి సముద్రంలో పడేసాడు. అందుచేత నేను రెక్కల అందం చెడిపోకుండా వున్నాను. దీనికి మీ తండ్రి వాత్సల్యమే కారణం సుమా! అందుకే నీ తండ్రీ నాకు పూజ్యుడే. నిన్నూ అందుకే గౌరవిస్తాను. నా స్నేహాన్ని వృథా కానీయకుండా నీవూ నన్ను అలరించాలి. నేను చేసే సత్కారాన్ని స్వీకరించి అలసట తీర్చుకుని, నన్నూ, సముద్రుడిని సంతోషపర్చు" అని అన్న మైనాకుడికి తనదైన శైలిలో జవాబిచ్చాడు హనుమంతుడు.

"పర్వతోత్తమా, నీవు చేసే సత్కారాలు అంగీకరించినట్లే. అన్నరసం కన్న ఆదరణరసం మేలు. నీ మంచిమాటల చేతనే సపర్యలు అంగీకరించినట్లయింది. ఆ ఫలం నీకు దక్కింది కూడా. నేను సంతోషించాను. నేనిక్కడ ఆగకూడదు. కార్యం, కాలం నన్ను తొందరపెట్టున్నాయి. చేయాల్సినపని చాలా వుంది. చీకటి పడిపోతున్నది. ఇంకా ఆలస్యమైతే చేయవలసిన పనికి తగినంత పొద్దులేదు. నేను ఎక్కడా ఆగననీ, రామబాణంలా వెళ్లి వస్తాననీ, పని చక్కబెట్టుకొస్తాననీ వానరులతో ప్రతిజ్ఞ కూడా చేసాను. నన్నాపవద్దు... కోప్పడవద్దు మిత్రమా!" అన్నాడు.

అణిమాది సిద్ధులున్న హనుమంతుడు

హనుమంతుడు మైనాకుడి చేతిలో చేయి కలిపి, నవ్వు ముఖంతో పోయివస్తానని సెలవుతీసుకొని, మరింత వేగంగా, మరింత పైకెగిరి, సముద్ర మైనాకుల ఆశీర్వాదం పొందాడు. హనుమంతుడి రెండవ ఈ అసాధ్య కార్యం చూసిన దేవతలు ఆయన్ను పొగిడారు. మొదటి అసాధ్య కార్యం సముద్రం దాటడమైతే, రెండవది కొండ అడ్డు వచ్చినా ఛేదించుకొనిపోవడం.

మైనాకుడు చేసిన స్నేహపూర్వక కార్యాన్ని చూసి, ఆకాశం పైనుంచి ఈ సన్నివేశాన్నంతా చూస్తూ నిల్చున్న దేవతలు, ఆయన్ను పొగిడారు. ఇంద్రుడు మైనాకుడిని చూసి, ఇక తనవల్ల అతడికి భయంలేకుండా వరమిచ్చానన్నాడు. సంకోచంలేకుండా లోకంలో సుఖపడమనీ మనస్సునందైనా భయపడవద్దనీ చెప్పాడు ఇంద్రుడు.

"హనుమంతుడు నిండు ధైర్యంతో పోతున్నప్పటికీ, ఇతడెట్లా నూరు యోజనాల సముద్రం దాటగలడన్న భయంతో, మా గుండెలు కొట్టుకున్నాయి. అట్లా రామకార్యం కొరకు దూతగా పోతున్న హనుమంతుడిని సరైన సమయంలో ఆదరించావు....నిన్ను మెచ్చాను స్నేహితుడా" అని అన్నాడు మైనాకుడితో ఇంద్రుడు.

ఈ ప్రకారం దేవేంద్రుడు తనతో అనడంతో వరం పొందిన మైనాకుడు భయం విడిచి సంతోషించాడు. హనుమంతుడు తన ప్రయాణం కొనసాగించాడు. (భగవత్ సేవకులకు దేవతలు సహాయపడ్తారని దీనివల్ల తెలుస్తోంది. శ్రేయస్కరమైన కార్యాలకు విఘ్నాలు ఎక్కువ. సంసారాన్ని తరించాలని ఆత్మావలోకనపరుడై యోగాభ్యాసం చేసే వ్యక్తిని చూసి, ఇతడు చెడిపోతున్నాడనే భయంతో, ప్రేమతోనే, అతడి బంధువులు తమవైపు తిప్పుకొనే ప్రయత్నం చేస్తారు. కారణం ప్రేమతో అయినప్పటికీ విఘ్నం, విఘ్నమే. కావున ఇట్టివారిని లక్ష్యం చేయకూడదు. మంచి మాటలతోనే వారికి సమాధానం చెప్పి వెనుకంజ వేయక కృషి కొనసాగించాలి. అదే నిష్ఠ.)

ఒంటరిగా సాహసించి పోతున్న హనుమంతుడు రావణుడిని ఎలాగెల్చి రాగలడని, దేవతలు, ఋషులు, సిద్ధులు అనుకుంటారు. ఎలా సముద్రాన్ని

దాటగలడన్న సందేహంతో, ఆయన బలాన్ని తెలుసుకోదల్చారు వారు. ఆ ఆలోచనతో, సూర్యకాంతిగల నాగమాత "సురస"ను సందేహ నివృత్తి కొరకు ఉపయోగించ దల్చారు. దైత్య స్త్రీగా పోయి వేగంగా సముద్రాన్ని దాటుతున్న హనుమంతుడికి అడ్డుపడి, ముహూర్తకాలం పాటు ఆలస్యం చేయమని సురసను కోరుతారు. దారికి అడ్డుపడే సమయంలో కోరలు, ఆకాశాన్నంటే నోరు, ఎర్రనిచూపులు, ఎదుటివారిని చంపే మిడిగ్రుడ్లు, ఆమెకుండాలని సూచిస్తారు. తెలివిగా ఆమెను దాటిపోతాడో, లేక, ఆమెకు చిక్కి, పోలేక ఆగిపోతాడో చూద్దామనుకుంటారు.

సరేనని అంగీకరించిన సురస, ఇంతకు ముందెప్పుడూ ప్రాణికోటి వినని, కనని, భయంకరమైన పెద్ద వికార రూపాన్ని ధరించి ఆకాశంలో తిరుగుతూ, ఆంజనేయుడికి అడ్డుపడి, ఎదురునిల్చి, "ఎటుబోతున్నావు" అని ప్రశ్నిస్తుంది. "దేవతలు నిన్ను నాకు ఆహారంగా పంపించారు. నన్ను దాటి నీవెక్కడకు పోలేవు. నా నోట్లో చొరపడు. నిన్ను మింగుతా. నువ్వేం మాట్లాడినా నేనువినను" అంటుంది సురస. ఈమె సహజ రాక్షసి కాదు, నన్ను పరీక్షించ వచ్చింది, నిజంగా నన్ను తినాలని వుంటే తనే నన్ను నోట్లో వేసుకోవచ్చుకదా! అనుకొని, ఆమెతో విరోధానికి పోకుండా, రెండు చేతులెత్తి జోడించి, నమస్కరించి, తాను వెళ్తున్న పనిని వివరిస్తాడు హనుమంతుడు.

"దేవీ! శ్రీరామచంద్రమూర్తి సీతాలక్ష్మణులతో అరణ్యంలో తిరుగుతుండగా, రాక్షసులందు ద్వేషబుద్ధిగల శ్రీరాముడు లేని సమయంలో, ఆయన భార్య సీతాదేవిని రావణుడు అపహరించాడు. ఆ పతివ్రతను నేను చూడడానికి పోతున్నాను. ఇది శ్రీరాముడి ఆజ్ఞ. నీవున్న దేశం కూడా ఆయనదే. నీవుకూడా ఆయన పనిచేయాల్సిన దానివే. నువ్వు చేయాల్సిందల్లా నన్ను క్షేమంగా పోనీయడమే. ఆ సహాయం చాలు. అది వీలు కాదంటే, జానకీదేవిని చూసొచ్చి, ఆమె క్షేమ సమాచరం రాముడికి తెలిపిన తర్వాత నీ నోట్లో ప్రవేశిస్తాను" అని తాను వెళ్లే కార్యక్రమం గురించి తెలియచేస్తాడు సురసకు. హనుమంతుడి మాటలు తాను నమ్మననీ, తనకు చిక్కి ఆతడు ప్రాణాలతో తప్పించుకుని పోలేడనీ, అది తనకీయబడ్డ వరమనీ అంటూ సురస హనుమను అడ్డుకుంటుంది. అలా అంటూ నోరు తెర్చుకొని నిలబడ్తుంది. తన్ను మ్రింగ

గల నోరు ఆమెకు లేదని తన దేహాన్ని పది ఆమడల నిడివిగా పెంచుతాడు హనుమంతుడు. సురస తన నోటిని ఇరవై ఆమడల నిడివిగా చేస్తుంది. హనుమంతుడు ముప్పై ఆమడలకు పెంచుతాడు. ఇలా ఇరువురూ పెంచుకుంటూ పోతుంటారు. ఎప్పుడైతే సురస తన నోటిని నూరు ఆమడలకు పెంచుతుందో, బుద్ధిమంతుడైన హనుమంతుడు తక్షణమే తన దేహాన్ని చిన్నదిగా చేసాడు. (హనుమంతుడికి అణిమాది సిద్ధులున్నాయనడానికి ఇదొక ఉదాహరణ)

అతి వేగంతో, సమర్ధతతో, హనుమంతుడు బొటన వేలంత రూపంలో, చటుక్కున సురస నోట్లో చొరబడి, అంతే వేగంతో, ఆమె నోరు మూసే లోపల, బయటపడి, ఆకాశంలో నిల్చి ఆమె కోరిక తీర్చానంటాడు. "తల్లీ దాక్షాయణీ! నీవు కోరినట్లే నీ నోట్లో ప్రవేశించాను. నీకు బ్రహ్మ ఇచ్చిన వరాన్నీ నిజం చేసాను. నన్ను దయతల్చి నా నమస్కారాన్ని అంగీకరించు. సంతోషంతో నేను సీతను వెదికేందుకు పోతాను. నేను తలపెట్టిన కార్యం సఫలం కావాలని కూడా నీ మనస్సులో అనుకో" అని హనుమంతుడు చెప్పాడు. రాహువు నోట్లో కెళ్లి బయటకు వచ్చిన చంద్రుడిలాగున్న హనుమంతుడిని చూసి, సంతోషించిన సురస తన నిజస్వరూపాన్ని ధరిస్తుంది. సుఖంగా పోయిరమ్మని దీవిస్తుంది. పనులన్నీ శ్రమ లేకుండా జరిగిపోతాయనీ, శ్రీరాముడి భార్యను ఆయన వద్దకు చేర్చమనీ చెప్పి ఆ నాగమాత వెళ్లిపోతుంది. దేవతలు, ఇతరులు, ఆంజనేయుడు విజయవంతంగా చేసిన ఈ మూడో పనిని కూడా చూసి, "మేలు–మేలు" అని మెచ్చుకుంటారు. (ముముక్షువైన యోగినీ, భాగవతులనీ, దేవతలు పరీక్షిందేకు, విఘ్నాలు కల్పిస్తారు. వీటిని భక్తితోనే తప్పించుకుని పోవాలి హనుమంతుడులాగా అనేది అంతర ధ్వని)

లంకానగరాన్ని తేరిపార చూసిన హనుమంతుడు

సురస పోయిన తర్వాత అలక్ష్యం చేయరాని సముద్రాన్ని వదిలి, గరుడ వేగంతో, ఆకాశానికి లంఘించి భయంకరంగా, హనుమంతుడు తన ప్రయాణాన్ని కొనసాగించాడు. (అంటే సురసతో జరిగిన సంభాషణంతా నీటిమట్టానికి పైనే జరిగిందని అర్ధమౌతుంది)

దొంతర, దొంతరలుగా కమ్ముకున్న మబ్బులు, పరుగెడ్తున్న పక్షులు, తుంబురుడులాంటి సంగీత విద్యానిపుణులు, కాంతివంతమైన ఇంద్ర ధనస్సు, పెద్దపులి, సింహం, ఏనుగులు వాహనంగా కలవారు, గొప్ప విమానాలు, వజ్రాలు, పిడుగుల రాపిడితో పుట్టిన మంటలు, స్వర్గానికి వెళ్తున్న పుణ్యాత్ములు, దేవతలు భుజించే అన్నాన్ని తీసుకెళ్తున్న అగ్నిహోత్రుడు, చంద్ర–సూర్యది గ్రహాలు, చుక్కలు, అశ్వినీ మొదలైన నక్షత్రాలు, దేవ ఋషులు, దేవతలు, ఆకాశమార్గాన సంచరించే ఇతరులు, నాగులు, యక్షులు, దేవ గంధర్వులు, కిన్నరుల కలయికతో కూడిన బ్రహ్మ నిర్మిత ఆకాశమార్గాన, సూర్య–చంద్రులు పయనించే దారిని (ఖగోళ రహస్య సంచారమార్గం) కూడా దాటుకుంటూ ఏ ఆధారం లేకుండా దూసుకుపోతున్నాడు ఆంజనేయుడు.

వేగంతో అతిశయించి పోతున్న హనుమంతుడిని చూసి, "సింహిక" అనే రాక్షసి తన సహజమైన పాపపు బుద్ధితో ఆలోచించి, ఆహా... పుణ్యాత్మురాలనైనా ననుకుంటుంది. ఆహారం దొరకక ఎన్నోరోజులైన ఆ రాక్షసికి ఏదో వింత జంతువు దొరికి, ఆకలి తీర్చనున్న భావన కల్గి, హనుమంతుడి నీడను తన ఆకారంతో పట్టుకుంటుంది. ఎదురుగాలి తగిలిన పడవలాగా అయిందప్పుడు హనుమంతుడికి. వేగం తగ్గింది. దుఃఖం కూడా కలిగింది. నాలుగు దిక్కులు పరికించి చూడగా ఓ భూతం సముద్రం నుండి లేవడం గమనించాడు. సముద్రంలో సరీగ్గా ఇదే చోట్లో, తన నీడను పట్టుకోబోయే అంగారక గ్రహం వున్నదని సుగ్రీవుడు తనకు చెప్పిన మాటలు జ్ఞాపకం చేసుకుంటాడు బుద్ధిమంతుడైన హనుమంతుడు. కోపం వస్తుంది. వెంటనే భయంకరమైన కొండలాగా, వానాకాలపు మబ్బువలె, శరీరాన్ని ఎత్తుగా, వెడల్పుగా పెంచుతాడు. అది చూసిన రాక్షసి పాతాళగుహ వంటి భయంకరమైన తన నోరు తెర్చి, మేఘం లాగా గర్జించి, సునాయాసంగా ఆంజనేయుడిని తినేద్దామని ముందుకొచ్చింది. అప్పుడాంజనేయుడు దాని శరీరాన్ని, విప్పిన నోటిని, మర్మ స్థానాలను, పరిశీలించసాగాడు. (ఈ విధంగా ప్రాణస్థానాలను పరిశీలించడం ఎందుకంటే, ఎక్కడ దెబ్బ తీస్తే అది వెంటనే చస్తుందో తెలుసుకునేందుకే)

ఇలా పరిశీలించిన వెంటనే అదను చూసి, వజ్రం లాంటి దేహమున్న హనుమంతుడు, శరీరాన్ని చిన్నదిగా చేసి, దాని నోట్లో దూరాడు. దేవతలది

చూసి ఆందోళన చెందారు. వారలా భయపడ్తుండగా, దాని పేగులను మొలకల్లాంటి తన గోళ్లతో అతివేగంగా, అతి తొందరగా, ఆ రాక్షసి భరించలేని రీతిలో, నోరు మూసే లోపల, చీల్చి బయటకు దూకాడు మహావీరుడు ఆంజనేయుడు. (ఈ సింహిక అనే హింసిక జలాంతర్గామి లాంటిది. సముద్రంలో వుండి కాపలా కాస్తున్నది కాబట్టే, చుట్టూ సముద్రం ఆవరించి వున్న తన లంకా నగరానికి ఎవ్వరూ ప్రవేశించజాలరనే విశ్వాసం రావణుడికుంది)

ఎదుటి వారిని దిగ్భ్రాంతి చెందేటట్లు చేసే ధైర్యం, బుద్ధి, చమత్కారం, దృష్టిబలంతో ఆ రాక్షసి గర్వభంగం చేసి తన పూర్వాకారానికి వచ్చి, యదావిధిగా ప్రయాణం కొనసాగించాడు హనుమంతుడు. మర్మస్థానాలు తెగిన రాక్షసి సముద్రంలో పడి చచ్చింది. దేవతలు యధాప్రకారం హనుమంతుడిని పొగడ్తూ: "నీవు చేసిన పని ఇతరులకు అసాధ్యం. తలపెట్టిన పనిని సాధించేందుకు త్వరగా వెళ్లు. నీకు మేలు కలుగుతుంది. ఏపని ఎట్లా చేస్తే జరుగుతుందోనని ఆలోచించేందుకు అవసరమైన బుద్ధి, చమత్కారం, సామర్థ్యం, ఎదుటివారి రహస్యం తెలుసుకోగల శక్తి వున్నవారికి అసాధ్యమనేది లేదు" అంటారు. (ఈ రాక్షసి, "సింహిక" లేక "అంగారక" చరిత్ర ముముక్షువునకు దుష్టగ్రహ భూతాలవల్ల, దుష్ట జనులవల్ల కలిగే బాధలను సూచిస్తున్నది. ఇట్టి విరోధభావం గల వారిపై దయ, గౌరవం చూపాల్సిన పనిలేదు. వారిని చంపడమే సరైన చర్య)

మైనాక, సురస, సింహిక చర్యలు ఆత్మసాక్షాత్కార సాధనతో ముముక్షువునకు ఎదురయ్యే ఆదిబౌతిక, ఆదిదైవిక, ఆధ్యాత్మిక అవరోధాలు- సాధకుడు వాటిని బుద్ధి, చమత్కారం, సామర్థ్యంతో దాటవలెనని సూచించుట.

దేవతలంటున్న మాటలను ఆలకిస్తూనే తను వచ్చిన పని పూర్తి చేసుకుపోయే ఉపాయాన్ని ఆలోచిస్తూ. ఆకాశాన్నుండి కిందకు దిగే ప్రయత్నం చేసాడు హనుమంతుడు. గరుత్మంతుడు నేలపైకి వాలే విధంగా దిగసాగాడు. దిగుతూ, పెద్ద-పెద్ద చెట్లతో, ఎంతో విశాలంగా వున్న, తను దిగాల్సిన తీరాన్ని దగ్గరనుండి చూస్తాడు. ఆ ప్రదేశాన్ని, అతి మనోహర ద్వీపమందున్న మలయ పర్వతాన్ని, దగ్గరున్న చెట్ల సమూహాన్ని, సముద్రాన్ని, దాని ఒడ్డును, నది-సముద్రం కలిసే చోటును, పరికించి చూసాడు హనుమంతుడు.

(మలయ పర్వతమనే ఓ పర్వతం లంకలో కూడా వుంది. నదులొచ్చి సముద్రంలో కలిసినట్లుగానే సీతాదేవి భర్తను కలవబోతున్న విషయం సూచించబడిందిక్కడ. హనుమంతుడికిక్కడ ముత్తైదువుల ముఖ దర్శనం అయిందని కూడా వర్ణించబడింది. ఇది శుభశకునాన్ని సూచిస్తుంది.

సముద్రానికి ఆవలి ఒడ్డున–ఈవలి ఒడ్డున మలయ పర్వతాలున్నట్లు చెప్పడం వలన, ఒకానొక రోజుల్లో, లంక దక్షిణ హిందుస్థానం ఒకేభాగంలో వుండి, మధ్యలో సముద్రం లేకపోయివుండవచ్చునన్న అభిప్రాయం వుండేది)

ఆ క్షణంలో, ఆకాశాన్నే మింగే ప్రయత్నంలో వున్న చందాన కనిపిస్తున్న తన శరీరాన్ని, దాని అభివృద్ధిని చూసుకుంటూ, ఆలోచనలో పడ్డాడు హనుమంతుడు. ఇంత పెద్ద శరీరంతో కనిపిస్తున్న తనను ఒక వింత జంతువుగా రాక్షసులు భావించి వేడుకగా తన చుట్టూ తిరుగుతారేమోనన్న అనుమానం కలుగుతుంది. అప్పుడు తానెట్లు సీతాన్వేషణ చేయగలడు? అని ప్రశ్నించుకుంటాడు హనుమంతుడు. కొండంత శరీరాన్ని తక్షణమే చిన్నదిగా చేస్తాడు.

ఆరడుగుల పొడగుండే శరీరమే "నేను" అన్న అజ్ఞాని ఆత్మ లక్షణం తెల్సుకొని, ఈ దేహం "నేను" కాను, నేను కేవలం అణువంత వాడినేనని, తన యదార్థ స్వరూప జ్ఞానంలో నిల్చినట్లుగానూ, వామనావతారంలో బలిచక్రవర్తిని అణగదొక్కి విష్ణుమూర్తి తిరిగి తన స్వరూపాన్ని గ్రహించినట్లుగానూ, హనుమంతుడు తన నిజస్వరూపాన్ని పొందాడు.

అనేకానేక రూపాలను ధరించే హనుమంతుడు, సముద్రపు ఆవలి ఒడ్డున వున్న మనోహరమైన మంచు శిఖర ప్రదేశాల కొనను చూసి, ఒడ్డుకు దూకి, త్రికూటపర్వతం మీదినుంచి దేవేంద్రుడి పట్టణంతో సరితూగే వన సమూహాలతో ప్రకాశిస్తున్న లంకానగరాన్ని తేరిపార చూసాడు.

❖ ❖ ❖

సర్గ-2

లంకాపురి వెలుపలి ఉద్యానవనంలో విహరించిన హనుమంతుడు ఆకాశాన వున్న స్వర్గంలాగా కనిపించిన లంక

ఇతరులకెవరికీ దాటేందుకు సాధ్యపడని సముద్రాన్ని సులభంగా, అవలీలగా దాటి, త్రికూటపర్వత శిఖరమందున్న లంకను చూసిన తర్వాతనే హనుమంతుడి మనస్సు కుదుటపడింది. (హనుమంతుడు సముద్రాన్ని ఆకాశమార్గాన్నే లంఘించాడని రామాయణంలో స్పష్టంగా చెప్పినప్పటికీ, ఎగురలేదు.... ఈదిపోయాడు, అని వాదించే వారు కూడా వున్నారు). బహిరంగంగా తను తిరిగితే రాక్షసులు చూస్తారేమోనన్న అనుమానంతో, ఉద్యాన వనంలోని చెట్ల చాటున తిరుగుతున్న ఆంజనేయుడిపై వృక్షాలు జల-జలా పూలు రాల్చాయి. ఆ పూల వాసనలను తన మీదుగా వ్యాపింపచేస్తూ హనుమంతుడు ఆపాదమస్తకం పూలతో నిండిపోయాడు (ఇక్కడ పుష్పాభిషేకం శుభసూచకమని అర్థమవుతోంది). ఈ విధంగా నూరుయోజనాల సముద్రపు నిడివిని, ఎక్కడా మధ్యలో విశ్రాంతి తీసుకోకుండా, ఓ నిట్టూర్పు అయినా విడువకుండా, వేగంగా, హనుమంతుడు దాటడం విశేషం.

(హనుమంతుడు నూరు యోజనాల సముద్రాన్ని దాటాడని రామాయణంలో స్పష్టంగా చెప్పబడింది. అయినప్పటికీ, ఇప్పుడు సముద్రమంత వెడల్పు లేదు కదా? రావణాసురుడి లంక ఇదేనా?....అని కొందరు సందేహపడుతుంటారు. అయితే, కొన్ని బౌద్ధ ప్రామాణిక గ్రంథాలను చదివినవారికి ఈ అనుమానం నివృత్తి చేసుకునే ఆధారాలు లభ్యమవుతాయి. ఇంద్రజిత్ హోమం చేసిన "నికుంభిల", సీతాదేవిని ఉంచిన "అశోకవనం" ఇప్పటికీ వున్నాయక్కడ. అక్కడ సీతాదేవి పూజించబడుతున్నదనీ, "రావణకోట" అనే స్థలం కూడా వున్నదనీ, స్పష్టమవుతున్నది. దీన్నిబట్టి సింహళ ద్వీపమే ఈనాటి శ్రీలంక, ఒకనాటి లంక. అయితే, ఇప్పుడు సింహళ ద్వీపానికీ, మన దేశానికీ, మధ్య వున్న సముద్రం వెడల్పు అరవై మైళ్లే. నూరు యోజనాలకు, అరవై మైళ్లకు ఎంతో వ్యత్యాసముందని అనుకోవడం సహజం కదా. ఇకపోతే

యోజనం కొలత, ఇంత అని ఎక్కడా స్పష్టంగా చెప్పలేదు. ఎనిమిది మైళ్లని కొందరు, రెండున్నర మైళ్లని కొందరు లెక్కలు చెప్తారు. అదే విధంగా "ఆమడ", "క్రోసు"ల విషయంలో కూడా స్పష్టత లేదు. ఇప్పటిమైలు (1760 గజాలు) పూర్వంలేదు. కావున యోజనం అంటే, ఖచ్చితంగా ఇన్ని మైళ్లని నిర్ధారించలేం. అంతే కాకుండా ఇప్పుడు సముద్రం అరవై మైళ్లే అయినప్పటికీ, రామాయణ కాలంలో, ఎక్కువై వుండవచ్చు. సముద్ర భాగము విశేషంగా పూడిపోయి క్రమేపీ నేలగా మారిందని శాస్త్రవేత్తలు వ్రాసి వున్నారు.... వ్రాస్తున్నారు కూడా. ఇప్పటి రఘునాథ పురానికి దక్షిణ భాగమంతా పూర్వం సముద్రంగా వుండేది. అదే విధంగా, పురాణాలలో చెప్పిన దాన్ని బట్టి, ఇప్పటి తిరువాన్కూర్ పూర్వం సముద్రంలో మునిగుండేదట. అలాంటప్పుడు నేటి తిరునల్వేరల్లి సముద్రంలో మునిగి వుండవచ్చుకదా! రామాయణంలో చెప్పబడ్డ "త్రికూటం", "లంబపర్వతం", "సువేల" అనేవి లంకకు దక్షిణ భాగాన వున్నవేకాని, ఉత్తర భాగంలో లేవు. కాబట్టి ఇప్పటి లంకలోని ఉత్తర భాగం కూడా సముద్రంలో మునిగే వుండాలి. లేదా హనుమంతుడు ఈ ప్రదేశాన్ని వదిలి అక్కడకైనా పోయుండాలి. ఈ పర్వతం చుట్టూ సముద్రమున్నదన్నాడుకాని, గ్రామాలున్నట్లు వాల్మీకి చెప్పలేదు. "సువేల" అన్న పదమే సముద్ర తీరమన్న అర్థాన్ని చెప్తోంది. లంకలోని ఇప్పటి ఉత్తర రేవుకు, త్రికూటానికి, మధ్య దూరం, నూరు మైళ్లకు పైనే వుంది. కాబట్టి హనుమంతుడు దాటింది రెండొందల ఏభై మైళ్లని తేలుతున్నది. అంటే నూరుయోజనాలు రెండొందల ఏభై మైళ్లకు సమానం కావచ్చు)

అలుపూ, సొలుపూ లేకుండా, ఎన్ని ఆమడల దూరాన్నైనా దాటగల సత్తా నాకుండగా, నూరు యోజనాలొక లెక్కా! అనుకుంటూ, పరిమళించే తోటలను, నిర్మలమైన పచ్చిక బయళ్లను, చిన్న చిన్న గుట్టలను, పరికిస్తూ హనుమంతుడు కొండ పైనుండి చూస్తాడు. గాలికి కదుల్తున్న రెమ్మలు, కొనకొమ్మలు, వాటిపైనున్న పక్షుల సమూహాలున్న చెట్లను చూసాడు హనుమంతుడు. హంసలు, కన్నె లేళ్లు, తామర, కలువ పూలున్న దిగుడు బావులు, క్రీడాస్థలాలు, మడుగులు, పూచే, కాచే చెట్లు, కమలములతో నిండిన అగడ్తలను కూడా చూసాడు హనుమంతుడు.

సీతను దొంగిలించి తెచ్చిన రావణాసురుడు, ఆమెకు కాపలాగా విల్లు, బాణాలు ధరించి ఎల్లప్పుడూ తిరుగుతుండే రాక్షస శ్రేష్ఠులుండే సమస్త ప్రదేశాలు కనిపించాయి ఆంజనేయుడికి. బంగారు మయమైన ప్రాకారాలూ, తెల్లని పెద్ద వీధులు, వందలాది అగడ్తలు, వాటిపైనున్న ధ్వజాలు, బంగారు తీగెల తోరణాలతో శోభాయమానంగా వున్న లంకను కొండ శిఖరాన్నుంచే చూసిన హనుమంతుడికది ఆకాశాన వున్న స్వర్గంలాగా గోచరించింది. (అయోధ్యకు "సాకేత"మనే పేరు, లంకకు "సింహళ"మనే పేరు ఇటీవల వచ్చినవే కాని పురాతన కాలంలో లేవు. సింహళం, సిలోన్, శ్రీలంక అయిన కారణం కూడా చెప్పారు చరిత్రకారులు).

లంకను చూసిన హనుమంతుడికది, ఆకాశంలో వ్రేలాడు తున్నట్లుగానూ, అవలీలగా ఎగిరిపోయేదానిలాగానూ, రావణుడి కాపలాదారుల రక్షణ కింద లోపరహితమైన కోటలున్న గొప్ప పట్టణం మాదిరిగానూ కనిపించింది. లంకను మొట్టమొదట విశ్వకర్మ నిర్మించాడు. కుబేరుడికి తొలుత స్థానమైంది. అంద-చందాలలో ఈవిధంగా ఉండవచ్చేమోనని ఉహించనలవికానిది. కోటగోడనే మొల, దాన్ని చుట్టి వున్న అగడ్తల నీళ్లనే చీర, శూలాలు, శతఘ్నులనే కొప్పు, అట్టములనే శిరోభూషణాలతో లంకానగరం స్త్రీలాగా వుంది హనుమంతుడి కళ్లకు.

విశ్వకర్మ నిర్మితమై పాములతో నిండిన భోగవతి (పాతాళంలోని సర్పాల ముఖ్య పట్టణం) లాగా రాక్షసులతో నిండి, ఉత్తర ద్వారం కైలాస పర్వతం లాగా ఆకాశాన్ని తాకే ఎత్తైన ఇండ్లు కలిగి, భయంకరాకార రాక్షస సేనల గుంపుల కాపలా కిందున్న లంకా నగరాన్ని, దానికి అగడ్తగా చుట్టూ వున్న సముద్రాన్నీ చూసి ఆశ్చర్య పోయాడు హనుమంతుడు. దేవతలను జయించిన రావణాసురుడి పరాక్రమం ఇంతా అనుకుంటాడు. ఈ లంకకు వానరులు ఏవిధంగా రాగలరని, ఇంత సముద్రాన్ని అందరూ ఎట్లా దాటగలరని, ఒకవేళ నిర్బంధంగా రాగలిగినా, వారి ప్రయాణం వ్యర్థమై తిరిగి పోవాలేమోనని, తనలో తాను అనుకుంటాడు హనుమంతుడు.

లంకను గెలవడం ఎలా అని ఆలోచించిన హనుమంతుడు

లంకను గెలవడానికి దేవతాసమూహాలకైనా సాధ్యం కాదనిపిస్తుంది హనుమంతుడికి. వానరుల సంగతలా వుంచి, అసమానబలుడైన శ్రీరామచంద్రమూర్తి లంకకు వచ్చినప్పటికీ, రావణ రక్షణలో ప్రవేశించనలవికాని లంకానగరాన్ని ఏం చేయగలడన్న అనుమానమేస్తుంది ఆయనకు. పోనీ, మనకు విరోధమెందుకు? సీతను అప్పగించమని మంచితనంగా మాట్లాడేందుకు వీలులేదు. మంచిమాటలు రాక్షసుల చెవికెక్కవు. బలంతో మదించి, మత్తెక్కిన వారికి మంచిమాటలు రుచించవనుకుంటాడు (సామోపాయం కుదరదన్న భావన). ధన కాంక్ష లేని వీరికి లంచమిచ్చి వశపర్చుకోవడం కుదరదు. వీరికే ఐశ్వర్యం పుష్కలంగా వుంది. ఒకరి డబ్బుతో వీరికేంపని? ఒకవేళ ఇద్దామన్నా శ్రీరాముడి దగ్గర అంత ధనంలేదే!(దానోపాయం కూడా కుదరదని అర్థం). పోనీ వారిలో వారికి కలహం పెట్టడం కూడా అసాధ్యమే. ఆపని చేయాలంటే వారిలో కొందరితోనైనా పరిచయం చేసుకోవాలి. తనను చూడగానే వారందరూ కలిసి కలహానికి వస్తారేకాని, స్నేహం చేయరుకదా! (భేదోపాయం కూడా వ్యర్థమే). యుద్ధంలో గెలుద్దామంటే అంతు చిక్కటం లేదు (దండోపాయం కుదరదేమోనన్న భావన). ఇలా పలు ఆలోచనలతో అభిప్రాయం వెంట, వెంట మార్చుకుంటాడు హనుమంతుడు.

ఏ ఉపాయం చేయటానికైనా లంకకు రాగల వారెంతమందన్న లెక్కలు కూడా వేస్తాడు. నీలుడు, అంగదుడు, తను, సుగ్రీవుడు, నలుగురు మాత్రం సముద్రాన్ని దాటగలరనీ, అయితే, ఈనలుగురితో ఏం సాధించగలమనీ ప్రశ్నించుకుంటాడు. ఇంతకూ అసలిక్కడ సీత వుందో? లేదో? ఆ విషయం తేల్తే అప్పుడు లంకకు వచ్చే ఉపాయం గురించి ఆలోచించవచ్చు. ఇప్పుడు తాను చేయవలసిన పని సీతను వెతకడం, దానికి లంకలో ఎలా ప్రవేశించాలని యోచించడమనుకుంటాడు. తన మొదటి ఆలోచన, ఉపాయం, ఇదేనని నిశ్చయించుకుంటాడు హనుమంతుడు.

ఎలాంటి ఆలోచనచేస్తే రామకార్యం నెరవేర్తుందో అట్లాంటి ఆలోచనే చేయాలనీ, ఆవిధంగానే నడవాలనీ, అనుకుంటాడు హనుమంతుడు.

శిఖరాగ్రాన కూర్చుండి, కొంచెం సేపు ఆలోచిస్తాడు. లంకలోకి పోకతప్పదు... పోయే మార్గమేంటని ఆలోచిస్తాడు. తన భయంకర రూపం చూస్తే, క్రూర రాక్షసులు, రాక్షస సేనలు, వారు రక్షిస్తున్న లంకలోకి ప్రవేశించడం సాధ్యపడనీయరు. లోనికి రానీయరు. జయించి పోవాలంటే వారంతా మహాబలపరాక్రమ సంపన్నులు. కాబట్టి, బహిరంగంగా లోపలికి వెళ్లడం మంచిదికాదు. తెలవకుండా వంచించి, లోపలికి పోయి, కనపడవలసిన చోట కనపడుతూ, కనపడరాని చోట కానరాక వుండే రీతిలో వేషాలు మార్చాలను కుంటాడు ఆంజనేయుడు. మొత్తం మీద చీకటి మాటున కార్యం చక్కబర్చుకోవాలని కూడా నిర్ణయించుకున్నాడు. (వాలి వధ విషయంలో శ్రీరాముడిని అధిక్షేపించిన మహానుభావులు, హనుమంతుడి విషయంలో, ఎందుకో ఆక్షేపించలేదు. లేకపోతే, హనుమంతుడు పిరికి, మోసగాడు, కుట్రాలోచనచేసాడు, పౌరుషంతో బహిరంగంగా ఉన్నరూపంలోనే లంకలోనికి ప్రవేశించలేడా అని ప్రశ్నించేవారే!)

ఈ ప్రకారం ఆలోచిస్తూ, దుర్భేద్యమై, ప్రవేశించనలవి కాని, లంకా నగరాన్ని కొంతసేపు రెప్ప వాల్చకుండా చూస్తాడు. చూసి, ప్రవేశిండం కష్టకార్యమని భావిస్తాడు. నిట్టూర్పులు విడుస్తాడు. రావణాసురుడి కళ్లల్లో కారం ఎట్లా కొట్టాలి, ఎట్లా మోసగించాలి అని ఆలోచిస్తాడు. సీతనెట్లు చూడగలననీ, ఎట్లు ఈకార్యం సాధించగలననీ, మధనపడ్డాడు హనుమంతుడు(సముద్రాన్ని దాటినప్పుడు నిట్టూర్పులు విడవనివాడు ఇప్పుడు చేస్తున్నాడంటే, దానికంటే ఇది కష్టతరమైన కార్యమని హనుమంతుడికి తోచుండాలి).

దేశకాల జ్ఞానం లేక, ఏ కాలంలో, ఏ దేశంలో, ఎట్లా ప్రవర్తించాలన్న ఆలోచన లేక, పనిచేసే దూత, అతడి జ్ఞానహీనత వల్ల, సక్రమ ప్రయత్నంతో సాధ్యమని తోచినపని కూడా చేయలేడు. ఈ కార్యం ఈ ప్రకారం చేస్తే తప్పక ఫలితమిస్తుందని బుద్ధిమంతులు నిశ్చయించినా, పండితమానియగు వాడు, కార్యం చేయ సమర్థత లేనివాడై, కార్యాన్ని, ప్రాజ్ఞుల ఆలోచనను కూడా విఫలం చేస్తాడు. నేనెలా ఈ కార్యాన్ని సాధించగలను? చేయలేదన్న నింద నాకెలా రాకుండా వుండాలి? అని హనుమంతుడు మరీ-మరీ, ఆలోచిస్తాడు. ఐహిక-

ఆముష్మిక శాస్త్రాలన్నింటినీ ఎరిగినవాడు, ఇతరుల మనస్సెరిగి మాట్లాడే స్వభావం కల నేర్పరి, ఇతరుల ఆకారం, చేష్టలు, సంజ్ఞలు ఎరిగినవాడు, అర్ధ-దాన-స్త్రీల విషయాలలో పరిశుద్ధుడు, నేర్పరి, సద్వంశంలో పుట్టినవాడు మాత్రమే దూతగా పనిచేయడానికి అర్హుడు. అందరిమీద అనురాగమున్నవాడు, ధన-స్త్రీ విషయంలో శుచికలవాడు, జ్ఞప్తికలవాడు, దేశకాల స్థితినెరిగినవాడు, చక్కని దేహం కలవాడు, భయంలేనివాడు, మాటలందు నేర్పరితనం కలవాడు దూతగా వుండటానికి అర్హుడు. ఇన్నిగుణాలు హనుమంతుడిలో కలవనే విషయం పలుసందర్భాలలో బోధపడ్తుంది.

ఏవిధంగా చేస్తే నా ప్రయత్నం సఫల మౌతుంది? పగటి వేళ ప్రవేశించాలా? రాత్రి వేళా? ఈ రూపంలోనా? రూపం మార్చాలా? వివేకం చెడకుండా ఎట్లా ఈ కార్యాన్ని నెరవేర్చగలను? ఎట్లా ప్రవర్తిస్తే సముద్రం దాటివచ్చిన శ్రమ వ్యర్థంకాదు? ఇంత శ్రమ పడ్డవాడిని ఇక్కడ ఏం చేయకుండా వుండేదెట్లా? ఈ క్షణమే ఈ రూపముతోనే పోవాలా? అలా పోతే, రాక్షసుల కంటబడితే, రామ కార్యం, సీతాదేవిని వెతకడం చెడిపోతుందికదా? రాక్షస రూపంలో పోవాలా? లంకలోని వారందరూ ఒకరికొకరు తెల్సినవారే కదా? కొత్తవాడినైన నన్ను గుర్తించరా? ఇంకో రూపంలో పోయినా వారు తెలుసుకోవచ్చు కదా? ఈ రాక్షసులకు తెలియకుండా గాలి కూడా లంకలో సంచరించలేదుకదా!" అని హనుమంతుడు పరి-పరి విధాలుగా ఆలోచిస్తాడు.

"పోనీ ఇప్పుడు లంకలోకి పోవద్దు.... ఇక్కడే వుందామా? అప్పుడుకూడా ఎవరో ఒకరు నన్ను కనిపెట్టరన్న నమ్మకమేంటి? తనకు వారు కనిపిస్తుంటే, తనెందుకు వారికి కనిపించడు? వారిక్కడికి రావడం నిజం, రామకార్యం చెడటం కూడా నిజం. కాబట్టి ఇదీ సరైన మార్గం కాదు" అనుకుంటాడు హనుమంతుడు." అంటే ఇప్పుడీ రూపంలో లంకలోకి పోవడం తప్పే..... వుండడమూ తప్పే. కాబట్టి చీకటి పడేవరకు ఇక్కడే దాక్కొని, ఆతర్వాత చిన్న కోతిగా మారి, రావణుడి పట్టణంలో చొరబడి, సీతాదేవిని రాక్షసుల ఇళ్లలో వెతకాలి. అట్లైతే రామకార్యం చేసినవాడినన్న గౌరవంతో అతిశయించగలను" అని ఆలోచించాడు హనుమంతుడు. చీకటి పడేవరకు ఇక్కడే దాక్కొని, ఆతర్వాత

చిన్న కోతిగా మారి, రావణుడి పట్టణంలో చొరబడి, సీతాదేవిని రాక్షసుల ఇళ్లలో వెతకాలి అనే ఆలోచనకొచ్చాడో, దాన్ని కార్యరూపం చేయాలని సంకల్పించాడు. ఎప్పుడు సూర్యుడస్తమిస్తాడా, ఎప్పుడు సీతను చూడగల్గుతానా అని ఎదురుచూస్తుండగా, సూర్యుడు పడమటి కొండ పై అస్తమించాడు. సూర్యుడు పద్మినీ బాంధవుడైనందున, పద్మినైన సీత కార్యం తానుంటే నెరవేరదన్న భావంతో అస్తమించాడనుకోవాలి.

"ప్రదోష" కాలంలో లంకలో ప్రవేశించేంచిన హనుమంతుడు

తూర్పు తిరిగి సూర్యుడికి నమస్కరించి హనుమంతుడు లంక దాటేందుకు ప్రయత్నించాడు మొదట్లో. అంటే ఆయన బయలుదేరినప్పుడు ఉదయం ఏడెనిమిది గంటల సమయమై వుండాలి. తీరందిగి కొండెక్కి ఎంతోసేపు ఆలోచన చేసినప్పటికీ, ఇంకా పొద్దుగుంక లేదని చెప్పడమంటే, తీరందిగేటప్పటికి నాలుగు గంటలై వుండాలి. ఉదయం ఎనిమిది గంటలకు బయల్దేరి, సాయంత్రం నాలుగు గంటలకు తీరం దిగాడంటే, ఎనిమిది గంటల్లో సముద్రాన్ని దాటుండాలి. దీంట్లో ఓ గంట కాలం విఘ్నాలతో వ్యర్థమై వుండొచ్చు. ఏడు గంటల కాలంలో రెండొందల ఏభై మైళ్లు ప్రయాణం చేసాడన్నమాట. అంటే సగటున గంటకు ముప్ఫై ఆరు మైళ్లు పోయుండాలి. ఇదేం గొప్పకాదు. ఎందుకంటే తిరుగు ప్రయాణం ఒక్క గంట లోనే పూర్తిచేస్తాడు.

సూర్యుడు అస్తమించగానే, పిల్లి ఆకారంతో, "ప్రదోష" కాలంలో, లంకలో ప్రవేశించేందుకు, కొండ దిగి నడిచి రాకుండా, అక్కడి నుండే ఒక్క గంతేసాడు హనుమంతుడు (భోజనం, మైథునం, ప్రయాణం, తలంటు, హరిదర్శనం, ఇతర శుభ కార్యాలు ప్రదోషవేళ చేయకూడదు. అయినా హనుమంతుడు అందుకు పూనుకున్నాడు. ఎందుకీ పని చేసాడన్న అనుమానం రావచ్చు. అర్చకులను, పరిచారకులను, వైష్ణవులను, జ్ఞానులను, సన్యాసులను, దాసీ-దాసులను, ప్రదోషం బాధించదు. హనుమంతుడు జ్ఞానీ, వైష్ణవుడూ, రామదాసూ, కాబట్టి, స్వామి కార్యంలో ఆయనకు ప్రదోష బాధ కలుగదు).

మేడల వరుసలతో ప్రకాశిస్తున్న నాల్గు చదరాల దారులను, బంగారం, వెండి స్తంబాలతో ప్రకాశిస్తూ బంగారు కిటికీలున్న ఏడెనిమిదంతస్థుల మేడలను, గంధర్వ నగరాలను పోలివున్న మేడలతో స్ఫటికాలు పరువబడ్డ రాక్షసుల ఇండ్లను, వాటిలోని బంగారం, వైఢూర్యాలు, ముత్యాలు, పగడాలతో కూడిన అలంకరణను, ఆ ఇండ్ల వరుసను, వాటి రక్షణకై నియమించబడిన, శ్లాఘించదగిన కఠిన రాక్షసులను లంకా నగరం ప్రవేశిస్తూనే చూసాడు హనుమంతుడు. ఇలా వుంటుందీ లంకని ఆలోచనకైనా రాని దీన్ని రావణ రక్షణలో వుండగా సాధించడమంటే మాటలా? ఇది సాధ్యమయ్యేదిగా లేదని వ్యాకుల పడికూడా సీతాదేవి ఇందులో వున్నది కనుక, ఆమెను తాను దర్శించాలన్న కోరికతో సంతోషించాడు హనుమంతుడు.

చంద్రుడా సమయంలో (లోగడ సముద్రుడు, మైనాకుడు, సూర్యుడు లాగా) హనుమంతుడికి తోడ్పడడానికి వచ్చాడా అన్నట్లు, భూమ్యాకాశాలను తన కాంతితో కప్పేస్తూ, చుక్కల నడుమ చక్కగా కనిపించాడు. ఆరోజు ఫాల్గుణ శుద్ధ త్రయోదశి తిథి. రాత్రి ఏడున్నర గంటల కాలం (ఆశ్వయుజ శుద్ధ త్రయోదశి రాత్రి ఎనిమిది గంటల సమయంలో చంద్రుడిని చూస్తూ పై వ్యాఖ్య రాయబడింది. అప్పుడు చంద్ర బింబం నిర్మలంగానూ, వెన్నెల శుభ్రంగానూ వుంది). శంఖం, పాలు, తామరతూడు వంటి తెల్లని కాంతిగలవాడై మనోహర రూపాన ప్రకాశిస్తూ కనిపిస్తున్న చంద్రుడిని, తామర కొలనులోని నీట్లో ఆడుతున్న హంసలాగా సంతోషంతో చూసాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-3

ప్రాకారం చేరి ఆలోచించిన హనుమంతుడు

లంక బహుముఖ ఐశ్వర్యానికి మురిసిపోయిన హనుమ

వరుస ఉద్యానవనాలతో, రమ్యమైన నీటితో, శరత్కాల మేఘాల్లాంటి తెల్లటి ఇండ్లతో, సముద్ర ఘోషకు సమానమైన చప్పుళ్లతో, ఇంపైన వాకిళ్లు, తోరణాలతో, మెల్లగా వీస్తున్న పిల్లగాలులతో, బంగారువన్నె ఇంటి ప్రహరీ గోడలతో, మంటపాలతో అలరారుతూ, చిరుగజ్జెల సవ్వడితో కీర్తికెక్కిన అమరావతీ, భోగవతీ నగరాలను మరిపించే లంకాపురిని ప్రవేశించడానికి లంబ పర్వతంపైనుండి దిగుతాడు హనుమంతుడు. ఆయన దిగిన లంబ పర్వతమప్పుడు చీకట్లో వేలాడే పర్వతంలాగా వుంది. ఆలకాపురితో సమానంగా, చక్కటి పోషణలో వుంటూ, బలీయమైన సేనల గుంపులతో, మెరుపులతో నిండిన మేఘంలాగా, ఎంతో చిత్ర, విచిత్రంగా వుందే ఈ లంకానగరం! అనుకుంటాడు హనుమంతుడు.

ఇంద్రుడి పట్టణమైన "వస్వోకసార"ను, యముడి పట్టణమైన "సమ్యమని"ని, వరుణుడి పట్టణమైన "సుఖ"ను, సోముని పట్టణమైన "విభావతి"ని, పవమానసుతుడు జ్ఞప్తికి తెచ్చుకున్నడు, లంకా నగర సౌందర్యాన్ని చూసి. ఇట్లా మనసులో అనుకుంటూ, ప్రాకార సమీపాన్నుండి లంకా నగరాన్నొక్కసారి తేరిపార చూస్తాడు హనుమంతుడు. బంగారు తలుపులు, వైడూర్యపు అరుగులు, వజ్రాలు, ముత్యాలు, రత్నాలతో కట్టబడిన నేలలు, బంగారపు తొడుగులతో వున్న ఇళ్లు, శుభ్రంగా వున్న సోపానాలు, ఆకాశానికి ఎగురుతున్నారా అనిపించే బలవంతులు, హంసలు, నెమళ్లు కలిసి చేస్తే వచ్చే ధ్వనితో నిండిన ఆకాశం కనిపిస్తాయి హనుమంతుడికి. ఇంద్రుడి పురమనదగి, మనోహరమైన ఆ రావణుడి పట్టణాన్ని, దాని గొప్పతనాన్ని తిలకించి, ఎంతో సంతోషంతో దాన్ని గురించి మరీ, మరీ అనుకుంటాడు మనస్సులో హనుమంతుడు.

ఒరనిండా, చేతిలో, కత్తులుంచుకుని తిరిగే సైనికుల రక్షణలో వున్న ఈపట్టణాన్ని బలంతో గెలవడం ఎవరికీ సాధ్యం కాదేమో ననుకుంటాడు హనుమంతుడు. అయితే, అంగదుడు, ద్వివిదుడు, సుగ్రీవుడు, మైందుడు, సుషేణుడు, రుక్షుడు, కుముడు, కుషపర్వుడు, కేతుమాలుడు మాత్రం లంకలో ప్రవేశించ గలరనుకుంటాడు. (మొదట్లో లంకను చూసినప్పుడు నలుగురు మాత్రమే లోనికి రాగలరనుకుంటాడు. ఇప్పుడు ఆ సంఖ్యను తొమ్మిదికి పెంచాడు. కార్యభారం తెలియని మూర్ఖులు, మొదట్లో తమను, తమవారిని, ఎక్కువగా అంచనా వేసుకుంటారు. చివరకు వెల్లికిలా పడ్తారు. ఆలోచనాపరులు, బుద్ధిమంతులు, కార్యభారం తెలుసుకుని, ఇది మనం చేయగలమా? మనవల్ల జరుగుతుందా? అని తొలుత జంకుతారు. ఎట్లాగూ ఈపని నెరవేర్చక తప్పదుకదా! అని, కొంచం, కొంచం చేయడం మొదలెట్టి, క్రమంగా ధైర్యం తెచ్చుకుంటారు. కార్యాన్ని సాధిస్తారు. ఇన్ని ఆలోచనలు చేసినప్పటికీ, తానొక్కడే రాక్షసులను జయించి, లంకను కాల్చి వచ్చాడు గదా హనుమంతుడు)

ఈ ప్రకారం, లంకలోకి రాగల బలవంతులగు వానరులను లెక్కపెట్టి, రామలక్ష్మణుల బలపరాక్రమాలను ఆలోచించి, భయపడాల్సిన పనిలేదు, వారు వస్తే విజయం కలుగుతుందని సంతోషపడ్తాడు, (రామలక్ష్మణులు కూడా ఇక్కడ ఏమీ చేయలేరని మొదట్లో అధైర్యం పొందినా ఇప్పుడు ధైర్యం తెచ్చుకుంటాడు). ఇలా ఆలోచిస్తూ మరీ, మరీ సమీపంలోకి పోతాడు హనుమంతుడు. పోతున్న అతడికి, రావణుడి పట్టణం, మణులనే దుస్తులు కప్పుకొన్నట్లుగా, పశువుల కొట్టం లాంటి శిరోభూషణాలు కలదిగా, యంత్రశాలను పోలిన స్తనాలున్నట్లుగా, అలంకరించుకున్న స్త్రీ లాగా కనిపిన్చింది. (లంకా నగరాన్ని స్త్రీలాగా వర్ణించడమంటే లంకాధి దేవత రాక సూచించడమే). ఆయన ఇలా లంకను గురించి అనుకుంటుండగానే లంక స్త్రీగా రానే వచ్చింది.

చీకటనేది రాకుండా వుండేందుకై, నవరత్న ఖచిత ఇండ్ల సముదాయంతో నిర్మించిన లంకానగరంలో ప్రవేశిస్తున్న కోతిని లంకాదిదేవత లంఖిని తన సహజ రూపంతో చూసింది. అదే సమయంలో ఆమెనూ చూసాడు హనుమంతుడు. తక్షణమే కోపంతో వూగిపోతూ అసహ్యమైన ముఖాన్ని,

భయంకరమైన రూపాన్ని, దాల్చిన "లంక" హనుమంతుడికి అడ్డంగా నిల్చి గర్జిస్తూ, "నువ్వెవరివి? ఎందుకొచ్చావు? నీవు చావక ముందే చెప్పు" అని ప్రశ్నించింది. ఎల్ల వేళల, అన్ని ప్రదేశాలలో, రావణుడి సేనలతో రక్షించబడుతున్న లంకా నగరంలోకి దేవతలే ప్రవేశించలేనప్పుడు ప్రవేశించినా బ్రతకలేనప్పుడు, హనుమంతుడేలా రాగాలిగాడని నిలదీస్తుంది.

"సరే నా సంగతి తర్వాత చెప్తాను. వికారపు కన్నులతో, లంకా నగర వాకిట్లో వున్న నీవెవ్వరవు? ఇక్కడెందుకున్నావు? నాకెందుకు అడ్డుపడ్తున్నావు? ఊరంటూ వుంటే ఎవరో ఒకరు రాకుండా వుండరు కదా!" అని ఎదురు ప్రశ్న వేస్తాడు ఆంజనేయుడు. ఆమాటలు విన్న "లంక" మండిపడి, మారుతిని చూసి కోపంతో, భయంకరంగా మాట్లాడడం మొదలెట్టిందీవిధంగా:

"రావణాసురుడి ఆజ్ఞను శిరసావహించి, ఈ పట్టణాన్ని ఎల్లవేళలా రక్షిస్తున్నాను. నాకళ్లు కప్పి నువ్విందులోకి రాలేవు. అది సాధ్యపడే విషయం కాదు. ఓ కోతీ, నువ్విప్పుడే చస్తావు. నేనే లంకనురా! ఇది నాసంగతి. మరి నువ్వెవరివో చెప్పు."

"లంకిణి" మాటలకు ఏ మాత్రం అధైర్యపడలేదు హనుమంతుడు. స్త్రీ ఆకారంలో వున్న ఆమెను చూస్తూ, ఏమాత్రం సందహించకుండా: "సైన్యంతో, ప్రాకారాలతో, గోపురాలతో, వెడల్పైన ఇండ్ల ముంగిళ్లతో, తోటలతో, అందంగా వున్న, ఈ లంకను చూసిపోదామన్న కోరికతో వచ్చాను" అని చెప్పాడు. తనను గెలవకుండా ద్రోహబుద్ధి గల హనుమంతుడు రావణుడు రక్షించే లంకా నగరంలోకి ఎట్లా పోతాడో చూస్తానని కఠినంగా అంటుంది లంకిణి. ఏదేమైనా తాను లంకను చూసి శీఘ్రంగా వచ్చిన దారిలోనే పోతానన్న హనుమంతుడిపై మండిపడుతూ, భయంకరమైన ధ్వని చేస్తూ, అరచేత్తో ఆయన్ను కొడుతుంది. దెబ్బతిన్న మారుతి, కేకపెట్తూ, ఆడదానిపై తన ప్రతాపం ఎందుకు చూపాలని అనుకుంటూ పెద్దగా కోప్పడక, తన ఎడమచేతి పిడికిలితో లంకిణిని పొడుస్తాడు.

ఆ మాత్రం పిడికిటి పోటుకే, లంకిణి నోరు తెర్చుకుని, నేలమీద పడిపోయింది. హనుమంతుడు దాన్ని జాలిగా, దయతో చూశాడు. లంకిణి గర్వమణిగి హనుమంతుడితో: "వానరేంద్రా! నన్ను రక్షించు. నామీద దయ చూపు. నువ్వు చాలా పరాక్రమవంతుడవు. బలవంతులు స్త్రీలను చంపరాదన్న

నీతికి కట్టుబడ్డారు. నేనే "లంకిణి"ని. యుద్ధంలో సాహసంతో, బలపరాక్రమాలతో, నన్నే గెలిచావు. నీకు రాక్షసులు ఇక అడ్డమా? లంకా నగర ప్రతిష్ఠ సమయంలో నాకు బ్రహ్మదేవుడు వరమిస్తూ, సీతాదేవిని వెతికేందుకు వచ్చే కోతి నిన్నెప్పుడు గెలుస్తాడో, అప్పుడే లంక నాశనమౌతుందని చెప్పాడు" అంటుంది.

తాను సత్యం చెప్తున్నాననీ, బ్రహ్మ దేవుడు యదార్థం చెప్పాడనీ, ఆయన మాటలు తప్పు కావనీ, సీతాదేవి కారణాన రాక్షసులకు, రావణుడికి చావు మూడిందనీ, హనుమంతుడు నగరంలోకి పోయి పట్టణమంతా కలియతిరిగి, తన ఇష్ఠ ప్రకారం చేయదల్చుకున్న పనులన్నీ చేయవచ్చని హనుమంతుడికి చెప్తుంది లంకిణి. పతివ్రతల శాపానికి గురైన లంకలోకి ప్రవేశించి సీతను చూసేందుకు కోరిక తీరేవరకు సుఖంగా లంకలో తిరగమని కూడా సలహా ఇస్తుంది.

లంకలో ప్రవేశిస్తున్న హనుమంతుడికీ, అడ్డుతగిలిన లంకిణికీ, యుద్ధం జరుగుతున్నప్పుడు, వారు కొట్టుకున్టున్నప్పుడు, ఆ కేకలు వూళ్లో వున్న రాక్షసులకు ఎందుకు తెలియలేదని సందేహం రావచ్చు. గ్రామదేవతల గుళ్లు ఊరిబయట వుంటాయి. వూళ్లోకి రావటానికి వీల్లేని వ్యక్తులను, పొలిమేరదాటకుండా చేసేటందుకే వీరు అక్కడ కాపలా కాస్తుంటారని శాస్త్రం చెప్తున్నది. లంకిణికి, హనుమకు మధ్య జరిగిన గొడవ వూరిబయట జరిగింది. అదీ రాత్రివేళ. వూళ్లోవారి అరుపుల మధ్య ఇవి వినపడే అవకాశం లేదు. మరో విషయం, ఎవ్వరూలేని ప్రదేశం గుండా లంకలోకి ప్రవేశించే ప్రయత్నం చేసాడు హనుమంతుడు. ఇకపోతే , హనుమంతుడు చెప్పక పోయినప్పటికీ, బ్రహ్మదేవుడి మాటలను గుర్తు చేసుకున్న లంకిణి, హనుమంతుడు సీతాదేవికొరకే వచ్చాడని నిర్ధారించుకుంటుంది.

("లం" అనేది పృధివీ బీజాక్షరం. కాబట్టి పృథివీ తత్వాన్ని తెలుపుతున్నది. అది కలది "లంక". లంకంటేనే "దేహం". హనుమంతుడు లంకను జయించాడంటే, తనలోని ఆత్మను వెతికేవాడు, మొదట దేహాన్ని జయించాలన్న అర్థం స్ఫురిస్తున్నది. దేహాన్ని జయించనివాడికి ఆత్మావలోకనం జరగదు).

❖ ❖ ❖

సర్గ-4

లంకలో సంచరిస్తున్న హనుమంతుడు
రావణాసురుడి అంతఃపురాన్ని చూసిన హనుమంతుడు

రాక్షస సంచారం లేని ప్రదేశం ద్వారా హనుమంతుడు లంక లోనికి ప్రవేశించాడంటే, లంకా పరాజయం (లంకిణీ పరాజయం) రాక్షసులకు తెలిసే అవకాశం లేదనుకోవాలి. శత్రు స్థానాలలోకి దొడ్డిదారి ("అద్వారం") నుండే ప్రవేశించాలన్నది రాజనీతి. హనుమంతుడదే పనిచేసాడు. జరాసంధుడితో యుద్ధం చేసేందుకు పోయిన కృష్ణ, భీమార్జునులు అదే పని చేసారు.

(ఇలా చేయడం వెనుక "ముముక్షు" వైన "యోగి" చర్య ఎలా వుండాలో సూచించ బడింది. వివరం లోకి పోతే: "ఆత్మావలోకన పరుడు" సత్య విక్రముడై వుండాలి. "సత్యం" అంటే, "అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యం, అపరిగ్రహం" అనే "యమము" లన్నింటికీ ఉప లక్షణం. ఆత్మ, సత్యం వల్ల, తపస్సు వల్ల, జ్ఞానం వల్ల, బ్రహ్మచర్యం వల్ల లభిస్తుంది. ఇవన్నీ హనుమంతుడిలో వున్నాయి. కాబట్టి "సత్యం" అనేది అన్నింటికీ ఉప లక్షణం. బలహీనులకు "ఆత్మ" లభించదు. "లంక"నే దేహం ప్రకృతి పరిణామం. అది కామ రూపిణి. "లంక" శబ్దానికి "రంకుటాల" అనే అర్థం కూడా వుంది. ఈ జీవుడిని యీ జన్మలో అనుసరించిన దేహం, మరో జన్మలో మరో జీవుడిని ఆశ్రయిస్తుంది. అంటే యీ దేహం రంకుటాల లాంటిది. తపస్సుతో దేహాన్ని గెలవాలే కాని సౌమ్య మార్గంలో కాదు. నశించేది దేహం. దేహంలోకి పోయేందుకు "నవ" ద్వారాలున్నాయి. ఆత్మలో మనస్సు పోవడానికి యీ ద్వారాలు పనికి రావు.)

శత్రు దేశంలోకి ప్రవేశించేటప్పుడు ఎడమకాలు ముందుంచాలి. కాబట్టి సుగ్రీవుడి మేలుకోరి శత్రు స్థావరం చేరుతున్న హనుమంతుడు ఆ పద్ధతినే అనుసరిస్తాడు. మేలుకోరేవారింట్లోకి పోయేటప్పుడు కుడికాలు ముందుంచాలని అంటారు. ఊళ్లోకి పోయ్యేందుకు పూలతోను, ముత్యాలతోను, అందంగా కనిపిస్తున్న రాచబాటకు చేరిన హనుమంతుడు, మనోహరమైన ఆ పట్టణాన్ని నాలుగు దిక్కులనుండి చూసి, దాని బహుముఖ ఐశ్వర్యానికి మురిసిపోయాడు.

విశేషంగా ధ్వనిస్తున్న వీణానాదంతో, మేళ, తాళ ధ్వనులతో, పకపక నవ్వుల అతిశయంతో, వజ్ర వైడూర్యాలు నిండిన ఇళ్లతో, తెల్లని మేఘకాంతి కల్గి అతిశయ మహిమగల "స్వస్తికం", "పద్మం", "వర్ధమానం"అనే ఆకారాలున్న రాక్షస గృహసముదాయాలతో, చిత్రమైన మాల్యాలతో, భూషణాలతో, కాంతివంతమైన లంకా నగరాన్ని చూసాడు హనుమంతుడు. చూసిన వెంటనే సుగ్రీవుడి మేలుకోరి రామకార్యార్థమై లోనికి పోయేందుకు ప్రయత్నిస్తూ సంతోషిస్తాడు.

ఇంటింటికి పోతూ, పలురూపాలతో, అసమాన సౌందర్యంతో అలరారుతున్న ఇళ్లను కన్నులపండుగగా తిలకించాడు వాయుపుత్రుడు. అలా తిరుగుతున్న హనుమంతుడికి ఆ పట్టణంలో వర్ణనాతీతమైన పలురకాల ధ్వనులు వినిపిస్తాయి. ఆ ధ్వనులేమిటంటే.....స్వర్గంలోని దేవతా స్త్రీలలాగా లంకలో, "రొమ్ము, కంఠం, శిరం" లో పుట్టిన మనోహర, మంద్ర, మధ్యమ తారలనే స్వరాల రాక్షస స్త్రీలు పూర్ణ మదంతో ఆసక్తిగా చేస్తున్న గానధ్వనులు.....మనోహర రత్నాలు చెక్కబడ్డ రాక్షస స్త్రీల వడ్డాణాలలోని చిరుగజ్జెల ధ్వనులు.....అందెల ఝళం–ఝళ ధ్వనులు.....అందెలు, మెట్టెలు, పాముజీలున్న కాలి ఆభరణాలు మెట్లకు తగులుతున్నప్పుడు కలిగే ధ్వనులు.....వీరులు భయంకరంగా సింహనాదం చేస్తున్న ధ్వనులు.....శూరులు భుజాలు తట్టుకున్నప్పుడు పుట్టిన ధ్వనులు.....జపాలు చేస్తున్నవారి ధ్వనులు.....మాంత్రికుల ధ్వనులు.....ఇలా పలు రకాల, రకరకాల ధ్వనులు.

ఈ ధ్వనులకు తోడు, వేదాధ్యయనం చేసేవారిని, రాక్షస వందిమాగధులను, రాచబాటల నడుమ నిల్చున్న గుంపులను, వేగులను, గర్జించే రాక్షసులను, దీక్షలో వున్నవారిని, జడలు పెంచుకుని తిరుగుతున్నవారిని, బోడితలల రాక్షసులను, ఎద్దుచర్మాలు ధరించిన వారిని, దర్భ పిడికిళ్లు, అగ్నికుండాలు ఆయుధాలుగా కలవారిని, సమ్మెటలు, ఇనుప గుళ్లు ధరించిన వారిని, ఒంటికన్ను, ఒంటిచెవి, వేళ్లాడే పొట్టలు, రొమ్ములు కలవారిని కూడా చూసాడు హనుమంతుడు. మిట్టపళ్లున్నవారిని, పెద్ద విల్లంబులు ధరించిన వారిని, పొట్టివారిని, వంకర నోటివారిని, బాకులు, రోకళ్లు, గుదియలు,

ఇనుపముళ్ల గదలు ఆయుధాలుగ వున్నవారిని, కవచాలు తొడుక్కున్నవారిని, స్థూలకాయులు కానివారిని, కృశించని దేహాలున్నవారిని, మరీ పొడగరి కానివారిని, మరీ పొట్టి కాని వారిని, మరీ పచ్చని శరీరం లేనివారిని, కారునలుపు లేనివారిని, అంతగా గూనిలేనివారిని, వికార రూపాలున్నవారిని, సుందరులను, సుకాంతులను, అనేక రకాలవారినికూడా హనుమంతుడు చూసాడు. వలలు, పాశాలు చేతుల్లో వున్నవారిని, గంధం అతిగా పూసుకున్నవారిని, పూలదండలు వేసుకున్నవారిని, విలువ కట్టలేని ఆభరణాలతో అలంకరించుకున్నవారిని, ఇష్టమొచ్చిన రీతిగా తిరిగే వారిని, రకరకాలుగా అలంకరించుకున్న వారిని, భయంకర బలవంతులను, ములికైన ఆయుధాలు ధరించిన వారిని, వజ్రాయుధం లాంటి ఆయుధాలు పట్టుకుని తిరిగేవారినీ చూసాడు హనుమంతుడు. వీరికి తోడుగా రావణాసురుడి ఇంటి ముందు, ఆయన ఆజ్ఞానుసారం కాపలాకాస్తున్న ఆయన మూలబలగాన్నీ చూసాడు హనుమంతుడు.

అక్కడే చూసాడు రావణాసురుడి అంతఃపురాన్ని కూడ హనుమంతుడు. వర్ణనాతీతంగా వుందది. స్వర్గంతో సరిసమానమైన మనోహరధ్వనులు వినిపిస్తున్నాయక్కడ. గుర్రాల సకిలింపులూ, మనోహర భూషణ ధ్వనులూ వినిపించాయి. విమానం, పల్లకి, మదించిన ఏనుగులు, పక్షుల గుంపులు, జింకల్లాంటి వాటితో అందంగా కనిపిస్తూ, బలవంతులైన యుద్ధభటుల రక్షణలో వుందా అంతఃపురం. బంగారం, ఇతర రత్నాలతో ప్రకాశిస్తున్న ప్రాకారంతో, విలువైన ముత్యాలు, రత్నాలతో అలంకరించబడిన లోగిలితో, అగరు చెక్కల కమ్మని వాసనలతో కూడి వున్న రావణాసురుడి అంతఃపురాన్ని చూసాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-5

చంద్రవర్ణన

ఇంతవరకు పట్టణంలో సంచరించిన హనుమంతుడు, రావణుడి అంతఃపురాన్ని బయటనుండే చూసి, ఆ తర్వాత లోనికి ప్రవేశిస్తాడు. ఆరోజు శుద్ధ త్రయోదశి తిథి. సుమారు తొమ్మిదిన్నర గంటల ఆసమయంలో చంద్రుడు ఆకాశం మధ్యలో వెన్నెల కురిపిస్తున్నాడు ప్రకాశవంతంగా. హనుమంతుడు చూసిన ఆనాటి చంద్రుడు.....వినోదకరమైన వెన్నెల కాంతులను విరజిమ్ముతూ, అందమైన ఎడ్ల గుంపులో ఆబోతులా తిరుగుతూ, ప్రపంచమంతా తన చల్లటి కాంతిని వ్యాపింప చేస్తూ, జనాల మనస్సుల్లో సుఖపడ్తున్నామన్న ఆలోచన కలుగ చేస్తూ, ఉప్పొంగిన సముద్రుడి నృత్యాన్ని తలపిస్తూ, ఆబాలగోపాలానికి దుఃఖ నాశనం చేస్తున్నట్లున్నాడు.

భూమ్మీదున్న మందర పర్వతపు కాంతి, సాయం సమయంలో సముద్రంలో వున్న కాంతి, సరస్సులందలి తామరపూల కాంతిని పోలిన కాంతే చంద్రుడిలో వుందప్పుడు. వెండి పంజరంలోని హంసలా, మందర పర్వత గుహలోని సింహంలా, ఏనుగెక్కిన వీరుడిలా ఆకాశంలో వున్న చంద్రుడు, మనోహరంగా, అందమైన స్త్రీ ముఖంలా కనిపించాడు. వాడికొమ్ముల బలిష్టమైన ఎద్దులా, బంగారు కొమ్ముల ఏనుగులా, ఎత్తైన శిఖరమున్న తెల్లటి కొండలా వున్న చంద్రుడు ఆసమయంలో పరిపూర్ణ శృంగుడై (నిండిన కొమ్ములు) లోకాలకు ఇంపైన కాంతినిస్తూ ప్రకాశించాడు. (పాడ్యమి-విదియ-తదియలలో కనిపిన్చినట్లు చంద్రుడి కొనలు, త్రయోదశినాడు కనిపించవు. పూర్ణబింబానికి కొంచెం తక్కువగా కనిపిస్తుంది. ఊత్తర శృంగమని, దక్షిణ శృంగమని చంద్రుడి కొనలకు పేర్లు. ఆ రాత్రి ఆ శృంగాలు లేవు)

నశించిన మంచు తుంపరల్లా మాలిన్య రహితుడిగా, బృహస్పతి కాంతినే తన కాంతితో కప్పేసినవాడిగా, ఆశ్చర్యకరమైన కాంతికి ఆశ్రయమై నిర్మలాంకమున్నవాడిగా, అమిత కాంతితో వున్నాడప్పుడు చంద్రుడు. (ఈ వర్ణనతో మంచుకాలం వెళ్లిపోయి ఫాల్గుణ మధ్యంలో వున్నట్లు

విశదమవుతున్నది. సూర్యకిరణాల సంబంధమున్నందువల్ల తానువెలుగుతూ చీకటిని తొలగిస్తున్నాడని కూడా తెలుసుకోవాలి. సూర్యకాంతి అద్దంపై పడితే ఎలా ప్రతిబింబిస్తుందో, అలానే జలమైన చంద్రుడిపై పడ్డ సూర్యకాంతి కూడా ప్రకాశిస్తున్నదన్న అర్థం స్ఫురిస్తుంది)

విశాలమైన బండరాతిపై కూర్చున్న సింహమా? భీకర సంగ్రామంలో విజృంభించిన మత్తగజమా? రాజ్యం లభించిన రాజా? అనుకునేటట్లు, హంసలాగా ప్రకాశిస్తున్నాడు చంద్రుడు. అంత నిర్మలంగా వుంది చంద్ర బింబమప్పుడు. త్రయోదశి నాటి ప్రదోష కాలంలో ప్రకాశిస్తున్న చంద్రుడి వల్ల చీకటి పటాపంచలయింది. రాక్షసులు, మాంసం తినే మృగాల సంచారం మొదలయింది. స్త్రీ-పురుషుల మదనతాపం, ప్రణయకోపం పెరిగింది. అలా తన తేజస్సుతో స్వర్గలోక సంతోషంతో సమానమైన ఆనందాన్ని కలిగించింది చంద్రబింబమప్పుడు.

సరిగ్గా ఆసమయంలో వినవచ్చాయి కమ్మని వీణానాదాలు. కనిపించారు... శృంగార చేష్టల స్త్రీలు....నిద్రాతిశయంతో భర్తల వెనుకబడడం.... హింసకలవాటుపడ్డ మాంసభక్షకులు క్రూరమైన పనులు చేయసాగారు. భర్తలను విడిచి వున్న స్త్రీలు విరహతాపంతో బాధపడ్డారు. మద్యపానంతో శరీరాన్ని మరిచి ఏంచేస్తున్నారో తెలియని రాక్షసులుండే ఇళ్ల సముదాయాన్ని కనుగొంటాడు మారుతి.

లంకలో రాక్షస స్త్రీలను చూసిన హనుమంతుడు

ఒకరితో ఒకరు పరాచికాలాడుతూ, ఎదుటివారిపై పూలో, రాళ్లో వేస్తూ, మద్యపాన ప్రభావంతో దేహాన్ని మరిచి మాట్లాడుతూ, ఇతరులను బెదిరిస్తున్న రాక్షసులను హనుమంతుడు చూసాడు. రొమ్ములు తెర్చి వెల్లికిల నిద్రపోయేవారిని, స్త్రీల శరీరంపైన కాలు, చేయి వేసి ప్రక్కకు తిరిగి పడుకున్నవారిని, భర్తలకు గంధం, మనోహరమైన ఇతర లేపాలను పూస్తున్నవారిని, మొగుడిమీద కోపంతో వారు పలుకరించలేదని నిట్టూర్పులు విడుస్తూ, నొచ్చుకుంటున్నవారిని, భర్తలను రతికై ప్రార్థిస్తున్న స్త్రీలను హనుమంతుడు చూసాడు.

ఘీంకరిస్తున్న ఏనుగులను, పెద్దలకు నమస్కరిస్తున్న పెద్దలను, వీరభటులను లంకలో చూసాడు హనుమ. గొప్ప బుద్ధి కలవారిని, శాస్త్ర విశ్వాసం కలవారిని, మంచి పేర్లున్నవారిని, విశ్వప్రధానులను, అనేక ఆకారాలున్నవారిని, స్వగుణానురూపులను, అసమానరూపులను, అనేక గుణాలతో వెలుగుతున్నవారిని, వికార రూపాలున్న రాక్షసులను చూసాడు హనుమంతుడు. నిర్మల మనస్సున్న వారిని, పాతివ్రత్య మహిమ కలవారిని, భర్తలందు పరిశు ద్ధమైన ప్రేమున్నవారిని, నక్షత్రాలవలె ప్రకాశిస్తున్నవారిని, ఇలాంటి రకరకాల స్త్రీలను అక్కడి భవంతులలో చూసాడు ఆంజనేయుడు.

ముగ్ధనాయికలను (సంపూర్ణమైన సిగ్గుతో వున్నవారు), మధ్యనాయికలను (ప్రేమరసం ప్రధానంగా వున్నవారు), ప్రౌఢనాయికలను (ప్రియమైన భర్తలచే కౌగలింపబడినవారు), బాలనాయికలను (భర్తలను మోహింపచేసే విధం తెలిసినవారు), చక్కటి పూలు తురుముకున్న ఆడపక్షుల్లాంటి అందమైన స్త్రీలను, సంతోషంగా కనిపిస్తున్న స్త్రీలను, భర్తల అనుగ్రహానికి నోచుకున్న స్త్రీలను, వయస్సున్న స్త్రీలను, మారుతి చూసాడు. బంగరు మేడలలో కూర్చున్న స్త్రీలను, భర్తల వొడిలో వున్నవారిని, మగడి ఇష్టంతో అడిగిన పనులు చేస్తున్న స్త్రీలను, ధర్మ శాస్త్రాలు తెలిసి ధర్మకార్యాలు చేస్తున్న స్త్రీలను, కామావేశం వున్న స్త్రీలను, వికారమైన, విడ్డూరమైన, ఇంపైన చేష్టలు చేస్తున్న స్త్రీలను, పెళ్లై సంతోషంతో వున్న స్త్రీలను చూసాడు హనుమంతుడు.

అందంగా, బంగారం లాంటి చాయ కలవారిని, భర్త ఎడబాటుతో విరహతాపం పొందుతూ పాలిపోయినవారిని, రతి క్రీడలలో ఆరితేరిన వారిని, పమిటలుజారి, రవికలు లేనివారిని, రతి శ్రమతో కరిగిన సుపర్ణలను (కస్తూరి-కుంకుమపువ్వు లేపంతో చెంపలపైన, స్తనాలపైన చిత్రాలు వేయించుకున్న స్త్రీలు), గంధం పొడి వాసనగలవారిని, నిడుపాటి కళ్లు చెవులవరకూ వ్యాపించిన స్త్రీలను చూసాడు మారుతి. భర్తల వద్దకు తమంతట తామే పోయి, కౌగిలిలో చేరి ఆనందిస్తున్న వారిని, నడి వయస్సులోని స్త్రీలను, వారి, వారి ఇళ్లల్లోనే తిరుగుతున్నవారిని (వేశ్యలు), తీగల్లాంటి మృదువైన దేహసంపద కలవారిని, విశేష ప్రేమకు స్థానమైన వారిని, రాక్షసుల పడకటిల్లి

లోనూ, క్రీడామందిరాలలోనూ హనుమంతుడు చూసాడు. లేతవయస్సులో వున్నవారిని, చంద్రబింబం లాంటి ముఖం కలవారిని, వంకర కనురెప్పల వెంట్రుకలున్న వారిని, ఆభరణాలు ధరించిన వారిని, మెరుపు తీగల్లాంటి ఆడవారిని చూసాడాంజనేయుడు.

(సీతను వెతుకుతున్న హనుమంతుడు స్త్రీల ముఖ-నేత్రాలను చూడటానికి కారణముంది. వీరు దేవతాస్త్రీలా? మనుష్యులా? రాక్షస స్త్రీలా? అని పరీక్ష చేయడం ఓకారణం. ఆభరణ పరీక్ష, సీతాభరణ స్వరూపం నిర్ధారణ చేసుకోవటం కొరకే. సీతాదేవిని చూసినప్పుడు ఆమె సీతేనని నిర్ణయించడానికి ఆమె ఆభరణాలు ఓ ముఖ్య నిదర్శనమని ముమ్ముందు తెలుస్తుంది).

తను చూస్తున్న స్త్రీలలో, రాజ వంశంలో పుట్టినదాని లాంటి దానిని, వారిలోనూ మిక్కిలి మనోహరంగా వున్నదానిని, అలాంటి వారిలోనూ భర్త సమీపంలో లేనప్పుడు పతివ్రతలు ఎలావుండాలో అలా వున్నలాంటి దానిని, తీగలాంటి దేహమున్న దానిని, స్వసంకల్పంతో అయోనిజగా పుట్టిన దానిని మాత్రం చూడలేకపోయాడు హనుమంతుడు. పతివ్రతల మార్గంలో, ధర్మ మార్గంలో స్థిరంగా వుంటున్నదానిని, భర్త ముఖం కనిపిస్తేనే ఆనందించే దానిని, భర్తను కలుసుకోవాలన్న పట్టుదల వున్నదానిని, అతిలోక సుందరిని, భర్త హృదయంలో చొరబడే దానిని, విరహతాపంతో, కన్నీటితో తడిసిన కంఠం కలదానిని, అందమైన కనురెప్పలున్నదానిని, చక్కటి కంఠధ్వని కలదానిని, శ్రేష్ఠమైన బంగారు పతకం మెడలో వున్నదానిని, వనసంచారం చేస్తున్న నెమలిలాంటి దానిని, పాడ్యమినాటి చంద్రుడి లాంటిదానిని, దుమ్ముతో కూడిన కొత్త బంగారపు కడ్డీలాంటి దానిని, పుండులో బాణం గుచ్చుకుంటే బాధపడే లాంటి దానిని, గాలికి చిందరవందరైన సన్నని మేఘం లాంటి దానిని (సీతాదేవని అర్ధం) హనుమంతుడు చూడలేకపోయాడు. శ్రీరామచంద్రమూర్తి భార్య సీతాదేవిని తాను వెతికిన అన్ని రహస్య ప్రదేశాల్లో ఎక్కడా చూడలేక పోయినందుకు హనుమంతుడు బాధపడ్డాడు ఆసమయంలో.

❖ ❖ ❖

సర్గ-6

రావణ గృహాన్ని చూసిన హనుమంతుడు

రాక్షసుల ఇళ్లల్లో ఎంత వెతికినా, సీతాదేవిని చూడలేకపోయినందుకు చింతిస్తూ హనుమంతుడు తాను కోరిన రూపాన్ని ధరించి, మరింత వేగంగా, శ్రద్ధగా తిరిగి వెతకనారంభించాడు. సింహాల కాపలాలో నిరపాయంగా వుండే వనంలాగా, క్రూరాతి క్రూర రాక్షసుల కాపలాలో సూర్యకాంతితో సమానమైన ప్రాకారంతో చుట్టబడి వున్న రావణ గృహాన్ని చూసాడు హనుమంతుడు. (ఇంతకు ముందే రావణాసురుడి ఇంట్లోకి హనుమంతుడు ప్రవేశించాడని చెప్పడం జరిగింది. మళ్లీ ఎందుకీ ప్రస్తావన అనుకోవచ్చు. రావణ అంతఃపురంలో సీత వుందని అనుకొని అక్కడ వెతుకుదామనుకున్నాడు. అయితే అప్పుడు జామురాత్రే అయినందున, అందరూ నిద్రపోనందున, వారు మేల్కొన్నప్పుడు వెతకడం కుదరదనుకుని బయటకు వస్తాడు. లంకాపురంలో కాసేపు గాలిస్తాడు. అందువల్లనే లంకాపుర స్త్రీల వర్ణన జరిగిందప్పుడు. ఇప్పుడు ఇంకాస్త పొద్దు పోయినందున తిరిగి రావణుడి ఇంట్లోకి వచ్చి వెతకడం మొదలెట్టాడు)

దేదీప్యమానంగా వెలుగుతున్న ఆ ఇంటిని చూసి ఆశ్చర్యంతో ముక్కుపై వేలుంచుకుని దాన్నే చూడసాగాడు హనుమంతుడు. అందమైన ఆ ఇంటి ద్వారాలకు వెండి, బంగారు, రత్నాలతో అలంకరించబడిన తోరణ సమూహాలున్నాయి. ఏనుగులెక్కిన మావటీలు, కష్టం తెలియని శూరులు, అతివేగంగా పోగలిగే గుర్రాలు, పులుల, సింహాల చర్మాలతో కప్పబడి దంతం, బంగారంతో ప్రకాశించే రథాల గుంపులు, వెలలేని రత్నాలతో నిండిన పెద్ద పీటలు, అతిరథులకు స్థావరమైన అసమాన రథాలు, హనుమంతుడి దృష్టిలో పడ్డాయక్కడ.

రకరకాల మృగాలతో, పక్షుల గుంపులతో నిండివున్న ఆ భవన పర్యవేక్షణ, భయమనేది ఎరుగని కాపలావారి చేతుల్లో వున్నది. మనస్సుకు ఆహ్లాదాన్నిచ్చే చక్కటి స్త్రీలున్నారక్కడ. బలసిన చకోర పక్షులతో సమానంగా వుండే కళ్లున్న

స్త్రీల బంగారు ఆభరణాల రాపిడి ధ్వనులు సముద్ర ఘోషతో పోటీపడ్తున్నాయక్కడ. చందనం, అగరు ధూపాల వాసనలతో నిండి వుండి, మద్దెల ధ్వనులు మ్రోగుతుంటే, రాక్షసులతో ఎల్లప్పుడు పూజించబడుతూ, సముద్రాన్ని మరిపిస్తూన్న చందాన గంభీరంగా వున్నదా రావణ గృహం. ఆ ప్రాన్తంలో వీధి-వీధీ, వాడ-వాడా, తోట-తోటా, దొడ్డి-దొడ్డీ, మేడ-మేడా, మూల-మూలా, గొంది-గొందీ, ఇదీ-అదీ అనేది లేకుండా వెతకసాగాడు సీతకోసం హనుమంతుడు.

ఇలా తిరుగుతూ: ప్రహస్తుడి, మహాపార్శ్వుడి, మేఘంతో సమానమైన కుంభకర్ణుడు, విభీషణుడు, మహోదరుడు, విరూపాక్షుడు, విద్యుజ్జిహ్వుడు, విద్యున్మాలి, వజ్రదంష్ట్రుడు, శుకసారణులు, ఇంద్రజిత్, జంబుమాలి, సుమాలి, రస్మి, కేతువు, సూర్యశత్రువు, వజ్రకాయుడు మొదలైన వారి ఇళ్లకు వెళ్లి అక్కడ సీతాదేవికొరకు వెతుకుతాడు హనుమంతుడు. బలవంతులైన: ధ్రూమాక్షుడు, సంపాతి, విద్యుద్రూపుడు, భీముడు, ఘనుడు, విఘనుడు, వికటుడు, వక్రుడు, శరుడు, శుకనాశుడు, బ్రహ్మకరుడు, దంష్ట్రుద్వజుడు, గ్రీవుడు, యుద్ధోన్మత్త మత్తులు, రోమశుడు, విద్యుజ్జిహ్వుడు, ,హస్తిముఖేంద్రుడు, జిహ్వుడు, శోణితాక్షుడు, పిశాచుడు, కరాళుడు మొదలైన వారు వుండే ఇళ్లన్నింటిలో వరుస తప్పక సీత కొరకై వెతుకుతాడు హనుమంతుడు. అయినా ఫలితం కానరాలేదు.

పుష్పక విమానాన్ని చూసిన హనుమంతుడు

ఇలా వీళ్లందరి ఇళ్లల్లో వెతికిన హనుమంతుడు, రావణుడి ఇంట్లో ప్రవేశించే ముందర, పాశాలు, చిల్లకోలలు, కత్తులు, కటార్లు, శూలాలు, చేతుల్లో పట్టుకుని కావలి కాస్తున్న స్త్రీలను, ఆ దగ్గర్లోనే నిద్దరపోతున్న వారినీ చూస్తాడు. రకరకాల ఆయుధాలను ధరించి యుద్ధ రహస్యాలను ఎరిగిన రాక్షస మూకల్ని, వేగాతి వేగంగా పోగలిగే ఎరుపు, తెలుపు ఉత్తమ జాతి గుర్రాలను కూడా చూస్తాడు హనుమంతుడు. శత్రువుల ఏనుగులను, సైన్యాలను, నాశనం చేయగల శక్తిమంతమైన ఉత్తమ జాతి ఏనుగులనూ చూస్తాడు. చూడడానికవి ఇంద్రుడి ఐరావతంలా ఆకారపుష్టి కలిగి వున్నాయి. వర్షించే మేఘంలా, సెలయేర్లు

పారుతున్న కొండల్లా వున్నదా ఏనుగుల మదం. ఉరిమే మేఘంలా గర్జిస్తూ, ఘీంకరిస్తూ, తమని ఎలాంటి ఏనుగులూ జయించలేవన్న ధీమా కనబరుస్తున్నవవి.

బంగారు అలంకరణతో, బాలభానుడితో సరితూగే ప్రకాశంతో వుంది రామదూత హనుమంతుడు చూసిన రావణుడి ఇల్లు. రకరకాల పల్లకీలు, చిత్ర-విచిత్రమైన తీగలతో అల్లబడిన ఇళ్లు, క్రీడాగృహాలు, కొయ్యలపై నిర్మించిన మంచెలు (క్రీడించేందుకు), కామాన్ని పురిగొల్పే రతి గృహాలు, పగలు క్రీడించేందుకు అనువైన ఇళ్లు, పెంపుడు నెమళ్లుండేందుకు కట్టే మందిరాలను పోలిన స్థలాలు, ధ్వజ దండాలు, నిధుల సమూహాలను కూడా చూస్తాడక్కడ హనుమంతుడు. ధగ-ధగమని ప్రకాశిస్తూ, కైలాసంతో సమానంగా వుందేంటీ ప్రదేశమనుకున్నాడు మారుతి. కిరణకాంతులతో ప్రకాశించే సూర్యుడి మాదిరిగా, దేవతా విరోధి తేజంతోనూ, జాతిరత్నాల కాంతులతోనూ రావణుడి గృహం ప్రకాశించింది. మేడలు, మిద్దెలు, గుంపులు-గుంపులుగా వున్న ఇళ్లు, ప్రకాశించే రత్నాలతో తయారైన పాత్రలోని సారాయిని సేవిస్తున్న వారితో నిండిందా ప్రదేశం. బంగారు పానుపులు, మెరిసే బంగారు పాత్రలు, చిలకల్లాంటి ఉత్తమ స్త్రీలు, వారి అందెల ధ్వనులు సమ్మిళితమై, మనోహరంగా, విశాలంగా వున్న అందమైన రావణాసురుడి గృహాన్ని చూస్తాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-7

నగళ్లలో సంచరించిన హనుమంతుడు

మనోహర వైడూర్యాలు, బంగారంతో నిర్మించిన ఇళ్లను చూసాడు హనుమంతుడు. ఆ ప్రక్కనే వున్న, పక్షులు విహరించేలాంటి మెరుపు తీగలను బోలిన ఇళ్ల సమూహాలను, వర్షాకాల మేఘాలను పోలిన వివిధ శాలలను, శంఖాలున్న శాలలను, మేడపైన కట్టిన విశాల భవంతులను కూడా చూసాడు. జాతి రత్నాలతో ప్రకాశిస్తూ, ఇంద్రాది దేవతలతో పూజించబడుతూ, ఏ విధమైన వాస్తు దోషం లేనటువంటి, భుజబలంతో కుబేరుడిని గెల్చి సంపాదించిన, మయుడనే దానవుడి బుద్ధి చమత్కారాలతో నిర్మించబడిన, రత్న భూషణాలంకార శోభితమైన ఇళ్లనెన్నో చూసుకుంటూ ముందుకు సాగాడు హనుమ. మేఘంలా, బంగారంతో ప్రకాశిస్తూ, రావణాసురుడి బలానికి తగిన, భూమ్మీదెక్కడా దానికి సమానమైనది లేనట్టి, ఆకాశాన్నుండి జారిపడిన స్వర్గాన్ని బోలిన ఆకారంగల పుష్పక విమానాన్ని చూసాడు హనుమంతుడు. విస్తార కాంతిగల అనేక రత్నాలతో పొదగబడి, మనోహర పుష్పాలతో వ్యాపించి, తేనెవలె పుప్పొడితో నిండి, మెరుపులతో కూడిన మేఘంలా, మెరుపు తీగల్లాంటి దేహాలున్న స్త్రీలతో సమానంగా ప్రకాశిస్తున్నదా పుష్పక విమానం. హంసలు మోసే బ్రహ్మ విమానంతో సరితూగేదిగా వున్నదా విమానం. పర్వతాకారంతో, అనేక గైరిక ధాతువులతో కూడి వుందది. నానా వర్ణాలుండే మేఘంలా చిత్రమైన రూపంలో వుందది. ఇది ఆకాశమేమోనన్న భ్రమకలిగిస్తూ, సూర్య-చంద్రుల చిత్రాలున్నాయి దానిపైన. రత్న ఖచితమైన ఆ విమానాన్ని ఆశ్చర్యంగా చూసాడు హనుమంతుడు. **(భూమి-పర్వతాల వరుసలు, పర్వతాలు, వృక్ష సమూహాలు, వృక్షాలు, పూలరాసులు, పూలు, ఆకులు నిండి వున్నాయంటే, ఇవన్నీ చిత్రాలని అర్థం చేసుకోవాలి)**

పూలతో నిండిన నీళ్లు, పక్షుల కిలకిలారావాలతో నిండిన తోటలు, అకరులతోడి కమలాలు, కాంతులు వెదజల్లే గృహాలు, ఆకుపచ్చ పక్షులు,

ఉత్తమ జాతి గుర్రాలు, రత్నాలతో తయారైన పాములు, ఒక్కో పక్షి వర్ణనకు తగినట్టు రత్నాలతో చేయబడిన పక్షులు, పుష్పక విమానంలో చిత్రించ బడ్డాయి.

ఇక చిత్రించబడిన ఆ పక్షులు కామోద్రేకం పెంచేందుకు మన్మధుడికి సహాయపడే విధంగా వున్నాయి. రెక్కల కొనలందు పగడాలతో, బంగారపు కూర్పుతో, ప్రకాశవంతంగా చెక్కబడి వున్నాయి. ఏనుగులు స్వయంగా వాటి తొండాల్లో విచ్చిన కలువ పూలను, నీటినీ తెచ్చి అభిషేకిస్తే, తామరపూలు చేత ధరించిన లక్ష్మీదేవి సౌందర్యంతో సమానంగా పుష్పకవిమాన శిల్పం చేయబడిందట. **(ఇలాంటి ఛాయా చిత్రాలు చాలామంది ఇళ్లలో వుంటాయి. ఇవన్నీ ఏనాడో, ఎన్నో ఏళ్ల నాడే, రావణాసుర భవనంలో కూడా అలంకరించబడి వున్నాయని వాల్మీకం చెపుతున్నది)** సువాసనలు వెదజల్లే వృక్షమో, వసంత కాలంలో గుహలతో నిండిన పర్వతమో అన్న భావన కలిగే మనోరంజకమైన పుష్పక విమానాన్ని చూసిన హనుమంతుడు దాని రూపకల్పనకు ఆశ్చర్య పడ్డాడు. దాని చుట్టు ఎన్నిసార్లు తిరిగినా హనుమంతుడికి రావణాసురుడు స్త్రీలతో వుండే స్థలం కనిపించ లేదు. ఆ విమానం పరిమితీ అంతు బట్టలేదు. ఆపట్టణంలో ఎంతసేపు తిరిగినా, సమస్త ప్రదేశాలు వెతికినా, ఎన్నెన్నో వింతలు చూసినా, వెతుకుతున్న సీత జాడ తెలియరానందున ఏంచేయాలన్న విచారంలో పడ్డాడు సునేత్రుడైన హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-8

పుష్పక విమాన వర్ణన

సూర్యుడు సంచరించే మార్గమే తనకు ప్రధాన లక్ష్యంగా తిరిగే, విశేషంగా ఆకాశంలోనే సంచరించే, భూమ్యాకాశాలలో ఎక్కడైన వుండగలిగే, అసమానమైన పుష్పక విమానాన్ని నిశితంగా చూస్తాడు మళ్లా హనుమంతుడు. పరిమాణంలో విస్తారమైందది. పుష్పకాధారమైన ఇంటి నడిమిభాగంలో దగద్ధగాయమానంగా, బంగారు కాంతిని బోలి ప్రకాశిస్తున్నదది. దేవతల విమానాలలో కొన్ని భూమిపైకి రాలేవు, భూమిపైనున్నవి కొన్ని పైకి పోలేవు. కానీ, ఇది భూమ్యాకాశాలపైన ఎక్కడికైనా పోగలదు. అతి ప్రయత్నంతో, అత్యంత నేర్పరితనంతో చేయని భాగమందేదీ లేదు. దేవతా సంబంధమైన మణులు, వజ్రాలు కూర్చబడని భాగమందేదీ లేదు. దాని సౌందర్యం దేవతల విమానాలకు లేనేలేదు. దాంట్లోని ఏ భాగం, ఏ ప్రదేశం చూసినా ఆశ్చర్యం కలుగక మానదు.

ఘోరతపస్సు చేయడం వల్ల సంక్రమించిన పరాక్రమంతో సంపాదించబడిందా విమానం. హృదయ సమ్మతంగా తిరుగవచ్చా విమానంలో. నివారించనలవి కాని వాయువేగ, మనోవేగం కలదది. స్వర్గాన్ని మైమరిపించే శిఖరాలతో అలరారుతుందది. శరత్కాల చంద్రుడుని పోలివుంది. ఇంపైన కుండలాలతో అలంకరించబడిన ముఖాలున్నాయి దానికి. దేవతల, రాక్షసుల, ఇరువురి ఆకారాలున్నాయి దాని పెద్ద కళ్లల్లో. తిరస్కరించరాని వేలాది భూత సమూహాలు మోస్తున్నారు దానిని. అలాంటి వసంతకాల పుష్పంలాగా వున్న సుందర, పరిమళ, విశ్వకర్మ నిర్మితమైన పుష్పక విమానాన్ని చూసాడు ఆంజనేయుడు తనివితీరా.

❖ ❖ ❖

సర్గ-9

రావణుడి అంతఃపురాన్ని పరిశీలించిన హనుమంతుడు

పుష్పక విమానం మధ్యలో, అర్ధ యోజనం వెడల్పు, యోజనం పొడవున్న రావణుడి ఇంటిని చూసి, అందులోకి పోయి, అక్కడ సీతాదేవి కనపడుతుందేమోనని వెతకసాగాడు హనుమంతుడు. మేడలనేకం వున్న రావణుడి నగరంలోని బలవంతులైన రాక్షసుల ఇళ్లలోనూ, రావణుడుంటున్న ఇంటిలోనూ, తనకార్యక్రమాన్ని కొనసాగించాడు మారుతి.

ఆ ఇంట్లో మూడు-నాలుగు కొమ్ములున్న ఏనుగులు, దూరం-దూరంగా కట్టబడి వున్నాయి. యుద్ధానికి సిద్ధంగా ఆయుధాలెత్తి నిలబడ్డ యోధులు కాపలాకాస్తున్నారా ఇంటిని. రావణుడి భార్యలతో-వాడపహరించుకుని వచ్చిన స్త్రీలతో, రాచ కన్నెలతో నిండి వున్నదా ఇల్లు. తిమింగలాలు, మొసళ్లు, పొడుగాటి చేపలు, ఇతర జలచరాలతో కలతచెంది అల్లకల్లోలమైన సముద్రంలా వుందా ఇంటి ప్రదేశం. కుబేరుడి సంపద, ఇంద్రుడి ఐశ్వర్యం, దిక్పాలకులందరి లక్ష్మి ఆ ఇంట్లోనూ, వాడి బంధువుల ఇండ్లలోనూ వుంది. ఇవన్నీ గమనించాడు హనుమంతుడు.

అలాంటి అందాల మేడల మధ్యలో వున్న పుష్పక విమానానికి గత చరిత్ర ఎంతో వుంది. విశ్వకర్మ బ్రహ్మదేవుడి కొరకు రత్నాలతో పొదిగి ఆకాశంలో నిర్మించాడు దానిని మొదట. తనను సేవించిన కుబేరుడికిచ్చాడు బ్రహ్మ కొంతకాలం తర్వాత. కుబేరుడిని యుద్ధంలో గెల్చి, రావణుడు లాక్కున్నాడు దాన్ని. కృత్రిమ జింకల్లాంటి బొమ్మలతో అలంకరించబడిందా విమానం. బంగారపు కంబాలున్నాయి. ధగ-ధగ కాంతులు విరజిమ్ముతూంది. మేరునగమంత ఎత్తుగా వుంది. ఆకాశాన్ని రాసుకుంటూ, మిట్ట మధ్యాహ్నం సూర్యుడిలా ప్రకాశిస్తున్నది. బంగారపు మెట్లు, అరుగులు, కిటికీలున్నాయి. నీలాలు, పగడాలు, మంచి ముత్యాలతో చెక్కబడిందది. అట్టి హంగులున్న విమాన ప్రదేశం పైకెక్కాడు హనుమంతుడు. (ఎంతమంది ఎక్కినా మరొకరికి

స్థానంకూడా కలిగి వుండటాన్ని పుష్పక విమానంతో పోలుస్తుంటాం మనం. కానీ ఆంధ్ర వాల్మీకి అలా చెప్పలేదు-వాల్మీకి అలా అనలేదు. ఇది గమనార్హం.)

ఆ సమయమ్లో అప్పచ్చులు, పాకాలు, పులిహోర, దధ్యోదనము, కేసరీబాత్, వాంగీబాత్ లాంటి వంటకాల కమ్మని వాసనలు హనుమంతుడిని సంతోషపెడుతూ, తనను బంధువులా రావణాసురుడు తింటానికి రమ్మని పిలుస్తున్నట్లు అనిపించింది. ఆవాసన జాడపట్టుకుని పోసాగాడు హనుమంతుడు. పోతూ గమనించాడెన్నో దృశ్యాలను. మనోహర రత్న సోపానాలున్న, బంగారు కిటికీలున్న, దంతపు బొమ్మలున్న, పగడాలు, ముత్యాలు, బంగారం, వెండి కలయికల పటుత్వంతో తీర్చిన స్తంబాలున్న, ఆకాశానికెగురగల చిత్రాలు దిద్దిన కంబళ్లున్న, ఇంపు-సొంపైన పొడవాటి సుందరీమణిలాంటి-రావణుడి ప్రియభార్య కాగల లక్షణాలున్నటువంటి, ఇన్నింటిని చూస్తాడు హనుమంతుడు. కమ్మని సువాసనలు వ్యాపించి-పక్షుల ధ్వనులు మిన్నుముట్టుతుండగా- మెత్తని పరుపులు కాంతులీనుతుండగా, రావణాసురుడు తిరిగే ఆ ఇల్లు, సాంబ్రాణి-అగరు వత్తుల పొగలతో, ధూమ్రవర్ణంతో అలరారింది.

రావణాసురుడి రక్షణలో వున్న ఆ ఇల్లు, ఇంపైన ధ్వనులతో వీనులకు-రూపాలతో కళ్లకు-త్రాగటానికి ఇంపైన వాటితో చర్మానికి-వాసనలతో ముక్కుకు- నోరూరిస్తూ నాలుకకు తృప్తినిచ్చాయి హనుమంతుడికి. ఈ పంచేంద్రియ సుఖాలు తల్లివలె తృప్తినిచ్చాయి హనుమంతుడికి. (భార్య వల్ల కలిగే సుఖాలు "తల్లివలె" అనడంలో అర్థం, హనుమంతుడి జితేంద్రియత్వాన్ని గురించి చెప్పడమే).

(పై వర్ణనంతా కవి చేస్తూ, ముత్యాల గురించిన వివరణ ఇస్తారు కవి. ముత్యాలు: మేఘాలలో-పాముపడగలలో - వెదుళ్ళలో - చేపల్లో - ఏనుగుకుంభాల్లో - చెరకుల్లో-శంఖాల్లో - పంది కోరల్లో - ముత్యపు చిప్పల్లో, పుట్తాయట. మేఘాల్లో పుట్టేవి మానవులకు లభించవు. పాముపడగలోని ముత్యం గురివింద గింజ వన్నెలో వుంటుంది. వెదురులో పుట్టేది మినుప గింజంత పరిమాణంలో నక్షత్ర కాంతికలిగి స్త్రీ వశీకరణకు వుపయోగపడ్తుంది. చేపతలపై వుండే ముత్యం తెల్లగా-మల్లెపువ్వులా వుంటుంది. ఏనుగు కుంభంలో దొరికేది

వుసిరి కాయంత వుంటుంది. చెరకులో లభ్యమయ్యేది ప్రేంకణపు పూవు చాయలో వుంటుంది. పంది కొమ్ములోది రేగిపండంత ఆకారంలో, కుంకుమ ఛాయలో వుంటుంది. వెదురు ముత్యాలు కోడిగుడ్డంత వుంటాయి. ఇవి మంత్ర సాధకులకు లభిస్తాయి. స్వాతివాన చినుకులు ముత్యపు చిప్పల్లో పడితే మంచి ముత్యాలవుతాయి. పూర్వకాలంలో నానా దేశాలవారు వీటి వ్యాపారం కొరకు మనదేశానికి వచ్చేవారు. వీటిలో, ఆణి-సుతారము-సుపాణి అనేవి మంచి జాతి ముత్యాలు).

రావణుడి ఇల్లు, పుణ్యాత్ములు వెళ్లే సామన్య దేవలోకమా? ముఖ్య దేవతలైన ముప్పై ముగ్గురుండే స్థలమా? ఇంద్రుడే వుంటున్న ఇల్లా? బ్రహ్మ లోకమా? అన్న ఆలోచనలో పడతాడు హనుమంతుడు. సర్వస్వాన్ని ఓడిపోయిన నేర్పరి జూదగాడు ఇకచేసేందుకు ఏమీలేక-దిక్కుతోచక-కదలక, మెదలక వుండేలాంటి బంగారు దీపాలున్నాయి ఆ ఇంటిలో. ప్రపంచంలో ఎక్కడా సరితూగని ప్రకాశవంతమైన మణులతో చేసిన దీపాలను-సెమ్మెలను చూసాడక్కడ. దీపాల కాంతి-రావణుడి దేహకాంతి-వాడు ధరించిన బంగారపు సొమ్ముల కాంతి, కలవడంతో ఆ శాల మండుతున్నట్లు వెలుగుతోంది. ఆ విశేషం చూసి హనుమంతుడు, ఔరా! అని తనలో మెచ్చుకుంటాడు.

నానావిధాలుగా ప్రకాశించే చీరెలు-హారాలు ధరించి, తాగి-తందనాలాడుతూ, మత్తుగా నిద్రపోతున్న విలాసవంతులైన స్త్రీలను హనుమంతుడు చూసాడక్కడ. అరమోడ్పు కళ్లతో-అందమైన దంతాలతో, విస్తారమైన పద్మాల వాసన కలిగిన ముఖాలతో వున్న, పద్మినీ జాతి స్త్రీలను చూసాడక్కడ హనుమంతుడు. వారి కళ్లు ఉదయాన వికసించి, రాత్రి తమంతట-తామే ముడుచుకునిపోయే తామరపూలవలె సంతోషాన్ని కలిగించాయి. తుమ్మెదలు వీరి చుట్టూ తిరుగుతుండడం వల్ల, వీరి ముఖాలు తామరరేకులను పోలి వున్నాయనవచ్చు. సుందరమైన చల్లదనం, సువాసన, మనోజమైన ఆకారమున్న వారి ముఖాలు నిజంగా పద్మాలేననుకుంటాడు హనుమంతుడు.

రావణుడి అంతఃపుర స్త్రీలను చూసిన హనుమంతుడు

శరత్కాలంలోని ఆకాశం నక్షత్ర సమూహాలతో ప్రకాశించినట్లు, స్త్రీ రత్నాలతో రావణాసురిడిల్లు ప్రకాశించింది (రావణాసురుడు చంద్రుడు-స్త్రీలు నక్షత్రాలు). తామరపూలలాంటి ముఖాలున్న ఆ స్త్రీల మధ్యలో, రావణుడు, చుక్కల్లో చంద్రుడిలా వున్నాడనుకుంటాడు హనుమంతుడు. అయితే పుణ్యం క్షయిస్తే నేలరాలుతున్న నక్షత్రాలలాగా ఆ స్త్రీలను భావిస్తాడు ధైర్యవంతుల్లో శ్రేష్ఠుడైన హనుమంతుడు. కారణం, ఆ స్త్రీలు త్వరలో విధవలు కాబోతున్నారు కనుక. ఉత్తమ జాతి క్షత్రియ స్త్రీలు రాక్షసుడితో సంభోగించాల్సిన పరిస్థితి కలిగిందంటే అది వారి పుణ్యక్షయమే కదా! తళుకు-తళుక్కను నక్షత్రాల రూపం, నైర్మల్యం, ఘనమైన కాంతి, రావణుడింట్లో నిద్రిస్తున్న స్త్రీలలో కనిపించింది.

ఆ రాత్రి రెండో జాములో: మధ్యపానానంతరం రతికేళిలో ఒళ్లు, వంటిమీదున్న హారాలను మరిచి, ఆభరణాలు నేలరాలినా వళ్లు తెలియకుండా నిదురిస్తున్న హస్తినీజాతి స్త్రీలను చూసాడు హనుమంతుడు. చెమటకు తిలకం చెరిగిపోయిన, కాలిగజ్జెలు ఊడిపడిన, మెడదండలు పక్కల్లో పడిపోయిన, చీరెలు వదులై వంటి మీదుండి జారిపడిపోయిన, మెడలోని ముత్యాల దండలు తెగి నేలరాలిపోయిన, మొలతాళ్లు తునిగి పడిపోయిన, అలసిన గుర్రపు పిల్లలా పడుకున్న, తళుకు కమ్మలు ధరించిన రావణుడి అంతఃపుర స్త్రీలను చూసాడు హనుమంతుడు. వారిలోని కొందరు తమ దండలు తెగిపడిపోవటంతో, అడవిలో ఏనుగు త్రుంచిన పూలతీగల్లా వున్నారు. మరికొందరు స్త్రీల చనుదోయి పైనున్న ముత్యాలదండలు సూర్య-చంద్ర కిరణాల కాంతితో నిద్రిస్తున్న హంసల మాదిరిగా వున్నాయి. కొందరు స్త్రీలు ధరించిన వైఢూర్యాలు కాదంబ పక్షుల్లా వున్నాయి. కొందరి మెడల్లోని బంగారు సరములు చక్రవాకాల్లా వున్నాయి. హంసలచేత, కన్నెలేళ్లచేత, చక్రవాకాలచేత, ఇసుకదిబ్బలచేత ఒప్పు నదులలాగా, నడుము ముందు భాగాలతో ఒప్పే స్త్రీలున్నారా ఇంట్లో.

బంగారపు సొమ్ములనే వికసించిన తామరపూలు, ఒడ్డాణాలలోని చిరుగజ్జెల్లాంటి మొగ్గలు, మనసు మింగేలా మోహించే స్వభావమున్న శృంగార చేష్టలనెడి మొసళ్లు, కాంతులనెడి ఒడ్డులు కలిగి నిద్రిస్తున్న బాలికలు క్రీడాతిశయంతో అలసి-సొలసి, పరవశంతో ఏరుల్లా పారుతున్నారక్కడ.

(పదహారేళ్లు నిండిన ఆడదే "బాల"నీ, ఆ తక్కువ వయస్సుది రతికి యోగ్యురాలు కాదని, శాస్త్రాభిప్రాయంగా అంటారు కవి. ప్రధమ రజస్వల ఎప్పుడైనప్పటికీ, పదహారేళ్లు దాటేంతవరకు గర్భాదానం చేయరాదని కూడా వ్రాస్తారిక్కడ)

స్తనములపైన, చనుముక్కులపైన, కుసుమ మనోహరమైన అవయవములమీద, అందమైన రత్నాభరణాలు ధరించి నిద్రిస్తున్న ఆస్త్రీలను చూసిన మగవారెవరైనా మదన వికారంతో పరవశులైపోవాల్సిందే. (ఈ కారణం వల్లే స్త్రీలు నిదురిస్తున్నప్పుడు పురుషులు చూడరాదన్న నియమం ఏర్పడింది. స్త్రీలు కూడా వెల్లికిల పరుండకూడదు). ఆ సమయంలో నిద్రిస్తున్న స్త్రీల ముఖాల్లోనుండి వస్తున్న నిట్టూర్పుగాలులు పైటకొంగులను కదిలించి, వారి ముఖాలపై వింజామర వీస్తున్నట్లుగా వుంది. ఆ స్త్రీలకెవరికీ రవికలు లేవు. స్త్రీల అందమైన ముఖాల మీదున్న పైటలు ప్రకాశిస్తూ, మదనుడి ధ్వజాలను మరిపిస్తూ అందంగా వున్నాయి. వారి ముఖం నుండి బయటకొస్తున్న కమ్మని వాయువు, అలంకరించబడిన వెలగల కెంపులను, కమ్మలను, కొంచెం కదిలించింది.

చక్కెర కల్లు వాసన కొడుతున్న ఆ స్త్రీల కమ్మని శ్వాసలు మదాతిశయంతో రావణుడిపై వ్యాపించాయి. **(అంటే హనుమంతుడు రావణుడిని సమీపిస్తున్నాడని తెలుస్తున్నది)** సవతుల ముఖాలను రావణుడి ముఖమే ననుకుని, భ్రాంతితో ముద్దెట్టుకుంటున్నారు కొందరు స్త్రీలక్కడ. ముద్దుపెట్టుకున్నది రావణుడేననుకొని భ్రమించిన ఆ సవతి, మరో సవతిని ముద్దెట్టుకుంటున్నది. నిద్రా పీడితులై, పరుపులు వేసుకునే అవకాశంలేక, వాటిని తలగడలాగా పెట్టుకుని, కొందరు నిద్రిస్తుండగా, మరికొందరు పైటలు పరుచుకుని నిద్రిస్తున్నారు. కడియాల చేతులు తలక్రిందుంచుకుని కొందరు, ఒకరి రొమ్ముపై మరొకరి తల వుంచి ఇంకొందరు నిద్రిస్తున్నారక్కడ. ఒకరి తొడమీద మరొకరి తల వుంచి నిద్రిస్తున్నవారినీ చూసాడు హనుమంతుడు. విపరీతంగా తాగి, దేహాలను మర్చి, ఒకరిపై ఇంకొకరు పడిపోయి, పక్కలు, వీపు, తొడలు, నడుములుంచి మన్మథ కామంలో మునిగిన స్త్రీలున్నారక్కడ. చేతులు-చేతులు పెనవేసుకుని నిద్రిస్తున్న కబరీవతులను చూసాడు హనుమంతుడు. పెనవేసుకున్న తీగలపైనున్న పూల సమూహాల్లా, తుమ్మెద గుంపుల్లా, చైత్ర మాసంలోని వనంలా వుంది రావణాసురుడి "స్త్రీవనం". స్త్రీలక్కడ

పడుకున్న విధం చూస్తే: కాళ్లు–చేతులు–వస్త్రాలు–మూల్యాలు, ఇవి వీరివీ–అవి వారివీ అన్న భేదం లేకుండా కలిసిపోయి వున్నాయప్పుడు.

ఆ ఇంట్లోని మణిదీపాలు ఏకాగ్రంతో వెలుగుతున్న విధానం గమనిస్తే, రావణుడు నిదురిస్తున్నందువల్లనే, భయంలేక ఆదీపాలు తనివితీర వాడి స్త్రీలను చూస్తున్నాయా అన్నట్లున్నాయి. రావణుడు మేల్కొన్నప్పుడు దీపాలకు కూడా వాడి స్త్రీలను చూసే ధైర్యం లేదు. ఆప్రదేశంలో రావణాసురుడు స్వాధీన పరుచుకున్న రాజుల–ఋషుల–దైత్యుల కన్యలు, దేవతా స్త్రీలు, యుద్ధంలో గెల్చి కోరికబడి తెచ్చుకున్న స్త్రీలు, కామమున్న స్త్రీలు, మన్మధ తాపం సహించలేక, నిద్రమబ్బుతో ఒళ్లుతెలియక, రావణాసురుడి చుట్టూ పడిపోయి వున్నారు. అక్కడున్న వారందరూ రావణుడిని చూసి, వాడి శౌర్య సంపదలను చూసి వచ్చిన వారే! అందరూ అకామ కాములట!

అయితే దీనర్థం రావణుడు పరస్త్రీల నంటని సదాచార సంపన్నుడని కాదు. ఆ పడకటింట్లో మాత్రం వాడిని ఒల్లని స్త్రీలు లేరనే కాని, వేరే స్థలాల్లో లేరని కాదు. ఈ స్త్రీలలో వాడిమీద ప్రేమ లేనివారూ లేక పోలేదు. (రావణుడు సీతాదేవిని బెదిరించేటప్పుడు,ఆమె దుఃఖ పడుతుంటే, ఈ స్త్రీలలో కొందరు సైగలతో సీతాదేవికి ధైర్యం చెప్పారట. వాడిపై నిజమైన కామమున్నవారు అలా చేయరు కదా! దిక్కులేక వాడి పాల్పడ్డవారు వాడికనుకూలంగా వుండి అనుభవించారే కాని వాస్తవపు మక్కువ కానేకాదు. లోబడని వారిని అనేక ఇక్కట్లకు గురిచేసాడు)

రావణుడి భార్యలలో కురూపులు లేరు. ఉత్తమవంశంలో పుట్టనివారు లేరు. భర్తను ఉపచారాలతో సంతోషింప చేయని ముగ్ధా లేదు. భర్తను వశపర్చుకోలేనిది కాని, శృంగార చేష్టలతో భర్తను కామించలేనిది కాని లేనేలేరు. అప్పుడు సద్బుద్ధియైన హనుమంతుడికి ఒక దుర్బుద్ధి పుట్టింది. ఈరావణుడి భార్యలవలె, శ్రీరాముడి ధర్మపత్ని కూడా చేరి వుంటే, రావణుడు పుణ్యాత్ముడై వుండే వాడుకదా అనుకుంటాడు. వెంటనే అలాంటి ఆలోచన కలిగినందుకు, అసమాన పాతివ్రత్యం కలదై, అయోనిజ, అవనిజైన (భూమినుండి పుట్టినదైన) సీత అలా చేస్తుందా? అనుకుంటూ, తనకీ పాపపు ఆలోచన కలిగినందుకు చింతిస్తాడు. రావణుడు తన నాశనం కొరకు చేయరాని పని చేసాడు కదా అనుకుంటాడు.

❖ ❖ ❖

సర్గ-10

నిద్రిస్తున్న రావణుడిని, ఆయన భార్యలను చూసిన హనుమ

ఇలా పరిపరి విధాలుగా ఆలోచిస్తూ-చింతిస్తూ, సీతాన్వేషణ కొనసాగిస్తాడు హనుమంతుడు. అలా వెళ్తున్న అతడికి రావణుడి శయ్య కనిపిస్తుంది. చిత్రమైన దాని ఆసనాలు స్ఫటికాలతో, బంగరు వైడూర్యాలతో, దంతాలతో చేయబడ్డాయి. చంద్రబింబాన్ని మరిపిస్తున్న ఆ శయ్య వెడల్పాటి పరుపులతో, పట్టుదిండ్లతో, పూలమాలలతో అలంకరించబడి ప్రకాశిస్తోంది. మీద తెల్లని గొడుగుతో, బంగరు చెక్కడాలతో, సూర్యకాంతిని పోలిన అశోక పుష్ప పంక్తులతో అలరారుతుందది. అన్నివైపులా విసనకర్రలతో విసిరే ఆడబొమ్మలున్న ఆ శయ్య మేకపిల్ల చర్మంపై పరిచి వుంది. అగరు-సాంబ్రాణి ధూపాల గుబాళింపులతో ఆస్వాద యోగ్యంగావుంది. ఆ ప్రదేశంలో ఇంద్రుడి పానుపును మించిన రావణుడి మంచాన్ని తిలకించి ఆశ్చర్య పోతాడు హనుమంతుడు.

వర్షాకాల మేఘంలాంటి నల్లటి దేహవర్చస్సుతో, కాంతులీనుతున్న తేట తేట కుండలాలతో, ఎర్రటి పెద్ద కళ్లతో, సంధ్యారాగం, మెరుపు మేఘాల్లా పులుముకున్న ఎర్రటి గంధంతో, ప్రకాశిస్తున్న దివ్యాభరణాలతో, సుందరాంగుడై, కోరిన రూపాన్ని ధరించగల శక్తిగలవాడై, అసుర స్త్రీలకు ప్రియుడై, సర్వాలంకార శోభితంగా గడచిన రాత్రి సయ్యాటల అలసటతో కనిపిస్తున్న రావణాసురుడు ఆ పెద్ద పానుపుమీద నిద్రపోతుండడం గమనిస్తాడు హనుమంతుడు. వెండి అంచు వస్త్రాలను ధరించి, ఏనుగులాగ బుసలు కొడ్తూ, మత్తుగా త్రాగి నిదురిస్తూ, పొడుగాటి చేతుల్తో మందర పర్వతంలా తన రాక్షసులకు రక్షణ కలిగిస్తూ, యుద్ధంలో కఠినాత్ముడన్న పేరుతెచ్చుకున్న రావణుడిని సమీపిస్తున్న హనుమంతుడు, దయ్యాన్ని చూసిన అనుభూతిని పొందాడు. అయ్యో! ఈపాపాత్ముడి దగ్గరకెందుకొచ్చానా అని బాధపడ్డాడు కాసేపు. వెంటనే ఆపానుపు దిగి మరో అరుగువైపుకు పోయి ఆ కుచ్ఛితుడిని చూసాడు. మత్తగజ ప్రవాహంలాగా శ్లాఘ్యమై వున్న ఆ పానుపును మరోమారు చూసాడు. దానిపై నిద్రిస్తున్న రావణాసురుడి చేతులనూ చూస్తాడు మళ్లీ.

హనుమంతుడు చూసిన ఆ రాక్షసుడి రెండు చేతులు: విస్తార పరాక్రమంతో పొందిన కీర్తితో కూడి, బంగరు భుజకీర్తులు, రత్నాభరణాలతో అలంకరించబడి వున్నాయి. ఇంద్రధ్వజంతో సమానమై, ఇంద్రుడి వాహనమైన ఐరావతంతో తలపడినప్పుడు దాని కొమ్ముల పోట్లతో కాయలు కాచి వున్నాయి. వజ్రాయుధపు దెబ్బలను సహించే శక్తి కలిగి వుండి కూడా విష్ణుచక్రముతో గాయపడినందువల్ల బలంతో సమమైన మూపులపై ఆ గుర్తులు కనిపిస్తున్నాయి. నిర్మలమైన లక్షణాలు కలిగిన గోళ్లు, బొటనవేళ్లుండి, గుదియలను పోలి, ఏనుగుతొండాల్లా అందమై, ఐదుపడగల పామును పోలి వున్నాయి. పానుపై ఆవరించి పడివుండి, కుందేటి నెత్తురులాంటి ఎర్రని గంధం పూయబడి, స్త్రీలచే కౌగలించుకొనబడి, మంచి గంధపు వాసనకలిగి, యక్ష, పన్నగ, దేవతల, అసుర, గంధర్వ సమూహాలను ఏడ్పించి, మందర పర్వత శిఖరాల మధ్యలో నిదురించిన కోపపు పాములా భయపెట్టేవిగా వున్నాయి.

శిఖరాలతో కూడిన మందర పర్వతాన్ని పోలి, ఒక పక్కకు ఒరిగి నిద్రపోతున్న రావణుడి నోటినుండి, మామిడి, పున్నాగం, పొగడలతో తయారుచేసిన సారాయి వాసనలు ఇంటి నిండా వ్యాపించాయప్పుడు. ముత్యాల బంగారు కిరీటం, చెవిపోగులు ధరించిన రావణాసురుడు ప్రకాశిస్తున్న ముఖవర్చస్సుతో పాములాగా బుస కొడ్తున్నాడు. అతడి రొమ్ము ఎర్రటి గంధపు పూతతో, అందమైన హారాలతో, వెడల్పుగా కనిపిస్తోంది. ఒకప్రక్క వేలుకు అందమైన తెల్లటి పట్టు వస్త్రం చుట్టుకొనివుంది. వెలలేని బంగారు అంచు వస్త్రాలు కట్టుకున్నాడు. మినుముల రాశిలా, గంగ మధ్యలో నిద్రపోయి మైమరిచిన ఏనుగులా వున్నాడు.

కమ్మలతో, వాడిపోని పూదండలతో, పున్నమి చంద్రుడి నవ్వుముఖంతో రావణుడి కాళ్లదగ్గర నిద్రిస్తున్న, వాడి స్త్రీలను నిర్మలమైన మనస్సుతో చూసాడు ఆంజనేయుడు. మనోహరమైన ఆభరణాలు ధరించి, వీణ వాయించడంలో, నృత్యం చేయడంలో నేర్పు కలిగిన వారిలా కనిపించే స్త్రీలను పతి తొడలపై పరుండగా చూసాడు. అలా పడుకున్న వారి చెవులకున్న వైడూర్య కుండలాలను, బంగరు భుజకీర్తులను, చంద్రుడినే పరిహసిస్తున్న ముఖాలను, సౌందర్యంతో

తళుక్కుమంటున్న కమ్మలను చూసిన హనుమంతుడికి, ఆ సన్నివేశం నక్షత్ర సమూహాలతో నిండిన ఆకాశాన్ని తలపించింది. ఆ విధంగా "హాలారతి కేళీగతి లీలారతి" తేలి వున్నారు ఆ లీలావతులు. బాగా మత్తుగా మద్యం సేవించి, నాట్యాలు చేసి, భర్తతో రతిక్రీడలాడి, అలసి–సొలసి, వళ్లు తెలీకుండా అక్కడ పడిపోయి నిద్రపోతున్నారు రావణుడి భార్యలందరూ.

నాట్యంలో సమర్థత కలదైవున్న ఒకామె, నిద్రిస్తున్నపుడు కూడా హయగ్రీవాభినయంతోనే కనిపిస్తున్నది (నిదురించకముందు ఆ అభినయం చేసుండాలి). మరో అందగత్తె, వికసించిన తామరతీగ పడవకు చుట్టుకున్నట్లు, తన లేతచేతులతో వీణను కౌగలించుకుని పడుకున్నది. తుడుమును చంకలో బిడ్డలాగుంచుకుని సంతోషంగా నిదిరిస్తున్నది ఇంకొకతె. వేరొక ఆమె, తప్పెటను గట్టిగా పట్టుకుని నిదిరిస్తుంటే, దేశాంతరం పోయి చాలాకాలం తర్వాత ఇంటికి వచ్చిన భర్తను కౌగలించుకుని పడుకున్న దానిలా వుంది. కామాతిశయంతో, పిల్లన గ్రోవిని పట్టుకున్న ఒకామె, ప్రియుడి లింగాన్నే చేతిలోపెట్టుకుని నిద్రిస్తున్న అనుభూతిని పొందుతున్నది. కామ మదంతో ఒక కామిని ప్రియుడి రహస్సును గ్రహించినట్లు ప్రేమాతిశయంతో వేణుని చేత పట్టుకుని నిదిరిస్తున్నది. నృత్యంలో నేర్పున్న ఒకతి మగడి పక్కన పడుకున్న అనుభూతితో, వీణను కౌగలించుకుని నిద్రిస్తున్నది. బంగరు కాంతి, మృదుత్వం కలిగి మనోహరంగా, బలంగా అవయవాలున్న ఒకామె మృదంగాన్ని ఒత్తుకుని పడుకునుంది. మద్దెల వాయిస్తూ, అలసిపోయి దాన్నే చంకలో వుంచుకుని నిద్రిస్తున్నది ఒకామె. ముందు బిడ్డ, వెనుక వయసు మగడు (యువ వల్లభుడు) వున్న అనుభూతితో, ముందొక ఢక్కా, వెనుకొక ఢక్కా పెట్టుకుని నిద్రిస్తున్నదో ప్రమద. ఒళ్లెరుగని మరోస్త్రీ, మృదువైన తన చేతులనే ఆడంబరంగా కౌగలించుకుని నిద్రలో మునిగింది. రావణుడికి నీళ్లు పోసే పనిమనిషి, నీటి పాత్రను నిద్రమత్తులో నేలమీద పడేసి ఆనీటిలోనే పడుకుని చూడటానికి పెక్కురంగుల పూదండలా వుంది. తన "కుచాల"ను సంతోషంగా పట్టుకుని, నిదురిస్తున్నది ఆడతుమ్మెద లాంటి జుట్టున్న వేరొక కుంభస్తని. శరత్కాల చంద్రుడి లాంటి ముఖమున్న ఓ స్త్రీ, "సింహమధ్య"ను గట్టిగా మోహంతో పట్టుకుని పరున్నది. రకరకాల వాద్యాలను పట్టుకుని మరెందరో నిదురిస్తున్నారు. రాగల వైధవ్య చిహ్నాలేమో

నన్నట్లు, సొమ్ములూడిపోయి, చీరలు తొలగిపోయి, ముఖం పై పైటకొంగేసుకుని నిద్రిస్తున్నారెందరో. ఆ అశుభ దృశ్యాలన్నీ రాబోయే క్లేశాలకు సంకేతాలను ఇస్తున్నట్లున్నాయి.

వీరాంజనేయుడు ఇలా నిద్రిస్తున్న స్త్రీలందరినీ చూసుకుంటూ పోయి-పోయి, ఓ ప్రత్యేకమైన స్థలంలో, ఏకాంతంగా నిద్రిస్తున్న ముగ్ధ మనోహర సౌందర్యాతిశయం కల, మరో స్త్రీని గమనిస్తాడు. (వీరుడనగా ఇంద్రియ జయం కలవాడని అర్థం. ఇందరు సుందరీమణులను ఏకాంతంగా చూసినప్పటికీ, ఆయన మనస్సు చలించ లేదని భావం). ఇక ఇప్పుడు కనిపించిన స్త్రీ పట్టపు దేవి కనుక, ఈమూకలో కలవక వేరే ఒంటరిగా నిద్రిస్తోంది. మంచి ముత్యాల హారాలు వక్షసీమన వేలాడుతుంటే, మాణిక్యాల కాంతులతో ప్రకాశించే అలంకారాలు చేసుకుని వెలుగొందుతూ, బంగారు చాయ, పచ్చటి దేహం కలిగి, మదించిన ఆడుజింక కళ్లలాంటి కళ్లున్న, మనోహర సౌందర్యరాశి, పట్టపురాణి మండోదరిని అక్కడి పడకటింట్లో నిదిరిస్తుండగా చూసాడు హనుమంతుడు.

ఆమె ముగ్ధ మోహనాకృతిని చూసిన హనుమంతుడు, "సీతను చూసితి-చూసితి" నని సంతోషంతో భుజాలు తట్టుకున్నాడు. తోకను ముద్దిడుకుంటాడు. గెంతులేస్తాడు. సంతోషంతో స్తంభాలెక్కి దూకుతాడు. సంగీత విద్వాంసుడైన హనుమంతుడు మెల్లగా పాడుతాడు, తన స్వభావ సిద్ధమైన కపిత్వంతో. వాస్తవానికి సీతాదేవిని చూసినప్పుడు హనుమంతుడు ఈచేష్టలేవీ చేయలేదు. ఎందుకంటే, తన కష్టమంతా ఫలించింది కదా నన్న సంతోషంతో పొంగిపోయాడు.

❖ ❖ ❖

సర్గ-11

సీతాదేవిని పానశాలలో మరల వెతుకుతున్న హనుమంతుడు

"అబ్బ ఇప్పటికి చూసాకదా సీతాదేవిని" అని అనుకుంటాడు కొంతసేపు హనుమంతుడు. కుదుటపడ్డ ఆయన మనస్సు, ఈమెట్లా శ్రీరాముడి భార్య సీతాదేవవుతుందని తర్కించుకుంటుంది. "సీత పతివ్రత కదా! భర్తలేని సమయంలో నిద్రిస్తుందా? ఆహారం తీసుకుంటుందా? సంతోషిస్తుందా? ఆభరణాలు ధరిస్తుందా? కనీసం మంచి నీళ్లయినా రుచిస్తాయా?" ఇవన్నీ చేస్తున్న ఈ స్త్రీ సీతాదేవి అయ్యే అవకాశం లేనే లేదని నిర్ణయానికొస్తాడు. ఇంకా అనుకుంటాడు: "సీతాదేవి రామచంద్రమూర్తిని తప్ప ఇంద్రుడినైనా కన్నెత్తి చూస్తుందా? ఇక ఈ రాక్షసుడిని గురించి చెప్పటమెందుకు? ఉత్తమోత్తమ వస్తువు లభించినవారు అధమ వస్తువునాశిస్తారా? కాబట్టి ఈమె సీత కాద"ని నిశ్చయించుకుని, మండోదరిని దాటి ఆవలికిపోయి, మద్యం సేవించే పానశాలలో సీతను వెతకడం ప్రారంభిస్తాడు.

ఆటలాడి, పాటలుపాడి అలసిపోయిన, మద్యంతాగి వళ్లు మర్చిపోయిన వారు; మద్దెల, మృదంగం, పీటలను తలదిండుగా పెట్టుకున్న వారు; కంబళ్లు, తివాచీలు పర్చుకుని పడుకున్న వారు; నిర్మల రత్నాభరణాలతో అలంకరించుకున్న వారు; దేశకాల ఉచిత జ్ఞానం కలవారైన స్త్రీలూ చుట్టూ వుండగా, "బాహ్య-అభ్యంతర రతుల"తో, అలసి నిద్రించే రావణుడిని చూసాడు ఆ దారిలో హనుమంతుడు. (రతి రెండు విధాలు: బాహ్యమని - అభ్యంతరమని. ముద్దిడడం, కౌగలించుకోవడం, నఖదంతక్షతాదికాలవంటివి బాహ్యమైనవి. నానాబంధకల్పిత - సాక్షాత్సురతమ్ అభ్యంతరమంటారు. బాహ్యంగా, ఆలింగనంతో రతిని ఆరంభించాలిఅని రతిరహస్యం)

ఆవుల మందలో (ఆంబోతు) ఎద్దులా, ఆడ ఏనుగుల గుంపులో మగ ఏనుగులా స్త్రీ పరివారంలో వున్న రావణాసురుడిని చూసి, దాటిపోయి, మనోహర వస్తువులతో నిండిన మద్యపాన గృహ ప్రదేశాన్ని చేరబోయాడు హనుమంతుడు.

ఆ ప్రదేశంలో దున్నపోతుల, జింకల, పందుల మాంసాలు, కుప్పలు-తెప్పలుగా పడివున్నాయి. మీగడ పెరుగుతో సౌవర్చ లవణాన్ని కలిపి తయారుచేసిన కోళ్ల, నెమళ్ల, పందుల, ఖడ్గమృగాల, ఏదుల, లేళ్ల, కక్కెరల, చకోరాల మాంసాలున్న పాత్రలు సగ భాగం ఖాళీ అయిపోయాయి. ఇంకా నానావిధాలైన ఆహార పదార్థాలున్నాయి. అక్కడే తెగిపోయి పడిన హారాలను, అందెలను, రకరకాల ఆభరణాలను, పానపాత్రలందుంచిన ఫలాలను హనుమంతుడు చూసాడు.

అందంతో అతిశయిస్తున్న, కొత్త బంగారు రత్నాలతో తయారైన శయ్యలు, ఆసనాలు అక్కడక్కడా పడి వున్నాయి. వాటి కాంతితో ఆ గృహం నిప్పు లేకున్నా కాలుతున్నదేంటా? అన్నట్లుంది. పాకశాస్త్రంలో రాటుతేలిన వంటవారు వండిన రుచిగల మాంసాలతో, పూలతో, చక్కెరతో, ద్రాక్ష, ఇప్పపువ్వులతో తయారై, త్రాగడానికి సిద్ధంగా వున్న సారాయిని చూసాడు. వెండి, బంగారం, వెండి స్ఫటికాల పాత్రల్లోని రుచిగల పానీయాలను చూసాడు హనుమంతుడు. కొన్నిపాత్రల్లో సారాయి సగమే అయిపోయింది. కొన్నింటిలోది పూర్తిగా అయిపోయింది. కొన్ని నిండుగా వున్నాయి. భక్ష్యాలు తిన్నవి కొన్ని, కొరికినవి కొన్ని, కుప్పలుగా పడేసినవి కొన్ని, కనిపించాయి హనుమంతుడికి.

పగిలిన గిన్నెలు, దొర్లుతున్న కుండలు, నేలమీద పడ్డ నీళ్లు, దండలు, నానా రకాల పండ్లు, నిద్రలో ఒకరినొకరు గట్టిగా కౌగలించుకుని పడుకున్న సుందరీమణులు, ఒకదాని చీరెను మరొకతె రొమ్ముపై కప్పుకుని పడుకున్న స్త్రీలు అక్కడి మరికొన్ని దృశ్యాలు. అందగత్తెలు వంటిపై ధరించిన సొగసైన దండలు, చీరెలు, నిట్టూర్పులతో కొంచెం-కొంచెం కదిలి, పిల్లగాలుల సుఖాన్ని గుర్తుచేసింది. గంధం, పూదండల-సారాయి రసాల-నలుగు పిండ్ల-ధూపాల వాసనలు వ్యాపించాయక్కడ. వివిధ వర్ణాల స్త్రీలు రతికేళిలో అలసి తామరతీగల్లా నిద్రపోతున్నారక్కడ.

రావణుడి అంతఃపురమంతా వివరంగా గాలించినప్పటికీ, సీతాదేవి రూపం, ఆమె వున్న స్థలం జాడ ఏ మాత్రం తెలవకపోవటంతో చింతించాడు హనుమంతుడు. అక్కడ నిదురిస్తున్న స్త్రీలలో పైటలు తొలగినవారిని, చీరలు

తొలగిన వారిని, ఇతరులను చూసి, ధర్మ విరుద్ధమైన కార్యం చేసినట్లు బాధపడ్డాడు. "ధర్మలోపం కరిశ్యతి అని వాల్మీకమ్". పరస్త్రీలపై తన దృష్టి పారదనీ, అట్లాంటప్పుడు, మేడల్లో వళ్లుమరిచి నిద్రిస్తున్న స్త్రీలను, కపటవిధంగా ఎందుకు చూసానా అని విచారిస్తాడు. నిద్రిస్తున్న స్త్రీలను, అందునా పరస్త్రీలను, వారిలోనూ ఒళ్లెరుగక చీరలు తొలగివున్న స్త్రీలను చూడరాదనే ధర్మానికి, విరుద్ధంగా వ్యవహరించానే అని చింతిస్తాడు.

మేల్కొని తిరుగుతున్నప్పుడే ఇతరుల భార్యల మోకాలు పైభాగం చూడకూడదు. చూస్తే పాపకార్యం. అట్లాంటప్పుడు నిద్రలో పరవశమై వళ్లు తెలియకుండా వున్న పరస్త్రీలను చూసి పాపం చేసాననుకుంటాడు. ఇట్లా ఆలోచిస్తున్న హనుమంతుడి మనసుకు, తాను చేసింది తప్పా-ఒప్పా అని నిశ్చయించి తీర్మానించగల సామర్థ్యం-బుద్ధి మళ్లీ కలిగింది. అప్పుడనుకుంటాడు: "రావణాసురుడి స్త్రీలనందరినీ చూసాను. చూస్తే వచ్చిన హాని ఏంటి? నాబుద్ధి కొంచెమైనా చలించలేదే! పాప-పుణ్య కార్యాల్లో ఇంద్రియ వ్యాపారం జరిపేదే మనస్సు. చూసినంత మాత్రాన, విన్నంత మాత్రాన, పుణ్యంకాని, పాపం కాని రాదు. మనస్సు పాపపు బుద్ధి కలదైతే ప్రత్యక్షంగా చూసినా-చూడకున్నా పాపం వస్తుంది. పుణ్యదృష్టి కలదైతే పుణ్యమే కలుగుతుంది. ఏ అభిలాష లేకున్నవారికి ఏదీరాదు. కావున మనోవ్యాపారం ప్రధానం కానీ, ఇంద్రియ వ్యాపారం కాదు. నామనసులో అభిలాష అనేది లేనేలేదు. నేను వీరిని కామాసక్తితో చూడలేదు. చూసిన కారణంవల్ల కామం కలగలేదు. ఇకనాకేమీ భయం లేదు"

ఇలా విచారించే బదులు ఇంకోచోట వెతుకుతాననుకుంటాడు. ఆడది ఆడవారి మధ్యలో వుండక ఎక్కడుంటుందని నిష్కాముడనై, కర్తవ్యం నెరవేర్చాలి అనుకుంటాడు మరల. "నిష్కల్మశమైన మనస్సుతో అంతఃపురమంతా మిక్కిలి శ్రద్ధతో వెతికాను-సీతాదేవి ఎక్కడా కానరాలేదు కదా" అనుకుని, పానశాలను విడిచి, అంతఃపురంలో వెతకసాగాడు మళ్లీ.

❖ ❖ ❖

సర్గ-12

సీతాదేవి కనిపించక విచారపడిన హనుమంతుడు

ఆ అంతఃపురం మధ్యలో తీగలతో ఏర్పాటుచేసిన ఇండ్లలోనూ, చిత్రాలతో అలంకరించబడిన ఇండ్లలోనూ ఎంత వెతికినా సీత కనపడలేదు. ఆమె కనపడనందున ఒకవేళ మరణించిందేమోనని అనుకుంటాడు. పాతివ్రత్య రక్షణకు పూనుకుని, సత్పురుషులతో స్తుతించబడే సుగుణోపేత సీతామాత ఆత్మహత్య చేసుకోక పోయుండవచ్చునేమో కాని, క్రూరుడైన రావణుడు చంపాడేమోనని అనుకుంటాడు. కాకపోతే కామాసక్తుడై తెచ్చిన వాడు నయానో, భయానో, కోరిక తీర్చుకునే ప్రయత్నం చేస్తాడు కాని, హింసించి వుండడనుకుంటాడు. ఒకవేళ భయంకర-వికార దేహాలు, ముఖాలు, కన్నులు వున్న రాక్షస స్త్రీలకు భయపడి సీతాదేవి ప్రాణాలు వదిలిపెట్టిందేమో... ఏం చేయాలిప్పుడని ఆలోచనలో పడ్తాడు హనుమంతుడు. చెప్పిన పౌరుష వాక్యాలను నెరవేర్చలేక, సీతను చూడలేక సుగ్రీవుడు పెట్టిన గడువు దాటినతర్వాత, ఆయన్ను చూడడం ఏ ధర్మాన్ననుసరించి చేయాలని భయపడ్తాడు. ఒకవేళ వెళ్లినా బలవంతుడైన అతడు తన ఆజ్ఞను మీరినందుకు తనను దండించక మానుతాడా? అని తలపోస్తాడు.

"అంతఃపురంలో చూసాను.... రావణాసురుడి స్త్రీలందరి మధ్యలో చూసాను. అయినా ఎక్కడా సీతాదేవి కనిపించలేదు. చేయాల్సిన కృషి అంతా చేసానే! శ్రమ వ్యర్థమైందికదా!" అని అనుకుంటాడు హనుమంతుడు. వానరుల ఎదుట పౌరుషాలు పలికినందుకు; "హనుమంతా...ఏంచేసొచ్చావు? సీతను తెస్తానంటివే? తెచ్చావా?" అని అడిగితే జవాబేమివ్వాలి? వెతికాను, కానరాలేదు, పోయినవాడిని పోయినట్లే తిరిగొచ్చాను అని చెప్పనా? అలా ఎలా చెప్పేది? చెప్తే మంచిగుండదు. ఇలా అనుకున్న హనుమంతుడు, ఇక్కడే వుండి వెతుక్కుంటూపోతే, హనుమంతుడు రావణుడి చేతిలో చచ్చిపోయాడేమో ననుకోవచ్చు నని తలుస్తాడు. అలా అనుకుని మిగిలిన వానరులు తామూ బ్రతికుండి ప్రయోజనం లేదనుకుని ప్రాయోపవేశం చేయడానికి

నిశ్చయించుకోవచ్చుననుకుంటాడు. ఇక్కడుండకూడదు, మరలిపోవాల్సిందే అనుకుంటాడు. పోతే నాడు పొగిడిన, శ్లాఘించిన జాంబవంతుడు,అంగదుడు, ఇతర వానర ముఖ్యులు "ఛీ" అంటారేమోనని కూడా భయపడ్డాడు.

తానిక్కడ ఊరకనే ఉండరాదనీ.... వ్యర్థుడై పోనూకూడదనీ..... అధైర్యపడకూడదనీ.... కార్యం ఎట్లాగైనా సాధించాలనీ.......సకల కార్యాలను నెరవేర్చే ఉత్సాహాన్ని ఆశ్రయించి మళ్లీ ప్రయత్నించాలనీ నిశ్చయించుకుంటాడు హనుమంతుడు. రావణాసురుడు రక్షించే అన్నిప్రదేశాలు: పానగృహాలు, చిత్రగృహాలు, తోటలు, కేళిశాలలు, సందులు, గొందులు, వీధులు, విమానాలు, ఇవీ, అవీ,అన్నీ విడిచిపెట్టకుండా గాలించాలనీ ఆలోచిస్తాడు. అనుకున్నదే తడువుగా వెతకడం ప్రారంభించాడు. నేలమాళిగలలో, నాలుగు వీధులు కలిసే ప్రదేశాలలోని మందిరాలలో, రావణుడింటి దగ్గరున్న ఆటపట్టులలో, ఇలా పోయినచోటికే పోయి, ఎక్కినమెట్టే ఎక్కి, దిగినమెట్టే దిగి వెతుకుతాడు. ప్రాకారాలలో, ఇంటింటి మధ్యనున్న వీధుల్లో, అరుగుల్లో, దిగుడుబావుల్లో, సరస్సు తీరాలలో నానారూపాల రాక్షస స్త్రీలు కనిపించారేకాని సీత జాడ లేదు. విద్యాధర స్త్రీల మధ్యనూలేదు. భోగినీ స్త్రీలు, అందగత్తెలలోనూ లేదు. నాగకన్యలందూ సీత కనిపించలేదు. రావణుడికి అనుకూలురైన స్త్రీల మధ్య, ప్రతికూలురైన స్త్రీల మధ్య ఎంత వెతికినా సీత కానరాక పోవటంతో శోకం, దుఃఖం, సంభ్రమం కలసిన మనస్సుతో తాను పరాక్రమించి సముద్రం దాటడం వ్యర్థమై పోతున్నదేనని దిగులు పడ్డాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-13

ప్రాకారం చేరి సీత కనపడలేదని దిగులుపడ్డ హనుమ

అక్కడినుండి ప్రాకారం మీదకు చేరిన హనుమంతుడు సీతాదేవిని చూడలేకపోయినందుకు చింతించసాగాడు. మనస్సు కలతచెందింది మరోమారు. లంకలోని చెరువులు, గుంటలు, సరస్సులు, నదులు, వంకలు, వాగులు, కొండలు, డొంకలు, సమస్త ప్రదేశాలలో వెతికినా వ్యర్ధమయింది కదా అని వ్యాకులపడ్డాడు. తర్వాత ఇలా ఆలోచిస్తాడు:

"సీతను చూడలేకపోయాను. సీత రావణుడింట వున్నదని ఎంతోనమ్మకంతో చెప్పాడే సంపాతి! అయినా ఆమె ఇక్కడ కనపడలేదాయె! ఏంచేయాలి? సంపాతి అసత్యమాడడే? దానివలన అతడికి కలిగే లాభమేంటి? కాబట్టి ఇక్కడే ఎక్కడో సీత వుండేవుండి తీరాలి. ఎందున్నదో? రావణాసురుడికి వశపడినందున వాడామెను వీరందరిలో కలపక మరెక్కడైనా వుంచాడా? ఛీ, ఎందుకిలాంటి తప్పుడు ఆలోచనలు వస్తున్నాయి? ఆమె జనకరాజు కూతురు....మిధిలలో పుట్టింది..... శ్రీరాముడి భార్య.....విదేహ సంబంధమున్నది......భూమిలో పుట్టింది..... పేరు సీత...అలాంటిది కామవశు రాలై దుష్టుడు, జాతివల్ల నీచుడు, దనుజుడు, క్రూరుడు, మనుష్యులను తినేవాడైన రావణుడిని ఎట్లా కామిస్తుంది? అట్టి విపరీతం ఎప్పటికీవుండదు"

"సీతాదేవి ఇందులేదు-అందులేదు. పోనీ రావణుడు అపహరించుకుని ఎత్తుకొస్తున్న సమయంలో, అబల అయిన సీత నడితోవలో పడిపోయి వుండవచ్చా? అలాకాకపోతే ఆకాశమార్గాన తన్నెత్తుకుని రావణుడు పోతున్న సమయంలో, క్రిందున్న సముద్రాన్ని చూసి, పరవశించి, వశంతప్పి, దాంట్లో పడిపోయిందా? వాడి వేగానికి ధైర్యం కోల్పోయి, వణకుతూ ఆకాశంలోనే తనువు చాలించిందా? శ్రీరామచంద్రుడిని, పున్నమినాటి చంద్రుడినే తిరస్కరించేరీతి ముఖాన్ని, తామరపూలరేకుల్లాంటి ఆయన కళ్లను స్మరిస్తూ ప్రాణం విడిచిందా? రావణుడే భక్షించాడా? రావణస్త్రీలు చంపారా? చంపి తిన్నారా? రామా! లక్ష్మణా! అంటూ ఏడుస్తూ మరణించిందా? ఇలా పరిపరి విధాలుగా అనుకుంటాడు.

రామపత్ని సీత రావణాసురుడి వశంకావడం కల్లనీ, అందువల్ల, వాడే ఎక్కడైనా సీతను దాచైనా వుంచి వుండాలి, లేదా, పతివ్రత కనుక వశపడక సముద్రంలో పడి మరణించైనా వుండాలి అనుకుంటాడు. భార్యపై ప్రేమ వున్న రాముడికి తాను ఏమనిచెప్పాలని మథనపడ్తాడు హనుమంతుడు.

సీతాదేవి కనపడలేదని ప్రాణత్యాగం చేద్దామనుకున్న హనుమంతుడు

సీత కనపడలేదని చెప్తే కీడు తప్పదు...చెప్పకపోతే దోషం కల్గుతుంది.... అంటే, చెప్పినా, చెప్పకున్నా కీడే! చెప్పాలా? వద్దా? అన్న మీమాంసలో పడ్తాడు హనుమంతుడు. ఏవిధంగా ఆలోచన చేసినా ఆయన మనస్సు కుదుటపడలేదు. ఒక ఆలోచన చేస్తుంటే, దాన్ని బాధించే ఆలోచన మరోకటి వస్తున్నది. ఇలాంటి సందర్భాలలో కాలానుగుణమైన, యోగ్యమైన నీతి ఏమిటా అని మరీ-మరీ ఆలోచించ సాగాడు. తాను కిష్కిందకు పోతే కలిగే లాభమేంటి? సముద్రం దాటడం, లంకలో ప్రవేశించడం, సీతను వెతకడం, రాక్షస ముఖ్యులను చూడడం, ఇవన్నీ వ్యర్థమైపోయి, సీతను చూడకుండా అక్కడకు పోతే, పుణ్యమా? పురుషార్థమా? అని తలపోస్తూ, అనుకుంటాడీవిధంగా:

"నేను పోయి సీత కనబడలేదనగానే, వానరులు, సుగ్రీవుడు, రామలక్ష్మణులు నన్నేమంటారు? లేనివస్తువు కనిపించలేదంటే దండిస్తారా? దండించక పోవచ్చునేమోకాని, ఆమాట విన్నంతనే శ్రీరాముడు ప్రాణం విడవడానికి సిద్ధపడతాడు. చెవుల్లో కరిగించి పోసిన సీసంలాంటి మాటలువిని ఇంకా ప్రాణాలతో ఎలావుండ కలుగుతాడు?"

"రామచంద్రమూర్తి మరణించాలని నిశ్చయించుకోగానే, అంతకు ముందే ఆయనపై అత్యంత ప్రేమున్న లక్ష్మణుడు రాముడి మరణవార్త వినడానికి ముందే, ప్రాణాలు తీసుకుంటాడు. అన్న-తమ్ములు మరణించారని తెలియగానే, భరత-శతృఘ్నులు ప్రాణాలు విడుస్తారు. కుమారుల చావు విన్న క్షణాన, కౌసల్య-సుమిత్ర-కైకేయిలు మిగలరు. వారు కొడుకులను పోగొట్టుకుని బ్రతకలేరుకదా? ఇతరుల మేలు మరవని, ఆడితప్పని సుగ్రీవుడు రామచంద్రుడి

గతిచూసి తానూ మరణించుతాడు. ఆయన భార్య రుమాదేవి, వాలిచనిపోయాడనే ఏడుస్తున్న తార కూడ వుందరు. వారి మరణవార్త విన్న అంగదుడు చనిపోతాడు. కిష్కిందలోని ముఖ్యులందరు రాజుమరణ వార్తవినగానే, దుఃఖంతో పరితపిస్తూ, పిడికిళ్లతో, అరిచేతి దెబ్బలతో తలలు పగులకొట్టుకుని చచ్చిపోతారు. అరణ్యంలో చిరకాలం నివసిస్తున్న వారెందరో వున్నారు....వారూ మిగలరు. అట్లా అందరూ చావగా మిగిలిన కోతులు, కొండల్లో, అడవుల్లో గుంపులు-గుంపులుగా మునుపటిలాగా తిరుగలేవు. అందులో కొన్ని వురిపోసుకుని చస్తాయి. కొన్నిమంటల్లో దూకి, మరికొన్ని విషంతాగి, ఇంకొన్ని కత్తులపైన పడి చచ్చిపోతాయి"

"ఇప్పుడు నేను కిష్కిందకు పోతే ఎక్కడ చూసినా, విన్నా ఏడుపు ధ్వనులే. దానివల్ల ప్రయోజనమేంటి? ఇక్ష్వాకు వంశం, వానరకులం నాశనమౌతుంది. కాబట్టి ఇక్కడినుండి కిష్కిందకు పోకపోవడమే ఉత్తమం. జానకిజాడ తెలుసుకోలేని నేను సుగ్రీవుడి ముఖం ఎట్లా చూడాలి? అంత సిగ్గు, బిడియం లేదా నాకు? నేను పోకపోతే...హనుమంతుడు ఇవ్వాళో, రేపో, ఎల్లుండో వస్తాడన్న ఆశతో కొంత కాలమైనా జీవించి వుంటారు". ఇలా హనుమంతుడి ఆలోచనలు కొనసాగుతాయి. కిష్కింధకు పోయి అనర్థాలు తెచ్చి పెట్టడంకంటే, ఇక్కడ చేయాల్సిన కార్యం ఆలోచించడం మేలని తీర్మానించుకుని తర్వాత ఏంచేయాలో నిశ్చయించుకుంటాడు హనుమంతుడు.

(హనుమంతుడు సీతాదేవిని చూడలేకపోతే ఎంత కీడు జరిగేదో ఊహించే ఘట్టమిది. ఇందు కొన్ని సందేహాలు రావచ్చు. జరుగుతుందనుకున్న ఈ కీడు సీత కనిపించలేదన్న విషయం మీద ఆధారపడి వుంటుంది. సీతా వియోగంతో రాముడు మరణిస్తే ఈ అనర్థం జరుగుతుంది. జీవించి వుంటే జరగదు. భార్య కనపడలేదనగానే శ్రీరాముడు ప్రాణాలు విడుస్తాడా? సీతాదేవి భూమాత ఒడిలోకి పోయిన తర్వాత రామచంద్రమూర్తి మరణించాడా? లేదే! ఆ తర్వాత ఎన్నో వందల ఏండ్లు బ్రతికున్నాడుకదా! అందుకే రాముడు సీతకై ప్రాణం విడుస్తాడన్న ఊహ సరైంది కాదేమో! కాకపోతే రెండవ సారి సీతావియోగం రాముడు స్వబుద్ధి పూర్వకంగా చేయడం, తదనంతర కథలో ఆమె భూమాత

వొడిలోకి చేరడం జరిగింది. భార్య మరణిస్తే ఏడ్చేవాళ్లు వుంటారు కాని సన్యాసిగా మారి భార్యను త్యజిస్తే ఏడవరు కదా! ఇంకా ఆలోచించాల్సివస్తే, హనుమంతుడు సీతను చూడలేక మరలిపోయిన తర్వాత, ఈ వార్త తెలిసిన వానరులు సుగ్రీవుడి భయంతో ప్రాయోపవేశం చేయడమో, లేక, రాజదండనకు గురికావడమో జరిగేది. హనుమంతుడు మటుకు బ్రహ్మ వరబలంతో జీవించే వుండి, సీత ఏమైందో అన్న ఆలోచనతో మనస్సు పాడుచేసుకోవాల్సిందేకదా!)

ఇక్కడినుండి తిరిగిపోక, ఎక్కడో-అక్కడ లంకలోనే వుండి, సీతాదేవిని కనుక్కోలేక పోయినందున, బ్రతుకు మీద ఆశవదిలి, ఓ చెట్టు క్రిందో, పుట్ట క్రిందో, నివసిద్దామనుకుంటాడు హనుమంతుడు. వానప్రస్థుడై వుంటున్న తనకు, కాయో, పండో నోట్లో పడితే తిందామని, లేకపోతే వూరికే వుందామని, అదే క్షేమ మార్గమని తలుస్తాడు. ఫలాలు, కందమూలాలు బాగాదొరికే సముద్రతీరానికి పోయి, అక్కడ చితి పేర్చుకుని, దాంట్లో చావడం మేలని కూడా భావిస్తాడు. చెట్టు క్రింద కూర్చొని కాయలు పడ్తాయా, పండ్లు పడ్తాయా అని అభిమానం లేకుండా ఎదురుచూడడం సరైన పనికాదనుకుంటాడు. మరణించాలనే వుద్దేశ్యంతో, ఓచెట్టు క్రింద పడివుండి, ధైర్యంగా పులులు, సింహాలు, కాకులు, గద్దలు తనశరీరాన్ని పీక్కుతింటుంటే, కదలక-మెదలక కూర్చుందామని కూడా అనుకుంటాడు.

"సీతాదేవిని ఇక్కడ చూడకపోతే, నీళ్లలో దూకి దేహాన్ని వదుల్తాను. రామ కార్యార్థినై ఇలా చేయడం మునీశ్వరులందరికీ సమ్మతమే కావచ్చు. స్వామి కార్యానికై, అందునా రామ కార్యానికై, ప్రాణం తీసుకోవడం పాపం కాదుకదా! అలా అని జటాయువులా నాది వీర మరణం కాదుకదా! అయ్యో నేనేం చేయాలి?" అనుకుని చింతిస్తాడు. లంకాధిదేవతను జయించడంతో శుభారంభం కలిగించి, మనోజమైన చంద్రుడి వెన్నెలతో నిండి, అందమై, నిద్ర లేకుండడంతో దీర్ఘమై, లంకలో హనుమంతుడు ప్రవేశించాడన్న కీర్తిని తెచ్చిన ఆనాటి రాత్రి, సీతాదేవి దర్శన భాగ్యం లేకుండా వృధాగా పోతున్నదే అని దిగులుపడ్తాడు హనుమంతుడు. చేసేదేమీ లేక చెట్ల మొదళ్లలో వ్రతదీక్ష పూని వుందామనీ, తిరిగిపోతే అంగదాదులు బ్రతకలేరనీ మళ్లీ అనుకుంటాడు. ఆహారం మాని

దేహం విడిస్తే, చచ్చేం సాధిస్తామనీ, ప్రాణాలొదిల్తే పెక్కు దోషాలు కలుగుతాయనీ, బ్రతికుంటే మేలు కలుగుతుందనీ, ప్రాణాలు విడువరాదనీ, బ్రతికుంటేనే శుభం కలుగుతుందనీ నిర్ణయానికొస్తాడు.

వేరేవిధంగా కూడా ఆలోచిస్తాడు. సీత వుందో-లేదోనన్న సంగతి తర్వాత చూసుకోవచ్చు. ముందు ఇంత అనర్థానికి కారణమైన రావణుడిని పట్టుకుని చావకొట్టే మంచిదనీ, ఇదే వాడి పాపానికి తగిన ప్రాయశ్చిత్తమనీ భావిస్తాడు హనుమంతుడు. "రావణుడిని చంపితే కలిగే లాభమేంటి? వాడిని రామచంద్రమూర్తి చంపుతానన్నాడే?" ఇదీసరైన ఆలోచన కాదనుకుంటాడు. యజ్ఞంలో అగ్నికి బలిచ్చేందుకు ఈడ్చుకుని పోయే మేకలా, రావణుడిని పట్టుకుని, సముద్రమ్మీదేసి, ఈడ్చుకుని పోయి రామచంద్రమూర్తి ఎదుట నిలబెట్టుదామనుకుంటాడు. ఆ తర్వాత వాడినేంచేయాలన్న విషయం రాముడికే వదిల్తే సరిపోదా అని తలుస్తాడు.

ఇలా పలుమార్లు అధైర్యంతో విచారపడ్డాడు. దిగులుపడ్డాడు. సీత కనిపించే దాకా వెతకాలనుకుంటాడు. సంపాతి మాట నమ్మి ఇక్కడకు వస్తే సీత లేదు కదా అని బాధపడతాడు. ఇంకా నయం...సంపాతి మాటలను నమ్మి, శ్రీరాముడినే ఇక్కడకు తెచ్చినట్లయితే, ఇక్కడ సీత కనిపించక పోతే, భయంకరమైన రాముడి కోపానికి వానరవీరులందరూ బలయ్యే వారేననుకుంటాడు. ఇలా అనుకుంటూ, అహార నియమం, ఇంద్రియ వ్యాపార నియమం కలిగి, ఇక్కడే వుండి, వ్యర్థుడను కాకుండా, సుసంపన్నులగు రామలక్ష్మణులు చావకుండా చూద్దామని తీర్మానించుకుంటాడు హనుమంతుడప్పటికి.

అశోకవనంలో ప్రవేశించిన హనుమంతుడు

ప్రాకారంపై నుండి నలువైపులా తేరిపార చూసిన హనుమంతుడికి పెద్ద-పెద్ద చెట్లున్న అశోకవనం కనిపించింది. అక్కడింకా వెతకలేదుకనుక, వెతకాలనుకుంటాడు. అదెందుకు విడవాలనుకుంటాడు. తక్షణమే అష్ట వసువులకు, ఏకాదశ రుద్రులకు, సహస్ర ఆదిత్యులకు, సప్త మరుత్తులకు,

అశ్వనీ దేవతలకు నమస్కరించి, తనపని చేసుకునిపోయి రావణుడి గర్వం అణుస్తాననుకుంటాడు. రాక్షసులందరినీ తన పరాక్రమంతో బాధించి, వారందరూ భోరున ఏడుస్తుంటే, సీతాదేవిని ఆమె భర్తవద్దకు చేరుద్దామనుకుంటాడు. ఈ విధంగా కొంచెంసేపాలోచించి, అశోకవనంలో సీత తప్పక వుంటుందని నిశ్చయించుకుని, ఉత్సాహంతో లేచి ధ్యానం చేస్తాడీవిధంగా: "రామచంద్రమూర్తికి నమస్కారం, లక్ష్మణస్వామికి నమస్కారం. విదేహ రాజపుత్రి, శ్రీరామ ధర్మ పత్ని సీతమ్మకు నమస్కారం. ధర్మరాజుకు, ఇంద్రుడికి, మరుత్తులకు, వాయువుకు, రుద్రులకు, సూర్యచంద్రులకు, సుగ్రీవుడికి నమస్కారం"....."నమోస్తు రామాయ సలక్ష్మణాయ దేవ్యై చతస్యై జనకాత్మజాయై" అని వాల్మీకం.

(హనుమంతుడు లంకను జయించాడంటే యోగి దేహాన్ని జయించినట్లే. దేహం వశ పడగానే ఆత్మావలోకనం లభించదు. హనుమంతుడు సీత కొరకై వెతుకుతున్నప్పుడు మండోదరిని చూసి సీతని భ్రమిస్తాడు. అంటే ఆయన అన్వేషణలో, శోదించే సమయంలో, కనిపించిన ఆత్మ తేజస్సు లాంటి తేజస్సును "ఆత్మ"ని భ్రమించ కూడదు. ముమ్ముందు మిక్కిలి హెచ్చరికతో, నిష్కాముడై, జితేంద్రియుడై వెతకాలి. ఇలా వెతుకుతుంటే, స్వప్రయత్నం ద్వారానే కార్యం సాధ్యమౌతున్నదనే భావనంటే, అది తొలగి పోయే వరకు, ఆత్మ దర్శనం కలగదు. అందుకే కార్య సిద్ధికై, సీత-రామ-లక్ష్మణులకు, మొక్కి, కార్యమారంభించినాడు. కాబోయే సీత దర్శనానికీ, జరిగిన రామ దర్శనానికీ, సుగ్రీవుడే కారణం కనుక ఆయనకూ నమస్కరించాడు. హనుమంతుడు సంపాతి (జటాయువు సోదరుడు) మాటలందు నమ్మకంతో రావణుడి అంతఃపురంలో సీతను వెతికినట్లే, సాధకుడు గురు వాక్యం మీద నమ్మకంతో, "దేహంలో ఆత్మాన్వేషణ" చేయాలి. కనపడక పోతే, ప్రయత్న లోపం జరిగిందనుకొని, నిరుత్సాహ పడకుండా, కనిపించే దాకా వెతకాల్సిందే!)

ఈ విధంగా సమస్త దేవతలకూ నమస్కరించి, దిక్కులన్నీ తేరిపార చూసి, అశోకవనం పైనే దృష్టి సారించాడు. అనేక రాక్షసుల కాపలాలో పరిశుభ్రంగా వుంచబడి, మిగిలిన అన్ని వనాలకంటే మనోహరంగా వున్న ఆ వనంలో, సీత

వుండడం నిశ్చయమని భావిస్తాడు. అశోకవనాన్ని, అందులో చెట్లను కావలివారు బాగా రక్షిస్తున్నారు. అక్కడ వాయుదేవుడు మెల్లగా వీస్తున్నాడు. ఆ కారణాన సీత వుండే వుంటుందని అనుకుంటూ, తన దేహాన్ని మరింత చిన్నదిగా చేసి, సీతాన్వేషణలో నిమగ్నమౌతాడు మళ్లా. మునులను, సామాన్య దేవతలను, ఇంద్రుడిని, బ్రహ్మను, వాయువును, అగ్నిని, చంద్రుడిని, సూర్యుడిని, వరుణుడిని, రుద్రుడిని, మరుత్తులను, అశ్వనీ దేవతలను, కనిపించీ, కనిపించని దేవతలందరినీ, సమస్త భూతాలను, పరాత్పరుడిని, భగవంతుడిని తనకార్యం సఫలమయ్యేటట్లుగా చూడాల్సిందని ప్రార్థిస్తాడు హనుమంతుడు. "సీతాదేవి వున్నతమైన నాసికను, తెల్లని దంతాలను, చిరునవ్వు మొలకలతో అందమైన తామర రేకుల్లాంటి కళ్లను, చంద్రుడివంటి ముఖారవిందాన్ని, నేనెప్పుడు చూడగలనో! గుణహీనుడు, నీచుడు, పరమపాపి, క్రూరుడు, తులువ, నిర్దయుడు, సాధుసన్యాసి వేషాన్ని ధరించి రావణుడపహరించిన సీతను, పతివ్రతను, ఖిన్నురాలిని, భూపుత్రిని, శ్రీరామచంద్రమూర్తి దేవిని, స్త్రీలలో వుత్తమురాలిని నేనెట్లుచూస్తానో కదా" అనుకుంటాడు హనుమంతుడు. అనుకొని ఆశతో ఎదురుచూడసాగాడు.

❖ ❖ ❖

సర్గ-14

అశోకవనం ప్రవేశించిన హనుమంతుడు

దిగులుపడి, తేరుకుని, ఆలోచించిన హనుమంతుడు మెల్లగా ఆ ఉద్యానవనంలోని ప్రాకారం మీదకు గెంతుతాడు. అక్కడ నిలబడి దేహమంతా పులకరిస్తుండగా శోకనాశి అయిన అశోకవనాన్ని తేరిపార చూసాడు. వసంతకాలం ఆరంభంలో పూలతో వికసించే కొమ్మలున్న చెట్లెన్నో వున్నాయక్కడ. మద్దులు, చీకటి మ్రాకులు, తక్కోలాలు, గిరికతాటిచెట్లు, ఉద్దాలకచెట్లు, అశోకచెట్లు, తియ్యమామిడిచెట్లు, సంపెంగలు, కోతిమూతికాయలున్న చెట్లు, అనేక ఇతర చెట్లతో ఆ వనం చూడచక్కగా వుంది. వాటిని చూసిన ఆంజనేయుడు అల్లెతాడు విడిచిన బాణంలా , సూటిగా, వేగంగా అక్కడకు పోతాడు. పక్షుల కిలకిలారావాలతో, బంగారు, వెండి చెట్లతో, ఆశ్చర్యం కలిగించే పక్షులతో, మృగాలతో, ఉదయభానుని పోలిన చిగుళ్లతో, పసరుకాయలతో, దోరపండ్లతో, ముదిరిన పండ్లతో, కోకిలల, తుమ్మెదల, నెమళ్ల ధ్వనులతో నిండిన అశోకవనాన్ని చూసాడు హనుమంతుడు. ఆయన అలికిడికి చెట్లపైనున్న పక్షులు నిద్రలేచి కిల-కిల కూయడం మొదలెట్టాయి. (పక్షులు నిద్ర లేచాయంటే హనుమంతుడు కోతిరూపంలో చెట్టు మీదినుండి చెట్టు మీదికి దాటుతూ, కాపలా వున్న రాక్షసుల కంట బడకుండా, సీత తప్పక మేలుకునే వుంటుందని భావించి ఆమెను వెతకసాగాడని అర్ధమౌతున్నది)

హనుమంతుడు ఒక చెట్టు మీదినుండి మరో చెట్టు మీదికి దూకటంతో, ఆ అలికిడికి, కొమ్మలు కదిలి, పక్షులు లేచి, కిలకిల కూస్తూ, ఆకాశానికి ఎగిరిపోతుంటే, వాటి రెక్కల తాకిడికి, జలజలా రాలిన పూలనడుమనున్న అతడు పూలకొండలా కనిపిన్చాడు. భూతకోటికాతడు వసంతుడిలా, చెట్లపైనుండి రాలిన పూలతో నిండిన భూమి అలంకరించుకున్న స్త్రీలా వున్నాడప్పుడు. ఆయన వేగంతో కదిలిన చెట్లు హనుమంతుడి మీద పూలవాన కురిపించడంతో పాటు-పూలు, పండ్లు, ఆకులు రాలిపోసాగాయి. **(పుష్ప వృష్టి, అలంకృత స్త్రీ దర్శనం శుభ శకునాలు)**

రాలిన ఆకులతో, నేలరాలిన పూలతో, పండ్లతో నిండిన ఆ చెట్లు, సమస్తం ఓడిన చెడు జూదరిలా వున్నాయి. పక్షులన్నీ ఎగిరిపోగా, బోదెలుమాత్రమే వున్న చెట్లు, అందరూ వదిలిపెడ్తే మిగిలిపోయిన మానవుడిలా, సేవించ తగనివిగా వున్నాయి. లంకకు, అశోక వనానినికి రాబోయే దుస్థితిని సూచిస్తున్నాయా అన్నట్లున్నాయి. వనభంగం, లంకా వైధవ్యానికి సూచనగా మిగిలాయా చెట్లు.

అశోకవనంలో సీతను విహరించిన హనుమంతుడు

వింధ్య పర్వత శిఖరంలో వర్షిస్తున్న మేఘాలను చెదరగొట్టిన గాలిలా, హనుమంతుడు అశోకవనంలోని తీగల గుంపును చిమ్మాడు. వజ్రాలు, బంగారం, వెండి వున్న స్థలాలను; మంచినీటి బావులను; వాటిలో దిగడానికి ఏర్పాటుచేసిన మణిమయమైన మెట్లను; ముత్యాలు, పగడాలతో కూడిన ఇసుక ఒడ్డులను; ఆ ప్రక్కనే కూర్చోడానికి తయారుచేసిన స్ఫటిక ప్రదేశాలను; అక్కడే పుట్టిన బంగారు వన్నె చెట్లను; బావుల్లోని తామరతీగలను; కలువతీగలను; అందులో కూస్తున్న హంసలను; చక్రవాకాలను; నీటి ఇర్రులను, బెగ్గురులను, వాటిలో పారే ఏరులను, అందులోని అమృత తుల్యమైన నీళ్లను, చుట్టూ అల్లబడిన పూల తీగలను; అశోకవనంలోని ఆ ప్రదేశంలో చూసాడు హనుమంతుడు.

ఆ ఉద్యానవనంలోనే ఇంపైన శిఖరాలు, గదులు, చెట్లున్న రాతి ఇంటి క్రీడా పర్వతాన్ని చూశాడు. ఆ పర్వతంపైనుండి కిందకు పారుతున్న సెలయేరు, చూడడానికి, మగడి తొడపైనుండి కోపంతో దిగిపోతున్న స్త్రీలా వుంది. వ్రేలాడుతున్న కొమ్మలు ప్రవాహాన్ని అడ్డగించడంతో, ఎదురెక్కిపోతున్న నీళ్ల సన్నివేశం బంధువుల బుజ్జగింపులకు సమాధానపడి, శాంతించి, మగడివద్దకు తిరిగిపోతున్న ఆడదానిలా వుంది. ఆ సమీపంలోనే అనేక రకాల పక్షులున్న కొలనుకూడా వుంది. వీటన్నింటినీ నిశితంగా పరికించి చూసాడు హనుమంతుడు.

రతనాలమెట్లు, నిర్మలమైన చల్లటి నీళ్లు, నానారకాల పక్షులు, మృగాలు, కల్పితవనాలు, దిగుడుబావులు, విశ్వకర్మ నిర్మించిన మేడలు, ఫలాలతో,

పుష్పాలతో నిండిన చెట్లవరుసలు, గొడుగులు, బంగారపు అరుగులు, మెట్లు ప్రకాశిస్తున్న ఆ ప్రదేశంలో, ఓపెద్ద "శింశుపావృక్షాన్ని" (ఇరుగుడుచెట్టు) చూసాడు హనుమంతుడు. అక్కడే బంగారపు అరుగుల చుట్టూ నిర్మించబడి మధ్యలో ఎర్రనిపూలు, చిగుళ్లూ వున్న అగ్నిలాంటి చెట్లను కూడా ఆశ్చర్యంతో చూస్తాడు హనుమంతుడు. ఆకాశాన్ని తగిలే కాంతితో వున్న బంగారపు చెట్ల కాంతులు తనపైన పడడంతో, సూర్యుడులాగా వున్నాననుకుంటాడు. చుట్టూ బంగారు చాయ ఉన్న చెట్లు చుట్టుకోగా, బంగారు గజ్జెలు ధ్వనించే "శింశుపావృక్షాన్ని" చూసి ఇంకా ఆశ్చర్యపోయాడు హనుమంతుడు.

ధూర్త రావణుడు అశోకవనాన్ని చందనపు వృక్షాలతో, సంపెంగ, పొగడ చెట్లతో, మనోహరంగా కూసే పక్షులతో, అందమైన కొలనులతో, ఆహ్లాదభరితంగా ఉంచాడు కాబట్టి, సీతాదేవి ఇక్కడకు తప్పక వస్తుందని నమ్మిన ఆంజనేయుడు, "శింశుపావృక్షాన్ని" ఎక్కి, ఆమెను చూద్దామని భావిస్తాడు. "సుందరి, రాముడిరాణి, శ్రీరామచంద్రుడిని ప్రేమించే పతివ్రత, శ్రీరాముడినే ధ్యానించేది, జింక కన్నుల లాంటి కళ్లున్నది, వనాలలో తిరిగే నేర్పుగల సీత ఎందుకు ఇక్కడకు రాదు? వీటన్నిటికంటే ముఖ్యం, ఇక్కడ సంచరించే వన్యమృగాల క్షేమంకోరే స్వభావంకలది సీత. సంధ్యావందనం ఇంటివెలుపలో, చెరువు దగ్గరో, నదిలోనో చేయాలి కాబట్టి, శ్రీరాముడిని తలచుకుంటూ సీత ఇక్కడకు తప్పక వస్తుంది." అని భావిస్తాడు హనుమంతుడు. సీతాదేవి ప్రాణాలతో వుంటే తప్పక అశోకవనానికి వస్తుందని నమ్ముతూ, "శింశుపావృక్షం" పైన దాక్కుని అన్ని ప్రక్కలా చూస్తుంటాడు హనుమంతుడు.

(పూర్వకాలంలో స్త్రీలకు సంధ్యావందనం, ఉపనయనం వుండేవి. వివాహమే స్త్రీలకు ఉపనయనం, పతిసేవే గురుకుల వాసం, గృహకృత్య నిర్వహణే అగ్నిహోత్రమని కూడా చెప్పబడింది. మంగళసూత్రధారణ స్మార్తం కాబట్టి ఉపవీతాలకు బదులుగా మంగళసూత్రాలు వచ్చాయి. పూర్వకాలంలో స్త్రీలు వేదాధ్యయనం, గాయత్రీజపం కూడా చేసేవారట. అయితే తండ్రి, పినతండ్రి, అన్న మాత్రమే ఉపదేశం చేయాలి)

❖ ❖ ❖

సర్గ-15

అశోకవనంలో సీతను వెతికిన హనుమంతుడు

తీగల్లాంటి కల్పవృక్షాలతో, ప్రకాశించే చెట్లతో, దేవలోక సంబంధ పరిమళఫల రసాలను కూడిన శుభాకారాలతో, నందనవనం లాంటి సౌందర్యంతో, అందమైన మృగ, పక్షిజాతితో, మిద్దెలు, మేడలతో, కోకిలకూతల సందడితో, బంగారు కమలములతో, కలువలతో, రకరకాల కంబళ్లతో, విశాలమైన నేలమాళిగలతో, అన్ని రుతువులలో పూచే, కాచే చెట్లతో, అతిశయిస్తున్న అశోకవనాన్ని, "శింశుపావృక్షం" పైనుండి చూసాడు హనుమంతుడు. వికసించిన అశోకవృక్షాల ఎర్రెర్రటి కాంతి, సూర్యోదయ కాంతిని పోలి, పెద్దమంటలో చిక్కుకున్నట్లుంది. పక్షులు తమ తలలపై రాలిన పూలను విదిలించుకునేందుకు రెక్కలు విప్పాయి. విప్పిన ఆ రెక్కల సందునున్నపూలకు ఆకులుకూడా వున్నాయి. అంటే, ఆకులు-పూలు లేనివాటివలె చెట్లు ఆంజనేయుడికి కనిపించాయి. పూలు చెట్లవేళ్లవరకూ పూచాయి. అందువల్ల అందంగా వున్న ఆ చెట్ల కొమ్మలు కాంతిగల పూల బరువుకు నేలను తాకుతున్నాయప్పుడు.

పూచిన గోగులను, కొత్తపూలున్న మోదుగులను, ఏడాకుల అరటిచెట్లను, పొన్నలను, సంపెంగలను, బంగారు వన్నె చెట్లను, అగ్నిజ్వాలల్లాంటి ఎర్రని చెట్లనూ, ఆంజనేయుడు అశోకవనంలో చూశాడు. నల్లటికాంతిగల వేలాది అశోకవృక్షాలను, చైత్రరథం (కుబేరుడి ఉద్యానవనం), నందన (ఇంద్రుడి ఉ ద్యానవనం) వనాలను మించిన సౌందర్యాన్ని, వర్ణించనలవికాని స్వరూపాన్ని కలిగిన అశోకవనం పూలనెడి నక్షత్రాల ఆకాశంలో రత్నాలతో నిండిన ఐదవ రత్నాకరంలా కనిపించింది. అన్ని రుతువుల్లో ఫలాలతో నిండి, సువాసనగల చెట్లతో, జింకలతో అలరారుతూ, రెండవ గంధమాదన పర్వతాన్ని తలపిస్తున్నదావనం. వనం మధ్యలో కైలాసపర్వతంలో, తెల్లగా, నిర్మలంగా, పగడాల మెట్లు, బంగారపు అరుగులు కలిగి, లక్ష్మీదేవిలా ప్రకాశిస్తున్న, రమ్యమైన, కన్నుల పండువైన, వేయిస్తంబాల మేడను చూసాడు హనుమంతుడు అతిదగ్గరనుండి.

సీతాదేవిని చూసి తర్కించుకుంటున్న హనుమంతుడు

మాసిన చీరతో, ధైర్యం చెడిన మనస్సుతో, ఆహారం తీసుకోనందున శుష్కించిన దేహంతో, నిట్టూర్పులతో, ఈమె సీతేనని గుర్తించలేని దేహకాంతితో, బాధిస్తున్న రాక్షస స్త్రీలమధ్యన కనిపించిందొక సుందరి హనుమంతుడికి. చంద్రుడి లాంటి కోమలమైన దేహంకల ఆ స్త్రీ, హోమధూమంతో కప్పబడి, అగ్నిశిఖలా అందంచెడి, మిక్కిలి బాధపడ్తూ కనిపించింది. పదినెలలుగా స్నానం లేక దుమ్ముతో మునిగిన దేహంతో, తామరపూలులేని కొలనులా, ఒంటి చీరెతో, దుఃఖంతో, శుష్కించిపోయి, అంగారకుడు పట్టుకున్న కాంతి విహీనమైన రోహిణిలాగుంది. కన్నీళ్లు కాలువలు కారుతూ ముఖమంతా ఆవరించి, దుఃఖంతో శోషించి, వెక్కి, వెక్కి ఏడుస్తూ, రాక్షస స్త్రీసమూహాలనే చూస్తూ, ఒంటరిగా, వేటకుక్కలకు చిక్కిన ఆడజింకలా అల్లాడుతూ, నడుంవరకు వ్రేలాడుతున్న నల్లటి త్రాచుపాములాంటి ఒంటి జడతో, శరత్కాలోదయాన కారడువుల్లోని భూమిని పోలి, స్నానంలేనందువల్ల సంపూర్ణంగా మాసిన దేహంతో వున్న స్త్రీని చూసాడు హనుమంతుడు. ఆమెను చూస్తుంటే: ఇంతవరకు దిగులంటే ఏంటో తెలియనిదానిలా, ఇప్పుడు తీవ్రమైన దిగులుతో మాడిపోతున్నదానిలా, మిక్కిలి సుఖానికి యోగ్యమైన దానిలా, మిక్కిలి దుఃఖంపడే స్త్రీలా అనిపించింది హనుమంతుడికి.

ఆహారం లేకుండా శుష్కించి, పదినెలలుగా స్నానం చేసినదానిలాలేని, మాసిన దేహంతో వున్న ఆ స్త్రీ, సీతేనా అని తర్కించుకుంటాడు హనుమంతుడు. ఆమె సీతాదేవేనని నిశ్చయించుకోవటానికి కారణాలు వెతుకుతాడు. ఆనాడు ఋశ్యమూకపర్వతం పైనుండి రావణుడు అపహరించుకుని పోతున్నప్పుడు చూసిన సుందరరూపాన్ని జ్ఞప్తికి తెచ్చుకుంటాడు మొదలు. ఆ రూపమే ఈమెలో కనిపిస్తున్నదికదా అని మరల–మరల చూస్తాడు నిర్ధారణగా (ఈవిధంగా పోల్చి చూడటాన్నే "ప్రత్యభిజ్ఞ" అంటారు). ఆనాటి ఆస్త్రీరూపాన్ని గుర్తుతెచ్చుకుంటూ, ఇప్పుడు తనుచూస్తున్న స్త్రీని ఆ రూపంతో పోల్చుకుంటూ, ఆమెను వర్ణించుకుంటాడిలా: "పూర్ణచంద్రుడి లాంటి ముఖం, అందమైన కనుబొమ్మలు, వర్తులాకార స్తనాలు, పొడవైన నల్లటి వెంట్రుకలు, చీకటిని హరించే దేహకాంతి,

దొండపండులాంటి పెదవులు, సింహం నడుములాంటి సన్నని నడుము, తీర్చిదిద్దిన పాదాలు, తామర రేకుల్లాంటి కళ్లు, రతీదేవిని పోలిన సౌందర్యం, సర్వజనులకు అభీష్టమైన చంద్రుడిలాంటి ముఖం, తపస్సు చేసుకునేదాని పోలికలు, తివాచీలు, చాపలు లేకపోవడంతో నిలబడేవున్న ఆకారం, పొగనిండిన అగ్నిలా తాపంతో సోంపు తగ్గిన వన్నె, అసత్యంలాంటి అపకీర్తి కారణాన ఆశ చెడినదాని రూపంతో, బుసకొట్టున్న ఆడపాములా నిట్టూర్పులు విడుస్తూ" వున్నదామె.

ఆమెలో "స్థిరపడని, కుదుటపడని శ్రద్ధ; సందేహం కలిగించే స్మృతి వాక్యమ్; క్షయించిన సంపద; కల్మషంతో కూడిన బుద్ధి; విఘ్నమైన కార్యఫలంలో వుండే లక్షణాలను" చూస్తాడు హనుమంతుడు. శ్రీరామచంద్రుడి జాడ తెలియక పరితపిస్తూ, రావణుడి చేజిక్కి దిగులుపడుతూ, భర్త రాకపోతాడా అని నాలుగు దిక్కులు పరికించి చూస్తూ, ఒంటరిగా చిక్కి బెదురు చూపులు చూసే ఆడలేడి కళ్లలాంటి కళ్లతో, కన్నీరు కాల్వలై పారగా కనురెప్పలు తెరుస్తూ, మూస్తూ, వాడిపోయిన ముఖంతో దుఃఖిస్తూ, వేడి నిట్టూర్పులు వెంట-వెంట విడుస్తూ, దుమ్ములో మునిగిన దేహంతో, శోకంతో మలమల మాడుతూ కనిపించిందామె. శ్రేష్టమైన అలంకారాలకు అర్హురాలైనప్పటికీ, ఆభరణాలేవీ ఒంటిమీద లేనేలేవు. మేఘాల చాటునున్న చంద్రుడిలా ప్రభమాసి వుంది. అలవాటు తప్పి మతిమరుపుతో చదువుతున్నదానిలా వుంది. మాట్లాడే మాటలు వ్యాకరణ శుద్ధం కాకుండా వేరే అర్థం వచ్చేరీతిలో వున్నాయి. ఇలాంటి ఆమెను చూసిన హనుమంతుడు, ఈమె సీత కాదేమో, అవునేమో, లేక, రావణుడు బలాత్కారంగా తెచ్చిన స్త్రీలలో ఒకతేమో అనుకుంటాడు. సందేహం మాని, ఈమె సీతేనని నిర్ధారించుకుంటాడు. తన నిర్ణయానికి తానే కారణాలు వెతుక్కుని తృప్తి పడతాడు. తన నిర్ణయం సబబేనని తీర్మానించుకుంటాడు.

(సీతాదేవి అని నిశ్చయించుకోవడానికి తగిన కారణాలను వెతుకుతున్న హనుమంతుడికి తాను చూస్తున్న స్త్రీ ఎలావుందో వర్ణించుకుంటాడు. ఆమె తపస్సు చేసుకుంటున్న స్త్రీ లాగా వుందనీ, కుదుటపడని శ్రద్ధ ఆమెలో కనిపించిందనీ, సందేహం కలిగించే స్మృతి కలదనీ భావిస్తాడు. తపస్సు

చేసుకుంటున్న స్త్రీ లాగా వుందంటే, అది ఆమె జితేంద్రియత్వాన్నీ, భోగవిరాగాన్నీ, తెలియ చెప్పడమే. బుసకొడ్తున్న ఆడపామని అనడమంటే, పామును చేరదీసిన వాడు జీవించ లేనట్లే ఆమెను తెచ్చినవాడూ జీవించడని అర్థం. పొగక్రమ్మటంతో తెలియని అగ్నిలా వుందనడమంటే, పైన కాంతి కనబడకున్నా మనస్సు అగ్నిలా పరిశుద్ధమైనదని అర్థం. అసత్యమైన అపకీర్తితో చెడినదంటే, ఈమె మీద నింద ఆరోపించిన వారు అసత్యవాదులని అర్థం.

కుదుటపడని శ్రద్ధ: శాస్త్రాలలో చెప్పిన విధంగా ఫలానా పని చేస్తే ఫలానా ఫలితం కలుగుతుందన్న నమ్మకానికే "శ్రద్ధ" అంటారు. ఆ శ్రద్ధ ధృడంగా కుదరకపోతే, శాస్త్రప్రకారం చేయాలా-వద్దా? ఫలితం వస్తుందో-రాదో? అన్న మీమాంసలో పడిపోవడం జరుగుతుంది. సందేహం కలిగించు స్మృతిః ఇది హనుమంతుడి సందేహాన్నే తెలుపుతుంది. సీతాదేవి స్థితి ఇలా వుందని తెలుసుకోవాలి. ఐశ్వర్యవంతుడు దరిద్రుడైపోతే, వేషం-భాష మారిపోతుంది. లోగడ చూసినప్పుడు లాగా ఇప్పుడు వుండకపోవచ్చు. వేషం-భాష మారడంతో వాడు వీడేనా అన్న సందేహం కలుగుతుంది. బుద్ధి నిష్కల్మశమై వుంటేనే నిశ్చయ జ్ఞానం కలుగుతుంది. కల్మశంతో కూడినప్పుడు యదార్థ జ్ఞానం కలగదు. సందేహమే తోస్తుంది. విఘ్నం చేసిన కార్య ఫలమంటే: ఏదైనా కార్యం చక్కగా చేస్తే ఫలహాని లేదు. అదే విఘ్నమైపోతే ఆపని చేసినవాడికి ఫలితం ప్రాప్తించదు. అదేవిధంగా సీత. సీతాత్వానికి ఏ విధమైన హాని లేదు. అయినా ఆమె సీతే అని తెలుసుకోలేని లోపం ఆ మూడుధీదె. ఆత్మావలోకమవడానికి ముందర, ఆత్మ జ్యోతిలాగా కనిపించిన వెలుతురుని చూసి భ్రమపడకూడదు. మండోదరిని చూసి హనుమంతుడు సీతని భ్రమ పడినట్లు పడకూడదు. అదే ఆత్మని సంతోషిస్తే, భ్రష్టుడవుతాడు. ఆచార్యలక్షణం.... శాస్త్రాలు చెప్పిన పద్ధతిలో ఆలోచించి, స్వబుద్ధితో తర్కించి, వూహించి, నిశ్చయించుకోవాలి. అదే చేస్తున్నాడు హనుమంతుడు.)

హనుమంతుడు చూసింది సీతాదేవినే!

రావణాసురుడు ఎత్తుకుని పోతున్నప్పుడు, తామంతా చూసిన స్త్రీ ఈమె మాదిరే వుంది కాబట్టి, ఈమె సీతాదేవేనని తలచికూడా, ఒకరిని పోలిన మనిషి

మరొకరు వుండవచ్చుకదానని తర్కించు కుంటాడు. ఖచ్చితంగా నిశ్చయించాలంటే, ఇతర ప్రమాణాలను ఆధారంగా చేసుకోవాలని భావించి, చివరకు తన నిర్ణయం సరైనదేనని తీర్మానించుకుంటాడు హనుమంతుడు. శ్రీరామచంద్రమూర్తి జానకి సొమ్ములని వేటిని చూపించాడో, అలాంటివన్నీ, ఈమె సమీపంలో ఒకచెట్టు కొమ్మకు వ్రేలాడుతుండడం కనిపించాయి, మరోనిదర్శనంగా సీతాదేవి ఆభరణాలను, కోతుల ముందు పడవేసినతర్వాత, వారు వాటిని మూటగా కట్టి, రాముడొచ్చినప్పుడు అందచేసారు. ఎవరైనా తనను వెతుక్కుంటూ వస్తే, గుర్తించేందుకు ఆమే ఆపని చేసింది. ఈమె సీతేననటానికి అక్కడ కిష్కింధలో చూసిన ఆభరణాలలాంటివే ఇక్కడా కనిపిస్తున్నాయి. అంటే కొన్ని అక్కడ విడిచి మిగిలినవి గుర్తుపట్టేందుకు ఇక్కడ వేలాడ కట్టిందని భావిస్తాడు.

చెట్ల మీది కొమ్మలకు వేలాడ కట్టిన సొమ్ములు సీతవే అనటానికి రూఢి ఏమిటి? మళ్లీ తన సందేహ నివృత్తి చేసుకుంటాడు. నాణ్యపు కమ్మలు, పొగడలు, రత్నాలు, పగడాలు, వీటన్నిటితో ప్రకాశించే భూషణాలు, మురికిగా తయారై, నల్లబడి, ఎన్నాళ్లుగానో ధరించనందున ఆమె ఒంటి మీద గుర్తులుకూడా కనిపిస్తున్నాయి. అంటే, శ్రీరాముడు, సీత సొమ్ములివి అని వేటిని చూపించాడో, అవి ధరిస్తే ఎలాంటి గుర్తులు పడతాయో, అలాంటివే ఈమె ఒంటిమీదున్నాయి. ధరించనప్పుడు సొమ్ములు దాచిపెట్టేందుకు పెట్టెలు లేనందున, ఒంటిమీదే వుండడం వల్ల, దేహమంతా కాయలు కాచింది. సీతాదేవి పారేసినవి కాకుండా, తొందరగా తీసేయలేనివి ఒంటిమీదే వుంచుకున్నది. రామచంద్రమూర్తి వానరులిచ్చిన నగలే కాకుండా, ఇంకొన్ని ఆమె ఒంటిమీదే వున్నాయని చెప్పాడు. ఆసొమ్ములిక్కడున్నాయి. అక్కడ చూసిన నగలిక్కడ లేవు.... ఇక్కడున్నవక్కడ లేవు. అక్కడ ఎడమభాగానివి వుంటే, ఇక్కడ కుడివైపువి వున్నాయి. సందేహం లేదనుకుంటాడు హనుమంతుడు.

ఇంకా సందేహ నివృత్తికి కారణాలు వెతుకుతాడు. ఆమెనెత్తుకుని పోతున్నప్పుడు ఆకాశంలోనుంచి విసిరిన సొమ్ముల మూటను కట్టిన ఉత్తరీయపు కొంగు ఏపచ్చని వన్నెదో, అలాంటిదే ఇప్పుడామె ఒంటిమీదున్నదని

నిర్ధారించుకుంటాడు. కాకపోతే ఎంతోకాలంగా వుతకనందున, రంగుమాసిపోయినా, వన్నె తరగలేదు. ఈమె సీతే అనడానికి మరో కారణం చెప్పుకుంటాడు హనుమంతుడు. ఈమె శ్రీరామచంద్రుడి హృదయేశ్వరి సీతాదేవి. సీతాదేవి హృదయేశ్వరుడు శ్రీరామచంద్రుడు. ఇరువురు ఏకాభిప్రాయం కలవారే. ఆమె "ఔనన్నది" ఈయన కాదనడు. ఈయన ఔనన్నది ఆమె కాదనదు. ఆమె రామాభిమతానుసారిణి. సీతానుగ్రహం వస్తే రాముడి అనుగ్రహం వచ్చినట్లే అనుకుంటాడు. రాముడి హృదయేశ్వరి, రాణి, అయినందున, దూరదేశంలో మగడిని విడిచి వున్నప్పటికీ, ఆయన హృదయాన్ని మటుకు వదలకుండా నిలిచే వుంది. ఆయన హృదయాన్నెడబాయకుండా వుంది. సాముద్రికశాస్త్రం ప్రకారం రాముడికెలాంటి అవయవ సౌష్టవముందో, అట్టి వాడికి ఎలాంటి అవయవ సౌష్టవం కల భార్య వుండాల్నో, అలాంటి లక్షణాలన్నీ ఈమెలో వుండడం మరో నిదర్శనంగా భావిస్తాడు. (హనుమంతుడు సాముద్రిక శాస్త్రవేత్తగా దర్శనమిస్తాడు ఇక్కడ. రాముడిలో ఏ అవయవ సౌష్టవం కలదో అలాంటివానికి ఎలాంటి అవయవ సొంపు గలది భార్యగా వుండాలో, ఆ అవయవ సౌష్టవం ఇక్కడ సీతమ్మలో కనిపిస్తున్నది. కాబట్టి ఆ రామయ్యకు ఈ సీతమ్మే భార్య అయి వుండాలి. అలాగే ఈ సీతమ్మకు మా రామయ్యే భర్త అయి వుండితీరాలి అని నిర్ధారించుకుంటాడు హనుమంతుడు)

అది అలా వుంచితే, ఆమె రాముడి భార్యేననడానికి మరి కొన్ని ప్రధాన కారణాలను వివరించుకుంటాడు హనుమంతుడు తనకు తానే. శ్రీరాముడెవరి కొరకు దయ, అక్రూరత్వం, నివారించలేని శోకం, కామం బాధిస్తుంటే పరితపిస్తున్నాడో, ఆమె, ఈమేనని నిర్ధారించుకుంటాడు. శ్రీరామచంద్రమూర్తి భార్య కొరకై శోకించడానికి నాలుగు కారణాలున్నాయి. పురుషుడిలో సగం భార్య. స్త్రీలో సగం భర్త. భార్యా-భర్తల సంబంధం జన్మాంతరాలలోనూ తప్పదు. అలాగే పాపపుణ్యాలలో ఉభయులూ సమభాగులే!

ఆ కారణాలు:

★ పురుషుడైనవాడు, ధన-ప్రాణమిచ్చి అయినా భార్యను రక్షించాలని ధర్మశాస్త్రం చెపుతుంటే, క్షత్రియుడనైకూడా సీతను కాపాడలేకపోతినికదా అనే "సర్వభూతదయ" రాముడిలో వుంది.

★ తాను రక్షించలేని స్త్రీ అన్య స్త్రీ కాదు. తాను రక్షిస్తానని నమ్మి, ఆ భారం తన మీద వేసి, వేరే రక్షణకోరక, సర్వసౌఖ్యాలు వదిలి, కష్టాలు పడుతూ, తనవెంట వచ్చింది. అలాంటామెకు ఎట్టి కష్టాలు రాకుండా కాపాడవలసి వుండగా, అలాచేయకుండా, కష్టాలు పడుతుంటే, సహించి వూరుకున్న తనెంతటి క్రూరుడనన్న భావన.

★ తన్ను నమ్మి వచ్చిన సీత బానిసా? కాదు. రక్తబంధువా? కాదు. తన దేహంలో సగభాగం. తన కుడి భాగాన్ని ఎట్లా రక్షించుకోవాల్నో, అట్లానే ఎడమ భాగాన్ని కూడా రక్షించుకోవాలి కదా! అయినా చేయలేకపోయానే ..... తనదేహాన్నే కాపాడుకోలేనివాడేమి క్షత్రియుడు?

★ తను భర్త–పతి, అని అన్నంతవరకు, పరస్పరానురాగం వున్నా, లేకున్నా, భరించి, పాలించవలసిన న్యాయం తనకుంది. సీత ఒప్పులకుప్ప, సద్గుణరాశి, ప్రియురాలు, ప్రేమగలది. ఆమె సాన్నిధ్యమాత్రంలోనే తనకు కష్టాలు లేకుండా చేస్తుందే! కనీసం ఆమెతో మాట్లాడే వీలుకూడా లేదే! ఈ వియోగాన్నెట్లు సహించాలనే విరహ–మదన తాపం.

రామలక్ష్మణుల కార్యం నెరవేరిందని సంతోషపడిన హనుమంతుడు

నాలుగు విధాలుగా రాముడు బాధపడ్తున్నాడని నిర్ధారించుకున్నాడు హనుమంతుడు. రామచంద్రుడు కామంతో దుఃఖపడడం లేదు. సీతమీద ఆయన తన మనస్సు నిలిపాడు. ఆమె ఈయనపై మనస్సు నిలిపింది. కాబట్టి వీరి మనసులు ఎక్కడ న్యాయంగా వుండాలో, అక్కడే వున్నాయి. దేహాలు మాత్రం వేరుగా వున్నాయి. మనస్సులు ఏకంగా వున్నాయి. అందుకే వీరిద్దరూ బ్రతకగలిగారు. అదే కాకపోతే ఇద్దరూ మరణించేవారే! (ఇదే జీవాత్మ–పరమాత్మ సంబంధమని అర్థం చేసుకోవాలి).

హనుమంతుడు శ్రీరాముడి గురించి అనుకుంటూ: "సీతతో ఆయన సరస–సల్లాపాలాడి వుండకపోవచ్చు, సంభోగించకుండవచ్చు కానీ, కళ్లనైనా చూడక ఇన్నిరోజులు విడిచి పెట్టి ఎలా బ్రతికున్నాడు? బ్రతికుండటమే కాదు,

చింత అయినా లేదే? బాధపడడంలేదే? ఆయనెంతటి అసాధ్యమైన కార్యం చేశాడు!"

"ఆయుష్షు తన స్వాధీనంలో వుండదు కనుక బ్రతికుండవచ్చు. చింతపడి శుష్కించడం లేదే? ఏ మాత్రం ప్రీతి కలవారు పోయినా, ఏడుపొస్తుందే! అట్లాంటిది సీతలాంటి దాన్ని పోగొట్టుకున్నా దుఃఖం లేదే? నిద్ర చాలించలేదే! ఆహారం మానలేదే? పడుకున్నాడుకదా! వియోగానికి చేయాల్సిన పనేంచేశాడు? ఆయన నడవడి ఎంత ఆశ్చర్యం కలిగిస్తున్నది? ఏమీ ఆయన ఇంద్రియ జయం! ఋశ్యమూకంలో సీతకై ఏడుస్తుంటే చూసి, అయ్యో, ఇంతటి ధీరోదాత్తుడు, మహానుభావుడు ఒక ఆడదానికొరకు ఇట్లా ఏడుస్తున్నాడెందుకు? అనుకున్నానే! ఎంత కామదాసుడు. ఏవిధంగా ఇంద్రియాలకు లోబడుతున్నాడని అనుకున్నాను కాని, సీతను చూసిన తర్వాత, రాముడు పాషాణ హృదయుడనే చెప్పాల్సి వస్తున్నది."

ఇంకా ఇలా అనుకుంటాడు: "రాముడు భూకాంతుడు కనుక బ్రతికాడు. సీతాదేవిని విడవడంవలన కలగాల్సినంత దుఃఖమే కలిగితే బ్రతికుండే వాడా? ఆత్మహత్య చేసుకోనక్కరలేదు. నిజంగా దుఃఖమే కలిగితే ప్రాణాలు వాటంతటవే శరీరాన్ని విడిచిపోయేవే. అలాంటప్పుడు సీత ప్రాణమెందుకు పోలేదు? ఆమెకు దుఃఖం లేకనా? సీత పరతంత్ర. భర్త ఆజ్ఞ లేకుండా మరణించ లేదు. దేహమే ఆమెది, ప్రాణం రాముడి సొత్తే. ఆమె పోగొట్టుకోలేదు. పోతాయన్నా బిగపట్టు కోవాలి. రాముడు స్వతంత్రుడు. దేహాన్ని వదలాల్సి వుండాలి. కానీ చేయలేదే? అదే అసాధ్య కార్యం"

జితేంద్రియుడని ప్రసిద్ధి చెందిన హనుమంతుడు కూడా రామచంద్రమూర్తి సీతాదేవిని విడిచి వుండడం చెడుపని అనుకుంటున్నాడు. "ఎంతటి చెడ్డ పనిచేసాడాయన. ఈమెను విడిచి క్షణకాలమైనా వుండకూడదే? అలాంటిది సీతాదేవి కోరగానే మాయా మృగం కొరకు ఆమెను విడిచి ఎందుకు పోవాలి? సీత అంటే ఆడది. చపలత స్త్రీ స్వభావం. తన కోరికవల్ల కలిగే మేలు–కీడుల గురించిన ఆలోచన వారికుండకపోవచ్చు. పోనీ కోరిక తీర్చదల్చుకుంటే, లక్ష్మణుడిని పంపవచ్చుకదా. అలా చేయకుండా, దానికొరకు పోయి సీతనింత

కష్టపెడ్తున్నాడే? రాముడు రమణీయమైన ఆకారమున్నవాడే కాని లోపల తెలివితేటలున్న వాడు కాడు. అక్కడ రాముడు ఏడ్వడం చూసి, ఆయన నిజమైన, నిండారు ప్రేమున్నవాడని తలిచాను. కాని ఇక్కడ ఈమె దుస్థితి చూసిన నాకు ఆయన దయలేనివాడని తోస్తుంది. ప్రణయవిద్యలో ఆయనకు "ఓనమాలు" కూడా రావు కనుక, ప్రణయమంటే ఏమిటో తెలియక చేశాడేకాని తెలిసిచేసిన వ్యవహారం కాదు. ఎండను విడిచిన సూర్యుడివలె, సీతను విడిచి రాముడుండడం దుష్కరం. ఎండలేని సూర్యుడినెవరూ పూజించనట్లే, సీతలేకపోతే తాను అపూజ్యుడని రాముడికి తోచలేదుకదా! భూకాంతుడు కనుక, మృగం మీద కాంక్షతో సీతను విడిచినట్లు, రాజ్యకాంక్షతో సీతనుపేక్షించాడు."

"అణచలేని పరాక్రమవంతుడైన రాముడు, విశాలమై, మత్తెక్కించే కళ్లున్న సీతను, ఇప్పుడు, ఇన్ని సంవత్సరాలు అనుభవించి, తటాలున వదిలి ఎలా వుండగలుగుతున్నాడు? బహుశా ఈమె కన్నులు ఆయనకు మత్తెక్కించలేదా? ఆయన హృదయం పాషాణమో, రాయో అయ్యుండాలి. జీవితేశ్వరైన సీత పోయిన తర్వాత నాకింకేమిపననుకొని, జీవుడు పోవాలనుకున్నా, పోనీయక బిగపట్టాడు. ఇది దుష్కరమేకదా! ఇంతటి అసాధ్యకార్యం సాధించిన రామచంద్రమూర్తి సామాన్యుడుకాడు. ఇది చేయకలిగిన వాడు ఎంతటి అసాధ్యమైన పనైనా చేయగలడు. లంకాప్రవేశం చేసి, సీతను చూసిన నేనే అసాధ్యకార్యం చేసానన్న గర్వంతో వున్నానే. కాని రాముడు చేసిన కార్యం ఎదుట నేనుచేసింది గొప్పకానేకాదు."

జానకీదేవిని చూసిన హనుమంతుడు ఇలా అనుకుంటూ, మాసిన చీరతో, స్నానంలేని ఒంటితో, నిద్రాహారాలు మాని, భర్తనే ధ్యానంచేస్తున్న పరమపతివ్రతను చూసే అదృష్టం తనకు కలిగిందికదా అని ఆనందిస్తాడు. వానరులందరూ బ్రతికినట్లేననీ, సుగ్రీవుడు కృతజ్ఞుడయినాడనీ, రామలక్ష్మణుల కార్యం నెరవేరిందికదా అని సంతోషపడ్డాడు. "రామచంద్రమూర్తి ఎంత గొప్పవాడో కదా! కాకుంటే ఇట్టి స్త్రీకి భర్తయ్యేవాడా! ఎంత జితేంద్రియుడు కాకపోతే ఈమెను విడిచి బ్రతుకుతాడా?" అని సంతోషంతో శ్రీరాముడి సామర్థ్యాన్ని తనివితీరా పొగడుతాడు.

❖ ❖ ❖

సర్గ-16

సీత-రాములిరువురూ సేవ్యులే అనుకున్న హనుమంతుడు

సకల గుణాభిరాముడైన శ్రీరాముడిని, గుణాలతో ప్రసిద్ధికెక్కిన సీతను పొగిడి, చింతా మనస్కుడై, కన్నీళ్లు కార్చాడు ఆంజనేయుడు. ఉత్తమురాలైన సీతకు ఎటువంటి కష్టమొచ్చిందని తల్చుకుంటూ మరీ-మరీ ఏడుస్తాడు. ఏడుస్తూ అనుకుంటాడు: "ఈమె మహాపతివ్రత. ఈమెకిట్టి ఆపద రాకూడదు. సీత ప్రకృతికతీత. అందరిలాగా కర్మానుభవానికై పుట్టిందికాదు. అట్టి ఈమెకే దిగులు సంప్రాప్తిస్తే కాలాన్ని అతిక్రమించే వారెవరైనా వుంటారా? అదెవ్వరికీ సాధ్యం కాదు" (సర్వం కాలాధీనమనుకొని, అదే నీతిని మనస్సులో వుంచుకొని, దుఃఖ-సంతోషాల పాలుపడ కూడదు. సీతకే ఇన్ని కష్టాలొచ్చాయే, మనమెంతనుకుని, మనస్సు పరితాప పడ్డా, బుద్ధిని వ్యాకుల పడనీయ కూడదు)

"రామచంద్రమూర్తి నిశ్చయం, లక్ష్మణుడి అభిప్రాయం ఎరిగింది కనుకనే, వర్షాకాలపు మురుగునీరు ఎంతకలిసినా మలినపడని గంగవలె, గుండె నిబ్బరంతో వుంది సీత. లేకపోతే, ఎప్పుడో గుండె పగిలి చచ్చిపోయేది. రామచంద్రమూర్తికి కాటుక కన్నుల సీత, పతివ్రత సీతకు రాముడు, వయస్సులో, స్వభావంలో, సాముద్రిక లక్షణాలలో, సద్వంశంలో పుట్టడంలో, ఒకరికొకరు సరిగ్గా సరిపోయారు" అని కూడా అనుకుంటాడు.

(వివాహకాలంలో శ్రీరాముడికి పన్నెండేళ్లు, సీతకు ఆరేళ్లు. అంటే రాముడి వయస్సులో సగం. శాస్త్రప్రకారం తగిన వయస్సే. ఇప్పుడు శ్రీరామచంద్రుడి వయస్సు ముప్పై తొమ్మిది సంవత్సరాలు, సీతకు ముప్పై రెండు. వధువుకు ఎనిమిదేళ్ళు వుంటే, వరుడికి పదహారేళ్ళు వుండాలని విష్ణు స్మృతి. సీత-రాముడు వయస్సులో ఎలా ఈడూ-జోడో, శీలంలోనూ అంతే. సాముద్రికం ప్రకారం, సార్వభౌమత్వ చిహ్నాలు రాముడికున్నాయి. అట్టి వాని భార్య కాగల దానికి ఏ చిహ్నాలుండాలో అవన్నీ సీతకున్నాయి. సూర్యవంశంలో ప్రసిద్ధికెక్కిన వాడి కొడుకు రాముడైతే, చంద్రవంశంలో జగత్ప్రసిద్ధికన్న జనకుడి కూతురు జనని-జానకి. "స్మరణ మాత్ర సంతుష్టాయ" అంటే స్మరించినంత మాత్రాన సంతోషించే

వాడు రాముడు. "ప్రణతి ప్రసన్న జానకి" అంటే ఒక్క నమస్కారంతో సంతోషించేది సీత. ఇట్టి అపురూప దాంపత్యం లోకంలో ఎక్కడైనా వుందానని ఆశ్చర్యపోతాడు హనుమంతుడు. భక్తులకు సీత-రాములిరువురూ సేవ్యులే. జగన్మాత "శ్రీదేవి", జగన్నాయకుడు "విష్ణువు". ఒకరున్న చోటే రెండో వారుంటారు. వీరిరువురితోనే ప్రపంచమంతా వ్యాపించి వుంది. ఈశత్వం ఇద్దరిలో సమానమే. సర్వదా ఏకశేషులే! ఒకేమాటలో ఇరువురినీ తెలిపేదే ఏకశేషం. ఇలా "సర్వకారణత్వం, సర్వవ్యాపకత్వం, సర్వనియంతృత్వం" లక్ష్మీనారాయణుల్లో, సీతారాముల్లో వుంది. ఇరువురిలో, "ఉపాయత్వం, ఉ పేయత్వం" వున్నాయి. అందుకే సీతారాములిరువురూ సమానంగా సేవించాల్సిన వారేనని గ్రహించాడు హనుమంతుడు.)

బంగరుబొమ్మలా, ముల్లోకాలకు దేవతైన లక్ష్మీదేవిలా వున్న సీతాదేవిని చూసి, రాముడిని మనస్సులో తలచుకుంటూ అనుకుంటాడు హనుమంతుడు:" రామచంద్రమూర్తి చేసే కార్యాలన్నింటికీ ఈమే మూలకారణం కదా! రావణ సమానుడైన కబంధుడి చేతులు నరికింది ఈమె కోసమే కదా! విరాధుడు చచ్చిపోయింది ఈమె కొరకే కదా! పద్నాలుగు వేల రాక్షసులను వధించింది ఈమె కొరకే కదా! ఖరుడు, త్రిశరుడు, దూషణుడు, రాముడి చేతిలో చచ్చింది ఈమె కారణాన్నే కదా! ఈమె కోసమే కదా దుర్లభమైన వానర రాజ్యసంపద నిమిషంలో సుగ్రీవుడికి లభించింది. ఈమె కోసమే కదా తాను సముద్రాన్ని దాటింది. అట్టి ఈమె కొరకై రామచంద్రమూర్తి ముల్లోకాలను దహించివేసినా దోషం లేదు" **(రామచంద్రమూర్తి చేసే కార్యాలన్నింటికీ మూలకారణం సీతాదేవే! చేసేది రాముడు... చేయించేది సీత. నిగ్రహానుగ్రహాల రెండింటిలోనూ ఇదే నియమం)**

"సీతాదేవి లేకుండా ముల్లోకాలతో కూడిన ప్రభుత్వం దక్కితే మేలా, అవి లేకుండా సీత లభించడం మేలా" అని ఆలోచించిన హనుమంతుడికి, సీతను దక్కించుకోవడానికి ముల్లోకాలను భస్మం చేసినా దోషంలేదనిపిస్తుంది. ఎందుకంటే "సీత కళలలో ఒక్కటైనా ఈ మూడులోకాలకు సరిపోవు. ఇలాంటి దొక్కటున్నా కోటానుకోట్ల ముల్లోకాలు లభిస్తాయి. ఆమే లేకుంటే ముల్లోకాలు

కూడా దక్కవు" అనుకుంటాడు. **(భగవంతుడు అనేకకోటి బ్రహ్మాండ నాయకుడు కాగా అఖిలాండ కోటి బ్రహ్మాండాలకు నాయకి లక్ష్మీదేవి. ఈ అనంత కోటి బ్రహ్మాండాలు ఆమె మూలాన్నే నామరూపాలై, స్థితిగలవై వున్నాయి. అట్టి ఈమెకు ముల్లోకాలు ఒక లెక్క కాదు. అయితే లక్ష్మీదేవి, సీతాదేవి భగవంతుడి సహధర్మచారిణిగా, భగవత్ సంకల్పానుసారంగా, తదాజ్ఞావశవర్తియై, ఆయనకు పరతంత్రంగా వుంటుందని భావన.)**

"ధర్మాత్ముడు, మహితాత్ముడు, మహాత్ముడు, మిధిలానాధుడు, జనకుడి కూతురు సీత ఈమె. పరమపతివ్రతైన సీతే ఈమె. సందేహం లేదు. ఇట్టి లక్షణాలు ఆమెలో తప్ప మరొకరిలో వుండవు. అందమైన పొలాన్ని దున్నతున్న నాగటికొనకు తగిలి, భూమినుండి లక్ష్మీదేవిలా పుట్టిన సీత, ఆ భూమినే లోకానికంతా భూమిగా చేసింది. సత్యమైన శీలాన్ని, సత్యమే శీలంగా, కలిగిన జనకుడికి ముద్దుల కూతురై, లోకానికంతా "జనకుడు" అనే పేరుతెచ్చింది తన జనకుడికి. పరాజయమంటే ఏమిటో తెలియని దశరధుడి కోడలయింది. ఆత్మజ్ఞాని, కృతజ్ఞుడు, శరణాగతవత్సలుడైన శ్రీరాముడి ముద్దులరాణయింది. భర్తమీదున్న భక్తితో, కష్టపడతానన్న విచారమే లేక, భర్తతో అడవికెళ్లి, ఆకులలములు తింటూ, ఇంట్లో వున్న తృప్తిని పొందుతూ, చివరకు రాక్షస స్త్రీల మధ్యలో పడిపోయింది. భక్తిపూర్వకంగా మనస్సంతా, భర్తమీద ఉంచింది కాబట్టి, ఆమెకు అడవిలో కష్టాలు, కష్టాల్లా కనిపించలేదు. రాతిని తొక్కినా, కంపను తొక్కినా, మనస్సు దానిపై నుంటేనే కదా కష్టమనిపించేది."

(దేహం, ఆత్మ తారతమ్యాన్ని గ్రహించిన వారిని సుఖదుఃఖాలు కదిలించలేవు. దేహమే ఆత్మ అనే భ్రాంతివల్లనే బాధ కలుగుతుంటుంది. మనస్సునుండి శరీరాన్ని వేరుచేసి భావించగల ధీమంతులకు బాధ, హాయి అనే అనుభవాలుండవు. ఈ సత్యం ఇక్కడ స్ఫురిస్తున్నది)

"సీతాదేవి సౌందర్యం చేతనే ఆదరించతగింది. కష్టాలేంటో ఎరుగకుండానే సుఖాలను అనుభవించతగింది. ఉత్తమ స్త్రీ అయినందున, పరిమిత చిరునవ్వుతో మాట్లాడే స్వభావం కలది. బంగరువన్నె దేహపు చాయ, పూర్ణచంద్రుడిలాంటి ముఖం కల్గి, రావణుడు పెట్టే బాధలకు గురౌతున్నది. దాహంతో వున్నవాడు

చలువపందిరి దగ్గరకు పోయినట్లు, ఇటువంటి దాన్ని శ్రీరాముడు చూడాలనుకోవడంలో ఆశ్చర్యమేముంది? చూడతలచుకోకపోతే, తప్పు ఆయనది కాని ఈమెది కానే కాదు. దుఃఖమెవరికి? రాజ్యసింహాసనం పోతే, తిరిగి సంపాదించుకుని, సంతోషించే విధంగానే, ముల్లోకాలకు, జీవకోటులకు, పూజ్యురాలైన సీతను శ్రీరామచంద్రమూర్తి మళ్లీ పొందుతాడు.... సంతోషిస్తాడు".

(పెదవులు కదిలించకుండా కళ్లతో నవ్వినా, కొద్దిగా పళ్లు కనిపిస్తూ పెదవులు తెరిచినా "హసిత" మంటారు. ఇవి ఉత్తమ స్త్రీ లక్షణాలు. మధురంగా గొంతు వినపడేటట్లు నవ్వితే దాన్ని "విహసిత" మంటారు. వళ్ళంతా కదిలేట్లు నవ్వితే "ఉద్ధసిత" మని, "అపహసిత" మని అంటారు. ఇవి మధ్యమ స్త్రీ లక్షణాలు. కళ్లల్లో నీళ్లు కారేటట్లు నవ్వినా "అపహసిత" మనే అంటారు. వళ్ళంతా పూర్తిగా కదిలేటట్లు నవ్వితే "అతిహసిత" మంటారు. పకపకా–వికవికా నవ్వులు దీంట్లో భాగమే. ఇది అధమ స్త్రీ లక్షణం. సీతాదేవిని అందుకనే కొంచెం చిరునవ్వుతో మాట్లాడేదన్నాడు హనుమంతుడు. అలాగే దాహంతో వున్నవాడు, చలువపందిరి, పరాజయం, భ్రష్టరాజు, అనే ఉపమానాలు శ్రీరాముడిని గురించే. సీతను పొందాలంటే కష్టపడి, ఆమెవున్న చోటుకే వచ్చి, ఆమెను స్వీకరించాలని సూచిస్తున్నాయి ఈ వుపమానాలు. ఆవిషయంలో సీతాదేవి చేయాల్సిన ప్రయత్నమేమీ లేదు)

దప్పికయినప్పుడు చలువపందిరి దగ్గరకొస్తే, అక్కడ నీళ్లు లేకపోతే, ఎట్లా వుంటుందో, ఆపరితాపమేంటో తెలిసిన సీత, శ్రీరాముడు తనకోసమొస్తే, తాను చనిపోతే, ఆయనెంత సంతాపపడ్తాడో, అన్న భావానతోనే వుంటుంది. ఆయనకట్టి సంతాపం కలిగించడం ఇష్టం లేక, బంధువులందరినీ విడిచినప్పటికీ, ఇష్టసుఖాలు కోల్పోయినప్పటికీ, ఎన్ని కష్టాలు కల్గినప్పటికీ, సర్వకాల, సర్వావస్థలందు మనస్సు భర్తపైనే నిల్పి, పోతున్న ప్రాణాలను పోనియ్యకుండా బిగపట్టి వుంచింది. ఆమె చేయకలిగింది ఇంతకంటే ఏముంటుందనుకుంటాడు హనుమంతుడు.

రామాయణాన్ని "సీతాయాశ్చరితమ్ మహత్" అన్న వాల్మీకి

సీతాదేవి వృత్తాంతమంతా ఏకమై, అనన్యమై, భగవత్ ప్రాప్తి ఎప్పుడా-ఎప్పుడా అని ఎదురు చూస్తుండే పరమభక్తురాలి-ప్రపన్నురాలి చరిత్రే! అందుకే రామాయణాన్ని "సీతాయాశ్చరితమ్ మహత్" అంటాడు వాల్మీకి.

లంకలో స్త్రీలు నాలుగు రకాలు. ఈ లోకంలోనూ ఇలాంటి నాలుగు తెగల (రకాల) మనుష్యులే కనపడ్తారు. వారు:

పాపంలో పుట్టి, పాపంలో పెరిగి ఇంద్రియమే పరమార్ధమని నమ్మి పరలోక చింత లేనివారు.

ఉత్తమ వంశంలో పుట్టికూడా, స్వధర్మాన్ని వీడి, కామానికి దాసులై, ఇంద్రియ సుఖాలకు అలవాటు పడ్డవారు.

ఉత్తమ జన్మెత్తినప్పటికీ, సంసార సుఖంలో పడి, కామంలో ఇరుక్కుపోయి, దారీ-తెన్నూ లేక, సంసారం నుండి తప్పించుకొనే మార్గం కానరాక, రక్షించే నాధుడు లేక పరితపించేవారు.

ఏదో చిన్న పాపం చేసి, సంసారంలో పడ్డామనుకుంటూ, నిర్వేదంతో, దీన్నుండి తప్పించే వాడు భగవంతుడే తప్ప, వేరేవాడు లేడని విశ్వసించి, తక్కిన ఉపాయాలన్నీ వదిలి, పరమ భక్తినీ-ప్రపత్తినీ ఆశ్రయించే వారు.

సీతాదేవి తాను చెరనుండి తప్పించుకోవటమే కాకుండా, తన లాగా దుఃఖిస్తున్న దేవ, గంధర్వ, నాగ మొదలైన జాతుల స్త్రీలను కూడా విడిపించింది. నాలుగోరకం వారు (పైన చెప్పిన) తాము తరించి ఇతరులను తరింపచేస్తారు. సీతాచర్య నేర్పేదిదే! ఇతర ఉపాయాలను వెతక్కుండా, దేహాభిమానం, స్వాతంత్ర్యం వదిలి, స్వరక్షణాభారం భగవంతుడిమీద వేసి, "అనన్యార్హశేషత్వం, అనన్యశరణత్వం, అనన్యభోగత్వం" అనే అకారత్రయ సంపూర్తిని కలిగి, సంసారంలో వుండే తరించేటందుకు "ప్రపత్తితోనో, పరమభక్తితోనో" సాయుజ్యాన్ని పొందవచ్చని, సీతాదేవి చరిత్ర వలన తెలుసుకోవచ్చు. అంటే, భగవత్ప్రాప్తి కోరేవాడు, ఆయన అనుగ్రహం కొరకు సీతాదేవి లాగా, భగవన్నామాన్ని ఉచ్ఛరిస్తూ, స్వధర్మాన్ని వదలకుండా వుండడం తప్ప వేరే

మార్గం లేదు. సీతాదేవి ప్రతిదినమూ సంధ్యవారుస్తున్నదని చెప్పటమంటే, పరమభక్తుడైనా, ప్రపన్నుడైనా, జ్ఞాని అయినా, యావజ్జీవం నిత్యకర్మలు వదలరాదని అర్థం. సీతాదేవి చర్య వలన మనం నేర్చుకున్న విషయాలను, ఆచరణలో పెట్టితే, జన్మాంతరలోనే ముక్తి లభిస్తుందనడంలో సందేహం లేదు.)

సుందరి సీతాదేవి, భువనైక సుందరుడైన శ్రీరాముని మాత్రమే చూడాలనుకుంటూ, ఎల్లవేళల మనస్సంతా ఆయన పైనేవుంచి, రాక్షస స్త్రీలను చూడనైనా చూడదు. పూలు, పళ్లు, మేడలు, మిద్దెలు, ఏవీ చూడదు. చూడదంటే కళ్లు మూసుకుని వుందని అర్థం కాదు. వాటి విషయమేదీ మనస్సులోకి రానీయదు. రాక్షసులు పెట్టే బాధలను లక్ష్యపెట్టేది కాదు. ప్రియమైన వాటిమీద మనస్సు పోనీయదు. ప్రియాలు, అప్రియాలు, రెండూ వదిలింది.

(సీతాదేవి శ్రీరాముడినొక్కడినే చూడాలనుకుంటుంది. అంటే, ఇది, "ఏకాగ్రభక్తి, ఏకభక్తి, అనన్యత్వాన్ని" గురించి చెప్పటమే. అలానే, భక్తుడు దేవతలెందరున్నా, తన ఇష్ట దైవాన్నే నమ్మి, "ఏకభక్తి, ఏకాగ్రభక్తి" కలవాడై వుంటాడు. అలానే భక్తులు, ప్రపన్నులు, తమ కెన్ని కష్టాలొచ్చినా, విశ్వాసం వదలకుండా, భగవంతుడు రక్షించేదాకా, తమ "భక్తి-ప్రపత్తులే" తమకు రక్ష అని భావిస్తారు. పతివ్రతలు తన భర్తకంటే ధనవంతులు, విద్యావంతులు, రూపవంతులు, బలవంతులు, లోకంలో ఎందరున్నా, భర్తకంటే అధముల్లాగానే ఎంచుతుంది కాని, వారిని ప్రేమించదు)

శ్రేష్ఠమైన ఆభరణాలెన్ని వున్నా, పతివ్రతకు మిక్కిలి శ్రేష్టమైన భూషణం, భర్తతో వుండడమే. భర్త అనే ఆ "భూషణం" దగ్గర లేకపోతే, ఆమె ఎంత గొప్పదైనా ప్రకాశించదు. వరభూషణాల కంటే పరమ భూషణం భర్తేనట! మానవులకు భూషణాలు "భూరిమయాంగద తారహారాలు కావు. వాగ్భూషణమే సుభూషణం. భూషణాలు నశించేవే! అలాగే ఎన్ని విద్యలు నేర్చినా భగవద్భక్తి లేకపోతే అన్నీ వ్యర్థాలే! భగవద్భక్తి లేని పండితుడు చాకలి మూట మోసే గాడిద వంటివాడే! మర్యాదగా, జ్ఞాన భారాన్ని మోస్తున్న గార్దభం అని ఈసడించబడతారు. తుమ్మెదలలా నల్లని వెంట్రుక కొనలున్నది, తామర రేకుల్లాంటి కనులున్నది, సాముద్రిక లక్షణాలను బట్టి ఎంతో సుఖపడాల్సింది,

మధుర కంఠస్వరం కలదైన సీత కూడా దిగులు పాలైతే, జితేంద్రియుడననీ, ద్వంద్వాతీతుడననీ, గర్వమున్న తనకు కూడా, తన ఇష్టం లేకుండా దుఃఖం కలుగుతున్నదేంటా? అనుకుంటాడు హనుమంతుడు. (రామాంజనేయులిద్దరూ విజితేంద్రియులే, నిర్ద్వందులే. ఇరువురూ సీతాదేవికై దుఃఖిస్తున్నవారే. పామరత్వం కాదు కారణం. ఇతరుల దుఃఖం తన దుఃఖమనుకునే "దయ" దీనికి కారణం. బ్రహ్మచారీ, జ్ఞానీ, యోగీ, విరాగీ, కోతీ, అయిన హనుమంతుడికే, సీతాదేవితో ఇంతకు ముందెట్టి సంబంధం లేకపోయినా, దుఃఖమేస్తున్నదంటే, తనలో సగభాగమైన సీతకొరకు, శ్రీరాముడెందుకు దిగులు పడడు?)

భూదేవి లాంటి ఓర్పు, కమలాలలాంటి కళ్లు కలిగి, రామలక్ష్మణుల రక్షణలో సుఖపడాల్సిన సీత, భయంకర రాక్షస స్త్రీల బెదిరింపుల మధ్య, ఒకచెట్టు మొదట్లో ఈ విధంగా వుండడమేంటనుకుంటాడు హనుమంతుడు. భగవంతుడు దయతప్పి ప్రతికూలిస్తే ఆయనకేదసాధ్యం అని తలుస్తాడు. **(రాముడు, లక్ష్మణుడు, భగవంతుడు: ఇది అనంత, గరుడ, విశ్వక్సేనాది నిత్య భాగవతులకు (నిత్య సూరిగణం) ఉపలక్షణం. చెట్టుమొదట్లో దుఃఖించడమంటే చెట్టు దేహమనీ, మొదలు హృదయమనీ, దేహానికి మూల స్థానమైన హృదయంలో ఈ విధంగా దుఃఖిస్తున్నదనీ అర్థం. ఇది భగవత్సంకల్పం)**

మంచు సోకి, కాంతి హీనమైన తామర పూలలాగా దుఃఖం మీద, దుఃఖం వస్తుంటే, పరితపిస్తున్న సీత, చక్రవాకాన్ని వదిలిన చక్రవాకిలా కనిపించింది హనుమంతుడికి. (శరదృతువులో కళ-కళలాడే తామరపువ్వు కాంతి మంచు పడగానే క్షీణిస్తుంది. అలానే పన్నెండేళ్లు అయోధ్యలో సమస్త సౌఖ్యాలనుభవించిన సీత ఇప్పుడు కష్టాలు పడ్తున్నది. వసంతం రాగానే తామరపువ్వు యదావిధిగా కాంతివంతమయినట్లే, సీతకు కూడా త్వరలోనే దుఃఖం పోతుందని అర్థం. చక్రవాకానికి రాత్రివేళ భర్త వియోగం కలిగినా, ఉదయం కాగానే కలుసుకుంటానన్న ఆశవుంటుంది. అంతే ఈమె కూడా. ఆపదలు ఎప్పుడూ వుండవు. మంచికాలం వస్తుంది....భర్త తనను కలుసుకుంటాడన్న ఆశతో జీవిస్తూ, ప్రస్తుతం దుఃఖ పడుతోంది సీత.)

పూలబరువుతో అశోక వృక్షాల కొమ్మలు సువాసనలు వెదజల్లగా, వసంతకాలపు చంద్రుడి మనోహర కాంతులు విజృంభించగా, ఈమె విరహాగ్నిని మరింత ప్రజ్వరిల్ల చేసి బాధపెడ్తున్నాయని తనలో అనుకుంటూ, రాక్షసులింకా మేలుకునే వున్నారు కాబట్టి, చెట్టు మీదనే వుండిపోయాడు హనుమంతుడు. (సీతాదేవిని అశోకవృక్షం కింద వుంచడానికి ప్రత్యేక కారణం ఏదైనా వుందా? దీన్నే "సీతాశోక వృక్షన్యాయం" అని అంటారు. ఏ చెట్టుకింద వుంచినా, అక్కడెందుకున్నారన్న ప్రశ్న కలుగుతుంది. ఈమె వున్నచెట్టు సమీపంలోనే రావణుడి మేడ వుంది కాబట్టి, రావణుడు దాంట్లోనే వుంచాలనుకున్నా, సీత నిరాకరించి, సమీపంలో వున్న అశోకచెట్టు కిందకు చేరింది. చేరి అక్కడే కూర్చుంది. అదేకారణం).

❖ ❖ ❖

సర్గ-17

సీతాదేవికి కాపలా వున్న రాక్షస స్త్రీలను చూసిన హనుమ

హనుమంతుడు లంకలో ప్రవేశించి, సీతను వెతకడం ఆరంభించినప్పటి నుండి, ఆమె కనపడేవరకు, చంద్రుడు వెన్నెల కురిపిస్తూ సహాయంగా తోడున్నాడు ఆయనకు. తలపెట్టిన కార్యం నెరవేరింది కనుక, ఇక తానుండవలసిన అవసరంలేదని వెళ్లిపోవడం మొదలెట్టాడు. ఆ రోజు శుద్ధ త్రయోదశి.... చంద్రాస్తమానం సుమారు నాలుగున్నర గంటలకు. అప్పుడు సమయం మూడు గంటలై వుంటుంది. నిర్మలమైన కాంతితో ప్రకాశించి, తోడుగా వుండి, హనుమంతుడి మనస్తాపాన్ని తగ్గించాడు చంద్రుడు ఇంతవరకూ.

బరువెక్కి మునిగిపోతున్న పడవలా, కడు దుఃఖంలో బరువెక్కిన సీతను చూసాడు హనుమంతుడు. ఆమె సమీపంలోనే ఆమెకు దిగులు కలిగిస్తున్న వికార-ఆకారాల రాక్షస స్త్రీలనెందరినో చూసాడు. ఒంటి కంటితో, ఒకే చెవితో, చెవులు లేకుండా, మేకు చెవులతో, సన్నని నిడువైన మెడతో, పైకెగ తీసుకునిపోయిన ముక్కుబొక్కలతో, భుజాలపై వేలాడే చెవులతో, పొట్టి వెంట్రుకలతో, బోడితలతో, పెద్దతలకాయతో, గడ్డం తాకే పెదవితో, వేలాడుతున్న చెవులతో, వేలాడే నొసలుతో, వేలాడే చనులతో, కంబళివంటి వెంట్రుకలతో, వంగిన మోకాళ్లతో, వేలాడే ముఖంతో, వేలాడే పొట్టతో, వేలాడే పెదవితో, రకరకాలుగా వున్నారా రాక్షస స్త్రీలు.

పెద్ద పిక్కలతో, పొట్టిగా, ముక్కు లేకుండా, వికారముఖంతో, గోరోజనం వన్నెతో, కోపిష్టిగా, ఉక్కుశూలాలు ధరించి, పులిముఖంలా, ఏనుగుకాళ్లతో, గుంత పడిన తలతో, ఒంటి కాలుతో, గుర్రపు చెవులతో, గాడిద చెవులతో వున్న వారిని ఆ రాక్షస స్త్రీలలో చూసాడు హనుమంతుడు. కడుపు నిండా కల్లు త్రాగి, మాంసం తిని, వెర్రికూతలు కూస్తూ, ఒంటి నిండా నెత్తురు పూసుకుని, సీత చుట్టూ తిరుగుతూ, అరుస్తూ, కేకలేస్తున్న రాక్షస స్త్రీలను చూసిన హనుమంతుడి దేహం జలదరించింది. ఆయన కంటికి వారంత భయంకరంగా వున్నారు.

సీతను చూసి సంతోషించిన హనుమంతుడు

పవిత్ర స్వభావం, చక్కని నడవడిక కలదానిలా కనిపిస్తున్న, దుఃఖంతో తపిస్తున్న, మాసి, చిక్కుబడిన వెంట్రుకలున్న, కాంతితొలగిన, మగనిజాడ తెలియనిదానిలా, మంచి సొమ్ములు ధరించని-పతిభక్తే సొమ్ములా వున్న, పుణ్యం తగ్గితే నేలపైబడ్డ నక్షత్రంలా వున్న, ఒంటరిగా చిక్కిన ఆడ ఏనుగులా వున్న స్త్రీని ఆ చెట్టు కింద చూసాడు హనుమంతుడు. మాసిన వీణలా, అతిశయంతో మగడిని స్మరిస్తూ, రాక్షస స్త్రీల మాటలు లక్ష్య పెట్టకుండా, శరత్కాల మేఘం చాటు పాడ్యమి చంద్రుడిలా, బుధ, అంగారకుల బారినపడ్డ రోహిణిలా, పూలు లేని తీగలా, దుమ్ము చాటున కనిపించే కాంతిలా, బురద కప్పిన తామరతీగలా, పూర్తిగా మాసిన చీర ధరించి, జింకపిల్ల కళ్లలాంటి కళ్లతో, చూడగానే కడుపులో కెలుకుతున్నట్లున్నది హనుమంతుడు చూసిన ఆస్త్రీ.

దుఃఖంతో నిండి, కాంతి తొలగిన ముఖమున్నప్పటికీ, భర్త పరాక్రమం తలచుకుంటూ, ఆయన తనను తప్పక రక్షిస్తాడన్న ధైర్యంతో కనిపించిందామె. మగడు వచ్చి రక్షించేంతవరకు తన పాతివ్రత్యంతోనే, తనను రక్షించుకుంటున్నట్లు వుందామె. ఆమే సీతాదేవి. (దీనర్థం: భక్తులు, ప్రపన్నులు, కష్టాలెన్నొచ్చినా, విశ్వాసం వొదలకుండా, భగవంతుడు రక్షించేదాకా, తమ భక్తి, ప్రపత్తులే తమకు రక్ష అని భావిస్తారు)

భయపడి వణకుతున్న ఆడలేడిలా, తన్ను రక్షించేందుకు రాముడెటువైపు నుండి వస్తున్నాడా అని దిక్కులు చూస్తున్నది సీత. తన వేడి శ్వాసలతో చెట్ల చిగుళ్లను కాలుస్తున్నదా అన్నట్లు వుందామె. హృదయంలోనుంచి వస్తున్న దుఃఖ సముద్రం పొంగి పొరలుతుంటే, అలల్లా నిట్టూర్పులు విడుస్తోంది. శుష్కించి, ఆభరణాలు వేసుకోకపోయినా, సహజ కాంతితో వెలుగుతున్నది. మైమర్చిపోయే సౌందర్యమున్న సీతను చూసి, కృతార్థుడనైతినని, సంతోషంతో హనుమంతుడి కళ్లల్లో నీరు ప్రవహించింది. ఇదంతా రామలక్ష్మణుల అనుగ్రహంతో లభించిందే కదా అని వారికి నమస్కరించి, సీతతో మాట్లాడే సమయం కొరకు, చెట్టు కొమ్మపైనే వేచి చూడసాగాడు.

❖ ❖ ❖

సర్గ-18

అశోకవనానికి వచ్చిన రావణుడు

దాదాపు రాత్రంతా గడిచిపోయి, తెల్లవారుతున్న సమయంలో, చల్లగాలికి కదుల్తున్న చిగుళ్లతో, పూలతో, ప్రకాశిస్తున్న అశోకవనాన్నంతా తేరిపార చూసిన హనుమంతుడు. సీతనింకా దగ్గర నుండి చూడాలనుకుంటాడు. షడంగాల వేదాలు తెల్సి, యజ్ఞకార్యాలపై మనసున్న బ్రహ్మరాక్షసులు (రాక్షసులే అయినా బ్రాహ్మణులవలె వేదాధ్యయనపరులన్న మాట) వేకువజామునే, బ్రాహ్మీ ముహూర్తంలో లేచి, శుచిగా, తప్పులొలకకుండా చదువుతున్న వేదఘోషలు, వీనులకింపుగా వాయిస్తున్న వాద్యాల ధ్వనులు, ఆలోచిస్తున్న హనుమంతుడి చెవిన బడ్డాయి ఆ సమయంలో.

రావణుడు ఆ మంగళధ్వనులు విని, మేల్కొని, కట్టుకున్న పట్టువస్త్రాలు, ధరించిన పూలదండలు, ఒంటి మీదనుండి జారిపోతుంటే, కామంతో సీతను తలచుకుంటాడు. మనసంతా సీతపైనే నిలిపిన రావణుడు, అతిశయించిన కామమదంతో, తన హృదయంలో నిండిన కామాన్ని కొంచెం కూడా అణచుకోలేక పోయాడు. సంతోషం కలిగిస్తున్న పండ్లచెట్లతో, వికసించిన తామరపూల సరస్సులతో, ఇంపై ఒప్పుతున్న పక్షుల కిలకిలారావాలతో, కృత్రిమ జింకలు, దుప్పుల సమూహాలతో, కంటికి ఇంపైన అశోకవనంలోకి, భూషణాలు ధరించిన రావణుడు, తనకున్న మహాసంపదను ప్రదర్శించుకుంటూ ప్రవేశించాడు. వందలమంది రాక్షస స్త్రీలు చేతుల్లో కాగడాలు, చామరలు ధరించి, ఇంద్రుడి వెంట పోయే దేవ-గంధర్వ స్త్రీలలా, రావణాసురుడిని అనుసరించారు.

అందమైన బంగారుబిందెల్లో నీళ్లు తీసుకుని కొందరు ముందు నడిచారు. కత్తులు, మణిమయమైన పీటలు పట్టుకుని మరికొందరు స్త్రీలు వెనుక అనుసరించారు. రత్నపాత్రను నీటితో నింపి, కుడిచేత్తో పట్టుకుని, ప్రక్కనే నడిచిందో నేర్పరి. ఇంకోకామె రాజహంసను, పూర్ణచంద్ర బింబాన్నీ పోలిన తెల్లటి గొడుగు పట్టుకుని ఆయన్ననుసరించింది. బంగారు దండం ఇంకొకరి చేతుల్లో వుంది. నిద్రమబ్బు కళ్లతో తన భార్యలు, మబ్బువెంట పోయే మెరుపులా నడచి వస్తుంటే, రావణుడు ప్రవేశిస్తాడు ఉద్యానవనంలోకి అప్పుడు.

వీడిన కొప్పులు, రాలిన గంధపు పూలు, నిద్దుర మబ్బులు, మద్యం వాసన, చెమటగారే ముఖాలు, చెమట నీళ్లతో తడిసిన పూదండలు, పూదండల్లో చిక్కుపడ్డ వెంట్రుకలు, ఎర్రనికళ్లు, అందమైన సొగసులు, మేలైన కాంతులున్న స్త్రీలు అనురాగంతో తనవెంట వస్తుంటే, రావణుడు సీతను తల్చుకున్నాడు. కామాతిశయంతో కన్ను మిన్ను కానని రావణుడు, సీత తనకు వశపడుతుందని, మూఢుడై భావిస్తూ, పరస్త్రీల విషయంలో పాటించాల్సిన కనీస మర్యాదను కూడా మరచి అశోకవనంలోకి ప్రవేశిస్తాడు. ప్రవేశించి సీతాదేవిని సమీపించాలని అనుకుంటాడు.

అదే సమయంలో రావణుడి వెంట వున్న స్త్రీల ఒడ్డాణాల లోని గజ్జెల ధ్వనులు, ఇంపైన అందెల నాదం వినపడింది. వీరుడు, సుందరుడైన రావణుడు, విశాలమైన వంకరకళ్లతో, అపరమన్మధుడిలా, కామాతిశయంతో, సువాసనల తైలంతో తడిసిన దివిటీలు పట్టుకున్న స్త్రీలు వెంటరాగా, తోట వాకిట్లోకి వచ్చాడు. భుజబలంలో ఇంతటి గొప్పవాడని చెప్పలేని ఆ రాక్షస వీరుడు తెల్లటి వస్త్రాలు సవరించుకుంటూ వస్తుంటే, చూద్దామని తలెత్తాడు హనుమంతుడు. ఆయన వెంటే వున్న, బంగారు ఒడ్డాణాలు, రత్నాల గజ్జెలు ధరించిన సుందరీమణులైన వయస్సున్న స్త్రీలను చెట్టు చాటునుండే చూశాడు హనుమంతుడు.

తన చుట్టూ వున్న స్త్రీల నడుమ నక్షత్రాల మధ్యనున్న చంద్రుడిలా భావిస్తూ వస్తున్న వాడినీ, హారాలు, ఆభరణాలతో సుందరంగా వున్నవాడినీ, మహాబలవంతుడినీ, కామానికి దాసుడైన వాడినీ, మనోహర శరీరం కలవాడినీ, విశ్రవసు కుమారుడినీ, చూసిన హనుమంతుడు, తను చూస్తున్నది రావణుడినేనని అనుకుంటాడు. వాడిని పూర్తిగా చూసేందుకు, అనువైన స్థలంచేరి , వాడెదురుగా కనిపించే విధంగా, బలవంతుడు అయినప్పటికీ, వాడి తేజస్సు ముందర తేజోహీనుడై కొమ్మల నడుమ దాగాడు.

❖ ❖ ❖

సర్గ-19

సీతాదేవిని చేరబోయిన రావణుడు

యవ్వన, సౌందర్య సంపత్తిగల రావణాసురుడు, ఆభరణాలతో అలంకరించుకుని, రాక్షస స్త్రీలను కూడి తనవైపు రావడం, దూరాన్నుండే చూసిన సీత, ఈదురుగాలికి వూగే అరటి చెట్టులా వణకసాగింది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, తొడలతో కడుపును, చేతులతో స్తనాలను, భయంతో కప్పుకుంటుంది. (సొమ్ములుమూట కట్టడానికి ఉత్తరీయం వాడింది కాబట్టి, పైటకూడా లేనందున, కడుపు కనపడకుండా తొడలను, రొమ్ములు కనపడకుండా మోకాళ్లను అడ్డంపెట్టుకుని, రెండుచేతులు కట్టుకుని బిగించిందని అర్థం. రావణుడిని చూసినప్పటి సీత పరిస్థితి దారుణంగా వుందనుకుంటాడు హనుమంతుడు.

రాక్షస స్త్రీల గుంపు రక్షణలో దుఃఖిస్తూంది. సముద్రం మధ్యలో విరిగిన ఓడలా, తీరం కొరకు వెతుకుతున్నదానిలా వుంది. కటికనేలపై కూర్చుని, తెగనరికిన పూతీగలా, నిద్రాహారాలు మాని, వ్రతదీక్ష పూనిన దానిలా వుంది. ఒంటరిగా దుఃఖిస్తూ, దుమ్ము పట్టిన దేహంతో, బురదంటిన తామరపూవులా వుంది. ఆభరణాలు ధరించే యోగ్యత వుండికూడా, అలా చేయలేని పరిస్థితిలో, దేహం శుష్కించిపోయింది. తన దుఃఖం ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితిలో పొరలుతున్న "ఆడుపాము"లా వుంది. గుణాలలో, నడవడిలో, ధర్మంలో, సదాచారంలో, ప్రసిద్ధికెక్కిన వంశంలో పుట్టి కూడా, నీచుడికి చిక్కిన దానిలా వుంది. కళంకరహితుడు, తల్లి కంటే తనపైనే ఎక్కువ ప్రేమున్నవాడు, తన దోషాలను హరించి స్వీకరించే నిత్యనిర్దోషైన శ్రీరాముడి దగ్గరకు, సంకల్పమనే గుర్రాలు నడుపుతున్న హృదయరంలో కూర్చుండిపోతున్న పతివ్రతా రత్నంలా వుంది.

నిష్కారణంగా నిందపడి చెడిపోయిన కీర్తిలా వుంది. ధనం పైనే దృష్టి నిలిపి, లోభిగా, గురువుకేమన్నా ఇవ్వాల్సివస్తుందేమోనన్న భయంతో, సరీగ్గా విద్య నేర్వనిదానిలా వుంది. నశించిన కీర్తిని, ఆదరించబడని శ్రద్ధను, పూజా

ద్రవ్యాలు లేని పూజను, చెడిపోయిన ఆశను, చెదిరి పోయిన లాభాన్ని, వాడిన పద్మాన్ని, కాలుతున్న దిక్కులను, విఘ్నమైన పూజను, చీకటితోకూడిన వెలుతురును, ఎండాకాలపు ఏరును పోలివుందామె. శూరులందరూ చచ్చిన సైన్యంలా, వ్యర్థమైన ఆజ్ఞలా, రాహువు మింగిన చంద్రుడి కాంతిలా, చల్లారిన అగ్నిలా కనిపించిందామె. మైలపడ్డ యజ్ఞవేదికలా వుంది. తామర పూలను, ఆకులను పీకేసి, అక్కడున్న పక్షులను పారద్రోలి, ఏనుగుతొక్కిడికి బురదమయమైన తామర కొలనులా వుంది. మగడినే తలస్తూ, అదేపనిగా సుకుమార నిర్మల దేహంతో అందగత్తెలలో శ్రేష్ఠురాలిగా వుందామె. అప్పుడే ఎండలో పడేసిన తామరతూడులా వాడిపోయి వుంది. యోధుడిని వదిలి, స్తంబానికి కట్టేయగా, తపించిపోతున్న ఆడ ఏనుగును బోలి, ఒంటిజడతో, చూడడానికి దిగులు పుట్టేలా, సొమ్ములేక, శరత్కాలంలోని నల్లని వనభూమిలా వుందామె.

భయంతో, దిగులుతో, ఆహారం లేకపోవడంతో, చింతతో, తపస్సు చేసే రీతిలో, శోకిస్తున్న సీత రావణుడిని చూసి తెల్లబోయింది. తన పతి పరాక్రమం అతిశయించేట్లు చేసి, రావణుడికి అపజయం కలిగించి, రాముడు గెలిచేట్లు చేయమని రెండు చేతులూ జోడించి, భక్తితో సమస్త దేవతలకు నమస్కరిస్తుంది. అన్ని దిక్కులు చూస్తూ ఏడుస్తున్న ఆ పవిత్రురాలైన సీతను, పాపాత్ముడైన రావణుడు, తన మరణదశ దగ్గర పడడంతో, ఆమెను సమీపించాడు (సీతను ఆడపామని చెప్పడం అంటే, దానిని తాకినవారికి మరణం తప్పదని భావన. హృదయమనే శరీరం కల ప్రాణాలు, అతివేగంగా పోతున్నాయని చెప్పడం జరిగింది. అంటే సీతాదేవి శరీరమందున్నదే కాని, ఆమె హృదయం, ప్రాణం, భావం, సర్వం, శ్రీ రాముడి వద్దకు పోయిందని భావం. భక్తులు, పతివ్రతలు, ఇట్లా వుంటారని అర్థం).

❖ ❖ ❖

సర్గ-20

సీతాదేవికి తనకోరికను చెప్పిన రావణుడు

ఇలా సీతను సమీపించిన రావణుడు, తియ్యటిమాటలతో,తన మనసులోని ఆలోచనను, స్పష్టంగా, పతివ్రతా శిరోమణైన సీతకు చెప్పాడీ విధంగా:

"ఓ నా ప్రియురాలా! జగదేక మోహినీ! నన్నుచూసి నీ వెందుకు కడుపు, స్తనాలూ దాచుకుంటున్నావు? ఎందుకిట్లా వణుకుతున్నావు? ఇక్కడ ఇతరులెవరూ లేరు. నా మాటవిను. సౌందర్యగనీ! నన్ను గౌరవించు. ఇక్కడ నీజాతి మనుష్యులెవ్వరూ లేరు, నా జాతివారూ లేరు. కామ రూపులైన రాక్షసులూ లేరు. ఎవరన్నా చూసి ఏమన్నా అనుకుంటారన్న భయంలేదు. నాకూ నీవు భయపడాల్సిన అవసరంలేదు. నేను రాక్షసుడనైనప్పటికీ, నీమీద కామంతో వచ్చానే కాని నిన్ను చంపడానికి రాలేదు."

"ఓరీ! నేను నీ భార్యను కాను, పరుల భార్యలను కోరవచ్చా అంటావేమో! పరుల భార్యలను పొందడం, ఇతరుల ధనం అపహరించడం, మారాక్షస కులధర్మం. పిరికిదానా! ఇది కులధర్మం కాబట్టి దోషం లేదు. నీకు పాపభయమక్కరలేదు. సుందరీ! ఇది నా స్వధర్మమైనా, నాపై నీకు కామం కలుగలేదు కాబట్టి నిన్నింకా తాకడంలేదు. నీవే, నీ కోరిక ప్రకారమే, యథేచ్ఛగా నామీద దయవుంచి, నన్ను కామించు".

"దేవీ! నువ్వు భయపడవద్దు. నన్ను అనుగ్రహ దృష్టితో గౌరవించు. దిగులు పడొద్దు. ఒంటి జడ, నేలపై నిద్ర, ఉపవాసాలు, విచారం, మాసినచీరె, నీకిక్కడ తగవు. సొగసైన పూదండలు, దివ్యాభరణాలు, దివ్యచందనపు పూతలు, రకరకాల చీరెలు, అందమైన ఇల్లు, సొంపైన పానుపులు, పీటలు, ఆటలు, పాటలు, అంగీకరించి నన్ను పొందు. స్త్రీలలో శ్రేష్ఠురాలివైన నీవిలా వుండవద్దు. వెలగల ఆభరణాలు ధరించు. నా దగ్గరుండికూడా అలంకరించుకోకుండా వుండరాదు. కోమలమైన నీ ప్రాయం వృథా కాకూడదు. పోయిన వయస్సు తిరిగిరాదన్న విషయం నీకు తెలియదా?".

"నిన్ను పుట్టించిన బ్రహ్మ ఆ తర్వాత సౌందర్యవంతులైన స్త్రీలను సృష్టించడం మానేసుంటాడు. నీకు సరితూగే స్త్రీ ఈలోకంలో లేనేలేదు. నీ కంటే అందగత్తెను సృష్టించాలన్నా, అది వృధా ప్రయత్నమే. నీవు లభిస్తే మగవాడైన ఆ బ్రహ్మకూడా నిన్ను వదలడు. నీ దేహం మీద ఎక్కడెక్కడ నా చూపులు పడ్డాయో, అక్కడే అవి ప్రేమతో భ్రాంతితో నిల్చిపోతున్నాయి. కొంచెం కూడా కదలడంలేదు. నిన్ను పొగడడం నాకు సాధ్యం కావడం లేదు. అజ్ఞానం వదలి నా భార్యవు కా. నేను దేశ, దేశాల నుండి బలాత్కారంగా తెచ్చిన స్త్రీలందరికి నీవు పట్టపురాణివి కా. నామణులు, రాజ్యం, నీ సొత్తే. ఇంకా కావాలంటే సమస్త భూమినీ, నగరాలనూ, జయించి, నీ జనకుడికి నీ తృప్తితీరా ఇస్తాను".

"యుద్ధమందు నన్నెదిరించగల శూరులెవ్వరూ లేరు. యుద్ధంలో నా బలం, శౌర్యం, నీవే చూస్తావు. సీతా, నేను యుద్ధం చేస్తుంటే, కట్టిన తాళ్లు తెగి, దండాలు విరిగి, నేల రాలిన ధ్వజాలతో, రౌతులు చచ్చిన గుర్రాలతో, కుప్పకూలిన రథాలతో, విరిగిన విల్లంబులతో, విరబోసుకుని పరిగెత్తే వెంట్రుకలవారితో, చస్తున్న శత్రు సేనాభటులతో నిండి వుంటుంది యుద్ధభూమి."

"నీ సౌందర్యాన్ని తనివితీర, కళ్లారా చూడాలని నా కోరిక. ఒంటిపై ఆభరణాలు ధరించు. ఆశ తీర సమస్త భోగాలనుభవించు. పానకం సంతోషంగా తాగు. ధనం, భూమి, రాజ్యం, ఇంకేదైనా సరే, నీ ఇష్టమొచ్చినట్లు, ఇష్టమొచ్చిన వారికి దానం చేయి. నన్ను దయతో చూడు. నీవేదడిగినా ఇస్తాను. నీ అనుగ్రహం నాపై కలిగితే నీ బంధువులందరినీ సుఖపెడ్తాను. ఇది సత్యం."

ఇలా ఇంతసేపు తన్ను పొగడుకున్న రావణుడు, రాముడిని దూషించసాగాడిలా:

"నీ మగడికి ఇల్లు, వాకిలి, గుడిసె లేదు. అడవుల్లో తిరుగుతున్నాడు. కట్టుకుంటానికి మంచి బట్టల్లేవు. నార చీరలు కడుతున్నాడు. గెలుపు లేనివాడు. నిద్రించడానికి చాపైనా లేదు. నేలపైనే నిద్ర. అట్టి దరిద్ర రాముడికీ, నాకూ ఏంటి పోలిక? రాముడు, రాముడని అంగలారుస్తున్నావు కాని, అతడింకా బ్రతికే వున్నాడని నమ్మకమేంటి? చావ లేదని ఎట్లా చెప్పగలవు? బ్రతికున్నా నిన్ను చూడడానికి రాలేడు. కొంగలు వ్యాపించిన చంద్రుడిపైన వానమబ్బు కమ్మితే వెన్నెలను చూడటమెంత అసాధ్యమో, సముద్రాన్ని దాటి నన్ను గెలిచి

నీ దగ్గరకు రావడమంత అసాధ్యం. (సముద్రములో వుండే సింహిక అనే జలాంతర్గామి చంపబడిందన్న వార్త రావణుడికి తెలిసి వుండదు పాపం!) హిరణ్యకశిపుడి భార్యను ఇంద్రుడపహరించినా వుంచుకోలేక పోయాడు. కాని, నా చే చిక్కిన నిన్ను మరల రాముడు హరించెనేని నా కీర్తి హరించినట్లే. అది జరగదు. నీవు నా భార్యవు. నిన్ను రాముడు, నయానా, భయానా హరించలేడు నా నుంచి. (రావణుడు తనను గొప్ప కోసమని ఇంద్రుడితో పోల్చుకున్నాడు)"

"అందమైన చిరునవ్వుతో, సుందరమైన దంతాలతో, కళ్ల సొగసుతో, గరుత్మంతుడు పామును హరించినట్లు, నువ్వు నా మనస్సును హరిస్తున్నావు (ఈ ఉపమానం సీతాదేవి రావణుడి పాలిట మృత్యుదేవతని సూచిస్తున్నది). మాసిన చీరెతో, సొగసుపోయి, ఆభరణాలు ధరించక, కష్టపడుతున్న నిన్ను చూస్తూ, నేను నా భార్యలతో నిశ్చింతగా గడపలేకపోతున్నాను. సీత ఇంత కష్టపడుతుంటే, నాకెందుకీసుఖమని, నా మనస్సు నీ మీదనే వుండడంతో, వారెవ్వరిపై మనసు పోవడంలేదు. అయితే నిన్నంగీకరిస్తే వాళ్లకు కోపమొస్తుందేమోనని అనుమానం వద్దు. నా భార్యలందరూ సుగుణ సంపత్తికలవారే. వారందరికి నీవే ఈశ్వరివి. నీ అధికారానుసారం నిన్నే అనుసరించి వస్తారు వారందరూ".

"శ్రీ మహాలక్ష్మిని ముల్లోకాల అప్సరసలు ఏ విధంగా భయ, భక్తులతో సేవిస్తారో, అలానే, నా ఆడవాళ్ళందరూ నిన్ను సేవిస్తారు. కుబేరనగరం అలకాపురిలోని నిధులందున్న రత్నాలన్నీ నీవే. తీసుకో. లోకంలో వున్న వెలలేని ఆభరణాలన్నీ నీవే. తీసుకో. నన్ను స్వీకరించు. తపంలో కాని, బలంలో కాని, పరాక్రమంలో కాని, ధనంలో కాని, లోకంలో మంచికీర్తి విషయంలో కాని, రాముడు నాతో సమానుడు కాడు. సీతా! నీ ఇష్టమొచ్చినట్లు మనసారా నాతో గడుపు. త్రాగు, భోగాలు అనుభవించు. నీవు ఏదికోరితే అది ఇస్తానంటున్నాను కదా! నీ వాళ్ళందరినీ సుఖపెడతానంటున్నాను కదా! ఓ లలనా! త్రాగు. విహరించు. రమించు. నీకు కావలసిన ధనమో, భూమియో, నీకేది కావాలంటే అది ఇచ్చేస్తాను. నీకే కాదు, నీ వారందరికీ అన్ని సుఖాలను సమకూరుస్తాను.

"భామినీ, నీవింకా ఆలస్యం చేయొద్దు. బంగరుబొమ్మా! ఝుంకారాలు చేసే తుమ్మెదగుంపుల మధ్య, సముద్రతీరంలోని పూలచెట్ల పొదల్లో నాతో విహరించు" అంటాడు రావణుడు.

❖ ❖ ❖

సర్గ-21

రావణుడికి బుద్ధి చెప్పిన సీతాదేవి

దుష్ట రావణుడి ద్వారా ఇలాంటి మాటలు వినాల్సి వచ్చెకదా అని, కళ్లల్లో నీరు కారుతుంటే, ఏడుపుగొంతుతో, వణకుతూ, మనసులోనే దిగులుపడుతుంది పతివ్రతా శిరోమణి సీత. అసహాయ కావడంతో, తొందరపడి వీడు తన్ను తాకుతాడేమోనని భయంతో వణకిందికూడా. వాడిని దహించగల శక్తి తనకున్నా, సాధ్వి అయినందున, సహించి వూరుకుంది. ఆపత్కాలంలో దేవుడిని ప్రార్థించినట్లే, పతివ్రతలకు భర్తే దైవం కనుక, శ్రీరాముడిని తలచుకుంది. తనను వీడేమీ చేయలేడన్న ధైర్యం తెచ్చుకుని, తన కోసం ఏడవకుండా, భర్తకు తనవల్ల దుఃఖం వచ్చింది కదా అని బాధపడింది. చెప్పినా వినకుండా, తనకారణాన రావణుడు సర్వనాశనమైపోతున్నాడే అని, వాడి కొరకూ కన్నీరు కార్చింది. ఇలా అనుకుంటూ, పరిశుద్ధమైన చిరునవ్వు ముఖంతో ఒక "గడ్డిపోచ"ను తనకడ్డంగా రావణుడి ముందు పడేసింది సీత.

(రావణుడు దుష్టుడైనా ప్రభువు, క్షత్రియుడు. పైగా తన దగ్గర కొస్తున్నాడు కాబట్టి వాడు అతిథే. అతిథిని సత్కరించాలని శాస్త్రాలు చెప్పుతున్నందువల్ల తనకు లభించిన "తృణం" వాడివైపుకు వేసిందని ఒక భావన. "నిన్ను నేను తృణప్రాయంగా చూస్తున్నాను. ఈ తృణం నన్నేమి చేయగలదో నువ్వూ అంతే" అనేది మరో అర్థం. రావణుడు పశువుతో సమానమనే అర్థమొచ్చే రీతిలో వాడి భోగ్య వస్తువైన గడ్డిపోచ వేసింది సీత. ఇలా ఎన్నో అర్థాలను, విశేషాలనూ సెలవిస్తారు మన పెద్దలు గడ్డిపోచను మధ్యలో వేయడంలో)

తన్ను పొగడుకుని, రాముడిని దూషించిన రావణుడికి బుద్ధి చెప్తూ సీత ఇలా అంటుంది వాడితో:

"అందని పండుకై అర్రులు చాచినట్లు నాపై మనస్సు పోనీయకు. పాపాత్ముడికి ముక్తి ఎట్లా లభించదో, నీకు నేనట్లే. నువ్వెంత వేడుకున్నా లాభం లేదు. నామీదుంచానంటున్న నీ మనస్సును, నీ భార్యలపై మరల్చు. అలా చేయకపోతే కీడుకలుగుతుంది. నిష్కారణంగా నువ్వు నీ భార్యలను

అవమానించవద్దు. వారిని ఉపేక్షించవద్దు, నన్ను అపేక్షించవద్దు. నేను పుట్టింది పుణ్యాత్ముల వంశంలో. మెట్టింది అంతకంటే పూజ్యులైన వారింట్లో. పతివ్రతా నియమాన్ని స్వీకరించినదాననైన నేను చేయరాని చెడు పనెలా చేస్తాను? అలా చేస్తే ఇరువంశాలవారిని నరకం పాలుచేసినట్లే కదా! ఇదంతా ఆలోచించకుండా, శాస్త్ర, లోక, ఆత్మవిరుద్ధమైన వాగుడు మాటలనెందుకు వినిపిస్తున్నావు రాక్షసుడా?". ఇలా అంటూనే, ఆ పాపాత్ముడెదురుగా ముఖముంచడం దోషమనుకుంటుంది సీత. వాడిని లక్ష్యపెట్టకుండా వెనక్కుతిరిగి, వాడికి బుద్ధివచ్చి బాగుపడుగాక అనుకుని వాడితో ఇలా అంటుంది మళ్లా:

"ఓరీ రాక్షసుడా! నేను పతివ్రతను. ఇతరుడి భార్యను, నీ భార్యను కాదు. పరస్త్రీల విషయంలో పరపురుషుడెట్లా వ్యవహరించాలో ఆ సాధుమార్గం తెలుసుకో...తెల్సుకుని ఆ మార్గంలో నడువు. నిష్కారణంగా ఎందుకు పాపం మూటకట్టుకుంటున్నావు? నీవు, నీ భార్యల పాతివ్రత్యాన్ని ఎట్లా రక్షించాలనుకుంటున్నావో, అలానే ఇతరుల పాతివ్రత్యాన్ని కూడా కాపాడు. పాతివ్రత్య నియమం మంచిది కాబట్టి అదెక్కడున్నా రక్షించాల్సిందే. కాదంటావా? నీ భార్యలు రంకుతనం చేస్తే ఏం తప్పు? ఇతరుల భార్యలను నీవు ఆశిస్తున్నావంటే, నీ భార్యల వ్యభిచారాన్ని ఒప్పుకుంటున్నట్లే కదా! కాబట్టి నిన్ను ఉపమానంగా తీసుకుని, నీవు ఇతరుల భార్యలను ఆశిస్తే, నీ భార్యను ఇతరులు ఆశించినా తప్పులేదని తెలుసుకో. నన్ను ఆశించకు."

"బాహ్య ఇంద్రియ నిగ్రహం, మనోనిగ్రహం లేకుండా, తన భార్యతోనే తృప్తిపడని మూఢుడి బుద్ధి, పూర్వపుణ్యం, ఐశ్వర్యం, సంతానం, ఆయుషులన్నింటినీ, పర స్త్రీలు నాశనం చేస్తారు. కాబట్టి జారత్వమెంత కీడో తెల్సుకుని బుద్ధికలగి ప్రవర్తించు. నీవు చేస్తున్న పని చేయతగనిది అయినప్పుడు, ఇది తప్పు, తగదు, హానికరం, అని నీ మేలుకోరి చెప్పేవారు, నీ వూళ్లో ఎవరూ లేరా? విభీషణుడి లాంటివారున్నారు కదా! కాని ఏమి లాభం? ధర్మా-ధర్మాలు తెలుసుకునేందుకు నీవు వాళ్ల దగ్గరకు పోతున్నావా? వాళ్లను చెప్పనిస్తున్నావా? నువ్వెళ్లి నమస్కరించి అడిగితే కదా మంచిచెప్పేది. నీ దుష్ప్రవర్తన, పాపకార్యాలు చేయడం, చూస్తుంటే, నీకూ, సాధువులకూ చాలా దూరమనిపిస్తున్నది. అట్లా కాకపోతే నీవిట్లా విపరీతంగా మాట్లాడలేవు."

"నీవడక్కపోయినా, నీ మేలు కోరేవారు నీకు మంచిమాటలు చెప్పేవుంటారు. కాని నువ్వు వింటేగా? నీ మూలాన రాక్షసులందరూ చావాల్సొస్తున్నదిప్పుడు. వీళ్ళంతా ఇంతవరకూ నీవేదో గొప్పవాడవనుకుని, నీ ఆశ్రయంలో వుంటే మేలనుకుంటున్నారు. నీతో స్నేహంగాకూడా వున్నారు. వాళ్లు నీ మంచి కోరుకుంటున్నట్లు, నీవు వారి మంచి కోరుకోవడంలేదని అనిపిస్తోంది. నీ స్నేహం అబద్ధం. నీవు చెడి వారందరినీ చెడగొడుతున్నావు. నీది మిథ్యా స్నేహం. పుణ్యాత్ములవల్ల చక్కదిద్దబడని మనస్సు, స్వభావం నీది. నీలాంటి చెడునడవడి వున్న రాజు కారణాన, పట్టణాలు, సంపద, రాజ్యం, నాశనం అవుతాయి. నీ ఒక్కడిపాపం వల్ల, అందమైన ఈ లంకంతా నాశనం కాబోతున్నది. ఓడ నడిపేవాడు, చిత్తుగా త్రాగి, సుడిగుండంలోకి నడిపితే, వాడిని నమ్మి అందులో వున్నవారంతా చస్తారు కదా!"

"దూరపు చూపులేక, ఎప్పుడు ఏం తోస్తుందో అప్పుడది చేసుకుంటూ పోతూ, ధర్మాధర్మ విచక్షణ చేయక, పాప కార్యాలందు మనస్సు పోనిచ్చే వున్మాది, వాడి పాపాలకు వాడే బలై చస్తే, ప్రజలంతా నిర్భయంగా, సుఖంగా నిద్రపోతారు. స్నేహం నటిస్తూ, కీడు కలిగిస్తున్న నీ లాంటి మోసగాడు కష్టాల్లో ఇరుక్కున్నప్పుడు, ఈ దుష్టుడు, కర్మ కొద్దీ చిక్కుల్లో పడ్డాడనీ, వీడు నాశనమైపోతే మంచిదనీ నిన్ను తిడ్తారు. సంతోషిస్తారు. ఎందుకు నిందల పాలై రెండు లోకాల్లో చెడిపోతావు?" (ఎవరికీర్తి ఎంతవరకు లోకంలో వుంటుందో, అంతకాలం వాడు స్వర్గంలోనూ, అపకీర్తి వున్నంత వరకూ నరకంలోనూ వుంటాడు).

రావణుడిని తృణప్రాయంగా చూసి కర్తవ్య బోధ చేసిన సీతాదేవి

సీత రావణుడికి ఇంకా ఇలా కర్తవ్యబోధ చేస్తుంది: "రావణా! నీవు మూఢుడివిరా! రామచంద్రమూర్తి నుండి నన్ను వేరుచేయడం నీకు చేతనవుతుందా? సూర్యుడికి ఎండలా, నేను శ్రీరామచంద్రుడికి "అనన్య"ను. నన్నాయన నుండి వేరుచేయలేవు. భోగభాగ్యాలను ఎరబెట్టి నన్ను మోసగించాలని

చూస్తున్నావు. నీవు అవివేకివి. ఎండ సూర్యుడిపైన ఆధారపడ్డప్పటికీ, ఆ ఎండ మూలాన్నే, ఆయన ఉనికి తెలిసి, ఆయన్ను పూజిస్తున్నారు. అట్లే నేనూ రాముడి దానినైనా, ఆయనమీద ఆధారపడ్డ పరతంత్రనైనా, నేనే ఆయన్ను లోకానికెక్కువగా వుపయోగపడేటట్లు చేస్తున్నాను. ఆయన మహిమ లోకమంతా తెలవడం నా వల్లనే. నేను లేకపోతే, ఆయన ఉనికేలేదని చెప్పాలి".

(మారీచుడు రావణుడితో "జనకాత్మజ సంబంధంబున రాముండప్రమేయ పురుతేజుండయ్యె"నని చెప్పాడు. అవివేకైన రావణుడికి అది అర్థం కాలేదని సీత గుర్తుచేస్తుందిక్కడ. యాచకులు లేని దాతలు, రోగులు లేని వైద్యులు లేనట్లే, ప్రపంచం లేకపోతే భగవంతుడు లేనేలేడు. ప్రకృతిమూలాన్న తప్ప, భగవంతుడిని తెల్సుకునే మార్గమే లేదు. ఆ భగవంతుడి శక్తే "లక్ష్మి". ఆమే "మాయ". ఆమే "ప్రకృతి". ఆమె 'చిద్విలాసమే' ప్రపంచం. ప్రపంచం, భగవంతుడు వేరు-వేరు కాదు. లక్ష్మి అనుగ్రహిస్తేనే ప్రపంచాన్ని దాటుతాం. భగవదనుగ్రహానికి నోచుకుంటాం. ఆమెను వశపర్చుకోవడానికి, నమస్కారమే సాధనం కాని, బలాత్కారం, ధన, విద్యాబలం మాత్రం కానేకాదు. ఎప్పుడెప్పుడు విష్ణువు అవతారమెత్తుతాడో, అప్పుడన్ని సమయాల్లో శ్రీదేవి ఆయనకు సహాయంగా రావాల్సిందే. ఆయన దేవతలందు అవతారమెత్తితే, ఈమె దేవత్వాన్ని ధరిస్తుంది. మనుష్యుల్లో అవతారం ఎత్తితే మనుష్య స్త్రీగా అవతరిస్తుంది. విష్ణు దేహానికి అనురూపమైన దేహాన్ని ధరిస్తుంది. ఆమె "అనన్య". అంటే, చీకటి-వెలుతురు లాగా అన్యం కాకుండా వుంటుంది. సూర్యుడు, ఎండ, చంద్రుడు, వెన్నెల, సముద్రం అలల్లా. ఇంతే "జీవాత్మ-పరమాత్మ"ల అనన్యత్వం. జీవుడు "పరమాత్మ" అంశ. ముముక్షువగు బద్ధ జీవుడు సీతాదేవి శ్రీరాముడి పట్ల ఎటువంటి అభిప్రాయం కల్గి, ప్రవర్తించి, లంకనుండి విముక్తు రాలైందో, అలాగే పరమాత్మ విషయంలో విశ్వాసంవుంచి, ప్రవర్తించి విముక్తుడు కావాలి. కాకపోతే ఎక్కడాకూడా, సీతాదేవి, తానే రాముడనలేదు-రాముడూ సీత తానే అనలేదు.)

"సర్వలోక ప్రసిద్ధుడు, జగన్నాధుడూ అయిన నా భర్త భుజాన్నే తలదిండుగా చేసుకుని పడుకున్న నేను, పేరూ-ప్రతిష్టా లేని, ఓ అనామకుడిని చేత్తో కూడా

తాకను. ఆరంగాలతో వేదం చదివి, సత్యం,సదాచారం కలిగి, సాధు సాంగత్యం చేసి, జీవాత్మ,పరమాత్మ సంబంధం తెల్సిన, బ్రాహ్మణోత్తముడికి, సకల గుణాభిరాముడికి, భూపతికి, తగిన భార్యను నేను. దీంట్లో ఒక్క గుణంకూడా లేనినిన్ను చేత్తో కాదు, కాలితోకూడా తాకను. ఎందుకు భ్రాంతితో నన్ను ఆశిస్తావు? కనీసం నీయోగ్యతెంతో తెలుసుకునే శక్తి కూడా నీకు లేదే!"

(ఆరంగాల వేదం చదవగానే లాభంలేదనే అర్థం వచ్చేటట్లు చెపుతుంది సీత రావణుడికి. సత్యం, శీలం, కలవాడై వుండాలి. రావణుడు వేదాలు చదివినా, సత్య-శీలాలు లేవు. ఆయన శుద్ధ బ్రాహ్మణుడు కాదు, శుద్ధ క్షత్రియుడూ కాదు.హనుమంతుడు లంకనుండి తిరిగొచ్చిన తర్వాత, "క్ష్మా విభుదేశు డు"-భూదేవికి, దేవతలకు ఈశుడు-రాముడు, ఆయన్ను రాక్షస బలా-బలాలను గురించి అడిగాడట. జవాబు విన్న రాముడు: "అగ్నిహోత్రాలు-వేదాలూ వున్న వారిని జయించడమెట్లాగా" అని అడుగుతాడు. "దయ, సత్యం, శౌచం"వారికి లేవని చెప్పాడు బదులుగా అంజనేయుడు. "సాధుసాంగత్యం" కూడా లేదన్నాడు. ఇది లేకపోతే, మిగిలనివన్నీ వృథానే! దుర్జన సాంగత్యం కూడా మానాలి. అప్పుడు ఇదివిన్న రాముడికి ధైర్యం కలిగిందట)

"నీ కర్తవ్యం ఏంటో చెప్తావిను. అడవిలో ఒంటరిగా చిక్కి ఏడుస్తున్న, ఆడ ఏనుగు దగ్గర మగ ఏనుగును విడిచినట్లే, నా భర్తను ఎడబాసి వగస్తున్న నాదగ్గరకు, నామగడిని తెచ్చి విడువు. (తనను తీసుకొనిపోయి రాముడిదగ్గర దింపమని అడగలేదు). అలాచేస్తే నిన్ను "నయమతి" అంటారు, దుర్నీతిపరుడన్న చెడ్డపేరు కూడా పోతుంది. ఇదివరకులా ముందు, ముందు కూడా సుఖంగా రాజ్యం చేయదల్చు కుంటే, క్షణమైనా ఆలస్యం చేయకుండా, శరణాగత వత్సలుడైన శ్రీరాముడికి నన్ను అర్పించు. జీవించి ఈ లోకంలో సుఖపడాలన్నా, మరణించి యమకింకరుల చేతిలో నరక బాధలు అనుభవించ వద్దనుకున్నా, నేను చెప్పినట్లు చేయి. చేయకపోతే రాముడు నిన్ను చంపడం ఖాయం. ఇహ-పర సుఖాలు కావాలనుకుంటే రాముడికి అనుకూలంగా వుండాల్సిందే. నీకు మంచిమాటలు చెప్పేవారెవరూ లంకలో లేరు. నీ మేలు కోరి, నీ పైన జాలి కలిగి, నీవు చెడిపోవడం ఇష్టంలేక నేనే చెప్తున్నాను, విను. రాముడికి

అనుకూలుడనై ప్రవర్తిస్తానని మనసులో అనుకున్నా చాలు...వెంటనే నిన్నాయన రక్షిస్తాడు. నీవెంత ఘోరపాపం చేసినా క్షమిస్తాడు. ఆయనకు శత్రువులందూ వాత్సల్యమే.... పురుషోత్తముడు. నీతో ఆయన్ను పోల్చుకోకు. ధర్మమే, ధర్మగుణమే భూషణం కలవాడాయన. ధర్మాత్ముడు. నీ ముఖం చూడగానే నువ్వు క్రూరుడవని ఎట్లా గురుపట్టవచ్చో, ఆయన్ను చూస్తే ధర్మాత్ముడని గుర్తించవచ్చు".

"నిష్ప్రయోజనమైన నీ చెడు బుద్ధి వదులుకో. రాముడు దయా స్వరూపుడు. మానమే ఆయన ధనం. ఆలస్యం చేయకుండా నన్నాయనకు సమర్పించుకో. నీవూ సేవించు. నీకు మేలు కలుగుతుంది. యముడి ప్రేరణతో నీవు నామాట వినకపోతే, యుద్ధంలో నీచావు ఆయన చేతుల్లో తప్పదు. బ్రహ్మ, శివుడి వరాలు పొందిన నీమీద ఇంద్రుడి వజ్రాయుధం పనిచేయకపోవచ్చు. యమధర్మరాజు కళ్లు కప్పొచ్చు. ఉదాసీనత మాని నా మాటలను జాగ్రత్తగా విను. రామచంద్రమూర్తికే కోపం వస్తే, నిన్ను, బ్రహ్మ, రుద్రాదుల వరాలు కాపాడ లేవు. ఆయన బాణాలు నిన్ను, నీవంటి వారినందరినీ, క్షణకాలంలో ముక్కలు-ముక్కలు చేసి చీలుస్తాయి. ఆయనకు కోపం రానంతవరకూ, బాణం తీయనంత వరకే నీబ్రతుకు".

"నా మాట వినకపోతే, ఇంద్రుడు విడిచిన పిడుగుల్లా, భయంకర ధ్వనితో రామబాణాలు నిన్ను తాకుతాయి. అవి వినకముందే తెలివి తెచ్చుకో. ఓ సారి ఆ శబ్దం విని శరణు కోరవచ్చులే అనుకోవద్దు. ఆ శబ్దం నీ చెవిన పడకముందే, బాణం నీ రొమ్ములోకి పోతుంది. నేల కూల్తావు. ఆయన బాణాలెట్లా వస్తాయో తెలియదుకనుక నిన్ను నీవు గొప్పవాడివిగా చెప్పుకుంటున్నావు. మారీచుడికీ, శూర్పణఖకూ తెలుసు వాటి సంగతి. వాళ్లు చెప్పే వుంటారు. నీ శర ప్రయోగాలు నీటిబిందువుల లాంటివి. రాముడివి పిడుగుల్లాంటివి. ఈ తారతమ్యాన్ని అనుభవపూర్వకంగా ముమ్ముందు తెలుసుకుంటావు. పిడుగులు, ఒకటో రెండో పడి ఆగిపోయినట్లు, రాముడు వూరి బయటనుండి ఒకటో రెండో బాణాలను విడిచి పోతాడనుకోకు. వేగంలో, శక్తిలో పిడుగుల్లాంటివే కాని సంఖ్యలో కాదు. క్రూరసర్పాలు విశాగ్నిని కక్కుతూ,

కోరలూడిస్తూ, గుంపులుగా దూరినట్లే, రామలక్ష్మణుల పేర్లు చెక్కబడిన భయంకర బాణాలు లంకలో చొచ్చి రాక్షసుల పైన పడితే, చచ్చినవారితో, భయపడి పరిగెత్తే వారితో, లంకంతా అల్లకల్లోలమై పోతుందన్న సంగతి ఆలోచించుకో".

"రామలక్ష్మణులు విడిచే గ్రద్ద ఈకల బాణాలు, ఈ పట్టణమంతా వ్యాపించి, పీనుగులపెంటలు పెరిగిపోతే, రాక్షసుల ఇళ్లల్లోని స్త్రీల ఏడ్పులు ఆకాశన్నంటుతాయి. కోట్లాది రాక్షస మూకలు గరుత్మంతుడి నోట చిక్కిన పాముల సమూహాల్లా మారుతారు. రాముడనే గరుత్మంతుడు, బాణాలనే ముక్కుతో,రాక్షసులనే సర్పాలను చీల్చి చెండాడుతాడు. పాములెన్ని వున్నా గరుత్మంతుడి ముందు గెలవలేవు కదా!".

"ఇంద్రవిరోధైన బలిచక్రవర్తినుండి విష్ణుమూర్తి ఇంద్ర స్థానాన్ని వశపర్చుకున్నట్లే, శ్రీరాముడు నీ స్వాధీనంలో వున్న నన్ను తీసుకుని పోతాడు. రాముడు ఒంటరివాడు కదా, ఏం చేస్తాడని అనుకోవద్దు. వామనుడూ ఒంటరివాడే. బలపరాక్రమాలు ముఖ్యం కాని, ఒంటరితనం కాదు. యుద్ధంలో రాముడు నీకు సాటికాదంటివి కదా! అట్టహాసంతో వచ్చిన రాక్షసులందరినీ రాముడు చంపిన తర్వాత, ఆయనను ఎదిరించే ధైర్యం లేక, ఒంటరిగా వున్న నన్ను, వంచనతో రామలక్ష్మణులిద్దరూ లేనిసమయంలో ఎత్తుకొచ్చావు. ఇది దొంగ చేసే పని, శూరుడు చేసేది కాదు. ఇట్లా చేసి కూడా ఇంకా శూరుడవని చెప్పుకోవడానికి సిగ్గులేదా? పులులవాసన తగిలి కుక్కలు పరిగెత్తినట్లుగానే, నువ్వూ యుద్ధభూమిలో నిలువలేక పారిపోతావు."

"నీ శక్తి, రామలక్ష్మణుల శక్తి బేరీజు వేసుకోకుండా, విరోధం కొని తెచ్చుకున్నావు. నీవు బలహీనుడవు. యుద్ధంలో వాళ్లను ఎదిరించలేవు. ఎదిరిస్తే వాళ్లబాణాల తాకిడికి చస్తావు. నా భర్త త్వరలోనే తన తమ్ముడితో ఇక్కడకు రావడం తథ్యం. నీమీద కోప్పడటమూ తథ్యమే. ఎండాకాలంలోని సూర్యుడు చిన్న గుంటలోని నీళ్లను కిరణాలతో పీల్చివేసినట్లే, నిన్ను ఊర్ధ్వలోకమైన కైలాసంలో దాక్కున్నా, అధోలోకమైన వరుణుడి నగరంలో దాక్కున్నా, పిడుగు చెట్టును పడగొట్టిన రీతిలో పడేయడం కూడా తథ్యం."

❖ ❖ ❖

సర్గ-22

సీతాదేవిని బెదిరించిన రావణుడు

సీతాదేవి కఠినంగా మాట్లాడుతుంటే, కోపించిన రావణుడు, అనరాని పరుషమైన మాటలతో, ఆమె పైన విరుచుకు పడ్డాడు. "పురుషుడు స్త్రీలను ఎంత బ్రతిమాలుతాడో, అంతగా వారికి వశమౌతాడు. ఎంత చక్కగా మాట్లాడితే అంతగా వారితో అవమానించ బడతారు. వీడు మనకు లోబడ్డాడని అవమానిస్తారు. అట్లానే నేను మంచి మాటలంటున్న కొద్దీ, నీ నోటికొచ్చినట్లు వాగుతున్నావు. అయినా త్రోవ తప్పుతున్న గుఱ్రాలను సారధి బిగించి పట్టుకున్నట్లు, నీమాటల వల్ల కలిగిన కోపాన్ని, నాలోని మంచి బిగించి పట్టున్నది". అంటాడు రావణుడు.

తన కోరికకు విఘ్నం కలిగించిన వారు చంపబడాల్సినప్పటికీ, కామాతిశయంతో, దయతో, స్నేహ భావంతో, "దొంగ తపస్విని లాంటి సీతను" అవమానించాల్సిన పరిస్థితి వున్నప్పటికీ, అలాచేయకుండా సహించి వూరుకున్నానంటాడు రావణుడు. సీత అన్న పరుషపు మాటలకు అప్పుడే చంపాల్సి వున్నప్పటికీ, తనలా చేయనంటూనే, ఒళ్లు తెలియకుండా బెదిరించసాగాడు ఈవిధంగా:

"జానకీ! ఇదివరకు పన్నెండు నెలల గడువిచ్చాను నీకు. ఇంకా రెండు నెలలు మిగిలాయందులో. అంతవరకు నీ మీద నమ్మకంతో వేచిచూస్తాను. ఈలోపల నువ్వు నాభార్యగా, నాపడకెక్కకపోతే, గడువు తీరిన మర్నాడే, నా వంట వాళ్లు నిన్ను, నా ఉదయం భోజనంలో నంచుకోవటానికి వండుతారు". ఇలా భయపెడుతుంటే అక్కడున్న దేవగంధర్వ స్త్రీలు, భయంతో, దుఃఖంతో, వికారమైన కళ్లతో తపించిపోయారు. కొందరు దేవతాస్త్రీలు, కంటిసైగలతో, పెదవి విరుపులతో, మూతులు తిప్పుతూ, ఆమెకు ధైర్యం కలిగేటట్లు సూచిస్తూ, రావణుడికి లోబడవద్దని సలహా ఇచ్చారు. (దీన్ని బట్టి అక్కడున్నవారిలో కొందరు వాడికి భయపడి లోబడ్డా వాడిమీద ప్రేమలేదని అర్థమౌతున్నది)

తనను బెదిరించిన రావణుడికి పరుషంగా జవాబిచ్చిన సీత

దేవతా స్త్రీలు చేసిన సైగల్తో ధైర్యం పెరిగింది సీతలో. రావణుడికి దేహబలముంటే తనకు పాతివ్రత్య బలముందికదా.....వీడు తననేమి చేయగలడన్న ధైర్యం కలిగి వాడితో ఈవిధంగా అంటుంది:"రావణా నీమంచి కోరే వారెవ్వరూ ఈ వూళ్లో లేరు. నువ్వు తప్పు చేస్తుంటే, చెయ్యొద్దు అని ఒక్కరూ ఎందుకు చెప్పడంలేదు? నీ తప్పులను సరిదిద్దకుండా ఉపేక్షించడం కూడా తప్పే. ఈ పాపం నీ ఒక్కడితో పోదు. నీ పాప ఫలం ఉపేక్షిస్తున్న వారూ అనుభవించవలసిందే. ఇంద్రుడికి శచీదేవిలా, నేను శ్రీరామచంద్రమూర్తి భార్యను. ఇలాంటి నన్ను, మూఢుడవైన నీవు తప్ప, ఈప్రపంచంలో, మరెవ్వరూ కోరరు. నువ్వెన్నో చెడ్డమాటలంటున్నావు. ఆపాప ఫలం నిన్ను వదలదు. నువ్వెక్కడికిపోయినా నిన్ను వెన్నంటి మింగుతుంది".

"మదపుటేనుగుతో, పనికిరాని, అల్పమైన చెవుల పిల్లి, యుద్ధం చేసే ప్రయత్నమెలావుంటుందో, నా భర్తతో నువ్వు పోరాడితే అంతేనని తెలుసుకో. వంచనతో నన్ను రామచంద్రమూర్తికి దూరం చేసావు. దొంగిలించి తెచ్చావు. ఆపని చేసినందుకు సిగ్గెందుకు పడవు? నీదీ ఒక పౌరుషమేనా? నువ్వు నన్ను దొంగిలించి తెస్తున్నప్పుడు, ఏ మాత్రం నా మగడి దృష్టిలో పడ్డా, ఆయన బాణంలోని చురుకుదనం, బలం తెలుసుకుని వుండేవాడివి".

"కామంతో నన్నే చూస్తున్న నీ వికారపు నలుపు, పసుపు రంగు కనుగుడ్లు ఎందుకు నేలపైన పడిపోవు? దశరథుడి కోడలినై, నిర్మల కీర్తిగల రాముడి ధర్మపత్నినైన నన్ను, పనికిమాలిన మాటలన్న నీ నాలుక ఎందుకు రెండు భాగాలుగా చీలిపోదో? నిన్ను చంపడానికి శ్రీరాముడంతటి వాడు రావాల్నా? నేనే నిన్ను భస్మం చేయలేనా? ఆ శక్తి వున్నా ఎందుకు చేయడం లేదంటే, నేను కేవలం పరతంత్రురాలినైనందునే! నా రక్షణ భారం నా భర్తపైన వేసాను. నేను స్వతంత్రించి నిన్ను చంపితే, నా పారతంత్ర్య వ్రతానికి హాని కలుగుతుంది. నా ప్రాణాలు పోయినా, స్వరూప-స్వభావాన్ని విడువను. అలాచేస్తే, నాకు స్వరూపహాని కలుగుతుంది. ఆపదలో నన్ను నేనే రక్షించుకోవాలనీ, దుష్టులను శపించాలనీ, నా మగడు నాకు అనుమతి ఇవ్వలేదు. నేనాయన సొమ్మును.

ఆయన నా దైవం, స్వామి. స్వామి కాబట్టి, తన సొమ్ము తానే కాపాడుకోవాలి. సొమ్మంటే అనుభవించేదాయనే. పోగొట్టుకుంటే నష్టపోయేదీ ఆయనే. నా ఉనికి ఆయన నిమిత్తమే కాని, నా కొరకు కానేకాదు. కాబట్టి ఆయన ఆజ్ఞలేని ఏ పనైనా నేనెందుకు చేస్తాను? అందువల్ల నిన్ను భస్మం చేయడానికి కారణమున్నప్పటికీ, నేను చేయగలిగి వున్నప్పటికీ, చేయకుండా వూరుకుంటున్నాను. "హతోభవ" అంటే చచ్చిపడి పోతావు. కాబట్టి నీవు నన్నేమి చేయగలవురా? నిన్ను చంపేందుకు దైవమే నిన్నిట్లాడిస్తున్నాడు. నీ అంతట నీవే నీ చావుకు సిద్ధపడుతుంటే, నేనెందుకాపని చేయాలి? బెల్లం తినిచస్తానంటే, విషం ఎందుకివ్వాలి?"

"రామచంద్రమూర్తి అంతటి శూరుడవు కావు. అయినప్పటికీ, శూరుడవన్న పేరు తెచ్చుకున్నావు. బలవంతుడివి. కుబేరుడి తమ్ముడివి. కుల, బలాల వల్ల ఇంతటిగొప్పవాడవైన నువ్వు, మోసం చేసి, పరస్త్రీని దొంగిలించి తేవడం సరైన పనికాదుకదా?" అని చెప్తుంది రావణుడికి. (చెరలో వున్న దేవతా స్త్రీలలో, విభీషణుడి భార్యో, కూతురో, "రావణాసురుడు శాపభయం వల్ల నిన్ను తాకడు, భయపడ వద్దని" రహస్యంగా చెప్పి వుంటారు సీతతో. రావణుడు చంపదల్చుకుంటే ఈ శాపం అడ్డం కాదు. చంపుతే చంపుతాడు.... ఏమవుతుంది? తన పాతివ్రత్యానికి హాని కలగదుకదా అన్న ధైర్యం సీతకుంది).

నయాన-భయాన, సీతాదేవి చెప్పిన మాటలు రుచించని రావణుడు, క్రూరమైన తనకళ్లను పెద్దవిగాచేసి, గుడ్లు తిప్పుతూ, కోపంతో మండిపడ్తూ చూసాడు. ఆమెపై తన కోపాన్ని వెళ్లగక్కుతూన్న రావణుడి ఆకారం.... నీలమేఘంతో సమానంగా, ఎత్తైన భుజాలు, మెడా కలిగున్నాడు. పెద్ద సింహం లాంటి వేగం, బలం కనిపించాయి ఆయనలో. మండుతున్న నాలుక కొన కళ్లున్నాయి. పూదండలు ధరించి, గంధం పూసుకుని, కదుల్తున్న కిరీటపు కొనలతో, బంగారు బాహుపురులు ధరించి, మందర పర్వతానికి చుట్టివున్న పాములాంటి నల్లని మొలత్రాడు ధరించి, పర్వత సమానుడై, బలసిన రెండు భుజాలతో, శిఖరంతో కూడిన మందరంలా, ముల్లోకాల్లోని జనాలను భయపెడ్తూ, పరుగెత్తేటట్లు చేస్తూ, ఎర్రని పూలు, చిగుళ్లున్న అశోక వృక్షాల

కొండలా, బాలసూర్యుని వన్నెగల పోగులతో ఒప్పుతూ, మునులను కష్టపెట్టే ఆకారంతో, చందన చర్చితమైన శరీరంతో, వసంతుడంత సౌందర్యంతో, అందమైన సొమ్ములుండే శ్మశానంలోని మండపంలా భయం కలిగిస్తూ, రాజుకుంటున్న కోపాగ్నివల్ల కళ్లెర్ర చేసి, తీవ్ర రోషంతో బుసకొడ్తూ, కంపించిన దేహంతో కనిపించాడు రావణుడు. వాడు సీతనిలా నిందించసాగాడు:

"ఓ గుణహీనురాలా! ధనవంతుడిని, బలవంతుడిని, శౌర్యవంతుడిని, రూపవంతుడిని, లోకాలెల్ల హా! హా! అనిపించేవాడిని అయిన నన్ను అంగీకరించకుండా, నీతి లేనివాడిని, ధనం లేనివాడిని ఎందుకు కోరుకుంటావు? నా కంటే గొప్పవాడంటావా? సూర్యుడు సంధ్యను హరించినట్లు, నిన్ను పట్టి నాశనం చేస్తాను చూడు. నీ ఆగడాలు నా ఎదుటనా? నేను రావణుడనని తెలియదా?" అంటూ అక్కడున్న నానారకాల రాక్షస స్త్రీలను ఆమెపైకి పురుగొల్పుతాడు. అణకువ మాటలతో కాని, సామదాన వాక్కులతో కాని, భయపెట్టి కాని, అనుకూల, ప్రతికూల వాక్యాలతోకాని, తామర రేకులలాంటి కళ్లున్న సీతాదేవిని తనవశమయ్యేటట్లు చేయమంటాడు. ఇట్లా బెదిరిస్తూ, రాక్షస స్త్రీలను ఆజ్ఞాపిస్తూ, సీతను మళ్లీ, మళ్లీ చూస్తూ, అరుస్తున్న రావణుడిని అడ్డగిస్తుందో స్త్రీ.

రావణుడికి అడ్డమొచ్చిన దాన్యమాలిని

ధాన్యమాలిని అనే రాక్షస స్త్రీ రావణుడి చిన్న భార్య. సీతను బెదిరిస్తున్న రావణుడిని అడ్డగించింది. కౌగలించుకుని: "రాజా! తుచ్ఛ మనుష్య స్త్రీ, మహానిర్భాగ్యురాలు సీత నీకెందుకు? నాతో రమించి సుఖపడు. రావణుడు దిక్కులన్నీ గెలిచి తెచ్చిన ధనాన్ని అనుభవించే గీత బ్రహ్మదేవుడు సీత ముఖంపైన రాయలేదు. కామం లేని స్త్రీని కామించి, భోగిస్తే అలాచేసిన వాడి ఆరోగ్యం చెడుతుంది. కామం వున్న నన్ను నీ మగతనం కొద్దీ రమించు" అని రావణుడిని అర్థిస్తుంది. ఇలా అంటున్న ఆమె మాటలకు నవ్వుకుంటాడు రావణుడు. దేవ గంధర్వ స్త్రీలు, రాక్షస స్త్రీలు, తన చుట్టూ సేవిస్తుండగా, సీతను అనుచితమైన రీతిలో బెదిరించి, మదనోద్రేకానికి గురై, తడపడ్తూ, బంగారంతో ప్రకాశిస్తున్న తన ఇంట్లోకి వెళ్లిపోతాడు రావణుడు.

❖ ❖ ❖

సర్గ-23

సీతాదేవికి బోధించిన రాక్షస స్త్రీలు

రావణుడి ఆజ్ఞానుసారం, కోపంతో, ఎర్రటి కళ్లతో వున్న రాక్షస స్త్రీలు, సీత దగ్గరకు చేరి, అనేక రకాలైన కఠినమైన మాటలన్నారు. తెలివి లేనిదాని వన్నారు. రావణుడిని భర్తగా ఎందుకొప్పుకోవని అడుగుతారు. రావణుడంటే ఎవరనుకుంటున్నావని నిలదీస్తారు. కులానికి తక్కువా అంటే, బ్రహ్మకుమారుడైన పులస్త్య మహాముని వంశంలో పుట్టినవాడని చెప్తారు. లోకంలో అందరికీ ఒకే తల వుంటే, వీడికి పది తలలున్నాయనీ, మూడులోకాల్లో వీడిని మించిన వాడు లేడనీ, గర్వించిన శత్రువులందరినీ జయించాడనీ, ఇట్టివాడు కాకపోతే మగడు ఎట్లాంటివాడై వుండాలని ప్రశ్నిస్తారు.

"ఏకజట" అనే రాక్షసి నచ్చచెప్తూ: "సీతా! రావణుడిని నీవు అల్పుడను కుంటున్నావు. వాడి పుట్టు-పూర్వోత్తరాలు నీకు తెలియదు. బ్రహ్మ మానసపుత్రుడు. నాల్గవ ప్రజాపతైన పులస్త్యుడి సంకల్పంతో కలిగిన విశ్రవసుడి కొడుకు రావణుడు. బలంలో శత్రువులను ఏడిపిస్తాడు. ఇంత గొప్పవాడు తనంతట తనే వచ్చి నిన్ను ప్రార్థిస్తుంటే ఎందుకు బిగుసుకుంటావు? వాడు మక్కువ చూపిస్తున్న కొద్దీ నీకు నిక్కువెక్కుతున్నదెందుకు?". పిల్లికళ్లు తెరిచి, గుడ్లు గిరగిరా తిప్పుతూ "హరిజట" అనే రాక్షసి: "ముప్పై మూడు కోట్ల దేవతలను జయించాడు రావణుడు. ఇంద్రుడుని చెరపట్టాడు. అలాంటి జగజ్జెట్టే నీకు తగిన మొగుడు.... వరించు" అంటుంది. కోపంతో ఒళ్లు మరిచి కఠినంగా మాట్లాడుతూ "ప్రఘస" అనే మరో రాక్షసి: "తన ప్రియురాలిని, సుందరిని, పుణ్యాత్మురాలిని విడిచి నిన్ను కోరుతున్న శూరుడికి, పరాక్రమవంతుడికి, బలవంతుడికి భార్య కావాలని నీ అంతట నీవే పోయి అడగాలి కాని, నిన్నింత బలవంతం చేయాల్నా? అందరు ఆడవాళ్లు అక్కడుండగా, వారందరు చూస్తుండగా వాడితో ఎలా రమించాలనుకుంటావేమో! పరవాలేదులే! అంతఃపురాన్ని వదిలేసి రావణుడే ఇక్కడకు వస్తాడు ఒంటరిగా. పిలుచుకుని రమ్మంటావా?" అని అడుగుతుంది.

"వికట" అనే రాక్షసి చనువుగా, దగ్గరకొచ్చి, కూర్చుని: "సీతమ్మా! రావణుడు యుద్ధంలో అవలీలగా నాగులను, గంధర్వులను, యక్షులను, పన్నగులను, దానవులను ఎన్నోసార్లు గెలిచాడు. అంతటి మహాత్ముడికి నీమీద మనస్సు కలిగింది. ఎందుకు ఇల్లాలివై సంతోషించవు?" అని ప్రశ్నించి, నిర్భాగ్యురాలివని నిందిస్తుంది. "దుర్ముఖి" అనే మరో రాక్షసి, రావణుడి పేరు చెప్తే సూర్యుడు లంకపై ఎండ కాయడు, గాలి వీయడానికి భయపడ్తాడు, చెట్లు భయపడి వాడొచ్చినప్పుడు పూలవాన కురిపిస్తాయి, కోరినప్పుడు మేఘాలు వర్షిస్తాయి, అంటుంది. అలాంటి మహిమగలవాడిని, రారాజును, దేవతల విరోధిని, రావణుడిని భర్తగా చేసుకుని సుఖపడమని హితబోధ చేస్తుంది.

❖ ❖ ❖

సర్గ-24

సీతాదేవిని బెదిరించిన రాక్షస స్త్రీలు

నయవాక్యాలతో సీతను ఒప్పించ లేకపోయిన రాక్షస స్త్రీలు, ఒక గుంపుగా చేరి, క్రూరంగా గర్జిస్తూ, బెదిరింపు మాటలనసాగారు. “సీతా! మనస్సు హరించే అంతఃపురంలో పరుపుల మీద పడుకోవడానికి ఎందుకు ఒప్పుకోవు? ఏల పడుకోనంటున్నావు? మనిషివైనందున, మనిషి భార్య కావడమే గొప్పనుకుంటున్నావు. ఇంకెక్కడి రాముడు? నీవేమో ఇక్కడ, ఆయనెక్కడో? ఆయన మీద మనసుంచి ఏడవడమెందుకు? రాముడిని చూడడం అసత్యం. రాక్షసరాజు రావణుడే నీకు తగిన భర్త. స్వీకరించు. నీవు మనిషివైనందున, పనికిమాలిన మనిషిని, రాజ్యం లేనివాడిని, ఏడుస్తున్న దరిద్రుడిని, బలహీనుడిని, భర్తగా తలుస్తున్నావు. ఈ రావణుడు మనుషులను తినేవాడు. జనుల దృష్టిలో గొప్పవనుకున్న పదార్థాలన్నింటినీ అనుభవిస్తున్న వాడు. రాక్షసరాజు. ఇటువంటివాడిని మగడిగా చేసుకుని యథేచ్ఛగా సుఖించకూడదా?” అంటూ తననీవిధంగా పరుష వాక్యాలతో బాధిస్తున్న రాక్షస స్త్రీలతో, కారుతున్న కన్నీళ్లను, కొనగోటితో తుడుచుకుంటూ, మెల్లగా తన మనసులోని మాటలను చెప్పసాగింది సీత.

“ఓరాక్షస స్త్రీలారా! నామాట మీ చెవికెక్కడం లేదా? మీరు చెప్తున్న మాటలు లోకం మెచ్చేవి కావు. మీకు ఘోర పాపాన్ని కలిగిస్తాయి. మనుష్య స్త్రీ, రాక్షసుడి భార్య కావడం ఎక్కడైనా జరిగిందా? కావాలంటే నన్ను చంపి తినండి. చెడుమాటలు మానేయండి. దరిద్రుడు, రాజ్యహీనుడు, మరెట్టివాడైనా, సువర్చలకు సూర్యుడిలా, నా మగడే నాకు గొప్ప” అంటుంది సీత రాక్షస స్త్రీలను వుద్దేశించి. (కల్పాదిలో బ్రహ్మకు కొడుకు పుట్టి, తనపేరేంటో చెప్పమని ఏడుస్తాడు. “రుద్రుడు” అని నామకరణం చేస్తాడు బ్రహ్మ. మళ్లా ఏడుసార్లు ఏడుస్తాడు రుద్రుడు. అప్పుడు: “భవ–శర్వ–ఈశాన–పశుపతి–భీమ–ఉగ్ర–మహదేవ” అని ఏడు పేర్లు పెడతాడు. ఆ ఎనిమిదిమందికి “సూర్య – జల–మహి – వాయు– వహ్ని – ఆకాశ–దీక్షిత బ్రాహ్మణ – సోమ” దేహాలను

ఇచ్చి, "సువర్చల-ఉష-సుకేశి-శివ-స్వాహా-దిశ-దీక్ష-రోహిణి" అనే ఎనిమిది మందిని భార్యలుగా ఇచ్చాడు. ఇక్కడ చెప్పబడిన సువర్చలే ఆమె. సూర్యుడు తన వేడితో ఎంతో తపించేట్లు చేస్తున్నా సువర్చల అతన్ని విడిచిపోలేదు).

సీతాదేవి అన్న మాటలకు ప్రత్యుత్తరంగా, రావణుడిచే ఆజ్ఞాపించబడిన రాక్షస స్త్రీలు, కఠినవాక్కులనే బాణాలతో ఆమెను నొప్పించసాగారు. ఎటూ కదలకుండా, పెదవి విప్పకుండా, శింశుపావృక్షం మీదనుండి రాక్షస స్త్రీలు జానకిని బెదిరిస్తూ అన్న మాటలన్నీ విన్నాడు హనుమంతుడు. రావణుడు రాకముందే తాను చూసిన స్త్రీని సీతాదేవిగా నిర్ణయించుకున్న హనుమంతుడు, సీతా-రావణుల సంభాషణవల్ల, తన నిర్ణయాన్ని స్థిరపర్చుకున్నాడు. అన్ని దుర్భాషలాడిన వారిమీద, హనుమంతుడు లంఘించి బుద్ధి చెప్పొచ్చును కాని, అలాచేయడం దూతలక్షణం కాదని వూరుకున్నాడు. దూతకృత్యం సీతాదేవిని చూడడం, మాట్లాడి రామ ముద్రికను ఇవ్వడమే. ఇది ముఖ్యం. దీన్ని పాడు చేయకూడదు. పైగా యుద్ధంచేసే సమయం కాదిది. ఆ స్థలంలో యుద్ధం జరిగితే సీతాదేవి బెదరవచ్చు. వచ్చిన పని అయిపోతే యుద్ధమెప్పుడైనా చేయవచ్చునని ఓర్పు వహిస్తాడు హనుమంతుడు.

సీతాదేవితో కటువుగా మాట్లాడిన రాక్షస స్త్రీలు

సీతాదేవి మాటలకు మిక్కిలి కోపంతో, రాక్షస స్త్రీలందరూ, భయంతో వణకుతూ, ఆమె చుట్టూచేరి, గొడ్డళ్లు తిప్పుతూ, తొర్రి కూతలు కూస్తూ, మీద, మీద పడ్తూ: "నువ్వెవతివే? మమ్మల్నీ, రావణుడునీ ఎదిరించి మాట్లాడటానికి? నీకు రావణుడెందుకు పనికిరాడే? వాడు మగవాడు కాదానే?" అని బెదిరిస్తారు. ఆమాటలకు, శోకంతో కన్నీళ్లు కారుతుంటే, భయంతో లేచి శింశుపావృక్షం చాటుకు పోతుంది సీతాదేవి.

ఆమె వెంటనే వచ్చిన "వినత" అనే వికటరాక్షసి చిర్రు, బుర్రులాడుతూ:" నీ మగడిపై ప్రేమచూపిస్తున్నావు, మంచిదే. మెచ్చుకుంటున్నాను. ఏదైనా మితిమీరకూడదు. మగడిపై కూడా ఎంతవరకు ప్రేముండాలో అంతే వుండాలి కాని అతిగా వుండకూడదు. మితిమీరిందేదైనా కీడు చేస్తుంది. మనుష్య స్త్రీల

పాతివ్రత్యం గురించి చెప్పావు. బాగుంది. అంతకంటే మేలైంది ఇంకోటి వుంది. ఇంద్రుడితో సమానమైన పరాక్రమవంతుడు, సుందరుడు, రావణుడిని నీవు భర్తగా స్వీకరించు. కనీసం ఒక్క పూటైనా అలా చేసి చూడు. ఇష్టం లేకపోతే వదిలెయ్యి. రావణుడు మహాదాత, భోగమందు ఆసక్తి వున్నవాడు, నేర్పరి. ఎంతమంది భార్యలనైనా సంతోషపెట్టగల ప్రియమైన ఆకారమున్నవాడు. దరిద్ర రాముడిని కట్టుకుని ఏడ్చే దానికంటే రావణుడుని చేసుకో" అంటుంది.

తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూ, బుజ్జగిస్తూ అంటుంది సీతతో: "సువాసన గల గంధాన్ని పులుముకొని, బంగారు రత్నాలతో ప్రకాశిస్తున్న సొమ్ములు ధరించి, ఈ క్షణం నుండే లోకాలను ఏలు. శచీదేవి ఇంద్రుడికెట్లానో, స్వాహా దేవి అగ్నికెలానో, నువ్వు రావణాసురుడికి అలానే ప్రియురాలివికా. ఎందుకు రాముడనే లోభిని, అల్పాయుష్కుడిని, తింటానికి తిండి, కట్టుకోవడానికి బట్టలేని వాడిని, పట్టుకొని ఏడుస్తావు? నామాట వినకుండా ధిక్కరిస్తే, నిన్ను ముక్కలు-ముక్కలుగా నరికి ఫలహారంగా తింటాం".

వినత మాటలు లక్ష్యపెట్టని సీతతో "అసుర" అనే మరో రాక్షస స్త్రీ వికటంగా నవ్వుతూ, గుద్దుతానని బెదిరిస్తూ, పరుష వాక్యాలతో అంటుంది: "ఓసీ దుర్బుద్ధీ! మా రాక్షస రాజును నువ్వెన్నో మాటలన్నావు. అయినా, నీపై దయతో, సుకుమారివైన నీపై కోప్పడక నిన్ను చంపలేదు. రాముడొస్తాడు, నిన్ను తీసుకోపోతాడంటున్నావే? అదెలా సాధ్యం? ఆ ఒడ్డున వున్నవారికి సముద్ర తీరంలో వున్న ఈ లంక కనపడనే కనపడదు. ఒకవేళ సముద్రాన్ని దాటివచ్చినా, రావణుడి అంతఃపురంలో వున్న నిన్ను కల్సుకోలేడు. కల్సుకొనే ప్రయత్నం చేస్తే, ఇంతమంది కాపలా కాస్తున్న వారిని కాదని నిన్నెట్లు తీసుకోపోగలడు? పంజరంలో చిలకలా మాకు చిక్కావు. ఆ ఇంద్రుడుకూడా నిన్ను కాపాడేందుకు ఇక్కడకు రాలేడు. నేను వ్యర్థంగా మాట్లాడను. నీకు హితమే కాని, అహితం చెప్పను. నా మాటలు చెవికెక్కించుకో. కన్నీళ్లు కార్చవద్దు. శోకం కీడుచేస్తుంది. నీకీ యవ్వనం శాశ్వతం కాదు. అదిపోక ముందే విస్తార సౌఖ్యాలను అనుభవించు. అమరారినేతతో క్రీడించడం నీకేమైనా చేదా? రావణుడిని భర్తగా స్వీకరిస్తానని ఒక్క మాటను.... ఏడువేల స్త్రీ లొచ్చి

నీ భజన చేస్తారు. మా మాటలు వినకపోతే, నీ రొమ్ములు చీల్చి, రుచిగల నీ రక్తాన్ని తాగుతా."

ఆ తర్వాత "చండోదరి" అనే మరో రాక్షసి భయంకరంగా త్రిశూలం తిప్పుతూ, జింక కన్నుల లాంటి కళ్లున్న నిన్ను చూస్తుంటే ఎప్పుడు కొరుక్కుని తనివితీరా తిందామా అనిపిస్తున్నది అంటుంది సీతతో. "ప్రఘస" అనే ఇంకొకతి: ఈ చర్చ ఎందుకు? సీత గొంతు నులిమేద్దాం చస్తుంది. అదే చచ్చిందని రావణుడితో చెప్పుదాం. తినండిపోయి అంటాడాయన. దీనికెందుకింత ఉపేక్ష?" అంటుంది. అంతా మాటలు చెప్పేవారే కాని చేసేవారెవరూ లేరని సాధిస్తూ "అజాముఖి" అనే రాక్షసి,"సారాయిలో వేసుకుని సీత మాంసం తిందాం. తొందరగా వెళ్లి ఊరగాయలు తెండి" అని ఇతరులను పురమాయిస్తుంది. అజాముఖి సత్యం చెప్పిందనీ, కల్లు తెచ్చుకుని, మాంసం కల్లులో నంజుకుంటూ "నికుంబిల" దేవాలయంలో గంతులు పెడ్తూ తిందామని "శూర్పణక" అనే రాక్షసి అంటుంది.

ఈ విధంగా రాక్షస స్త్రీలు బెదిరిస్తూ మాట్లాడుతుంటే, సీతాదేవి "రామా" అంటూ గొంతెండగా ఏడ్చింది. **(లంకలో వున్న సీతాదేవి రాక్షస స్త్రీలతో పడ్డ బాధల్లాంటివే, దేహంలోని "బద్ధజీవుడు" సంసారమనే ఇంద్రియాలతో పడే బాధలు. రావణుడు కానీ, రాక్షస స్త్రీలు కానీ, సీతను బెదిరించారే కాని, చంపలేక పోయారు. అదే విధంగా, "జీవాత్మ" ను ఏవీ చంపలేవు. బాధించ గలుగుతాయి. సీతాదేవి లాగా బద్ధ జీవులు "ప్రారబ్ధ" మని, దృఢ చిత్తంతో, భగవంతుడే రక్షిస్తాడని అమిత విశ్వాసంతో వుండాలి. సీతాదేవి ఇన్ద్రియాలకు లోబడ లేదని, భగవంతుడి మీదే విశ్వాసం వుంచిందని దృఢ పడ్తున్నది. తర్వాత జీవుడు చేయాల్సిన భగవధ్యానమ్, సీతా విలాప రూపంలో మున్ముందు విశదమౌతుంది).**

❖ ❖ ❖

సర్గ-25

రాక్షస స్త్రీల మాటలకు భయపడి ఏడ్చిన సీతాదేవి

నీచ రాక్షసులకు, మనుష్య స్త్రీలకు పొత్తంటే, అది భూలోకం లోనే విపరీతంగా భావించాలనీ, ఆలోచన లేక రాక్షస స్త్రీలు చెప్తున్న మాటలను తాను వినే ప్రసక్తే లేదని వాళ్ళేం చేయదల్చుకుంటే అదే చేయొచ్చుననీ, వాళ్లిష్టమొచ్చినట్లు తినదల్చుకుంటే తినవచ్చునీ, ఎక్కెక్కి ఏడుస్తూ జవాబిస్తుంది సీత రాక్షసమూకకు. (రాక్షస స్థానంలో "ప్రకృతి", మనుష్య స్థానంలో "జీవాత్మ" వుందని గ్రహించడమే! మనుష్యులకు, రాక్షసులకు విజాతీయ భేదమున్నట్లే, అచేతనమైన "దేహాని" కీ, చేతనమైన "ఆత్మ" కు తారతమ్యం వుంటుంది).

మంద తప్పి, ఒంటరిదైపోయి, తోడేలు పాలపడ్డ జింకలా, సీత రాక్షస స్త్రీల మధ్య చిక్కుకుని వణకసాగింది. మనస్సులోని విషాదాన్ని దూరం చేయడానికి, పూలబరువుకు వొంగిన ఓ పూల చెట్టుకొమ్మను పట్టుకుని, భర్తను తలచుకుని, శోకంతో, కన్నీళ్లతో స్తనాలను తడుపుతూ, భర్తను లోలోపలే స్మరించుకుంటూ, రాక్షస స్త్రీలు ఎప్పుడు ఏంచేస్తారో అన్న భయంతో, అరటి చెట్టు పెనుగాలికి వణికినట్లు వణకసాగింది. "రామా! లక్ష్మణా! అత్తా కౌసల్యాదేవీ! సుమిత్రా! నాపైన దయలేదా ఒక్కరికైనా!" అంటూ భయపడ్తూ గడగడలాతున్న సీతాదేవి కళ్లు వణకుతున్న కలువలను పోలి వున్నాయి. పొడవాటి ఆమె జడ నిలబడ్డ ఆమె భుజాలమీదకు దొర్లుతూ పెద్దపాములా కనిపించింది.(దీని అర్థం: బంధువులెవ్వరూ, ఎంత ఆప్తులైనా, "ఆత్మ" ను వుద్ధరించలేరనే!)

సీతాదేవి రాముడిని స్మరిస్తూ ధ్యానంలో అనుకుంటుందీవిధంగా: "ఓర్పు నశించిపోయింది. రాక్షసుల బెదిరింపులు బాధిస్తున్నాయి. భర్తను వదిలి వుండాల్సి వచ్చెకద! ఈ మూడు కారణాల వల్ల ప్రాణం ఎప్పుడో పోవాల్సి వుంది. పోలేదంటే, అకాల మృత్యువు, స్త్రీని కాని, పురుషుడిని కాని తాకదన్న పండితుల మాట సత్యం కావచ్చు. కాకపోతే, నా శరీరంలో ఇంకా ప్రాణం వుండటమేంటి? గొప్ప వ్రతం చేయబూని, పూర్తిచేయ లేనందువల్లే, వ్రత ఫలం దక్కకుండా

పోయి, భర్తతో ఎడబాటు కలిగి, నడి సముద్రంలో మునిగిన నావలాగా అయ్యాను. వ్రతం పూర్తి చేస్తే ఆ పుణ్యఫలం వల్ల నా భర్త నన్ను రక్షించేవాడేమో!" (దీన్నిబట్టి, స్త్రీల పాతివ్రత్యం, నోములఫలం, వారి భర్తలు తమను రక్షించేవిగా చేస్తున్నాయనీ, అట్టి ఫలం లేక పోతే, భర్తలున్నా రక్షించలేరనీ అర్థం చేసుకోవాలి. "ఆడదాని అదృష్టం" అన్న నానుడి ఇందుకే ఏర్పడి వుండవచ్చు. ఆడది నిర్భాగ్యురాలైతే, మగవాడు ఎంత పుణ్యాత్ముడు, సమర్థుడు అయినప్పటికీ, ఆ స్త్రీకి సుఖం లేదు. లోకంలో కొందరు దరిద్రులుగానూ, కొందరు ధనవంతులుగానూ, దుఃఖంతో కొందరు, సుఖిస్తూ కొందరు వున్నారు. ఇవి వారి-వారి పాప-పుణ్య ఫలాలు. బాగుపడటానికి, చెడిపోవటానికి, వారి-వారి పూర్వ కర్మలే కారణం.)

సీత ఇంకా ఇట్లా అనుకుంటుంది తన మనస్సులో: "శ్రీరామచంద్రుడి దర్శనం లేకపోవడం అటుంచి, రాక్షస స్త్రీలకు వశపడి బాధపడాల్సి వచ్చింది కదా! నదీ ప్రవాహానికి తెగిపోయిన వారధిలా, మరణించక ఎందుకు ప్రాణం నిల్పుకున్నాను? ప్రాణాలకు విభుడు భగవంతుడే! అట్టి భగవత్ సాక్షాత్కారం పుణ్యాత్ములకు కలుగుతుంది. భగవంతుడు నాలో వున్నా నేనెందుకు చూడలేక పోతున్నాను? నా పాపమే కారణమా? విషం తింటే తిన్నవాడి ప్రాణాలు పోతాయి. అట్లానే సమర సన్నిభుడు, భూపతి అయిన నాభర్తకు ఎడబాటైన ఈ దేహంలో ప్రాణమెందుకుంది? ఇంత మహా దుఃఖాన్ని అనుభవించడానికి పూర్వజన్మలో నేనెంత ఘోర పాపం చేసానో? ఈ విధంగా మూర్ఖపు రాక్షస స్త్రీలు కావలి కాస్తుంటే ఎక్కడో వున్న రాముడు రావడమేంటి? నన్ను రక్షించడమేంటి? కాబట్టి మృత్యు దేవతే నాకు దిక్కు. మనుష్య జన్మ ఎంత పాపమైంది? అందునా పరవశమైన బ్రతుకేం బ్రతుకు? అనుకున్నప్పుడు చచ్చిపోయే శక్తి ఈయకూడదా?"

(సీతా విలాప రూపంలోని పై ఆలోచనల కర్థం.... భగవత్ సాక్షాత్కార మయ్యేంత వరకు సంసార బాధ తొలగదని. ప్రకృతి బంధం మన ప్రయత్నంతో తొలగేది కాదు. భగవదనుగ్రహం తోనే తొలగాలి. ఒక దేహంలో "జీవాత్మ-పరమాత్మ" లిరువురూ వుంటారు. జీవాత్మ సంసారంలో మునిగి, ఈశ్వరుడిని చూడలేక, మోహంతో దుఃఖిస్తుంది. ఎప్పుడైతే, జీవాత్మ,

పరమాత్మను దర్శిస్తుందో, అప్పుడే దాని శోకం తొలగిపోతుంది. ఇందు "ఆత్మగుణం, దేహగుణం" కలిపి చెప్పడంవల్ల, "సగుణ బ్రహ్మ" మే సేవించ తగిందనీ, అట్టి దానిని సాక్షాత్కరింప చేసుకొనగలవారే "పుణ్యాత్ములనీ, మోక్షార్హులనీ" అర్థం చేసుకోవాలి. పూర్వ జన్మ పాపంవల్ల కూడా ఇలా అనుభవిస్తున్నానని సీత అంటుందోసారి. అంటే, ఆమె కర్మ వశాత్తు పుట్టిందని కాదు. ఆమాట రాక్షస స్త్రీలను ఉద్దేశించి చెప్పబడింది. భక్తుడు తన సర్వస్వం ధారపోసినా, భగవంతుడు కనపడకపోతే నాస్తికుడి లాగా భగవంతుడు లేడనుకోకూడదు. తనలోనే ఏదో లోపం వుందనుకోవాలి. మనుష్యులు సుఖమయినా, దుఃఖమయినా, "ప్రారబ్ధాన్ని" అనుభవించాల్సిందే కాని, బలాత్కార మరణంతోనో, ఇంకే విధంగానో దాన్ని తప్పించుకోలేరు.)

❖ ❖ ❖

సర్గ-26

శ్రీరాముడిని తలచుకొని దుఃఖించిన సీతాదేవి

కళ్ల నీళ్లు విపరీతంగా కారుతుంటే, తల వంచుకుని సీతాదేవి, నేలమీదపడి పొర్లాడే ఆడగుఱ్ఱంలా, పిచ్చెత్తినట్లు, పిశాచం పట్టినట్లు, వళ్లుతెలియక, మనస్సు దిగ్భ్రమ చెందిన దానిలా అయ్యి ఏడవసాగింది (ఇదంతా భక్తుల-ప్రపన్నుల స్థితి. భక్తి అతీతంగా పెరిగిపోతే, భక్తుడు దేహాభిమానాన్ని విడిచి నేలపైపడి పొర్లాడుతాడు. పిచ్చి పట్టినట్లు, దయ్యం పట్టినట్లు, వంటిమీద గుడ్డలున్నదీ, లేనిదీ తెలియకుండా ప్రవర్తిస్తాడు. ఇదే స్థితి సీతాదేవికి కలిగింది). ఏడుస్తూ తన స్థితిని తలచుకుందీ విధంగా:

"రామచంద్రమూర్తి నేను పట్టుదల పట్టడం వలనే ప్రమాదంలోకి పోవడంతో, కోరిన రూపం ధరించగల రావణాసురుడు, నేను ఏడుస్తున్నా లెక్క చేయకుండా, బలాత్కారంగా తీసుకొచ్చాడు. ఇక్కడ రాక్షసులచేత చిక్కిన నాకు, రామప్రాప్తి లేకుండా రాక్షసులు భయపెడ్తుంటే నేనెట్లా బ్రతకాలి? నేను బ్రతికేదే రాముడి కొరకు. ఆయన సేవకే నా ధనం. రామ కైంకర్యానికే నా సొగసులు. ఇవన్నీ రాముడిని సంతోషపెట్టడానికే అయినప్పుడు, ఆయనలేనందున నేనేడుస్తున్నప్పుడు, నాకెందుకివన్నీ? రాక్షస స్త్రీల మధ్య నేనేడుస్తుంటే నా గుండె పగలకపోవడానికి, అదేమన్నా ఇనుపగుండేమో! లేకపోతే, నా హృదయానికి ముసలితనం, చావూ లేవేమో? ఇది నా దౌర్భాగ్యం".

"రామచంద్రమూర్తి నన్ను విడిచి పోయాడంటున్నానే కాని, దానికి కారణం నా పాపమయమైన జీవితమే కదా! నేను పుణ్యాత్మురాలినే అయితే, ఆయన్ను పొమ్మని ఎందుకంటాను? అన్నా ఆయనెందుకు పోవాలి? ఆ నా పాప ఫలమే నన్ను ప్రాణాలు విడవనీయకుండా చేస్తున్నాయి. నేనెప్పుడైతే దేహమంత అభిమానంతో ప్రాణాలు నిలుపుకుంటున్నానో, అప్పుడే నేను అనార్య నయ్యాను....పతివ్రతను కాను.....సదాచారవతిని కాను. ఇట్టి శీలాదులు లేని దిక్కుమాలిన బ్రతుకెందుకు? నా పతివ్రతమేమి వ్రతం? రామచంద్రమూర్తి సేవ మళ్లీ లభిస్తుందనే ఆశతో ప్రాణాలు నిల్పుకున్నాను. ఎందుకంటే

బలవంతంగా విడువకూడదాయె! రావణుడేమో ఒక్క ద్వీపానికే అధిపతి. రాముడేమో భూమీతలానికంతా అధిపతి. అట్టివాడిని విడిచి శోకంతో బ్రతకలేను. రాక్షసులు నన్ను పీక్కుని తింటే తిననీ! ముక్కలుగా నరికితే నరకనీ! ఈ స్థితిలో నాకు పరుపులు, మంచాలు, సొగసులు కావాల్నా? ఈ పాడు ప్రాణమింత తీపా?" (దీన్ని బట్టి భక్తుడి మనస్సు భగవంతుడి మీదుండాలికాని సుఖ–సౌఖ్యాల మీదకాదని అర్థమౌతోంది)

"రావణాసురుడిని నేను ఎడమ కాలి గోటితో నైనా తాకను. అట్లాంటిది వాడిని ప్రేమించడమేంటి? ఛీ, ఇంత మాత్రం వాడికి అర్థం కావడంలేదు. వాడు సిగ్గులేని దుష్టుడవటమే దీనికి కారణం. చూడటానికే ఇష్టపడని స్త్రీ, మోహిస్తుందని ఎట్లా అనుకుంటున్నాడు? ఆ మాత్రం జ్ఞానం కూడా లేదు. అంత ఊహాబలం లేకున్నా, ఛీ అని చీదరించినా తెల్సుకోలేకపోతున్నాడు. ఎటువంటి వంశంలో పుట్టాడు! వాడి గౌరవమేంటి? పిత్రార్జితం, స్వార్జితమైన గౌరవాన్నైనా ఆలోచించాలి కద! ఈ ఆడదానిచేత చీవాట్లు పడటమెందుకని కూడా అనుకోవడం లేదు. ఇంకా నన్ను తన క్రూరత్వంతో వశపర్చుకోవాలను కుంటున్నాడు. ఇదివాడి దోషంకాదు. యమపాశంతో ఈడ్వబడటానికీ, చావుకు సిద్ధపడటానికీ, ఇటువంటి బుద్ధికాక మంచి బుద్ధి, చక్కటి ఆలోచన ఎట్లా కలుగుతుంది? కాల ప్రేరణవల్ల వాడు అలా చేస్తున్నాడు".

మనసు నాస్వాధీనం....దాన్ని మీరేమీ చేయలేరు

శ్రీరాముడిని తలచుకొని దుఃఖించిన సీత, రాక్షస స్త్రీల పైన తన కోపాన్నీ, అశక్తతనూ చూపిస్తుంది. పరుషంగా మాట్లాడుతుంది. "మీ నోళ్లు పట్టెతంత చిన్న–చిన్న ముక్కలుగా నాశరీరాన్ని కోసుకోండి. కత్తులతో నరకదల్చుకుంటే అలానే చేయండి. మంటల్లో వేయదల్చుకుంటే వేసికాల్చండి. మీ ఇష్టం వచ్చినట్లు మీరు చేయండి. నేనైతే మీ మాట వినను. ఎందుకు మీకీ మిడిసిపాటు? గర్వం? నాదేహం మీవశం. ఏమైనా చేసుకోండి. మనసు నా స్వాధీనం....దాన్ని మీరేమీ చేయలేరు కద!" అని తెగేసి చెప్పి మళ్లీ రామధ్యానం లోకిపోయి ఈవిధంగా అనుకుంటుంది.

"రామచంద్రమూర్తి నన్ను ఉపేక్షించడానికి కారణమేంటి? ఆయన దయాగుణం లేనివాడా? కాడే! నీ వాడినన్న ప్రతివాడిని, వాడిలో ఎన్ని దోషాలున్నా పట్టించుకోకుండా మంచి గుణాలను స్వీకరించేవాడుకదా! ఇట్టివాడు నా దోషాలను ఎందుకెంచుతాడు? ఇంతకాలం తనసేవ చేస్తున్న నన్ను మరవడం ఎందుకు? తనపైన విశ్వాసమున్న వారికెవరికైనా, ఏ దుఃఖం కలిగినా, అదితనకు కలిగినట్లే భావించి బాధపడే రాముడు, తనకొరకై అడవుల పాలైనదాని విషయంలో బాధపడకుండా వుండగలడా? ఇతరుల అభివృద్ధి కోరి, ఇంకా ఎవరెవరిని బాగుపరచాలా అన్న ధ్యాసతో సర్వజనుల శాంతి, సౌఖ్యాలు కోరి, వారికి ముక్తినిచ్చేవాడు, నా మేలుకూడా కోరడా? పధ్నాలుగువేల రాక్షసులను చంపి జనస్థానాన్ని హతస్థానాన్ని చేసాడు ఒక్కడే. సామర్థ్యం కొరవై వూరుకుంటాడా? ఆయన దయ రాకపోవటానికి నాదురదృష్టమే కారణమై వుండాలి. **(ఇలాంటి భావన నిజమైన భక్తుడికే కలుగుతుంది. భగవత్ కటాక్షం తనకు కలగలేదని భగవంతుడిని తప్పు పట్టడు. ఆ యోగ్యత తనకింకా కలగలేదనే అనుకుంటాడు. తనలోని లోపాలను సరిదిద్దుకొని, చేయాల్సిందంతా చేసి, అన్ని ప్రయత్నాలూ చేస్తాడు. అయినా తాను పూర్ణభక్తి సంపాదించుకున్నానని గానీ, భగవంతుడే కఠినుడై అనుగ్రహించలేదని గానీ అనుకోడు. ఎవడు పూర్ణ భక్తుడనని అనుకుంటాడో, వాడు నిజమైన భక్తుడు కాదు. నిజమైన భక్తుడు, ఇంకా, ఇంకా, భాగవత సేవ చేయలేకపోయానే! అని విచారిస్తాడు. భగవత్ సేవ చేయలేక పోయానే అని అసంతృప్తి చెందుతాడు. భగవత్ కైంకర్యం చేస్తూనే వుంటాడు. ఇది భక్తుడి స్వభావం.)**

రాముడిని ధ్యానం చేస్తూ పరిపరివిధాలుగా అనుకుంటుంది సీత. రామచంద్రమూర్తి శక్తి చాలక తనను రక్షించడానికి రాలేకపోవడం నిజంకాదని, దానికి కారణాలను వెతుకుతుంది. "నన్నీ ప్రకారం బాధపెట్టున్న ఒక అల్పుడు, బలహీనుడూ, అయిన రావణుడిని చంపడానికి ఎందుకు రావడంలేదు? నా కొరకేకదా ఖర-దూషణులను చంపాడు. ముఖా-ముఖి తలపడ్డారుకాబట్టే వాళ్ళందర్నీ చంపగలిగాడా? సముద్రమధ్యంలో వుండి కనపడడంలేదు కనుక, రావణుడిని చంపడంలేదా? లంక సముద్రంలో వున్నా, ఇతరులకు రావడం

అసాధ్యమైనా, ముల్లోకాల్లో తిరుగులేని రామబాణాలకు సముద్రం ఎట్లా అడ్డమౌతుంది? నా మీద ప్రేమ వున్నవాడు, ఎన్నో ఆపదలనుండి రక్షించిన వాడు, నేడు దయ తప్పి కానీ, శక్తిచాలక కానీ, వూరుకున్నాడని అనుకోలేము. మరెందుకు వూరుకున్నాడు? నేనెక్కడ వున్నానో ఆయనకు తెలిసుండక పోవచ్చు. అంతేకాని, తెలిస్తే పౌరుషమున్న ఆయన తన భార్యను ఇతరులు ఎత్తుకునిపోతే ఆ అవమానాన్ని ఎట్లా సహిస్తాడు? పోనీ అసలే తెలియదా అందామంటే, అదీ నిజం కాదు. జటాయువు బ్రతికుంటే, నా జాడ చెప్పే వుంటాడు" అనుకుంటుంది.

జటాయువును తలచుకోగానే ఆయన ధైర్యసాహసాలు గుర్తుకొచ్చాయి సీతకు. "వీరుడైన జటాయువును రావణుడు చంపి వుండవచ్చుగాక! అతడు వృద్ధుడై వుండికూడా ఎంతో సాహసం చేసాడు. నిరాయుధుడైనా, ద్వంద యుద్ధంలో తన పరాక్రమాన్నంతా చూపాడు. వీడిని విడిచిపెట్టలేదు. ఇంకా ఎంతో చేసేవాడు. నా దురదృష్టం చేత వాడికి కాలం కలసిరాలేదు." అనుకుంటుంది సీత.

"నేను లంకలో వున్నానని మాటమాత్రంగా తెలిసినా శ్రీరాముడు అమిత కోపంతో రాక్షసుడనేవాడు లంకలో లేకుండా చేయడా? ఈ క్షణంలో సముద్రంలో నీళ్లన్నీ ఇంకి పోయేటట్లు చేసి దుమ్ములేపే వాడే. వీడిమానం, ప్రాణం, లంక అనేవి లేకుండా రూపుమాపేవాడే. కాబట్టి, ఇంకా ఇప్పటిదాకా, రాముడికి నా జాడ తెలియలేదనే అనుకోవాలి. ఊరూ–పేరూ లేకుండా, ఎప్పుడీ రావణుడిని, శ్రీరాముడు చంపుతాడో, అప్పుడు, ఈ రాక్షస స్త్రీలు నేనేడుస్తున్నట్లే, లబో–దిబోమని ఏడుస్తారు కదా! యావజ్జీవం విధవలై ఏడుస్తారు కదా!"

"రామచంద్రమూర్తికి జటాయువు నా వార్త చెప్పక ముందే మరణించాడనుకుంటే, ఇంకే విధంగానైనా ఆయనకు నా వార్త తెలవకుండా వుంటుందా? చచ్చిపోయిన జటాయువైనా ఆయనకు కనిపించి వుండాల్సిందే! నేనుపారేసిన ఆభరణాలన్నా ఆయనకు కనిపించి వుండాల్సిందే! ఈ గుర్తులతో నన్నెవడో రాక్షసుడు ఎత్తుకుని పోయాడని ఊహించవచ్చునే! ఎవరీ రాక్షసుడని ఆరా తీసి వుండాల్సిందే! వానరుల ముందు సొమ్ములు వేసాను కదా, వారైనా

చెప్పాల్సిందే! ఎట్లైనా నేనిక్కడ వున్నానని తెలుస్తుంది. తెలవగనే ఇక్కడకు రావడం తథ్యం. రామలక్ష్మణులు ఇక్కడకురాగానే రాక్షసులందరూ చెల్లాచెదురై, పారిపోవాల్సిందేకాని, క్షణం కూడా ప్రాణాలను కాపాడుకోలేరు. వీడి నగరమంతా వల్లకాడై పోతుంది."

ఇలా ధ్యానంలో మునిగి అనుకుంటున్న సీత తనకెదురుగా వున్న రాక్షస స్త్రీలనుద్దేశించి: "నాకోరిక నెరవేరుతుంది. మీ చెడ్డ పనులవల్ల మీరే చెడిపోతారు. ఇది నిశ్చయం. నేనిప్పుడు చెప్తున్నది నిజమయ్యే రోజు దగ్గరలోనే వుంది. అప్పుడు తెలుస్తుంది నేను చెప్పిన మాటల్లోని విలువ. లంకాపురం పాడైపోయే లక్షణాలెన్నో కనపడుతున్నాయి. ఈవూరు కాంతిహీనమై పోవడం ఖాయం. ఇతరులు చొరబడలేని ఈపురం అనతికాలంలో, బాలవిధవలా, అందహీనమవుతుంది. ఎంతోకాలం బాగుండాల్సిన ఈ వూరు, వ్యభిచారాలు ఎక్కువైన కారణాన, పతిహీనై పాడైపోతుంది. పతి ఐన రావణుడు చచ్చిపోవడంతో, లంకంతా, పుణ్య–శుభ కార్యాలులేక, పండుగలు–పబ్బాలు చేసుకోక, పసుపు–కుంకుమ–గంధం–కాటుక–కమ్మలు–పాపిడిలాంటి శు భలక్షణాలు పోయి, విధవలాగా, విధవలకు నిలయమై పోబోతున్నది. రామబాణాగ్నిలో కాలిపోయి, కాంతిహీనమై, చచ్చిన రాక్షసులతో నిస్సందేహంగా పాడైపోతుంది చూడండి."

రాక్షసస్త్రీలకు పరుషంగా జవాబిచ్చిన సీతాదేవి

దుఃఖంతో పరితపిస్తున్న సీత రాక్షస స్త్రీలతో ఇంకా ఇలా అంటుంది: "నీచుడైన రావణుడు నాకు ఏడాది గడువిచ్చాడు. అది వాడి చావు గడువు. అది దగ్గర పడ్తున్నది. ఆ గండం తప్పించుకోవడం, మీ రాక్షసులకు తెలవదు. ఉత్పాతం ఇప్పుడే పడుతున్నది... చూస్తుండండి. ధర్మ మార్గంలో అపాయం తప్పించుకోవడం తెలియని మూఢరాక్షసులు, ఈ కీడు మూడింది నా వల్లనేనని, రావణాసురుడి భోజనానికి నన్ను హింసించి పంపుతారేమో! ఆమాత్రం కీడు తప్పదు. రాముడు తమను చంపుతుంటే, వాళ్లు నన్ను చంపుతారు. నా ప్రాణేశ్వరుడు దయాశీలి, తామర రేకుల్లాంటి కళ్లున్న రామచంద్రమూర్తినే విడిచి ఏడుస్తున్న నన్ను మీరేం చేసినా, నేనేం చేయగలను?"

"ఈ లంకలో నేనింకా బ్రతికే వున్నాననీ, తనకై విలపిస్తున్నాననీ, రామచంద్రమూర్తికి తెలియదేమో! లక్ష్మణుడైనా చెప్పేవాడే! భూమండలమంతా గాలించక ఎట్లా వూరుకుంటాడు? ఒకవేళ నాపై శోకంతో అడవిలో మరణించాడేమో! ఇక నేనేం చేయాలి? రామా! రామా! అని నేనిక్కడ అంగలారుస్తున్నానుకదా! రాముడితో సాంగత్యం నాకు మంచిదా, ఆయనకు మంచిదా? శ్రీరాముడు పరమాత్ముడు, జీవాత్ములందరి కంటే గొప్పవాడు. ఆయన స్వరూప–స్వభావాలు, జీవాత్ములకంటే వుత్తమమైనవి. ఆయన సర్వజ్ఞుడు. తానెవరెవరి విషయంలో ఎట్లా ప్రవర్తిస్తే బాగుపడతారో, అలానే చేస్తాడు. జీవకోటిని వుద్ధరించడంలో సర్వదా ఆసక్తి వున్నవాడు. రాజులందు ఋషిలాంటి వాడు. జీవకోటులను పాలించే వాడు. ఇట్టి సదాచార సంపత్తిగల రాముడి ఆజ్ఞకు లోబడిపనిచేసే దాన్ని నేను. ఆయన విషయంలో పొరపాటు చేసి దారితప్పనూ వచ్చు. ఇలాంటి నా వలన ఆయనకేం లాభం? నామేలుకోరి నేనే ఆయన్ను సేవించాలి. నేను సేవించకున్నా ఆయనకొచ్చే లోపం లేదు."

"రామచంద్రమూర్తి రాజు కాబట్టి ఎదురుగా వున్నవారిని ఎక్కువగా ప్రేమించడం, చాటునున్న వారిని మర్చిపోవడం జరగవచ్చు. అందువల్ల ఎదురుగా వున్నప్పుడు నన్నెంత ప్రేమించినా, కనుమరుగైన నన్ను మర్చిపోయాడేమో! అందుకే వెతికే ప్రయత్నం కానీ, ఇక్కడకొచ్చే ఆలోచన కానీ చేయడం లేదేమో! రామచంద్రమూర్తి కృతఘ్నుడు కాడే మర్చిపోవడానికి! ఒక్క ఉపకారం చేసినా ఎల్లప్పుడు గుర్తుంచుకుంటాడే! అట్టివాడు నన్ను మర్చిపోతాడా! చాటుగా వున్నప్పుడు, ఎదురుగా వున్నప్పుడు, వేరేలాగా నేను వుండవచ్చునుకాని రాముడలాంటివాడు కాదే!"

"అంత ప్రేమ నీపై నున్న భర్త ఇంకారాలేదని అంటున్నావా రాక్షసీ! అది ఆయన లోపంకాదు. నన్ను ఆయన అనుగ్రహించేటంత మంచి గుణాలు నాలో లేవేమో! ఉన్నా ప్రారబ్ధ వశాన పుణ్యఫలం చెడిపోయిందేమో! ఆ కారణంతో నా భర్తనుండి నేను వేరైనాను కాని ఆయనకు నాపై దయ లేక కాదు. ఆయన నన్ను మరువనూ లేదు. దోషమెవరిదైనా ఎందుకు రాలేదంటే, ఏం చేస్తావిప్పుడంటే, ఒకటే సమాధానం. అటువంటి శూరుడు, ధైర్యసాహసాలు

కలవాడు, శత్రుసంహారకుడు, కళ్యాణగుణధనం కలవాడు, గొప్పస్వభావం, గొప్ప మనసున్నవాడు, మిగుల గంభీరుడు, త్యాగైన శ్రీరామచంద్రమూర్తిని విడిచి బ్రతకడంకంటే చావడమే మేలు."

"రామచంద్రమూర్తి ఎందుకు రాలేదంటే దానికి రెండు కారణాలున్నాయి. బహుశా కందమూలాలు తిని, శస్త్రాస్త్రాలు వదిలి, నా ఎడబాటువల్ల కలిగిన దుఃఖంతో, అవమానంతో, శోకతప్తులైన అన్నతమ్ములిద్దరూ మరణించైనా వుండాలి. వంచకుడైన రావణుడు నీతిమంతులైన రామలక్ష్మణులను మోసగించి చంపించైనా వుండాలి. వారు మరణించి వుండి రాలేకపోయారేకాని, జీవించి వుంటే వచ్చేవారే! ఇంత దుర్దశలకు పాల్పడి ఇంత కష్టమనుభవిస్తున్న ఈనీచురాలికి చావే సుఖం. అయినా యముడికి నా మీద దయలేదు. ఏం చేయాలి?"

మనస్సును, ఇంద్రియాలను జయించి, శీతోష్ణాలు, సుఖ-దు:ఖాలు, లాభనష్టాలు, అనే విషయాలను త్యజించి, ప్రియమైనా, అప్రియమైనా, మనస్సు దగ్గరకు రానీయక, సుఖంకలిగితే సంతోషించక, దుఃఖం కలిగితే బాధపడక, ఎటువంటీ దిగులులేని మునీశ్వరులెంత పుణ్యాత్ములో కదా! దేహాభిమానం వుంటే సంతోషం, భయం రెండూ కలుగుతాయి. శుభకరాలైన గుణాలున్న మునులకు మ్రొక్కాలి. ఆత్మ జ్ఞానముండి నాకు ప్రియుడైన, సద్గుణవంతుడిని, రామచంద్రమూర్తిని, విడిచి, ఆత్మజ్ఞానంలేక, నా ప్రీతిపాత్రుడు కాక, దుర్గుణాలున్న పాపపు రావణుడికి స్వాధీనపడి బ్రతకడంకన్న చావనైనా చస్తాను" అని రాక్షసస్త్రీలకు పరుషంగా జవాబిస్తుంది సీతాదేవి." (ఆత్మహత్య మహాపాపం అంటారు. అలా బలవన్మరణం చేసినవారికి మైల, మృతాశౌచం పట్టకూడదంటారు. అలాగే అగ్నిసంస్కారం కూడా చేయకూడదట. నీళ్లు విడవకూడదట).

(లంకానగర పతనం గురించి, రాక్షసనాశనం గురించి, సీతాదేవి తనకు భూమ్యాకాశాలలో కనిపించిన శకునాలను బట్టి చెప్పింది. ఉత్పాత చిహ్నాలు అరిష్ట సూచకాలు. రామదర్శన భాగ్యం కలిగిన జనులు ధన్యులని చెప్పాలి. సంసార మందున్న భక్తులు ఎట్టి రూపంలో భగవంతుడిని చూడదల్చుకున్నారో,

పరమపదంలో కూడా అట్టి రూపంలోనే చూడగల్గుతారు. సీతారాములను సేవిస్తూ ముక్తులయ్యే వారికి, పరమపదంలో భక్తులకు, భగవంతుడు సీతారామమూర్తిగానే కనపడతాడు. "జీవాత్మ"లు భగవంతుడిని సేవించడం తమ మేలుకొరకే గాని, ఆయన్ను ఉద్ధరించడానికి కాదు. "జీవాత్మ"లు సేవించనంత మాత్రాన ఆయనకు వచ్చిన లోటేం లేదు. జీవాత్మలు భగవంతుడి విషయంలో ఎన్ని అపచారాలు చేసినా, భగవంతుడట్లా చేయడు. దూరంగా వున్నంత మాత్రాన బిడ్డలను తల్లితండ్రులు మర్చిపోతారా? అట్లానే భగవంతుడు.)

❖ ❖ ❖

సర్గ-27

తన స్వప్నవృత్తాంతాన్ని తోటి రాక్షసులకు చెప్పిన త్రిజట

సీతాదేవి చెప్పిన ఈ మాటలు విన్న రాక్షసస్త్రీలు కోపంతో వూగిపోయారు. కొందరేమో రావణాసురుడికి ఫిర్యాదు చేసారు. కొందరేమో, మామాట వినడంలేదు, మరణించే ప్రయత్నం చేస్తుందన్నారు. మరి కొందరామెను తిరిగి బెదిరించారు. ఇదంతా జరుగుతున్న సమయంలో అక్కడే నిద్రిస్తున్న "త్రిజట" అనే వృద్ధ రాక్షస స్త్రీ, వీళ్ల మాటలకు మేల్కొని, పడుకొనే వీళ్లందరినీ మందలించింది. ఇంతవరకూ చేసింది చాలు, ఇకమాట్లాడడం ఆపుచేయండని వాళ్లను హెచ్చరించింది. సీతాదేవిని, రాముడి భార్యను, జనకరాజు పుత్రికను, దశరథుడి కోడలిని, భుజించే శక్తి వాళ్లెవరికీ లేదని, దూరంగా పొమ్మని అందరినీ గద్దిస్తుంది. ఆమెను బాధించవద్దనీ, తినదల్చుకుంటే ఆమె బదులుగా తనను తినమని అంటుంది. ఈ రాక్షస సమూహమంతా మూలమట్టంగా నాశనమౌతుందని, సీతాదేవి భర్తకు విజయం తథ్యమని కలగన్నాననీ, ఆ కలను తల్చుకుంటే దేహమంతా వణుకుతున్నదనీ, తన కల విషయం వివరంగా వినమనీ అనగానే రాక్షస స్త్రీలందరూ భయంతో ఆమె చుట్టూ చేరారు. తాను కలలో చూసిన సన్నివేశం వివరాలను ఇలా చెప్పసాగింది త్రిజట:

"తెల్లటి ఏనుగు దంతంతో తయారై, ఆకాశంలో పయనించగలిగిన పల్లకీని, వేయి హంసలు లాగుతుంటే, తెల్లటి వస్త్రాలు కట్టుకుని, రామచంద్రమూర్తి, లక్ష్మణుడితో కూడి వస్తాడు. సీత అందమైన తెల్లటి చీరె కట్టుకుని, పాలసముద్రంలో, తెల్లటి పర్వతం మీద సూర్యుడితో కూడిన ప్రభలాగా, రాముడితో వుండగా చూసాను. నాలుగు దంతాల కొండలాగున్న ఏనుగుపై లక్ష్మణుడితో రాముడు పోతుండగా చూసాను. (కలలో ఎద్దను, ఏనుగులను, మేడలను, కొండ శిఖరాలను, కాచే, పూచే చెట్లను ఎక్కడం, మలం పూసుకోవడం, ఏడ్వడం, చావడం, పొందరాని దానితో పొందడం చూస్తే శు భ సూచకమంటారు)

"తెల్లటి వలువలు, పూదండలు ధరించి, ధీరుల్లో శ్రేష్ఠులైన రామలక్ష్మణులు, చిగుళ్ల లాంటి పాదాలున్న సీత పక్కన సంతోషంతో వుండగా చూసాను. అదిచూడగానే నా గుండెలు పగిలాయి. ఆ పర్వత శిఖరం మీద ఆకాశాన్ని తాకుతున్న ఏనుగుపై, రాముడి తొడమీద సీతాదేవి కూర్చొని వుంది. సూర్యచంద్రులను తాకుతున్నదా అనిపించింది. (కలలో సూర్య మండలం కానీ, చంద్ర మండలం కానీ చేతుల్తో పట్టుకున్నట్లు కనిపిస్తే, వాడికి గొప్ప రాజ్యం లభిస్తుంది). రాజకుమారులైన రామలక్ష్మణులు, చంద్రుడిలాంటి ముఖమున్న సీతాదేవి, స్పష్టంగా భద్రజాతి ఏనుగుపై కూర్చొని లంకమీద ఆకాశాన వున్నట్లు కలగన్నాను. ఎనిమిది మేలుజాతి ఎడ్లను కట్టిన రథమెక్కి రామచంద్రుడు ఈ సీతాదేవితో రావడం చూసాను."

"సూర్యకాంతి గల పుష్పక విమానం ఎక్కి రామలక్ష్మణులు, ఉత్తరదిశగా సీతతో పోతుంటే చూసాను. విష్ణుపరాక్రముడు, మహాబుద్ధిశాలి, శ్రీరామచంద్రమూర్తి, సీతతో, తమ్ముడితో వుండగా చూసాను. ఇది నిజమవుతుందనిపిస్తున్నది". (స్వప్నక్రమం: రామలక్ష్మణులు పల్లకీలో సీతను వెతుకుతూ లంకకు వస్తారు. లంక దగ్గర పాలసముద్రంలో ఒక తెల్లటి కొండ దగ్గరకు రాముడు వచ్చి చేరుతాడు. సీతకూడా ఆ కొండ దగ్గరే వుంది. రామలక్ష్మణులు పల్లకి దిగి ఏనుగునెక్కి సీత దగ్గరకొచ్చారు. సీతకూడా ఏనుగునెక్కి పెనిమిటి తొడపై కూర్చున్నప్పుడు సూర్యచంద్రులను తాకుతున్నట్లుగా వుంది. ఈవిధంగా వాళ్లు లంకకు ఆకాశమార్గాన వచ్చి, ఏనుగు దిగి, ఎనిమిది ఎడ్లు కట్టిన రథంపై కూర్చుని, లంకకొచ్చి, పుష్పకవిమానం ఎక్కి ఉత్తర దిశగా పోయారు)

"పాపాత్ములు స్వర్గం దగ్గరకు ఎట్లా పోలేరో, అట్లే దేవ రాక్షస సమూహాలు యుద్ధరంగంలో, శ్రీరాముడిని సమీపించలేవు. రావణుడు ఒంటికి నూనె పూసుకుని, నూనె త్రాగుతూ, గన్నేరు పూల దండలు మెళ్లో వేసుకుని, ఎర్రబట్టలు కట్టుకుని, బోడితలతో, నల్లబట్టలు ధరించి, పుష్పక విమానం నుండి ఒక ఆడది ఈడుస్తుంటే, నేలపైబడి బాధపడ్తుంటే చూసాను. గాడిదలు కట్టిన రథం మీద, ఎర్ర పూదండలు వేసుకుని, ఎర్రగంధం పూసుకుని, పిచ్చివాడిలాగా

నూనె త్రాగుతూ, గంతులేస్తూ, గాడిద మీద దక్షిణ దిక్కుగా పోతుంటే చూసాను. గాడిద మీద పోతున్న వాడల్లా తలకిందులుగా పడిపోతాడు. పడి, భయంతో దిగ్గునలేచి, తెల్లబోయి, మత్తుతో వికలుడై, భయపీడితుడై, వాగుతూ, బట్టలిప్పేసి, దిక్కుతోచక, భయంకరమైన, అసహ్యమైన బురదలో పడిపోవడం చూసాను. కాళి అనే ఓ స్త్రీ ఎర్రగుడ్డేసుకుని, బురద పూసుకుని, వాడిమెడను కౌగలించుకుని, రాక్షసరాజును దక్షిణదిక్కుగా ఈడ్చుకుంటూ పోతుంది."

"కుంభకర్ణుడి పైకూడా ఇలాంటి కలే కన్నాను. రావణుడి కొడుకులు నూనెలో మునగడం చూసాను. పందిపై రావణుడు, మొసలిపై ఇంద్రజిత్తు, ఒంటెపై కుంభకర్ణుడు దక్షిణదిక్కుగా ప్రయాణం చేయడం చూసాను. ఒక్క విభీషణుడు మాత్రం తెల్ల గొడుగు, తెల్ల బట్టలు, తెల్లగంధం పూతతో, ఆటపాటల మధ్య, మేఘధ్వని గల ఒక పెద్ద ఏనుగునెక్కి నలుగురు మంత్రులతో ఆకాశ మార్గంలో పోతుంటే చూసాను. ఎర్రగుడ్డలు, ఎర్రమూల్యాలు ధరించి మేళతాళాలతో వుండగా చూసాను. విరిగిన గోపురాలతో వున్న రావణరక్షణలోని లంక సముద్రంలో పడుతుంటే చూసాను. రాముడికి భృత్యుడైన ఓ కోతివచ్చి లంకను కాల్చి బూడిదచేయగా చూసాను. ఏడుస్తున్న ఆడవాళ్లు నూనె త్రాగి లంకలో వేడి బూడిదలో పడిపోవడం, కుంభకర్ణుడు, ఇతర రాక్షసులు పౌరుషం పోయి, పేడమడుగులో పడుతుంటే చూసాను."

కల విషయం చెప్పి రాక్ష స్త్రీలను మందలించిన త్రిజట

తనకొచ్చిన కల విషయం చెప్పడంతోపాటు, రాక్షస స్త్రీలను మందలిస్తుంది కూడా త్రిజట ఇలా: "రాక్షస స్త్రీలారా లేచి చాటుగా పొండి. సీతాదేవిని తీసుకెళ్లటానికి ఇక్కడకు వచ్చిన రాముడు, భయంకరంగా రాక్షసులందర్నీ చంపుతున్నప్పుడు, తనభార్యను బాధించిన మిమ్ములనందరినీ కూడా చంపకుండా వూరుకోడు. తనమీద ప్రేమున్నదనీ, తన్నేనమ్మిందనీ, తనతో సంతోషంగా అడవులకు వచ్చిందీమె అనీ, భావించే రాముడు, సీతకొరకై రాక్షసులందర్నీ చంపుతాడు. అందువల్ల మీమాటలు చాలించండి. బెదిరింపు మాటలు మానండి. ఇంకా బెదిరిస్తే మన ప్రాణాలకు అపాయం వస్తుంది. ప్రాయశ్చిత్తంతో

క్షమించమని సీతను వేడుకుందాం. నా కల నిజమైన కల. సీత తప్పక తన భర్తను చేరుతుంది. సీతాదేవిని మనం బెదిరించాం, అరిచాం, నిర్బంధించాం కాబట్టి మనమీద ఆమెకు ఎందుకు దయవుంటుందని అనుకోవద్దు. రావణుడు చస్తే మనలను, అయ్యో పాపం అని, అపాయం నుండి రక్షించే వారెవరున్నారు? సీత "ప్రణతి ప్రసన్న" అంటే, నమస్కార ప్రియురాలు. మనమెన్ని తప్పులు చేసినా నిష్కల్మషమైన బుద్ధితో క్షమించమని వేడుకుంటే, శాంతించి మనలను తప్పక కాపాడుతుంది. మనకు రానున్న ఉపద్రవం నుండి ఈమె తప్ప వేరు ఎవరూ రక్షించలేరు. కల సంగతటుంచి, ఈమెకు శాశ్వతంగా పతి వియోగముందని తెలిపే గుర్తులు ఈమె శరీరంపైన ఎక్కడాలేవు. భర్త ఈమెకు తప్పక దర్శనమిస్తాడు."

"సీత దుఃఖాన్ని అనుభవించడానికి అర్హురాలుకాదు. ఈమె దివ్య సుఖాలను అనుభవిస్తుంది. ఈమెను బాధిస్తే మనకొచ్చిన లాభమేంటి? నేనుచెప్తున్న మాటలు అసత్యం కాదంటానికి ఆమెను ఓ మారు జాగ్రత్తగా చూడండి. పొడగైన తామరరేకుల్లాంటి ఆమె ఎడమ కన్ను ఎట్లదురుతుందో చూడండి. అది ఆమెకు మేలు చేస్తుంది. ఈమె అనుకున్నట్లే భర్తను కలుస్తుంది. రావణుడు నాశనం అవుతాడు. రామచంద్రమూర్తి గెలుపు ఖాయం" అంటుంది.

(ఇది చెప్తుంటే ఉన్నట్లుండి సీతాదేవి ఎడమ చేయి పులకించి అదిరింది. ఎడమ తొడా అదిరింది. అంటే రాముడు సమీపంలోనే వున్నాడని మంగళసూచిక. మొదట సీతమ్మ ఎడమ కన్ను అదిరింది. వెంటనే ఎడమ భుజం అదిరింది. తరువాత ఎడమ తొడ అదిరింది. ఇవన్నీ త్రిజట చెప్పినప్పుడు ఆ రాక్షస స్త్రీలంతా చూసారు. నిజమేనని నమ్మక తప్పింది కాదు. పురుషులకు కుడివైపు భాగాలు శుభప్రదాలు. స్త్రీలకు ఎడమవైపు భాగాలు మంగళప్రదాలు. అదరడం అంటే ప్రొద్దస్తమానం అదరడమని కాదు. క్షణకాలం పాటుకలిగే స్పందన అది. సీతమ్మకు ఎడమవైపు శరీర భాగాలు అదరడం శుభసూచకం. దాన్ని బలపరుస్తూ చెట్టుపైనున్న పక్షి కూయడం విశేషం).

కొమ్మల మీదున్న పక్షులు అమితమైన సంతోషంతో, ఓదార్పు మాటలు పల్కుతూ, శుభసూచకం ప్రేరేపిస్తూ సీతకు ధైర్యాన్ని కలిగిస్తున్నాయనీ, దీన్ని

బట్టి సీతకు త్వరలోనే శుభం కలుగనున్నదనీ, కాబట్టి రాక్షసులు ఆమెను బాధించవద్దనీ అంటుంది త్రిజట. దూరంగా పొమ్మనీ, ఆమెను నిర్భయంగా వుండనీయమనీ అనగానే, రాక్షసస్త్రీలంతా, త్రిజట చెప్పినట్లే సీతాదేవి శరణుజొచ్చారు. రక్షిస్తానని సీత వారికి అభయమిస్తుంది.

(త్రిజట విభీషణుడి కూతురని కొందరు, కాదని మరి కొందరు అంటారు. ఆమె సీతాపక్షపాతి, అభిమానం వున్నామె. కలంతా కల్పితమనుకున్నా, కోతి వచ్చే విషయం, లంక కాల్చే విషయం వూహించని విషయమే కదా! అంటే స్వప్నమంతా కల్పితం కాకపోవచ్చు. శూన్యవాదులు, మాయావాదులు, నాస్తికులు, స్వప్నాలు అసత్యమంటారు. రామాయణంలో మూడు స్వప్నాలున్నాయి. దశరథ స్వప్నం, భరత స్వప్నం, త్రిజట స్వప్నం. మూడూ నిజమయ్యాయి. ఆరోగ్యవంతులై నిర్మలమైన మనస్సున్న వారు కన్న కలలు నిజమవుతాయి. అనుభవంలో నేటికీ ఎన్నో స్వప్నాలు నిజమైన దాఖలాలున్నాయి.

పురుషుడికి (జీవాత్మకు) రెండు స్థానాలే వున్నాయి. ఇహ లోకం, పర లోకం. మూడోది స్వప్నమనే తృతీయ స్థానం. అది ఇహ-పరలోకాల సంధి స్థానం. ఆ సంధి స్థానం నుండి ఇహ-పరలోకాలను రెండింటినీ చూస్తున్నాడు. పొలిమేర నుండి రెండు వైపులా వున్న గ్రామాలను చూసినట్లే ఇదికూడా. భగవంతుడే నిద్రపుచ్చుతూ, మేల్కొన్నప్పుడున్న ఇంద్రియాలను తానే గ్రహించి, బాహ్యేంద్రియాలను విస్తరించి, స్వప్నాలను వాడి, వాడి అదృష్టం ప్రకారం సృష్టించి, కొంతసేపు వాడనుభవించేటట్లు చేస్తాడు. స్వప్నంలో కనిపించేవన్నీ సృష్టించబడినవే. అక్కడ రథాలు లేవు, గుర్రాలు లేవు, రథం పోయే దారీ లేదు, గుంటలూ లేవు, పుష్కరిణులూ లేవు, నదులూ లేవు. ఏమీ లేవు. అన్నీ సృష్టించబడినవే. ఆ సృష్టికర్త భగవంతుడే.

జీవుడు చేసిన పుణ్య-పాపాలను అనుభవించేందుకై, భగవంతుడే దానికి కావాల్సిన విషయాలను అప్పటికప్పుడే సృష్టిస్తాడు. కాబట్టి స్వప్నాల్లో చూసినవన్నీ అసత్యం కాదు. రెండు గ్రామాలు సత్యమైతే, నడుమనున్న పొలిమేర ఎట్లా అబద్ధమవుతుంది? కలల్లో సాధారణంగా అప్రియాలు కనబడవంటారు. ఎవడూ

అప్రియాలను కోరుకోడు కదా! స్వప్న సృష్టికర్త భగవంతుడే. మొదటిజాములో వచ్చిన కల సంవత్సరానికి ఫలిస్తుందనీ, రెండోజామున వస్తే ఎనిమిదినెలలకనీ, మూడో జామున వస్తే మూడు నెలలకనీ, నాలుగో జామున వస్తే నెలకేననీ, అరుణోదయ వేళవస్తే పది దినాలకనీ, సూర్యోదయాన వస్తే మూడు రోజుల్లోనే ఫలిస్తుందనీ అంటారు. ఆవులు పితికే వేళ వస్తే వెంటనే ఫలిస్తుందట. ఏ కల ఏ జాములో వస్తే ఎన్నాళ్లకు ఫలిస్తుంది అన్న విషయాన్ని అటుంచితే, స్వప్నాలు యదార్థమౌతాయనడం శాస్త్ర సమ్మతం. అయోధ్యలో దశరథుడి స్వప్నం, మాతామహుల ఇంట్లో వుండగా భరతుడికి వచ్చిన స్వప్నం, లంకలో త్రిజటకు వచ్చిన స్వప్నం, వెరసి మూడూ ఫలించాయి కద! వాల్మీకి అద్భుత రచనా వైచిత్రి ఇక్కడ గమనార్హం. త్రిజట తన స్వప్నాన్ని వివరించిన విధం రాక్షస స్త్రీలకు హడలెత్తించగా, శింశుపా వృక్షంపై చక్కగా కూర్చొని ఇదంతా వింటున్న హనుమంతుడికి ఇక చేయవలసిన పని ఏదో అందంగా సూచించినట్లయింది.)

❖ ❖ ❖

సర్గ-28

శ్రీరాముడు రాలేదని అనేకవిధాలుగా పరితపించిన సీత

దయాహీనుడైన రావణుడి ఆజ్ఞానుసారం రాక్షస స్త్రీలు తనను అనరాని, విన రాని మాటలంటుంటే, సీతాదేవి సింహం బారినపడ్డ ఏనుగు పిల్లలా వణికిపోయింది. అంతకుముందు రావణాసురుడి బెదిరింపు మాటలను కూడా గుర్తుచేసుకుని, అడవిలోపడి కాపాడేవారులేని ఆడపిల్లలాగా ఏడ్చింది. "విధి నిర్ణయించిన కాలం తీరే వరకు ప్రాణం పోదంటారు పెద్దలు. నా విషయంలో అదే నిజమవుతున్నది. కాలం రాలేదు. రావణాసురుడు నన్నిలా ఎత్తుకొచ్చి, ఈ రాక్షసులబారిన పడవేసి, వాళ్లంటున్న మాటల్తో బాధపడటానికి నేనెంత పాపం చేసానో! సుఖమా లేదాయె! దుఃఖమా అధికమవుతుండే! హృదయం వేయితునకలై పోతుండే! రావణాసురుడు పెట్టే హింసలకు లోబడి బాధపడడం కంటే ఉరి పోసుకుని చావడం మేలు. ఆత్మహత్య చేసుకుంటే నరకానికి పోతారంటారు కాని, ఆ నరకబాధ దీనికంటే తీవ్రమయింది కాదుకదా! రావణుడి ఇష్టప్రకారం నడుచుకుందామంటే, అన్నిబాధలు తప్పించుకుందామంటే, శూద్రుడికి వేదమంత్రం ఉపదేశించే బ్రాహ్మడిలాగా, నేను రాక్షసుడికి మనసీయ వచ్చా? రామచంద్రమూర్తికి నామనసు త్రికరణశుద్ధిగా ధారపోసాను. ఆ మనస్సును ఈ నీచుడికి అర్పించడం మహా దోషం" అని అనుకుంటుంది. (ఒక ఋషీశ్వరుడు శూద్రుడొకడికి వైదిక విధానంలో పితృకర్మ తెలిపి, వాడితో అట్లా చేయించి, రాజపురోహితుడిగా పుట్టినట్లు భారతంలో చెప్పబడింది. అంటే ముముక్షువుకు భగవత్ మంత్రం చెప్పడం నిషేధం కాదు. భక్తి, ప్రపత్తి మార్గంలో మోక్షానికి అందరూ అర్హులే, అధికారులే. చెప్పడం తప్పుకాదు. కాకపోతే, వైదిక కర్మల్లో, శూద్రుడికి అధికారం లేదనీ, ఆ విధానం చెప్పరాదనీ వాల్మీకి భావన)

"శత్రువు సహించలేని పరాక్రమవంతుడైన రాముడు రాకపోతే, గడువు ముగుస్తుండగానే, కోపం పెరిగిన రావణుడు, శస్త్రచికిత్స చేసే వైద్యుడు, గర్భంలో మరణించిన శిశువును కోసి తీసేసినట్లే, వాడి కత్తులతో నన్ను కోస్తాడు కదా!

నిర్భాగ్యురాలైన నాకు, వాడిచ్చిన రెండు నెలల గడువులో కూడా కొంతకాలం అప్పుడే గడిచిపోయిందే!” అనుకుంటూ శోకిస్తుంది సీత.

సీతా పరితాపం ఇంకా ఇలా కొనసాగుతుంది:”అయ్యో! జింకవేషంలో వున్న వంచకుడి చేతిలో నాకొరకు, రామలక్ష్మణులు, పిడుగుపాటుకు చచ్చిన సింహాల, వృషభాల జంటలా మరణించారేమో! ఇంతకంటే దుఃఖం ఏముంటుంది? ఈ అనర్థానికంతటికీ నేనే కారణం. వాళ్లిద్దరూ నన్ను విడిచిపోవడానికి నేనే కారణం గదా! తెలివిమాలి, ఎప్పుడు దురదృష్టంతో, రామలక్ష్మణులను ఎడబాటుచేసుకున్నానో, అప్పుడే మృత్యుదేవత జింకరూపంలో వచ్చి నన్ను మోసగించింది. ఇప్పుడనుకుని ఏం ప్రయోజనం? “జీవాత్మ-పరమాత్మ” లిరువురూ ఎడబాసిన దేహం లాగా అయిపోయానే!”

ఇంకొంచెం కటువుగా ఏంచేసే శక్తిలేనిదానిలా అనుకుంటుంది సీత: “రఘురామా! నీ పూర్వీకుల యోగ్యత, కీర్తి-ప్రతిష్టలు, అలోచించు. సత్యప్రీతి గల నువ్వు వివాహ సమయంలో నాకేం ప్రమాణం చేసావు? లోకానికంతటికీ చీకటి రూపుమాపి, అమృతం కురిపించి, అందర్నీ సంతోషపరిచే చంద్రుడిలాంటి ముఖమున్న నీవు నా విషయంలో ఎందుకు సార్థక నామధేయుడవు కాలేకపోతున్నావో చెప్పు? పొడగాటి చేతులున్న నీకు అందలేని దూరం ఏదైనా వుందా? ప్రపంచానికంతా మేలుకోరే నీవు, నిన్ను విడిచిన నన్ను రక్షించవా? వేరే రక్షించేవారు లేరే? నీవు దేనికైనా సమర్థుడవే కద! ఒక ఆడదాన్నైన నన్ను ఆపదనుండి తప్పించలేవా? ఆ సామర్థ్యం లేదా? యుద్ధరంగంలో అరివీర భయంకరుడవే? నువ్వే తల్చుకుంటే నీ ముందర ఈ రాక్షసులు నిలవబడగలరా? ముల్లోకాలలోని అందరినీ రక్షించే దీక్షకలవాడవు కదా! నన్నొక్కదాన్ని రక్షించకపోతే నీ వ్రతభంగం కాదా? ఓ కమలలోచనా! ఈ రాక్షసుల్లాగా నువ్వు క్రూరుడివి కాదే? దయార్ద్రదృష్టి గలవాడివే! నాపై ఎందుకు నీ దృష్టి పడలేదు? నీవు సర్వజ్ఞుడివే! నన్నిక్కడ రాక్షసులు బాధించడం నీకు తెలియదా?”

“నీ కంటే నాకు వేరే దైవంలేదనీ, నీవే నా దైవమనీ, నిన్ను కొలుస్తున్నాను. నీ మాటలు వింటానన్న ఆశతో, రాక్షసుల పరుషవాక్యాలను సహించి వూరుకున్నాను. నీతో శయనించుదామని ఇక్కడ నేల పైన పడుకున్నానే!

శ్రీరాముడే నన్ను రక్షిస్తాడన్న ధైర్యంతో, నన్ను నేను రక్షించుకునే ప్రయత్నమేమీ చేయలేదే!. పాతివ్రత్యమన్న తపస్సు తప్ప వేరే ఏమీ అలోచించలేదే! నేను నిర్భాగ్యురాలను కాబట్టి, కృతఘ్నునకు చేసిన మేలులాగా అన్నీ వ్యర్థమైపోయాయి". (అందుకే, పరమ భక్తులు, ప్రపన్నులు చేయాల్సిందల్లా, భగవత్ చరిత్ర తప్ప వేరేదాని పై దృష్టి నిలపకపోవటమే. దేహ సుఖాలు కోరకూడదు. భగవంతుడే రక్షిస్తాడన్న దృఢ విశ్వాసం కలిగి, తన యోగక్షేమాలకై, తాను పాటుపడకూడదు. స్వతంత్ర బుద్ధి మానాలని అర్థం)

"నాథా! నీకు సంతోషం కలిగించే నా చక్కదనం పోయి, సన్యాసి దేహం లాగా బక్క చిక్కి పాలిపోయింది. ఇలా వుంటే, మునుపటి ప్రేమ వుంటుందో, లేదో! అందంగాలేని నన్ను, వెనుకటి లాగా నీవు ఆదరించక పోయినా, దూరం నుండైనా నిన్ను దర్శించగలనన్న ఆశ కూడా లేదు. నా పుణ్యఫలమంతా వ్యర్థమైపోయింది. రెండు విధాల చెడ్డ రేవడిలాగా అయ్యాను. పుణ్యకర్మఫలం పోతే ఫర్వా లేదు. దానికి అంతగా బాధలేదు. కానీ, నన్ను రక్షిస్తుందనీ, వ్యర్థమైపోదనీ, నిన్ను చేరే తిరుగులేని ఉపాయమనీ నమ్మిన నిర్మలమైన నా పాతివ్రత్యం (భక్తి) కూడా వృధా అయిందే! దానికి దుఃఖ పడ్తున్నాను". (దేహం భగవంతుడుండు ఆలయమన్న భావనతో అలంకరించుకోవచ్చు. భగవదర్పణం అనుకుంటూ మంచి ఆహారం తీసుకోవచ్చు. స్వబుద్ధి, స్వప్రయోజనం మటుకు నిషిద్ధం. సన్యాసుల్లాగా దేహాన్ని శుష్కింప చేసుకుని, తపస్సు చేయడం కంటే, గృహస్థ మార్గమే వుత్తమం. అయితే, దానికంటే ఇది కష్టమైన పని. ఇలా వుండలేని వాడే సన్యాసి అవుతాడు. సన్యాసులకు కలిగే బ్రహ్మలోక ప్రాప్తి కంటే వీరికి భగవత్ సాయుజ్య ప్రాప్తి తొందరగా లభిస్తుంది).

"రామచంద్రమూర్తీ! నీవు సత్యసంధుడవు. తండ్రి ఆజ్ఞ ప్రకారం పధ్నాలుగు ఏళ్లు వనవాసం చేసి, లోకం మెప్పు పొంది, అయోధ్యకు తిరిగి పోయి, రాజ్యాభిషేకం చేసుకుని, కృతార్థుడవై, అనేకమంది సుందరీమణులతో కులుకుతావనుకుంటా! అట్లా చేయకుండా నువ్వెట్లా వుండగలవు? ఇంత రాజ్యం చేస్తూ విదురుడి లాగా, సన్యాసి లాగా వుండడం నీ దగ్గరి వాళ్లు చూస్తే వూరుకోరు. బలవంతం చేసైనా నీకు పెళ్లి చేస్తారు. నీకు పిల్ల నివ్వడానికి

ఎందరో రాజులు పోటీపడ్తారు. కాబట్టి నీవు మళ్లీ పెళ్లాడి సంసార సుఖం అనుభవిస్తావనుకుంటా. ఇదంతా సరే కానీ, నీవు ఏకపత్నీవ్రత దీక్ష వున్నవాడివి కదా! పట్టిన వ్రతం విడువవే! నీ మీద అనురాగమున్న నన్ను ఇక్కడే చావమని చెప్పి, వ్రతభంగం చేసుకుని, మాట తప్పుతావా? అలా చేయక పోతే, నేను నీ సుఖం కూడా చెడగొట్టిన దాన్నవుతాను కదా! తాను చెడి, భర్తను చెడగొట్టే నా వంటి నిర్భాగ్యురాలు లోకంలో వుంటుందా?"

"ఎంతటి పాపాత్ములైనా, నీ మీద కొంచెం మనసుంచితే శుభం కలుగుతుంది కదా! అట్లయితే, చిరకాలం నుండీ దృఢంగా నీ మీదే మనస్సు నిల్పిన దాన్నికదా నేను. ఎందుకీ విధంగా నశిస్తున్నాను? ఇది నీ దోషం కాదు, నాదే! ఎందుకంటే, నేను నియమం తప్పకుండా చేసిన వ్రతాలన్నీ, పుణ్యం కొంచెమే చేసుకున్న దాన్నైనందున, వ్యర్థమై పోయాయి. ఏ మాత్రం అదృష్టమున్న దాన్నైనా, ఇతరుల్లాగా, నిన్నాశ్రయించిన నేను కూడా బాగుపడకపోయానా? నా దుర్దశకు నేనే కారణం, నీవు కానేకాదు"

"రామచంద్రా! నీవు అయోధ్యకు వెళ్లి, సుఖపడతావో, దుఃఖపడతావో కాని, దుఃఖపడకుండా, సుఖపడటానికి, నేను మాత్రం ఏమీ చేయలేని పరిస్థితి నాది. ఇట్టిదాన్ని జీవించి ప్రయోజనం లేదు. ప్రాణం తీసుకుందామంటే, విషమో, కత్తో కావాలికదా! నేనవి ఎక్కడనుండి తేవాలి? ఈ రావణుడింట్లో ఎవరైనా నామీద ద్వేషంతో కానీ, దయతోకానీ, ఇంత విషమో, పదునైన కత్తో ఇచ్చేవారుంటే బాగుంటుంది. ఇస్తే వెంటనే ప్రాణం, తీసుకోవచ్చే!" అని భర్తను నానా విధాలుగా తలచుకుంటూ, దుఃఖంతో కలవరపడ్తూ, నోరు తెరచి, నోరెండేదాకా ఏడుస్తుంది సీత. ఇక బ్రతికి ప్రయోజనం లేదని, పూచిన చెట్టు మొదట్లోకి పోయి, జడచేతుల్లోకి తీసుకుని, ఉరిపోసుకుందామన్న అభిప్రాయానికి వస్తుంది సీత.

ఉరిపోసుకోవటానికి అనుకూలమైన కొమ్మను చేతిలో పట్టుకుని, తన వంశాన్నీ, రామలక్ష్మణులను, స్మరిస్తూ, ఉరిపోసుకుండే ప్రయత్నంలో వుండగా, శోకాన్ని నశింపచేసి, ధైర్యం కలిగించే, శుభ శకునాలు మునుపటి లాగానే కనిపిస్తాయి సీతాదేవికి.

❖ ❖ ❖

సర్గ-29

మరణించే ప్రయత్నం చేస్తున్న సీతాదేవికి కలిగిన శుభ శకునాలు

మాటల్లో చెప్పలేనంతగా బాధపడ్తూ, సంతోషమనేది లేక, శోకపూరిత మనసుతో, పరమవ్రతం విడువని, సీతాదేవికి ధనవంతుడిని చేరే సేవకుల్లాగా శుభశకునాలు కనపడ సాగాయి. (ఈ శుభశకునాలు, సాక్షాత్తు లక్ష్మీదేవైన సీతాదేవిని ఆశ్రయించి, ఆమెకు వుపకరించినందువల్లే శుభశకునాలని పేరుతెచ్చుకున్నాయట). శోభాయమానమై, వంకరవెంట్రుకలతో ఆవరించబడి, తెల్లగా, విశాలంగా, నల్లని గుడ్లతో, ఎర్రటి అంచుకాంతితో వున్న సీతాదేవి ఎడమకన్ను చేప తాకిన పద్మంలాగా అదిరింది. మృదువైన, మనోహరమైన, బలసిన, గుండ్రని చందన, అగరు పూతకు అర్హమైన, లోకాధినాధుడగు శ్రీరామచంద్రమూర్తిని చేపట్టిన, ఆమె ఎడమ చేయి అంతకంటే కూడా ఎక్కువగా అదిరింది. (స్త్రీలకు ఎడమకన్ను, భుజం, తొడ అదిరితే శుభం. పురుషులకు కుడివైపున అదిరితే శుభం కలుగుతుందని ఇంతకు ముందే చెప్పుకున్నాం).

ఏనుగు తొండంతో సమానంగా, అందంగా, బలిసున్న ఆమె తొడలు జోడించి నడిస్తే, నడుమనున్న ఎడం కనిపించిందట. అందులోనూ ఎడమతొడ, రామచంద్రమూర్తిని ఎప్పుడు చూస్తానా అనుకుంటున్న సీతకు నేను చూపిస్తానన్నట్లుగా అదిరింది. (సీత ఎడమకన్ను, ఎడమచేయి, ఎడమతొడ అదిరిందంటే సరిపోతుందికదా! ఈ వర్ణన ఎందుకని పాఠకులనుకోవచ్చు. ఇది వ్యర్థమైన వర్ణనకాదు. లోకంలో స్త్రీలకున్న అంగవైకల్యం వారి దుఃఖ కారణమౌతుంది. అలాంటి ఏ విధమైన అంగవైకల్యం ఈమెలో రవ్వంత అయినా లేవు. మరెందుకు దుఃఖిస్తున్నదని ప్రశ్నిస్తే, అది ఆమె స్వయంగా కోరి తెచ్చుకున్నదేనన్న సమాధానం దొరుకుతుంది. కాల్తున్న ఇంట్లో చొరబడి, దాంట్లో చిక్కుకున్న వారిని రక్షించే ప్రయత్నం చేసేవారిలాగా, రావణుడి చెరలో వున్నవారిని రక్షించదలచి, ఆమె కూడా ఆ చెరలో ప్రవేశించింది. కాని

కర్మానుభవం కొరకు కాదు. ఈ విషయాలు తెలియ చేసేందుకే ఈ అవయవ వర్ణన చేయడం జరిగింది)

అందంగా దానిమ్మ గింజల్లా వున్న పళ్లు, చక్కటి కళ్లు, తామరాకుల వంటి ముఖమున్న సీతాదేవి కట్టుకున్న పచ్చని కాంతిగల మాసిన చీరె, సన్నగా వదులై జారింది. ఈ శకునాల గురించి వివరంగా తెలిసిన సీతాదేవి, ఎండకెండి, నేలలో పడి వున్న విత్తనం గింజ వానపడగానే మొలకెత్తినట్లు సంతోషపడింది. దొండపండు లాంటి పెదవి, తుమ్మెదల్లాంటి ముంగురులు, చక్కటి కనుబొమలు, తామర రేకుల్లాంటి కళ్లు, తెల్లటి పళ్లున్న సీతాదేవి ముఖం, ఈ శుభ శకునాలను గని, రాహువు విడిచిన చంద్రుడిలాగ ప్రకాశించింది. (సాముద్రిక శాస్త్రంలో చెప్పబడిన ఉత్తమ స్త్రీ లక్షణాలన్నీ సీతాదేవిలో వున్నాయి).

ఇలాంటి శుభశకునాలు కన్న సీతాదేవి శోకం వదలి, సంతోషించి, చంద్రుడున్న రాత్రిలాగా ప్రకాశించసాగింది. అంటే భర్తతో గూడిన సంతోషం కలిగింది. **(చంద్రుడు రాత్రి వేళే కనిపిస్తాడు కనుక రాత్రికి ప్రతి చంద్రుడు. రాత్రి చంద్రుడితో తేజరిల్లు తున్నట్లుంటుంది. అంటే, రాత్రీ చంద్రులూ కలిసినట్లే, సీత కూడా త్వరలో రాముడిని కలియబోతోందని సూచన)**

❖ ❖ ❖

సర్గ-30

సీతాదేవితో మాట్లాడడం ఎలా అని ఆలోచిస్తున్న హనుమ

సీతాదేవి ఏడుస్తూ అన్న మాటలను, రాక్షసస్త్రీల బెదిరింపు మాటలను, త్రిజట చెప్పిన స్వప్న వృత్తాంతాన్ని విన్న హనుమంతుడు, ఈమె దేవలోకంలోని నందనవనంలో వుండాల్సిన స్త్రీ గాని, మనుష్య స్త్రీ కాదని తలుస్తాడు. హనుమంతుడు (ఆచార్యుడు) తాను చూస్తున్న స్త్రీ, సీతాదేవేనని (శిష్యుడు) నిశ్చయించుకోవడానికి, స్వతంత్ర, పరోక్ష, ప్రత్యక్ష, పరస్పర సంబంధం లేని, సాక్ష్యాలు ఆధారంగా చేసుకుంటాడు. ప్రత్యక్ష సాక్ష్యం, శరీరం పైన కనిపించిన సాముద్రిక చిహ్నాలు. సాముద్రిక శాస్త్రంలో చెప్పబడిన ఉత్తమ స్త్రీ, లక్షణాలన్నీ ఆమెలో వున్నాయనుకొంటాడు. ఇన్ని విధాలైన ప్రత్యక్ష, పరోక్ష నిదర్శనాల వల్ల, ఈమే సీతనీ, రామచంద్రమూర్తి సందేశం వినే అర్హత ఈమెకే వుందనీ, హనుమంతుడు తీర్మానించుకుంటాడు. అదేవిధంగా "ఆచార్యుడు" కూడా, తన శిష్యుడిగా స్వీకరించదలచిన వాడిని, ప్రత్యక్ష, పరోక్ష నిదర్శనాల ద్వారా, భగవత్తత్వ రహస్యం ఉపదేశించడానికి అర్హుడా, కాడా? అని పరీక్షించాలని దీనర్థం).

ఇలా అనేక కోణాల్లోంచి చూసి, అనేకవిధాల ఆలోచించి, వానర లోకమంతా ఏ స్త్రీ కొరకై వెతుకుతున్నదో, ఆమెను నేనిక్కడ చూసాననుకుంటాడు హనుమంతుడు. వేగులవాడి లాగా, ఉపాయంతో, చేయతలపెట్టిన కార్యాన్ని చేయడమే కాకుండా, శత్రువుల బలాబలాలు తెలుసుకునే సమర్థతున్న తాను లంకంతా తిరిగి, రాక్షసుల బలాల తారతమ్య విశేషాలు, రావణుడి బలం, లంకా నగర లక్షణం కూడా తెలుసుకున్నాననుకుంటాడు. ఇంతవరకు సుగ్రీవుడు అప్పగించిన పని సాధించిన హనుమంతుడు, ఇక శ్రీరాముడు చెప్పిన కార్యసాధన గురించి ఇలా ఆలోచించసాగాడు. (సీతాన్వేషణ బహిరంగంగా చేయకుండా దొంగ లాగా వెతకడం పౌరష విరుద్ధమని కొందరు వాదిస్తారు. ఇతరులు మనపట్ల ఎలా ప్రవర్తిస్తారో, వారి విషయంలో అలానే ప్రవర్తిస్తే ధర్మ హాని లేదని భీష్మవాక్యం తెలుపుతుంది. మాయలమారిని మాయ చేతనే

ఎదుర్కోవాలి. చోరునివలె వంచనతో సీతను ఎత్తుకునిపోయిన రావణుడి విషయంలో వంచన చేయడం ధర్మ విరుద్ధం కాదు.)

"రావణుడిని గురించి తెలుసుకోవాల్సిన విషయాలన్నీ తెలుసుకున్నాను. పతిని చూసే ఆసక్తిగల రామచంద్రమూర్తి దేవిని కల్సి, ఆమెకు భర్త యోగక్షేమాలు తెలిపి, ధైర్యం చెప్పడమే మేలైన పని. అట్లా చేయకుండా వెనుతిరిగిపోతే, ఆమె దుఃఖాన్ని పోగొట్టుకోక, ఇంకా అందులోనే మునిగితేలుతుంటుంది. ఈమె ఎన్నో సుఖాలను అనుభవించాల్సిందేకాని, ఇలా వుండాల్సిందికాదు. ఈమెకు ధైర్యం చెప్పి, ఈమె దుఃఖాన్ని నివారించడం నా ప్రధమ కర్తవ్యం. ఈమెను వూరడించకపోతే అనర్థం కూడా జరుగుతుంది. కీర్తికి అర్హురాలైన ఈమె, తన్ను తాను రక్షించుకోలేక మరణిస్తుంది. మహాబలశాలి రామచంద్రమూర్తి సీతను ఎప్పుడు చూస్తానా అని ఆసక్తితో వున్నాడక్కడ వనంలో. ఆయన మాటలు ఈమెకు చెప్పి, ఓదార్చి, ఈమెచెప్పే మాటలు ఆయనకూ చెప్పి ఆయన్ను కూడా ఓదార్చాలి. ఇదే సరైన మార్గం." అనుకుంటాడు హనుమంతుడు.

శ్రీరాముడి వృత్తాంతం సీతకు చెప్పదలచుకున్న హనుమ

"శ్రీరాముడి వృత్తాంతం ఈమెకు చెప్పడం ఆవశ్యకమే అయినా, ఎలా చెప్పాలి? నేను చెప్తున్న మాటలు రాక్షసులు వినకూడదు. వింటే ఇప్పుడే పోయి రావణుడికి చెప్తారు. వాడు బయలుదేరి వస్తాడు వెంటనే. కార్యభంగ మవుతుంది. వీళ్లకు తెలియకుండా సీతాదేవితో మాట్లాడాలి. ఉదయం అయ్యే లోపల మాట్లాడకపోతే, ఆమె ప్రాణాలు విడుస్తుందేమో! అంతేకాదు, రాముడి దగ్గరకు పోగానే: సీతను చూసావా హనుమంతా? ఉంగరమిచ్చావా? చూసి ఏమంది? అని ఆయన అడగక మానడు. అడిగితే ఏమని చెప్పాలి? చూసి రమ్మన్నావు కాబట్టి చూసి వచ్చాను, మాట్లాడలేదని చెప్పాలా? ఉంగరం ఏం చేసావంటే పెట్టుకున్నానని చెప్పడం నాకు తగిందేనా? అట్లా చెప్పొచ్చా? సీతాదేవి ఏం చెప్పిందో తెలుసుకోకుండా, రాముడిని చూడబోతే, ఆయన కోపజ్వాలలో నన్ను భస్మం చేయడా? పోయి, చూసి, మాట్లాడకుండా వచ్చావని, కోప్పడడా? సీతాదేవిని చూసి రమ్మన్నావు కనుక చూసివచ్చానంటే, కోతి

కింతకంటే ఎక్కువ తెలివితేటలెందుకుంటాయని నన్నేమనడనుకుందాం. నా మాటలు నమ్మి, వానరులందరు ఇక్కడకు వచ్చేసరికి, సీతాదేవి మరణించి వుంటే, వారి రాక వ్యర్థం కాదా! కాబట్టి అవకాశం చూసి, సీతాదేవిని ఓదార్చిపోవడమే మంచిది. ఎట్లాజరగాలది? నేను చిన్న ఆకారంలో వున్నాను. దాన్నిప్పుడు పెంచొద్దు. కోతినైన నేను మనుష్యులలా సంస్కృతం మాట్లాడవచ్చా? బ్రాహ్మణుడిలాగా సంస్కృతం మాట్లాడితే, నన్ను రావణుడిగా అనుమానించి అసలే మాట్లాడదేమో!"

"మాట్లాడకుండా వూరుకుంటే, ఓదార్చాల్సిన ఆమెను ఎలా ఓదార్చాలి? మాట్లాడాలంటే, ఎలా, ఏమి మాట్లాడాలి? వేరే మార్గం లేదు. ఈమెకు తెలిసిన ప్రాకృతభాషలోనే మాట్లాడుతా. ఈ భాష రాక్షసులకు తెలియదు. వారికర్థం కాదు. ప్రాకృతం మాట్లాడాలంటే కోతి ఆకారంలో ఎట్లావీలవుతుంది? సీత ఇది రాక్షసుల పనేననుకుని, మరెక్కువ భయపడుతుందేమో! భయపడి రావణుడే వచ్చాడనుకుని అరుస్తుందేమో! ఆ అరుపు విన్న రాక్షస స్త్రీలు, నన్ను చూసి చంపడమో, కట్టిపడేసి రావణుడి వద్దకు తీసుకుపోవడమో జరుగుతుంది. పోనీ, కొమ్మో-రెమ్మో పట్టుకుని పారిపోతే, నా భయంకర రూపాన్ని చూసి, రావణుడింటివద్ద కాపలా వున్న రాక్షసులను పిలుచుకొస్తారు. వాళ్లు కత్తులు-కటార్లు-శూలాలతో వచ్చి, గుంపుగా నామీద పడ్తే, నాకూ కోపం వస్తుంది. ఇలావచ్చిన రాక్షసులను అందరినీ చంపుకుంటూ పోతే, సముద్రం దాటి తిరిగిపోవడమెట్లా? వాళ్లే గెలిచి నన్ను పట్టుకుంటే, సీతకు, శ్రీరాముడి వార్త చెప్పేవారుండరు. నేను చిక్కిపోతా. సీతను రాక్షసులు చంపుతారు."

"ఇలా జరిగితే రామసుగ్రీవులు అనుకున్న పని చెడిపోతుంది. సీతను చంపకపోయినా, జాడ తెలియకుండా ఏ రహస్య ప్రదేశంలోనో దాచిపెట్తారు. ఆ బాధలు పడలేక ఆమె చనిపోవచ్చు. యుద్ధంలో రాక్షసులు నన్ను చంపినా, కోపంతో కట్టిపడేసినా, రామకార్యం చేయగలవాడెవరూ లేరు. నూరు యోజనాల సముద్రాన్ని దాటగల వానరుడెవడూ లేడు. ఎంతమంది రాక్షసులనైనా, భుజబలంతో యుద్ధంలో గెలుస్తాను కాని, బడలికవల్ల సముద్రాన్ని మళ్లీ దాటలేను. యుద్ధంలో జయాపజయాలు నిర్ధారించలేం కూడా! కాబట్టి

సందేహానికి తావిచ్చే పనులేవీ చేయరాదు. మేలైన పనిని, బుద్ధిమంతుడైనవాడు ఆలోచించకుండా చేస్తే, అది మేలుచేస్తుందా, కీడు చేస్తుందా, అనేది సందేహమే! అలాంటి సాహసం చేస్తే, నీతిమాలిన వాడని లోకులు నిందిస్తారు. రాక్షసులకు భయపడి పలకరించకుండా పోతే, అదే రాక్షసులకు భయపడి సీత మరణించడం ఖాయం. పలుకరిస్తే కీడు కలుగుతుందేమో? ఎట్లా చేస్తే కార్యం చెడదు, ఎట్లా ప్రవర్తిస్తే సముద్రం దాటడం వ్యర్థం కాదు, ఎలా చెప్పితే సీత నామాటలు చక్కగా వింటుంది, నన్ను చూడగానే సీత భయపడకుండా ఎట్లా వుంటుంది?"

ఇలా పరిపరి విధాల ఆలోచించిన హనుమంతుడు, బుద్ధిమంతుడు కనుక, సరైన నిర్ణయానికొస్తాడు. తన్ను చూస్తేనే కదా సీత భయపడేది అనుకుంటాడు. కనిపించకుండా, కొమ్మల్లో దాక్కుని, సీత భయపడకుండా, రామచంద్రమూర్తిని, ధర్మంతో కూడిన, శుభాన్నిచ్చే, తియ్యటి మాటల్తో పొగిడి, ఆమె నమ్మేటట్లు చేస్తే మంచిదని భావిస్తాడు. తన మాటలను ఆమె ఎంతవరకు నమ్ముతుందో చూసిన తర్వాతనే, ముందు-ముందు ఏమి చేయాలనో నిర్ణయించుకోవచ్చు అనుకుంటాడు. దీనివల్ల నష్టమేమీ లేదని నిశ్చయించుకుని, హనుమంతుడు, ఆమెను చూస్తూ, ఆమె మాత్రమే వినేటట్లు, చెట్టు చాటు నుండి, తియ్యగా మాట్లాడసాగాడు.

❖ ❖ ❖

సర్గ-31

సీతాదేవి వినేవిధంగా శ్రీరాముడిని కీర్తించిన హనుమంతుడు

దశరథుడి పేరు స్మరించే వారెవ్వరూ లంకలో వుండరు కాబట్టీ, ఆ ప్రస్తావన వచ్చినా కీర్తించే వారెవరూ లేరు కాబట్టీ, దశరథుడితో మొదలెట్టి ఆయన ఉదార కీర్తిని గురించిన మాటలు సీతచెవిలో పడేటట్లు చేసి, ఆమె మనస్సును ఆకర్షిస్తాడు హనుమంతుడు. ఈ విధంగా సీతాదేవి మనస్సును తనవైపు లాక్కొని, ఆ తర్వాత ఇంకేమి చెప్తాడో విందామన్న ఆసక్తి ఆమెలో కలిగిస్తాడు హనుమంతుడు. పరేంగిత జ్ఞాగా హనుమంతుడు సాక్షాత్కరిస్తాడు. ఇలా కొనసాగితుంది ఆయన ప్రశంస:

"దశరథుడనే మహారాజు, మహాదాతనే కీర్తి తెచ్చుకున్నాడు. ఆయనకు చతురంగ బలసైన్యం, ధర్మస్వభావం వున్నాయి. సుగుణ సంపత్తి కలిగిన లోక పూజ్యుడు. రాజర్షులందరిలోనూ శ్రేష్టుడు. చక్రవర్తుల వంశంలో పుట్టాడు. తపస్సులో ఋషులకు, బలంలో ఇంద్రుడికి సమానుడు. దయాశీలి. ఇక్ష్వాకు వంశంలో పుట్టిన వాళ్లందరిలో శ్రేష్టుడు. సత్యపరాక్రముడు. అహింసా ప్రియుడు. గొప్ప రాజులకుండే శుభ లక్షణాలున్నవాడు. చక్కని నడవడి కలిగి, నాలుగు సముద్రాల నడుమనున్న భూమిని ఏలినవాడు. ఒకరిని సుఖపెట్టి తానూ సుఖపడే వాడు. ప్రభువులందరికీ ప్రభువైనవాడు."

(ఇలా ఎవరో తన మామగారిని పొగడ్తున్న మాటలు విన్న సీతాదేవి ఇంకేమి వినపడ్తుందో అని ఆలకించింది ఆసక్తిగా)

"గొప్ప మనసున్న ఆ దశరథ మహారాజు పెద్దకొడుకే శ్రీరామచంద్రుడు. చంద్రుడిలాంటి ముఖమున్న కారణాన అందరికీ ప్రియుడైనాడు. తన్ను ఆశ్రయించిన వారిని, వారినాశ్రయించిన వారినీ, రక్షించే సమర్ధుడు. స్వధర్మ రక్షణ అంటే ఇష్టపడేవాడు. విల్లుపట్టే వారిలో మేటి. అన్ని విషయాలలో పరిపూర్ణ వ్యక్తిత్వమున్నవాడు. సర్వజ్ఞత్వ, సర్వశక్తిమత్వ, సర్వసంహారకత్వ సర్వరక్షకత్వాది గుణాల్లో ఏ లోపమూ లేనివాడు. చెడ్డవారికి, పగవారికి భయం కలిగిస్తాడు. నిర్మలమైన తన వంశాచార ధర్మాన్ని రక్షించేవాడు".

(ఎవరో తన మగడిపేరు చెప్పుతున్నారే అని, ఇంకా ఏంచెప్తారో విందామని, మరింత ఆసక్తిగా మనస్సు పెట్టి వినసాగింది సీత)

"పాపరహితుడైన ఆ శ్రీరాముడు సత్యసంధుడు. ముసలివాడైన తండ్రి ఆజ్ఞప్రకారం, తమ్ముడు, భార్య తోడురాగా అడవులకెళ్లాడు. ఆయన కామరూపులైన దుష్ట రాక్షసులను, ఖరదూషణాదులను, ఇంకా అనేకమందిని చంపాడు. జనస్థానంలో వున్నవారిలా చావడం భరించలేని రావణుడు, మాయలేడి నెపంతో, మోసంచేసి, శ్రీరాముడి భార్యను అపహరించాడు. ఆమెను వెతుకుతూ వచ్చిన రామలక్ష్మణులు వానర రాజైన సుగ్రీవుడితో స్నేహం చేసారు. తన స్నేహితుడైన సుగ్రీవుడి కోరికపై, వాలిని చంపి, రాజ్యాన్ని ఆయన కప్పగించాడు రాముడు. సీతాదేవిని వెతికేటందుకు, సుగ్రీవుడు పంపిన, పరాక్రమమవంతులు, కామరూపులైన వానరులనేకమంది అన్నిదిక్కుల్లో గాలిస్తున్నారామెకొరకు. అలాంటివారిలో ఒకడినైన నేను, జటాయువు సోదరుడు సంపాతి సలహామేరకు, ఆయన మాటలు నమ్మి, నూరామడల పొడవున్న సముద్రాన్ని దాటి లంకకొచ్చాను. సీతాదేవిని ఇక్కడ వెతుకుతున్న నాకు, నా పూర్వ పుణ్యఫలం వల్ల, శ్రీరాముడు చెప్పిన ఆకారం, వర్ణన, కాంతి, గుణం, సౌందర్యం వున్న పతివ్రత కనిపించింది.

ఇలా హనుమంతుడు అంటున్న మాటలను విన్న సీతాదేవి, ఆశ్చర్యపడి, కుటిలాలకాలను సవరించుకుంటూ తలపైకెత్తి, ఎవరీ మాటలు చెప్పుతున్నారా అని చెట్టువైపు చూసింది. ఇదేమన్నా రావణుడి మాయేమో అనుకుని, భయం, భయంగా, రాముడిని స్మరించుకుంటూ, చెట్టు కింద, మీద, ప్రక్కన, సందుల్లో చూడసాగింది సీత. **(మృతసంజీవనం రామచరితం అని ఆర్యోక్తి. అంటే, చనిపోయేవారిని బ్రతికించేది రామమంత్రమట. ఆత్మహత్యకు సిద్ధపడిన సీతమ్మకు హనుమంతుడు చేసిన రామగుణగానం జీవితంపైన ఆశలు చిగురింప చేసింది. సీతమ్మకు ఊపిరులూదింది. మరొక చమత్కారం కూడా వుంది. రామ కథని వివరించే సందర్భంలో కైక మాటను ప్రస్తావించకుండా, తండ్రి ఆజ్ఞ పైనే రాముడు అడవికి వచ్చాడని హనుమంతుడు పలకడం అతని వాగ్విదాంవరత్వానికి శుభ ప్రతీక కద!).**

❖ ❖ ❖

సర్గ-32

హనుమంతుడిని చూసి భయపడిన సీతాదేవి

రామనామస్మరణ చేస్తూ, చూస్తున్న సీతాదేవికి, చెట్టుకొమ్మల్లో కనిపించింది ఒక కోతి. ఆమె కంటికి ఆ కోటి, తూరుపు కొండపై అప్పుడే ఉదయించీ, ఉదయించకున్న సూర్యుడిలా, తెల్లటి వస్త్రాలు ధరించి ప్రియవాక్కులు పలుకుతున్న వాడిలా, మెరుగైన పింగళ వర్ణం కలవాడిలా, అశోక పుష్పాలరాశిని బోలిన ఎర్రటిముఖం కలవాడిలా, అద్భుత పరాక్రమవంతుడిలా, పచ్చనికళ్లు కలవాడిలా కనిపించింది. **(సూర్యబింబం కనిపించీ, కనిపించని సమయమయిందన్న సూచన, రామచంద్రమూర్తనే సూర్య దర్శనం త్వరలో జరగబోతున్నదన్న సూచనా ఇందులో ధ్వనిస్తాయి)**

కోతిని చూడగానే ఒళ్లు జలదరించింది సీతకు. భయంకరమైన కోతి రూపాన్ని చూసిన తనకేం కీడు జరగబోతున్నదో అని భయపడింది సీత. శోకంతో, రామలక్ష్మణులను స్మరించి మెల్లగా ఏడ్చింది సీత. అయితే తాను చూసింది, సుగ్రీవుడి మంత్రుల్లో శ్రేష్టుడూ, ఆయన బంటుగా వచ్చినవాడూ, బుద్ధిమంతుడూ, వాయుకుమారుడూ, భయంకర భీమరూపం కలిగిన హనుమంతుడనే విషయం ఆమెకు తెలియదు. మనోవేదనతో దుఃఖిస్తున్న సీత, వినయవంతుడుగా వున్న హనుమంతుడిని చూసి, ఇది కలేమో అనుకుని, స్మృతి తప్పి, శవంలా అయిపోయి, తిరిగి తెలివి తెచ్చుకుని, తనలో తనే అనుకుంటుందీ విధంగా:

"కలలో కోతిని చూస్తే కీడంటారు. నేను కోతినికలగన్నాను. కీడు కలగనున్నదేమో! రామలక్ష్మణులకు మేలు కలుగుగాక! మా తండ్రి జనకమహారాజు కుశలంగా వుండుగాక! అయినా ఇది కలగాదే! నిద్రరాని నాకు కలలెలా వస్తాయి? అసలు దుఃఖంతో బాధపట్టున్న నాకు నిద్ర ఎలా వస్తుంది? సుఖమెక్కడనుండి వస్తుంది? నిద్రలేనందున కల కాదిది. రామదూత ఇంత సముద్రాన్ని దాటి రావణుడి అంతఃపురానికి రావటమనేది నమ్మరాని విషయం. అంటే, ఇది నిజం కాదు. బహుశా నేనెప్పుడూ రామనామ స్మరణే

చేస్తున్నందువల్ల, ఆయన్ను గురించిన మాటలే వినవస్తుండవచ్చు. ఇదే వాస్తవం. రామచంద్రమూర్తిపైనే మనస్సు నిలిపి, దుఃఖంతో పరితపిస్తున్న నాకు, వేరే ఆలోచన లేకపోవడంతో, నేనేదిచూసినా, ఎందు చూసినా, రాముడి స్వరూపమే కనబడుతుండవచ్చు. ఆయన కథలే వినపడుతుండవచ్చు. నా మోహమే ఒక కోతి రూపంలో పలుకుతున్నదేమో! ఈ ఆలోచనా సరైంది కాదేమో! మనస్సుకు రూపం వుండదు కదా! ఈ కోతి స్పష్టంగా రూపంతో కనిపిస్తున్నదే! ప్రత్యక్షంగా కనపడుతూ, నన్ను చూసి మాట్లాడుతుంటే, ఇది మాయ ఎట్లా అవుతుంది? ఇది వాస్తవమయ్యుండాలి".

ఇలా అనుకుని, తాను చూసింది వాస్తవంగా కోతేనని నిశ్చయించు కుంటుంది. రెండు చేతులు జోడించి, బ్రహ్మకు, అగ్నికి, బృహస్పతికి, నమస్కరించుతుంది. కోతి చెప్పిన మాటలన్నీ నిజం కావాలని, భిన్నంగా జరుగవద్దని కోరుకుంటుంది. సీతాదేవి మనస్సుకు తాను నిజమైన కోతేనన్న నమ్మకం కుదిరిందనీ, పూర్తిగా నమ్మకం ఇంకా కుదరలేదని భావిస్తాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-33

సీతాదేవితో సంభాషించిన హనుమంతుడు

తనమీద సీతకు కొంత విశ్వాసం కలిగిందన్న నమ్మకంతో, హనుమంతుడు పై కొమ్మ నుండి కింది కొమ్మకు దిగుతాడు. వినయవంతుడి వేషంలోనే వుండి, రెండు చేతులు జోడించి, శిరస్సు వంచుకుని, వినయంతో, తియ్యనిమాటలతో ఇలా అంటాడు సీతతో: "అమ్మా పతివ్రతారత్నమా! నా ప్రార్థన విని నన్నునుగ్రహించి నువ్వెవరివో, ఎందుకిట్లా మాసిన పట్టువస్త్రం కట్టుకుని, కొమ్మను పట్టుకుని, నిలబడి వున్నావో చెప్పు తల్లీ? తామర రేకులనుండి నీళ్లు పడుతున్నట్లే, నీ కళ్ల నుండి నీ రెందుకు కారుతున్నది? నీవు కిన్నెర స్త్రీవా? వసువుల, రుద్రుల భార్యవా? పన్నగ స్త్రీవా? దేవతా స్త్రీవా? యక్ష కాంతవా? చంద్రుడుని విడిచి నేలరాలిన రోహిణివా? నీ శుభ లక్షణాలు చూస్తుంటే, నీవు మనుష్య స్త్రీవి కావనీ, దేవతా స్త్రీవనీ అనుకుంటాను. పోనీ, కోపంతోనో, మోహంతోనో, భూమి మీద తిరగటానికి వశిష్టుడిని విడిచివచ్చిన అరుంధతివి కావుకదా?"

"అమ్మా! ఎక్కడ నుండి నీవిక్కడకు వచ్చావు? ఎందుకు దుఃఖిస్తున్నావు? నీ తండ్రి ఎవరు? తోడబుట్టిన వాళ్లెవరు? భర్త ఎవరు? కొడుకెవరు? నీ రూప, గుణాలను బట్టి నీవు దేవతా స్త్రీవనుకున్నాను కాని, రాచరికపు స్త్రీలకు వుండాల్సిన లక్షణాలు, చిహ్నాలు, నీకుండడంతో, నీవు దేవతా స్త్రీవి కాదని అనిపిస్తున్నది".

(చక్రం, స్వస్తికం, వజ్రం, ధ్వజం, మత్స్యం, గొడుగు ఆకారంలాం రేఖలు పాదంలో వుంటే, రాజపత్ని అవుతుందట. కాలివేళ్ల నడిమిభాగం భూమిని తాకి వుంటే, అఖండ భోగాలు కలుగుతాయి. బొటనవేలు ఎత్తుగా, గుండ్రంగా వుంటే, అమిత సుఖాలు కలుగుతాయి. మీగాలు ఎత్తుగా, చెమటలేకుండా, నరాలు కనిపించకుండా, నున్నగా, మెత్తగా, బలిసినవిగా వుంటే రాజు భార్యవుతుంది. పిక్కలు, రోమాలు లేకుండా, నున్నగా, గుండ్రంగా, నరాలు కనిపించకుండా వుంటే రాజపత్ని అవుతుంది. తొడలు దృడంగా ఏనుగు

తొండాల్లా, నున్నగా, లావుగా, గుండ్రంగా, వెంట్రుకలు లేకుండా వుంటే రాజపత్ని అవుతుంది. ఇలా ఆమెకున్న అనేక చిహ్నాల వల్ల సీత రాజపత్ని కావచ్చునని హనుమంతుడి నిశ్చయం)

"తల్లీ! నీవు క్షత్రియ స్త్రీవని కూడా నీ శుభ చిహ్నాలు చూసి భావిస్తున్నాను. భూమండలాన్నంతా పరిపాలించే రాజశ్రేష్టుడి పట్టపురాణివని కూడా నేను ఊహిస్తున్నాను. ఒకవేళ దండకారణ్యంలో తిరుగుతున్నప్పుడు, రావణాసురుడు బలాత్కారంగా ఎత్తుకొచ్చిన సీతవు కావుకదా! నిజం చెప్పు. మనుష్య స్త్రీలకుండని నీ అందం, దీక్షతో వున్న నీ వేషం, నీ కాంతి హీనత, ఇవన్నీ చూస్తుంటే నీవు రామచంద్రమూర్తి భార్యవన్న సందేహం కలుగుతున్నది. నా అభిప్రాయం నిజమేకద! చెప్పాలి" అని అడుగుతాడు హనుమంతుడు సీతాదేవిని. త్రిజట మాటలకు భయపడ్డ రాక్షస స్త్రీలు సీతను వదిలి ఎక్కడి వారక్కడే దూరంగా పోయారు కొంతసేపు. అందువల్లనే సీతతో మాట్లాడటానికి కొంత సమయం దొరికింది హనుమంతుడికి.

(సీతావిలాపం, ముముక్షువైన ప్రపన్నుడి విలాపం, ఒకటేనని ముందే చెప్పడం జరిగింది. సంసారం తరించే మార్గం తెలీక, నిర్వేదంతో తనను ఆశ్రయించిన జీవులను రక్షించటానికి, భగవంతుడు "ఆచార్య" లను పంపుతాడని కూడా చెప్పుకున్నాం. ఇట్టి భగవత్సహాయం, ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దేహాభిమానాన్ని పూర్తిగా వదిలిపెట్టి, తన కొరకే (భగవంతుడి) మాన, ప్రాణాలను పోగొట్టుకోటానికి సిద్ధపడే పరతంత్రులకు మాత్రమే లభిస్తుంది. స్వప్రయత్నంతో, దేహంపై ఏమాత్రం అభిమానమున్నా, ఆ సహాయం రాదు. సీతాదేవి తనను, రాక్షసులు ఏం చేసినా, చేసుకోమని చెప్పి, దేహాభిమానాన్ని విడిచి, నిద్రాహారాలు మాని, ఏకాగ్రతతో, బుద్ధి పూర్వకంగా, తన దేహాన్నీ, ప్రాణాన్నీ, రామచంద్రమూర్తికే సమర్పించాలనుకొని, నిరాశతో మరణించాలనుకొని సిద్ధపడిందో, అప్పుడే హనుమంతుడి ద్వారా "ఆచార్య" లాభ ప్రాప్తి కలిగింది).

హనుమ-సీత తొలి సంభాషణ, ఉభయ కుశలోపరి

హనుమంతుడు తన భర్తను కీర్తించినందుకు, సంతోషించిన సీత, చెట్టుపై నున్న ఆయనతో తన గురించి చెప్పసాగింది ఇలా: "కీర్తితో ప్రకాశించే రాజశ్రేష్టుడైన దశరధుడి కోడలను నేను. జనకరాజు కూతుర్ని. చంద్రబింబం లాంటి ముఖమున్న రామచంద్రుడి భార్యను. నాపేరు సీత. (స్త్రీ మొదట తన మామగారి పేరు చెప్పాలి-అలాంటి వారి కోడలిని అని చెప్పాలి. తరవాత తండ్రి పేరు, తన పేరు, ఆ తర్వాతనే భర్త పేరు చెప్పాలని పెద్దలంటారు. ఆ మర్యాదను పాటించి, ఆ క్రమంలో తన పరిచయం చేసుకున్నది సంస్కార సంపన్న అయిన సీతమ్మ) మనుష్యులనుభవించదగిన భోగ-భాగ్యాలన్నీ అనుభవిస్తూ, కోరికలను తీర్చుకుంటూ, పన్నెండు సంవత్సరాలు శ్రీరాముడింట్లో వున్నాను. పదమూడో ఏట దశరథుడు నా భర్తను రాజును చేయాలనుకున్నాడు. ఆయన్ను రాజును చేస్తే, నీళ్లు త్రాగను, తిండి తినను, ప్రాణాలు కూడా పోగొట్టుకుంటానన్నది దశరథుడి ముద్దుల భార్య కైకేయి. సత్యవర్తనుడవైన దశరథుడు తనకిచ్చిన మాటప్రకారం రామచంద్రమూర్తిని అడవులకు పంపాలని కోరుతుంది. ఆ కఠినమైన మాటలకు బాధపడ్డ దశరథుడు మూర్ఛలో మునిగి, తేలి, భార్యకేమీ సమాధానం చెప్పలేక, అయిష్టంగానే తన పెద్ద కొడుకును రాజ్యం వదిలి పొమ్మంటాడు. నా భర్తకు రాజ్యాభిషేకం కంటే, తండ్రి మాట నెరవేర్చడమే ఎక్కువ కావటాన, ఆయన మాట ప్రకారం నడుచుకో దల్చాడు. ప్రాణ రక్షణ కోసం కూడా, నా మగడు ఇతరులకు అప్రియం చేసేవాడు కాడు. మంచితనంగా ఎవ్వరేమడిగినా, ఇచ్చేవాడే కాని, ఒకరి దగ్గర ఏమీ తీసుకునే మనిషి కాదు."

"తండ్రిపై నున్న భక్తి, గౌరవాల వల్ల, సమస్త ఐశ్వర్యాలను, భోగభాగ్యాలను, వెలగల వస్త్రాలను, వదిలిపెట్టి, తక్షణమే వనవాసానికి పోవడానికి కావాల్సిన, దర్భలు, జింకచర్మాలు తెప్పించుకున్నాడు రాముడు. నన్ను తన తల్లికి అప్పగించే ప్రయత్నం చేసాడు కాని, ఆ పుణ్యాత్ముడిని వదిలుంటే, నాకు స్వర్గం కూడా రుచించదని భావించాను. అందుకే శ్రీరాముడికంటే నేనే ముందుగా, అడవులకు బయల్దేరాను. ఆయన పైనున్న భక్తివల్ల, ఆయన్ను సేవించాలని హృదయమున్న

లక్ష్మణుడు, అన్నకంటే ముందుగానే నార చీరలు కట్టాడు. (నిజానికి రాముడి తర్వాతనే లక్ష్మణుడు నార బట్టలు ధరించాడు. కానీ సీతమ్మకు లక్ష్మణుడిపైనున్న సహృదయం, వాత్సల్యంవల్ల తమకంటే లక్ష్మణుడే ముందు అరణ్యానికి సిద్ధమైనాడనీ, నారబట్టలు ధరించాడనీ అంటుంది) ఇలా మేము ముగ్గురం వనవాస దీక్ష తీసుకుని, రాజాజ్ఞ ప్రకారం భయంకరమైన అడవిలో ప్రవేశించాం. రాముడి భార్యనైన నన్ను, వంచనతో, రావణాసురుడు దొంగతనంగా ఎత్తుకొచ్చాడు. అందుకే ఇక్కడ దిక్కు లేక ఏడుస్తున్నాను. పన్నెండు నెలలు గడువిచ్చాడు వాడిమాట వింటానికి. అందులో ఇంకా రెండునెలలే మిగిలి ఉన్నాయి. ఆ గడువు ముగిస్తే చస్తాను. ఈ లోపల రామచంద్రమూర్తి రాకపోతాడా అన్న ఆశతో చావకుండా బ్రతికున్నాను".

❖ ❖ ❖

సర్గ-34

శ్రీరామలక్ష్మణుల కుశల వార్తను సీతాదేవికి చెప్పిన హనుమంతుడు

సీతాదేవి మాటలను విన్న ఆంజనేయుడు, ఆమెను ఊరడిస్తూ అన్నాడీ విధంగా: "దేవీ! రామచంద్రమూర్తి నీకోమాట చెప్పమని పంపినందువల్ల, ఆయన దూతగా నేనిక్కడకు వచ్చాను. ఆయన క్షేమమని నీతో చెప్పమన్నాడు. బ్రహ్మాస్త్రాలతో సహా, సకల అస్త్ర విద్యలు తెలిసినవాడూ, వేదార్థాలను, సర్వవిషయాలను తెలిసిన జ్ఞానీ, ధర్మశాస్త్రాలు తెలిసిన వాడూ, అయిన శ్రీరాముడు, ఎప్పుడే పని చేయాల్నో తెలిసిన వాడైనందున, నీ క్షేమ సమాచారం తెలుసుకుని రమ్మన్నాడు. శౌర్యగర్వమే ధనంగా భావించే లక్ష్మణుడు, నీభర్తకు సేవచేస్తూ, ప్రియుడై వున్నాడు. ఆయన నీకు సాష్టాంగ నమస్కారమని చెప్పమన్నాడు. వారిరువురూ కుశలం. హనుమంతుడు చెప్పిన ఈ మాటలను విన్న సీతాదేవి సంతోషపడి, తనువెల్ల పులకరిస్తుంటే ఇలా బదులు చెప్పుతుంది:

"ఆంజనేయా, బ్రతికుంటే, వందేళ్లకైనా మనిషి సంతోషం అనుభవించ వచ్చని ఓ సామెత విన్నాను. అది నిజమని అనిపిస్తున్నది. నేను ప్రాణాలు బిగపట్టుకుని బ్రతికి వుండబట్టే గదా ఈ సంతోషవార్త విన్నాను. చచ్చిపోతే ఈ భాగ్యం లేకపోయేది కదా!" శుభవార్త తెలిపిన హనుమంతుడిపై సీతాదేవికి ప్రేమకలుగుతుంది. ఒకర్నొకరు నమ్మి మాట్లాడుకోవడం ప్రారంభించారు. సీతాదేవి చెప్పిన మాటలను విన్న హనుమంతుడు, ఈమెకు తనమీద దృఢమైన నమ్మకం కుదిరిందన్న విశ్వాసంతో, ఆమెను బుజ్జగిస్తూ, ఆమె దుఃఖాన్ని అణచటానికి, కొద్ది-కొద్దిగా ఆమె దగ్గరకు పోసాగాడు. ఆయనలా దగ్గరకు వస్తుంటే, రావణాసురుడే ఈవేషంలో తనతో మాట్లాడడానికి వచ్చాడన్న భయం కలిగింది సీతాదేవికి.

హనుమంతుడిని రావణుడేమోనని శంకించిన సీత

హనుమంతుడు దగ్గరకొస్తున్న కొద్దీ, సీత తాను మోసపోయానేమో అనుకుంటుంది. రావణుడే మారువేషంలో, వచ్చాడనీ, ఇంతమాత్రం ఆలోచించక వీడితో చనువుగా మాట్లాడాననీ, రామదూతంటే ప్రేమతో నమ్మాననీ, ప్రమాదంలో పడ్డాననీ భయపడి, పట్టుకున్న చెట్టుకొమ్మను వదిలి, దుఃఖిస్తూ, నేలపై కూలబదిండి. శరీరం వణకుతూ, బాధపడుతున్న సీతను చూసి, హనుమంతుడు రెండు చేతులెత్తి నమస్కరిస్తాడు. సీతాదేవి అది చూడకుండానే, దుఃఖంతో నిట్టూర్పులు విడుస్తూ; "నువ్వెవరివో తెలిసిపోయింది. ఎందుకిట్లా దొంగ వేషం వేసుకుని, నన్ను బాధపెడ్తావు? దీనివల్ల నీకు కలిగే మేలేంటి? దండకారణ్యంలో నేనున్నప్పుడు, సన్యాసివేషంలో వచ్చిన మాయలమారివి నీవు కాదా? బలం లేనిదాన్ని, తిండి తినని దాన్ని, ఏడుస్తున్న దాన్ని, నన్నీ ప్రకారం బాధపెట్టడం నీకు తగునా? " అంటుంది. ఇలా అంటూనే ఓ పక్క తాను తప్పుగా అనుకుంటున్నానేమో అనికూడా భావిస్తుంది. ఈవిధంగా అంటుంది ఆంజనేయుడితో:

"ఒక విధంగా చూస్తే నీవు రావణుడివి కావేమోనని అనిపిస్తున్నది. ఎందుకంటే వాడిని చూస్తేనే నామనస్సు చిర-చిరలాడుతుంది. కాని నిన్ను చూస్తుంటే ప్రేమ పుట్టుకోస్తోంది. నా అంతఃకరణ నన్ను మోసం చేయదు. నీవు నిజంగా రామదూతవే అయితే నాకు ప్రియమైన ఆయన గుణాలు వర్ణించు. అలాచేస్తే నాకు అమిత సంతోషం కలుగుతుంది. రావణుడైతే రామచంద్రుడిని కీర్తించడు కదా!" **(భగవత్ గుణానుభవంలో అభిలాష వుండి, భగవద్గుణాను సంధానం చేస్తూ, శిష్యుడికి, భగవత్ గుణాలను వర్ణించి చెప్పేవాడే నిజమైన "గురువు-ఆచార్యుడు". అట్లా చేయకపోతే వారిని నమ్మకూడదు. దగ్గరకు రానీయ కూడదని దీనర్థం.)**

గొప్ప ప్రవాహ వేగానికి ఆనకట్టను గూడా ప్రవాహంలోకి ఈడ్చుకు పోయేటట్లుగా, సౌమ్యమైన హనుమంతుడి ఆకారం తన మనస్సును ఆయన వైపుకు లాగుతున్నదని అనుకుంటూనే, వేరే విధంగా అలోచిస్తుందిట్లా: "ఇదేం భ్రాంతి? ఎంత భ్రమలో పడ్డాను? రాముడెక్కడ? ఆయన దూతెక్కడ? సముద్రాన్ని

దాటి, లంక ప్రవేశించి, అంతఃపురంలోకి వచ్చి, ఈ వనంలో, ఈ మూల నేనున్న చోటుకు రావడం ఏంటి? ఇది సాధ్యం కాదు. ఇది కలకావచ్చు. స్వప్నమే నాకు నిజమైన సుఖాన్నిస్తున్నదే! ఇన్ని రోజులకు, రామదూతనంటూ, ఒక కోతికలలోకి వచ్చిందికదా! కానీ నిద్రపోతే కదా కల వచ్చేది! కలక్కూడా నా మీద కోపమా? కలలోకూడా రామలక్ష్మణులను చూడలేని దాన్ని ప్రత్యక్షంగా ఎట్లా చూస్తాను?"

"ఇది కల కాదనుకుంటా. కలలో కోతిని చూస్తే కీడు కలగాలి గాని, ఈయనను చూస్తుంటే మనస్సుకు సంతోషం కలుగుతున్నదే! పోనీ నాకేమన్న పిచ్చి పట్టిందా? పిచ్చివాడికి తాను పిచ్చివాడినని ఎట్లా తెలుస్తుంది? ఇదేమన్న ఎండమావేమో! ఎండమావిలో నీళ్లు కనిపిస్తాయికాని కోతి ఎలా కనిపిస్తుంది? కాబట్టి ఇవ్వేవీ కావు. నా స్మృతి చక్కగావుంది. కనిపించేది కోతే!" ఇలా అలోచిస్తూ: "ఇతడు రామదూతని నేను నమ్మిన తర్వాత, కాదని తెలిస్తే నాకపాయం కలుగుతుంది. నిజంగా రామదూతే అయితే, తను వచ్చినపని యధాతథంగా నాకు చెప్పే ప్రయత్నం చేస్తాడు. నేను మాట్లాడకపోతే నష్టం లేదు. నా మనస్సులో కళంకం లేదు. సందేహంతో పనిలేదు." వచ్చింది రావణుడేనన్న అనుమానంతో సీత హనుమంతుడితో మాట్లాడకుండా వూరుకుంది.

సీతాదేవి సందేహం తీర్చిన హనుమంతుడు

సీతాదేవి తనను సందేహిస్తున్నదనుకున్న హనుమంతుడు, అది పోగొట్టడానికి, తియ్యటి మాటల్తో, రామచంద్రమూర్తిని ఇలా కీర్తిస్తాడు: "రామచంద్రమూర్తి రాజుల్లో శ్రేష్ఠుడు, ప్రతాపంలో సూర్యుడు, చంద్రుడిలా ఆహ్లాదకరుడు, కుబేరుడిలా లోకమంతటికీ ప్రభువు, జగమంతా వ్యాపించిన కీర్తి గలవాడు, విష్ణుమూర్తిలాగా పరాజయం ఎరుగని శౌర్యమున్నవాడు, సౌందర్యంలో మన్మథాకారుడు, సత్యం చెప్పడంలో ప్రీతిగలవాడు, తీయటి మాటలు చెప్పడంలో బృహస్పతి, శత్రువులకు భయంకరుడు, లోకమంతా స్థిరంగా జీవించడానికి నీడనిచ్చే శ్రీకరములున్నవాడు".

ఇలాంటి గుణాలున్న శ్రీరాముడు, లేడి నెపంతో తనను దూరంగా పంపించి, సీతను ఎత్తుకుని పోయి, దుఃఖానికి గురి చేసిన, విరోధి రావణుడి జాడ తెలుసుకుని, వాడి పాపానికి తగ్గ ఫలితం అనుభవించేట్లు చేసేందుకు, రామదూతగా వచ్చానని హనుమంతుడు చెప్తాడు సీతతో. తన విషయంలో వాస్తవమైన రామదూతో, కాదోనని సందేహించవద్దంటాడు. యుద్ధంలో ప్రళయకాల రుద్రుడిలాగా, తనపదునైన బాణాలతో విజృంభించి, సీతను అపహరించాడన్న కోపంతో, రావణుడిని చంపబోతున్న ఆ శ్రీరాముడి దూతగా, ఆయన పంపగా వచ్చానని విన్నవించుకుంటాడు హనుమంతుడు. పతివ్రతా శిరోరత్నమైన సీత, తనను సందేహించవద్దనీ, తాను రావణుడిని కాననీ, మాయావిని కాదనీ, నమ్మమని మరీ–మరీ అంటాడు. ఇంకా ఇలా చెప్తాడు సీతాదేవితో:

"నీ ఎడబాటు వల్ల కలిగిన వ్యధతో, రామచంద్రమూర్తి, రేయింబగళ్లు, తనను సంతోషపెట్టిన, తామర రేకుల్లాంటి, చంద్రుడి లాంటి ముఖమున్న సీతాదేవిని చూసే ప్రాప్తం లేదని బాధపడ్తున్నాడు. నన్ను పోయి తన క్షేమం ఆమెకు చెప్పి, ఆమె క్షేమం తనకు తెలియచేయమంటే, ఆయన ఆజ్ఞ ప్రకారం, నేను బయల్దేరి వచ్చాను. నేనొచ్చేటప్పుడు, నిన్ను కన్నెత్తైనా చూడని లక్ష్మణుడు, నిండు భక్తితో, నీపాదాలకు నమస్కరించి, నీ క్షేమం కనుక్కుని రమ్మన్నాడు. తన ప్రాణదాత, అభయదాతా అయిన రామచంద్రుడిని, తండ్రిలాగా భావించే సుగ్రీవుడు, నిన్ను తల్లిలాగా తలంచి, నీ క్షేమం కనుక్కుని రమ్మన్నాడు. రామచంద్రమూర్తి నీకోసం దుఃఖిస్తున్నాడో, రాజ్యం పోయినందుకు దుఃఖిస్తున్నాడో, బంధువులకు దూరమయినందుకు దుఃఖిస్తున్నాడో, నీకెట్లా తెలుసని నన్నడిగితే, నా పాలిట శ్రీమహాలక్ష్మివైన నీతో అబద్ధం చెప్పను. ఆయన రహస్యంగా తనలో తను ఏడవలేడు. లక్ష్మణుడు, సుగ్రీవుడు దగ్గరున్నప్పుడు వారితో చెప్పుకుని ఏడుస్తుంటే, వారూ నీకై దుఃఖపడ్డారు. మా అదృష్టం వల్ల, రాక్షసుల చేతచిక్కినా, నీవు వారి చేతుల్లో చావక బ్రతికే వున్నావు. నీవే మరణించి వుంటే, మేమందరం చచ్చే వాళ్లమే! ఇక జరగబోయేది చెప్తా విను" అంటాడు హనుమంతుడు.

"త్వరలో నువ్వు రాముడిని, లక్ష్మణుడిని, సుగ్రీవుడిని లంకలో చూస్తావు. నేను మాయలమారి రావణుడిని కాను. నీకు కనిపిస్తున్న రూపమే నా అసలు రూపం. నేను కోతినే. పేరు హనుమంతుడు. సూర్యపుత్రుడు, వానరరాజు అయిన సుగ్రీవుడికి మంత్రిని. అధముడను కాను. ఇలాంటి నేను నీ కొరకై, రామాజ్ఞ ప్రకారం సముద్రాన్ని దాటాను. లంకలో ప్రవేశించాను. రావణుడి నెత్తిమీద దొంగచాటుగా కాకుండా, పరాక్రమంతో కాలుపెట్టాను. ఇదంతా చేసి నిన్ను చూడటానికి వచ్చాను. నన్ను నమ్ము. నేను నువ్వనుకుంటున్నట్లు రావణుడను కాను. సందేహం మాని, పరులతో ఎలా సంభాషించ వచ్చున్న అనుమానం లేక, నీ దాసుడైన నాతో, నీ బిడ్డతో మాట్లాడినట్లే మాట్లాడు" అంటాడు హనుమంతుడు.

రావణుడు మారువేషంతో వస్తే: రావణుడి నెత్తిపై పాదంపెట్టాననీ, రావణుడిని రాముడు చంపుతాడనీ అనడు కద!. కాబట్టి హనుమంతుడితో మాట్లాడవచ్చని నిశ్చయించుకుంటుంది సీత. అయితే రామదూతే అని నిర్ణయించుకోవడానికి, సందేహం తీరక ప్రశ్నిస్తుంది మరలా. (హనుమంతుడు ప్రత్యక్ష, పరోక్ష నిదర్శనాలతో, సీతాదేవిని పరీక్షించి (ఆచార్యుడు–శిష్యుడిని) చూసుకున్నట్లే, సీతాదేవి కూడ హనుమంతుడిని (శిష్యుడు–ఆచార్యుడిని) ప్రత్యక్షంగా పరీక్షిస్తుంది మొదలు. (అంటే శిష్యుడిని గురువు పరీక్షించినట్లే, గురువును కూడా శిష్యుడు పరీక్షించాలి. వీధిన పోయే ప్రతివాడినీ నమ్మి "ఆచార్యుడి"గా చేర రానీయకూడదు.)

❖ ❖ ❖

సర్గ-35

శ్రీరామ లక్ష్మణుల చిహ్నాలను సీతకు వివరించిన హనుమంతుడు

సందేహ నివృత్తి కొరకు హనుమంతుడిని ఈ విధంగా ప్రశ్నిస్తుంది సీత: "శ్రీరామచంద్రమూర్తికీ, నీకూ స్నేహమెలా కలిగింది? లక్ష్మణుడెట్లు తెలుసు నీకు? నరులు, వానరులు, ఒకరిని చూస్తే ఇంకొకరు బెదురుతారు కదా! ఎట్లా మీరిరువురూ ఒకచోట చేరారు? అన్నదమ్ములిద్దరికి ఎలాంటి గుర్తులున్నాయి? రాముడికీ, లక్ష్మణుడికీ తొడలెలా వుంటాయి? చేతులెట్లా వుంటాయి? నీవు నిజమైన వానరుడవే అయితే, రామదూతవే అయితే, వాస్తవం చెప్పి నన్ను మెప్పించు"

(శ్రీరామ-లక్ష్మణుల చిహ్నాలేంటని సీతాదేవి హనుమంతుడికి వేసిన ప్రశ్న ఒక విషమ ప్రశ్న. అందులో రెండు భాగాలున్నాయి. చేతుల విషయం ఎవరైనా చెప్పొచ్చు.... అందరికీ కనిపిస్తాయి కాబట్టి. "తొడలెలా వుంటాయని" కూడా అడుగుతుంది. అంటే మర్మాంగాలను గురించి ఆరా తీస్తున్నదన్న మాట. దీంట్లో గురువును పరీక్షించే తీరు కనిపిస్తుంది. జవాబు చెప్పేటప్పుడు ఔచిత్యం కనబరుస్తాడా? లేదా అని పరీక్షించ దల్చింది. దీనర్థం: "ఆచార్యుడు", భగవత్ తత్వాన్ని ఆమూలాగ్రంగా, రహస్యాలతో సహా తెలిసిన వాడై వుండాలని.)

జవాబుగా హనుమంతుడు: "దేవీ! నా అదృష్టం కొద్దీ, నేను రావణుడను కానని నమ్మి, మౌనం చాలించి, నీ భర్త గుర్తులు, లక్ష్మణుడి చిహ్నాలు, యోగ్యంగా, వాస్తవంగా చెప్పమని అడిగావు. చెపుతా విను. రామచంద్రమూర్తి కమల పత్రాక్షుడు. సర్వసత్వ మనోహరుడు. సమస్త జంతువుల మనస్సు హరించే గుణమున్నది. సౌందర్య, దాక్షిణ్యాలతో పరిపూర్ణుడై పుట్టాడు. తేజస్సులో సూర్యుడికి, ఓర్పులో భూదేవికి, బుద్ధిలో బృహస్పతికి, సమానుడు. కీర్తికి ఇంద్రుడి లాంటి వాడు. తన కులవృత్తి ధర్మాన్నే కాకుండా, లోకమందున్న వారందరి కులవృత్తి ధర్మాలను రక్షించేవాడు. మానవులకు ఏది మంచో తెలుసుకుని, దాన్ని తాను అనుసరించి, తర్వాత లోకులకు ఇట్లా చేయమని

చెప్పే గుణమున్నవాడు. రామచంద్రుడిలో కేవలం చెప్పే పాండిత్యమే కాకుండా, చేసే సామర్థ్యం కూడా వుంది. కాంతికలవాడు, సాధుపూజితుడు, తీవ్రమైన బ్రహ్మచర్య నిష్ఠ వున్నవాడు, సాధువులకు ప్రీతిపాత్రుడు, వైదిక కర్మ విధాన్నంతా ఆసాంతం పూర్తిగా తెలిసినవాడు, రాజ్యవిద్యలందు కడుసమర్థుడు, సదాచార సంపత్తి కలవాడు, అందరి ఎడలా నీతిగా ప్రవర్తించేవాడు. ఋగ్వేద సామవేద, అధర్వణవేదాలూ, వేదాంగాలైన శిక్ష, వ్యాకరణం, చందస్సు, నిరుక్తం, జ్యోతిష్యం, కల్పాలూ, యజుర్వేద, ధనుర్వేదాలూ నిపుణంగా తెలిసినవాడు”

ఇంతవరకూ చెప్పినవన్నీ ఆత్మ గుణాలనీ, దేహ గుణాలను కూడా చెప్తాననీ ఇలా వర్ణిస్తాడు: “వెడల్పైన మూపులున్నాయి, పొడవైన చేతులతో ప్రకాశిస్తుంటాడు, శంఖం లాంటి కంఠముంది, పూర్ణచంద్రుడితో సమానమైన ముఖముంది, ఎర్రటికళ్లు, గంభీర ధ్వని, బలిష్టమైన అవయవ సౌష్టవం, మెరిసే దేహకాంతి, మేఘవర్ణంలాంటి దేహవర్ఛస్సూ వుంది. ఏ అవయవం ఎంత పరిమాణంలో వుండాల్నో, అంతమాత్రమే వున్నవాడు. మరోవిధంగావున్నట్లు తెలియనివాడు. హెచ్చు తగ్గులు లేని శరీర కొలతలున్న వాడు. ఎర్రటి కనుకొనలు, గోళ్లు, అరచేతులు, అరికాళ్లున్నాయి. కనుబొమ్మలు, చేతులు, వృషణాలు, పొడుగ్గా వుంటాయి. రొమ్ము, మడికట్టు, పిడికిలి, స్థిరంగా వుంటాయి. పొత్తి కడుపు, బొడ్డు, రొమ్ము ఎత్తుగా వుంటాయి. పాదరేఖలు, తల వెంట్రుకలు, లింగం, సున్నగా వున్నవాడు. గంభీర కంఠధ్వని, నడక, లోతైన బొడ్డు కలవాడు. కంఠంపైన మూడు రేఖలున్నాయి. తలవెంట్రుకల కొనలు, వృషణాలు, మోకాళ్లు, సమానంగా వుంటాయి. చనుమొనలు, స్తనముల రేఖలు పల్లంగా వున్నాయి. సమంగా, గుండ్రంగా, విశాలంగా వున్న శిరస్సు కలవాడు. బొటనవేలు కింద మూడు వేదాలను సూచించే గీతలున్నాయి. నొసట నాలుగు రేఖలున్నాయి. అరికాలిలో, అరచేతిలో, ధ్వజం, వజ్రం, అంకుశం, శంఖం లాంటి నాలుగు రేఖలున్నవాడు. చేతులు, మోకాళ్లు, పిక్కలు, తొడలు, సమంగా వున్న బలశాలి. తొంభై ఆరంగుళాల ఎత్తుంటాడు. దొండపండులాంటి పెదవి, బలసిన చెక్కిళ్లు, పొడుగ్గా, నిక్కపొడిచిన ముక్కున్నవాడు. కనుబొమలు, ముక్కుపుటాలు, కళ్లు చెవులు, పెదవులు, చనుముక్కులు, మోచేతులు, మణికట్టు, మోకాళ్లు, వృషణాలు, కటిప్రదేశాలు

చేతులు, కాళ్లు, పిరుదులు, సమానంగా వుంటాయి. వీటన్నింటికీ తగిన చిహ్నాలున్న స్త్రీవి నీవొక్కతవే ఎట్లున్నావో, లోకంలో నీకు తగ్గట్టి ఇట్టి చిహ్నాలున్న పురుషుడు ఆయనొక్కడే!"

"నాలుగు ప్రక్కలా దంష్ట్రలు (పైపళ్ల వరుసలో రెండుప్రక్కలా, దిగువ పళ్ల వరుసలో రెండు ప్రక్కలా చేరి నాలుగు ప్రక్కలుంటాయి. అందులో ఒక్కొక్క దాంట్లో నాలుగేసి కోరల్లాంటి పళ్లున్నాయని అర్థం. ఈ రెండు వరుసలలోనూ, మధ్యనున్న నాలుగు పళ్లకు, రెండుప్రక్కలా ఒక్కొక్క "పన్ను" వుంటుంది. దాన్ని "దంష్ట్ర" అంటారు. ఇలాంటివి నాలుగు ప్రక్కలా నాలుగున్నాయని అర్థం) కలవాడు. సింహం, ఏనుగు, శార్దూలామ్, వృషభం లాగా నడుస్తాడు. వీపు, దేహం, చేతుల, కాళ్ల వ్రేళ్లు, చేతులు, ముక్కు, కళ్లు, చెవులు, లింగం నిడుపులుగా వున్నవాడు. చేతులు, వ్రేళ్లు, తొడలు, పిక్కలు, ఎనిమిది నిడుపులగు వాడు. కళ్లు, దంతాలు, చర్మం, పాదాలు, వెంట్రుకలు, మెరుస్తుంటాయి. ముఖం, కళ్లు, నోరు, నాలుక, పెదవులు, దవడలు, చన్నులు, గోళ్లు, చేతులు, కాళ్లు, పద్మాలవలె గుండ్రంగా వుంటాయి. శిరం, నొసలు, చెవులు, కంఠం, రొమ్ము, హృదయం, కడుపు, చేతులు, కాళ్లు, పిరుదులు, పెద్దవిగా వున్నవాడు. వ్రేళ్ల గణుపులు, తలవెంట్రుకలు, శరీరంపై వెంట్రుకలు, చర్మం, లింగం, మీసంలోని వెంట్రుకలు, సూక్ష్మ బుద్ధి, సూక్ష్మ దృష్టి, సూక్ష్మంగా వున్నవాడు".

(సీతమ్మ రాముడి తొడలు ఎలా వుంటాయనీ, లక్ష్మణుడి తొడలు ఎలా వుంటాయనీ అడగటమేమిటి? తప్పుకద! అలా అనిపించడం సహజం. విశేషించి పరపురుషుడిని, అందునా పరిచయం లేనివాడిని అడగటమంటే, ఇదొక పరీక్ష హనుమంతుడికి. ఆమెకు రామలక్ష్మణుల స్వరూపం తెలుసు. కాబట్టి అడిగింది. హనుమంతుడు చెప్పేదానిలో ఆ వివరాలు సరిపోతే ఆమె నమ్మగలుగుతుంది. అది అలా వుంచుదాం. కంటికి కనిపించే అవయవాలను వర్ణించి చెప్పవచ్చు. కంటికి కనిపించని మర్మావయవాలను ఎలా వర్ణించగలం? తెలిసే అవకాశం లేదే! ఒకవేళ చూడడం సంభవించినా, స్త్రీ ముందు వివరించి చెప్పడం ఔచిత్యం కాదుకద! హనుమంతుడు బుద్ధిమంతులలో శ్రేష్టుడు. సాముద్రిక శాస్త్రవేత్త. ఆ శాస్త్రం వ్యక్తుల రూపురేఖా విలాసాలను చెప్పి, వాటి ఫలితాలను వివరిస్తుంది.

ఏ ఏ జాతులవారు ఎలావుంటారో, సర్వావయవ పరిమాణాలను బట్టి విశ్లేషిస్తుంది. సాముద్రిక శాస్త్ర జ్ఞాని హనుమంతుడు అయినందున, కంటికి కనిపించే అవయవాల పరిమాణాలను బట్టి, పొందికను బట్టి, కంటికి కనిపించని (మర్మ) అవయవాలను వర్ణించగలుగుతాడు. సీతమ్మ ఉద్దేశ్యం కూడా అదేనేమో! రామలక్ష్మణుల ముఖాలనూ, బాహువులనూ, వక్షస్థలాలనూ గమనించిన వాడు, మిగిలిన వాటిని చెప్పగలడా? లేడా? అని. అంటే, ఈ దూత చూసినదే వల్లిస్తాడా? లేక చూసిన దానిని బట్టి, ఇంగిత జ్ఞానంతో, తదుపరి ఆలోచన చేయగలడా? లేదా? అని గ్రహించటానికే. హనుమంతుడు జయశీలుడు. పరీక్ష నెగ్గాడు. సీతకు విశ్వాస పాత్రుడైనాడు).

"తేజస్సు, యశస్సు, శ్రీ అనే మూడింటి వల్ల వ్యాపించిన వాడు. ఉదయం, మధ్యాహ్నం, సాయం కాలాలలో ధర్మార్థ కామాలను ఆలోచించి చేస్తాడు. కళ్ళు, దంతాలు, తెల్లగా వుంటాయి. పరిశుద్ధమైన మాతా, పితృ వంశాలున్నవాడు. సత్యం వీడనివాడు. స్వధర్మం అంటే విశేషమైన ప్రీతి కలవాడు. ధనార్జనలోనూ, దానం చేయడంలోనూ, మిక్కిలి అసమానుడు. శ్రీతో నిత్య యోగం కలవాడు. రామచంద్రమూర్తి సవతి తల్లి కొడుకైనప్పటికీ, స్వంత సోదరుడిలాగా వుండే లక్ష్మణుడు యుద్ధంలో అజేయుడు. సద్గుణంలో, రూపంలో, ప్రేమలో, రాముడిలాంటి వాడే. వారిరువురూ నీ కొరకై భూమంతా వెతుక్కుంటూ మేముండే చోటుకు వచ్చారు".

(రాముడిని గురించి చెప్పిన హనుమంతుడు అతడు "బ్రహ్మచర్య నిష్ఠకలవాడంటాడు. బ్రహ్మచర్యం రెండు రకాలు. మొదటిది, గృహస్థుడు రుతుకాలంలో మాత్రమే తన భార్యతో సంగమించి, తక్కిన రోజుల్లో స్త్రీసాంగత్యాన్నే మానడం. రెండవది, స్త్రీ సంభోగాన్నే పూర్తిగా మానడం. స్త్రీకి రజో దర్శనమైన నాటినుండి పదహారు రోజులు రుతుకాలం అంటారు. వీటిలో మొదటి నాలుగు రోజులు నిషిద్ధం. పదకొండు, పదమూడు రాత్రిళ్లు కూడా పనికిరావు. మిగతా పదిరోజుల్లో ఏకాదశి, అమావాస్య, పౌర్ణమి, పితృ దినాలు వదిలిపెట్టాలి. మిగిలిన రోజులు ప్రశస్తమైనవి. రుతుకాలంలో భార్యాభర్తలు ఆరోగ్యంగా వుండి వీర్యాన్ని వ్యర్థం చేస్తే, భ్రూణ హత్యా దోషం తగులుతుంది.

ఇది ముగ్గురు సంతానం కలిగే వరకే కాని ఆ తర్వాత ఈ నియమం లేదు. ఆ తరువాత భార్యను కూడా చెల్లెలు లాగానే చూడాలి. పరస్త్రీలను తల్లుల్లాగా చూడాలి. సరి దినాలందు కలిస్తే పుత్రులు, బేసి దినాలలో కలిస్తే పుత్రికలు కలుగుతారు. పదిహేనో రోజు రాత్రి పురుషుడిని కలిసిన స్త్రీకి, రాజపత్ని, పతివ్రత, శ్రేష్టులైన పుత్రులను కనే కూతురు కలుగుతుంది. పదహారో రోజైతే, విద్యా లక్షణ సంపన్నుడు, సత్యవాది, జితేంద్రియుడు, సర్వ భూతాశ్రితుడైన కొడుకు పుడ్తాడు.

ఇక స్త్రీ సంభోగమే మానడం రెండో రకం బ్రహ్మచర్యం. ప్రేమ, అభిలాష, రాగం, స్నేహం, ప్రేమం, రతి, శృంగారం, అనే ఏడు రకాలైన సంభోగాలున్నాయి. అందగత్తెలను చూడాలన్న కోరికను "ప్రేమ" అంటారు. ఆ విషయమైన చింతే "అభిలాష". అలాంటి వారితో సంగమించాలన్న బుద్ధిని "రాగ" మనీ, దాని మీదే మనస్సుంచడం "స్నేహం" అనీ, అలాంటివారిని విడిచి వుండలేక పోవడం "ప్రేమం" అనీ అంటారు. వారితో కలిసి-మెలసి తిరగడం "రతి", క్రీడించడం "శృంగారం" అంటారు. ఈ ఏడింటినీ సంభోగమనే అంటారు.

స్త్రీలతో ఒంటరిగా మాట్లాడడం, వారితో తల దువ్వించుకోవడం, తలంటి పోయించు కోవటం, స్పృశించడం, నిషిద్ధం. స్త్రీలు తల దువ్వుకుంటున్నప్పుడు, పడుకున్నప్పుడు, స్నానం చేసేటప్పుడు, చూడకూడదు. వయస్సున్న స్త్రీలను పీనుగుల్లాగానన్నా చూడాలి, లేదా, ఐదారేళ్ళ పిల్లవాడిలాగానన్నా వుండాలి. ఈ బ్రహ్మచర్య గుణాలన్నీ శ్రీరాముడిలో వున్నాయని హనుమంతుడు చెప్పాడు.

హనుమంతుడు మొదట శ్రీరాముడి ఆత్మగుణాలను వర్ణించి, తర్వాత దేహగుణాలను వర్ణిస్తాడు. "తేజస్సు, యశస్సు, శ్రీ" ల వల్ల వ్యాపించిన వాడంటాడు. బ్రహ్మచర్య నిష్ఠ కలవాడంటాడు. రాముడిని వర్ణించిన హనుమంతుడు, ఆయన్ను గురించి చాలా నిగూఢంగా చెప్తాడు. స్పష్టంగా చెప్పి వుండేవాడే కాని, అలా చెప్తే, చెప్పడం తెలియనివాడని అడవి మనిషని, సీత భావించి వుండేది. "లింగం, వృషణం" గురించి కూడా చెప్పాడు. ఔచిత్యం పాటించకపోతే "ఇటువంటి వాడు రామదూతగా వుండతగిన వాడు కాదని" సీతాదేవి తీర్మానించేదే! అసలామే ప్రశ్న వేసింది కూడా హనుమంతుడెలా

చెప్తాడని తెలుసుకునేందుకే! జరిగిన విషయాన్ని, రామలక్ష్మణుల శుభ లక్షణాలను విలక్షణంగా వర్ణించిన హనుమంతుడు ఎక్కడా తన ఔన్నత్యాన్ని చెప్పుకోలేదు. ఆత్మస్తుతీ చేసుకోలేదు. ఇంత ఘనకార్యం చేసి కూడా ఇదంతా "రాముడి చలవే" అని తలవంచి, సవినయంగా విన్నవించగల నిరుపమ వినయశీలి హనుమంతుడు)

శ్రీరామ సుగ్రీవులు ఎలా కలుసుకున్నారో సీతాదేవికి చెప్పిన హనుమ

"సీత కొరకై వెతుకుతున్న శ్రీరామలక్ష్మణులు మేముండే చోటుకు వచ్చారు. అన్న రాజ్యంలోంచి వెళ్లగొట్టబడి, ఋష్యమూకాద్రి మీద మేమందరం సేవిస్తుండగా, భయపడుతూ నివసిస్తున్న సుగ్రీవుడు, నార చీరెలు, చేతుల్లో బాణాలతో వస్తున్నా వారిని చూశాడు. చూసి భయపడి, వారెవరో తెలుసుకొని రమ్మని నన్ను పంపాడు. నా కంటికి వారు మహాత్ముల్లాగా కనపడినందున, వినయంగా, చేతులు జోడించి, వారి దగ్గరకు పోయాను. నన్నాదరించి, గౌరవించిన వారిద్దరినీ తీసుకునివచ్చి, సుగ్రీవుడి ఎదుట నిలిపాను". (నేను, నేను అనే ఉత్తమ పురుష లక్షణం చెప్పడం అహంకారంతో కాదు. రామ, సుగ్రీవుల కలయికలో తనకున్న సంబంధాన్ని, తానూ లక్ష్మణుడిని ఎలా ఎరుగుదునన్న ప్రశ్నకు సమాధానంగా చెప్పడానికే హనుమంతుడు అలా అన్నాడు)

"కలిసిన రామ, సుగ్రీవులు ఒకరితో ఒకరు మాట్లాడుకుంటూ, ఒకరినొకరు నమ్మారు. ఒకరి దుఃఖం ఇంకొకరికి చెప్పుకొని సమాధానపర్చుకున్నారు. తన భార్యను అపహరించాలనుకున్న ఆయన అన్న వాలి, సుగ్రీవుడిని వెళ్లగొట్టాడు. ఆ అవమానాన్ని భరించలేని సుగ్రీవుడిని నీ మగడు సమాధానపర్చాడు. వాలి, సుగ్రీవుల కలహ కారణం ఇదే. నీ ఎడబాటుతో దుఃఖిస్తున్న శ్రీరాముడి చరిత్రను లక్ష్మణుడు సుగ్రీవుడికి చెప్పాడు. ఆ సంగతి విన్న సుగ్రీవుడు తేజో విహీనుడయ్యాడు. గతంలో రావణాసురుడు ఆకాశమార్గాన నిన్ను ఎత్తుకొని వెళ్తున్నప్పుడు, నువ్వు, భూమి మీద పడేసిన

ఆభరణాలను నేను భద్రపర్చాను. వాటిని సుగ్రీవుడు రామచంద్రమూర్తికి చూపాడు. కాని ఆయన మనస్సు సంతోషపడడానికి మాత్రం నీ జాడ చెప్పలేకపోయాం. నీ ఆభరణాలను వళ్ళో వుంచుకున్న రాముడు శోకాగ్నితో కాలినవాడిలాగా వెక్కెక్కి ఏడుస్తుంటే, స్మృతి తప్పినప్పుడు నేనే మూర్ఛపోకుండా చేసి ఓదార్చాను".

శ్రీరాముడి విరహ బాధ, స్వవిషయం సీతకు చెప్పిన హనుమ

మొదట రాముడి అవయవ సౌందర్యం, ఆ తర్వాత సొమ్ముల విషయం చెప్పిన హనుమంతుడు, నగలు చూసినప్పుడు, రాముడి ప్రవర్తన ఎలా వుందో వివరించి చెప్పాడు ఈ విధంగా:

"ఆభరణాలను చూసిన రాముడు, వాటిని తిరిగి సుగ్రీవుడికిచ్చాడు. నీ ఎడబాటుతో, నీ మగడు, ఎల్లప్పుడు లోలోన కుములుతుంటే, అగ్నిని కలిగిన అగ్నిపర్వతంలాగా కనిపించాడు. లోపలున్నది నాకెట్లా తెలుసంటే....తెలుసు. శోకంలో మునిగి వున్నప్పుడు, నిద్రాభంగం కలిగి, చింతిస్తూ, దుఃఖిస్తున్న రామచంద్రమూర్తి, అగ్నులతో తపిస్తున్న అగ్నిహోత్రంలాగా వున్నాడమ్మా సీతమ్మా! నిత్యాగ్నిహోత్రులైన బ్రాహ్మణుల ఇళ్లల్లో, అగ్నిని సంరక్షించేందుకు, ప్రత్యేకంగా ఓ గది వుంటుంది. ఆ గదిలో, అగ్ని ఆరకుండా వుండడం వల్ల, గదెప్పుడూ సెగలు కక్కుతుంటుంది. అలానే నీ మగడు విరహాగ్నితో నిండి వుండడం వల్ల, శరీరమంతా పెనం కాలినట్లు కాలుతుండేది".

"నిన్ను చూడలేకపోతినే నన్న తాపంతో, సుఖాన్నెంత మాత్రం ఎరుగడు. తాపమూ వీడడు. నీ వియోగాగ్ని దహిస్తుంటే, భూకంప వేగానికి వణికే కొండలాగా వణకుతున్నాడు. నీ ఎడబాటు కారణాన, రమ్యమైన పూపొదలెన్ని కనపడినా సంతోషించడు. అందర్నీ ఆహ్లాద పరిచే అడవులూ, పారుతున్న సెలఏళ్లూ, నిన్నుచూడని కారణం వల్ల రాముడిని సంతోషపర్చ లేకపోతున్నాయి. రావణుడిని, వాడి కొడుకులను, స్నేహితులను, యుద్ధంలో చంపి, నీ భర్త, నిన్ను త్వరలోనే తీసుకెళ్తాడు. వాలిని చంపుతానని రాముడు, నిన్ను వెతికించి నీవార్త తెప్పిస్తానని సుగ్రీవుడు ప్రమాణం చేసారు. సుగ్రీవుడితో కిష్కింధకు పోయి, వాలిని చంపి, సుగ్రీవుడిని రాజుగా చేసాడు రాముడు. ఇలా వారిద్దరికీ

స్నేహం కుదిరింది. నేను వారి దూతను, నిన్ను వెతుక్కుంటూ సముద్రాన్ని దాటి ఇక్కడకు వచ్చాను. నా పేరు హనుమంతుడు. సుగ్రీవుడు రాజై, తాను చేసిన ప్రమాణాన్ని నెరవేర్చడానికి, నిన్ను వెతికేందుకు వానరులను పది దిక్కులకు పంపాడు".

"వాలి కొడుకు అంగదుడనే వాడు శూరాతి శూరుడు. యువరాజై ఇంట్లో వుండాల్సిన వాడు, సైన్యంలో మూడవ భాగాన్ని వెంటేసుకుని, స్వయంగా వెతుకుతున్నాడు. మేము వింధ్య పర్వత ప్రాంతంలో చాలా రోజులు వెతికి, తోవ తప్పడం వల్ల, ఇక్కడకు రావడం ఆలస్యమయింది. చెట్టూ, పుట్టా, గుట్టా, చేనూ, అన్నీ వెతికినా నీ జాడ తెలియలేదు. సుగ్రీవుడిచ్చిన నెల రోజుల గడువూ అయిపోయింది. నీ జాడ తెలియదని సుగ్రీవుడికి చెప్తే చంపుతాడని భయ పడ్డాము. భయపడి మేమందరం ప్రాణాలు విడుద్దామనుకున్నాం".

"ఆ సమయంలో అంగదుడు: నీవు అపహరించబడిన సంగతి, జటాయువు మరణం, వాలి వధ, నిన్ను వెతికేందుకు మేం తిరగడం, చివరకు దిక్కులేని చావు చావాల్సి రావడం, చెప్పుకుంటూ ఏడ్వసాగాడు. ఇది విన్న జటాయువు సోదరుడు సంపాతి అనేవాడు మా దగ్గరకొచ్చాడు. కోపంతో, కళ్లెర్రచేసిన సంపాతి, తనతమ్ముడిని చంపిన వాడెవరని అడిగాడు. సీత నెత్తుకుపోయిన రావణుడు, జటాయువును చంపిన విషయాన్ని, సంపాతికి చెప్పాడు అంగదుడు. అంతా విన్న సంపాతి, దుఃఖిస్తూ, నువ్వు రావణుడి అంతఃపురంలో వున్న వార్త మాకు చెప్పాడు. వానరులందరం సంతోషించి, వింధ్య పర్వత శిఖరం వదిలి, సముద్రపు ఉత్తరపుటొడ్డుకు చేరాం. నిన్ను చూడాలని మాకెంత తొందరున్నా, సముద్ర దర్శనం వానరులకు భయం కలిగించిం. నేనప్పుడు ధైర్యం, సాహసం చేసి, నూరామడల సముద్రాన్ని దాటి, రావణుడి నగరం లంక ప్రవేశించి, రాత్రి సమయంలో రావణుడినీ, నిన్నూ చూశాను".

"సాధ్వీ రత్నమా! వాస్తవం చెప్పాను. భయం లేకుండా, ధైర్యంగా నాతో మాట్లాడు. నన్ను నమ్ము. నాలో మాయ లేదు. రామకార్యం చేసేందుకు నీ కొరకై వచ్చాను. వానర రాజు మంత్రిని, వాయుదేవుడి కొడుకును, సూర్యవంశం రాజు రామచంద్రమూర్తి దూతను. ఆయుధ ధారులలో శ్రేష్టుడైన రామచంద్రమూర్తి కులాసాగా వున్నాడు. లక్ష్మణుడు అన్నసేవలో సుఖంగా

వున్నాడు. నీ భర్త మేలుకోరి, సుగ్రీవుడి మాటప్రకారం, దక్షిణ దిక్కుగా వెతుక్కుంటూ వచ్చాం. నా పూర్వ పుణ్యంవల్ల, నిన్ను, నేను చూడగలిగాను. నిన్ను చూడలేక పోయామే అని, దుఃఖంతో భయపడ్తున్న వానర సమూహానికి, నీవు కనిపించిన వార్త చెప్పి, సంతోషం కలిగిస్తాను. నా సముద్రయానం సఫలమయింది. నా పుణ్యభాగ్యం వల్ల, హనుమంతుడొక్కడే సీతాదేవిని చూడగలిగాడన్న కీర్తిని సంపాదించాను. వీరుడగు రాముడు, పరివారంతో, మిత్రులతో, చుట్టాలతో వున్న రావణుడిని యుద్ధంలో చంపి, నిన్ను స్వీకరిస్తాడు".

(ఇది సుందరకాండ కథ! ఆద్యంతాలూ సౌందర్యాన్ని నింపుకున్న కాండ ఇది. ఇంతవరకు జరిగిన కథ అంతా హనుమంతుడు సీతమ్మకు చెప్పాడు. ఏమి జరగబోతుందో త్రిజట తాను కన్నకలను వివరిస్తూ చెప్పింది. జరుగుతున్నదీ, జరిగినదీ సీతమ్మ చెప్పింది. భూత, భవిష్యత్, వర్తమానాలను ధ్వనింప చేస్తున్న ఈ నాటకీకరణం నిజంగా సౌందర్యోపేతం!)

ఇంతవరకు తాను రామచంద్రమూర్తి దూతగా వచ్చానని చెప్పిన హనుమంతుడు, తన జన్మ వృత్తాంతాన్ని చెప్పుతాడు సీతాదేవితో, ఇలా:

"మాల్యవంతమనే పెద్ద పర్వతముంది. అక్కడ నా తండ్రి కేసరి అనే వానర రాజున్నాడు. దేవ ఋషుల ఆజ్ఞానుసారం, గోకర్ణమనే పర్వతానికి పోయి, శంభసాధనుడనే దైత్యుడిని చంపాడొకసారి. ఇట్లా మా తండ్రి కాలం నుండే, రాక్షసులకు, మాకూ విరోధముంది. ఆయన భార్యకు, వాయుదేవుడికీ, నేను జన్మించాను. నా స్వశక్తితో, స్వకార్యంతో, హనుమంతుడన్న పేరు తెచ్చుకున్నాను. నీ నమ్మకం కొరకు నీ భర్త గుణ-గణాలన్నీ చెప్పాను".

(సీతమ్మ హనుమంతుడిని తన జన్మ వృత్తాంతం చెప్పమని అడగలేదు. రాముడి రూప విశేషాలను మాత్రమే అడిగింది. దానితోపాటు తన జన్మ వృత్తాంతాన్ని హనుమంతుడు చెప్పాడు. అడగనిదే చెప్పడం దేనికి? అని అనిపించవచ్చు. కానీ హనుమంతుడు ఆంజనేయుడు కదా! అంటే ప్రశస్త వాక్కు కలవాడని అర్థం. వ్యర్థంగా ఏదీ మాట్లాడడు. అసలు కారణమేమిటంటే, తాను రామదూతను అనీ, సామాన్యమైన సగటు వాడిని కాదనీ, సమర్థుడనీ సీతమ్మను నమ్మించ చేయడం. నమ్మదగిన వాడినీ, విశ్వాసపాత్రుడినీ అని సీతమ్మకు రూఢి చేయాలని భావించడం! తనను ఈ మహాకష్టం నుండి

తప్పించగల వాడని, రాముడిని రప్పించి తనను ఆయనతో కూర్చగల సమర్థుడనీ విశ్వాసాన్ని పాదుకొల్పటానికే తన వైనం చెప్పాడు. రామాయణం ధ్వని కావ్యం. అంతరాంతరాలలో దాగి వున్న పరమార్థాలను వాల్మీకి-ఆంధ్రవాల్మీకి ఎంతో సులభంగా, సుందరంగా మనకు అందించారు, మన అదృష్టం వల్ల!)

ఇన్ని విధాలుగా చెప్పిన తర్వాత హనుమంతుడు, శ్రీరామచంద్రమూర్తి దూతన్న విషయం నమ్మింది సీతాదేవి. కళ్లనుండి సంతోషంతో ఆనందభాష్పాలు ప్రవహించాయి. రాహువు పట్టి విడిచిన చంద్రుడిలాగా ప్రకాశించింది ఆమె ముఖారవిందం. సీతాదేవి తనమాటలు నమ్మడంతో ఆనందించిన హనుమంతుడు, తాను తిరిగి ఆమె కుశలవార్తను రాముడికి తెలపాల్సి వుందన్నాడు. సీతకేమి సహాయం కావాలో చెప్పమనీ, చేస్తాననీ అంటాడు. ఊరడిల్లమని కోరతాడు. తను వాయుపుత్రుడైనందున, వేగాతిశయంలోనూ, బలంలోనూ, తండ్రికి సమానమైన వాడినంటాడు. తాను ఓ సామాన్యమైన వానరుడననీ, ఏంచేయలేడనీ, సందేహించవద్దని చెప్పాడు.

(రామచంద్రమూర్తి దూతగా వచ్చానని చెప్పిన తర్వాత, ఆమె నమ్మిందని నిర్ణయానికి వచ్చిన తర్వాత, తనజన్మ వృత్తాంతాన్ని, తనను గురించిన విషయాల్నీ కూడా వివరించి చెప్తాడు హనుమంతుడు సీతాదేవికి. ఇలా చెప్పడంలో కూడ ఎంతో అర్థం వుంది. స్నేహం చేయడానికి, కలసిమెలసి వుండడానికి, కులహీనుడితో, ఆచారహీనుడితో, సదాశ్రయం లేనివాడితో కుదరదు కాబట్టి, తన విషయం చెప్పుకున్నాడు. కులం, గుణం, ఊరు, నిజమైన పేరు దాచేవాడు, ఆచార్యుడిగా పనికిరాడు. శిష్యుడు కూడా గురువు వంశాదులను, పుట్టుపూర్వోత్తరాలను విచారించాలని కూడా దీని భావన."ఆచార్య కృత్యం" కూడా హనుమంతుడి మాటల్లో వ్యక్తమౌతుంది. శిష్యుడికి భగవంతుడి విషయమంతా వివరంగా చెప్పి, భయపడొద్దనీ, భగవంతుడే స్వయంగా వచ్చి తీసుకుపొతాడనీ, ఆ సమయానికై వేచి వుండాలనీ అంటాడు. శిష్యుడు మాత్రం సదాచారం, భక్తి విశ్వాసాలు మానవద్దని కూడ ఆయన మాటల్లో స్ఫురిస్తుంది. గురు పరంపర కూడా చెప్తాడు. శిష్యులు కాదల్చుకున్న వారు ఆచార్యులమని వచ్చేవారిని, పరీక్షించు కోమని అర్థం కూడా వుంది).

❖ ❖ ❖

సర్గ-36

సీతాదేవికి శ్రీరామ ముద్రికనిచ్చిన హనుమంతుడు

జనకరాజు కూతురు సీతాదేవికి, తన మాటల మీద, ఇంకా సందేహం ఏ మాత్రమైనా వుంటే, దాన్నీ పోగొట్టదల్చిన హనుమంతుడు, శ్రీరాముడి పేరు చెక్కిన ఉంగరాన్ని చూపిస్తాడు. దానిని దూతైన తనకు ఇచ్చిన రామచంద్రుడు, సీతకు ఇమ్మని చెప్పాడనీ, అది చూసిన ఆమెకు తనమీద నమ్మకం కుదురుతుందన్నాడనీ, అంటాడు హనుమంతుడు. ఆ ఉంగరాన్ని చూసిన సీతకు మనోవ్యాకులత కూడా తీరుతుందని రాముడు చెప్పినట్లు తెలియచేస్తాడు. హనుమంతుడిచ్చిన ఉంగరాన్ని సంతోషంగా తీసుకుంటుంది సీత. ఇదొక అద్భుతమైన ఉంగరం. ఇందులో మూడు మణులుంటాయి. అందులో ఒక మణిలో రాజైనవానికి పితృ-పితామహంగా వచ్చే సూర్యవంశపు శక్తిని ఆవహింప చేస్తారట. ఇది శ్రీరాముడి రాజ్యాధికార ముద్ర. దానిపై శ్రీరాముడి పేరు కూడా చెక్కబడి ఉందని పెద్దలంటారు. అలాంటి రాజ ముద్రను ఇవ్వడమంటే రాజ్యాన్నే ఇచ్చి వేయడమని అర్థంకద! సీతమ్మ కంటే రాజ్యం గొప్పది కాబోదు అని రాముడి భావన అనేది స్పష్టమవుతున్నది.

(సీతాదేవి సందేహం తీరిందనీ, శ్రద్ధ కలిగిందనీ, నమ్మకం కల్గిన తర్వాతనే ఉంగరం ఇచ్చాడు హనుమంతుడు. దీన్ని బట్టి సంశయంతో వున్నవారికి, శ్రద్ధలేని వారికి, "రామమంత్రం" ఉపదేశించ కూడదని అర్థం చేసుకోవాలి. అదే విధంగా శిష్యుడు ఇది చెప్పమని అడగకూడదు. గురువనుగ్రహించిందే స్వీకరించాలి. ఈ విధంగా "సీత-ఆంజనేయుల" చర్య వలన "శిష్య లక్షణం, గురులక్షణం, ముముక్షుహిత చర్య, భగవత్ మంత్రప్రాప్తం" చెప్పడం జరిగింది).

తన భర్త శ్రీహస్తాన్ని అలరించే ఆ ఉంగరాన్ని చూసిన సీతకు తన మగడే ఎదురుగా వచ్చినంత సంతోషం కలిగింది. ఎర్రటి, తెల్లటి కళ్లున్న ఆమె ముఖం, రాహువు విడిచిన చంద్ర బింబంలా ప్రకాశిస్తూ కనిపించింది. (భర్త ఎడబాటు వల్ల కలిగిన దుఃఖమే రాహువు) ఆ ఉంగరాన్ని తాకుతూ అనుకుంటుంది సీత: "పాణిగ్రహ సమయంలో మొదటిసారి తన చేతిని రామచంద్రమూర్తి

పట్టుకున్నప్పుడు, తనను తగిలిన ప్రథమాభరణం ఇదే కదా! తనకు ప్రణయకోపం వస్తే, శాంతింప చేయటానికి, భర్త తన గడ్డం పట్టుకుని బ్రతిమిలాడుతుంటే, తాకేదీ ఉంగరమే కదా! తనను కౌగలించుకున్నప్పుడు, వంటిమీదున్న ఆభరణాలన్నీ తీసేసినా, తీయందీ ఉంగరం కదా! ప్రణయ కోపంలో ఇరువురికీ మాటలు లేనప్పుడు, మాట్లాడే నెపంతో, నేలమీద ఉంగరం పడేస్తే, తీసుకొమ్మని మాట్లాడే అవకాశం ఇచ్చింది ఈ ఉంగరమేకదా! అరణ్యాలకు పోతున్నప్పుడు, సర్వాభరణాలూ తీసేసినా, తనతో పాటు వెంట తెచ్చుకున్నదీ ఈ ఉంగరమేకదా!" ఇలా అనేక విధాలుగా ఆలోచిస్తున్న సీతకు, సాక్షాత్తూ శ్రీరామచంద్రుడే ఎదురుగా వచ్చి నిల్చున్నట్లు, భావనాతిశయ బలం వల్ల ఆయన ఆకారం స్పష్టంగా కనిపించిందామెకు.

(భగవన్మూర్తి ధ్యాన-సోపాన మార్గాన్ని తెలుపుతున్న దీచర్య. ఇది శిష్యుడి ఉత్తర కార్యం. భగవన్మూర్తి ఇలా ఎదురుగా వచ్చి నిల్చున్నట్లు అనిపించిందాకా భగవంతుడిని ఉపాసించాల్సిందే!)

లజ్జవతైన సీత, తన పతి క్షేమం, పతివార్త తెలిపిన ఆంజనేయుడిని, అభినందన పురస్సరంగా స్తోత్రం చేసింది. హనుమంతుండిని ప్రశంసించి శ్రీరామాదుల కుశలం అడిగిందిలా.

"నూరు ఆమడలున్న సముద్రాన్ని, ఆవుపాదమున్నంత గుంటను దాటినట్లు దాటి, ఒక్కడివే లంకలో ప్రవేశించిన వానరేశ్వరా! నీవే శూరుడవు, నీవే కార్యసాధకుడవు, నీవు మహా బుద్ధిమంతుడవు. రావణుడంటే అందరికీ తొట్రుపాటే! కాని, నీవతనికి ఏమాత్రం భయపడవు. కాబట్టి నిన్ను అందరి కోతుల్లాంటి కోతివని నమ్మను. నా ప్రాణనాధుడైన, శ్రీరామచంద్రమూర్తికి పావనివి (ఆంజనేయుడు అనీ, పవిత్రుడు అనీ అర్థాలు). నీవు దూతవు కాబట్టి, నీతోటి రహస్యాలు కూడ చెప్పొచ్చు. శ్రీరాముడు మామూలు పనులకే దూతను పరీక్ష చేసి పంపుతాడు. అలాంటప్పుడు నా దగ్గరకు పంపేటప్పుడు, విశేష పరాక్రమం కలవాడినే పంపుతాడు. దుర్బలుడిని పంపడు. నామగడికి నచ్చిన బంటువు కనుక నీకు రహస్య విషయాలు కూడా చెప్ప తగినవాడివి. (శూరుడు, కార్యసాధకుడు, మహాబుద్ధిమంతుడు, అనేపదాలు, హనుమంతుడి జ్ఞాన-శక్తి-

బలాలు తెలుపుతున్నాయి. ఇదే విషయం చెప్తూ, జాంబవంతుడు, హనుమంతుడిని రాముడంతటి వాడవని అంటాడు). ఇలా పొగడి శ్రీరామాదుల కుశలం అడుగుతుంది సీతాదేవి.

"తండ్రీ! సత్య ప్రతిజ్ఞ కల కౌసల్యా కుమారుడు, నా అదృష్టం కొద్దీ బాగున్నాడు కదా? అసమాన గుణవంతుడైన సుమిత్రా నందనుడు సుఖమా హితేంద్రా? కుశలంతో వున్న రాముడు, నాకొరకై ప్రళయకాలాగ్నిలా కోపించి, భూమినీ, సముద్రాన్నీ కాల్చ లేదు కదా! వారు శూరులుకారా అంటే శూరులే! దేవతలనైనా యుద్ధంలో గెల్చే శక్తిగలవారే! నాపాప ఫలం వల్ల వాళ్లా ప్రయత్నం చేయలేదేమో! అన్నా ఆంజనేయా! నన్ను ఎడబాసానన్న తాపంతో రామచంద్రమూర్తి సంతాప పడడం లేదు కదా? నా కొరకై ఆయన దుఃఖపడడం లేదు కదా? నా విషయం అలా వుంచి, తన గురించీ, ముమ్మందు అయోధ్యలో చేయాల్సిన పనుల గురించీ, మళ్లీ పెళ్లి చేసుకునే వ్యవహారం గురించి అయినా ఆలోచిస్తున్నాడా? లేక నన్ను గురించే, నా ప్రియురాలికింత కష్టం కలిగిందే, ఎలా తప్పించాలీ కష్టం నుండి, అని చేయాల్సిన పని గురించి ఎన్నడైనా ఆలోచిస్తున్నాడా?" అని అడుగుతుంది.

(ఆంజనేయుడిని, "తండ్రీ, హితేంద్రా, అన్నా" అని సంబోధిస్తుంది. మగడు వదిలిన ఆడబిడ్డలు తమ దుఃఖాన్ని తండ్రితో చెప్పుకుంటారు. తన మేలు కోరేవారిలో శ్రేష్టుడని "హితేంద్రా" అని సంభోదిస్తుంది. రాముడిని "కౌసల్యా కుమారుడు" అని అనడంలో కూడా అర్థముంది. ఇది "నర్మోక్తి". దశరథ తనూజుడనదు. ఆయన బల-పరాక్రమ-శౌర్య సంపద లేదనీ, ఆడదానిలో వుండే గుణాలే వున్నాయని ఒక అర్థం. కౌసల్య కడుపున పుట్టి ఆమెను ఏం సంతోష పెట్టాడనీ, తన్నూ ఏం పెట్టాడనీ మరో అర్థం. సుమిత్రా నందనుడని లక్ష్మణుడిని అంటుంది. దీనర్థం: రాముడు అడవికి వచ్చి తల్లిని దుఃఖ పెట్టాడనీ, లక్ష్మణుడు అడవికి అన్న వెంట వెళ్లి తల్లిని సంతోష పెట్టాడని భావన. "ప్రళయకాలాగ్ని లాగా", భూమినీ, సముద్రాన్నీ కాల్చడం అనే మాటలో కూడా నర్మోక్తి వుంది. అంతటి పనిచేయలేదనీ, అంతటి పని చేసే శక్తిలేదనీ, వారిశక్తి ఆడదాన్ని చంపడానికీ, ముక్కు, చెవులు కోయటానికేననీ వ్యంగ్యంగా అంటుంది).

"నన్నెడబాసిన కారణం వల్ల, శోకంలో మునిగిపోయి, తొట్రుపడి, చేయాల్సిన పనులన్నీ మరచిపోకుండా చేస్తున్నాడు కదా! నామీద ప్రేమ మునుపటి లాగానే వుందా? ఈ రాజకుమారుడు రాజధర్మాన్ననుసరించి, చేయాల్సిన మానవ ప్రయత్నాలన్నీ లోపం లేకుండా చేస్తున్నాడుకదా? స్నేహితులందు సామదానాలు, శత్రువులందు దాన, భేద, దండోపాయాలు ప్రయోగిస్తున్నాడు కదా? మిత్రులను సంపాదించుకుంటున్నాడు కదా? స్నేహితులతన్ని గౌరవిస్తున్నారా? దైవసహాయం కలిగే ఉపాయాన్ని ఆలోచిస్తున్నాడు కదా? పౌరుషాన్ని, దైవాన్ని నమ్ముకుని, మానవ ప్రయత్నం మానకుండా, రెండింటినీ ఆశ్రయించి వున్నాడుకదా? ఇన్ని పనులమధ్య ఎంతో దూరంలో వున్న నా గురించి ఎప్పుడైనా ఆలోచించే దయ వుందా? నన్నీ బాధనుండి తొలగించి రక్షిస్తాడన్న ఆశ వుందా?"

"ఆగర్భ శ్రీమంతుడు, పుట్టినప్పటి నుండీ భోగ, భాగ్యాలు ప్రతిరోజూ అనుభవించిన వాడు, దుఃఖం అంటే ఏంటో తెలుసుకునేందుకు కూడా అర్హతలేని వాడు, శ్రీరాముడు, అడవుల్లో తిరగడం వల్ల ఎంత మోతాదులో చిక్కిపోవాల్నో అంతే అయ్యాడా? లేక, నా మీద మమతతో దుఃఖమెక్కువై బాగా చిక్కిపోయాడా?" (ఈ విధంగా అడగడంలోనూ, నర్మగర్భం, వ్యతిరేక లక్షణం కనిపిస్తుంది. "శ్రీ" అంటే, విషమని కూడా అర్థముంది. అలానే "భోగి" అంటే పాము అని అర్థం కూడా వుంది. అంటే, తల్లి గర్భంలో పడింది మొదలు విషం గల పాము తనకాటువలన ఇతరుల బాధ ఎట్లా తెలుసుకోలేదో, అట్లానే, తన ఉపేక్షవల్ల బాధపడ్తున్న సీతకై రాముడు దుఃఖ పడుతూ, చిక్కిపోయాడా? లేడా? అన్న అర్థం ఆమె అడగడంలో ధ్వనిస్తుంది).

సీతాదేవికి ధైర్యోక్తులు చెప్పిన హనుమంతుడు

ఇతరుల కుశలం గురించి ఆంజనేయుడిని ఇలా అడుగుతుంది సీతాదేవి: "కౌసల్య, సుమిత్ర, భరతుడు క్షేమంగా వున్నారా? వాళ్ల వార్తలేమన్నా తెలుస్తున్నాయా? అన్నపై ప్రేమున్న భరతుడు నన్ను కాపాడేందుకు తన వద్దనున్న యక్షౌహిణి సేనను పంపుతాడా? దంతాలు, గోళ్లు ఆయుధాలుగా వున్న వానరసేనతో సుగ్రీవుడు ఈ లంకలో ప్రవేశించగలడా? బలవంతుడైన

లక్ష్మణుడు రాక్షసులందరినీ నానా విధాలైన అస్త్రవర్షం కురిపించి నరికేస్తాడా? దశకంఠుడు బంధువులతో సహా, భయంకర బాణాల బారినపడి, దేహాలు చీలి నేలబడి మరణించడం నేను చూస్తానా? రామచంద్రమూర్తి నాకింత కష్టం కలిగిందని మధనపడ్తున్నాడా? నా దుఃఖాన్ని తీర్చేందుకు ఏక నిశ్చయంతో వున్నాడా? బంగారం లాంటి మెరుగుతో, పద్మాల వాసనలాంటి వాసనతో, అందంగా, నాకళ్లకు చంద్రబింబంలాగా కనిపించే రాముడి ముఖం, నా ఎడబాటువల్ల కలిగిన దైన్యంతో, నీళ్ళింకిన తామరలాగా వాడిపోలేదుకదా? చెప్పు."

"దయలేకుండా, అడవుల్లో పడిపొమ్మని చెప్పిన సవతితల్లి మాట ప్రకారం నడుచుకోవడం తన ధర్మమనుకున్న రాముడు, పట్టాభిషేకం చేసుకోమన్నప్పుడు ఎట్లా వున్నాడో, అడవులకు వెళ్లేటప్పుడుకూడా ఏకరూపంతో అట్లానే వున్నాడు. కోపం, భయం, వ్యధ, ఏవీ కనపడలేదు ఆయన ముఖంలో. అలాంటి రాముడు పద్దెనిమిదేళ్ళ పిల్లనైన నేను, కారడువుల్లో ముళ్లుగుచ్చుకుంటూ, కాలినడకన తిరుగుతుంటే, మనస్సులో జాలి అనేది లేనట్లుగా, ధీరత చూపిస్తుండే ధైర్యశాలి, ఇప్పుడు సీతపోతే, పోనిమ్మని ధైర్యం వదలకుండా వున్నాడుకదా! నిజం చెప్పు" అంటుంది.

"నాయనా! రామదూతా! రాముడు కఠిన చిత్తుడు, సీతను విడిచి సహించాడని నిష్ఠూరాలు ఆడుతున్నదేంటి ఈమె? ఆమె మాత్రం తక్కువైందా! ఆడదైనా, చిన్నదైనా, ఇంత ఆపదలో మునిగినా, ప్రాణాలు విడవకుండా, ధైర్యంతో వుందే! ఆమె ధైర్యం ముందర రాముడి ధైర్యం ఏపాటిదంటావా? నేను ప్రాణాలు నిల్పిన కారణం ఏమని చెప్పేది? నా హృదయేశ్వరుడైన శ్రీరాముడికి, నాపైనున్న ప్రేమకంటే ఎక్కువగాని, సమానంగాకాని, తల్లిమీద, తండ్రిమీద, ఆప్తులమీదా లేదు. ఇది నాకు తెలుసు. ఆ ధైర్యంతోనే, ఆయన వార్త తెలిసేవరకు, బొందిలో ప్రాణాలు నిలుపుకున్నాను. నాపైన అంత ప్రేమున్నవాడు, ఎట్లాగైనా ఇక్కడకు వస్తాడు. నేను ప్రాణం విడిచానని తెలిస్తే: 'అయ్యో, తన ప్రేమ వ్యర్థమయిందికదా! తను వచ్చి రక్షిస్తానన్న విశ్వాసం సీతకులేదాయనే! ఎంతటి దయాహీనురాలు?' అని తపించేవాడు. నా పైన అంత ప్రేమున్నవాడికి, దుఃఖం కలిగించ కూడదు కదా! ఎన్నిబాధలు పడ్డా, అందుకనే ప్రాణం నిలుపుకున్నాను. ప్రాణం పైన తీపితో రక్షించు కోలేదు".

(ఇప్పుడు దూతా! అని సంబోధిస్తుంది. కారణం: దూతతో చెప్పిన మాటలు, అతని స్వామితో చెప్పినట్లే. ఆ మాటలను అతడు రాముడికి చెప్పాలని కూడా అర్థముంది)

ఈ విధంగా గొప్పగా, తియ్యగా, నర్మగర్భితంగా మాటలు చెప్పిన సీతాదేవికి, రామభక్తుడు, రామపరతంత్రుడూ అయిన, హనుమంతుడు, రామగుణ కీర్తన ఎలా చేస్తాడో వినదల్చి మౌనం వహించింది సీత. హనుమంతుడు కూడా ఆమె అభిప్రాయం తెలుసుకున్న వాడిలాగానే, ముకుళిత హస్తాలుంచి, భక్తితో సమాధానం ఇచ్చాడు. (దీనివలన రామభక్తుడు, సీతారాములిరువురి పైనా సమాన భక్తి, అసమాన పారతంత్ర్యం కలిగి వుండాలని తెల్సుకోవాలి. ముకుళితహస్తాలతో అంటే, పెద్దలతో మాట్లాడేటప్పుడు, సేవకులు చేతులు కట్టుకుని నిలబడాలని అర్థం.)

"తామర రేకుల్లాంటి దీర్ఘమైన కళ్లున్న నీవు, నీ నేత్ర సౌందర్యాన్నెప్పుడైనా చూసుకున్నావా? తేనెకు తనతీయదనం తెలియనట్లు, నీ సౌందర్య మహాత్మ్యం నీకు తెలియకపోయినా, నీ దృష్టి తనపై పడాలని రాముడే కోరుతున్నాడు. అలా అనుకోవడానికి కారణం నీవు కమలదళాయతాక్షివి కావటమే. నీ దృష్టి గురించి ఆయనేమంటాడో తెలుసా? నీవు దగ్గరున్నా, దూరంగా వున్నా, కమలదళాయతాక్షివే నట. దగ్గరున్నప్పుడు, తామర రేకుల్లాగా చల్లబడి తాపం తీరుస్తావట. దూరంగా వున్నప్పుడు, చురకత్తిలాగా మనస్సును చీలుస్తావట. నిన్ను రమింపచేసే వాడేనమ్మా రాముడు! అట్టివాడు నీ విక్కడున్నావని తెలిస్తే రాకుండా వుంటాడా? ఆ సంగతి ఆయనకు ఇంతవరకూ తెలియదు. అందుకే, నిన్ను మరల స్వీకరించడంలో కొంత ఆలస్యమయింది. నేనెప్పుడు పోయి చెప్తానో, ఆ క్షణమే భల్లూక సేనాసమూహంతో బయలుదేరి వస్తాడు".

"నీవు కోతివి కనుక సముద్రాన్ని దాటావు. రాముడెట్లా దాటుతాడంటావా? కఠినమైన, పదునైన, బాణాలు ప్రయోగించి, సముద్రాన్ని కట్టేసి, లంకలోని పాపపు రాక్షసులందరినీ చంపుతాడు. ఈ మధ్యలో యముడైనా, దేవతలైనా, దైత్యులైనా, అడ్డుతగిలితే వాళ్ల తలదిమ్ము వదిలిస్తాడు. నిర్దుష్ట పాతివ్రత్యమే అలంకారంగా వున్న నువ్వు నా మాట నమ్ము. "

రామచంద్రమూర్తి చిక్కిపోలేదు కదా అని అడిగావు. సింహం బారిన పడ్డ ఏనుగులాగా, నీ ఎడబాటువల్ల కలిగిన తాపంతో బాధపడ్తూ, పూటపూటకు

సంతోషం చెడి చిక్కిపోతున్న స్థితిలో వున్నాడాయన. నేను వుత్తుత్తి ఓదార్పు మాటలు చెప్పటానికి రాలేదిక్కడకు. మలయ, మేరు, వింధ్య, మంధర, దర్దుర పర్వతాల మీద, మేము తినే పళ్లు, వ్రేళ్లు, గడ్డల మీద ప్రమాణం చేసి చెప్తున్నాను. తామర రేకుల్లాంటి కళ్లు, గొప్ప కుండలాలు, ఎర్రని పెదవుల నీ మగడి అందమైన ముఖాన్ని చంద్రుడిలాగా చూస్తావు త్వరలోనే. నేను చెప్తున్నది అసత్యమనుకుంటే, నువ్వే వచ్చి చూడు....ప్రసవణ పర్వత శిఖరమందున్న రామచంద్రుడిని".

"మాంసాన్ని తాకడు. తేనె అసలే ఆసించడు. సాయంకాలం మటుకు అడవి ఫలాలను కొంచెం తింటాడు. రోజుకొక్కసారేకాని రెండోమారు తినడు. నీకు రెండు పూటలా లేదు. కాకపోతే ఆయన యుద్ధం చేయాలికదా! నిరశన వ్రతం పూనితే యుద్ధం చేయలేడుకదా!"

"ఆయన కొరకే ప్రాణాలు నిలుపుకున్నా నన్నావు. ఆయన తన ప్రాణాలన్నీ నీ మీద నిల్పి వుండడం వల్ల, ఈగలు, దోమలు, పురుగులు, పాములు, ఆయన వంటిమీద మంటలు పుట్టేటట్లు పాకినా ఆయనకు తెలిసేదికాదు. పరకాయ ప్రవేశం చేసిన యోగిలాగా వున్నాడు. నీకు కోపం వస్తున్నది కాని ఆయనకు ఆ స్వభావమేలేదు. నీవు ఆయన్ను నిష్ఠూరాలాడావు. నిన్నాయన ఒక్క మాట కూడా అనలేదు. ఆయన సమయమంతా సీతా-సీతా! అనడంలోనే సరిపోతున్నది.

(ఇది "మనస్సంగమం" అనే అవస్థ. ఇష్టమైన పదార్థం మీద తప్ప దేనిపైనా మనసు పోకుండడమే ఈ అవస్థ). నీకు నిద్ర రాలేదంటున్నావు. ఆ విషయంలో జ్ఞానమైనా వుంది. రాముడికి ఆ ఆలోచనేలేదు. నిద్రనేది ఒకటుందని కూడా ఆయనెరుగడు".

ఇలా హనుమంతుడు రామచంద్రమూర్తిని పొగడడంతో సీత సంతోషించింది. రాముడికెంత దుఃఖమున్నదో అంతే దుఃఖమున్న సీత, తనంత దుఃఖాన్ని రాముడుకూడా పడుతున్నాడు కదా అనుకుని, తన దుఃఖాన్ని వదిలి, హనుమంతుడితో మాట్లాడుతుంది.

❖ ❖ ❖

సర్గ-37

రావణుడు పెట్టిన గడువు గురించి చెప్పిన సీత

రామచంద్రమూర్తి తనను తప్ప మరేదీ తల్చుకోవడం లేదని ఆంజనేయుడు చెప్పడంతో, సీతకు అమృతం తాగినంత సంతోషం కలిగింది. అయితే ఆయన అమితంగా దుఃఖ పడుతున్నాడని కూడా చెప్పినందువల్ల విషం తాగినట్లనిపించింది. "విషం కలిపిన అమృతాన్నిచ్చినట్లున్నాయి నీ మాటలు" అంటుంది సీతాదేవి హనుమంతుడితో.

"గొప్ప సంపద విషయంలోనూ, భయంకర దారిద్ర్య, దుఃఖ వ్యవహారంలోనూ, పురుషుడిని దైవం పూర్వజన్మ ఫలమనే తాటితో కదలకుండా ఈడుస్తాడు. భూమిమీద పుట్టిన వారికెవరికైనా స్వాతంత్ర్యం వున్నదా అంటే, లేదనే అనాలి. దైవాజ్ఞను అతిక్రమించి, స్వతంత్రించి, తన ఇష్ట ప్రకారం నడుచుకోగల ప్రాణి ఈలోకంలో లేదు. వానర శ్రేష్టా! ఇది నిజమని తెలిసికూడా, రాముడు, లక్ష్మణుడు, నేను దుఃఖ పడడానికి కారణం లేకపోయినా దుఃఖిస్తున్నాం. దుఃఖ పడడానికి మేం చేసిన తప్పేంటి? పోనీ, రాముడికొరకు నేను, నా కొరకు రాముడు, మేం చేసిన అపరాధాలకు దుఃఖిస్తున్నామనుకుంటే, మా నడుమ, మా కొరకై, లక్ష్మణుడు ఎందుకు దుఃఖించాలి? ఇదంతా దైవ చేష్ట కాక ఇంకేంటి?".

"ఓ మారుతీ! రామచంద్రమూర్తి సూర్య వంశానికే అలంకార ప్రాయమైన వాడే! ఆయన ఈ వ్యధా సముద్రంలో మునగకుండా, తీరానికి ఎప్పుడు చేరుతాడయ్యా? గాలివానకు గిర-గిరా తిరిగే నావ లాగా నలిగిపోయాడా? నన్నెప్పుడు తీసుకుని పోతాడో? ఎప్పుడు రావణుడిని చంపుతాడో? ఎప్పుడొస్తాడయ్యా రామచంద్రుడు? ఎప్పుడు చీలుస్తాడయ్యా రాక్షస మూకను? వాళ్లనెప్పుడు తన బాణాలతో ఖండిస్తాడు? పునాదులతో సహా ఎప్పుడీ లంకాపురి పాడైపోతుంది? ఎప్పుడు నన్నాయన చూస్తాడు?"

"ఆంజనేయా! రావణుడు నాకొక్క సంవత్సరం గడువిచ్చాడు. అది ముగిసేవరకే నేను బ్రతికుంటాను. ఆ సంవత్సరంలో పదో నెల

జరుగుతున్నదిప్పుడు. ఇంకా రెండు నెలలే గడువున్నది. అవికాగానే నా చావు సిద్ధం. కాబట్టి రామచంద్రమూర్తిని ఈ లోపలే వచ్చేటట్లు తొందరపెట్టు. ఆ తర్వాత వచ్చినా ఫలితం వుండదు". (అది ఫాల్గుణ మాసమైనందున, పదినెలలు గడిచినవని చెప్పినందున, సీతాపహరణం జ్యేష్ట మాసంలో జరిగిందని అనుకోవాలి).

"ఈ లోపల సద్బుద్ధి కలిగి రావణుడు నన్ను రాముడికి అర్పించే అవకాశం వుందనుకుంటున్నావేమో! వాడికట్టి అభిప్రాయం లేనేలేదు. వాడితమ్ముడు విభీషణుడనేవాడు, సీతను రాముడికిమ్మని ఎన్నోసార్లు, ఎన్నోరీతులుగా బోదించాడు. మూర్ఖుడైన రావణుడు వినలేదు. చావు సమీపిస్తుంటే, దురభిమానం కళ్లు కనిపించకుండా చేస్తుంటే, వాడెందుకు వింటాడు? ఈవిషయం నాకెట్లా తెలుసంటే: విభీషణుడి భార్య, సరమ, భర్తనడిగి, కూతురైన, అనలతో నాకు కబురు చేసింది. నాపతి నన్ను స్వీకరించడంట సత్యం. నా అంతరాత్మ శుద్ధమై, శుభగుణములు కలదై, నాకీ విషయాన్ని చెప్తోంది. (విభీషణుడు సకుటుంబంగా సీతా పక్షపాతని దీన్ని బట్టి తెలుస్తున్నది. అందుకే శ్రీరాముడు విభీషణుడిని అనుగ్రహించాడు)

"హనుమంతా! లోకోత్తర కార్యం చేయడం, దానిక్కావాల్సిన ఉత్సాహం, సాధించేందుకు అవసరమైన మహాబలామ్, ఆపని చేసేటప్పుడు కామ, క్రోధాలకు వశం కాకుండా వుండడం, తన దివ్య మహిమను ప్రకాశింప చేయడం, కార్యం చేసేందుకు తోడ్పడ్డ వారిపై కృతజ్ఞతాభావం చూపడం, అనే స్థిరమైన గుణాలన్నీ ఒక్క రామచంద్రుడిలోనే వున్నాయి. ఈ కల్యాణ గుణాలన్నీ ఆయనలో పరిపూర్ణంగా, శాశ్వతంగా వున్నాయి. అట్టివాడు నావిషయంలో పౌరుషంగా వుండడా?"

"ఆంజనేయా! రాముడు రాలేదు, రావణుడిని చంపలేదు, నన్ను తీసుకుని పోలేదు, అని నిష్టూరమాడా నంటావేమో! ఒంటరిగాడు, ఆయనేం చేయగలడంటావేమో! జనస్థానంలో, తమ్ముడు కూడా తోడు లేకుండా, పద్నాలుగువేల రాక్షసులను తన భుజ బలంతో అవలీలగా చంపలేదా? అలాంటివాడు, ఇక్కడకు వచ్చాడనగానే, రాక్షసులు భయపడిపోరా? ఆయన

శక్తి తెలియక నేను దూషించలేదు. మానధనుడైన ఆయన్ను ఈకష్టాలేవీ కలతపెట్టవు. ఎన్ని కష్టాలకైనా ఓర్చుకుని మానం కాపాడుకోగలడు. సూర్యుడికి తన కిరణాలతో నీటిని ఎండబెట్టినట్లే, రాముడికి రాక్షసులను చంపడం కష్టమా?" అంటుంది సీత. ఇలా కళ్లనిండా నీళ్లు వుంచుకుని మాట్లాడుతున్న సీతాదేవిని చూసి హనుమంతుడు శోకించవద్దని ప్రార్థిస్తూ, ఇలా అన్నాడు.

శ్రీరాముడి దగ్గరకు సీతను తీసుకుపోతానన్న హనుమ

"నా మాటలు విన్న శ్రీరాముడు కోతులు, భల్లూకాలున్న సేనతో, వెంటనే ఇక్కడకు వస్తాడు. అంతవరకు దుఃఖమెట్లా ఆపుకోవాలంటే, దానికో మార్గముంది. నా వీపుపైనెక్కు...రామచంద్రమూర్తి వున్న చోటుకి నిన్ను తీసుకుని పోతాను. నేను దూతను. నీ శీలానికి ఏ హానీలేదు. నిన్ను మోయగలనా అంటావేమో! నిన్నేకాదు ఈ లంకను, రావణుడిని కూడా మోసుకునిపోగలిగే సమర్థుడను. అగ్నిహోత్రుడు హోమం చేయబడ్డ హవ్యాన్ని ఇంద్రుడికి చేర్చినట్లు, నిన్ను శ్రీరాముడి దగ్గరకు ఇప్పుడే చేరుస్తాను (ఈ ఉపమానం "స్పర్శదోషశంక"ను తీసేస్తున్నది. ఆంజనేయుడి శుచిత్వాన్నీ తెలియచేస్తున్నది). తల్లీ పూర్వం రాక్షసులను చంపే ప్రయత్నం విష్ణుమూర్తి చేసినట్లే, నీమగడు, తమ్ముడితో కూడి రావణాదులను చంపే ప్రయత్నాన్ని నీ కళ్లతో నువ్వే చూడగలవు. నా వీపు పైకెక్కు.....నా మాట నమ్ము!"

"నిన్ను చూడాలనుకుంటున్న బలశాలి శ్రీరాముడు పర్వత శిఖరం మీదున్నాడు. ఆయన్ను నువ్వు చూడొచ్చు. నామాటలను కొట్టిపరేయకు. రోహిణీ, చంద్రుల కలయికలాగా, నిన్ను, నీ మగడితో కలుపుతాను. ఆకాశంలో సూర్యచంద్రులతో ముచ్చటిస్తూ, సముద్రాన్ని, ఆకాశాన్ని అవలీలగా నా వీపు మీద కూర్చొని దాటు. రాముడివద్దకు పోయేంతవరకూ నిన్ను దించను. రాక్షసులు మనవెంటపడి పోనీయరేమో అన్న అనుమానం వద్దు. నిన్ను నేను తీసుకుని పోతుంటే, నా వెంట ఈ రాక్షసులలో ఒక్కడైనా రాలేడు. నేనెట్లా ఆకాశమార్గంలో వచ్చానో, అట్లానే, నిన్నూ ఆకాశమార్గంలోనే తీసుకునిపోతాను. సందేహం వదులుకో" అన్న ఆంజనేయుడి మాటలకు, భక్తికి, సంతోషించిన సీత, ఆయన మాటలకు ఆశ్చర్యపోయి ఇలా జవాబిస్తుంది.

తను హనుమ వెంట రాలేని కారణాన్ని చెప్పిన సీత

"ఆంజనేయా! నేను సొమ్ములను మూటవేసిన స్థలం నాకు గుర్తుంది. అక్కడికి, ఇక్కడికి చాలా దూరం. ఇంతదూరం నన్ను ఎట్లా మోసుకుని పోతావు? నీమాటలు వినడానికే వింతగా వున్నాయి. ఇంతవరకు నీవు నిజంగా కోతివో, కాదో అన్న అనుమానం, సందేహం వుండేవి. ఇప్పుడు నీ బుద్ధిని పట్టి చూస్తే నీవు నిజంగా కోతివేనని, నిశ్చయించుకుంటున్నాను. ఊడ్చి కొలిస్తే నువ్వు జానెడు కూడా లేవు.... నీవు నన్నెట్లా మోసుకుపోతావు" అన్న సీతాదేవి మాటలకు హనుమంతుడు విచారపడ్డాడు. ఎప్పుడూ, ఎవరివల్లా జరగని అవమానం, నేడు ఒక ఆడదానివల్ల జరిగిందికదా అని ఆలోచించసాగాడు. సీత తనను అవమానించాలన్న ఉద్దేశంతో మాట్లాడి వుండదనీ, తనెంతటి వాడినో, తన మహత్త్యమెట్టిదో తెలియక, లక్ష్యం లేక మాట్లాడిందనీ అనుకుంటాడు. తనమాట నిజమనీ, తనంత కార్యం చేయగల సమర్థుడననీ, నిజంగా నమ్మని సీత నమ్మేటట్లు చేయటానికి, తన స్వరూపం చూపించాలని తలుస్తాడు. వెంటనే తన దివ్యాకారాన్ని చూపటానికి నేలమీదకు దూకి శీఘ్రంగా శరీరాన్ని పెంచనారంభించాడు హనుమంతుడు.

మండుతున్న అగ్నిహోత్ర కాంతితో వెలుగుతూ, మేరుపర్వతంతో సమానమైన ఆకారంతో, ఎర్రటి ముఖంతో, వజ్రాయుధం లాంటి గోళ్లతో, కోరలతో, సీతాదేవి ముందరర నిలబడి: "దేవీ! ఈ లంకను, కొండలతో, వనాలతో, బురుజులతో, ప్రాకారాలతో, తోరణాలతో, రావణాసురుడితో సహా పెల్లగించి, అత్యంత వేగంగా తీసుకునిపోయే శక్తి నాకుంది. నేను చిన్నవాడినన్న అభిప్రాయం మానుకో. ఆలస్యం చేయకుండా రాముడి దగ్గరకు పోదాం రా!" అంటాడు హనుమంతుడు సీతతో.

హనుమంతుడలా చెప్పగానే, ఆశ్చర్యం, భయం కలిగించే అతడి ఆకారాన్ని చూసి: "కపీశ్వరా! నీ బలగర్వం, వాయువేగం, కార్చిచ్చులాంటి నీశరీరం, ఎలాంటిదో తెలుసుకున్నాను. నీవు సామాన్య కోతివికావు. ఇంత గొప్పవాడివి కాకపోతే నువ్వెట్లా సముద్రాన్ని దాటి, రహస్యంగా లంక ప్రవేశించి, నన్ను వెతకగలిగే సమర్థుడవవుతావు? ఇంతపని మామూలు వాళ్లకు

సాధ్యమవుతుందా? నన్ను వేగాతిశయంతో, రామచంద్రమూర్తి దగ్గరకు తీసుకుపోగలవని నమ్ముతున్నాను. నీపై నాకెంత విశ్వాసమున్నా, శీఘ్రంగా నామగడి కార్యం నెరవేరే ఉపాయం నేను ఆలోచించాల్సిన అవసరముందికదా! కాబట్టి నేను నీవెంట రాకూడదు. వాయువేగంతో సమానంగా పోయే నీ వేగాన్ని, సహించలేక నేను దిగ్భ్రమ చెందుతాను. పైపైకి వస్తున్న అలలను చూసి తలతిరిగి సముద్రంలో పడితే తిమింగలాలు, మొసళ్లు, నన్ను పీక్కు తింటాయి. ఇదీ నా సంగతి. నీవిషయంలో కూడా నాకు కొంత సందేహముంది".

"నన్ను తీసుకునిపోతున్న నిన్ను చూసి రావణాజ్ఞ ప్రకారం రాక్షసులు నిన్నాపగా, నీకూ, వారికీ, భయంకర యుద్ధం జరుగుతుంది. వారు ఆయుధాలతో, నిన్ను కొట్టారు. వారితో నీవు గెలుస్తావో, లేదో తెలయదు. దూరం నుండి కొట్టే వారితో ఆయుధాలు లేని నీవెట్లా యుద్ధం చేస్తావు? నన్నెట్లా రక్షిస్తావు? నీవు వారిదగ్గరకు పోయి కొట్టాలి కదా! నిన్ను కొట్టుతుంటే నాకు దెబ్బలు తగలవా? దెబ్బల సంగతి అటుంచి, క్రూర రాక్షసులను చూడగానే నా మనస్సు తల్లడిల్లదా? నేను సముద్రంలో పడిపోతానేమో! పడగానే నన్ను, పట్టుకుని రావణుడికి అప్పగిస్తారు కదా! ఇందులో ఏది జరిగినా క్రమ మార్గం తప్పుతుంది కదా! వారికి చిక్కిన నన్ను ముక్కలు, ముక్కలుగా కోయరా? జయాపజయాలు దైవాధీనాలు. బలహీనుడు గెలవొచ్చు, బలవంతుడు ఓడిపోవచ్చు. నీవు గెలిచినా, సముద్రంలో నేను పడిపోక పోయినా, రాక్షసుల సింహనాదాలు వినగానే నాప్రాణాలు పోవా? అప్పుడు నీవు చేపట్టిన పనంతా వ్యర్థమే కదా!"

"నేనిలా మాట్లాడుతున్నానంటే, నువ్వు యుద్ధంలో రాక్షసులను గెలవలేవని అర్థం కాదు. నీవు తప్పక గెలుస్తావు. అలా నీవు గెలిస్తే, లోకమంతా అనివార్యంగా, నిరంతరంగా నిండివున్న రామచంద్రుడి కీర్తి తగ్గిపోదా? అలా చేయడం నీకు తగిన పనేనా? అలాకాకపోయినా, రాక్షసులు నన్ను పట్టుకునిపోయి, రామలక్ష్మణులకు, వానరులకు తెలియరాని చోట దాచిపెట్టే, నీ శ్రమకు ఫలితం వుండదుకదా? ఇంకో సంగతి, రామలక్ష్మణుల ప్రాణం, సుగ్రీవుడి ప్రాణం

క్షేమంగా వుండాలంటే, అది నా క్షేమంపైనే అధారపడి వుంది. నేను క్షేమంగా లేకపోతే, మీకెవరికీ క్షేమం లేదు. కాబట్టి వెంటనేపోయి, సీత సుఖంగా వుందని చెప్పి, రాముడిని ఇక్కడకు తీసుకునిరా. నీకు శుభం కలుగుతుంది".

"నీ వెంట రాకపోటానికి, మరో ముఖ్య కారణముంది. నా భర్తపై నాకున్న భక్తివల్ల, మగవాడిని, రాముడిని, తప్ప మరెవ్వరినీ తాకను. రావణుడు తాకలేదా అంటే, అప్పుడు నేను పరాధీనను, మూర్ఛపోయాను, బలం లేనిదాన్ని, వేరే సహాయం లేనిదాన్ని, దిక్కులేనిదాన్ని, ఒంటరిదాన్ని. ఇక రావణుడు, బలవంతుడు, సహాయ సంపత్తి కలవాడు. నేను అప్పుడు ఏమీ చేయలేని స్థితి. ఇప్పుడలా కాదు. నేను బుద్ధిపూర్వకంగా నిన్ను తాకాలి. అలా చేయటానికి నామనస్సు ఒప్పుకోదు. ఈ వాస్తవాన్ని ముందే చెప్పితే, నీవేమనుకుంటావోనని, చివరకు చెప్తున్నాను".

"రామచంద్రమూర్తి వచ్చేవరకు ఆగలేను. అయినా, నేను రాలేను. జరగాల్సింది ఏంటంటే, రాముడు, రావణుడిని, యుద్ధంలో, ఈ లంకలోనే చంపి నన్ను తీసుకోపోవడం. అదే ఆయన యోగ్యతకు తగిన పని. ఆయన రాడు, నన్ను రక్షించలేడు, అన్న సందేహం వుంటే కదా, నేను నీ వెంట రావాల్సింది. నాకా, అట్టి సందేహం ఏమాత్రం లేదు. శ్రీరాముడి యోగ్యతకు తగనిదీ, ఆయనకు కష్టసాధ్యమైనదీ, సందిగ్ధమైంది, నేనుకోరడం లేదు. ఎలాంటి విరోధులనైనా చంపేశక్తి, దండించే పరాక్రమం, ఆయనకున్నదని చెప్తే విన్నాను. కళ్లారా చూసాను. ఆయన శక్తి నాకు తెల్సు. ఆ సమర్థుడి ఎదుట యుద్ధభూమిలో నిల్చే శక్తి ఇంద్రాది దేవతలకు కానీ, పన్నగులకు కానీ, దేవదానవ రాక్షస సమూహాలకు కానీ లేదు".

"జయాపజయ విచారం సామాన్యుల విషయంలోనే కాని, రామచంద్రమూర్తి విషయంలో అపజయం అనే శంకలేదు. రాముడితో ఎదుటబడి యుద్ధం చేయడం మాటలా వుంచితే, యుద్ధంలో ఆయనను చూసి సహించే బలశాలి ఎవరూ లేరు. మహాబలశాలి, ఇంద్ర పరాక్రముడు, చిత్రమైన ధనస్సున్న వాడు, ఆశ్చర్యకరమైన నడవడి కలవాడు, లక్ష్మణుడితో కూడిన రామచంద్రమూర్తి, యుద్ధంలో కనిపించగానే, గర్వభంగం కాని మొనగాడెవడూ

లేడు. వాయువు ప్రేరణున్న అగ్నిలాంటివాడిని, అష్టదిగ్గజాలకు సరితూగేవాడిని, ఎదిరించి బ్రతుకగల వాడెవరయ్యా! ప్రళయకాల రుద్రుడి వలె వేడి కలవాడు, గురితప్పని లక్ష్యమున్న బాణంకలవాడు, వ్యర్థంకాని సంక బలుడు, రామచంద్రమూర్తి, లక్ష్మణుడిని కూడి వుండగా, యుద్ధంలో ఎదిరించేందుకు మనసునందైనా సాహసించేవారున్నారా? కాబట్టి హనుమంతా! నేను చెప్పిన ఈ ఉపాయం తప్ప తక్కినవన్నీ వదిలేయి. నీవు త్వరగా లక్ష్మణ, సుగ్రీవులతో కూడిన రామచంద్రమూర్తినే లంకకు తీసుకొచ్చి, రావణుడిని చంపి, నన్ను తీసుకుని పొమ్మని ఆయనతో చెప్పు. ఆయనకొరకు తీవ్ర దుఃఖంతో వున్న నన్ను కృతార్థురాలిని చేయి. నీకు పుణ్యముంటుంది" అని చెప్తుంది.

(హనుమంతుడి వెంట పోనని సీత అనటానికి సరైన కారణముంది. ఆ కారణాలు విశ్లేషించి చూస్తే: రాముడు రావణుడిని గెల్వలేక, రావణుడి లాగానే దొంగచాటుగా సీతను అపహరించుకుని పోయాడన్న నిందా, హనుమంతుడే లేకపోతే, రాముడు సీతను దక్కించుకోలేడన్న అపకీర్తి తన మగడికి వస్తుంది కనుక అలా చేయవచ్చునా అన్న సందేహం మొదటి కారణం. వెంటపోతే తన ప్రాణం దక్కుతుందేమో కాని, రావణుడికి శిక్ష పడేదెట్లా? శిక్షించకపోతే వాడు ఇంకెన్ని అనర్థాలు చేస్తాడేమోనన్న సంశయం రెండో కారణం. మరోకారణం, రావణుడెత్తుకొచ్చిన స్త్రీలకు తనలాగా విముక్తి కలగాలంటే, వాడు చావాలి. వాడిని చంపగలిగిన వాడు తన మగడేనన్న విశ్వాసం. ఇకచివరిది, రామచంద్రమూర్తి రావణుడిని చంపుతానని చేసిన ప్రతిజ్ఞ నెరవేరాలంటే, తాను ఇక్కడే వుండాలన్న నిర్ణయం. "మగవాడిని, రాముడిని" తప్ప అన్యులను తాకను అనడంలో అర్థం: శ్రీరామచంద్రుడొక్కడే పురుషుడని, తక్కిన వారందరూ స్త్రీలని అనుకోవాలి."భగవంతుడు, వాసుదేవుడు" మాత్రమే పురుషుడు. తక్కిన బ్రహ్మాదులతో కూడిన ప్రపంచమంతా స్త్రీ మయమే! స్త్రీ-స్త్రీ తో కలిస్తే ఆనందం లేదు కదా! అంటే, "జీవాత్మ", "భగవంతుడితో" సాయుజ్యం పొందితేనే ఆనందం కలుగుతుందికాని, బ్రహ్మాదులతో సాయుజ్యం కలిగితే మళ్లీ పుట్టాల్సిందే, మళ్లీ దుఃఖపడాల్సిందే!

సీతాదేవి మరో అభిప్రాయంలో "ఆత్మనిక్షేపం, పారతంత్ర్యం" స్పష్టంగా చెప్పడం జరిగింది. "ప్రపన్నులు" తప్ప తక్కిన "ముముక్షువు" లందరూ, భగవత్

ప్రాప్తికి, “భక్తో, కర్మయోగమో, జ్ఞాన యోగమో, అష్టాంగ యోగమో”, ఏదో ఒకటి సాధనంగా (ఉపాయంగా) స్వీకరిస్తారు. ప్రపన్నుడు ఈ సాధనాలేవీ ఆశించడు. భగవత్ ప్రాప్తికి భగవంతుడే సాధనమనీ, ఆయనే వచ్చి తనను తీసుకోపోవాలనీ భావిస్తాడు. ప్రపన్నుడు భగవంతుడిని తప్ప మరే సాధనం కోరినా, భగవత్ ప్రాప్తి తప్ప మరే ఫలం కోరినా, భగవంతుడిని తప్ప మరే దేవతను ఆశ్రయించినా, ప్రపత్తి చెడుతుంది, ఫలించదు. హనుమంతుడి వెంట సీతాదేవి వెళ్ళి వుంటే, ఆమెను రామచంద్రమూర్తి భ్రష్టురాలివైనావని స్వీకరించి వుండడు. కాబట్టి “ప్రపన్నులు” అన్ని విధాలుగా “అనన్య” లై వుండాలి. “భక్తుడికీ, ప్రపన్నుడికీ” భగవంతుడు తన పాలిట వున్నాడనుకోవటానికి అనేక నిదర్శనాలు అనుభవ పూర్వకంగా తెలుస్తాయి. వాటిని బట్టి తక్కినవి ఊహించుకోవచ్చు. శ్రీరామచంద్రమూర్తి తక్కిన అందరు దేవతలకంటే గొప్పవాడని తెల్సుకోగలుగుతాడు. ఇట్టి ఉత్తమోత్తమ దేవతను సాధించే “ప్రపత్తి”నే ఉత్తమోత్తమ “ఉపాయ”మని ఎరిగి దృఢ చిత్తంతో, అనన్యుడిగా వుండాలి. అందుకే సీత అంటుంది: తక్కిన అన్ని “ఉపాయాలూ” వదలమని. గుహలో వున్న భగవంతుడిని తాను వెతుక్కుంటూ పోలేను, ఆయన్నే ఇక్కడకు రప్పించమని. శిష్యుడు, ఆచార్యుడిని కోరడమే యిది. హనుమంతుడి జవాబులో “ఆచార్య కృత్యం” కూడా వుంది).

❖ ❖ ❖

సర్గ-38

సీతాదేవి చెప్పిన కారణాలను విని ఆమెను ప్రశంసించిన హనుమంతుడు

హనుమంతుడు వాక్య విశారదుడు. తర్క పండితుడు. అందువల్ల, రామానుగ్రహం కొరకు, తాను చెప్పిన ఉపాయం మంచిదా, లేక, సీత చెప్పిన ఉపాయం మేలా, అని తర్క-యుక్తులతో, ఆలోచిస్తాడు. ఆమె చెప్పిందే బాగుందనుకుని, సీతాదేవిని చూస్తూ, సంతోషంతో, ప్రశస్తమైన మాటలతో, "చారుదర్శనా" అంటూ సంభోధిస్తూ ఇలా చెప్తాడు:

"నువ్వు చెప్పిన మాటలు వింటుంటే, అవి స్త్రీ చెప్పేందుకు మంచి యుక్తమైనవిగనూ, స్త్రీల స్వభావానికీ, సదాచార సంపత్తిగల పతివ్రత నడవడికీ, తగ్గట్లున్నాయని అనిపిస్తోంది. అప్పుడు నీ దుఃఖాన్ని చూడలేక అలా చెప్పాను. అయితే నేను చెప్పినట్లు, ఆడది మగవాడి వీపు పైనెక్కి కూర్చొని రావడం, ఘోర రణంలో ప్రవేశించడం, పతి ఆజ్ఞ లేకుండా స్వతంత్రించి, స్వేచ్ఛగా ప్రవర్తించడం, పతివ్రతకు తగ్గ పనులు కావు. నీవు క్షత్రియకన్యవు. రాముడి భార్యవు. ఘోరారణ్యాలలో తిరిగావు. ఎంతో ధైర్యశాలివి. అయినా, నూరామడల సముద్రాన్ని నా వీపుపైకెక్కి దాటేందుకు ఎప్పుడైతే భయపడ్డావో, అప్పుడే, నీ ఆడతనపు పిరికితనం బయట పడ్డదనుకుని పొరబడ్డాను. నీవు నా వెంట రాకపోవటానికి చెప్పిన మరోకారణం, నేను పరపురుషుడిని కావటమే. ఇట్లా అనటానికి రామచంద్రమూర్తి భార్యవైన నీకు మాత్రమే తగిందికాని, వేరెవరైనా స్త్రీలు ఇలాంటి ఆపద్దశలో వుంటే అనగలరా? ఏదో విధంగా తప్పించుకుని పోవాలనుకుంటారు".

"దేవీ! ఇక్కడి సంగతులన్నీ....అంటే, నీవు నా ఎదుట రావణుడికి, రాక్షస స్త్రీలకు, నాకు చెప్పిన మాటలను, రామచంద్రమూర్తికి విన్నవించుకుంటాను. నీ ఏడ్పులు, వురిపోసుకునేందుకు నువ్వు చేసిన ప్రయత్నం కూడా చెప్తాను. నీ కష్టాలను చూసి, రాముడిపైనున్న భక్తితో నా వెంట రమ్మన్నానే కాని,వేరే కారణం లేదు. నన్ను తప్పుగా ఎంచక క్షమించు. సముద్రాన్ని దాటడం మొదటి

అసాధ్యం, లంకలో చొరబడడం అంతకంటే అసాధ్యం. ఈ కష్టాలన్నీ ఆలోచించి, నాకు ఆ శక్తి వున్నదికాబట్టి, సాధించగలనన్న ఆశతో, నీ భర్తవద్దకు ఎలాగైనా నిన్ను చేర్చాలన్న సదభిప్రాయంతోనే అలా అన్నాను".

"నాతో నీవు రావడానికి అంగీకరించలేదు కనుక, నేనిక్కడ కొచ్చినట్లు, నిన్ను చూసినట్లు, రామచంద్రమూర్తి నమ్మదగ్గ గుర్తేదన్నా ఇవ్వు. లేకపోతే నా మాటలు ఆయన నమ్మడేమో! ఉత్త మాటలు నీవు నమ్మవని ఆయన ఉంగరం ఆనవాలుగా తెచ్చాను. అలాగే నీవుకూడా ఆయన్ను నమ్మించే గుర్తు ఏదన్నా ఇవ్వు తల్లీ!" అంటాడు హనుమంతుడు.

హనుమంతుడికి కాకాసుర వృత్తాంతం చెప్పిన సీత

ఆంజనేయుడి మాటలు విన్న సీతాదేవి కళ్లనుండి నీరు కారుతుంటే, మెల్లగా హనుమంతుడితో, శ్రీరాముడికి మంచి గుర్తు చెప్తాను వినమంటుంది. ఆ విషయాన్ని చెప్తున్నన్నంత సేపూ, ఎక్కువగా, సీత ప్రత్యక్షంగా ఆయనకు చెప్తున్నట్లే, ఆయన్నే సంభోదిస్తుంది. ఒక్కోసారి ఆయన్ను పరోక్షంలో వుంచుకున్నట్లుగా హనుమంతుడిని సంభోదిస్తుంది. మొదట రాముడిని వుద్దేశించి కథ చెప్తుందీ విధంగా:

"పూర్వం చిత్రకూటంలోని, మందాకినీ తీరం దగ్గర నివసిస్తున్నప్పుడు, ఓనాడో కాకి, నన్ను మాంసమనుకుని, తన ముక్కుతో పొడవగా, ఓ మట్టిపెళ్లను ఆ తుంటరి కాకి మీద విసిరాను. అయినా అదిపోకపోతే, కోపంతో దాన్ని తరిమి కొట్టటానికి, నా ఒడ్డాణం తీసాను. అప్పుడు నాచీరె జారిపోవడం, నీవు నవ్వడం, సిగ్గుతో నేను ఆయాసపడడం జరిగింది. కాకిముక్కుతో గీకిందన్న కోపం, నువ్వు నవ్వడంతో కలిగిన సిగ్గుతో, ప్రయాసపడి వొచ్చి నీ ఒళ్లో చేరాను. అప్పుడు నా కళ్లల్లో నీళ్లు కారుతుంటే, నీవు నన్ను ఓదార్చలేదా? అట్లా అలసిపోయి, నిద్ర రాగా, నీ తొడమీద పడుకున్నాను. ఆ వెంటనే నేను లేవగా, నా తొడపైన తలవుంచి నీవు పడుకున్నావు".

"రామచంద్రమూర్తీ! నీవు నిదురించగానే, ముందు బాధపెట్టిన కాకే, నా దగ్గరకొచ్చి, నా స్తనాలను గీరి, ముక్కుతో నాకు బాధకలిగేటట్లు పొడిచింది.

ఆ గాయం నుండి రక్తం కారి, ఆ బొట్లు నిదురిస్తున్న నీ పైన పడ్డాయి. ఆ పాపపు పక్షిపెట్టే బాధ సహించలేక, సుఖంగా నిద్రిస్తున్న నాధుడిని, శ్రీకాంతుడిని, శత్రుమర్దనుడిని, నిన్ను లేపాను. అప్పుడు నీవు లేచి, నా స్తనములందున్న గాయాన్ని చూసి, కోపంతో, ఈ పాపం చేసినవాడెవ్వడో చెప్పు, వాడినిప్పుడే రూపుమాపెద నన్నావు. రోషంతో బుసలు కొట్టే ఐదు తలల పాముతో ఆడుకుంటానికి సాహసించిన వాడెవరని అంటూ, నాకెదురుగా వున్న కాకిని నెత్తురుతో తడిసిన గోళ్లతో చూసావు. నీవు చూడగానే, కాకిరూపంలో వున్న ఇంద్రుడి కొడుకు, గాలిలాగా కొండ దిగి పరుగెత్తసాగాడు". (ఇంద్రుడు అహల్యను చెరచదల్చి, ఒకనాటి రాత్రి, కాకిలాగా కూసాడు. ఇదితెలుసుకున్న గౌతముడు, ఇంద్రుడిపైన కోపించి, అతడికి కాకి రూపమే శాశ్వతంగా వుండాలని శపిస్తాడు. అయితే దేవతలు, ఋషులు, గౌతముడిని ప్రార్థించగా, శాపం ఇంద్రుడి కొడుక్కు తగిలేటట్లూ, రామబాణ పీడితుడై, ఆయనవల్ల రక్షించబడి, శాపవిముక్తు డయ్యేటట్లు చేస్తాడు).

శ్రీరాముడిని పరోక్షంగా వుంచుకుని, హనుమంతుడిని సంభోధిస్తూ: "పరుగెడ్తున్న కాకిని చూసి, కోపంతో, దయను వదిలేసి, దర్భాసనంలోని దర్భను తీసి, దాన్నే బ్రహ్మాస్త్రంగా కాకిమీద వేసాడు. (అస్త్రం అంటే మంత్రించి విసిరివేసే ఆయుధం. శస్త్రం అంటే హింసించడానికో, చికిత్సకో ఉద్దేశించబడింది. నియమ నిష్టలుంటేనే అస్త్రం పనిచేస్తుంది. శస్త్రం ఒక పరికరం లాంటిది) ఆ దర్భపోచ ఆకాశంలో పోతున్న కాకిని వెంటాడింది. ఆ కాకి ముల్లోకాలు తిరిగి, ఎంతోమంది శరణు కోరింది. ఇంద్రుడు, బ్రహ్మాది దేవతలు, గొప్ప మహర్షులు, అందరూ దానిని కాపాడలేమని చెప్పారు. వేరేగతిలేక మళ్లీ తిరిగొచ్చి రాముడినే శరణుకోరింది".

"శరణు-శరణని భూమిపై సాగిలబడిన కాకిని చూసి, అది చంపబడాల్సిందే అయినా, దయతల్చి వదిలేసావు. ప్రపంచంలో, ఏ ఒక్కడైనా కాపాడలేకపోయిన ఆ కాకి నీ శరణుజొస్తే, దాన్ని చూసి నీవు, బ్రహ్మాస్త్రం వ్యర్థం కాదు, ఏమిస్తావని అడిగావు. అది తన కుడి కంటిని తీసుకొమ్మంది. ఆ భయంకర బాణం దాని కుడికన్ను హరించి వేసింది. కాకేమో చావు తప్పి

కన్నులొట్టబోగా, రాముడినీ, దశరథుడినీ తలచుకుంటూ, నమస్కరిస్తూ పోయింది".

"నరేంద్రా! నాకు చిన్న బాధ కలిగితేనే, ఆ బాధ కలిగించిన కాకి పైన బ్రహ్మాస్త్రం ప్రయోగించావే! నిన్ను తిరస్కరించి, ఇంతకాలం, ఇంత బాధపెడుతున్న ఈ క్రూరుడిని ఎందుకు ఉపేక్షిస్తున్నావు? ఇలా చేస్తే, నీవు నరేంద్రుడవెట్లా అవుతావు? నీ నరేంద్రత్వానికి హాని రాదా? జగన్నాథా! నీ బలపరాక్రమ సాహసాలెట్టివో, ఎంతటివో నేనెరుగుదును. తెలియబట్టే నీవు నన్ను తప్పక రక్షిస్తావని నమ్మి వున్నాను. అన్ని గుణాలలో దయాగుణమే శ్రేష్టమని నీవు నాతో చెప్పావుకదా! ఆ దయ బాధపడ్తున్న నామీద ఎందుకు చూపడం లేదు? నిన్ను నాథుడిగాగల నేను అనాథలాగా పడి వున్నానే! ఇలా చేయడం నీకు ధర్మమేనా?" అని భావగర్భితమైన వాక్యాలు రాముడిని గురించి అన్న సీత, హనుమంతుడితో, రాముడి ఉపదేశ పాండిత్యం ఆచరించడంలో లేదా? అని అడగమంటుంది. ఇంకా ఇలా అంటుంది:

"హనుమా! సముద్రం లాంటి గాంభీర్యం కలవాడు, ప్రకాశించే పరాక్రమం గలవాడు, శత్రుసంహారంలో సమర్థుడు, ఇంద్రుడితో సమానమైన రామచంద్ర భూపాలుడు చతుస్సముద్రాలతో నిండిన భూమండలానికి భర్త. ఇలాంటివాడు, అస్త్రవిద్యలో పండితుడు, శ్రేష్టుడు, మంచి బలవంతుడు, మంచి స్వభావం కలవాడూ అయిన రామచంద్రమూర్తికి నా మీద కాస్తయినా దయవుంటే, ఎందుకొక్క అస్త్రం సంధించడు? ఉత్తమ దివ్యాస్త్రాలను కలిగి వున్న రాముడు, రాక్షసుల మీద ఎందుకు పదునైన అస్త్రాలు వేయడం లేదు? దేవదానవులు, పన్నగ గంధర్వులు, యుద్ధభూమిలో ఆయన వంకైనా స్థిరంగా చూడలేరే? అట్టివాడు, నామీద ప్రేముంటే, రాక్షసులను చంపడా? దీనికి కారణం ఏమీలేదు....నామీద దయలేకపోవటమే!"

"ఆంజనేయా! రామచంద్రమూర్తి ఉపేక్ష చేసినా నన్ను తన తల్లిలాగ చూసుకునే లక్ష్మణుడు, నావలెనే పరతంత్రుడైనా, అన్న అనుమతి తీసుకుని, నన్ను రక్షించే ప్రయత్నం ఎందుకు చేయలేదు? ఆయన పగవారిపాలిట యముడే! దోషం కల భార్యలను భర్తలు విడిచిపెట్టవచ్చుగాని, దోషం కలదైనా

తల్లిని కొడుకు విడిచి పెట్టవచ్చా? అలాంటిది లక్ష్మణుడు నన్నేల విడిచిపెట్టాడు? అన్నదమ్ములిద్దరూ అగ్ని, వాయువు లాంటివారు. ఎవరూ ఓడించిజాలని సమర్థులు. వారు నన్నుపేక్షించడానికి కొద్దో-గొప్పో నేను చేసిన దుష్కృతం తప్ప ఇంకే కారణం కనిపించడం లేదు. వాళ్లలో దోషముందని ఎట్లా అనను? వారు సమర్థులే! నా మీద ప్రేమలేనివారు కాదే! కాబట్టి దోషం నాదే! “

ఇలా శోకంతో కూడిన మాటలను, కళ్లల్లో నీరు కారుతుంటే, కలవరపడుతూ, అడుగుతున్న సీతాదేవిని చూసి, ఓదార్పు మాటలతో హనుమంతుడు, సీత కష్ట కాలం పోయిందనీ, దుఃఖం అంతరిస్తుంద, లంక నెప్పుడు భస్మం చేయాలా అని రామలక్ష్మణు లిద్దరూ ఎదురు చూస్తున్నారనీ అంటాడు. సీతకు ద్రోహం చేసిన రావణుడిని బంధువులతో సహా చంపి శీఘ్రంగా అయోధ్యకు రామచంద్రుడు తీసుకుపోయే సమయం వచ్చింది అంటాడు.

హనుమకు చూడామణి ఇచ్చి రామలక్ష్మణులకు సందేశం పంపిన సీత

“అమ్మా, నేను పోయి సీతాదేవిని చూశానన గానే, శ్రీరాముడు, లక్ష్మణుడు సుగ్రీవుడు, వానరులైన నా స్నేహితులు, మాకేం చెప్పిందంటే, మాకేం చెప్పిందని అడుగుతారు. నీమాటలుగా, వారందరికీ ఏం చెప్పాలో చెప్ప” మని ఆంజనేయుడు అడుగుతాడు సీతను. దుఃఖంతో కన్నీరుకారుస్తూ, సీతాదేవి సమాధానమిస్తుంది హనుమంతుడికిట్లా:

”కుశల మడిగానని చెప్పు. నాకు బదులుగా ఇది సీత నమస్కారమని రాముడికి మ్రొక్కు. మీ క్షేమ సమాచరం అడిగానని చెప్పు. నేను రక్షించమని అడిగానని మాత్రం చెప్పవద్దు. నీవు మిత్ర శ్రేష్ఠుడవు. ఇదే నీవు నాకు చేయవలసిన ఉపకారం. (ఇదివరకు తన్ను రక్షించమనికోరి మహాపరాధం చేసాననుకుంటుంది. ప్రపన్నురాలు అలాంటి కోరికలు కోర రాదు. భగవత్ కృత్యం ఆయనకు నేర్పి “దురహంకారి” నైనా ననుకుంటుంది సీత. అంటే ఆయనపై “విస్మృతి” దోషం ఆరోపించినట్లే! ఆయన రక్షణ చేస్తాడన్న విషయంలో

విశ్వాసం లేక పోవటమే! అయన సొత్తు కాపాడుకున్నా, పోగొట్టుకున్నా, బలవంత పెట్టేందుకు తనెవరనుకుని, దోష నివృత్తి కొరకు, ప్రాయశ్చిత్తంగా "నమస్కరిస్తున్నా" నని మాత్రమే చెప్పమంటుంది.)

"ఆంజనేయా! శ్రీరాముడు, నేనూ అడవులకు రావటానికీ, లక్ష్మణుడు రావటానికీ, చాలా తేడా వుంది. రామచంద్రమూర్తి తండ్రి ఆజ్ఞ మీరలేక, నిర్బంధంగా వచ్చాడేకాని, సంతోషంగా, బుద్ధిపూర్వకంగా రాలేదు. ఆయన వచ్చాడు కాబట్టి భార్యనైన నాకు తప్పిందికాదు. రాముడి రాకను సమ్మతించిన వారెవ్వరూ లేరు. లక్ష్మణుడి విషయం అలాంటిదికాదు. అరణ్యాలకు రావాల్సిన కారణంలేదు. ఆయన చేసిన పనికి, ఆయన భక్తికి అందరూ సంతోషించారు, సమ్మతించారు. సంచార యోగ్యమైన, మనోహరమైన ఇళ్లను, భోగభాగ్యాలను, సేవకులను, బుద్ధిపూర్వకంగా వదిలేసి, తల్లి, తండ్రులను గౌరవించి, సమాధానపర్చి, వారి అనుగ్రహానికి పాత్రుడై అరణ్యాలకు బయల్దేరాడాయన. తనలా పోవడంవల్ల ప్రయోజనం లేకపోయినా, అన్న ఒక్కడే పోతున్నాడన్న ఆలోచనతోనూ, ఆయన పిలుస్తే మారు పలికే మనిషి లేడనీ, ఆయన ఏకాంతానికి ఏ ఇబ్బందీ లేకుండా చూద్దామనీ అడవుల్లోకి వచ్చాడు. ఆయనెంత సుగుణవంతుడో కదా!"

"అడవుల్లో ఎట్లా వున్నాడో తెలుసా? అసమాన పరాక్రమవంతుడైనా, గర్వమనేది లేక వినయంగా మసిలేవాడు. అది ఆయన గురువులవద్ద నేర్చుకున్న విద్యాఫలం. సత్పురుషులకు ప్రియంగా వుండేవాడు. సుఖాలన్నీ త్యాగం చేసి, అన్న కొరకే, కష్టకాలంలో, ఆయన కనుకూలంగా, ఆయన సేవే చేస్తుండేవాడు. ఆయనకు మేలుచేయటమే తెలుసుకాని, ద్రోహబుద్ధి అంటే ఏమిటో తెలియదు. ఆయన్ను చూస్తుంటే సౌమ్యుడనే విషయం వెంటనే తెలిసిపోతుంది. సింహబలుడిలాంటి వాడు. అన్ని విషయాల్లోనూ, మా మామగారికి సమానమైన వాడు. రావణాసురుడు నన్నెత్తుకొచ్చిన సంగతి ఆయనకు తెలిసుండదు. తెలిస్తే వాడినక్కడనే చంపేసేవాడు".

"లక్ష్మణుడు పెద్దల దగ్గరుండి వారి సేవ చేసినవాడు. కాంతిమంతుడు, మితంగా మాట్లాడుతాడు. మామగారికి ముద్దుల కొడుకు, నాకు ముద్దుల

మరది. ఎంతకష్టమైన పనిచెప్పినా, చేతకాదనకుండా చేసేవాడు. ఎంతబరువైనా మోసేవాడు. ఆయన పక్కనుండడంతో, తండ్రి లేడే అన్న భావనేలేకపోయింది. దయాగుణం కలవాడు, దాక్షిణ్య స్వభావమున్న వాడు. నిర్మలమైన, మృదువైన, మనస్సున్నవాడు. ఎట్టిదోషం లేనివాడు. శ్రీరాముడి ప్రియ సోదరుడు. అలాంటి లక్ష్మణుడి క్షేమం అడిగానని చెప్పు హనుమంతా! ఎలా నచ్చ చెపితే, శ్రీరామచంద్రమూర్తి తక్షణమే ఇక్కడకు వస్తాడో, ఆవిధంగానే విషయాలన్నీ క్షుణ్ణంగా చెప్పు".

"వానరేంద్రా! నా దుఃఖం సమసిపోవాలి. ఇదే నాకు కావాల్సింది. దాని కొరకు నా మగడు, ఎలాంటి ప్రయత్నం చేస్తే నన్ను రక్షించగలడో, అదంతా ఆయనతో చేయించాల్సిన వాడివి నీవే! ఆ భారం నీ మీదే వుంది. ఒక్కమాటమాత్రం ఆయనకు మళ్లీ-మళ్లీ చెప్పు. ఎంత కష్టమైనా సహించి ఇంకొక్క నెల ప్రాణాలు బిగపట్టుకుంటాను. ఆ పైన నేను నిల్పుకోవాలన్నా ప్రాణం నిల్వదు రామచంద్రా! అన్నానని చెప్పు. పూర్వం ఇంద్రుడికి రాజ్యలక్ష్మిని చేర్చినట్లు నన్నుద్ధరించమను. తన సొమ్మును తనే కాపాడుకోవాలని చెప్పు".

(రావణుడిచ్చిన గడువు ఇంకా రెండు నెలలుండగానే, నెలరోజులకే ప్రాణం విడుస్తానని ఎందుకంటున్నది సీత? ఇది పద్నాలుగవ సంవత్సరం, ఫాల్గుణ మాసం. సీతారామలక్ష్మణులు అయోధ్య విడిచి వెళ్లింది చైత్ర శుద్ధ చతుర్థి. పద్నాలుగు సంవత్సరాలు నిండడానికి ఇంకా పంతొమ్మిది రోజులే మిగిలి వున్నాయి. పదిహేనవ సంవత్సరం మొదటి రోజున, రాముడు రాకపోతే అగ్నిప్రవేశం చేస్తానని భరతుడు శపథం చేసాడు. రామచంద్రమూర్తి దాన్ని ఒప్పుకున్నాడు. అంటే ఆ రోజు కింకా ఇరవయ్యోరోజు, అయోధ్యలో రాముడుండక తప్పదు. భరతుడు మరణిస్తే, కౌసల్య, సుమిత్ర, కైకేయి, శత్రుఘ్నుడు కూడా మరణిస్తారు. వంశనాశనం జరుగుతుంది. దాన్ని నా కొరకు రామచంద్రుడు ఎట్లా సహించగలడు? కావున అయోధ్యకు పోక తప్పదు. రాముడొస్తాడు, తన్ను రక్షిస్తాడన్న ఆశతో వున్న సీతకు, ఆయన అయోధ్యకు పోయాడని తెలిసి, ఆశాభంగమై ప్రాణాలు పోతాయి. అందుకే నెల రోజులు గడువిచ్చింది)

తన మాటలుగా రామచంద్రమూర్తికి చెప్పమని ఎన్నో విషయాలు చెప్పిన సీతాదేవి, ఆ తర్వాత తన కొంగులో ముడివేసి దాచుకున్న "చూడామణి" ని తీసి, రామచంద్రమూర్తి కిమ్మని హనుమంతుడికిస్తుంది. నిత్యమూ శ్రీరాముడికి పాదాభివందనం చేయడం సీతమ్మకు అలవాటు. అలా చేస్తున్నప్పుడు చూడామణిని (నాగరం లేదా కొప్పుబిళ్ల) రాముడు చూస్తుండడం వల్ల దానిని ఆయన తేలిగ్గా గుర్తు బడతాడు. అందువల్లనే చూడామణిని ఇచ్చింది సీతమ్మ. ఆమె ఇచ్చిన ఆ జడ బిళ్లను హనుమంతుడు తన వేలికి పెట్టుకున్నాడు. అప్పుడాయన చేయి పెద్దగాలేదు. సీతకు చూపించిన ఆకారాన్ని తగ్గించి, పూర్వంలాగా చిన్నగయ్యాడు. ఆ జడబిళ్ల ఆయన వేలికి ఉంగరం లాగా సరిపోయింది. తర్వాత ఆమెకు ప్రదక్షిణ చేసి, నమస్కరించి నిలబడ్డాడు. వచ్చిన పని అయిపోయిందన్న సంతోషంతో, హనుమంతుడు, శరీరాన్ని సీత దగ్గరుంచినా, మనస్సును రాముడిపై మళ్లించి, ఆయన్ను ఎప్పుడు చూస్తానా అని త్వరపడసాగాడు. అసమానమై, ఉత్తములు మాత్రమే ధరించదగి, సీతాదేవి తన మహాత్మ్యం వల్ల ధరించిన, చూడామణిని, హనుమంతుడు, తన బుద్ధిబలంతో పొంది, సంతోషించి, శ్రీరాముడి దగ్గరకు త్వరగా పోవాలన్న ఆలోచనలో పడ్డాడు.

❖ ❖ ❖

సర్గ-39

తనను గురించి శ్రీరాముడికి చెప్పమని హనుమంతుడిని వేడుకున్న సీత

చూడామణిని హనుమంతుడికిచ్చిన సీతాదేవి, ఈ మణి రామచంద్రమూర్తికి బాగా తెలుసనీ, దీన్ని చూడగానే తనను, తన తల్లినీ, దశరథ మహారాజునూ, ఆయన స్మరించుకుంటాడనీ చెప్తుంది. వివాహ సమయంలో, దీనిని జనకమహారాజు తనతల్లి చేతికిచ్చాడనీ, ఆమె, దశరథుడు, రాముడు చూస్తుండగా, తనతలలో అలంకరించిందనీ అంటుంది. హనుమంతుడికి ఉత్సాహం కలిగేవిధంగా, చెప్పగలిగినంత చెప్పాననీ, ఇక ముందున్న కార్యం ఎట్లా చేస్తే బాగుంటుందో, అది ఆయన్నే ఆలోచించుకోమనికూడా చెప్తుంది. (ఇప్పుడు ఆడవారు ధరించే పచ్చబిళ్ల లాంటిదే, ఈ జడబిళ్ల కూడా. సీతాదేవి జడబిళ్ల అంతా రత్నమే! అంత పెద్ద కెంపు అయినందునే దాన్ని "అతులితము", "మహార్హము" అని వర్ణించారు)

ఆంజనేయుడి మనసంతా, ఎక్కడో వున్నదని గ్రహించిన సీత, తను చెప్పేది వినమనీ, శ్రీరామచంద్రమూర్తినీ, ఆయన తమ్ముడినీ, ఆయనకూ, తనకూ ముఖ్యులైన వారితో కూడిన సుగ్రీవుడినీ, వానరులందు పెద్దవారినీ, ధర్మ పద్ధతిలో యధాచితంగా క్షేమాన్ని విచారించానని చెప్పమంటుంది. మహాబలవంతుడైన శ్రీరాముడు, ఏవిధంగా, మోయలేని ఈ దుఃఖ సముద్రాన్నుంచి తన్ను దరిచేరుస్తాడో, ఆ విధానాన్ని తెలుసుకుని, ఆ పద్ధతిలోనే ఆయన్ను ఒప్పించి, కీర్తిమంతుడివి కమ్మని చెప్తుంది. తాను దేహాన్ని చాలించకముందే, తనమగడు తన్నెట్లా రక్షించగలడో ఆలోచించి, బుద్ధి, చమత్కారాలున్న హనుమంతుడు, ఆయనకు నచ్చచెప్పి పుణ్యం కట్టుకొమ్మని అడుగుతుంది.

"సాహసవంతుల్లో అగ్రగణ్యుడవైన నీవు, సందేహానికి తావులేని మాటలతో, ఉత్సాహంతో చెప్తే, ఆ ప్రోత్సాహంతో, నా భర్త నన్ను ఆపద అనే సముద్రం నుండి కాపాడుతాడు. అట్లా కాకుండా, నువ్వు నీళ్లు నములుకుంటూ, లంక చాలా దూరముంది, చుట్టూ సముద్రముంది, దాటడం కష్టం, దాటినా రావణుడు బలవంతుడు, ఎలానో, ఏంటోనని సంశయాత్మకంగా చెప్పొద్దు. రామచంద్రా!

లే! సీతాదేవిని ఆ దుష్టుడైన రావణుడు బాధిస్తున్నాడు, మనం వెళ్లేవరకు బ్రతుకుతుందో లేదో, రావణుడేమీ లెక్క కాదు, నిమిషంలో పోయి లంకను నాశనం చేసి, రావణుడిని చంపి సీతను తీసుకొద్దామని చెప్పు. ఒక ఆడది దిక్కులేక, అల్లాడుతుంటే, ఇందరం మగవాళ్లం, పరాక్రమవంతులం, వూరికే వుండరాదని చెప్పు. నీవు నేను చెప్పినట్లు అనుకూల వాక్యాలతో చెప్తే, రాముడు తనపౌరుషాన్ని రాక్షసులపై చూపుతాడు" అంటుంది సీతాదేవి.

ఇలా అన్న సీతాదేవితో హనుమంతుడు: "దేవీ! శ్రీరాముడు వానరులతో, భల్లూకాలతో, శీఘ్రంగా ఇక్కడకు వచ్చి, శత్రువులను చంపి, నీ దుఃఖాన్ని పోగొట్టుతాడు. నీకొరకు రామచంద్రమూర్తి యుద్ధప్రయత్నం చేస్తే, దేవతలు, మానవులు, పన్నగులు, ఇంద్ర, సూర్య, యములు, ఎవరడ్డమొచ్చినా చచ్చిపోవాల్సిందే. ఇలా జయించి, ఈ భూమండలమంతా, పరిపాలించగలడు. రామచంద్రమూర్తి పరాక్రమాన్ని వర్ణిస్తున్నానేకాని, నిజానికి ఆయన విజయానికి మూలకారణం నీవే కదా! సత్యవంతుడికి సావిత్రిలాగా, రాముడికి నీవని చెప్పావుకదా! ఎందుకు మర్చిపోయావు? నీ పాతివ్రత్యం వ్యర్థమై పోదు. ఆయన్ను గెలిపించడానికి అదొక్కటే చాలు" అని బదులు చెప్తాడు ఆచార్యావతారమైన హనుమంతుడు. (ఆచార్యుడు అంటే జీవాత్మ-పరమాత్మలను అనుసంధానించే వాడని అర్థం. సీతమ్మ జీవాత్మ కాగా, రామచంద్రుడు పరమాత్మ కద! ఆచార్యుడిని భగవంతుడి అవతారంగా పెద్దలు భావిస్తారు.)

ఇలా చెప్పిన హనుమంతుడి మాటలకు, చెప్పిన విధానానికి, వాటిలోని యదార్థానికి, సీత సంతోషించి, ఆయన్ను ఎంతగానో మెచ్చుకుంటుంది. లంకలోనే, ఎక్కడైనా, ఆ పూటవరకు చాటుగావుండి, మర్నాడు సముద్రాన్ని దాటి పోవచ్చుకదా అంటుంది. (హనుమంతుడు లంకకు వస్తున్నప్పుడు సముద్ర మధ్యంలో మైనాకుడు ఎదురు వచ్చి కించిత్తు విశ్రమించి వెళ్లమంటే, ఇది రామకార్యం, రామబాణంలాగా వెళ్లి వస్తానని వానరులకు మాట ఇచ్చి బయలుదేరాను, మధ్యలో ఆగజాలను, అన్న మహానుభావుడు ఇప్పుడు ఒక రోజు ఆగమంటే ఆగగలడా? కార్య ఔచిత్యాన్ని, ఆవశ్యకాన్నీ హనుమంతుడు ఎలా భావించాడో తెలిసిందే. ఇది తెలుసుకుందామని సీతమ్మ కూడా

తలచిందేమో! హనుమంతుడు పరీక్షలో నెగ్గాడు. అరణ్యానికి రాముడు బయలుదేరి వెళ్లే సమయంలో కూడా దశరథుడు రామచంద్రుడిని ఒక్క రోజు ఆగి వెళ్లమంటాడు. రాముడు ఆగనేలేదు. రోమరోమంలో రామభావాన్ని నింపుకున్న రామదూత రాముడి వలెనే ప్రవర్తించడం గమనార్హం) ఇది తన మనస్సులోని మాటనీ,ఆయన మనసుకు నచ్చితే అలా చేయొచ్చనీ సూచిస్తుంది. అప్పుడే వచ్చి, మళ్లా అప్పుడే పోవటమంటే అలసటగా వుండవచ్చని చెప్పినా, ఆమె మనసులోని అసలు భావన: కొంతసేపైనా హనుమంతుడు సమీపంలో వుంటే, తనకు ధైర్యంగా ఉంటుందనే ఆశ. అంతసేపన్నా శోకతాపాలను విడిచి బ్రతకగలుగుతానన్న ఉద్దేశంతో అలా చెప్తున్నానని కూడా అంటుంది.

"ఆంజనేయా! ఒకరోజు నువ్విక్కడుంటే, నాకొచ్చే లాభం ఏంటి? ఆ తర్వాతైనా ఎప్పుడిలాగా ఏడ్వాల్సిందేకదా! నువ్వు మాత్రం ఎన్నాళ్లుంటావిక్కడ? నీకిక్కడ ఆలస్యమైతే, నీకోసం ఎదురుచూస్తున్న రామచంద్రమూర్తి, నాకంటే ఎక్కువగా పరితపిస్తాడుకదా! నువ్వు ఇక్కడుంటే జరగాల్సిన పనులెలా జరుగుతాయి? అందుకే శ్రీరాముడి దగ్గరకు వెళ్లి మళ్లీ రామచంద్రుడితో రా! మళ్లీ ఎన్నాళ్లకొస్తావో, ఏంటో! అంతవరకు నా ప్రాణం ఉంటుందో, లేదో? చెప్పలేను. ఎందుకంటున్నానంటే, నిన్ను చూడగానే పోయే ప్రాణాలు నిలబడ్డాయి. మరి నువ్వుకూడా పోతే ఆ ప్రాణాలుంటాయో, పోతాయో చెప్పలేను" అంటుంది.

"నువ్వెట్లాగూ సముద్రాన్ని దాటిపోతావు. రాముడికి నా సంగతులన్నీ చెప్తావు. ఆ అన్నదమ్ములిద్దరూ, వానర సేనతో సముద్ర తీరానికి వస్తారు. ఆ తర్వాత ఏం జరుగుతుందనేదే ప్రశ్న. ఎలుగుబంట్లు, వానరులు, రాజకుమారులు, అలవి కాని ఆ సముద్రాన్ని ఎట్లా దాటుతారయ్యా? ఈ భూ ప్రపంచంలో, నువ్వూ, గరుత్మంతుడు, వాయుదేవుడు, తప్ప ఇంకెవరూ ఈ సముద్రాన్ని దాటలేరని నా అభిప్రాయం. నేనాలోచిస్తున్న కొద్దీ, వారిక్కడకు రావడం, అసాధ్యమైన పనిలాగానే తోస్తున్నది. అయినా కార్యదక్షుడవైన నీకు చేయలేని పనేదీలేదు. దీనికి ఏమంటావు? ఎలా నెగ్గుకొస్తావో నాకు తెలియదు కాని, సాధించగలవాడివి మాత్రం నీ వొక్కడివే! నీ వలె ఎవరూ చేయలేరు, కీర్తినీ

పొందలేరు.” అని తన సందేహాన్ని వెలిబుచ్చుతుంది సీతాదేవి. ఇంకా ఇలా అంటుంది ఆమె:

“రామచంద్రమూర్తి సైన్యంతో వచ్చి, యుద్ధంలో బల-పరాక్రమాలను ప్రదర్శించి, రావణుడిని చంపి, నన్ను అయోధ్యకు తీసుకొని పోతేనే అది నాకు కీర్తికరం. అప్పుడే నేను వీరపత్నినన్న బిరుదుకు కూడా అర్హురాలిని అవుతాను. ఇది రాముడికి సాధ్యపడుతుందా, పడదా అనే సంగతి వేరే విషయం. కాని ఇంకే విధంగా జరిగినా నాకు కీర్తికరం కాదు. నేను చెప్పినట్లు చేసి, తన బలంతో, బాణాలతో లంకను భస్మం చేసి, నన్ను వెంట తీసుకునిపోతే, నాకేకాదు, శ్రీరాముడికీ కీర్తి. ఆయన వంశానికీ కీర్తి దక్కుతుంది. నా కోసం కాకపోయినా, తనకోసమైనా నేను చెప్పినట్లు చేయాల్సిందేనని నా కోరిక. ఆడదానినైన నా ఆలోచనా విధానమిది. యుద్ధంలో శూరుడైన రామచంద్రమూర్తికి తగినటువంటి చర్య ఏదో ఆలోచించి చెప్పు”.

సీతాదేవి చెప్పిన మాటలన్నీ, హితమైనవిగా, యుక్తియుక్తంగా, నిర్దోషమైనవిగా, ప్రయోజనంతో కూడినవిగా వున్న మంచిమాటలని భావించిన మారుతి చెప్పదలుచుకున్న మిగిలిన మాటలను ఆమెకు చెప్తాడు.

(సీత కోరరాని కోరికేమీ కోరలేదు. “పరమ భక్తులు, ప్రపన్నులు” భగవంతుడే స్వయంగా వచ్చి, తమను పిల్చుకోపోవాలని కోరుకుంటారు కాని, దూతలతో పిలిపించు కోవటానికి ఇష్టపడరు. అలా కాకపోతే మహారాజును ఆశ్రయించినా, వాడి సేవకుడిని ఆశ్రయించినా తేడా లేనట్లే గదా! సీత చెప్పిన “ఉపాయం” వలన, భక్తి-ప్రపత్తుల శ్రేష్టత్వం నిరూపించబడింది. సీత చెప్పిన “ఉపాయం” గొప్పదైనా, “ఉపేయం” కూడా గొప్పదే! ఉపేయం గొప్పదైతే, దాన్ని సాధించే ఉపాయం కూడ గొప్పగానే వుండాలి. “ఉపేయం” రామచంద్రమూర్తి, దాని సాధనోపాయం రామచంద్రమూర్తి రావడమే!)

సీతాదేవి సందేహాన్ని తీర్చిన హనుమంతుడు

వానర, భల్లూక రాజైన సుగ్రీవుడు సీత నిమిత్తమై, గొప్ప సైన్యంతో రాముడికి సహాయ పడేందుకు నిర్ణయించుకున్నాడనీ, ఆయనతో వచ్చే వారంతా

అసమాన పరాక్రమవంతులనీ, దేవతలతో సమానులనీ, మనోవేగం కలవారనీ, దిక్కులలో, ఆకాశంలో సంచరించే వారనీ, వారంతా శీఘ్రంగా రాబోతున్నారనీ, ధైర్యం చెప్పాడు సీతకు హనుమంతుడు. వారెటువంటి వారో చెప్తూ హనుమంతుడు ఇలా అంటాడు:

"ఎంతటి కష్టకార్యమైనా ఏ మాత్రం అలసట పడకుండా చేయగలుగుతారు. పరాక్రమవంతులు. సముద్రంతో, పర్వతాలతో వ్యాపించి వున్న భూమండలాన్ని ఆకాశమార్గాన చుట్టిరాగల సమర్థులు. వారికీ సముద్రం దాటడం చాలా చిన్నపని. వానరులలో సముద్రాన్ని దాటగల నాలాంటివారు చాలామంది వున్నారు. సుగ్రీవుడి దగ్గరున్నవారందరూ నా కంటే గొప్పవారో, సమానులో కాని తక్కువైన వాడొక్కడు కూడలేదు.

(విద్యాదదాతి వినయం అని ఆర్యోక్తి. సర్వ వేద వేదాంగ పారంగతుడు హనుమంతుడు. వినయమంటే ఎలా వుండాలో హనుమంతుడిని చూసి నేర్చుకోవాలి. నిజానికి అనంత వానర వీరవాహినిలో ఆయన్ను మించిన వారెవరున్నారని? కానీ, వాగ్విదామ్ వీరత్వం కూడా ఆయన శుభలక్షణమే. ఇలా సీతమ్మకు విన్నవించడంలో ఉదాత్త గుణసంపత్తి ఏ స్థాయిలో హనుమంతుడిని వరించిందో స్పష్టమౌతోంది)

వారిటు పక్కకు రానందున నువ్వు వారిని చూడలేదు. నా పుణ్యంకొద్దీ నేను రాగలిగాను, నిన్ను చూడ గలిగాను. అంతమాత్రాన వానరులందరిలో నేనే మొనగాడినని నీవెట్లా నిశ్చయించావు? వానరులందరిలో చిన్నవాడినీ, ఒక కోతినీ అయిన నేనే నిన్ను చూడగాలేంది, అసమాన బలవంతులైన ఇతరుల సంగతి చెప్పాలా? రాజు శత్రువుల దగ్గరకు పంపేటప్పుడు, అల్పులను మొదట పంపుతాడు కాని, మహాబలవంతులను పంపడు కదా! ఇది రాజనీతి. ఎందుకంటే బలవంతుడు శత్రువు దగ్గర చిక్కుపడితే తన బలం తగ్గుతుంది కాబట్టి".

(ఇది తెలివిగా చెప్పొచ్చు కాని, సత్యం కాదు. అయినా ఇట్టి అసత్యం నిజంగా అసత్యం కాదు. ఇది సీతాదేవికి ధైర్యం చెప్పడానికి, చెప్పి ఆమెను ప్రాణాలతో వుంచడానికి చేసిన పని. ఇందులో సదుద్దేశమే కాని, దురుద్దేశం లేదు. అసత్య దోషమూ లేదు. ఆమె సందేహ నివృత్తి చేయడం కూడా ఆయన ఉద్దేశ్యం)

"రామలక్ష్మణులు ఎట్లా వస్తారా అనే సందేహం కానీ, రారని శోకించడం కానీ వదులుకో. నీవు దుఃఖించే కాలంపోయింది. నేనుపోయి చెప్పగానే ఒక్క గంతేసి, వానరు లొస్తారిక్కడకు. రామలక్ష్మణులు, సూర్య, చంద్రుల్లాగా నా వీపు పైకెక్కి, నీ ఎదుట నిలుస్తారు. వారి బాణాగ్నికి లంకంతా పాడైపోతుంది. రావణుడిని సేనలతో సహా చంపి రాముడు నిన్ను అయోధ్యకు తీసుకుపోతాడు. మేమెప్పుడొస్తామా అని మా రాక కొరకు ఎదురుచూస్తుండు. ఏ సాహసం చేయొద్దీలోపల. మండుతున్న అగ్ని హోత్రం లాగా రామచంద్రమూర్తిని ఇక్కడ చూస్తావు. రాక్షసుడికే గతి పడ్తుందో చూడు. కొడుకులతో, చుట్టాలతో, మంత్రులతో చచ్చిపోయి రావణుడు నేలకూలగా చూసిన నీవు దుఃఖ సముద్రపు ఒడ్డుకు చేరుకుంటావు. రోహిణి చంద్రుడిని కలుసుకున్నట్లు, నీవూ నీ మగడిని కలుస్తావు".

ఇట్లా పలురకాలుగా సమాధానపరిచి ప్రయాణానికి సిద్ధపడిన హనుమంతుడు, సీతకు మరింత ధైర్యం కలిగేటట్లు మరికొన్ని మాటలు చెప్పాడిలా: "అమ్మా! విల్లు, బాణాలు ధరించిన రామలక్ష్మణులు, త్వరలోనే లంక వాకిట్లో నిలుస్తారు. వారివెంట గోళ్లు, కోరలు ఆయుధాలుగా వుండే, సమర్థులైన, పర్వత సమానులైన వానరులుంటారు. రావణుడి భయం వదులు. ఏ విషయంలోనూ రామచంద్రమూర్తి కంటే గొప్ప వాడెవరు? లక్ష్మణుడికి సమానమైన వాడెవ్వడు? వారిరువురు అగ్ని, వాయువుల్లాంటివారు. ఈ రెండూ ఏకమైతే శత్రు నిశ్శేషం చేస్తాయి. వీళ్లిద్దరూ నీకు సహాయంగా వస్తుంటే, నీకొచ్చిన భయం లేదు. నేను పోయి రామచంద్రమూర్తిని చూడటమే ఆలస్యం. ఆ వెంటనే భయంకర వానర సమూహంతో బయల్దేరి వచ్చి శత్రువులను సంహరిస్తాడు. రాక్షసులు కాపాడుకుంటున్న ఈ లంక శాశ్వతంగా దుఃఖాలపాలు కానున్నది. ఇంద్రుడిని శచీదేవి కలుసుకున్నట్లు, నీవూ రామచంద్రమూర్తిని కలుసుకోబోతున్నావు. ధైర్యంగా వుండు".

❖ ❖ ❖

సర్గ-40

శ్రీరాముడిని ఉద్దేశించి హనుమంతుడితో పలికిన సీతాదేవి

వాడిపోతున్న మడిలోని పైరుపై వానచినుకులు పడడంతో, పచ్చబడ్డట్లు, హనుమంతుడి ప్రియమైన మాటలు సీతకు మళ్లీ ప్రాణం పోసినట్లనిపించింది. బ్రతికాననుకుంటుంది. తన భర్తను ఎలా కలిసే వీలుందో అలానే చేయమని మళ్లీ కోరుతుంది హనుమంతుడిని. ఇదివరలో హనుమంతుడికిచ్చిన గుర్తుకాక, ఇంకో రహస్యమైన గుర్తు చెప్తా వినమంటుంది. అరణ్యంలో తిరుగుతున్న రోజుల్లో, గండశైలం పక్కనున్నప్పుడు, చెమట వల్ల తన ముఖం మీదున్న చుక్క బొట్టు కరిగిపోతే, కాంతిహీనంగా కనిపిస్తున్న తనకు, మణిశిలను అరగదీసి తన బుగ్గమీద బొట్టుగా వినోదంకోసం తిలకం దిద్దాడని చెప్తుంది. అలా చెప్పి, ఆ సంగతి కూడా జ్ఞాపకం తెచ్చుకోమంటుంది రాముడిని. ఇంకా శ్రీరాముడిని ఉద్దేశించి ఇలా పలుకుతుంది:

"పరాక్రమంలో ఇంద్రుడూ, వరుణుడూ కలిసికట్టుగా వచ్చినా నీకు సమానం కారు. అంత పరాక్రమవంతుడవైన నీవు, నీ భార్యను, నీకు తెలియకుండా, దొంగతనంగా రాక్షసులెత్తుకునిపోయి, బాధపెడుతుంటే, శత్రువులాగా ఎలా వూరుకుంటున్నావు? ఇదేమన్న ప్రశస్తమైన కార్యమా? దశరథ రాజకుమారా! నీమనస్సును ఆకర్షించే శక్తి ఉన్నందునే, సముద్రజలాలలో కౌస్తుభంలాగా పుట్టిన చూడామణిని నేను దాచుకున్నాను. నీ వియోగమనే అగ్ని నన్ను దహిస్తుంటే, నీళ్లలో పుట్టి, చలువ గుణం వున్న చూడామణిని నా దగ్గర వుంచుకున్నందున, నీళ్లు అగ్నిని చల్లార్చినట్లే, అది నా విరహాగ్నిని చల్లారుస్తుండేది. దీనిని చూడగానే నీ విరహాగ్నికూడా చల్లారాలి! ఇప్పుడు దీన్ని కూడా ఎడబాస్తున్నాను. ఇక ఈ దుఃఖసాగరంలో నేను ప్రాణాలు నిలబెట్టుకోవాల్సిన అవసరం లేదనుకుంటా. అలాగైతే ఎందుకు పంపించానంటావా? ఇదివరదాకా దీని దర్శనం నీ రూపాన్ని స్మృతికి తెస్తుండేది.

(పాదాభివందనం చేసినప్పుడల్లా చూడామణిపై రామచంద్రుడి చూపులు పడతాయి కద! కాబట్టి ఆయన చూపులలో తాను చూపులు కలిపినప్పుడు ఆయనను చూసినట్లే!)

ఇప్పుడది పోయి నిన్ను పిల్చుకొస్తుందన్న నమ్మకంతో పంపాను. ఇది సముద్రంలో పుట్టింది కనుక, సముద్రంవల్ల బాధ లేకుండా నన్ను రక్షిస్తూ వచ్చింది. ఇక నన్ను రక్షించే వారెవ్వరు?"

(దీనర్థం భగవంతుడు ఎల్లవేళలా జ్ఞాపకం వుండడానికి సీతాదేవి "చూడామణి" వుంచుకున్నట్లే, ఓ పతకం కానీ, మరేదైనా చిహ్నం కానీ శరీరం పైన ధరించాలెప్పుడూ. అదిపోతే ప్రాణం పోయినట్లే. అంగలకుదురులోని శ్రీకోదండరామ సేవక సమాజ సభ్యులు, సీతారామలక్ష్మణ పతకాన్ని ఎల్లవేళలా ధరిస్తారు. శరీరం వుంది భగవంతుడి స్మరణకే! దేహం లేక పోతే భగవత్ స్మరణే లేదు. భగవంతుడిని స్మరిస్తేనే గాని భగవత్ ప్రాప్తి లేదు. భగవత్ ప్రాప్తికై దేహ ధారణ చేయాలేకాని, మనమే విడిచిపెట్ట కూడదు. దానిని "అన్య ప్రాకృత" విషయాల్లో వినియోగించ కూడదు. దేహంపోయే లోపల భగవత్ ప్రాప్తి కలిగే ఉపాయాన్ని వెతుక్కోవాలి. అట్టి దేహం మీద సీతాదేవి, సర్వాభరణాలు వదిలి "చూడామణి" ని మాత్రమే ప్రాణపదంగా దాచుకుంది. దాన్నీ రామార్పణం చేసి, హనుమంతుడికి తన గుర్తుగా యిచ్చి, "సర్వ స్వనిక్షేపం" చేసిందయింది)

"ప్రాణి పడటానికి వీలుకాని బాధలు పడుతూ, నోటితో చెప్పలేని మాటలు వింటూ గుండెలదురుతుంటే, రాక్షసుల మధ్య చిక్కుకున్నా, నీవున్నావన్న ధైర్యంతో, నిన్నే స్మరించి సహిస్తున్నాను. ఎంత కష్టపడైనా మరొకనెల బ్రతికుంటాను. ఈ లోపల నువ్వు రాకపోతే, ప్రాణాలు వాటంతటవే పోతాయి. నేను నిలుపుకోలేను. రావణుడిని చూస్తేనే నా ప్రాణాలు పోతాయి. వాడు మహా క్రూరుడు. ఇంత చెప్పినా నీ మనస్సు కరగకపోతే, ఇది నా పాప ఫలమేకాని నీ దోషం కాదు" అని దుఃఖంతో మగడిని సంభోధిస్తూ హనుమంతుడితో పలుకుతుంది సీతాదేవి.

హనుమ మరలి పోయేందుకు సెలవిచ్చిన సీతాదేవి

సీత మాటలు విన్న హనుమంతుడు, రామచంద్రమూర్తి తప్పక ఆమె కష్టాలు తొలగిస్తాడనీ, ఆయన నిజంగా దుఃఖిస్తున్నాడనీ, ఆయన స్థితి చూసి లక్ష్మణుడు కూడా శుష్కిస్తున్నాడనీ, తాను ఇవ్వన్నీ ప్రమాణం చేసి చెప్తున్నాననీ,

తన మాటలు నమ్మమనీ అంటాడు. తానెంతో కష్టపడి సీతాదేవిని ఇక్కడ చూడగలిగాననీ, ఇక ఎంతమాత్రం బాధపడవద్దనీ, ఆమెను చూసేందుకు రాబోతున్న రాజకుమారులు లంకను నాశనం చేసి, రావణుడిని చంపడం ఆమే త్వరలోనే కళ్లారా చూస్తుందని కూడా అంటాడు. ఇది జరిగిన తర్వాత సీత తనమగడితో, తన వూరికి పోవడం ఖాయమని కూడా చెప్తాడు హనుమంతుడు.

రామచంద్రమూర్తి గుర్తించే మరో జ్ఞాపిక ఇవ్వమని మళ్లీ అడుగుతాడు. తానిచ్చిన చూడామణిని మించిన గుర్తేమీలేదని, దానిని చూడగానే హనుమంతుడు తన దగ్గరకు వచ్చినట్లు నమ్ముతాడనీ సీత చెప్పడంతో, తనింక వెళ్లడానికి అనుమతినివ్వమంటాడు హనుమంతుడు. ఇలా అంటూనే, తనకు తలవంచి నమస్కరించి నిల్చిన హనుమంతుడు దేహాన్ని పెంచడం, సముద్రాన్ని దాటే ఉత్సాహాన్ని కనపర్చడం కళ్లారా చూసి, ఆ పుణ్యాత్ముడితో మాట్లాడాలని మళ్లీ అనుకుంటుంది.

(హనుమంతుడు సీతను మొదలు చూసినప్పుడు నమస్కరించలేదు. ఇప్పుడు నమస్కరిస్తున్నాడు. ఎందుకిలా చేసాడు? వయస్సులో వృద్ధ స్త్రీలు, పతిని దేవుడిలాగా కొలిచే పతివ్రతలు నమస్కరించడానికి అర్హులు. పాదాలుపట్టి మ్రొక్కడాన్ని "అభివాదం" అంటారు. చేతులు జోడించి నమస్కరిస్తే, మ్రొక్కితే, దాన్ని నమస్కారమంటారు. మొదలు సీతాదేవిని చూసినప్పుడు, ఆమె సీత అవునో–కాదో, తెలియదు. పతివ్రతో, కాదో తెలియదు. వృద్ధస్త్రీ కూడా కాదు)

"ఆంజనేయా! రామచంద్రమూర్తిని, ఆయన తమ్ముడిని, మంత్రులతో సహా సుగ్రీవుడినీ, ఆక్కడున్న మిగతావారందరినీ, కుశలమడిగానని చెప్పమని" అంటుంది సీతాదేవి. తాను ఈ ఆపత్సముద్రంలో మునగకుండా, ఎట్లా చెప్పితే రాముడు తన్ను రక్షిస్తాడో, అట్లానే చెప్పమంటుంది. తనుపడ్డ నానాకష్టాలనూ మగడికి చెప్పమని అంటుంది. వెళ్లిరమ్మనీ, శుభం కలుగుగాక అని అంటూ సెలవిస్తుంది.

❖ ❖ ❖

సర్గ-41

కార్యశేషమాలోచించిన హనుమంతుడు

తనకు శుభమగుగాక, విఘ్నాలు కలగకుండా వుండు గాక! అని సీతాదేవి అనడంతో, ఆమె దయకు పాత్రుడనైనాననుకుంటాడు హనుమంతుడు. ఇంక తనకేమీ భయం లేదని, ఉత్తర దిక్కుగా ప్రయాణమై పోవాలనుకుని, చెట్టుచాటు చేసుకుంటూనే కొంచెం దూరం వెళ్లాడు. ఇంకా చేయాల్సిందేమన్నా వుందా అని అప్పుడాలోచించడం మొదలెట్టాడు. చేయాల్సిన పని కొంచెం మిగిలుంది అనిపించిందాయనకు. సుగ్రీవుడు సీతను వెతకమనీ, లంకను చూడమనీ, తనకు రెండు పనులప్పగించాడు. ముఖ్యమైనది సీతను వెతకడం అయిపోయింది. లంకను చూడడం మిగిలి వుంది ఇంకా! రాత్రివేళలో సరీగ్గా చూడలేదు. లంకను చూడటమంటే, మిద్దెలు, మేడలు బాగున్నాయని చెప్పడం కాదుకదా! రాక్షసుల బలాబలాలు బేరీజు వేయడం, రావణుడి అభిప్రాయం తెలుసుకోవడం ఇంకా జరగలేదు. రావణుడి విషయంలో, అతడి బలగం విషయంలో, ఇది చేయాలంటే, సామ-దాన-భేదాలు పనికిరావు. దండోపాయ మొక్కటే సరైన మార్గమనుకుంటాడు.

రాక్షసుల్లో తమో గుణం పాలెక్కువ. వాళ్లు మంచి మాటలకు, ధర్మ వాక్యాలకు సాధువులకు మాదిరి లోబడేవారు కారు. దానగుణంతో చేద్దామంటే వారి దగ్గరే బోలెడు ధనమున్నది. పరాక్రమవంతులైన వీరిలో భేదోపాయం సాధ్యం కాదు. మిగిలిన దండోపాయమే ఇప్పటికి తగిన పనిగా తోస్తున్నదని తలుస్తాడు ఆంజనేయుడు. జయాపజయాలు దైవాధీనమైనందున, ఓడిపోతే కార్యభంగ మౌతుందా? ముందు రాముడు, వెనుక సీతాకటాక్షముంటే తనకు పరాజయ మెందుకు కలుగుతుంది? తను చేయబోయేది అధర్మ కార్యం కాదు. ధర్మమెందుకు చెడుతుంది? దైవబలం, దేహబలం, ధర్మబలమున్న తనకు ప్రస్తుతం యుద్ధమే శరణ్య మనుకుంటాడు హనుమంతుడు. రావణ, రాక్షసుల బలాబలాలను గురించి రామసుగ్రీవులు, తాను మరలిపోగానే, తప్పకుండా అడుగుతారు. దానికి సరైన ప్రత్యుత్తర మీయాలంటే, రాక్షసుల బలమెంతో,

వారెంత బలవంతులో తెల్సుకోవాలి. ఇది తెలుసుకోవాలంటే యుద్ధం చెయాల్సిందే. యుద్ధానికి ప్రయత్నం చేస్తే ఇంకో మేలుగూడా జరుగుతుంది. రామలక్ష్మణులు సహాయం లేని వారు, ఏమీ చేయలేరని దురభిప్రాయంతో వున్న రాక్షసుల అపోహ తొలగించాలంటే, సుగ్రీవుడి సహాయముందని ప్రకటించి, యుద్ధం చేసి, కొందరినన్నా చంపాలని అనుకుంటాడు. ఇలా జరుగుతే తక్కినవారు ద్వేషం వదిలి మెత్తబడటమో, వారిలో వారికి విభేదాలు రావటమో జరుగుతుందనుకుంటాడు.

తాను యుద్ధం చేసి కొందరిని చంపి వేస్తే రామచంద్రమూర్తి పని సులభం కావచ్చు. కాకపోతే ఆయన సీతాదేవిని చూసి రమ్మన్నాడే కాని, నీతి మాలిన వారితో నీచకలహానికి దిగమని చెప్పలేదే! అలాగైతే, సీతాదేవి ఏం చెప్పింది? రాముడే రావాలి, రావణాదులను చంపాలి, తనను తీసుకుని పోవాలని కదా! ఈ సంగతి చెప్పటమంటే రాక్షసుల బలాబలాల విచారణ జరగాలనే! అంటే ఈ పని నన్ను చేయమని చెప్పలేదన కూడదు. ఎట్లాగైనా కార్యం సాధించుకుని రావడం ఉత్తమదూత లక్షణం. చెప్పిన పనికి తోడు, అనుబంధమైన పనులన్నీ దూత కృత్యాలే! కాకపోతే అప్పచెప్పిన కార్యానికి అవరోధం కాకూడదు. ఏ పనైనా ధైర్యం చెడకుండా ఆలోచనతో చేయొచ్చు.

ఎంత చిన్న పనైనా చక్కగా చేయాలని పూనుకుంటే, అది నెరవేరటానికి, ఎన్ని ఉపాయాలు అవసరమో, అన్నీ వెతికి చేయాలి. రామకార్యం కూడా పలువిధాలుగా చేయటమే మేలని భావిస్తాడు హనుమంతుడు. బలంలో తనకు, రాక్షసులకు వున్న భేదాన్ని తెలుసుకొని, రామచంద్రుడి దగ్గరకు పోతే, స్వామి ఆజ్ఞ నెరవేర్చిన బంటని పేరొస్తుందని అనుకుంటాడు. రావణుడు తనంత బలవంతుడు లేడన్న మదంతో వున్నాడు. ఆ మదమణుగుతేనేగాని వాడు లొంగడు. కొందరు రాక్షసులను యుద్ధానికి ఈడ్చి సులభంగా చావకొడ్తే, రావణుడు యుద్ధాని కొస్తాడు. అప్పుడు వాడి బలమెంతో తేల్చుకుని పోతే మంచిది. వూరికే తిరిగెళ్లిపోతే, తన సంగతి వాడి కెట్లా తెలుస్తుందని భావిస్తాడు.

కాబట్టి ఏదో విధంగా, రావణుడిని, వాడి మంత్రులను, సైన్యాన్ని, యుద్ధాని కీడ్చి, దాంతో శత్రువుల బలాబలాలను తెల్సుకుని, వాడి ఆలోచనేమిటో అర్థం

చేసుకోవటమే మంచిదనుకుంటాడు. ఆ తర్వాత అనాయాసంగా, బాధలేకుండా మరలి పోతే, రామకార్యం చేసిన వాడి నవుతాననుకుంటాడు. కన్నుల పండుగగా, మనస్సుకు ఇంపుగా, ఇంద్రుడి నందన వనంగా, గొప్పగొప్ప వృక్షాలతో, అందమైన తీగలతో వున్న ఈ ఉద్యానవనం సొగసుగా వున్నదనీ, దీన్ని ధ్వంసం చేస్తే రావణుడికి కోపం వస్తుందనీ అనుకుంటాడు. ఈ అశోకవనం కార్చిచ్చుతో కాలినట్లు పాడైపోతే, మండిపడ్డ రావణుడు, ఏనుగులతో సహా తనసైన్యాన్ని యుద్ధం చేయమని తన మీదకు పంపుతాడు. ఆ శూరులు త్రిశూలాలతోనూ, విల్లంబుల తోనూ వస్తే వాళ్లను తునా తునకలు చేసి సంతోషంగా కిష్కింధకు పోదామని నిర్ణయించు కుంటాడు.

అశోకవనాన్ని పాడు చేసిన హనుమంతుడు

ఇలా ఆలోచించిన హనుమంతుడు విజృంభించాడు. మహావాయువు లాంటి తన తొడల వేగంతో, చెట్లన్నీ కూకటి వ్రేళ్లతో సహా పీకి నేలమీద పడేయడం ఆరంభించాడు. నానా రకాల చెట్ల తీగలతో, మదించిన పక్షుల ధ్వనులతో నిండిన ప్రమదావనాన్ని పాడుచేసాడు. క్రీడా పర్వతాలను నేల మట్టం చేసాడు. క్రీడా సరస్సులను విరగ గొట్టాడు. తెగిన తీగలతో, విరిగిన చెట్లతో, పాడైన సరస్సులతో, ఆ వనం కార్చిచ్చు తగిలి కాలిపోయినట్లయింది. తీగలు అల్లుకునేందుకు ఆధారంగా వుండి, భూమిలో దాకా పాతుకు పోయిన తల్లి వ్రేళ్లున్న చెట్లు కూడా పడిపోవడంతో, వాటికొనలందున్న తీగలు దిక్కులేని ఆడవారిలా, భయంతో వణుకుతూ కనిపించాయి. చెట్లు పడడంతో వాటిసందున వున్న పాములుకూడా నలిగి చచ్చాయి. చెట్టు తొర్రలు నేలగూలాయి. పొదరిళ్ళు పాడైపోయాయి. రాతి ఇళ్లు నేలపై తూలిపడ్డాయి. ఇదంతా చూడటానికి ఘోరంగా కనిపించింది. రావణాసురుడి భార్యలకు ప్రమదావనమైన ఉద్యానవనాన్ని మూల మట్టంగా నాశనంచేసి, సంతోషంతో కయ్యానికి కాలు దువ్వి, యుద్ధానికెదురు చూస్తూ ఆ వనం తలవాకిటి మీద కూర్చున్నాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-42

హనుమంతుడి వృత్తాంతాన్ని సీత నడిగిన రాక్షసులు

గుంపులు-గుంపులుగా ఆకాశంలోకి ఎగిరికూసే పక్షుల ధ్వనులకూ, ధభీలు మని పడి పోతున్న చెట్ల చప్పుళ్లకూ, లంకలో వున్న రాక్షసులందరు భయపడి, దిక్కుతోచక, అదేంటో తెలియక, ఒకరి ముఖాలొకరు చూసుకో సాగారు. కీడును సూచించే ధ్వనులు చేస్తూ, పక్షులు, క్రూరమృగాలు పరుగెత్తసాగాయి. కాపలా కాస్తున్న రాక్షసస్త్రీలు భయపడి, లేచి, భయంకరమైన కోతి ఆకారాన్ని చూసి, సీత ఏమై పోయిందోనని ఆమె వైపు పరుగెత్తారు. రాక్షస స్త్రీలు భయపడాలనే హనుమంతుడు, ఘోరమైన, భయంకరమైన ఆ రూపాన్ని ధరించాడు. ఆయన్ను చూసిన రాక్షస స్త్రీలు సీతాదేవితో:

"సీతా! ఎవడే వీడు? ఎవరి కొరకు ఇక్కడకు వచ్చాడే? వీడెవడి వాడు? మీరిద్దరేం మాట్లాడుకున్నారు? నువ్వు భయపడకుండా, ఇంతవరకు ఆ కోతి నీతో ఏమన్నదో మాకు చెప్పు" అని అడుగుతారు. పాముల కాళ్లజాడ పాములకే తెల్సినట్లు, రాక్షసుల జాడ, మాయలు రాక్షసులకే తెలుస్తాయని జవాబిస్తుంది సీత. ఏ రాక్షసుడు ఏ మాయా రూపం ధరించాడోనని, తన మనస్సు కూడా కలవరపడుతుంది అంటుంది.

(రాక్షస స్త్రీలు, హనుమంతుడిని గురించి సీతాదేవిని అడిగినప్పుడు, తనకు తెలియదని అబద్ధం చెప్పుతుంది. అయినా అసత్య దోషం ఆమెకు తగలదు. ప్రతి మని, ప్రతినిత్యం, పాటించాల్సిన "యమము"లలో ముఖ్యమయినవి అయిదు. అవి: "అహింస, సత్యం, అస్తేయమ, బ్రహ్మచర్యం, అపరిగ్రహం". చివరి నాలుగింటికి "అహింస" తల్లి. సత్యాదులు దాని బిడ్డలు. నిజం చెప్పడం వల్ల నిరపరాధికి, నిష్కారణంగా హింస జరుగుతే, జరుగుతుందనుకుంటే, సత్యం చెప్ప రాదు. అసత్య మాడవచ్చు. ప్రాణం పోతున్న సమయంలో విశ్వామిత్రుడిలాగా దొంగతనం చేసి ప్రాణం రక్షించుకోవడం తప్పుకాదు. దురుద్దేశ్యం లేని హాస్యమాడేటప్పుడు, స్త్రీల విషయంలో, వివాహ కాలంలో, ప్రాణాపాయ సమయంలో సర్వస్వం కోల్పోయేటప్పుడు అసత్యం చెప్తే పాపం

తగలదు. సత్యం చెప్తే హాని జరుగుతుందనుకుంటే, అసత్య మాడవచ్చునే కాని, ఆడాలన్న నిర్బంధం మాత్రం లేదు. హనుమంతుడు, సీతాదేవికి ప్రత్యుపకారం కోరని ఉపకారి, గౌరవ మిత్రుడు, నిరపరాధి, సత్యం చెప్తే, ఆయనకు, తనకు, ప్రాణహాని కలుగుతుందని భయపడింది. ఆమెకు అసత్య దోషం లేదు).

సీతాదేవి మాటలకు భయపడి కొందరు పరుగెత్తారు. కొందరక్కడే వుండిపోయారు. కొందరేమో పరుగు-పరుగున రావణుడికి చెప్పటానికి వెళ్లారు. వెళ్లి: "భయంకరమైన వానరరూపంకల వీరుడొకడు సీతతో మచ్చికగా ముచ్చట్లాడి, అశోకవనంలో వున్నాడు. వాడు ఇంద్రుడి దూతో, కుబేరుడి దూతో, సీతను వెతికేందుకు వచ్చిన శ్రీరాముడి దూతో, తెల్సుకోవడం కష్టంగా వుంది" అని విన్నవించుకున్నారు రావణుడికి. రౌద్రాకారంతో విజృంభించిన ఆ కోతి ప్రమదావనాన్నంతా నిర్మూలించి, మృగాలనూ, పక్షులనూ తీగలనూ, చెట్లనూ, నామ రూపాలు లేకుండా చిందరవందర చేసింది కాని సీతాదేవి వున్న ప్రదేశాన్ని తాకనైనా తాకలేదని కూడా ఫిర్యాదు చేసారు ఆ రాక్షసస్త్రీలు. "సీతాదేవికి రక్షణగా వుండాలనే వుద్దేశంతోనే, చెట్లన్నీ త్రుంచినా, ఆమె వున్న అశోకవృక్షాన్ని మటుకు ఏమీ చేయలేదు. సీతా సౌఖ్యం కొరకే దాన్ని పాడుచేయలేదు. నీ వనాన్ని పాడు చేసినందుకు, సీతను పలుకరించినందుకు, కోతి పొగరు అణిగేటట్లు కఠినంగా దండించు. నువ్వు కోరికపడ్డ ఆడదానితో మరొకరొచ్చి మాట్లాడినవాడెవరైనా కాని ప్రాణాలతో వుండవచ్చునా?" అని రెచ్చగొట్టారు రాక్షసులు. ఆ మాటలకు మండిపడ్డాడు రావణాసురుడు.

హనుమంతుడిపైకి కింకరులను పంపిన రావణుడు

కోపంతో ఊగిపోయాడు రావణుడు. గిరగిరా తిరిగే గుడ్లున్న ఆయన కళ్లనుండి బొటబొటా రాలిన నీళ్లు, దీపం నుండి మండుతూ, మీద-మీదపడే చమురు బొట్లలాగా కనిపించాయి. మహాగర్వంతో కన్ను, మిన్నుకానని, తనతో సమానమైన కింకరులనే వారిని వెంటనే వెళ్లి, ఆ కోతిని పట్టుకునిరమ్మని పంపుతాడు. పెద్దపెద్ద కోరలు, మిట్టపళ్లు, కడుపులు, కంటధ్వనులు, వికార ఆకారాలున్న బలమైన ఆ కింకరులు సమ్మెట ల్లాంటి ఆయుధాలు, ఖడ్గాలు

ధరించి, యుద్ధకాంక్షతో, హనుమంతుడిమీదకొస్తారు. ఎనభైవేలమంది రాక్షసులు ఒక్క మూకగావచ్చి, తోటద్వారం పైనున్న హనుమంతుడిమీద పడి, బంగారంతో ప్రకాశిస్తున్న గండ్రగొడ్డళ్లతో, కత్తులతో, మండుతున్న బాణాలతో, శూలాలతో, ఇనుపగుళ్లతో, అడ్డకత్తులతో, చిల్లకోలలతో, ఆయన్ను కొడుతుంటే, కోపంతో ఆయనకూడా దేహాన్ని పెంచుతాడు.

హనుమంతుడి జయఘోష

దేహాన్ని పెంచిన హనుమంతుడు, తోకను ఆడించి, జాడించి, నేలపై కొట్టి, సింహనాదం చేస్తాడు. ఆ ధ్వనికి లంకంతా ప్రతిధ్వనిస్తుంది. పక్షులు ఆకాశానికెగిరి గుండెలు పగిలి నేలరాలాయి. "దృఢపరాక్రమం, ధన్యమైన రూపంకల శ్రీరామచంద్రమూర్తికీ, శత్రువులు సంహరించలేని బలమున్న లక్ష్మణుడికీ, రామలక్ష్మణుల రక్షణలో వుండి, తెంపు, పరాక్రమం, కీర్తిగల వానరనాధుడు సుగ్రీవుడికి, జయం కలుగుకాక... జయంకలుగుకాక" అని స్మరిస్తాడు హనుమంతుడు. (జయ త్సతిబలో రామో లక్ష్మణశ్చ మహాబల: దాసోహం కోసలేంద్రస్య; సరావణ సహస్రం మే యుద్ధే ప్రతిబలం భవేత్–వీటిని జయమంత్రాలంటారు. సర్వకార్య సిద్ధికి ఈ శ్లోకాలను జపించమన్నారు పెద్దలు. ఇవి నిత్యమూ పఠించే వారిపై క్షుద్రశక్తులు పనిచేయవని పెద్దలంటారు) సమస్తకళ్యాణ గుణాలవల్ల మనోహరుడైన కోసలదేశ ప్రభువైన రామచంద్రమూర్తికి తాను దాసుడననీ, శత్రు సంహారకుడైన వాయుపుత్రుడననీ, హనుమంతుడన్న పేరు కలవాడిననీ, వేయి మంది రావణులైనా తనతో యుద్ధంలో సరితూగరనీ, రాళ్లతో, చెట్లతో శత్రువులను సంహరిస్తాననీ గర్జిస్తాడు. లంకను ధ్వంసం చేసి, రాక్షసులందరినీ హింసించి, సీతాదేవికి మ్రొక్కి రాక్షసులేడుస్తుంటే, కీర్తిమంతుడనై వెళ్తానని అరుస్తాడు.

ఇలా ధ్వనించిన హనుమంతుడి మాటలకు భయపడి, సంధ్యా సమయపు మబ్బులాగా దేహాన్ని పెంచుతున్న వానరుడిపై రాజాజ్ఞ ప్రకారం ఆయుధ వర్షం కురిపించారు కింకరులు. హనుమంతుడప్పుడు ఉద్యానవనంలో దొరికిన ఓ పెద్ద ఇనుప గుండు తీసుకుని, నోట్లో పాముంచుకుని తిరిగే గరుత్మంతుడిలాగా

గిరగిరా తిరిగి, ఆ రాక్షసులందరినీ ఆ గుండుతో నుగ్గు చేసాడు. ఇలా కింకర సమూహాన్నంతా చంపి, ఇంకా యుద్ధం చేయాలన్న కోరికతో, జంకూ, గొంకూ లేకుండా, రాక్షసులకు భయంకరంగా కనిపిస్తూ, మళ్లీ తోరణమెక్కి కూర్చున్నాడాయన. చావగా మిగిలిన ఇతరులు చస్తామన్న భయంతో పరాజితులై రావణుడింట్లో దూరారు. మాటలు తడపడుతుంటే, తోటి కింకరులందరూ చచ్చారని చెప్పారు రావణుడితో వీరు. తీవ్రమైన కోపంతో, భయంకరంగా, కనుగుడ్లు గిరగిరా తిప్పుతూ, అజేయ బలమున్న ప్రహస్తుడి కొడుకును యుద్ధానికి పంపుతాడు రావణుడు. వాడి పేరే “జంబుమాలి”.

❖ ❖ ❖

సర్గ-43

చైత్య ప్రాసాదాన్ని విరగదన్నిన హనుమంతుడు

కింకరులందరినీ చంపిన హనుమంతుడు, తోరణం పైనుండి నాలుగు ప్రక్కలా తేరిపార చూస్తాడు. ఉద్యానవనమంతా తన ప్రతాపానికి దుమ్ము-దుమ్ముగా అయిపోయినందుకు ఆనందిస్తాడు. అయితే ఆ ప్రక్కనే, అందం చెడకుండా, మేరుపర్వత శిఖరంతో సమానమైన ఓ మేడను చూసాడు. ఎందుకీ మేడను పడగొట్టలేదింకా అనుకుంటూ, అది గట్టిగా వూగిపోయేటట్లు దానిమీదకు దూకుతాడు. చూడటానికి ప్రాసాదంలాగా వున్న ఆమేడ లంకాధిదేవత గుడి. ఆ మేడ శిఖరాన్నెక్కి, దిక్కులు వెదజల్లే కాంతితో, ఉదయించిన సూర్యుడిని పోలి కూర్చున్నాడక్కడ. (సూర్యోదయమయిందన్న సూచన)

యుద్ధమంటే ఆసక్తిగల హనుమంతుడు, ఆ మేడంతా విరగదన్ని, దేవతలు స్తోత్రం చేస్తున్నప్పుడు కనిపించే పారియాత్ర పర్వతంలాగా ప్రకాశించాడు. హనుమంతుడప్పుడు వేగంగా, భరించలేనంత ధ్వని చేస్తుంటే, ఆ ధ్వనికి రాక్షసమూకల చెవిగూబలు అదిరిపోయాయి. ఆయన సింహనాదానికి వారంతా మూర్ఛపోయారు. విజయగర్వంతో మరొక్కసారి "జయం-జయం" రాముడికి అని స్మరిస్తూ, వేయిమంది దశకంఠులు కూడా ఒక్క హనుమంతుడికి సరికాదని గర్జిస్తాడు.

చైత్యపాలకులను చంపిన హనుమంతుడు

హనుమంతుడి సింహనాదాన్ని విన్న దేవాలయం కాపలాదారులు (చైత్యపాలకులు), కోపాతిశయంతో ఆయన్ను చుట్టుముట్టారు. ఈటెలతో, ఇతర ఆయుధాలతో హనుమంతుడిని నొప్పించసాగారు. గంగలోని సుడిగుండంలాగా వున్న ఆ రాక్షస మూకపై అమిత కోపంతో, భయంకరంగా దెబ్బ తీయాలనుకుంటాడు హనుమంతుడు. ఇంతకుముందు వాడిన ఇనుపగుండు చిన్నదని భావించిన హనుమంతుడు, దేవాలయంలోని ధ్వజస్థంభాన్ని పీకి,

కళ్లకు కనిపించకుండా గిరగిరా వేయి సార్లు తిప్పాడు. ఆ వేడికుదయించిన అగ్నిజ్వాలలు, గుడిని భస్మం చేసాయి. ఆ తర్వాత కావలి రాక్షసులందరినీ చంపి, ఆకాశంలోకి ఎగిరి, అందరూ వినపడేటట్లు గట్టిగా చెబుతాడు ఈవిధంగా:

"ఓ లంకావాసులారా! వినండి. నాలాంటి వేలాది వానరులు సుగ్రీవాజ్ఞ ప్రకారం సీతాదేవిని వెతుకుతున్నారు. వాళ్లంతా నాలాగా బలవంతులే! పది ఏనుగుల బలమున్నవారు కొందరు, నూరేనుగుల, వెయ్యేనుగుల బలమున్న వారు మరికొంతమంది, చెప్పలేనంత బలవంతులు ఇంకొందరు, వాయువేగంతో పోగలిగేవారు ఎంతో మంది వున్నారు వాళ్లలో. వీళ్లందరిరి ఆయుధాలు గోళ్లు, దంతాలు, రాళ్లే! ఇలాంటి కోటానుకోట్ల, లెక్కించనలవికాని వానరులను తీసుకుని, అమేయబలుడు సుగ్రీవుడు ఇక్కడకు రాబోతున్నాడు. వచ్చి మిమ్మల్నందరినీ చంపబోతున్నాడు. నిష్కారణంగా శ్రీరాముడితో విరోధం తెచ్చుకున్నారు మీరందరూ. రావణుడికీ లంకకూ, మీకూ ఇక ఋణానుబంధం తీరినట్లే!".

దీంతో ఇంతవరకు సీతను లంకలో వుంచిన వార్త అంతఃపురానికి వచ్చేవారికి తప్ప తెలియని ఇతరులకు కూడా తెలుస్తుందిప్పుడు. రహస్యం బయటపడింది.

❖ ❖ ❖

సర్గ-44

జంబుమాలిని వధించిన హనుమంతుడు

హనుమంతుడు చైత్య పాలకులను చంపి, అందరూ వినేలా వానర సేన బలం గురించి బిగ్గరగా చెప్తున్న సమయంలోనే, రావణుడు పంపిన మహాబలశాలి, ప్రహస్తుడి పుత్రుడు జంబుమాలి అక్కడకు అతివేగంగా వచ్చాడు. ఎర్రటి పూదండలు, ఎర్రటి వస్త్రాలు, కుండలాలు ధరించాడు. ఇంద్రుడి ధనస్సు లాంటి విల్లును చేత ధరించాడు. కంచరగాడిదలు కట్టిన రథమెక్కిన జంబుమాలి, బాణాన్ని తీసుకుని, దిక్చక్రం వణికేటట్లు, వింటితాడును మీటుతాడు. తనవైపు వస్తున్న పెద్దదేహంకల వానర వీరుడిని చూసిన ఆ రాక్షసుడు, తనకు తగిన శత్రువే వీడనుకుని పొంగిపోయాడు. వింటిలో పదిబాణాలు సంధించి, హనుమంతుడి చేతులమీద, ముఖంపైన, తలమీద అవి నాటుకునేటట్లు విసురుతాడు.

(బాహు యుద్ధం చేసేవారిని పంపితే కింకరులను చంపినట్లే చంపుతాడని భయపడ్డ రావణుడు వింటి యుద్ధం చేసేవారిని పంపాడు ఈ సారి).

బాణాల దెబ్బతిన్న హనుమంతుడి ముఖం నెత్తుటితో తడిసి, సూర్య కిరణాలకు వికసించిన శరత్కాలపు తామరపూవులాగా వుందప్పుడు. ఎర్రటి హనుమంతుడి ముఖం ఎర్రటి నెత్తురు బొట్లతో, ఆకాశాన ఎర్రటి చందనపు బొట్లున్న ఎర్రటి తామరలాగా వుంది. వరుస వెంట బాణాలు తాకడంతో, కోపగించిన హనుమంతుడు, దగ్గర్లో వున్న ఓ బండరాయినెత్తి వాడిమీదకు విసురుతాడు. దాన్ని వాడు పదిబాణాలతో తునాతునకలు చేసాడు. హనుమంతుడప్పుడొక చెట్టు పీకి, గిరగిరా తిప్పుతుంటే దాన్ని వాడు నాలుగు బాణాలతో నరుకుతాడు. ఆ వెంటనే, అయిదు బాణాలతో భుజాలను, ఒక బాణంతో రొమ్మును, పదిబాణాలతో స్తన ప్రదేశాన్ని కొట్టాడు. మండుతున్న బాణాలతో తగిలిన ఆ దెబ్బలకు, దేహం వేధిస్తుంటే, మునుపటిలాగానే, ఇనుప గుండునొక దాన్ని తీసుకుని, గిరగిరా తిప్పి వాడి వక్షస్థలాన్ని గురి చూసి కొట్టాడు హనుమంతుడు. ఆ దెబ్బకు, తల ఏదో, మొండెమేదో, చేయి ఎక్కడో,

విల్లేమయిందో, మోకాళ్లు ఏమైనాయో? అని గుర్తించలేని రీతిలో, జంబుమాలి పొడిపొడిగా, ముక్కలు చెక్కలై నేలకూలాడు.

రథంతో, దానికి కట్టిన కంచర గాడిదలతో, వాడని, సంధించని బాణాలతో, వంటి మీదున్న అందమైన ఆభరణాలతో సహా రాక్షసుడు ముద్దగా పడిపోయాడు. చావగా మిగిలిన కింకరులు జంబుమాలి చచ్చాడని రావణుడికి తెలిపారు. మళ్లీ కోపగించిన రావణుడు, శౌర్య దర్పాల్లో గొప్పవారని పేరున్న ఏడుగురు మంత్రి పుత్రులను పంపాడు హనుమంతుడి మీదకు.

❖ ❖ ❖

సర్గ-45

మంత్రి పుత్రులందరినీ చంపిన హనుమంతుడు

అగ్నిలాగా మండుతున్న ఆ ఏడుగురు మంత్రిపుత్రులు, ఇల్లువెడలి, విల్లులు, బాణాలు, ఇతర యుద్ధ సామగ్రి, ఆయుధాలూ తీసుకుని, ఎవరికివారే గెలవాలన్న కోరికతో వచ్చారక్కడకు. బంగారుమయమైన ధ్వజాలున్న రధాలెక్కి, మేఘాలురిమినట్లు శబ్దం చేస్తూ పోయారు యుద్ధానికి. కింకరుల మరణవార్త విన్నవారైన వీరి తల్లులు, వీళ్ల గతేమవుతుందోనని చుట్టపక్కాలతో చెప్పుకుని ఏడ్చారు. ఆ రాక్షసులు హనుమంతుడిని సమీపిస్తుంటే, వాళ్ల రథచక్రాల ధ్వని ఉరుముల్లాగా, బాణ ప్రయోగం వర్షంలాగా అనిపించింది. వాళ్లు మేఘాల్లాగా కమ్ముకున్నప్పటికీ, హనుమంతుడేమీ కలతపడలేదు. చక్కగా ద్వారం తోరణం మీద కూర్చున్న హనుమంతుడు చావుమూడిన రాక్షసులకు స్వాగతం చెప్తోన్న మృత్యుదేవతలాగా కనిపిస్తున్నాడా! ఏమో! అన్నట్లున్నాడు. అతి వేగంగా వస్తున్న వారి బాణాలకు గురికాకుండా, ఆకాశంలోనే తిరగసాగాడు. ఇంద్రధనస్సుతో కూడిన మేఘాల గుంపును వాయువు చెదరగొట్టినట్లు, హనుమంతుడు రాక్షసులను హెచ్చరిస్తూ కలవరపర్చాడు.

పెద్ద సింహనాదం చేసి, రాక్షసులను చంపుదామన్న తొందరలో, ఎక్కువ సేపు వీళ్లతో యుద్ధం చేయాల్సిన అవసరం లేదనుకుంటూ, వాళ్లను అరిచేతుల్తో, కాళ్లతో కొట్టి, గోళ్లతో చీల్చేసాడు. చెవులదిరేటట్లు మరొక్కమారు గర్జించగా, ఆ దెబ్బకు, ధ్వనికి, కొందరు చావగా, మిగిలిన కొందరు పారిపోయారు. ఇలా రాక్షసులను చంపిన హనుమంతుడు, వెంటనే ఉద్యానవనంలోకి పోయి, ఇంకా యుద్ధం చేయాలన్న కోరికతో, మళ్లీ తోరణం ఎక్కి కూర్చున్నాడు.

❖ ❖ ❖

సర్గ-46

ఐదుగురు సేనానాయకులను హనుమ వద్దకు పంపిన రావణుడు

మంత్రికుమారుల మరణవార్త విన్న రావణుడు తన ఐదుగురు సేనానాయకులైన, విరూపాక్షుడు, దుర్ధరుడు, యూపాక్షుడు, భాసకర్ణుడు, ప్రహసుడు అనేవారిని పిల్చి, వారి సమస్త సైన్యంతో వెళ్లి, కోతిని పట్టుకుని తెమ్మంటాడు. కోతేకదా అని అలక్ష్యం చేయకుండా, తగు ప్రయత్నం చేసి, దేశకాల విరోధం లేకుండే విధంగా కార్యాన్ని నెరవేర్చుకుని రమ్మంటాడు. వాడు నిజమైన కోతి కాదనీ, ఇంద్రుడు తపస్సు చేసి తన్ను జయించాలన్న కోరికతో, పెద్దభూతాన్ని సృష్టించి పంపాడనీ వాళ్లతో చెప్పాడు.

వాళ్లను పొగుడుతూ: "మీ సహాయం వుండటంవల్లే కదా, నేను అమిత బలవంతులైన నాగులను, కుబేరుడిని, దేవతలను, మహర్షులను, దానవులను యుద్ధభూమిలో గెల్చాను" అంటాడు. వాళ్లను ఓడించామన్న కారణంవలనే, తమతో విరోధంగా వున్నారనీ, పగతీర్చుకోవడానికి సమయంకోసం కాచుకున్నారనీ, తనకు కీడుచేయాలని తలుస్తున్నారనీ, అంటాడు. తనవలె వారూ దేవవిరోధులే కనుక, వారుపంపిన ఆ కోతిని ఎలాగైనా బంధించి తెమ్మంటాడు.

"ప్రతిదినం తోటల్లో, తోపుల్లో చూసే కోతిలాంటిదిది కాదు. దీన్ని పరిహాసంగా చూడవద్దు. ఇది మిక్కిలి కీర్తి పొందిన పరాక్రమం కలది. నేను వాలిని, సుగ్రీవుడిని, జాంబవంతుడిని, నీలుడిని, ద్వివిదుడిని చూసాను. కాని ఇంతగొప్ప ఆకారం, బుద్ధిబలం, వారించలేని తేజం వారెవరికీ లేదు. ఏదో భూతం ఈ వానర రూపంలో, ఏదో పని పెట్టుకుని వచ్చుండాలేకాని, ఇది మామూలు కోతి కాదు. మిమ్మల్ని మానవులు, దేవతలు, రాక్షసులు, ఎవ్వరూ యుద్ధంలో ఎదిరించలేరని నాకు తెలుసు. అయినా మేమింత వారమని, మాకెదురేమీ లేదని భావించక, మిక్కిలి మెలకువగా యుద్ధం చేయండి. యుద్ధంలో ఎంత బలవంతుడైనా, తానే గెలుస్తానని చెప్పలేడు. గెలుపు స్థిరం

కాదు. బలవంతుడే జయించాలన్న నియమం కూడా ఏదీ లేదు. కాబట్టి ప్రతి వీరుడూ, శూరుడూ, తనను రక్షించుకోవటానికి చేయాల్సిన ప్రయత్నమంతా చేయాలి" అని రావణుడు ఆజ్ఞాపిస్తూ చెప్పాడు.

సేనా నాయకులందరినీ చంపినా హనుమంతుడు

సేనా నాయకులు ఐదుగురు, శ్రేష్ఠమైన రథాలు, ఏనుగులు, గుర్రాలు, కావలిసినవన్నీ తీసుకుని, కలకల ధ్వని చేస్తూ, విల్లంబులు, బాణాలు, ఆయుధాలు, ధరించి యుద్ధానికి వెళ్తారు.

యుద్ధానికొస్తున్న సేనానాయకులకు హనుమంతుడు, వీరుడిలా, మండుతూ ఉదయిస్తున్న ప్రకాశించే సూర్యుడిలా, మంచి మనసున్న వాడిలా, గొప్ప ఆకారం కలవాడిలా, గొప్ప వేగంకలవాడిలా, గొప్ప ధైర్యవంతుడిలా, గొప్ప ఉత్సాహం కలవాడిలా కనిపించాడు. కనిపించిన వెంటనే, వాడిలో ఒకడైన దుర్ధరుడు, అసమానమైన, పదునైన ఐదు పచ్చని బాణాలతో హనుమంతుడి తలకు గురిపెట్టి కొట్టాడు. ఆ బాధతో హనుమంతుడు ఆకాశానికి ఎగిరి, భూమి, దిక్కులు పిక్కటిల్లేటట్లు సింహనాదం చేసాడు. దాని కదిరిన రాక్షసుడు పూర్ణ తేజస్సుతో వంద బాణాలను వానరవీరుడిపై కురిపిస్తాడు. మేఘాన్ని చెదరగొట్టే వాయువులా, ఆ బాణాలను చిందరవందర చేసి, శరీరం నొప్పి పుట్టున్నా ఓర్చుకుంటూ, తన దేహాన్ని పెంచి, ఆకాశాని కెగిరి, అక్కడనుండి, కొండమీద పిడుగు పడ్డట్లు దుర్ధరుడి రథంపై దూకుతాడు.

అలా హనుమంతుడు రాక్షసుడి రథం మీద పడడంతో, గుర్రాలు ఎనిమిదీ చచ్చాయి. బండి విరిగిపోయింది. వాడూ చచ్చాడు. అది చూసిన విరూపాక్షుడు, యూపాక్షుడు కూడా ఆకాశానికి ఎగిరి, హనుమంతుడి రొమ్ము పగల కొట్టటానికి, బాణాలేస్తారు. వారి వేగాన్ని అణచివేసిన హనుమంతుడు, చటుక్కున భూమి మీదకొచ్చి, ఒక చెట్టు పీకి, రాక్షసులమీద వేసాడు. వాళ్లు ఎత్తులో, హనుమంతుడేమో కింద వుండడంతో, ఆ చెట్టు దెబ్బకు వారిద్దరూ చచ్చారు. ఇలా తమ వాళ్లు ముగ్గురూ చావడంతో, అమిత కోపంతో ప్రహసుడు, భాసకర్ణుడు హనుమంతుడిని ఆయుధాలతో, శూలాలతో, పొడవడంతో,

ఆంజనేయుడు నెత్తురుతో తడిసి బాల భానుడిలా ప్రకాశించాడు. ఆ బాధతో, ప్రక్కనే వున్న ఓ పర్వత శిఖరాన్ని, అందులో వున్న చెట్లతో, పాములతో, మృగాలతోసహా పెకిలించి ఆ రాక్షసుల మీద మహా వేగంతో విసురుతాడు హనుమంతుడు. ఆ దెబ్బకు ఇద్దరూ చచ్చి నేల మీద పడ్డారు.

ఇలా సేనా నాయకులందరూ చావడంతో మిగిలిన ఏనుగులను, ఏనుగులతో కలిపి గుర్రాలను, గుర్రాలతో సహా భటులను, కొట్టి ఇంద్రుడు రాక్షసులను చంపినట్లు చంపుతాడు. పోయే దారి లేదన్న రీతిలో ఆ యుద్ధ భూమి చచ్చిన ఏనుగులతో, గుర్రాలతో, భటుల సమూహాలతో వ్యాపించాయి. వాటి మధ్యలో, హనుమంతుడు ప్రళయకాల యముడిలా కనిపించి, బడలిక తీర్చుకునేందుకు మళ్లీ తోరణ సీమ పైకెక్కి కూర్చున్నాడు.

❖ ❖ ❖

సర్గ-47

అక్షకుమారుడి చావుతో రావణుడి వంశ ధ్వంసన ప్రారంభం

తన ఐదుగురు సేనానాయకులు, సైన్యంతో సహా యుద్ధంలో మరణించారన్న వార్త విన్న రావణుడు, ఇంకొంచెం బలవంతుడిని పంపాలని నిర్ణయించుకుంటాడు ఈ సారి. అక్షుడనే తనకొడుకు, యుద్ధ గర్వం కలిగి, యుద్ధానికి పోవడానికి ఎప్పుడూ సిద్ధంగా వుండే భయంకర పరాక్రమవంతుడు. వాడినెంచుకున్న వెంటనే, తండ్రి కంటి సైగతోనే, యుద్ధానికి పోవడానికి తయారవుతాడు. బంగారంతో అలంకరించిన విల్లు ధరించి, బ్రాహ్మణుల హోమాగ్ని కెగిరే మంటల్లాంటి అగ్నిలా నిప్పులు కక్కుతూ బయల్దేరాడు యుద్ధానికి. తన తపస్సుతో సంపాదించుకున్న రథమెక్కాడు. అది బంగారు, రత్న సమూహాలతో ప్రకాశిస్తున్న ధ్వజాలు కలిగి, రత్నాలతో నిండిన రథం. ఎనిమిది గుర్రాలు లాగే ఆ రథం, బాలసూర్యుడిలా వెలుగుతూ, దేవదానవులకు అజేయమై, ఆకాశంలో శీఘ్రంగా పోగలిగినదై వుంది. యుద్ధానికి సిద్ధమైన అక్షకుమారుడు, అంబులపొద, ఎనిమిది కత్తులు, చిల్లకోలలు ధరించి, ఆ రథమెక్కుతాడు.

(ఇంతకు ముందు యుద్ధానికి వెళ్లినవారు, రథాలు విడిచి, ఆకాశంలో యుద్ధం చేసారని విన్న అక్షుడు, ఆకాశంలో పోగలిగే రథాన్ని తెచ్చుకున్నాడు)

భూమ్యాకాశాలు దద్దరిల్లే ధ్వనితో, పోగలిగే రథాలు, ఉత్తమ ఏనుగులు, గుర్రాలు, పదాతి దళం వెంట రాగా, బయల్దేరిన అక్షుడు, తోరణం మీద కూర్చున్న బలవంతుడైన హనుమంతుడిని చూసాడు. ప్రళయకాలాగ్నిలా వున్న వుత్తమ వీరుడిని, ఆంజనేయుడిని సగౌరవ దృష్టితో చూసి, వాడికున్న వేగంతో వెళ్లగలనన్న పొగరున్న వాడని గ్రహించిన వాడై, తన శస్త్రాస్త్ర పాండిత్యం, దేహబలం అతడికి చూపటానికి, గ్రీష్మ సూర్యుడిలా, తీవ్రంగా ఆంజనేయుడిని మూడు బాణాలతో కొట్టాడు.

అంతటితో ఆగకుండా మీదపడి పదునైన కరకు బాణాలతో, నొప్పి కలిగించడం మొదలుపెట్టడంతో, దేవతల గుండెలదిరేలా, క్రూరంగా, అక్షుడికి,

హనుమంతుడికి యుద్ధం కొనసాగింది. ఒకరికొకరు, ఇద్దరూ తీసిపోకుండా, భయంకరంగా యుద్ధం చేస్తుంటే, భూమి కంపించింది. సూర్యుడి కాంతి ఆగిపోయింది. గాలి వీచడం మానింది. కొండలు కదిలాయి. ఆకాశంలో ధ్వని పుట్టింది. సముద్రాలు భయంతో కలవరపడ్డాయి. ఇలా జరుగుతుంటే, రాక్షస రాకుమారుడు, చిన్నవాడైనా, విషసర్పాల్లాంటి బంగారుకొనగల బాణాలను, మూడింటిని హనుమంతుడిపైకి విసిరాడు. అవి నాటుకుని నెత్తురు కారుతున్న హనుమంతుడి ముఖం సూర్యబింబాన్ని తలపించింది. అక్షకుమారుడి బాణాలేమో కిరణాల్లా ప్రకాశించాయి.

ఇది చూసిన ఆంజనేయుడు కోపంతో, తన చూపులతోనే అక్షకుమారుడి సేనలను, వాహనాలను దగ్ధం చేసాడు. అక్షుడు కూడా సూర్యప్రతాపంతో, కొండపై వర్షించే మేఘంలా, బాణవర్షం కురిపించ సాగాడు. తనను పట్టుకోవాలన్న ధ్యేయంతో వున్న అక్షుడిని మోసగించి ఆకాశాని కెగిరాడు హనుమంతుడు. తప్పించుకున్నాడే! అనుకుంటూ ఆయనపై బాణవర్షం కురిపించాడు అక్షకుమారుడు. అయినా హనుమంతుడు చిక్కలేదు. అప్పటికీ అక్షుడు వెనుకంజ వేయలేదు. బాణాల వర్షం కురిపిస్తూనే వున్నాడు. వీడినెట్లా గెలవాలా అని హనుమంతు డాలోచిస్తుంటె, ఆయన చేతులు కట్టి పడేసి, బాధించుదామనుకున్నాడు అక్షుడు.

“వీడు చిన్నవాడైనా గొప్ప శూరుడు. బాలభానుడిలా ప్రకాశిస్తున్నాడు. భయం లేదు కాని ఇలాంటివాడికి కూడా ఆపద రాబోతున్నదే! నా మనస్సంగీకరించడం లేదే! వీడి పరాక్రమాన్ని దేవతలు, యక్షులు, పన్నగులు, మహర్షులు, పొగడుతున్నారే! పోనీ వీడిదృష్టి మళ్లించి మోసం చేద్దామంటే, వీడేమో నన్నే చూస్తున్నాడే! ఎటుపోతే అటు నాకెదురవుతున్నాడు. పోను పోను వాడి నేర్పు, తీర్పు, ఓర్పు, పెరుగుతున్నదే కాని తరగడంలలేదు. రోషం కూడా తగ్గలేదు. వీడు చిన్నవాడని ఉపేక్షిస్తే, యుద్ధంలో నాకు అవమానం తప్పదు. నేను పిల్లరాక్షసుడి చేతిలో ఓడిపోయానన్న అపకీర్తి కూడా వస్తుంది” అనుకుంటాడు అక్షకుమారుడి గురించి హనుమంతుడు.

వాడిని మెచ్చుకుంటూ, అక్షుడి పరాక్రమం, వేగం, ప్రతాపం, దేవతా సమూహాలకైనా గుండెలదిరేటట్లు వున్నాయను కుంటాడు. అయినా వాడి విలువిద్యా పాటవాన్ని, భుజబల సంపూర్ణత్వాన్ని సహించాల్సిన పనిలేదని, వాడిని చంపాల్సిందేనని, లేకపోతే, మండుతున్న అగ్నిని చల్లార్చడం ఎంతకష్టమౌతుందో, ఇదీ అంతే అవుతుందని తలుస్తాడు. ఇలా ఆలోచిస్తూనే దేహాన్ని పెంచి, రాక్షస కుమారుడిని చంపే ఉద్దేశ్యంతో, వేగంగా, ఆకాశంలో తిరిగే గుఱ్ఱాలను, తన అరిచేతి దెబ్బతో చంపుతాడు మొదలు. అంతే రథాన్ని విరగ్గొట్టి నేలమీద పడేస్తాడు. రథం విరగడంతో, అక్షుడు కిందకు దిగి విల్లు చేతబట్టుకుని ఆకాశానికి ఎగురుతాడు, దేహాన్ని విడిచి స్వర్గానికి పోయే మహర్షిలా. ఎగిరి కత్తి చేత్తో పట్టుకుని, హనుమంతుడి దగ్గరకొచ్చి ఘోరంగా యుద్ధం చేయసాగాడు. ఇకలాభం లేదనుకుంటాడు ఆంజనేయుడు. గరుత్మంతుడు పాముతోక పట్టుకుని ఈడ్చినట్లు, వాడికాళ్లు పట్టుకుని, తిప్పి, వేగంగా బలంకొద్దీ నేలమిద వేసి బాదుతాడు. వాడితల తునకలై, కండలు, నెత్తురు, ఎముకలు, నేలంతా వ్యాపించాయి. వాడి చావుకు రావణుడి గుండెలు పగిలాయని, దేవతలు, మునులు, యక్షులు, పన్నగులు, చక్రవర్తులు, మహాత్ములు, ఇంద్రుడు సంతోషించారు. హనుమంతుడి బలానికి ఆశ్చర్యపోయారు.

బలపరాక్రమాలలో జయంతుడితో సమానమైన, అక్షకుమారుడిని చంపిన హనుమంతుడు, ప్రళయకాల యముడిలా బడలిక తీర్చుకునేందుకు, మళ్లీ ద్వార తోరణం మీదకు ఎక్కాడు.

❖ ❖ ❖

సర్గ-48

ఇంద్రజిత్తును హనుమంతుడి మీదకు పంపిన రావణుడు

వీరుడైన తన కొడుకు అక్షకుమారుడు, కోతిచేతిలో చచ్చాడని విన్న రావణుడు హతాశుడైనాడు. కోపంతో కళ్లెర్ర చేసాడు, ఇంద్రజిత్తును (అసలు పేరు మేఘనాదుడు. ఇంద్రుడిని జయించి ఈ బిరుదు పొందాడు) పిలిచి అతడిని యుద్ధానికి పంపాలని నిర్ణయించాడు. ఉద్యానవనాన్ని పాడుచేసిన కోతి మామూలు కోతి కాదని తలచిన రావణుడు, మొదట తనసేవకులైన కింకరులను పంపాడు. ఆతర్వాత ఏడుగురు మంత్రిపుత్రులను పంపుతాడు. అప్పటికీ లాభంలేకపోవడంతో సేనానాయకులను పంపాడు. వీరందరూ చచ్చిన తర్వాత, ఎప్పుడూ ఇతరులనే పంపుతున్నాడన్న నింద పడుతుందేమోనని తన చిన్న కుమారుడిని పంపాడు. వాడూ చచ్చిన తర్వాత వీరందరికంటే ఘనుడూ, అస్త్రవిద్యలో ప్రవీణుడూ అయిన తన రెండవ కొడుకు ఇంద్రజిత్తును పంపదలచాడు.

ఇంద్రజిత్తు, అస్త్రవిద్యలలో ప్రధముడనీ, సమస్త దేవదానవులకు శోకం కలిగించిన వాడనీ, భుజబలంలో ఎల్లలోకాలలో ప్రసిద్ధికెక్కిన వాడనీ, బ్రహ్మదేవుడి దగ్గరనుండి మహాస్త్రాలు సంపాదించిన వాడనీ, వాడు చేసిన పనులు దేవతలందరకూ తెలుసనీ, అంటాడు రావణుడతడితో. దేవదానవులూ, ఇంద్రుడూ అతడి ఎదుట నిల్చి యుద్ధం చేయడం మాట అటుంచి, మాయలు చేయడంలో కూడా అతడికి సమానులు కారనీ అంటాడు రావణుడు. (అంటే హనుమంతుడిని న్యాయమార్గంలో, అస్త్రాలతో చంపే ప్రయత్నం సఫలం కాకపోతే, మాయ చేసైనా చంపమని అర్థం). రావణుడు ఇంద్రజిత్తును పొగడ్తల మాటలతో ప్రేరేపించుతాడిలా:

"నువ్వాలోచిస్తే నీకు తోచని ఉపాయమేదీలేదు. యుద్ధంలో నీకు అసాధ్యమయిందేదీ లేదు. ముల్లోకాల్లో నీ బలం, అస్త్రశస్త్ర పాండిత్యం, తెలియని వారెవ్వరూ లేరు. గొప్పతనంలో, పరాక్రమంలో, భయంకర అస్త్రబలంలో, గొప్ప శక్తిలో, నా అంతటివాడవు. యుద్ధంలో నీకెప్పుడూ జయం నిశ్చయమన్న

ధైర్యంతో, నేనెప్పుడూ నిర్విచారంగా వుంటున్నాను. అన్నింటికీ ఇంద్రజిత్తున్నాడులే! నాకెవరివలనా భయం లేదని, సర్వవేళలా అనుకుంటున్న నాకు ఈ వేళా అంతేకదా!".

ఇంకా ఇంద్రజిత్తును గురించీ, వాడు ఎలా యుద్ధం చేయాలనే విషయాన్నీ రావణుడు ఇలా చెప్తాడు:

"యుద్ధంలో నిన్నెదిరించి భయపడని వాడూ, అల్లాడనివాడూ, ఎవరన్నా వున్నారా? భుజబలం, తపోబలం, అస్త్రబలం, నిన్నెప్పుడూ రక్షిస్తున్నాయి. ఎప్పుడెలా, ఎక్కడెలా ప్రవర్తిస్తే మంచిదో, అలానే ప్రవర్తించే తత్వంకల నీకు విజయం సులభం.(హనుమంతుడితో యుద్ధం చేసేటప్పుడు ఇవన్నీ వుపయోగించాలని సూచిస్తున్నాడు). కింకరులను, జంబుమాలిని, మంత్రి పుత్రులను, సేనానాయకులను, అక్షకుమారుడిని ఆ వానరుడు చంపాడు. అందరికంటే నీమీద నా కెక్కువ నమ్మకం వున్నందున, ఇంకెవరిని పంపినా జయించరేమోనన్న అపనమ్మకంతో నిన్నే పంపాల్సివస్తున్నది. వానరుడి బలం, వేగం చక్కగా పరీక్షించి, దానికి తగ్గట్లు నీ బలశౌర్యాలు చూపించు. వాడిని చంపడం ఆలస్యమైనకొద్దీ, మన సైన్యం నాశనం పెరుగుతున్నది. అందుకే అస్త్రాలతో త్వరగా చంపు. ఉత్తుత్తి బాణాలతో సమయం వృధా చేయొద్దు. మీ ఇరువురి శక్తియుక్తులు జాగ్రత్తగా పరీక్షించు".

"ఇరువురు యోధులు యుద్ధం చేస్తుంటే సైనికులు అడ్డం వచ్చి రక్షిస్తారు. కానీ, ఈ వానరుడు, సైనికులు ఏమీ చేయలేని పద్ధతిలో, గమ్మున నీమీద దూకితే ఎవరూ ఏమీ చేయలేరు. సైనికులను నమ్మి యుద్ధం చేయొద్దు. సామాన్యంగా రాక్షసులుపయోగించే ఆయుధమైన "వజ్రం" వాడినేం చేయలేదు. అగ్నిహోత్రుడి లాంటి వాడిని నీ ముష్టి ఘాతాలు కూడా ఏమీ చేయలేవేమో. నువ్వక్కడకు పోయిన తర్వాత, ఏది మంచిదని తోస్తే అదే చేయి. బ్రహ్మాస్త్రంలాంటి మహాస్త్రాలనూ ధరించి పో! మనస్సు, దృష్టి, బాణం, మూడూ ఏకకాలంలో, ఒకే స్థలంలో పడేటట్లు యుద్ధం చేయి. ఈ మూడూ చెదిరి పోకుండా, తొందరపడకుండా, నిబ్బరంగా, ఏ కలతా మనస్సులో పెట్టుకోకుండా యుద్ధం చేస్తే జయం కలుగుతుంది".

"పెద్దవాళ్లుండగా యుద్ధంలోకి పిల్లలను పంపడం సరికాదని నాకు తెలుసు. మనం రాజులం, మనది క్షత్రియ ధర్మం. దాని ప్రకారం, రాజు ముందుగా యుద్ధానికి పోగూడదు. క్షత్రియధర్మం మనం అతిక్రమించకూడదు. అందుకే నిన్ను పంపుతున్నాను. రకరకాల అస్త్రాలను మనస్సులో స్మరించుకుంటూ యుద్ధం చేయి. జయించి రా!" అంటాడు.

(రావణుడు తాను క్షత్రియుడనని తానే అంగీకరించాడు. వాడు బ్రాహ్మణుడనీ, వాడిని చంపినందువల్ల రాముడికి బ్రహ్మ హత్యాపాతకం చుట్టుకుంటుందని కొందరనడం నిజం కాదు. ఎలాంటివాడు బ్రాహ్మణుడో తెలుసుకోవడం అవసరం. ఏ జాతివారు ఆ జాతివారిని పెళ్లి చేసుకుని, పిల్లలను కంటే, ఆ పిల్లలు, మాతా-పితరుల జాతి కలిగి సజాతీయులమని పిలువబడతారు. బ్రాహ్మణుడికి శాస్త్రప్రకారం వివాహం చేసుకోని బ్రాహ్మణ స్త్రీయందు పుట్టినవారు కూడా బ్రాహ్మణులు కారు. సవర్ణ స్త్రీకి, రెండవ తండ్రికి పుట్టినవాడు కూడా జాతివల్ల శూద్ర ధర్మం కలవాడే. వాడికి బ్రహ్మచర్యాది వ్రతాలూ, ఉపనయనాది సంస్కారాలూ లేవు. బ్రాహ్మణుడికి బ్రాహ్మణ జాతి స్త్రీయందు పుట్టినా, బ్రాహ్మణ గుణకర్మములు లేకపోతే వాడు బ్రాహ్మణుడు కాడు. ఇకపోతే రావణుడి తండ్రి విశ్రవసుడు బ్రాహ్మణుడు. తల్లి కైకసి రాక్షసి, క్షత్రియురాలు. బ్రాహ్మణుడికి వివాహిత క్షత్రియ స్త్రీ యందు జన్మించినవాడు క్షత్రియుడే అవుతాడు. విశ్రవసుడు బ్రాహ్మణుడే అయినా, అవివాహిత అయిన క్షత్రియ రాక్షస స్త్రీ కైకసికి జన్మించిన కారణాన రావణుడు బ్రాహ్మణుడు కాబోడు. వ్యాసుడికి శూద్ర స్త్రీయందు పుట్టిన విదురుడు శూద్రుడే అయినాడు).

హనుమంతుడిపైకి యుద్ధానికి పోయిన ఇంద్రజిత్తు

తండ్రిమాటలు విన్న ఇంద్రజిత్తు, వినయంతో ఆయనకు ప్రదక్షిణ చేసి నమస్కరిస్తాడు. దేవతలతో సమానమైన బలమున్న ఇంద్రజిత్తు, గర్వంతో యుద్ధానికి తగిన ప్రయత్నాలు చేసి, బంధువు లందరి గౌరవాభిమానాల మధ్య, పున్నమి నాటి సముద్రిడిలా పొంగిపోయి, గరుడ వేగంతో సమానంగా పోగల గుర్రాలు కట్టిన రథమెక్కి ఇంటినుండి కదుల్తాడు. ఉత్తమోత్తమ రథికుడైన

ఇంద్రజిత్, హనుమంతుడిని సమీపిస్తుంటే, అతడి రథచక్రాల ధ్వనినీ, అల్లెత్రాటి మ్రోతనూ విన్న ఆంజనేయుడు, తగినవాడే యుద్ధానికి వస్తున్నాడని సంతోషంతో సింహనాదం చేసాడు. ఏం జరుగుతుందో చూద్దామని ఆకాశంలో సంచరించే నాగులు, యక్షులు, ఋషిశ్రేష్టులు గుమిగూడారు ఆనందంతో.

భయంకరమైన విల్లు, పదునైనబాణాలు పట్టుకుని యుద్ధానికి పోతున్న ఇంద్రజిత్తు వేగానికి జంతువులు అరిచాయి, దిక్కులు కాంతిహీనమయ్యాయి, పక్షులు ఆకాశానికెగిరి కూయసాగాయి. ఇంద్రజిత్తు బాణవర్షాన్ని కురిపిస్తూ, హనుమంతుడి దగ్గరకు పోయేప్రయత్నం చేయగా, ఆయన కంఠధ్వనికి, కొండలు బద్దలయ్యి, భూమికదిలి, మేఘాలు చెదిరిపోయాయి. ఇంద్రజిత్తు వేస్తున్న బాణాలు, విచ్చులవిడిగా వచ్చి హనుమంతుడిని తాకాయి. ఈ వీరులిద్దరూ దేవదానవుల్లా విరోధంతో యుద్ధం చేయసాగారు. సందు లేక వస్తున్న ఇంద్రజిత్తు బాణాలను అడ్డుకునేందుకు, దేహాన్ని పెంచిన ఆంజనేయుడు వాయుమార్గంలో తిరగసాగాడు. ఇంద్రజిత్తు బంగారుకొన ములుకు బాణాలను అతివేగంగా వేస్తుంటే, రాక్షసుల ఆనందానికి హద్దులేకుండాపోయింది. ఆంజనేయుడేమో, కోపంతో, ఇంద్రజిత్తు వేస్తున్న బాణాలను వ్యర్థం చేయటానికీ, తనకు తగలకుండా చేసుకోవటానికీ, సకలప్రయత్నాలూ చేసాడు. కాసేపు ఆ బాణాలమధ్య వేగంగా తిరిగాడు. కాసేపు ఎదురుగా కనిపించాడు. కనిపించాడని బాణం వేసే లోపల, ఆకాశంలోకి ఎగిరిపోయేవాడు. ఇంతలోనే మీద దూకేవాడు. కాసేపు చేతులడ్డం పెట్టుకునేవాడు.

ఇద్దరూ యుద్ధంలో, సమర్థులే! ఇద్దరూ అతివేగంగా, అంతులేని పరాక్రమంతో, భూతసమూహాలు ఆశ్చర్యపోతుంటే యుద్ధం చేసారు. వారిద్దరిలో తేడా కనిపించలేదు. ఒకరిలోపం ఇంకొకరికి తెలవడం కష్టమయింది. తన బాణాలన్నీ వ్యర్థమైపోతుంటే, ఏంచేయాలన్న ఆలోచనలో పడ్డాడు ఇంద్రజిత్తు.

❖ ❖ ❖

సర్గ-49

హనుమంతుడిని బ్రహ్మాస్త్రంతో బంధించిన ఇంద్రజిత్తు

ఆంజనేయుడెంతకూ తనకు చిక్కడంలేదనుకున్న ఇంద్రజిత్, భుజబలంతో వీడిని చంపడం వీలుకాదనీ, ఏవిధంగానైనా కట్టేయాలనీ, భావించి బ్రహ్మాస్త్రం సంధించాడు. అది ఆంజనేయుడిని కట్టేయడంతో, కోతి నేలకూలిందని సంతోషించారు రాక్షసులు. కాళ్లూ, చేతులూ కదిలించలేక సోలిపోయిన ఆంజనేయుడు, బ్రహ్మ తనకిచ్చిన వరాన్ని గుర్తు చేసుకుంటాడు. భుజపరాక్రమం చాలించి, బ్రహ్మ ఆజ్ఞను దాటకుండడమే మేలని తలుస్తాడు. రాక్షసులకు కొంచెం సేపు చిక్కిపోయినా, తనకు వరాలిచ్చిన బ్రహ్మ, ఇంద్రుడు, తండ్రి వాయుదేవుడు, తన్ను రక్షిస్తుంటే, తనకొచ్చిన భయమేదీ లేదనుకుంటాడు.

(ఇంద్రజిత్తు బుద్ధిహీనతకు ఇది ఒక దృష్టాంతం అనిపిస్తున్నది. అస్త్రాలన్నింటిలోనూ అవక్ర పరాక్రమం గలది బ్రహ్మాస్త్రమే! దానికి ఎదురులేదు. అలాంటి బ్రహ్మాస్త్రాన్ని అల్ప కార్యాలను సాధించడానికి ప్రయోగించరాదు. ఆవేళ సీతమ్మ తృప్తికై కాకిని శిక్షించడానికి రాముడు బ్రహ్మాస్త్రాన్ని సంధించాడు. ఇంద్రజిత్తు తన ప్రబల శత్రువైన రాముడిని తప్పించి హనుమంతుడిపైన వేయడమేమిటి? అవివేకం కాకపోతే! పైగా హనుమంతుడు దూతకదా! ఓర్పూ-నేర్పూ లేని వాడిగా ఇంద్రజిత్తు మిగిలిపోయాడు)

బ్రహ్మ రుద్రేందాదుల వరాలను పొందిన నిరుపమ పరాక్రమశాలి హనుమంతుడు. అతడిని ఏ అస్త్రాలూ బంధించలేవు. కించిత్తు దైవ శాపం వుంది కనుక హనుమను బ్రహ్మాస్త్రం కించిత్తు సమయమే బాధించగలిగింది. తరువాత విడిచి పెట్టింది. ఇది గమనించిన ఇంద్రజిత్తు ఇదంతా తన ప్రభావమే అనుకుంటాడు. అసమర్థతను సామర్థ్యంగా భావించిన ఇంద్రజిత్తును చూసి, ఇదీ తనకు మేలేనని భావిస్తాడు హనుమంతుడు.

వీళ్లకు చిక్కినా తన్నేమీ చేయలేరనీ, ఏం చేయాలన్నా రావణాజ్ఞ తప్పని సరనీ, ధైర్యం తెచ్చుకుంటాడు. తనను పట్టుకుని రావణుడి దగ్గరకు తీసుకునిపోతారుకనుక, వాడితో మాట్లాడటానికీ, వాడి అభిప్రాయం

తెలుసుకోవటానికీ, ఇదొక మేలైన అవకాశమని భావిస్తాడు. ఇలా ఆలోచిస్తూ హనుమంతుడు, కదలక, మెదలక వూరుకుండిపోయాడు. దుష్ట రాక్షసులు తనమీద పడి, నారతాళ్లతో, నార గుడ్డలు కలిపి, తన్ను కట్టేస్తుంటే, కోతిగుణం తెలిపే వాడిలా కేకలు వేయసాగాడు.

హనుమంతుడు పడిపోవడం చూసిన రాక్షసులు కోపంతో, బలమైన పగ్గాలను నారవస్త్రాలతో ముడేసి, కడు ప్రయత్నంతో తన్ను కట్టేస్తుంటే, రావణుడిని చూడవచ్చుకదా అన్న కోరికతో, ఆ కట్లు సహించి వూరుకున్నాడు ఆయన. రాక్షసులు తాళ్లతో, పగ్గాలతో, హనుమంతుడిని కట్టేయగానే, బ్రహ్మాస్త్ర బంధాలు తెగిపోయాయి. బ్రహ్మాస్త్రబంధాలు మరో బంధాలతో కలిస్తే వ్యర్థమైపోతాయి. అసమాన శక్తిగల ఈ అస్త్రం, ఈవిధంగా నిష్ప్రయోజనమై పోవడం చూసిన ఇంద్రజిత్తు, శోకిస్తూ, అయ్యో! ఎంతగొప్ప ప్రయత్నం ఇలా వ్యర్థమైపోయిందేనని బాధపడ్డాడు. ఈ రాక్షసులు అజేయమైన మంత్రశక్తిమీద నమ్మకంలేక ఇలా చేసారుకదా! అనుకుంటాడు. ఈ అస్త్రం మళ్లీ ప్రయోగించలేమనీ, ఇది వ్యర్థమైన చోట మరింకే అస్త్రం పనిచేయలేదనీ, ఇప్పుడేంగతనీ, రాక్షసులందరూ నాశనమైపోయే రోజొచ్చిందనీ బాధపడ్డాడు. తన దేహాన్ని కట్టేసిన అస్త్రబంధాలు వదిలిపోయిన సంగతి ఎరుగని ఆంజనేయుడు చిక్కుబడి వున్నాడనీ, తెలిస్తే విజృంభిస్తాడనీ, అప్పుడేంగతనీ ఇంద్రజిత్తు ఆలోచనలో పడిపోయాడు.

(ఇంద్రజిత్తు హనుమంతుడిని, "బ్రహ్మాస్త్రం"తో బంధించిన తర్వాత, రాక్షసులు, తాళ్లతో, పగ్గాలతో తిరిగి కట్టేయగానే, బ్రహ్మాస్త్ర బంధాలు తెగిపోయాయి. బ్రహ్మాస్త్ర బంధాలు మరో బంధాలతో కలిస్తే, ఆ బంధాలు విడిపొయినట్లే! దీనర్థం: ప్రపత్తి చేసినవాడు, దాని మీద విశ్వాసం లేక పోతే, ప్రపత్తికి సహాయపడుతుందని వేరే సాధనాన్ని వుపయోగిస్తే, "ప్రపత్తి" చెడిపోతుంది. ప్రపత్తిలో వున్న అపాయం ఇదే! ఇతర "ఉపాయాల"ను అది సహించదు. ఉత్తములు నీచ సహవాసాన్ని సహించరు కదా! అంతే భరన్యాసం చేసినవాడు మళ్లీ సొంత ప్రయత్నం చేస్తే వాడికి భరన్యాస ప్రభావం మీద నమ్మిక లేనట్లే! భరన్యాసం చేసినవాడు అకించనుడిగా భావిస్తూ వుండాలని పెద్దలంటారు)

ఇంద్రజిత్తు ఆలోచన చేస్తున్నప్పుడే, రాక్షసులు కోతిని తాళ్లతో కట్టి, కట్టెలతో కొట్టూ, పిడికిళ్లతో గుద్దుతూ తీసుకునిపోయి, రావణుడి ముందర నిలబెట్టారు. "కోతిని తెచ్చాం" అంటే, "కోతి" అన్నమాట మొదట విన్న రావణుడు, ఇంద్రజిత్తును కూడా చంపేశాడేమోనని అనుకుంటాడన్న భయంతో, "తెచ్చాం కోతిని" అంటారు. వెంటనే ఆ సభలో వున్నవారందరూ: "వీడెవడు? ఎక్కడనుండి వచ్చాడు? ఎవరు పంపారు? ఏం పనుండి వచ్చాడు? ఎందుకిలా చేసాడు?" అని ఒకరితో ఒకరు అనుకుంటుంటే, ఇంకొందరు మదించిన గర్వంతో హేళనగా మాట్లాడసాగారు. "కట్టేయండి, కొట్టండి, కాల్చండి, మింగండి" అనడం మొదలెట్టారు వాళ్లు. ఇవన్నీ వింటూనే రామదూత హనుమంతుడు, రాక్షసుల వెంటపోయి రావణుడి పాదాల దగ్గర వున్న మంత్రులను, దిట్టలను, ముసలి వారిని, సేవకులను, దివ్య రత్నఖచితమైన సభా మంటపాన్ని చూసాడు.

వికారమైన అకారమున్న రాక్షసభటులు, ఇరు ప్రక్కలా ఈడ్చుకుంటూ..... రారా! అని సంబోధిస్తుంటే, వచ్చి ఎదుట నిలబడిన, భయంకర తేజమున్న హనుమంతుడిని రావణుడు చూసాడు. సూర్యకాంతితో, బలంతో, తేజంతో, కోపంతో, కఠిన ముఖంతో వున్న మహిమగల రావణాసురుడిని హనుమంతుడప్పుడే చూశాడు. భయంకరమైన తన ఇరవై కళ్లు ధగధగా మెరుస్తుంటే, తన దగ్గర కూర్చున్న బుద్ధిమంతులైన మంత్రి శ్రేష్టులను, కులంలో, ఆచారంలో పెద్దలను, వీడెవ్వడో తెలుసుకోమని కోరాడు రావణుడు. వారు రాజాజ్ఞ ప్రకారం అలానే ప్రశ్నించగా, తాను వానర రాజైన సుగ్రీవుడు పంపితే వచ్చానంటాడు ఆంజనేయుడు. వీడొక కోతి, నీచ ప్రాణి. నేను రాజునుకదా! నేరుగా నేను వీడితో మాట్లాడేదేమిటి? అని రావణుడి అహంకారం, స్వాతిశయం. మంత్రి ద్వారా హనుమంతుడిని ప్రశ్నించేట్లు చేస్తాడు. కానీ హనుమ మంత్రులకు నేరుగా జవాబు చెప్పడు. రావణుడితోనే మట్లాడుతాడు. రావణుడిని లక్ష్యపెట్టడు. మొదట రాముడిని కలిసినప్పుడు లక్ష్మణుడి ద్వారా హనుమంతుడికి జవాబిస్తాడు రాముడు.

రావణుడిని సభలో చూసిన హనుమంతుడు

రావణుడు చేయించిన పనులకు ఆశ్చర్యపడ్డ హనుమంతుడు, కోపంతో, ఎర్రటికళ్లతో, కలహానికి కాలుదువ్వుతున్న రావణుడిని నిర్లక్ష్యంగా చూశాడు. రావణుడున్న తీరు, ఆ కొలువుకూటం హనుమంతుడికెలా అనిపించిందంటే:

వెలగల ముత్యాలతో చుట్టబడి, అసమానమైన కాంతిని విరజిమ్మే కిరీటం ధరించాడు. రావణుడు మనసుకు నచ్చిన బంగారు ఆభరణాలను ధరించి ప్రకాశిస్తున్నాడు. తెల్లటి పట్టు వస్త్రాలు ధరించి, ఎర్రటి గంధం పూసుకుని సువాసనలు వెదజల్లుతున్నాడు. చూడ బుద్దేస్తున్నా తెరిస్తే భయం కలిగించే కళ్లున్నవాడు. మెరిసే కోరలు, వేలాడే పెదవి, పదితలలతో, పాములతో కూడిన మందర శిఖరంలా వున్నాడు. కాటుక కుప్ప లాంటి నల్లటి మెడలో, ముత్యాల దండలు, అందంగా కనపడుతుంటే, చంద్రబింబం లాంటి ముఖం కలిగున్నాడు. చిత్రాలు గీసి, స్ఫటికాలు, రత్నాలు చెక్కిన సింహాసనం పైన కూర్చుని వున్నాడు. రెట్ట కడియాలు, చేతి కడియాలతో, గంధంపూత రంగులో ఐదు తలల పాములా ప్రకాశిస్తున్న భుజాలతో తేజరిల్లుతున్నాడు. యువతులు తమ చేతి కంకణాలు గణగణా మ్రోగుతుంటే ఆయనకు వింజామరలు వీస్తున్నారు. భూమిని నాలుగు సముద్రాలు చుట్టుకొన్నట్లు ఆయన చుట్టూ మంత్రులు, ప్రహస్తుడు, నికుంభుడు, దుర్ధరుడు, మహాపార్శ్వుడు, ఆయనకు ఆలోచనలందిస్తున్నారు. దూరాన్నుంచే దేవతలు ఇంద్రుడిని కొలిచినట్లే, ఇతర మంత్రులు రావణుడికి ఎడంగా వుండి సేవిస్తున్నారు. మేరు శిఖరం చివరలో వుండే నీళ్లలాంటి మేఘంలా నల్లగా వున్నాడు రావణుడు.

ఇలా వున్న రావణుడిని చూసి ఆశ్చర్యపోయిన హనుమంతుడు ఆయన్ను గురించి "ఏమి రూపం, ఏమి తేజం, ఏమి బలం, ఏమి ధైర్యం" అని అనుకుంటాడు. వాడి అవయవ సంపద చూసి చకితుడై పోతాడు. (హనుమంతుడు రాముడి దివ్యమంగళ విగ్రహాన్ని చూసాడు. ఇప్పుడు మళ్లీ రావణుడిని చూస్తున్నాడు. రాముడిని చూసి ఆయన కమల పత్రాక్షుడనీ, సర్వసత్త్వ మనోహరుడనీ అంటాడు. ఇలాంటి సౌందర్యం, సంపద, ఆకర్షణ ఇద్దరిలోనూ వున్నాయి. కానీ, రూప దాక్షిణ్య సంపన్నత, ఇతరుల పట్ల కరుణ,

రక్షించాలనే బుద్ధి రాముడిలోనే కనిపిస్తున్నాయి. రావణుడిలో లేవు. అందువల్లే రావణుడికంటే రాముడే గొప్ప అని నిశ్చయించుకుంటాడు) రాజులకుండాల్సిన చిహ్నాలన్నీ వున్నాయే ఇతడికి అనుకుంటాడు. ఇట్టివాడు ధర్మ విరుద్ధమైన పనులే చేసి వుండకపోతే, ఇంద్రుడున్న స్వర్గాన్ని కూడా తన శక్తి, యుక్తులతో పరిపాలించేవాడుకదా! అని భావిస్తాడు. "కఠినమైన మనస్సుతో, భూతదయ లేకుండా ఉన్నందునే కదా జనులు దూషిస్తున్నారు. దేవదానవులు వణుకుతున్నారు. వీడు కోపించి, పరాక్రమించి, లోకాలన్నీ ప్రళయకాలంలోని సముద్రం లాగా చేయదల్చుకుంటే ఆ తేజస్సును అడ్డగించే వారుండరు కదా!" అనుకుంటాడు.

❖ ❖ ❖

సర్గ-50

హనుమంతుడిని చూసి ఆలోచిస్తున్న రావణుడు

పచ్చటికళ్లున్న వానరుడిని, ఎదురుగా వున్న ఆంజనేయుడిని, ఎగాదిగా చూసి ఆలోచనలో పడ్డాడు రావణుడు. కైలాస పర్వతాన్ని పెళ్లగించినప్పుడు, తనను శపించిన నందీశ్వరుడే ఈ రూపంలో వచ్చెనా వుండాలి లేదా, తన శత్రు పక్షంలోని బాణుడన్నా కోతి రూపంలో వచ్చి వుండాలని సందేహిస్తాడు. సందేహంతో, కోపంతో కళ్లెర్ర చేసాడు. వచ్చిన దుష్టాత్మకుడెవ్వడు? లంకకేపనిమీద వచ్చాడు? వీడిని పంపిందెవ్వరు? ఉద్యానవనాన్ని ఎందుకు పాడుచేసాడు? రాక్షస స్త్రీల నెందుకు బెదిరించాడు? యుద్ధమెందుకు చేసాడు? ఈ విషయాలన్నీ అడగమని తన ముఖ్యమంత్రి అయిన ప్రహస్తుడిని ఆజ్ఞాపించాడు. వెంటనే అతడు రావణుడి ఆదేశం మేరకు కోతి జాతి వాడా అని ఆంజనేయుడిని సంబోధిస్తూ ప్రశ్నిస్తాడు. ఊరడిల్లమనీ, భయపడవద్దనీ, నిజం చెప్పితే వదిలిపెట్తామనీ, అసత్యం చెప్తే ప్రాణాలతో వదలమనీ అంటూ, హనుమంతుడి నెవరు తమ రాక్షసనగరానికి పంపించారని ప్రశ్నిస్తాడు ప్రహస్తుడు. "యముడా, కుబేరుడా, వరుణుడా, రాక్షసులను గెలవదల్చుకున్న విష్ణుమూర్తా"? ఎవరు పంపారని అడుగుతాడు. హనుమంతుడిలాంటి అసమాన పరాక్రమం సామాన్యకోతిలో వుండవనీ, ఆకారంలో వానరుడైనా వాస్తవానికి మారువేషంలో వచ్చిన మరెవరో అయ్యుండాలనీ కూడా అంటాడు. నిజం చెప్తే వదిలేస్తామనీ, అసత్యం చెప్తే మెడమీద తలుండదనీ భయపెడ్తూ, రాక్షసరాజు నగరానికి ప్రవేశించిన కారణం సర్వం విన్నవించమంటాడు ప్రహస్తుడు.

రావణుడికి తన వృత్తాంతాన్ని చెప్పిన హనుమంతుడు

ప్రహస్తుడడిగిన ప్రశ్నలకు వాడంటే లక్ష్యం లేకుండా, రావణుడంటే జంకు లేకుండా, మాట తడబడక, తనవృత్తాంతాన్నంతా చెప్తా వినమంటాడు. ఇంద్రుడు, వరుణుడు, యముడు పంపితే తాను రాలేదు అంటాడు. కుబేరుడికి

తనకు ఏనాడూ స్నేహం లేదనీ, విష్ణు విక్కడకు పొమ్మని అనలేదనీ చెప్పాడు. తానే ఆకారంలో కనిపిస్తున్నాడో, ఆ జాతివాడినేననీ, దుర్లభమైన రాక్షసరాజు దర్శనం కోరి ప్రమదావనాన్ని పాడుచేసాననీ అన్నాడు. యుద్ధం చేయడానికి రాక్షసులొస్తే తన్ను కాపాడుకోవటానికి మాత్రమే వారితో పోరాడానంటాడు.

తనను ఇంద్రాది దిక్పాలకులెవరూ కూడా అస్త్రాలతో కట్టెయ్యలేరనీ, తానే కావాలని పట్టుబడ్డాననీ చెప్పాడు. "బ్రహ్మ చేత నీవొక్కడివే వరాలు పొందలేదు. నేనుకూడా ఇట్టి వరాలు పొందినవాడినే. రాక్షస రాజును చూడగోరి బ్రహ్మాస్త్రానికి పట్టుబడ్డాను. రాక్షసులు నన్ను తాళ్లతో కట్టినప్పుడే ఆ అస్త్ర బంధాలూడి పోయాయి" అంటాడు. రావణాసురుడిని చూడాలని పట్టుబడ్డ తను, రాచకార్యం మీద ఆయన్ను చూడదల్చుకున్నాననీ, గొప్ప పరాక్రమవంతుడైన శ్రీరామచంద్రమూర్తి బంటుననీ, రాక్షసరాజుకు కొన్ని క్షేమకరమైన మాటలు చెప్తా వినమనీ హెచ్చరికగా అంటాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-51

లంకకు వచ్చిన కారణం రావణుడికి తెలిపిన హనుమంతుడు

తాను లంకకు వచ్చిన కాకారణం చెప్తా వినమంటాడు హనుమంతుడు రావణుడితో: "సుగ్రీవుడి ఆజ్ఞానుసారం నిన్ను చూడటానికి ఈ పట్టణానికి వచ్చాను. నీ తమ్ముడు వానర రాజు, సుగ్రీవుడు నీ కుశలవార్త అడిగాడు. నీకు ఇహపరాలలో సుఖం కలిగించే ధర్మ వాక్యాలను చెప్పి పంపాడు. దానిని నీకు చెప్తా విను. చతురంగ బలాలున్న దశరథుడనే మహారాజున్నాడు. ప్రజలకాయన తండ్రిలాంటి వాడు. తేజంలో ఇంద్రుడికి సాటి. అతడి పెద్దకొడుకు, భూజనులను సంతోషపెట్టేవాడు, కీర్తిమంతుడు. పేరు శ్రీరామచంద్రుడు".

(ఈ మాటలు హనుమంతుడు స్వయంగా తానే చెప్పినా సుగ్రీవుడి మాటలవలె చెప్పాడు. కొన్ని మాటలు ఆయన చెప్పినవి కాకపోయినా దూతధర్మంగా ప్రభువు మాటలను ఆయన అభిప్రాయానికి అనుకూలంగా చెప్పాడు).

"ఆ రామచంద్రమూర్తి తండ్రి ఆజ్ఞప్రకారం భార్య సీత, తమ్ముడు లక్ష్మణుడు తోడురాగా దండకారణ్యంలోకి వెళ్లాడు. ఆయన భార్య ఒకనాడు అడవిలో కనిపించక పోయేసరికి, తమ్ముడు లక్ష్మణుడితో కలిసి వెతుక్కుంటూ ఋశ్యమూక పర్వతం వద్దకు వచ్చారు"

"సుగ్రీవుడు సీతను వెతికిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. రాముడు వాలిని చంపి, సుగ్రీవుడికి వానరరాజ్యం ఇస్తానని వాగ్దానం చేసి, ఇచ్చిన మాట ప్రకారమే యుద్ధంలో వాలిని చంపి, సుగ్రీవుడిని రాజును చేసాడు. వాలి ఎవరో, ఎట్టివాడో నీకూ తెలుసు. అలాంటివాడు ఒక్క రామబాణానికి చచ్చాడు. ఆ తర్వాత సీతను వెతికేందుకు వేలాదివేల వానరులను అన్ని దిక్కులకూ పంపాడు సుగ్రీవుడు".

(రావణుడిని జయించిన వాలిని రాముడు ఒక్క బాణంతోనే చంపాడని చెప్పడంలో ఉద్దేశ్యం స్పష్టం. వాలి అంతటి వాడినే ఒక్క బాణంతో కూల్చి పారేసిన రాముడికి రావణుడొక లెక్కా! అని హెచ్చరించడమే!)

"గరుత్మంతుడితో సమానమైన వేగంగా పోగలిగే వానరవీరులు, భుజ బలసంపన్నులు, సీతాదేవిని అన్ని ప్రదేశాల్లో వెతుకుతున్నారు. సుగ్రీవుడి దగ్గర నా లాంటి వాళ్లు అనేకమంది వున్నారు. నన్నొక్కడిని జయించడమే నీకింత కష్టమైతే, వారందరూ ఒక్కసారే వస్తే నువ్వేమి చేయగలవో ఆలోచించుకో".

"నేను వాయు పుత్రుడిని. పేరు హనుమంతుడు. సీతాదేవిని వెతుక్కుంటూ నూరామడల సముద్రాన్ని దాటి ఇక్కడకు వచ్చాను. ఆమెను నీ ఇంట్లో చూసాను. నేను చెప్తున్నదంతా సత్యం".

(దూత ధర్మం ప్రకారం, సీతను రావణుడు దొంగిలించాడని చెప్పలేదు. అయితే దొంగసొత్తు వాడింట్లో వుందని స్పష్టంగా చెప్పాడు).

"విధానాన్ననుసరించి ధర్మ శాస్త్రాలను చక్కగా అధ్యయనం చేసావు. ప్రపంచం మెచ్చేరీతిలో తపస్సు చేసావు. ఇంత గొప్పవాడివి, పరపురుషుల స్త్రీలను బాధపెట్టడం ధర్మమా? రాక్షస వంశాన్ని నీ ఈ అధర్మ కార్యం కూకటివ్రేళ్లతో నాశనం చేసే విపత్తుకు దారి తీయదా? నీవంటి బుద్ధిమంతుడు, ఇలాంటి పనులు చేయవచ్చా? నాకెవడూ కీడు కలిగించలేడని అనుకోవద్దు. రామచంద్రమూర్తి కోపంగా వదిలే బాణాలకు, లక్ష్మణుడి బాణాలకు, నీవేకాదు దేవదానవులందరు కలిసి ఎదిరించినా నిలువ లేరు. శ్రీరామచంద్రమూర్తికి కీడుచేసిన వారెవ్వరైనా, ముల్లోకాల్లో ఎక్కడైనా ప్రాణాలతో వుండడం సాధ్యమేమో నీవే ఆలోచించు. నిన్ను జయించి కారాగృహంలో బంధించిన కార్తవీర్యార్జునిడిని ఓడించి, ఇతర రాజులందరినీ ఇరవై ఒక్క సార్లు చంపిన పరశురాముడిని అర గడియలో బాణప్రయోగం లేకుండానే ఓడించాడాయన".

"ధర్మమైనదీ, భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు పనికొచ్చేదీ, సుఖలాభాలతో కూడినదైన సుగ్రీవుడి మాటలు విను. జానకీదేవిని రాముడికివ్వు. ఆమె ఎక్కడుందో చూశాం. వున్న స్థలం తెలిసిపోయింది. మిగిలిన కార్యం రామచంద్రమూర్తే చేస్తాడు. రామచంద్రమూర్తి చూసిరమ్మన్నాడే కాని తీసుకుని రమ్మనలేదు కాబట్టి ఒక్కడినే వెళ్తున్నాను. సీతాదేవిని నేను చూసాను. ఆమె స్త్రీయేకదా అని నువ్వనుకుంటే అది పొరపాటు. నిన్ను చంపడానికి నీ మెడకు చుట్టుకున్న ఆడ త్రాచుపాము. ఆమె దగ్గరకు పోతే చస్తావు. నిన్ను చంపటానికి

ఆమే చాలు. విషం కలిపిన అన్నం తినడం ఎలాంటిదో, ఆమెను స్వీకరించాలను కోవడం అలాంటిదే. కడుపులో చేరిన విషంలాగా ఆమె నీ ఇంట్లో చేరిందనుకో. నిన్ను చంపకుండా ఆమెవదలదు కాబట్టి, ఆమెను నువ్వు వదులు"

"రావణా! నీకు లెక్కకు పదితలలున్నా, మంచి, చెడు ఆలోచించేందుకు, ఒక్క తల కూడా ఉపయోగపడడంలేదు. ఎంతో కష్టపడి తపస్సు చేసావు. అది మర్చిపోయి, తపోధర్మం వల్ల కలిగే సత్ఫలితాలను పాడుచేసే పనులెన్నో చేసావు. నీ తపస్సు వ్యర్థమై పోతున్నదని మర్చావు. నీ తపఃఫలంతో దేవదానవులెవ్వరూ నిన్ను జయించకుండా వరం పొందావు. ఇంక నాకేం భయమని గర్వపడ్డావు. ఆ వరాలేవీ నిన్నిప్పుడు రక్షించలేవు. ఎందుకో చెప్తా విను".

"నువ్వు దేవతలతో, దానవులతో, రాక్షసులతో, గంధర్వులతో, నాగులతో చావకుండా వరం పొందావు. సుగ్రీవుడు అమరుడు కాదు, అసురుడూకాదు, గంధర్వుడుకూడ కాడు, దానవుడూ కానే కాదు, నాగులలో చేరినవాడూ కాదు. మరి నీవరాలు నిన్నెట్లా రక్షిస్తాయని అనుకుంటున్నావు? ఆ వరాల బలంతో నీవెట్లా బ్రతుకుతావు? కాబట్టి తపోబలం వుందన్న గర్వం వదులుకో. చీకటి, వెలుతురు ఒకేసారి రానట్లే, పాప-పుణ్యఫలాలు రెండూ ఒకేసారి అనుభవించలేం. నువ్వు పుణ్యఫలం అనుభవించుతున్నంత వరకూ, పాపఫలం దరికిరాదు. ధర్మఫలం అధర్మ ఫలాన్ని చెరిపేస్తుంది. చీకటి ఎలాగైతే వెలుతురును చెరచలేదో, అలానే అధర్మఫలం ఇంకా నీకనుభవంలోకి రాలేదు. నీ తపఃఫలం వల్ల నీ కసలే పాపఫలం రాదనుకుంటున్నావేమో! అష్ట ఐశ్వర్యాలను అనుభవించేవాడికి రోగాలు రావా? నీ తపస్సు నీకు దీర్ఘాయువు ఇవ్వాలి. కాని, నువ్వు చేసిన పరస్త్రీ అపహరణనే పాపపు పనివల్ల త్వరగా చావాలి. ఈ రెండూ ఏకకాలంలో జరుగవు కాబట్టి, నీ చావింతవరకూ ఆగింది. అదేకాకుండా, తపస్సు చేసినవాడు వ్రతఫలం కోరకుండా వుంటే ఆ ఫలం అందరినుండీ కాపాడేది. నీ వ్రతఫలంగా దేవదానవుల చేతుల్లో చావులేకుండా వరం కోరావు. నరవానరులను నిషేధించావు. నీ తపఃఫలం వారినుండి నిన్ను కాపాడదు. ఇక నీ పూర్వపుణ్యం పూర్వపాపాన్నే హరిస్తుంది. కాని ఇప్పుడు చేస్తున్న పాపకార్యాలనుండి నిన్ను రక్షించదు. నేడు చేస్తున్న భోజనం, నిన్నటి ఆకలిబాధ

తీరుస్తుందేకాని, రేపటి బాధను కాదుకదా! పశ్చాత్తాపం చెందితే, ప్రాయశ్చిత్త ముంటుంది. నీవు బలవంతంగా ఎత్తుకొచ్చిన సీతాదేవిని, ఇతర స్త్రీలను ఎవరివారికి వారిని అప్పగిస్తే నీ దోషం పోతుంది".

రావణుడికి బుద్ధి చెప్పిన హనుమంతుడు

హనుమంతుడు రావణుడితో సంభాషణ కొనసాగిస్తూ ఇంకా ఇలా అంటాడు. "తపఃఫలం సదా రక్షిస్తుందనేమాట భ్రాంతే! తపఃఫలం పుణ్యమనుభవించినకొద్దీ క్షీణిస్తుంది. శాశ్వతంగా మిగిలిపోదు. నీ తపఃఫలం ఎంతవరకు అనుభవించాలో, అంతా ఇప్పటివరకూ అనుభవిస్తూ వస్తున్నావు. అది పూర్తయింది. ఇకనుండి నీవు చేసిన పాపఫలం నేటినుండే అనుభవిస్తావు".

(చేసిన పుణ్యం వల్ల చక్రవర్తి కాగలిగినా చేసిన పాపంవల్ల పక్షవాతం వచ్చి మంచాన పడవచ్చు. పాప, పుణ్యాలలో తక్కువ భాగం మొదట అనుభవంలోకి వస్తుంది. అధిక భాగం తరువాత అనుభవించాలి. అయితే పాప, పుణ్యాలు సమంగా వుంటే, రెండూ ఒకేసారి అనుభవించాల్సి వుంటుంది. చక్రవర్తి అయికూడా పక్షవాతంతో చావు, బ్రతుకుల మధ్య మంచాన పడడంవంటి స్థితి ఇలాంటిదే!)

"దాని ఫలితం త్వరలోనే నీకర్థమవుతుంది. ఈ విషయం నాకెట్లా తెలుసనుకుంటున్నావా? జనస్థానంలో వున్న నీ తమ్ములందరూ చావడంతో మొదలయిందినీ పాపఫలం అనుభవించేరోజు. తర్వాత నీ స్నేహితుడు వాలి చచ్చాడు. అతడి విరోధి సుగ్రీవుడు రాముడికి మిత్రుడయ్యాడు. ఇవన్నీ నీకు అరిష్ట సూచనలే! ఇవన్నీ ఆలోచించి, నీకేది మంచిదని తోస్తే అదే చేయి".

"నీ అధర్మ ఫలాన్ని, నేడే, ఇక్కడే, ఇప్పుడే, నిన్ననుభవించేటట్లు, నా మాటలను యదార్థం చేయగలను. నేనొక్కడినే లంకా నగరాన్నంతా నాశనంచేయగలను. మీలో ఎవ్వరూ నన్ను బాధ పెట్టగలిగేవారు లేనే లేరు. మీ శస్త్రాస్త్రాలు నన్నేమీ చేయలేవు. ఇంద్రజిత్తు దగ్గరున్న బ్రహ్మాస్త్రం పనికూడా అయిపోయింది. అదిమళ్లీ ఉపయోగపడదు".

(బ్రహ్మాస్త్ర ప్రయోగం మీ వాడికి తెలియదని తేలిపోయింది. ప్రయోగించాక ఎలా రక్షించుకోవాలో కూడా మీ సైనికులకు అసలే తెలియదు. యుద్ధానికి పనికిరాని దద్దమ్మలు మీరు అని స్పష్టమైపోయింది. బ్రహ్మాస్త్రం మీద మరో కట్టు కడితే అది నిష్ప్రయోజనం అవుతుందన్న జ్ఞానం మీ వారికి లేనందువల్లే నాకు మార్గం సుగమమైంది అని హనుమ పరోక్ష సూచన!)

"అంతకన్నా ఎక్కువ అస్త్రాలతని దగ్గరలేవు. నాకున్న వరబలం వల్ల తక్కిన అస్త్రాలు నన్నేమీ చేయలేవు. నేనిప్పుడు తిరగబడి తంతే నాకు అడ్డమొచ్చే వాళ్లు ఎవరూలేరు. కాని, నాకాపని రామచంద్రమూర్తి అప్పగించలేదు. అందుకే సహించి వూరుకున్నాను".

(నేను రామదాసుడిని. నన్ను నువ్వేమీ చేయలేవు. నువ్వు నన్ను ఏదో చేస్తావని నేను భయపడేవాడినే అయితే, నీకు ఇంత ధైర్యంగా హెచ్చరికలు చేయనుకదా! ఉపదేశం మాట ప్రక్కనపెట్టు. అలా భయపడే పనే అయితే ప్రాధేయపడి బయటపడే ప్రయత్నం చేసేవాడినే కదా! అని ధ్వనింప చేయడం హనుమంతుడి ఉద్దేశ్యం)

"జానకీదేవికి ద్రోహం చేసినవాడిని, తానే చంపుతానని ప్రతిజ్ఞ చేసాడు శ్రీరాముడు సుగ్రీవుడి ముందర. అందుకే ఈ విషయంలో నేనేమీ చేయలేకపోతున్నా. రామచంద్రమూర్తికి అపకారం చేసి ఇంద్రుడు కూడా సుఖపడలేదు. తక్కినవారి సంగతి అటుంచితే పాపాత్ముడవైన నీ సంగతి చెప్పాల్సిన పనేలేదు. నీ వశమందున్న జానకి ఉత్తమ స్త్రీ. ఆమె లంకంతా పాడుచేసేందుకు వచ్చిన కాళరాత్రి. ప్రళయకాలంలో కాళరాత్రి ఏ విధంగా లోకాన్నంతా నాశనం చేస్తుందో, అట్లాగే, ఈమె లంకంతా నాశనం చేయబోతున్నది. నీ మెడలో తగులుకున్న యమపాశం ఈమె. నువ్వు బ్రతకాలనుకుంటే, లంకను కాపాడుకోవాలంటే, ఆమెను వదిలి పెట్టడమొక్కటే మార్గం".

("కాళరాత్రి" అంటే, ప్రళయకాలంలో సర్వ సంహారం చేసే భగవంతుడి శక్తి. ఈమే విష్ణుశక్తి, భగవంతుడి మహా మాయ. ఆయన ఆజ్ఞానుసారమే నడుస్తుంది. ఆయన సంకల్పం ప్రకారమే పనిచేస్తుంది. మహావిష్ణువు క్రీడా

శరీరామ్, బ్రహ్మాదులకు అగోచరం. ఎవరైతే విష్ణువును భజిస్తారో, వారే మహామాయను దాటగలరు. ఇతర ఉపాయాలు ఎన్నైనా దాటలేరు. ఈ విష్ణుశక్తే లోక కల్యాణం కొరకు, సత్వ గుణాన్ని అంగీకరించి, లక్ష్మి, శ్రీ, భూమి, రుక్మిణి, సీత లాంటి రూపాలు సంతరించుకొని అవతరిస్తుంది. సంహార సమయంలో తమో గుణాన్ని పూనుతుంది. అప్పుడే కాళరాత్రి లాంటి పేర్లను ధరిస్తుంది.)

"రామచంద్రమూర్తి కోపాగ్నికి, సీత పాతివ్రత్యమనే అగ్నికి, లంకంతా కాలి బూడిదవుతుందని తెలుసుకో. మంత్రులతో, హితులతో, బంధువులతో, తమ్ముళ్లతో, పుత్ర, పౌత్రాదులతో సహా ఎందుకు నాశనమౌతావు? నువ్వేమో రాక్షసుడవు. శ్రీరామచంద్రమూర్తేమో మనుష్యుడు. మధ్యవర్తినైన నేను మీ ఇద్దరి జాతుల్లో దేనికీ చెందినవాడిని కాను. నాకు లాభనష్టాలేవీ లేవిందులో. నేను కేవల రామదాసుడను. శ్రీరాముడు సీతను చూసిరమ్మంటే దూతగా వచ్చాను. అబద్ధాలు చెప్పాల్సిన పనిలేదు నాకు. నిజమే చెప్తున్నాను. నామాటలు వింటే నీకు మేలు కలుగుతుంది. నేను మధ్యవర్తిని కనుక మీ ఇరువురి బలాబలాలు తెలుసు. నీవొక్క ఇంద్రుడినే గెలిస్తే, అతడు తన శక్తితో సమస్త ప్రపంచాన్నే సంహరించగలడు. తక్షణమే యధాపూర్వంగా సృష్టించనూ గలడు. నీకూ, ఆయనకూ పోలికేలేదు. సమానుల మధ్య యుద్ధం రాణిస్తుంది కానీ, దోమకూ, ఏనుగుకూ ఎక్కడి యుద్ధం?".

(హనుమంతుడు మొదలు పెట్టినప్పుడు అనునయంగా చెప్పాడు. రావణుడి ముఖకవళికలను కనిపెట్టి, భయపడే మాటలనడం ప్రారంభించాడు. "సృష్టించేవాడు బ్రహ్మ, సంహరించేవాడు రుద్రుడు" కదా! అయితే ఇవి రామ కార్యాలుగా హనుమంతుడు చెప్పడంలో అతిశయోక్తి లేదు. తగిన కారణం వుంది. అనంతకోటి బ్రహ్మాండానికి "పరబ్రహ్మం" ఒక్కడే! అతనికి సమానుడూ, అధికుడూ, ఎవరూ లేరు. గడ్డిపోచ కదలాలన్నా ఆయనే కారణం. ఆయనే సృష్టికొక అధికారిని, సంహరించటానికొక అధికారిని నియమించాడు. "బ్రహ్మ, రుద్రులు" నిమిత్తమాత్రులు. భగవంతుడైన "విష్ణుమూర్తి", రజోగుణం విశేషంగా వుండే జీవులందు ప్రవేశించి వారితో సృష్టి కార్యాన్ని, తమోగుణం వున్నవారిలో ప్రవేశించి సంహార కార్యాన్ని, సత్వగుణం వున్నవారిలో ప్రవేశించి రక్షించే పనినీ చేస్తాడు. అందుకే సమస్త ప్రయోజకర్త వాస్తవానికి ఆ "భగవంతుడే")

"మనుష్యులు, దేవతలు, అసురులు, యక్షులు, కింపురుషులు, గంధర్వులు, పన్నగులు, విద్యాధర సమూహాలు, సిద్ధులు, ఇతర దేవజాతుల వారు, కిన్నరులు, వీరందరిలో పరాక్రమంలో మొదటివాడైన విష్ణుమూర్తితో సమానమైనవాడు శ్రీరామచంద్రమూర్తి ఒక్కడే. ఈ రాజశ్రేష్టుడిని, యుద్ధంలో, ఎవ్వరూ, ఏ కాలంలో, ఏ ప్రదేశంలోనూ, ఏ ప్రాణికూడా ఎదిరించ లేదు. అంశ పూర్ణ స్వరూపాన్ని దేంట్లోనైనా ఎదిరించగలదా? సముద్రంలోని అలలన్నీ కలిసినా, సముద్రంతో శత్రుత్వం తెచ్చుకుని బ్రతకగలవా? ఆయన త్రికాల సత్యమైన పరబ్రహ్మ స్వరూపం. పూజ్య స్వభావం కలిగి, సమస్త లోకాలకు ప్రభువైన రామచంద్రమూర్తికి నీవు ద్రోహం చేసావుకనుక నువ్వేం చేసినా ఇక బ్రతుకలేవు. నువ్వొక్కడివే కాకుండా, నీతోపాటు, నాగ, యక్ష, రాక్షస, గంధర్వ, దేవదానవులందరినీ తెచ్చుకున్నా ఆయనపై నీగెలుపు అసాధ్యం".

"ఓ రాక్షసరాజా! చిల్లర దేవుళ్ల మాట అటుంచు. నీ మీద ప్రేమతో వరాలిచ్చిన స్వయంభు, చతురాస్యుడైన బ్రహ్మదేవుడైనా, ముక్కంటి త్రిపురాంతకుడు అయిన రుద్రుడైనా, ముప్పైమూడుకోట్ల దేవతలకు అధిపతైన ఇంద్రుడు, మహేంద్రుడైనా, లేక ఈ ముగ్గురూ కలిసొచ్చినా, యుద్ధంలో రాముడి బారినుండి నిన్ను రక్షించలేరు. శరణాగతియే నీకు రక్షణ. ఆయన్నే శరణుకోరు".

ఇలా హనుమంతుడు చెప్పుకుంటూ పోతుంటే మంచి మాటలైనా అవి కఠినంగా వుండడం వల్ల, పైగా ధైర్యంగా నొక్కి చెప్పడంతో, సహించ లేక పోయాడు రావణాసురుడు. మహా కోపంగా, గుడ్లు గిరగిరా తిప్పుకుంటూ, కనుబొమలు ముడిచి, వూగిపోయాడు.

❖ ❖ ❖

సర్గ-52

దూతను చంపకూడదని రావణుడికి చెప్పిన విభీషణుడు

రావణాసురుడు హనుమంతుడిని చంపమని ఆజ్ఞాపించాడు. అది విన్న విభీషణుడు, పండితుడైనందున, రాజాజ్ఞ నీతికి విరోధమనీ, దోషమనీ చెప్పుతాడు. రావణాసురుడి మేలుకోరి, హితోక్తులతో, మెత్తటి మాటలతో, రాజుకు నచ్చ చెప్పే ప్రయత్నం చేస్తాడు. "రాజా! నన్ను క్షమించు. కోపం మాను. వీడిపైన దయచూపు. న్యాయం ఆలోచించు. నీతిశాస్త్రం ఎరిగిన రాజులు దూతను చంపడం దోషమని, ఆపని చేయరు. అందులోనూ కోతిని చంపడం, ఇంకా లోకనిందకు గురయ్యే విషయం. రాజ ధర్మానికి విరుద్ధమైన పని. దేవతలను జయించిన నీ అంతటి గొప్పవాడు ఒక కోతిని చంపిస్తే, పేరూ, ప్రతిష్ఠ వుంటాయా?" అంటూ ఇంకా ఇలా చెప్పసాగాడు విభీషణుడు:

"క్షత్రియధర్మంలో పండితుడవు. కృతజ్ఞుడవు. సామాన్యధర్మం తెలిసిన వారిలో నీకు సమానులు లేరు. ప్రజలు చేసే తప్పొప్పులు తెలిసినవాడివి. పరమార్థం తెలిసిన పండితుల్లో శ్రేష్టుడవు. నీలాంటి పండితుడు, క్షణకోపంలో పోగూడని మార్గంలో పోతే, నేర్చిన విద్యకు ఫలితం కష్టపడటమే! చదివిన చదువును కార్యరూపంలో పెట్టకపోతే ఆ చదువు నిరర్థకం. మూర్ఖుడు, పండితుడూ, ఒకేవిధంగా నడుచుకుంటే, వాళ్లకు, వీళ్లకు తేడా లేనట్లే కదా! శ్రమపడి చదవటమొక్కటే తేడా. శత్రువులను దండించడంలో నేర్పరివైన నీవు, ఔచిత్యం ఆలోచించి, దూతనెట్లా దండించాలో, ఎలా చేస్తే న్యాయమో, అట్లానే దండించు".

పాపాత్ములను దండించడం పాపం కాదనీ, పాపపు నడవడికల కోతిని అందుకే చంపమన్నానని రావణుడు విభీషణుడితో అంటాడు. పెద్దలు సమ్మతించని, కర్మం అధారంగాలేని, దోషంతో కూడిన రావణుడి మాటలకు, సమర్థుడు, నేర్పరి, బుద్ధిమంతుడైన విభీషణుడు చక్కగా జవాబు చెప్పాడీవిధంగా:

"రాక్షసరాజా! నీమాటకు ఎదురు చెప్తున్నానని కోప్పడవద్దు. నేను ధర్మం ప్రకారమే చెప్తున్నాను. కోపం మాని విను. దూతను, దూతకార్యం చేస్తున్నప్పుడు,

చంపకూడదు. ఈ నిబంధన, మర్యాద, అన్ని జాతుల్లో, అన్ని ప్రదేశాల్లో వుందని పండితులు చెప్తారు. నిన్ను జయించగల వాడెవ్వడూ లేడు. వీడేదో అన్నాడని కోప్పడాల్సిన పనిలేదు. వీడు పగవాడే, అందులో సందేహంలేదు. వీడపకారం చేసాడు కాబట్టి దండించాల్సిందే. నేనువద్దనడంలేదు. క్షమించి విడిచిపెట్టమనీ అనడం లేదు. దూతనెలా దండించాల్నో, అలా మాత్రమే, ఆవిధానం ప్రకారం మాత్రమే దండించాలంటున్నాను. ఆ పద్ధతుల్లో దేహబాధ కలిగించటానికి కొన్ని మార్గాలు చెప్పారు పెద్దలు. ఆ ప్రకారమే దండించు".

"తల గొరిగించడం, అవయవ హీనుడిగా చేయడం, కొరడాతో కొట్టించడం, కాల్చి వాతలు వేయడం వంటివి కొన్ని పద్ధతులని పెద్దలంటారు. ఇలా చేయమని చెప్పారేకాని దూతను చంపవచ్చని ఎవరూ చెప్పలేదు. ధర్మాధర్మ విచక్షణ వున్న నీలాంటివాడు, ఉచితానుచితమైన పనేదనే విషయంలో, దృఢమైన మనస్సుతో ఆలోచించకుండా, ధర్మవిరుద్ధంగా చేయదల్చుకుంటే, ఇతరులకు నీవిలానే మార్గ దర్శకుడవుతావు కదా! ధర్మబద్ధంగా వాదించడంలో కానీ, లోకవ్యవహారం నడపడంలో కానీ, సకల శాస్త్రజ్ఞానమందుకానీ, చదివిన విషయం ధారణ చేయడంలొ కానీ, దేవదానవుల్లో నీకు సరిసమానమైన వాడు లేనేలేడు. నీకు నీవే సాటి".

"అయినా ఇతడిని చంపితే నీకు ఒరిగేదేంటి? శత్రుత్వం పోతుందా? వీడిని పంపించిన వాడిని దండిస్తే లాభముంటుంది, పగ తీరుతుంది, కీర్తి పెరుగుతుంది. వ్రేళ్లు పెకిలించకుండా కొమ్మ నరికితే వచ్చిన లాభమేంటి? మంచికో, చెడుకో, కడుపు కూటి కొరకు ఇతరుల దూతగా వచ్చాడు. ఇక్కడి మాటలక్కడ, అక్కడి మాటలిక్కడ చెప్తాడు. వాడినెందుకు చంపడం? ఇక్కడితడిని చంపితే, సముద్రాన్ని దాటిరాగల బలవంతుడు మరొకడుండడు. వీడి చావు వార్త రామలక్ష్మణులకు తెలియచేసి, వాళ్లనిక్కడకు పిల్చుకొచ్చే వారెవరూ వుండరు. కాబట్టి యుద్ధమే వుండదు. యుద్ధం జరక్కపోతే, వీడిని పంపినవాడిని దండించలేవు. నీకు యుద్ధమంటే ఇష్టం. ఎప్పుడు యుద్ధమొస్తుందానని నీ భటులూ ఎదురు చూసేవారే! ఇంద్రుడిలాంటి వాడు వచ్చినా యుద్ధం మీద ఉత్సాహం చూపడమే నిజమైన మగతనం. దానిని నువ్వు తప్పించే ప్రయత్నం చేయొద్దు. కాబట్టి దూతను చంప వద్దు".

రాజకుమారుల మీద పగ సాధించదల్చుకున్న తన సేనానాయకులను, మేలుకోరే వారిని, చక్కగా ఆలోచించే వారిని, జీతాలు, బహుమతులు ఇచ్చి చేర్చుకున్న వారిని, గొప్ప వంశంలో పుట్టిన వారిని, ఆయుధాలు ధరించడంలో నేర్పరులను, యుద్ధంలో గెల్వాలన్న అభిలాష వున్నవారిని, చక్కగా యుద్ధం చేయగల వారిని, తాను పోషిస్తున్న వారిని, బలవంతులను, వారున్న చోటికే పంపి, వారి శక్తి సామర్థ్యాలను చూపించమని రావణుడితో చెప్పాడు విభీషణుడు. కోతిని దండించడం పౌరుషమూ కాదు, మర్యాదా కాదని మరీ మరీ చెప్తాడు విభీషణుడు రావణుడితో.

❖ ❖ ❖

సర్గ-53

హనుమంతుడి తోక కాల్చమని ఆదేశించిన రావణుడు

విభీషణుడు చెప్పినదంతా సత్యమేనని ఒప్పుకుంటాడు రావణుడు. దూతను చంపడం రాజనీతికి తగినపని కాదనీ, అయినా వూరికే విడిచిపెట్టకుండా, ఏదో ఒక శిక్ష వేయాలనీ భావిస్తాడు. కోతికిష్టమైన అవయవం తోకైనందున, దానిని కాల్చి పంపితే వీడికది తగిన శిక్షని తలుస్తాడు. అవయవాలు వికృతంగా మారిపోయి, కృశించిన వీడిని చూసి, వీడి బంధువులూ, స్నేహితులందరూ, నవ్వుకునే రీతిలో తోకను కాల్చి వూరంతా తిప్పమని ఆజ్ఞాపించాడు రావణాసురుడు. ఇలా ఆజ్ఞాపించిన వెంటనే, రాక్షసులు పాతగుడ్డలు తెచ్చి, చమురులో తడిపి, తోకకు చుట్టసాగారు. హనుమంతుడు తన దేహాన్ని పెంచసాగాడు. రాక్షసులు రెచ్చిపోయి, తోకకు నిప్పంటించారు. బాలభానుడిలా కోపించిన హనుమంతుడు తన తోకతో వాళ్లను కొట్టాడు. హనుమంతుడి తోక కాలుతుంటే, పిల్లలు, పెద్దలు, స్త్రీలు సంతోషించారు.

రాక్షసులు చుట్టుముట్టి, తోకకు నిప్పంటించి బాధపెడుతుంటే, హనుమంతుడు పరిపరివిధాలుగా ఆలోచించసాగాడు. "తాను ఏమి చేయాలిప్పుడు? తాను విడిపించుకోదల్చుకుంటే వీళ్లు తనకడ్డమా? త్రాళ్లు తెంచుకుని వీళ్ళందరినీ చంపాల్నా? ఇదికోపగించుకునే సమయం కాదు. ఏది మేలో అదే ఆలోచించాలి. వీళ్లనెందుకు కొట్టాలి? రావణుడి ఆజ్ఞ ప్రకారమే వీళ్లు తనను బాధిస్తున్నారే తప్ప, వాళ్ల తప్పేమీ లేదే! వాళ్లు తనకోవిధంగా మేలే చేస్తున్నారు. రాత్రివేళ మొత్తం లంకను చూడడం సాధ్యపడలేదు. వీళ్లిప్పుడు తిప్పితే చూడొచ్చు. వీళ్లు రెక్కలు విరిచి కట్టితే కట్టుకోనిద్దాం. నా దేహాన్ని కాల్చినా కాల్చవచ్చు. అటూ-ఇటూ ఈడిస్తే ఈడ్వవచ్చు. వీళ్లు చేసేపనిని వడ్డీతో సహా తీరుస్తా" అనుకుంటాడు.

ఇలా హనుమంతుడు ఆలోచిస్తున్నప్పుడే, అతడిని వాడవాడా తిప్పారు రాక్షసులు. విజృంభించి శంఖాలు పూరిస్తూ, చప్పట్లు కొడుతూ, తిట్టుకుంటూ, కొట్టుకుంటూ, వూరంతా తిప్పారు. రాక్షసులు తిప్పుతుంటే, హనుమంతుడు

కష్టపడకుండానే, సందు-సందు, గొంది-గొంది, వాడ-వాడ, వీధి-వీధి, రహస్య ప్రదేశాలు, ఇళ్ళకున్న దొడ్డి దోవలు, చిన్న-చిన్న ఇళ్లు, పెద్ద-పెద్ద మేడలు తిరిగి చూశాడు. "వీడే మనవూరికొచ్చిన గూఢచారి" అని గొంతెత్తి రాక్షసులు కేకలేస్తుంటే, పిల్లలు, పెద్దలు, ముసలివారు, గుంపులు-గుంపులుగా వచ్చి, తోక కాల్తున్న ఆంజనేయుడిని చూసి సంతోషించి గెంతులేసారు. కొందరు రాక్షస స్త్రీలు పరిగెత్తుకుంటూ సీతాదేవి దగ్గరకు వెళ్లి: "ఎవరో ఎర్రటి ముఖమున్న కోతిని, నీతో గుసగుసలాడిన కోతిని, రాక్షసులు పట్టుకుని, తోక కాల్చి వూళ్లో తిప్పుతున్నారు" అని ఆమెకు చెప్పారు. వీళ్లు సీతాదేవి కావలి కత్తెలయి వుండాలి. వారివురి సంభాషణను విన్నప్పటికీ, వాళ్ల మాటలు అర్థమై వుండకపోయుండాలి.

సీతాదేవి ప్రార్థించిన వెంటనే చల్లబడ్డ అగ్నిహోత్రుడు

హనుమంతుడి మేలుకోరుకునే పతివ్రత సీతాదేవి, ఆయన పరాక్రమం గురించి, రాక్షసులను ఆయన చంపిన సంగతి గురించి విని సంతోషించింది. ఇప్పుడు తన మరణంతో సమానమైన ఈ వార్తను విని దిగులుపడి, ఆంజనేయుడి మేలు కోరి అగ్నిహోత్రుడిని ప్రార్థిస్తుందిలా:

"నేను పతిసేవచేసే స్త్రీనైతే, నిష్టతో తపస్సు చేసిన దాననైతే, నేను నిజమైన పతివ్రతనే అయితే, ఓ అగ్నిదేవుడా! నీవు హనుమంతుడిపట్ల చల్లబడాలి. సూర్యవంశ రాజుల్లో శ్రేష్టుడైన శ్రీరామచంద్రమూర్తికి నామీద దయవుంటే, నాకింకా కొంచెం భాగ్యం మిగిలే వుండి వుంటే, హనుమంతుడికి చల్లగా అయిపో! మనసున్న రామచంద్రమూర్తితో సాంగత్యం నేనెప్పుడూ కోరేదాన్నైతే, మంచి నడవడిగల దాన్నని హనుమంతుడు నన్ను నమ్మితే, ఆయనకు శీతలుడవైపో. సుగ్రీవుడు త్వరగా ఇక్కడకు రావడం, నన్నీ శోకసముద్రం నుండి దాటించడం నిజమైతే, హనుమంతుడికి బాధలేకుండా చల్లగా అయిపో".

(ఇదొక అగ్ని పరీక్ష. సీతమ్మకే కాదు, రాముడికి కూడా! నేనే పతివ్రతనైతే, నాకు తపశ్శక్తి వుంటే, అదృష్టవంతురాలిని అయితే, తార వుత్తమరాలైతే, సుగ్రీవుడు సత్యవంతుడైతే---- ఇవన్నీ నిజమైతే, అగ్ని తన సహజ స్వభావాన్ని ఉపసంహరించుకోవాలి. అంతేకాదు, చల్లబడిపోవాలి. అందరిపట్ల, అన్ని

విషయాలలో కాదు. కేవలం హనుమంతుడిపట్ల మాత్రమే చల్లబడమంది ఆ తల్లి. అంతే, చక్కగా చల్లబడ్డాడు. ఆమె అన్న మాటలన్నీ సత్యమని నిరూపించేసాడు అగ్నిదేవుడు. రామాయణంలో ఇదొక అత్యంత ఆశ్చర్యకరమైన సన్నివేశం. మరొక రహస్యం కూడా వుందిక్కడ. శీతోభవ అని సీతమ్మ ఆజ్ఞాపిస్తే అగ్ని విధేయుడై చల్లబడ్డాడు హనుమంతుడి విషయంలో. మరి సీతమ్మ దగ్ధోభవ దశానన అని అగ్నిని ఆజ్ఞాపిస్తే రావణుడు బూడిద అయ్యేవాడు కద! అందువల్లనే ఆ తల్లి అన్నది, నాకు శ్రీరాముడి ఆజ్ఞ లేదు కనుక అలా శపించడం లేదని. రావణుడికి గుండె పగిలేంత దిగులు పట్టుకుంది దీనివల్ల. అంతేకాదు. ముందు కాలంలో సీతమ్మ అగ్నిప్రవేశం చేయవలసిన సమయంలో అగ్ని సీతమ్మను దహించజాలడన్న విషయం కూడా రుజువయింది.

హనుమంతుడి విషయంలో అగ్నిహోత్రుడు చల్లబడితే, ఆమె చెప్పినవన్నీ సత్యమేనన్న భావం పై మాటల్లో కలుగుతుంది. రామచంద్రమూర్తి బ్రహ్మాస్త్రం సంధించి, నిన్ను రూపుమాపుతానని సముద్రుడిని బెదిరించినా, తనస్వభావాన్ని విడువలేనని చెప్పగలిగాడు ఆ వేళ సముద్రుడు. కాని, హనుమంతుడికి చల్లదనం కలిగించమని సీతాదేవి మాట మాత్రంగా అడిగితే, అగ్ని చల్లబడింది. ఎంతటి మహాత్ములైన పురుషులకు కూడా సాధ్య పడనిది, పతివ్రతలైన స్త్రీలకు సాధ్య పడుతుందని దీనివలన తెలుస్తున్నది.

"అష్టాక్షరి" మంత్రంలో "ప్రణవం, నమస్సు, నారాయణపదం" వున్నాయి. "ప్రణవం" అంటే జీవాత్మ పరమాత్మకే వుపయోగ పడాలనీ, ఆయన సేవకే వినియోగపడాలనీ అర్థం. "నమస్సు" అంటే స్వాతంత్ర్య రాహిత్యాన్నీ, పారతంత్ర్యాన్నీ తెలుపుతుంది. చతుర్థీ విభక్తి యుక్తమైన "నారాయణపదం" భగవత్ ప్రియమైన భాగవత సేవను తెల్పుతుంది. భాగవత సేవ భగవత్ ప్రీతికరమ్. "ప్రణవం" లక్ష్మణుడు: జీవితాంతం అన్నకు శుశ్రూశ చేశాడు. లక్ష్మణుడిని వాల్మీకి మహర్షి లక్ష్మణుడు లక్ష్మీ వర్ధనుడు అని సంభావిస్తాడు. లక్ష్మి అంటే సిరిసంపదలని మనం భావిస్తాం. అలాంటి సిరిసంపదలను లక్ష్మణుడు ఎన్నడైనా కోరుకున్నాడా? అనుభవించాడా? వాటికోసం ఆరాటపడ్డాడా? అంటే లేనే లేదని సమాధానమొస్తుంది. కానీ లక్ష్మి అంటే

భగవంతుడికి సేవ చేసే భాగ్యం అని మన పెద్దలు తేల్చి వేసారు. కాబట్టి లక్ష్మణుడు లక్ష్మీవర్ధనుడు. అంటే అతడు భగవదవతారమైన శ్రీరాముడి సేవా నిరతుడనీ, భగవత్ కైంకర్యాన్ని అవిచ్ఛిన్నంగా సాగించే కైంకర్య లక్ష్మీవర్ధనుడని అర్థం చేసుకోవాలి. "నమస్సు" భరతుడు: కేవలం పరతంత్రుడై రాముడులేని అయోధ్యలో, వానప్రస్థుడి లాగా ఉన్నాడు. "నారాయణపదమ్" శతృఘ్నుడు: రామ పరతంత్రుడై, భాగవతుడైన భరతుడికి ప్రీతిగా ప్రవర్తించాడు. ఈ మూడింటినీ ఒక్క సీతాదేవే అనుష్టించి చూపింది. పతి సేవ చేసే స్త్రీనని అగ్నిహోత్రుడికి తెలిపి రామ కైంకర్యాన్ని స్థిరపరచింది. రావణుడిని దగ్ధం చేయననీ, హనుమంతుడి వెంట రాననీ చెప్పి తన పారతంత్ర్యాన్ని ప్రకటించింది. రామదాసుడగు హనుమంతుడికి అపాయం లేకుండా చేసి భాగవత ప్రీతిని కనపరచింది.

సీత అగ్నిహోత్రుడిని ప్రార్థించిందే కాని, తన తపోబలంతో నువ్విట్లా కమ్మని శాసించలేదు. స్త్రీలకు రక్షా కార్యం స్వధర్మం. బిడ్డలను రక్షించడానికి, భర్తకున్న స్వాతంత్ర్యం భార్యకూ వుంది.)

ఇలా ప్రార్థిస్తున్న సీతాదేవికి, హనుమంతుడికి అపాయం లేదన్న సూచనలు రాసాగాయి. కాలుతున్న తోకనుండి మండే గాలి రాకుండా, మంచులాంటి చల్లటి గాలి వీచింది ఆమెవైపు. అగ్ని తనను కాల్చకుండా చల్లబడిపోవడం చూసి హనుమంతుడు ఆశ్చర్యపోయాడు, కారణం తెలియక. అకస్మాత్తుగా అనిలుడు శీతలుడైనాడేమిటా! అని ఆయనకు ఆశ్చర్యం కలిగింది. అయితే కాసేపు ఆలోచించిన తర్వాత, కారణం తెలిసిందనుకుంటాడు. లోగడ సముద్రం దాటి వచ్చేటప్పుడు, ఎలాగైతే శ్రీరాముడి మహిమవల్ల, సముద్రం, పర్వతం, సహాయపడ్డాయో, అదేవిధంగా, ఇప్పుడుకూడా జరిగి వుంటుందని తలుస్తాడు. అప్పుడు తనదగ్గరున్న రామముద్రిక కాపాడగా, ఇప్పుడు సీతమ్మ ఇచ్చిన చూడామణి తనదగ్గరుండి కాపాడిందనుకుంటాడు. సముద్రుడు, మైనాకుడు శ్రీరాముడిపట్ల చూపిన ప్రీతిని, అగ్నిహోత్రుడు మాత్రం ఎందుకు చూపడనీ, ఇదంతా రామచంద్రమూర్తి మహిమేననీ, ఆయన పని చేస్తున్న తనకు ఆయనెందుకు అపాయం కలుగనిస్తాడనీ, భావిస్తాడు.

(సదా రామ కైంకర్యమ్ చేసే వారికి, శ్రీరామచంద్రమూర్తి అపాయం కలుగ నీయడు, సహాయమే చేస్తాడు)

పతివ్రతైన సీతాదేవి దయ వలన, శ్రీరామానుగ్రహం వల్ల, వాయుదేవుడికి అగ్నిహోత్రుడు మిత్రుడైనందువల్ల తనపైన ప్రేమతో చల్లబడ్డాడనుకుంటాడు. ఇలా కొంతసేపు ఆలోచించి, సింహనాదం చేసి, పర్వత శిఖరమంత ఎత్తున్న లంకానగర ద్వారం గోపురం మీదకు చివాలున దూకుతాడు. ఆ పని చేసేటప్పుడు, దేహాన్ని చిన్నగా చేయడంతో, కట్టిన కట్లన్నీ వాటంతట అవే వూడి జారిపడిపోయాయి. సీతారాముల కటాక్షానికి పాత్రుడైన హనుమంతుడు, అటు పక్క, ఇటు పక్క చూసి, పూర్వపు భయంకరాకారాన్నే తిరిగి దాల్చి, ద్వారం దగ్గరున్న పొడగాటి గుదిబండను తీసుకుని, కావలివాళ్లను దాంతో చంపుతాడు. తోక మండుతుంటే హనుమంతుడు ఏం చేయాలన్న ఆలోచనలో పడ్డాడు.

❖ ❖ ❖

సర్గ-54

లంక కాల్చిన హనుమంతుడు

శత్రువులకు అమితమైన దుఃఖం కలిగించడమే, ఇక తాను చేయవలసిన పని అనీ, అలా చేస్తే, రామకార్యం సులభంగా నెరవేరుతుందనీ, తలుస్తాడు హనుమంతుడు. లంకలోని పౌరులకు బాధ కలిగిస్తే, ఈ బాధ రావణుడి మూలాన్నే జరిగిందని, ప్రజలందరూ వాడిపట్ల విరోధం పెంచుకుంటారు కనుక, దాని మూలాన, వారిలో వారికి పడక, సీతాదేవిని రాముడి కప్పగించమని చెప్పేవారు కొందరుండ వచ్చని హనుమంతుడు భావిస్తాడు. రావణుడు వినకపోతే, రాముడి పక్షం వహించేవారు కొందరేర్పడుతారని కూడా అనుకుంటాడు. అందుకే ఈ రాక్షసులకు కొంచెం బాధ కలిగించాలని నిశ్చయించుకుంటాడు.

"అశోకవనాన్ని పాడు చేసాను కనుక, రావణుడికి, వాడి స్త్రీలకు ఇబ్బంది కలిగి, సీతను పంపించమని వారు రావణుడికి చెప్పుతారు. రాక్షసులను చంపాను కనుక, వారి సన్నిహితులు, రావణుడిని దూషిస్తుంటారు. సైన్యంలో కొంత భాగం నాశనం చేసాను. వీరికి స్థావరాలైన కోటలు, బురుజులు, మిగిలిన స్థలాలు కూడా పాడుచేయాలి. ఇంకొంచెం ప్రయత్నం చేసి, ఈ నగరాన్ని నాశనం చేస్తే, నేననుకున్న పనులన్నీ అయినట్లే. నేను పడ్డ శ్రమకు ఫలితం లభించినట్లే! నాకుపకారం చేస్తున్న, అగ్నిహోత్రుడికి ప్రత్యుపకారంగా ఇక్కడున్న ఇళ్లన్నీ ఇవ్వడం న్యాయం" అనుకుంటూ ఇళ్ల మీద తిరగడం ప్రారంభించాడు.

మెరుపులతో కూడిన మేఘంలా చలించక హనుమంతుడు లంకలోని, ఇల్లిల్లూ, తోట తోటా, మేడ మేడా తిరిగి, సర్వం కాల్చేసే కార్యక్రమంలో మునిగిపోయి, ఆనందించ సాగాడు. ప్రహస్తుడు, మహాపార్శ్వుడు, వజ్రనాభుడు, శుకసారణులు, ఇంద్రజిత్తు, జంబుమాలి, సుమాలి, రశ్మికేతుడు, సూర్యజిత్తు, హ్రస్వకర్ణుడు, దంష్ట్రుడు, రోమశుడు, మత్తుడు, యుద్ధోన్మత్తుడు, ధ్వజగ్రీవుడు, హస్తిముఖుడు, విద్యుజ్జిహ్వుడు, కరాళుడు, పిశాచుడు, శోణితాక్షుడు, కుంభకర్ణుడు, మకరాక్షుడు, కుంభుడు, బ్రహ్మశత్రువు, నికుంభుడు,

యజశత్రువుల ఇళ్ళకు నిప్పుపెట్టాడు. సీతాపక్షం వాడనీ, తన తరఫున ధర్మ మార్గంలో రావణుడితో వాదించాడనీ, విభీషణుడి ఇల్లు మాత్రం తగులపెట్టలేదు. మిగిలిన వారి ఇళ్ళన్నీ కాల్చాడు. ఒకసారి లక్ష్మణుడు హనుమతో అంటాడు, విభీషణుడు ధర్మాత్ముడని శూర్పణఖ రాముడితో చెప్పిందని. తాను స్వయంగా గమనించాడు రావణ సభలో విభీషణుడు ధర్మ బద్ధంగా తనకు హాని కలిగించవద్దని చెప్పిన సంధర్భం కూడా. ఆ తర్వాత వెలలేని బంగారు మణుల సొమ్ములతో అలంకరించబడిన రావణుడి ఇంటికీ చిచ్చు పెట్టాడు.

ప్రళయకాల మేఘధ్వనిలాంటి, సింహనాదధ్వని చేస్తూ, బలంగా గాలి వీస్తుంటే, విజృంభించిన హనుమంతుడు, ఇల్లిల్లూ తగులబెట్టడంలో నిమగ్నమైపోయాడు. లంకా నగరమంతా కాలిబూడిదైపోయి, నేలకూలుతున్న పెద్ద పెద్ద మేడలతో నిండిపోయింది. మునుపు రావణుడు తనను పెట్టిన బాధలకు బదులు తీర్చుకుంటానికి అగ్నిహోత్రుడే కోతి రూపంలో వచ్చాడేమోనని, అరిచే రాక్షసుల ధ్వనితో ఆకాశం నిండిపోయింది. కొన్దరు రాక్షస స్త్రీలు తమను అగ్ని జ్వాలలు చుట్టుముట్టుకోగా, తల వెంట్రుకలు విరబోసుకుని, పెద్దగా ఏడ్చుకుంటూ, చంటిపిల్లలను రొమ్ముకు హత్తుకుని, మేడలమీదనుండి కింద పడుతుంటే, చూసేవారికి, మేఘాలనుండి మెరుపులు రాలిపడ్తున్నాయా అన్నట్లుంది. అగ్ని వేడిమికి వజ్రాలు, పగడాలు, వైడూర్యాలు, వెండి, బంగారం, ముత్యాలు, లోహాలతో చేసిన ఇళ్లు, కరిగి ప్రవహిస్తుంటే చూసాడు హనుమంతుడు.

ఎన్నిళ్లు కాలినా, ఎంత తగులబడినా, భూమిమీద పీనుగులెన్ని పడ్డా, ఆయనకు తృప్తి కలగలేదు. గాలెంత గట్టిగా వీచినా శ్రమ కలుగదు. అగ్ని జ్వాలలు మోదుగు పూల కాంతితో ఒకచోట, బూరుగు పూల మాదిరిగా మరోచోట, కుంకుమ నెత్తురులా మరొక్క చోట కనిపించాయి. త్రిపురాలను కాల్చిన రుద్రుడిలా, హనుమంతుడు లంకా దహనం చేస్తుంటే, ఆ మంటలు పెరిగి త్రికూట పర్వతం వరకూ వ్యాపించాయి. అగ్ని జ్వాలలు ఆకాశాన్నంటుతుంటే, రాక్షసుల శరీరాలనే నేయిలో ఆ జ్వాలలను, పొట్టిగా, పొడవుగా, నాలుగు ప్రక్కలా వ్యాపించేటట్లు చేస్తున్నప్పుడు, గాలికూడా

సహాయపడింది. హనుమంతుడప్పుడు విజృంభించి, కోటి సూర్యకాంతితో పిడుగు పడ్డట్లు చిటపట ధ్వని చేస్తూ, ఎక్కడ చూసినా తానే కనిపించసాగాడు. మంటలు మోదుగుపూల గుత్తుల్లా, నిప్పు చల్లారిన ప్రదేశంలోని సెగలు నల్ల కలువల కాంతిలా కనిపించసాగాయి.

ఇదంతా జరుగుతుంటే, జ్ఞానులైన రాక్షసులు, అగ్నిజ్వాలలకు దగ్ధమై పోయిన చెట్లను, ఇళ్లను, వనాలను, పక్షులను, ఇతర జంతువులను, లంకా నగరాన్నీ చూసి దుఃఖపడ్తూ ఎవరీ వానరుడని ఆలోచనలో పడ్డారు. ఇతడేమన్నా ముప్పై మూడు కోట్ల దేవతలకు ప్రభువై, వజ్రాయుధాన్ని ధరించే ఇంద్రుడా? యముడా? చంద్రుడా? అగ్నిదేవుడా? కుబేరుడా? వరుణుడా? సూర్యుడా? వాయుదేవుడా? రుద్రుడా? అని భయపడ్డారు. వీళ్లల్లో ఎవరో ఒకరై వుండాలేకాని, ఇది సామాన్య కోతి అనటానికి వీల్లేదు అనుకుంటారు. అయితే వీరందరూ లోగడ రావణుడి చేతుల్లో ఓడిపోయిన వారైనందునా, పీడించబడ్డందునా, వీరెవరూ కాక పోవచ్చునని కూడా అనుకుంటారు. ఒకవేళ సృష్టి కారకుడు చతుర్ముఖ బ్రహ్మ, తనిచ్చిన వరాల బలం వల్ల గర్వంతో చేయకూడని పనులు చేస్తున్న రావణుడికి బుద్ధి చెప్పటానికీ, రాక్షసులను నాశనం చేయటానికీ, ఇలా వచ్చాడేమోనన్న అనుమానం కూడా కలిగింది. అదీ కాదనుకుంటారు కాసేపు.

బ్రహ్మ రుద్రాదులు, ఇంద్రాది దిక్పాలకులు, ఎవరూ ఇంత పని చేయలేరని తీర్మానించుకుంటారు. అవ్యక్తమై, (బాహ్యేంద్రియ గోచరం కానిది) అసమానమై, అనంతమై, ఇలా వుంటుందని వూహించలేనిదైన మహా విష్ణుతేజం వానర రూపంలో వచ్చిందని భావిస్తారు. ఈ విష్ణుతేజం శక్తి అచింత్యమై (మనస్సులో ఆలోచించి తెలుసుకునేందుకు సాధ్య పడనంత), అత్యద్భుతమైన పనులు చేయడం కొరకూ, సర్వ రాక్షస సంహారం, నాశనం చేసేందుకూ, వచ్చిందని నిశ్చయించుకుంటారు.

హనుమంతుడి మూలాన అగ్నిజ్వాలలకు కాలిపోయిన గుర్రాలు, ఏనుగులు, రథాలు, జనాలు, పక్షులగుంపులు, మృగాలు, వృక్షాలున్న లంకా నగరం, శోక సముద్రంలో మునిగి ఏడుస్తుంది దీనాతి దీనంగా. చిటపట ధ్వనులు

చేసుకుంటూ, కాలిపోయి, ఏడుపు ధ్వనులతో నిండిపోయి, హనుమంతుడి కోపాగ్నికి నాశనమై పోయిన లంకా నగరం శాపగ్రస్థురాలిగా దీనమై కనపడింది. తత్తరపాటుతో భయపడి, దుఃఖించే రాక్షస మూకలతో, మండుతున్న మంటల గుర్తులతో, లంక,ప్రళయకాలంలో బ్రహ్మ కోపానికి నశిస్తున్న ప్రపంచంలా వుందప్పుడు.

వనాన్ని పాడుచేసి, రాక్షసులను చంపి, మేడలు, మిద్దెలు నేలమట్టం చేసి, ఇంకా మండుతున్న తోకతోనే, సూర్యుడిలాగా వెలుగుతూ, హనుమంతుడు త్రికూట పర్వతాన్ని చేరుకుని, శ్రీరాముడిని చూడటానికి పోదామనుకుంటాడు. ఆయన చేసిన ఆశ్చర్యకరమైన పనికి, దేవతలు, గంధర్వులు, నాగులు, మునులు, ఆకాశ సంచారులు మిక్కిలి సంతోషపడ్డారు. గంధర్వులు, సిద్ధులు ఆశ్చర్యపడి కాలి బూడిదైన లంకను చూసారు. అగ్నిజ్వాలలతో చుట్టుకున్న ఆంజనేయుడి తోకచూసి, అగ్నిహోత్రుడే వచ్చాడని భయపడ్డాయి భూతాలు. మునులు, దేవతలు, పన్నగులు, యక్షులు, ఆంజనేయుడు చేసిన పనికి ఎంతో సంతోషించి "మేలు-మేలు" అని ఆయన్ను పొగిడారు.

❖ ❖ ❖

సర్గ-55

సీతాదేవి దగ్ధమైందేమోనని భయపడ్డ హనుమంతుడు

ఈ తతంగ మంతా జరిగాక హనుమంతుడు, మండుతున్న అగ్నిని, తోకను, సముద్రంలో ముంచి చల్లారుస్తాడు. పట్టణమంతా కాలి వుండడం గమనించి, ఎంత పాడు పని చేసాను! అని విచారించసాగాడు. లంకంతా కాల్చివేసి, ఆలోచన లేకుండా తానెంతో చేయరాని పని చేశానే అని బాధపడతాడు. ఆ దిగులుతో తన్ను తానే నిందించుకుంటాడు. మండుతున్న అగ్నిని నీళ్లల్లో ముంచి చల్లార్చినట్లే, పెరుగుతున్న కోపాన్ని బుద్ధిమంతుడిలా ఆలోచించి, అణచుకోగల వాడే ధన్యుడు, గొప్ప మనస్సున్న వాడు. కోపం అణచు కోలేని వాడు, గురువునైనా చంపుతాడు, గుణవంతులనూ తిట్టాడు. కోపి చేయని పాపంలేదు. కోపం వున్నవాడికి, ఒకడిని ఈమాట అనవచ్చునా, అనగూడదా అన్న ఆలోచనే రాదు. ఎంత గొప్పవారినైనా, ఎంత మాటైనా అనగలరు. కోపికి చేయరాని పని, చెప్ప లేని మాట లేనే లేదు.

పాము జీర్ణించిన కుబుసాన్ని (దేహంపొర), వదిలిపెట్టినట్లు, కోపాన్ని నేర్పుగా ఎవరు విడిచి పెట్టగలడో వాడే పురుషుడు. తానెంత సిగ్గులేని వాడిననీ, పాడుబుద్ధి కలవాడిననీ, పాపాత్ములలో పాపాత్ముడననీ, ఆలోచన లేక సీతాదేవిని కాల్చి స్వామి ద్రోహం చేసినవాడినైనాననీ, బాధపడ్డాడు హనుమంతుడు. లంకంతా కాలి బూడిదయితే, ఆమంటల్లో సీత కూడా తగులుకుని నశించి వుండాలి కనుక, తాను చేసిన పని తానే పాడుచేసాననీ, తెలివిలేక జానకి వున్నదన్న ఆలోచన లేక క్రూరమైన పని చేసి రామకార్యం పాడు చేసాననీ, కుమిలి పోతాడు హనుమంతుడు.

ఆంజనేయుడిలా అనుకుంటాడు తనలో: "ఈ లంకను దహించి వేయడం చాలా చిన్న పని. ఇంతచేసినా ప్రయోజనమేంటి? ఆలోచన లేక నేను బాగు చేద్దామనుకున్న పనిని నేనే పాడు చేసానే? తొందరపడి పని చేసేవాడికి బుద్ధి వుంటుందా? ఎంత కొద్ది సమయంలో, నేను పడ్డ కష్టమంతా వ్యర్థమైపోయింది! రోషంతో, చెడిన మనస్సుతో, స్వామి కార్యాన్ని సమూలంగా వరదపాలు చేసానే! రావణుడి నగరం కొంచెమైనా మిగలక సర్వం నాశనమై పోయింది. ఈ

ప్రళయంలో సీతాదేవి కూడా చావక ప్రాణమెట్లు కాపాడుకోగలుగుతుంది? ఆమె కూడా కాలిపోయుండాలి. తెలివితక్కువతో నేను చేసిన పనికి, నా ప్రాణత్యాగమే ఈ సమయంలో ఉత్తమమైన పని. అగ్నిలోపడాలా? సముద్రంలో దూకాల్నా? బడబాగ్నిపాలు కావాలా? ఎలామరణించాలి?"

"రామలక్ష్మణులు, సుగ్రీవుడు అప్పచెప్పిన పనిని పాడుచేసి, వారి దగ్గరకు పోయి, వాళ్ల ముఖాలెట్లా చూడాలి? కోపంతో నా స్వభావసిద్ధమైన కోతి బుద్ధిని పోగొట్టు కోలేకపోతినికదా! దండించే పెద్దవారు లేనందున, నా బుద్ధి చెడిపోయి, రక్షించే శక్తి వుండి కూడా, కోపాతిశయంతో, జానకీదేవిని కాపాడలేకపోతినికదా! జానకి మరణిస్తే, రామలక్ష్మణులు బ్రతకరు, వారుపోతే బంధువులతో సహా, సుగ్రీవుడు చచ్చిపోతాడు. ఇదంతా విన్న భరత శత్రుఘ్నులు చనిపోతారు. ఈ విధంగా సూర్యవంశం నశించిపోతే, ప్రజలు శోకంతో తపించి పోతారు. ఇంత అనర్థానికి, ధర్మార్థ హీనుడను, అదృష్టహీనుడను, కోపమనే పాపంతో మనస్సు చెడిపోయినవాడిని, దుర్మదుడను, పొగరుబోతును నేనే కారణం. నా వల్ల లోకనాశనం జరగడం నేనుచూడాల్సివస్తోంది. ఇందులో సందేహంలేదు" అని శోకంతో ఆలోచించసాగాడు.

ఇలా ఆలోచిస్తున్న హనుమంతుడికి, దేహంలో శుభశకునాలు కనిపించసాగాయి. కుడి కన్ను, కుడి భుజం అదరడం, హృదయం ప్రసన్నం కావడంతో, వేరేవిధంగా ఆలోచిస్తాడిలా: "సీతాదేవిని అగ్నిదహించడమా? నా తెలివి తెల్లారే ఆలోచనకదా ఇది! సీత రాక్షస స్త్రీలాంటిది కాదుకదా! అగ్నిని అగ్ని ఎలా దహిస్తుంది? ప్రపంచంలో ప్రసిద్ధి గన్న మహాత్మురాలు, సదాచార సంపన్నురాలు, పుణ్యపు నడవడిగల శ్రీరామచంద్రుడి దేవేరి, నిర్మల పాతివ్రత్యం సదా రక్షిస్తున్న జానకీదేవిని తాకే శక్తి అగ్నిహోత్రుడికి వుందా? శ్రీరామచంద్రుడి మహాత్మ్యం వల్ల, సీతాదేవి పాతివ్రత్య సంపదవల్ల, నా దేహాన్నే కాల్చే సమర్థత లేనివాడు అగ్నిహోత్రుడు. అలాంటిది లక్ష్మణ, భరత, శత్రుఘ్నులతో మహాలక్ష్మి లాగా పూజించబడుతూ, శ్రీరామచంద్రమూర్తికి ప్రేమ పాత్రురాలైన ఆయన ప్రియురాలిని కాల్చేశక్తి అగ్నిహోత్రుడికి వుందా? రామచంద్రమూర్తి దాసుడనైన నేను, ఆయన కార్యంపైన లంకాదహనం చేస్తుంటే, నా తోక కొనవెంట్రుకలనైనా కాల్చనివాడు, అలాంటి మహానుభావురాలిని తాకగలడా?"

తను లంకకు వచ్చేటప్పుడు, సముద్రం మధ్యనున్న మైనాక పర్వతం తనకు వూరట కలిగించేందుకు వచ్చిందంటే, అది రామానుగ్రహమే ననుకుంటాడు హనుమంతుడు. అలాంటి ఆయన అనుగ్రహానికి పాత్రురాలై, సత్యవాక్య సంపదవల్ల సమస్త లోకాలను జయించే శక్తికలదై, నిర్మలమైన పాతివ్రత్యమనే తపస్సు చేస్తున్నదై, భర్త ధ్యానంలోనే సంతోషాన్ని పొందగలిగే మనసున్నదైన జానకీదేవి తల్చుకుంటే, అగ్నిహోత్రుడినే దహించగలదని తలుస్తాడాయన. తనకెందుకీ పనికిమాలిన, కుచ్ఛితపు సందేహాలొచ్చాయని, సీతా మహాత్మ్యం గురించి ఆలోచించసాగాడు అదేపనిగా. సరీగ్గా అదే సమయంలో, ఆకాశంలో తిరుగుతున్న ఋషులు, చారణులు, మునులనుకుంటున్న మాటలు హనుమంతుడి చెవుల్లో అమృతం పోసినట్లు వినిపించాయి. వారిలా అనుకుంటున్నారు:

"ఆశ్చర్యం-ఆశ్చర్యం! హనుమంతుడివల్ల అగ్నిదేవుడు, తోరణాలతో, ప్రాకారాలతో, బురుజులతో సహా లంకానగరాన్నంతా దహించి వేసాడు. ఇది అసాధ్య కార్యం. తమతమ ఇళ్లు వదిలి పారిపోయిన రాక్షసబాలురు, వృద్ధులు, స్త్రీలు, గుహల్లో చేరి ఏడుస్తుంటే, లంకా నగరమే గుహల్లో చేరి ఏడుస్తున్నదేమో అనిపిస్తోంది. ఎవ్వరూ చేయలేని ఘనకార్యం హనుమ చేసాడు. మంటల్లో యావత్తూ మసి అయిపోయినా అశోకవనంలో సీత చెక్కు చెదర లేదే! ఎంత ఆశ్చర్యం? ఆమెను అగ్ని సమీపించనేలేదు" అన్న మాటలను వింటాడు హనుమంతుడు.

శుభశకునాలు కలగడంతో, సీతాదేవి మహాత్మ్యం ప్రత్యక్షంగా చూసినవాడు కావడంతో, ఋషుల మాటలవల్ల సీతాదేవి క్షేమంగా వున్నదని తెలుసుకున్న హనుమంతుడు సంతోషిస్తాడు. అయినా ఆ మహాపతివ్రతను మరొక్కసారి కళ్లారా చూసి, స్వయంగా దర్శించుకుని, క్షేమసమాచారం తెలుసుకుందామను కుంటాడు. ఆ తర్వాత ప్రయాణమైతే, చేయాల్సిన పని నిర్విఘ్నంగా, సంపూర్ణంగా నెరవేర్చినట్లవుతుందని తలుస్తాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-56

సీతాదేవిని మళ్లీ సందర్శించిన హనుమంతుడు

ఇలా తలచిన హనుమంతుడు, సీతాదేవి వుండే ప్రదేశానికి పోయి, శింశుపావృక్షం కిందున్న ఆమెకు నమస్కరించి, తను చేసిన పూర్వ పుణ్యఫలంవల్ల, క్షేమంగా వున్న సీతను మళ్లా దర్శించే భాగ్యం తనకు కలిగిందని చెప్తూ, తన ప్రభుకార్యం ఏదెట్లా చేయాలో, ఎట్లా జరగాలో అవన్నీ అలానే చేయడం జరిగిందని అంటాడు.

(సీతాదేవి మాత్రమే క్షేమంగా వుండడమే కాకుండా, ఆమెను ఆశ్రయించిన కారణం వల్ల, శింశుపావృక్షం, అశోక వృక్షాలతో సహా వాటి చుట్టు ప్రక్కలున్న చెట్లు కూడా కాలిపోక, విరిగిపోక నిల్చి వున్నై. సీతారాములనాశ్రయించిన వారే కాకుండా, వారిని ఆశ్రయించిన వారు కూడా చెడరని దీనివల్ల స్పష్టమైంది. విభీషణుడే కాకుండా, ఆయన వెంట వచ్చిన వారందర్నీ రక్షిస్తాడు శ్రీరాముడు. విష్ణు భక్తులను ఆశ్రయించిన పశు-పక్ష్యాదులు, మనుష్యులు కూడా వారి వెంట విష్ణుని పరమపదానికి పోతారు).

ఇలాచెప్పి బయల్దేరబోతున్న హనుమంతుడితో, తన భర్తపై తనకున్న ప్రేమను తెలిపే వాక్యాలను మరోసారి చెప్పింది సీతాదేవి ఆయనతో. తాననుకున్న రీతిలో, శ్రీరాముడికి చెప్పి, ఇక్కడకు తీసుకునిరాగల సమర్థుడు ఆంజనేయుడొక్కడేనని అంటుంది సీతాదేవి. చేయబోయె కార్యాన్ని తన బలాధిక్యంతో, శత్రువులను వధించే శక్తియుక్తులతో సాధించగల శక్తి కలవాడనికూడా అంటుంది. ఆయనకంటే గొప్పవారు సుగ్రీవుడి దగ్గరున్నారని తన బరువు తగ్గించుకొనే ప్రయత్నం చేయవద్దనికూడా చెప్తుంది. ఎందరున్నా ఈ కార్యభారం తనమీదే వేసుకోవాలని ఆంజనేయుడిని మరీమరీ కోరుతుంది సీతాదేవి.

అణకువతో సకారణంగా, దోషరహితంగా అర్థం స్ఫురిస్తూ, సీత చెప్పిన ఆ మాటలకు సరైన రీతిలో స్పందిస్తాడు ఆంజనేయుడు. రామచంద్రమూర్తి వానర సైన్యంతో సముద్రాన్ని దాటివచ్చి, రాక్షసుల పొగరణచి, ఆమె శోకాన్ని

నిర్మూలిస్తాడనీ, తనమాటలు నమ్మమనీ, దిగులుపడవద్దనీ సీతకు ఓదార్పు వచనాలు చెప్తాడు హనుమంతుడు. సాహసంచేసి, అపాయం కలిగే ఎటువంటి పనీ చేయవద్దని సీతకు చెప్పి, తానిప్పుడే రామచంద్రమూర్తిని చూడబోతున్నానని, ఆమె అనుజ్ఞ కోరుతూ ఆమెకు నమస్కరిస్తాడు.

సీత దగ్గర సెలవు తీసుకుని అరిష్టాద్రి ఎక్కిన హనుమంతుడు

సీత అనుమతి తీసుకుని, ఆమెకు అభివాదం చేసి, ఆశీర్వాదాన్ని పొందిన హనుమంతుడు, రాముడి దర్శనం త్వరలో చేసుకోవాలన్న కోరికతో అరిష్టమనే పేరున్న కొండనెక్కాడు. అరిష్ట పర్వతం అందచందాలు వర్ణనాతీతం. విశేషమైన తీగలతో, చెట్లతో, సింహధ్వనులను పోలిన పొడుగాటి గుహలతో, యక్షసంఘాలు, గంధర్వులు, మునులు, పాములు, తియ్యటి కందమూలాలున్న పర్వతమది. ఎత్తైన తామర రంగు చెట్లున్న నల్లటి ఉద్యానవనం ధోవతిలాగా, శిఖరాల మధ్య వ్రేలాడే మేఘాలు ఉత్తరీయంలాగా, సూర్యకిరణాలతో మెలకువ వచ్చి, రెప్పలు తెరిచి చూస్తున్న ధాతువులు నేత్రాలుగా, సెలయేళ్ల గంభీరధ్వనులు వేదాభ్యాసం చేస్తున్నరీతిలో, ఊటనీరు చప్పుళ్లు మనోహర సంగీతంలా, దేవదారు వృక్షాలు ఎత్తిన చేతుల్లాగా కనిపిస్తున్నదా పర్వతం. నలుపురంగు పుష్పాలతో, శరత్కాల మేఘాలకు ముసలిదానిలాగ వణకుతున్నదా పర్వతం. వెదురుబొంగుల్లోంచి వస్తున్న గాలి, కోకిల పంచమ ధ్వనిలాగా వుందక్కడ. పాములు బుసకొట్టే నెపంతో, హనుమంతుడిపై శ్వాస విడుస్తున్నాయా కొండమీద. ఆసాంతం మంచుతోనిండి, గంభీరమైన గుహలు ధ్యానం చేస్తున్నట్లుగా వుందక్కడ. మేఘాలు ప్రాకగల గుట్టలున్నాయక్కడ. మద్ది, తాటి, ఇనుమద్ది, వెదురుచెట్లతో నిండి వున్నదా అరిష్టాద్రి.

అరిష్టాద్రిపై నెక్కిన హనుమంతుడి కాళ్లరాపిడికి, రాళ్లు పొడిపొడవుతుంటే, "కొలువాసాలు" అనే చేపలు, పాములూ, వున్న భయంకరమైన సముద్రాన్ని దాటే ప్రయత్నం చేసాడు హనుమంతుడక్కడి నుండి. సముద్రపు ఉత్తరగట్టు చేరేందుకు, ఆ పర్వతం మీదనుండి సన్నద్ధుడవుతున్న హనుమంతుడి

కాళ్లతొక్కిడికి, అక్కడున్న అడవిజంతువులు తత్తరలాడాయి. పూలగుత్తులున్న చెట్లన్నీ నేలకూలాయి. కొండగుహల్లో వున్న సింహాలన్నీ బెదిరిపోయి దిక్కులు పిక్కటిల్లేటట్లు ధ్వని చేసాయి. వేగంగా పోతున్న అతడి తొడలతాకిడికి పూచిన పూల చెట్లన్నీ, పిడుగుపడ్డ చెట్ల మాదిరిగా కూలి విరిగిపోయాయి. ఆయన వేగానికి భయపడ్డ కొండసింహాలు, గుహల్లోకి పారిపోయి, అందులో చిక్కుకుని, తబ్బిబ్బై, దిక్కులు పగిలిపోయేటట్లు అరవసాగాయి. చీరలు జారుతుంటే, పైటలు వేలాడుతుంటే, ఆభరణాలు ఒకదానికొకటి పెనవేసుకుని రాసుకుంటుంటే, కలత చెందిన ఆ కొండలోని, విధ్యాధర స్త్రీలు అక్కడినుండి వెళ్లిపోయారు వేగాతివేగంగా.

హనుమంతుడు సముద్రాన్ని దాటేందుకు, ఆకాశానికి లంఘించి ఎగరగానే, అక్కడున్న విషం జ్వలించే సర్పాలు సందుల్లోకి దొర్లిపోయాయి. కిన్నరులు, పన్నగులు, యక్షులు, కింపురుషులు ఆ పర్వతాన్ని వదిలి ఆకాశానికి ఎగిరారు. చెట్లతో, శిఖరాలతో, ఎత్తుగా వున్న ఆ పర్వతం పాతాళానికి దిగబడింది. పది యోజనాల వెడల్పు, ముప్పై యోజనాల ఎత్తున్న ఆ పర్వతం నిమిషంలో నేల మట్టమైంది.

❖ ❖ ❖

సర్గ-57

మరల సముద్రాన్ని లంఘించిన హనుమంతుడు

ఆకాశ మార్గంలో పోతున్న హనుమంతుడు, సముద్రంలో పోతున్న నావలా వున్నాడు. సూర్యుడనే నీరుకోడిని, చంద్రుడనే తెల్లకలువను, పుష్యమి, శ్రవణ నక్షత్రాలనబడే హంసలను, మేఘాలనబడే పాచిపచ్చికను, పునర్వసు నక్షత్రమనే పెద్ద చేపను, అంగారకుడనే మొసలిని, ఐరావతమనే దీవిని, స్వాతి అనే హంసను, గాలికి కలిగే అలలనే మేఘాన్ని, సిద్ధులు, యక్షులు, సర్పాలు, గంధర్వులతో వికసించిన తామర రేకుల్లాగున్న ఆకాశమనే సముద్రాన్ని నావ దాటినట్లు దాటిపోతున్నాడు హనుమంతుడు. అమిత తేజస్సుగల హనుమంతుడి దేహంతాకిడికి మేఘాలు, తెల్లగా కొన్ని, ఎర్రగా కొన్ని, పసుపు, నలుపు కలయికగా ఇంకొన్ని, ఎరుపు-నలుపు కలయికగా మరికొన్ని కనిపించాయి. మేఘాలమధ్య దూరిన చంద్రుడు కనిపించీ-కనిపించక వున్నరీతిలోనే, హనుమంతుడు కూడా మబ్బుల్లో దోబూచులాడుకుంటూ పోతున్నాడు. తెల్లటి వస్త్రాలు ధరించిన హనుమంతుడు, మేఘాలమధ్య చుట్టుకున్నప్పుడు ఆకాశంలోని చంద్రుడిలా, మేఘాలను చీలుస్తున్నప్పుడు ఆకాశంలో వెళ్తున్న గరుత్మంతుడిలా కనిపించాడు.

సముద్రాన్ని లంఘించి కపులకు సీత జాడ చెప్పిన హనుమ

అపరిమిత శక్తిగల హనుమంతుడు, వింటినారినుండి విడువబడిన బాణంలా పోయి, మేఘంలా వున్న మహేంద్ర పర్వతాన్ని చూసి, దిక్కులు దద్దరిల్లేటట్లు ఉరుములాగా సింహనాదం చేశాడు. మొదట లంకకు బయల్దేరే ముందు వానరులతో తాను రాఘవుడి కోదండం నుండి వెడలి లక్ష్యాన్ని భేదించి, తిరిగి వచ్చి రాముడికి ప్రదక్షిణం చేసి విధేయంగా వెళ్లి రాముడి అంబులపొదిలో ముచ్చటగా చేరే రామబాణంలాగా వెళ్లి వస్తానంటాడు హనుమంతుడు. స్నేహితులను చూడడానికి తొందరపడుతున్న హనుమంతుడు, తోకజాడించి, విదిలించేసరికి, ఆ అద్భుత ధ్వనికి, సూర్యుడితో కలిసి వున్న ఆకాశం బద్దలయిందేమోననిపించింది.

హనుమంతుడి సింహనాదం, ఆయన తొడలవేగానికి వాటి సందులోనుండి దూరి వెడలిన గాలి ధ్వని, ఆవలి ఒడ్డున వుండి, దిగులుపడుతూ, ఎప్పుడు

హనుమంతుడిని చూస్తామా అని ఎదురుచూస్తున్న కోతులు విని సంతోషించారు. హనుమంతుడు పోయిన పనిని చేసుకొస్తున్నాడనీ, అందుకే, "జై–జై" నాదం చేస్తున్నాడనీ అంటాడు జాంబవంతుడు వానరులతో.

"సందేహంలేదు. హనుమంతుడు కార్యం సాధించాడు. ఆయన చేసిన ధ్వనే దాన్ని సూచిస్తున్నది. కార్యం సాధించనివాడు, ఇంత ఉత్సాహంగా సింహనాదం చేయడు" అని జాంబవంతుడు ఇతరులకు చెప్పగా, వారందరూ హనుమంతుడు వస్తున్నాడని సంతోషిస్తూ, స్నేహితుడిని చూడాలన్న ఆత్రంతో, ఆయన ధ్వనిని వింటూ గంతులేసారు. వస్తున్న హనుమంతుడిని దూరాన్నుండే చూడాలన్న కోరికతో, ఒక శిఖరాన్నుండి అంతకంటే ఎత్తైన మరో శిఖరానికీ, ఒక చెట్టునుండి అంతకంటే ఎత్తైన ఇంకో చెట్టుమీదకూ, కొమ్మనుండి కొమ్మపైకీ, కిలకిలా అరుచుకుంటూ దూకసాగారు వానరులందరూ. తాము ఫలానా చోటున్నామని ఇతరులకు తెలపటానికి, పూచిన కొమ్మలను, చేతుల్లోని గుడ్డలను వూపుతూ ఆనందించసాగారు వారంతా.

కొండగుహల్లో దాక్కుని, అమిత వేగంతో ధ్వనిస్తూ బయటకొచ్చే గాలిలా, సింహనాదం చేస్తూ హనుమంతుడొచ్చాడు. ఆ అకాశమార్గాన, మేఘంలా వస్తున్న హనుమంతుడిని చూస్తూ, ఆకాశంవైపు చేతులు జోడించి నిల్చున్నారు వానరులందరూ.

కొండంత దేహమున్న హనుమంతుడు, అతివేగంతో వస్తున్నందున, వృక్షాలతో నిండిన మహేంద్రగిరి రాళ్ల మీద దూకితే గాయపడ్తానన్న ఆలోచనతో, కొండపక్కనున్న నీళ్లల్లో రెక్కలు తెగిన పర్వతంలాగా ధభీలున పడ్డాడు. సంతోషించిన వానరయూధాలు, ఆంజనేయుడు ఏం చెప్పబోతున్నాడో విందామని, అతన్నే చూస్తూ, అతడి చుట్టూ మూగారు. ఏ గాయం లేకుండా, దేహబాధ లేకుండా వున్న హనుమంతుడిని చూసి, వ్రేళ్లు, పళ్లు కానుకలుగా ఇచ్చి ఆయన దగ్గరకు చేరారు మిత్రులందరూ. జ్ఞానవృద్ధుడు, వయోవృద్ధుడైన జాంబవంతుడికీ, యువరాజైన అంగదుడికీ, తనకంటే వయసులో పెద్దవారికీ, భక్తితో నమస్కరించాడు హనుమంతుడు.

(హనుమంతుడు పెద్దలకు, వృద్ధులకు నమస్కరించాడంటే, దానికీ సరైన కారణముంది. ఒక గ్రామంలో వున్న వాళ్లలో, తన కంటే పదేళ్ళు పెద్దవారైతే వారిని "సఖులు" అంటారు. అంతకుపైబడ్డ వారందరు "పెద్దవాళ్లు".

గీతాదివిద్యలు నేర్చినవారు, తనకంటే ఐదేళ్ళు పెద్దవారైతే "సఖుడే". అంతకన్న ఎక్కువ వయస్సుంటే, పెద్దవాడని పిలుస్తారు. వేదాలు చదివిన వాడు, మూడేళ్ళు పెద్దైతే, సఖుడు, అంతకంటే పెద్దైతే పెద్దవాడు. తన వంశంవారిలో అన్నల్లాంటివారు పెద్దైనా సఖులే. అధికులందరూ అందుకే నమస్కారానికి అర్హులు).

ఏం చెబుతాడో విందామని తహతహలాడుతున్న వానరుల మనస్సు కుదుట పడేటట్లు రెండే-రెండు మాటలు చెప్తాడు ఆరంభంలో: "చూచితి-సీత"నని. ఆ తర్వాత అంగదుడి చేయిపట్టుకుని, మహేంద్ర పర్వతం మీద, అందరూ కూర్చునే వీలున్న రమ్యమైన ప్రదేశానికి తీసుకుపోతాడు. అప్పుడందరూ వింటూ వుండగా: "దయాహీనులైన రాక్షసస్త్రీల రక్షణలో వున్న సీతను చూసాను. అశోకవనంలో, భర్తను చూడాలన్న కోరికతో, ఆ పతివ్రత మాసిపోయిన వెంట్రుకలతో, ఆహారంలేక శుష్కించింది" అనగానే అమృత సమానమైన ఆమాటలకు పోయిన ప్రాణాలు తిరిగొచ్చినట్లు సంతోషంతో, మిగిలినదంతా వినే ఓపికలేక ఎగురసాగారు కొందరు. మరి కొందరురు గెంతులేశారు. ఇంకొందరు కిలకిలా అరుచుకుంటూ, తోకలను నేలకేసికొట్టారు.

హనుమంతుడి సమీపంలో వుండి వింటున్నవారు, వెంటనే చెట్లమీదనుండి దూకి, హనుమంతుడిని కౌగలించుకుని, "తండ్రీ బ్రతికించావు" అని అరిచారు. కోతుల మధ్యనున్న అంగదుడు హనుమంతుడితో, "ఇంతపెద్ద సముద్రాన్ని దాటిపోయి, సుఖంగా తిరిగి రాగలవాడెవరున్నారు నీవు తప్ప! వేగంలో, బలంలో నీతో సమానులెవరూ లేరు. నీ ప్రభుభక్తి, శక్తి, ధైర్యం, ఆశ్చర్యకరమైంది. మా అదృష్టం కొద్దీ, నువ్వు శ్రీరాముడి భార్యను, పతివ్రతైన సీతాదేవిని చూసావు. సీతను విడిచి వున్నందున, రాముడికి కలిగిన శోకం అదృష్టం కొద్దీ పోయిందిక. నీవెట్లా పోయావో, ఏం చేసావో, ఎట్లా చూసావో, అదంతా వివరంగా చెప్పాలి. సముద్రాన్నెట్లా దాటింది, లంకలోకెట్లా ప్రవేశించింది, సీతనెట్లా చూసింది, రావణుడెట్లా కనిపించింది, అదంతా వివరంగా చెప్పు" అని అడుగుతాడు. ఆ సమయంలో అంగదుడు, హనుమంతుడు వున్న మహేంద్రగిరి పర్వతం వారిరువురివల్ల ప్రకాశించింది.

❖ ❖ ❖

సర్గ-58

లంకకు పోయి వచ్చిన విధమంతా కాపులకు చెప్పిన హనుమంతుడు

లంకకు పోయివచ్చిన వృత్తాంతమంతా, ఇంతవరకు సుందరకాండలో చెప్పబడిన విషయమంతా, దండకంగా చెప్పాడు హనుమంతుడు.

దీంట్లో "త్రిజట" వాక్యాలను నమ్మి, రాక్షస స్త్రీలు సీతాదేవిని శరణాగతి కోరినట్లు, ఆమె వారికి అభయ ప్రదానం చేసినట్లు చెప్పాడు. అయితే, తననే రక్షించుకోలేని సీతాదేవి, తనను చెరనుండి తప్పించమని హనుమంతుడిని కోరుకున్న సీతాదేవి, ఇతరులనెట్లు రక్షించగలదన్న సందేహం కలగొచ్చు.

సీతాదేవి తనను తాను కాపాడుకోలేక హనుమంతుడిని ప్రార్థించడం జరగలేదు. అలా అనుకోవడం సమంజసం కాదు. లంకంతా సీతాదేవి తప ప్రభావం వల్ల దగ్ధమైపోయిందనీ, రామచంద్రమూర్తి నిమిత్త మాత్రుడేననీ, హనుమంతుడు చెప్పాడు. తనను తాను రక్షించుకున్నా, హనుమంతుడు రక్షించినా, రామచంద్రమూర్తికి అపకీర్తి వస్తుందని ఆప్రయత్నం మానుకుంది సీతాదేవి.

సీతాదేవి అభయప్రదానం చేస్తూ, తాను రక్షించ గలిగినా, ఆ అధికారం తనకున్నదని స్వతంత్రించి చెప్పకూడదు కదా! అంటే సీతాదేవిలో "ఉపాయం" వుందేకాని, "ఉపేయం" లేదన్న మరో సందేహం రావడం కూడా సబబు కాదు. లక్ష్మీనారాయణులు, సీతారాములు, వేరు వేరు దంపతులు కానేకారు. లక్ష్మీదేవి, భగవంతుడి కరుణా శక్తే!

వేదాంత దేశికులనే మహానుభావులు భగవంతుడిలో ఉన్న దయ అనే విశిష్ట గుణాన్ని దయాదేవి గా, శ్రీదేవి గా, చైతన్యస్తన్యదాయినీగా, శ్రీనివాసుడి ప్రేయసిగా, కరుణారూపిణిగా అభివర్ణించారు. లక్ష్మి రక్షించినా, నారాయణుడు రక్షించినా, సీత రక్షించినా, రాముడు రక్షించినా ఒకటే! రాముడు లేని కరుణ రక్షించలేదు. కరుణ లేని రాముడూ రక్షించలేడు. కృప రక్షించింది అంటే రాముడు రక్షించినట్లే! సీత, లక్ష్మి, కరుణ, కృప, దయ: ఇవన్నీ పర్యాయ

పదాలే! అందుకే భక్తులు, లక్ష్మీ విశిష్ట నారాయణుడినీ, సీతా విశిష్ట రాముడినీ ఉపాసించాలని శాస్త్రాలు చెప్పుతున్నాయి. ఒకరి పేరు చెప్పితే రెండవ వారున్నట్లే! సీతతో పనిలేదు, రాముడు చాలుననీ, లేక, రాముడితో పనిలేదు,సీత చాలుననీ అనరాదు. ఎండలేని సూర్యుడు, వెన్నెల లేని చంద్రుడు, అలల్లేని సముద్రాన్ని అనుభవించలేం.

"అహం" భగవంతుడైతే, "అహంత" లక్ష్మీదేవౌతుంది. సీతాదేవి అనుగ్రహించిన వారిని రాముడూ అనుగ్రహించినందు వల్ల ఆమెలో "ఉపాయత్వం" వున్నదనీ, రాక్షస స్త్రీలను ఆమె కాపాడినందు వల్ల ఆమెలో "ఉపేయత్వం" (స్వతంత్ర రక్షణ శక్తి) వుందనీ తెల్సుకోవాలి. అందువల్లనే మిధున కైంకర్యం శ్రేష్టమన్నారు. సీతారాములలో, లక్ష్మీనారాయణులలో ఏ ఒక్కరినో ఆశ్రయించ కూడదు. శూర్పనఖ రాముడినే కోరింది, సీతమ్మను కాదన్నది. ఫలితం ముక్కూ-చెవులూ తెగినాయి. రావణుడు సీతమ్మను కోరాడు, రాముడిని విడిచాడు. పది తలలు తెగి కింద పడిపోయాయి. హనుమంతుడు సీతారాములను కోరుకున్నాడు. సీతారామానుగ్రహ లబ్ది పొందాడు. చిరంజీవి అయినాడు. కనుక మిధున (దంపత్సమేతంగా) కైంకర్యాన్నే కోరుకోవాలంటారు మన పెద్దలు.

లంకకు పోయివచ్చిన విధం కపులకు చెప్పిన హనుమ

సీతాన్వేషణకు లంకకు వెళ్లి వచ్చిన హనుమంతుడు, ఆ వృత్తాంతమంతా, తోటి వానరులకు వివరించిన దానిని, ఒక సుదీర్ఘ "దండకం" రూపంలో రాశారు వాసు దాస కవి. ఇంతవరకు జరిగిన సుందరకాండ వృత్తాంతం అంతా ఇందులో వుంది. ఆ దండకం ఇలా సాగుతుంది.

దండకం: ఆద్యంత వృత్తాంత మాలింపఁ గా నింపు పెంపార నా జాంబవంతుండు వాతాత్మజుం జూచి యో యంజనానందనా! ముందుగాఁ బొందుగాఁ దెల్పుమే రీతి నా నాతిని న్నీవు గన్గొంటి? వాల్గంటి దా నొంటి నెట్లున్న? దా యన్నుమిన్నన్ దశాస్యుండు క్రూరుండు దా నే విధం జూచెడిన్? మీది కార్యంబు ఠేనంచునన్ సంచుగా జెప్ప నౌ చెప్పఁ గా రాని యవ్వాని

భాశింపు మన్నన్, హనూమంతుఁ డత్యంత సంతుష్టుడై హృష్టుడై జానకిన్ లోన ధ్యానించి మూర్ధంబుచే మ్రొక్కి యిక్కె వడింబల్కె; వారాశియా ప్రక్కతీరంబుఁ జేరంగ లో నెంచి నే నీ నగాగ్రంబునందుండి కుప్పించి దాఁ టంగ మీరెల్లఁ గన్నారఁ గన్నార కాదే? యటేనేగ నంబోధిమధ్యంబునన్ హేమశృంగాంచితంబైన శైలంబు నాత్రోవకడ్డంబు రా వచ్చె రా విఘ్న మం చెంచి రోషించి భేదించి పోవంగ లోనెంచి దానిన్ ఢికీలంచు నే దాఁ కితిన్, దోఁ కతో దాచితిన్, దాచినన్ దాని శృంగంబు వేభంగులన్ భంగ మై రాలెఁ , దచ్ఛైలమో మామకీ నాశయం బెంచి హర్షంబుగా నాయనా! నీకు జిన్నప్ప నే, గాడ్పుమిత్రుండ, మైనాకుఁ డన్, వార్ధిలో నుండుదున్, మున్ను పక్షంబు లుండన్ ధరాధ్రంబు లెల్లన్ యథేచ్ఛంబుగాఁ గ్రుమ్మరన్ లోకభీదానదక్షంబు లౌ వాని వీక్షించి పక్షంబులం ద్రుంచె వజ్రహతిన్ శక్రు, డగ్గోడు తప్పింప నీ తండ్రి నన్దెచ్చి యీ యంబుధిం ద్రోచెఁ జూ, ధర్మభృద్వర్యుఁ డున్ శక్రవీర్యుండు నౌ రాము కార్యంబున న్నాదు సాహాయ్యముం గొమ్ము నా, సమ్మతిన్ నాదు కర్జంబు చందంబు బోధించి కార్యైకసక్తాత్మతన్ శైలరాజాజ్ఞ నేఁ బోయితిన్, గ్రావమున్ మానుషాకారమున్ మాని శైలాకృతింబూని వారాశిమధ్యంబునన్ నిల్చె, నే నెచ్చు వేగంబునన్ బోవ బోవంగ నాగాంబ వేగంబ నాకడ్డమైనిల్చి యోక్రోతిఁతేఁ డా! మదాహారముం గమ్ము, వేగమ్మ రారమ్ము, దేవాళి యేర్పాటురా సుమ్ము నా; నమ్మహాదేవికిన్ మ్రొక్కి దిక్కేమియుం దోఁ ప కిట్లంటి నో దేవి! భూదేవి జామాత శ్రీరాముఁ డారణ్య దేశంబునన్ జానకీ లక్షణాన్వీతుడై! క్రుమ్మరం బంక్తికంఠుండు శుంఠుండు తద్దేవినిన్ మ్రుచ్చిలించెన్, దదన్వేశణార్థంబు రామాజ్ఞచే బోవుచున్నాఁ డ, దద్దేవిదేశంబునం దుంట శ్రీరాము కార్యంబునందోడు కారాదె? కాదేని వైదేహినిన్ రామునిం జూచి వే వచ్చి నే నిచ్చి నీ మెచ్చుగా జొచ్చువాఁ డన్ భవద్వక్త్రమం దన్న న య్యన్ను హో! యేటిమాటల్ బళా దాఁ టి పోనీయ, నాకీ వరం బిచ్చి రా దేవతావల్లభుల్, పొల్లుగాదన్న, మే న్పెంచితిన్ యోజనంబుల్ పది న్నిద్దు లం దర్ధవిస్తారముం గల్గనాదేవి నాయంత వాక్రంత దావిచ్చె నే నంత హ్రస్వుండనై యొక్క యంగుష్ఠ మాత్రంబు గాత్రంబుగా జివ్వనన్ దాని వక్త్రంబునం జొచ్చి వెల్వడ్డ నన్ జూచి నైజాకృతిం దాల్చి యా యంబ, యోవానరంబా! సుఖంబార బోపొమ్ము,

నీకార్యముల్ చక్కనౌc , గూర్పుమీ సీత శ్రీరాముతో, మెచ్చితిన్ నీయెడన్, భద్రమౌ నన్న నన్నంతటన్ భూతముల్ ప్రీతముల్ మేలు మేలంచు శ్లాఘించె, దర్వాత నిర్భీతి బక్షీశురీతిన్ మొగుల్ త్రోవ నేc బోవ, నాచాయనేదో గ్రహింపంగ నేచాయ గన్గొన్న నాకేమియుం దోc ప దాత్మీయ వేగంబు సంకుంఠితం బైన నే నాత్మలో నే మహా! నా మహావేగమాచిక్కె, నే ప్రక్క నేయొక్కరిం గాన, గార్యంబు వార్యంబుగా నోపునో? యంచు దుఃఖాకులాత్ముండ నై క్రింద చూడంగ, మున్నీట ఘోరాకృతిం బండి రాకాసి యొక్కర్తు నన్ చూచి గర్జించి తర్జించి పెన్నవ్వుతోc గ్రొవ్వుతోc గీడుగా నాడె, నో పెద్ద దేహంబువాడా! బలే యెందురా యేగవే వేగ? నే నెన్నియో నాళ్ళుగాc గూడు లేకుంట నాc కంట నే జిక్కి స్రుక్కంగ నిందుండ నా దండిభాగ్యాన నాకంటికిం దోc చి తిప్పట్ల, నాకడ్పులోc గుడ్పుగా జొచ్చి యానంద మొందింపరా యన్నc గా నిమ్మటం చేను నామేను వేదాని వాకంటె బల్ పెద్దగాc బెంప, నా టక్కు నూహింపc గా లేక నన్మింగ నోర్విచ్చె, నేనో నిమేశంబునన్ గుజ్జువేశంబునన్ దాని పెన్బొట్టలో దిట్టనై యట్టెవేచొచ్చి ప్రేవుల్ వెసం గొంచుc జివ్వాలునం బైకి లంఘించితిన్, హస్తముల్ వ్రేల రాకాసి వారాశిలోc గూలె, మింటన్ నభశ్చారు లౌ చారణుల్ సింహికా రాక్షసిం ద్రుంచె సామీరి యం చాడగా వింటి, నే నత్యయం బెంచుచున్ వింటిమార్గంబునం బోయి శాఖిప్రతానావృతంబౌచు లంకాపురం బుండు నాయొడ్డు గన్గొంటి, నా పిమ్మటన్ సూర్యుc డస్తాద్రిc జేరంగ ఘోరాసురస్తోమముల్ గాన కుండంగ లంకాపురిం జొచ్చితిం, జొచ్చుచుండంగ నొక్కర్తు కల్పాంత ధా రా ధ రా కా రఘోరాట్టహాసానవోపేత జాజ్వల్యమానాగ్ని కేశాలితో నన్నుc జంపన్ సమీపింప డా కేల నేc బెద్ద పెట్టొక్కటిం బెట్టితిన్, దానితో ఙోలుచుం గూలి, నన్ చూచి యో వీర! లంకాపురిన్ నేను, నన్గెల్చి తీవింక గెల్వంగ నేర్తీసురారాతి సంఘంబుc బొమ్మంచు నచ్చేడె నన్నాడె, నేనా ప్రదోశంబునన్ లంకలో జొచ్చి రేయెల్ల సీతాసతిన్ రోసితిన్, దైత్యునంతః పురాంతస్థలిం గానరాదయ్యె, నేనయ్యెడన్ శోకసంతాప మేపారc బ్రాకారముం దాc టి, యుద్యానముం గాంచి, యందే యశోకావనీజాతమొం డెక్కి బంగారసంటుల్ విరాజిల్లు తోc టొక్కటిన్ శింశు పాభూరుహోపాంతదేశంబునన్ శ్యామనీ రేజిపత్రాంబకన్ నిట్టుపాసంబులం

జిక్కి యేకాంశుకాన్వితయై, ధూళిసంలగ్న కేశాంతయై, శోకసంతాపదీనాంగియై, నాథు ధ్యానించుచున్ బెబ్బులుల్ చుట్టఁ గా లేడిచందాన దుఃఖించుచున్ భూమిపై వ్రాలి పెన్మంచునం దమ్మివోలెన్ వివర్ణాకృతిం దాల్చి దైత్యేశభీతిన్ మృతిం జెందఁ గా గోరు సీతాసతిం గాంచు చా చెట్టుపై నుంటి, నే నింతలోఁ బంక్తి కంఠాలయంబందు ఝూళం ఝుళీరావముల్ వింటి, నద్దాన నే నివ్వెఱన్ గొంటి, సంక్షిప్త గాత్రుండనై పక్షివోలెం గుజంబందు నే నుంటి, దైత్యేశు డిల్లాంద్రతో వచ్చె నచ్చోటికిన్, జానకీదేవి యారాక్షసాధీశునింజూచి మోఁ కాళులన్ ఱొమ్ముమంజేర్చి హస్తంబులం జుట్టి విత్రస్తయై దిక్కు లేకందు నల్దిక్కు లీక్షించుచున్ వేపమానాంగియై యుండ వాఁ డంగనం జేరి ధాత్రీస్థలిన్ వ్రాలి నన్నేలవే గోల! యో బేల! రెన్నెల్లలో నన్నుఁ గైకోక గర్వించి తేనిన్ భవచ్ఛోణితం బేను ద్రావంగ నుంకితుఁ జుమ్మన్న నన్నీచు వాక్యంబు లాలించి రోశంబునన్ సీత భాషించె నో నీచుడా! దుర్మతీ! నన్నెవ్వతెంగాఁ గనుంగొంటిరా! నీవు; శ్రీరాము నిల్లాల, నిక్ష్వాకువంశేశ్వరుండైన యయ్యాజికిం గోడలన్, నన్నురా నీవు నీచోక్తులాడంగ! నీనాల్క తుత్తున్కలై కూలదా? క్రూరుఁ డా! శూరుడా నీవు? చోరుండవై నాదు నాథుండు లేనప్డు నన్దెచ్చి ముచ్చట్లు వాక్రువ్వగా వచ్చితా? రామచంద్రుండు సంగ్రామశూరుండు సత్తోక్త్యుదారుండు యజ్ఞప్రచారుండు నీ వా మహాభావు దాసుండగా నైన నర్హుండవా? కావు కావన్న నన్నాతివాక్యంబు లాలించి కోపించి యంతం, జితాస్థాగ్ని చందంబున న్మండి పెన్గుడ్డులం ద్రిప్పి నద్దేవినిం గ్రుద్ధి చంపంగఁ గేలెత్తనయ్యో యయో యయ్యయో యంచు దైత్యాంగనల్ గూయ స్త్రీ మధ్యమందున్న మండోదరీ నామ్ని దానడ్డమై శూరుఁ డా! యేమి ఈ సేఁ త? యీసీత నీకేల నేనుండగా? లేరె యీయక్ష దేవాంగనల్? చాలరే వీరు? లీలావిలాసంబులం దేలఁ గా రాదె, రమ్మంచువారెల్లఁ గోపంబు చల్లార్చి యా రాక్షసుం దోడు కొంచేగి ర ట్లేగ సీతాసతిం గాచు ఘోరాస్యలౌ రాక్షసస్త్రీలు తద్దేవినిం జూచి గర్జించి భర్జించి, తర్జించి కర్ణంబుగా నెన్నియో దారుణాలాపముల్ పల్కఁ గా వాని నా చానయున్ గడ్డిపోఁ చంబలెం జూచె, నా యింతి స్థైర్యంబు నారక్కెసల్ గ్రక్కునం బోయి దేవారికిం జెప్పి యా యంగనన్ లొంగఁ గాఁ జేయ దుస్సాధమం చెంచి యందంద నిద్రించిరా మైథిలీ దేవియున్ రామ! రామా! యటం చేడ్చుచుండం

త్రిజాటాఖ్య దా నిద్దురన్ లేచి రక్షస్సతీసంఘముం గాంచి మీరేటికే జానకిం జూచి బక్షింతుమా తిందుమా యంచుఁ దర్జింపగా? మ్రింగుడీ నన్ను మీరే, ధరాపుత్రి నాశంబు గా దెన్నఁ , డా యాజికిం గోడ లై రాము నిల్లాలు నౌ సాధ్వి మీచేతికా చిక్కెడిన్? దారుణమ్మైన స్వప్నంబునం దీ దశగ్రీవునాశంబు శ్రీరాము గెల్పుం గనుంగొంటి, మీ తర్జనల్ చాలు, మిమ్మెల్ల నీదేవి శ్రీరాముతోఁ చెప్పి రక్షింపఁ జాలున్, నమస్కారమాత్ర ప్రసన్నన్ గృపావాల, వే వేఁ డుకోరే, మదీయాశయం బిద్ది, నిక్కంబు దుఃఖంబులం బాపు నీదేవి, యో తల్లిరో! నీవ మాదిక్కు మా మ్రొక్కుఁ గైకొంచు రక్షింపుమన్నన్ దయాలోల సీతామహాదేవి తా నెవ్వరిం గాచు, నన్నంత నా యింతియుం గాంతు జేతృత్వ మాలించి లోసిగ్గునం బల్కె, మీ మాట సత్యంబ యే నట్ల రక్షింతు నం చీ గతిం బల్క, నా కల్కి యాపద్దశం జూడ లేనైతి నాధైర్యమోవమ్ముగాఁ బోయె. నేనంత నాకాంతతో భాశణోపాయముం జక్క భావించి యిక్ష్వాకు వంశస్తవం బారఁ గా జేయ నామాట లాలించి యాదేవి కన్నీటితో వానరశ్రేశ్థ యెవ్వండవయ్యా! నినుం బంపె నెవ్వం డ దేలా య దేలాగునన్ వచ్చితీ విందు? నే విందుగా విందు, శ్రీరాముతోఁ జెల్మి నీ కెట్లు చేకూరె? భాషింపవే యన్న నా యన్నుతో విన్నపం బిట్లు నేఁ జేసితిన్, దేవి! నీ నాథు మిత్రుండు మిత్రాత్మజుండుండు సుగ్రీవనాముండు, నే నా మహాశూరుబంటన్ హనూమంతుఁ డన్పేరివాడన్, నినుం గాన నా ఱేఁ డు శ్రీరాముఁ డంపెజుమీ, నీ కభిజ్ఞానమాత్మాంగుళీయంబు దా నిచ్చెఁ గైకొమ్ము, నా కిమ్ము నీవానతిన్, రామ సౌమిత్రులన్ డాయ ని న్గొంచు నేఁ బోయెదన్ వచ్చెదే? యన్న నాగోలలన్ మిన్న యోయన్న శ్రీరాముడే రావణుం జంపి నన్గొంచుబో వత్తు నన్నన్ సతీ! నాకు జిత్తప్రమోదావహంబైన గుర్తేమియే నిచ్చెదే? యన్నఁ గానిమ్మటం చింద మీ దివ్యచూడామణిం గొమ్ము, నా ప్రాణనాధుండు నిద్దాని వీక్షించినంతన్ నిజం బెచ్చుగా నిన్ను మన్నించు నం చిచ్చి తా వెండియుం గొన్ని సందేశవాక్యంబులం జెప్పె, నే నా సతీరత్నమున్ మ్రొక్కి నే నిందురాఁ జూచుచుండంగఁ , దా వెండియున్ నన్ను వీక్షించి యో యంజనానందనా! యెట్లు వ్రాకుచ్చినన్ రామసౌమిత్రి సుగ్రీవు లిచ్చోటికిన్ వేగ రాఁ జూతురో యట్లు భాశింపు, మిం కేను మాస ద్వయంబే చుమీమేనఁ బ్రాణంబులం దాల్తు నీలోన శ్రీరామచంద్రుండు న

న్జూడ రాఁ డాయెనా నాయనా! నే నా యనాథాకృతిం జత్తు, మిాయిష్ట మం చన్న నాకన్నె దీనోక్తు లాలింపఁ గాఁ గింక యంకూర మెత్తెం జుఁ డీ, యంత గొండంత దేహంబుతో యుద్ధకాంక్షన్ వనంబెల్లఁ జీకాకుగాఁ బీకి నిర్మూలముం జేయ యారద్దునన్ నిద్దురన్ లేచి యద్ధైత్యకాంతల్ మదిన్ భీతి గొల్పంగ నల్దిక్కులం బాటి యిం దారినిం జేరి యోవైరివిద్రావణా రావణా! క్రోతి యొక్కండు యుష్మన్మహాశూరతాజ్ఞాని దుష్టాత్ముఁ డై తోఁ టయెల్లన్ సపాటంబుగా నేలతో పాటు గావించె, నా క్రించు రప్పించి ఖండింపుమిా, యన్న నా రాక్షసుం డుగ్రులంగింక రాఖ్యాతశూలాయుధాశీతిసాహస్ర సఖ్యాకులం బంచె, నే లౌడిచేఁ ద్రుంచితిన్ వారలం జావగా, దక్కియున్నట్టి దైత్యుల్ వెసంబారిదేవారితోఁ జెప్పి, రే నింతలో నూర కేలుండగా నంచుఁ దోఁ పంగ నాచైత్య ప్రాసాదమున్ ధ్వస్తముం జేసి యచ్ఛోటిరక్షస్తతిన్ స్తంభఘాతంబులం గూల్చితిన్ నూర్వురన్, వచ్చెఁ దా నంతలోనం బ్రహస్తాత్మసంభూతుఁ డౌ జంబుమాల్యాఖ్య విఖ్యాత శూరుండు ఘోరాసురవ్యూహసం యుక్తుఁ డై, వాని సేనాసమేతంబుగా లౌణిచేఁ జంపితిం, బిమ్మటం బంచె నాపై మహామాత్ర పుత్రాష్టకం బేను నద్దాననే వారిఁ గాలాలయావాసులం జేసితిం, బంచసంఖ్యాకసేనాను లుద్దండత న్వెండి పై రా విదారించితిన్ సేనతో, వెన్క నప్పంక్తి కంఠాత్మజుం డక్షుఁ డన్వాఁ డు సైన్యంబుతో వచ్చె, నే నా కుమారున్ మహావీరు మందోదరీసూనునిన్ మింటికిన్వాఁ డు లంఘించుచోఁ గాళ్ళు లీలన్ బిగంబట్టి గి ర్గిఱ్ఱునన్ నూఱు మాఱుల్ వడిం ద్రిప్పి పెన్మొద్దగా జేసి ధాత్రీస్థలి న్మోఁ దితిన్, వానిపా టా దశాస్యుండు నాలించి వేరొడు పుత్రున్ మహాగాత్రునినిన్, శక్రజిం బంపె; నవ్వాని నవ్వాహినిం గూడఁ దేజం బఱంజేసి మోదించితిన్, వాడు నన్గెల్చున న్నమ్మకం బూనిరక్షోవిభుం డంపె, నన్నెట్టులుం గెల్వరాదంచు నూహించి వాఁ డంత బ్రహ్మాస్త్రపాశంబులన్ నన్ను బంధించె, రక్షోవరుల్ త్రాళ్లతో నన్ను బంధించి కొంపోయి దైత్యేశు మ్రోలన్ నిలంబెట్ట వాఁ డుగ్రుఁ డై యేలరా వచ్చితీలంక! కీ వేలరా చంపితా సోఁ కులం? జెప్పరా యన్న సీతార్థ మై సర్వముం జేసితిన్, నిన్నుఁ జూడంగ నీయింటికిన్ వచ్చితిన్ రాక్షసేంద్రా! హనూమంతు డన్వాఁ డ, నేఁ బావమానిన్ రఘూత్తంసుఁ డౌ రామదూతుండ, సుగ్రీవు మంత్రిన్,

ననుంబంప రాముండు నీయొద్దకు న్వచ్చితిన్ దూతనై, సూర్యపుత్రుండు నీ సేమముం ప్రశ్న గావించె, ధర్మార్థకామానుషక్తంబు పథ్యంబు వాక్యంబు నీకున్ వచించెంజుమీ, ఋశ్యమూకంబునన్ రాముతో మైత్రిఁ గావించి యున్నాఁడు, తద్వీరు వాక్యంబు లాలింపుమా, రామదేవుండు దేవారి నా నారినిన్ ద్రుచ్చిలించెన్ వనీభూమి, నీవిందు సాహాయ్యముం జేయుమా, యంచు నన్వేఁ డ నే నట్టులే చేయుదుంగాని యవ్వాలినిం జంపఁ గా బాసఁ గావింపుమీ యంటి, సూర్యాన్వయుండట్లు గావించి యవ్వాలినిన్ బాణమొక్కంటనే చంపి కీశాధిపత్యంబు నా కిచ్చె, నే హవ్యభుక్సాక్షికంబైన స్నేహంబు గావించితిన్, రామసాహాయ్య మే నెట్టులుం జేయుదున్, జానకీదేవి శ్రీరామభూనేత కిమ్మోయకున్నంత వీరుల్ వనాటుల్ భవచ్చౌర్య నిర్మూలనం బెట్లుఁ గావింతు, రెవ్వారు! మావారి శౌర్యంబు లోకంబునం గానరో? పోవరో మున్ను దేవాళికిం దోడుగా? నంచు నీతో వచింపన్ ననుం బంచె నన్నన్ రుషాశోణితం బైన నేత్రంబులం జూఁ డున ట్లుగ్రతం జూచి నా విక్రమం బా దురాత్ముం డవిజ్ఞాతుడై యంత నన్ జంప నాజ్ఞప్తి గావింపగా వానితమ్ముండు ధీశాలి రక్షోవరు న్నానిమిత్తంబుగా వేఁ డె నో సోఁ కు ఈఁ డా! కనన్ రాజశాస్త్రవ్యపేతంబు నీ యాజ్ఞ శాస్త్రంబునం దూత వధ్యుండుగాఁ , డిచ్చమైఁ దథ్యముం బథ్యముం బల్కు వాఁ డెట్టి నేరంబు గావించినన్ రూపుమార్పన్ వికారంబుగాఁ జెల్లుగా, కెప్పుడుం జంపగా రా దనం, దోఁ కఁ గాల్పంగఁ బంచెన్ దశాస్యుండు, రక్షోవరుల్ వాల్క వారంబులన్ జీర్ణ కార్పాసవస్త్రంబులం దోఁ కకుం జుట్టి నన్ గట్టెలం గొట్టుచున్, గింకచే దిట్టుచున్, బైపయిన్ ఊప్పుచుం, వీథులం ద్రిప్పుచున్, బోవ సంక్షిప్తగాత్రుండనైతట్టులండుల్చి నే వెండియున్ ఘోరరూపంబుఁ గైకొంచుఁ బెన్ లౌడిచే వారలం జంప ద్వారంబునన్ జేరి లంకాపురిం గొంప లన్నింటికిం జిచ్చు సంధించి యామంటలో సీతయుం ద్రుంగెనో? పోయెఁ గా పట్టనం బంతయుం బాడుగాఁ, దన్విమాత్రంబు దా నెట్లు జీవించెడిన్? రామకార్యంబు నిర్మూలముం జేసితిన్ బుద్ధిహీనుండనై యంచు శోకించుచున్ సీత భద్రంబ యం చంబ్రమార్గంబునం జారణుల్ పల్కునాలించి భావించి సర్వంబునుం గాల్చు నా యాశ్రయాశుండు నాతోఁ క గాల్పండ, నా చిత్తమా సంప్రహృష్టంబు, సౌరభ్య సంభారుఁ డై గంధవాహుండు

నున్ వీచె, సీతామహాదేవి నావీతిహోత్రుండు దాఁ గాల్పఁ గానోపు? నంచాత్మ మోదించి యా యించుబోణిన్ మఱిం గాంచి నే నామెకుం జెప్పి తత్రస్థమౌ నా యరిష్టంబుపై నెక్కి మిమ్మెల్ల దర్శించు పెన్మక్కువన్ గ్రక్కునన్ వారిధిం దాఁ టి చంద్రార్కసంసేవితంబైన మార్గంబునన్ వచ్చితిన్, మిమ్ముఁ గన్గొంటి, శ్రీరామచంద్ర ప్రభావంబునన్ యుష్మదీయోరుతేజంబునన్ నేను సుగ్రీవు కార్యంబు నీమట్టు గావించితిన్ లంకలో, నింకఁ గాఁ గల్గు కార్యం బవార్యంబుగాఁ జేయ మీరెల్లరున్నారుగా.

(హనుమంతుడు సముద్రం దాటి లంకకు పోయి సీతను చూసి, సంభాషించి, మరలి వచ్చే ముందర లంకాదహనం చేసి, తిరిగి వచ్చి తన వానర మిత్రులను కలిసేంత వరకూ జరిగిన సుందరకాండ వృత్తాంతం ఇది. ఇంతవరకూ జరిగిన సుందరకాండంతా ఇందులో వుంది. ఇందులోని విషయమంతా హనుమంతుడు వక్తగా, సంగ్రహంగా వానర మిత్రులకు చెప్పాడు. ఇది చదివి ఇక ముందుకు సాగితే సుందరకాండ అంతా చదివినట్లే కద! మహాద్భుతమైన, రసరమ్య రంజితమైన శ్రీవాసుదాసస్వామి శ్రీ లేఖిని నుండి జాలువారిన ఈ దండకం సర్వదోషహారం. సర్వ క్లేశ నివారణం. శ్రీరామానుగ్రహ ప్రసాద కారణం).

❖ ❖ ❖

సర్గ-59

సీతాదేవిని తోడ్కొని వచ్చి శ్రీరాముడిని దర్శించడం యుక్తమని చెప్పిన హనుమంతుడు

లంకకు పోయివచ్చిన విధమంతా క్షుణ్ణంగా కపులకు వివరించిన హనుమంతుడు, తన వానర మిత్రులతో ఇలా అంటాడు:

"శ్రీరామచంద్రమూర్తి అనుగ్రహంచేత, మీ అందరి ప్రోత్సాహం వల్ల, నావన్తుగా మీరు నాకు అప్పగించినపని, లంకకు వెళ్లి సీతను చూసి రావడం పూర్తయింది. ఇక తక్కిన కార్యం మీ వంతు. సుగ్రీవుడు సీతాన్వేషణకోసం చూపిన ఉత్సాహం, రామచంద్రుడి ప్రయత్నం, ఈ రెండూ, సీతాదేవి మహాపాతివ్రత్య మహిమవల్ల ఫలించాయి. వారివురు అనుకున్నవి నెరవేరాయి. వికసించిన తామరపూవును విడిచి తుమ్మెద రాలేనట్లే, నా మనసు లంకలో వున్న సీతాదేవిని విడిచి ఇక్కడకు రాలేక పోతున్నది. ఇలా నా జన్మ సఫలమయింది. ఉన్న విషయాన్ని యదార్థంగా చెప్పాను".

"నేను చెప్తున్నదాన్నిబట్టి రావణుడు అల్పుడనీ, సులభ సాధ్యుడనీ, భావించవద్దు. వాడి తపోబలంతో, లోకాలను నిల బెట్టగలడు. సంహరించనూ గల సమర్థుడు. జానకిని తగిలినా వాడింకా దగ్ధమై పోలేదంటే, అది వాడి తపోబలమే! వాడి తపోమహిమ సీతాదేవి పాతివ్రత్యం కంటే గొప్పదనడంలో అర్థం, వాడిని రాముడు, సుగ్రీవుడు ఏమీ చేయలేరని కాదు. రావణుడు దగ్ధమైపోకుండా వున్నాడంటే అది వాడి తపోబలంవల్ల కాదు. వాడు ఆమెను తాకినప్పుడు ఆమె కోప్పడలేదు. ఆమె నిజంగా కోపమే తెచ్చుకుంటే, ఆ కోపాగ్ని, నిజమైన అగ్నిహోత్రుడి అగ్నికంటే తీవ్రమయిందవుతుంది. అగ్నిహోత్రుడు రావణాసురుడి కొంపకాల్చగలిగాడు కాని, సీతాదేవి వున్న చెట్టుకాల్చగలిగాడా? సీత తనంతట తానుగా రావణుడిని నాశనం చేయ సంకల్పించలేదు కనుకనే వాడింకా జీవించి వున్నాడు".

"లంకలో జరిగిందంతా చెప్పాను. ఇక జరగాల్సింది మీరు ఆలోచించండి. సీతాదేవిని తీసుకొచ్చి, రామచంద్రమూర్తి దగ్గరకు పోతే మంచిదని నా

అభిప్రాయం. జాంబవంతుడితో సహా మీరంగీకరిస్తే అలానే చేద్దాం. ఆమె అక్కడ ఏడుస్తూ వుండడం, ఆ వార్త చెప్పగానే రామచంద్రమూర్తి దుఃఖపడడం, ఈ సన్నివేశం మనం కళ్లప్పగించి చూడడం నాకు నచ్చలేదు. రావణుడిని, వాడి బలగాన్నీ, నేనొక్కడినే చంపగలను. మీరుగూడా నావెంట వుంటే చెప్పాల్సిన పనేలేదు. కార్యం సులభమైపోతుంది. మనం రావణుడిని చంపి సీతను తెస్తే, రాముడికేమీ అపకీర్తి రాదు. మనం ఆయన సేవకులం. సేవకులు చేయాల్సిన పని కూడా ప్రభువే చేయాలా? సేవకులకు సాధ్యపడకపోతేనే ప్రభువు చేయాలి. అన్నీ ప్రభువే చేసుకుంటే సేవకులతో పనేమిటి?"

"ఈ కార్యం మనవలన అవుతుందా, కాదా? అన్న సందేహం లేదు. మీరంతా శూరులు, అస్త్రజ్ఞానమున్నవారు, వీరాధివీరులు, బుద్ధిమంతులు, జయం మీద కోరికున్నవారు, ఎదిరించలేని బలవంతులు, సముద్రాన్ని దాటే శక్తిగలవారు. ఇలాంటి మీరు తోడైవస్తే, లంకానాశనం జరగదా? రావణుడిని కొడుకులతో, తమ్ములతో, సైన్యంతో సహా నేనొక్కడినే చంపగలను. ఇంద్రజిత్తు బ్రహ్మాస్త్రం, ఇంద్రాస్త్రం, రుద్రాసత్రం, వారుణాసత్రం, అన్నింటినీ నేనొక్కడినే నాశనం చేస్తాను. దీనికి మీ సమ్మతి కావాలనీ, మీ అంగీకారం లేదనీ, ఆగాను. నేను రాళ్లవాన కురిపిస్తే దేవతలైనా చస్తారు, రాక్షసులొక లెక్కా? సముద్రం చెలియలికట్ట దాటితే దాటవచ్చు, మందర పర్వతం వణకొచ్చు, కాని జాంబవంతుడిని యుద్ధంలో కదిలించగల శత్రు సమూహం లేనేలేదు".

"ఆ రాక్షసుల్లో ప్రసిద్ధమైన వారందరినీ ఒక్క అంగదుడే చంపగలడు. పనసుడి, నీలుడి వేగానికి మందరం కూడా పొడైపోతుంది. మైంద, ద్వివిదులతో పోరి, గెలవగలవారు యక్షులలో, గంధర్వులలో, పన్నగులలో కూడా లేరు. వీరు బ్రహ్మవరప్రసాదితులు, అమృతాన్ని త్రాగినవారు, అశ్వినీ దేవతల గౌరవార్థం వీరికి చావులేకుండా బ్రహ్మ వరం ఇచ్చాడు. మిగిలిన బలవంతుల సంగతి అటుంచి, వరగర్వంతో, దేవతా సమూహాలను గెల్చి అమృతం తాగిన వీరు రాక్షసులను లక్ష్య పెడతారా?"

"నిర్భయంగా లంకా నగరమంతా తిరిగి బూడిదయ్యేంతవరకూ కాల్చాను. రామచంద్రుడి పేరు, సుగ్రీవుడి పేరు, లక్ష్మణుడి పేరు, మహా పరాక్రమవంతులైన

మీ అందరి పేర్లూ, అన్నిచోట్లా అదేపనిగా చెప్పాను. నేను రామచంద్రమూర్తి దాసుడననీ, పేరు హనుమంతుడనీ, వాయుపుత్రుడననీ, అందరూ వినేటట్లు చెప్పాను. రహస్యంగా ఏపనీ చేయలేదక్కడ".

కపులకు సీతాదేవి పరిస్థితిని తెలిపిన హనుమంతుడు

"శీలవతి, గుణవతి, రూపవతి, పతివ్రతా శిరోమణి, ఒక దుష్టుడికి చెందిన అశోకవనంలో, ఓ ఇరుగుడు (శింశుపావృక్షం) చెట్టు నీడ కింద దుఃఖించే దృశ్యాన్ని జప్తికి తెచ్చుకుంటే, మనస్సు మండిపోతున్నది. సీతను ఆస్థితిలో మీరందరూ చూస్తే ఏమైపోయే వారో! ఎంతో రాతిగుండె వున్నవాడినైనందున నేను నిబ్బరించుకున్నాను. రాక్షసస్త్రీల మధ్య బందీగా వున్న సీత, మబ్బుల్లో మరుగునపడ్డ చంద్రకాంతిలా, కాంతిహీనమై శోకిస్తున్నప్పటికీ, రావణుడినే మాత్రం లక్ష్యపెట్టడం లేదు. ఇంద్రుడిమీద శచీదేవి మనసుంచినట్లే, భర్తమీద ఏకాగ్రమైన మనసుంచి, అనురాగంతో, ఎల్లవేళలా శ్రీరామచంద్రమూర్తినే ధ్యానిస్తున్నది సీతాదేవి".

"మాసిపోయిన ఒకే ఒక్క చీరెతో, వంటిమీద ఉత్తరీయం కూడా లేకుండా, దుమ్ములో మునిగి దుఃఖిస్తున్న సీత, భర్తను చూస్తానన్న ఆశతో రాక్షసస్త్రీల మాటలు, బెదిరింపులు లెక్కచేయడంలేదు. ఆమె శోకించే దృశ్యాన్ని తలచుకున్నప్పుడల్లా కడుపు మండుతున్నది. చూడటానికే వికారంగా వుండే రాక్షసస్త్రీలు, ఆమెను ఎల్లప్పుడూ భయపెడ్తున్నారు. అయినా ఆమె ఎల్లవేళలా నాథా అంటూ, అతని క్షేమం కోరి దుఃఖిస్తూ, వెల వెల్లాడిన ముఖంతో, నేలపైన కూర్చుని వుండడం చూస్తుంటే, ఆమె, శీతాకాలంలోని తామరతూడులాగా కనిపించింది. రామచంద్రమూర్తి తనదగ్గరకు వచ్చేమార్గం కనపడలేదనుకుని, రావణుడిని నమ్మలేని సీత, వాడి చేతుల్లో చచ్చే కంటే, తనంతట తానే మరణిద్దామని నిశ్చయించుకున్నప్పుడు, ఆపతివ్రతా శిరోమణికి నచ్చచెప్పి, ఏదోవిధంగా ఆ పని మానిపించాను".

"మా ఇద్దరిమధ్య జరిగిన సంభాషణలోని అన్ని విషయాలనూ, ఆమె అడిగినవన్నీ తెలియచేసాను. వానరరాజు సుగ్రీవుడికి, శ్రీరామచంద్రమూర్తికి

స్నేహం కుదిరిందన్న సంగతివిని ఎంతో ఆనందించింది. సీతాదేవి మహాత్మ్యం చేత, ఆమె అసమానమైన పాతివ్రత్యంచేత, తమోగుణంకల రావణుడు ఇంతవరకూ దుర్మరణం పాలుకాలేదంటే వాడుగొప్పవాడనే అనాలి. అయితే భర్త చేతులతోటే రావణుడిని చంపించి, ఆ కీర్తి ఆయనకు దక్కేలాచేసి వీరపత్ని ననిపించుకోవాలన్న ఆమె వ్రతమే ఆ రావణుడినింత వరకూ కాపాడింది. వాడందుకే ఇంకా శాపగ్రస్తుడు కాలేదు. సహజంగా సన్నగా వుండే సీత, భర్తను విడిచి వుండడంవల్ల ఇంకా క్షీణించిపోయింది. వీటన్నిటికీ ప్రతిక్రియగా ఏది న్యాయమని తోస్తే అదేచేద్దాం. ఆలోచించండి" అని హనుమంతుడనగా, అంగదుడు తన అభిప్రాయం చెప్పసాగాడు.

❖ ❖ ❖

సర్గ-60

సీతాదేవిని తోడ్కొని వచ్చేందుకు సమ్మతించిన అంగదుడు

శౌర్యమందు సమర్థుడు, దేవదానవ పన్నగులకు అసమానుడు, హనుమంతుడు, సీతను చూసివచ్చాడే కాని, పిలుచుకుని రాలేదనడం బాగుంటుందేమో ఆలోచించమని అంటాడు అంగదుడు. ఇట్టివాడు ఉత్త చేతులతో రాముడి వద్దకు పోతే మంచిదికాదేమో నని తన అభిప్రాయమంటాడు అంగదుడు. "వీరుడు హనుమంతుడు లంకలోని వీరులందరినీ చంపి వచ్చాడు. ఇక మనం అక్కడకు పోయి సీతను తేవడమే మిగిలుంది, సీతను తెద్దాం" అంటాడు అంగదుడు. అయితే అంగదుడి ఆలోచన బాగున్నప్పటికీ, రామచంద్రమూర్తి అభిప్రాయం తెలుసుకుని, ఆయన చెప్పినట్లు చేస్తే బాగుంటుందని జాంబవంతుడు సలహా ఇస్తాడు.

❖ ❖ ❖

సర్గ-61

కిష్కింధకు పోయే మార్గంలో మధువనాన్ని చూసిన కపులు

జాంబవంతుడి సలహా బాగున్నదని అంగదుడు, హనుమంతుడు, తక్కిన వారందరూ అంగీకరించి, హనుమంతుడు ముందుండగా మహేంద్ర పర్వతాన్ని విడిచి బయల్దేరారు. మేరు, మందర పర్వతాలంత ఎత్తు, పెద్ద ఏనుగుల బలమూ వున్న వానరులు కిష్కింధకు పోయే మార్గంలో ఆకాశాన్నే మరుగుపరుస్తున్నట్లు వ్యాపించిపోయారు. ఆంజనేయుడిని తమ చూపులతోనే మోస్తున్నారా అనేవిధంగా, కళ్లురెప్పలార్చకుండా ఆయన్నే చూసుకుంటూ, పొగుడుకుంటూ, స్వామికార్యం నెరవేర్చామని ప్రియమైన మాటలు చెప్పుకుంటూ పోతున్నారు వారందరూ.

(ఈ హనుమంతుడు ఎంతటి ఘనకార్యం చేసాడు! ఎంతటి నిరుపమ భాగ్యశీలి! ఆహా! సీతమ్మను చూసి, కుశలాదులు విచారించి, చక్కగా వచ్చి మన ప్రాణాలను నిల్పిన ఈతడు ఎంతటి మహనీయుడు! స్తవనీయుడు! ధన్యుడు! అని వానరులు ప్రేమ, ఆప్యాయతలు నిండిన మనస్సులలోని అభినందన భావ పరంపర వారి కళ్లల్లో ప్రతిబింబించిందేమోనని అనిపిస్తోంది).

యుద్ధం చేయాలన్న ఆసక్తితో, దానిమీదే మనస్సుంచి, ఉత్సాహంతో రామచంద్రమూర్తికి ఎప్పుడు సహాయం చేద్దామా అన్న కోరికతో, ఆకాశ మార్గాన పోతున్న వారి కంటికి అందమైన మధువనం కనిపించింది.

(మహేంద్ర పర్వతం నుండి సముద్రాన్ని దాటి లంకకుపోయే దూరం కంటే, మహేంద్ర పర్వతం నుండి కిష్కింధకున్న దూరమే ఎక్కువ)

ఇంద్రుడి నందనవనంతో సమానమై, చెట్ల వరుసలతో, అందమైన తీగల గుంపులతో, ప్రకాశిస్తూ, సంతోషాన్నిచ్చే ఈ మధువనం పటిష్టమైన కాపలాలో భద్రంగా కాపాడబడుతున్నది. సుగ్రీవుడి మేనమామ "దధిముఖుడు" దాంట్లోనే కాపురముంటూ, కాపలావారికి నాయకుడిగా వున్నాడు. ఆ వనాన్ని చూస్తూనే వానరులంతా, అక్కడున్న తేనె తాగాలన్న కోరికతో యువరాజైన అంగదుడి

అంగీకారమడిగారు. జాంబవంతుడు, ఇతర వానర ప్రముఖులు, సరేననడంతో వారందులోకి దూరారు.

మధు వనంలో చొరబడి చెలరేగిన కపులు

లోపలికి పొమ్మని అంగదుడు అనుమతి ఇవ్వగానే, వానరులందరూ నాట్యం చేస్తూ, సంతోషంతో గెంతులేస్తూ, ఒళ్లు తెలియకుండా ఆటలాడుతూ, పాటలు పాడుతూ, మీసాలు తిప్పుకుంటూ, వేడుకలాడుకుంటూ, ఊగుతూ, తూలుతూ, మధువనంలోకి దూరారు. యథేచ్ఛగా తిరుగుతూ, తృప్తి తీరా తేనె తాగారు. దానితో బాగా మత్తెక్కింది వానరులందరికీ. వనాన్నంతా కలియబెట్టి, చెట్లకున్న పళ్ళన్నీ నేలరాలకొట్టి, చిందరవందర చేసారా మధువనాన్ని.

చెలరేగి వనాన్ని పాడుచేస్తున్న వానరులను వారించి, నయానా-భయానా చెప్పిచూసాడు దధిముఖుడు. తనమాటలు వాళ్ల చెవికెక్కక పోవడంతో, బలవంతంగానన్నా వాళ్లను నివారించి వనాన్ని రక్షించాలనుకున్నాడు. కొందర్ని తిట్టాడు, కొందర్ని మెడపట్టుకుని తోటబయటకు విసిరాడు, పెద్దవారికి నీతులు చెప్పాడు, కొందర్ని చేత్తో కొట్టాడు, కొందరిని పిడికిలితో బాదాడు. వానరులు కూడా వూరుకోలేదు. కొందరు వాడిని కొరికారు, కొందరు గోళ్లతో గీకారు, కొందరు ఈడ్చారు, కొందరు మీదపడి మర్దన చేసారు, కొందరు దూషించారు, కొందరు కోపంతో ఆ వనాన్ని మరింత పాడుచేయసాగారు.

❖ ❖ ❖

సర్గ-62

అంగద హనుమంతుల ప్రోద్బలంతో మధువనంలో విచ్చలవిడిగా సంచరించిన కపులు

దధిముఖుడు వానరులకు అడ్డం తగలడంతో, వారిరువురికీ, కొట్లాటలోనే కాలం వృధా అయిపోతుందని గమనించాడు హనుమంతుడు. వానర ముఖ్యులు కలహంతోనే కాలం గడపకుండా, తేనెతాగడంలోనే నిమగ్నంకమ్మనీ, దధిముఖుడి సంగతి తాను చూసుకుంటాననీ వారికి చెప్పాడు. స్వామికార్యం నెరవేర్చిన హనుమంతుడు, చెప్పరాని పని చెప్పినా సమ్మతమేననీ, వాళ్ల ఆశతీరేదాకా తేనె తాగమనీ వానరులకు చెప్తాడు అంగదుడు. భళి-భళీ అనుకుంటూ, అంతకుముందు దధిముఖుడి మాటలకు తోటబయటకు పోయినవారుకూడా వనంలోకి చొరబడ్డారు మళ్లీ. కావలివాళ్లను కొట్టారు, కిందపడేసారు. తూములకొద్దీ తేనెతాగి, తేనెతెట్టెలను నేలమీద పడేసి పగలగొట్టారు. స్వభావసిద్ధమైన బలంవల్లా, సీతాదేవిని చూసిన వార్త వినడంవల్లా, అంగదుడు అనుమతి ఇచ్చాడన్న ఉత్సాహం వల్లా, తృప్తి తీరేదాకా తేనెతాగారు. కొంత తేనె పారబోసారు, మైనపు వుండలతో ఆడుకున్నారు, కోతికొమ్మచ్చులాడారు, తోసుకున్నారు, నిద్రించారు, అరిచారు. నానా హడావిడీ చేసారు. ఏమిటేమిటో చేసారు వానరులు. కోతుల గుంపుల చేష్టలు చూసిన కావలి వాళ్లు, దధిముఖుడి సైన్యం వెంటరాగా, కోపంతో వీళ్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తే, వానరులు వాళ్లను మోకాళ్లతో కుమ్మారు, పిడికిళ్లతో గుద్దారు, కొట్టారు, ముడ్డిచూపించారు. వాళ్లు భయపడి, తమ ప్రభువు వద్దకు పరిగెత్తారు. హనుమంతుడి సహాయంతో కోతులు వనమంతా పాడుచేసి తమను కొట్టారని దధిముఖుడికి పిర్యాదు చేసారు. కోతులను కొడదాం రమ్మని సైనికులకు చెప్పగా, వాళ్లు చేతికి దొరికిన ఆయుధాలను పట్టుకుని బయల్దేరారు. దధిముఖుడు ఒక చెట్టు పీకి దానితో వానరులను దండించడానికి వెళ్లాడు.

ఇలావచ్చిన దధిముఖుడు, అతని సైనికులు, వానరులమీద పడి వారిని తోటనుండి తరిమేస్తున్నారని తెలుసుకున్న హనుమంతుడు, ఇతరవానర

ప్రముఖులు, అక్కడకు చేరుకున్నారు. అలావచ్చిన వారిలో వున్న అంగదుడు, తనకు వరుసకు తాతైనప్పటికీ, (మాతామహుడు) గౌరవించాల్సిన వాడైనప్పటికీ, తేనెతాగిన మత్తులో, దధిముఖుడిపైన పడి గుద్దులుగుద్ది వదిలిపెట్టాడు. వాడు వెలవెల బోయి, మూర్ఛపోయి, లేచి ఇతర వానరులను అడ్డగించాడు.

అంగదుడే ముందుండి మధువనాన్ని పాడుచేసాడని సుగ్రీవుడికి చెప్పాలనుకుంటాడు దధిముఖుడు. అలాచెప్తే సుగ్రీవుడు వీళ్లను తప్పక దండిస్తాడని భావిస్తాడు. రాజాజ్ఞ మీరి సంచరిస్తున్న వీరందరినీ చంపించాలనీ, అలాచేస్తే వీరికి బుద్ధి వస్తుందనీ, పొగరణుగుతుందనీ తలుస్తాడు, పగతీరుతుందనుకుంటాడు. తనవెంట ఇతర వనపాలకులు వస్తుంటే, నిమిషంలో సుగ్రీవుడి దగ్గరకు అకాశ మార్గాన వెళ్లాడు దధిముఖుడు. అక్కడున్న రామలక్ష్మణ సుగ్రీవులను చూసి, ఏడ్చుకుంటూ అల్లుడైన సుగ్రీవుడికి నమస్కరిస్తాడు.

❖ ❖ ❖

సర్గ-63

సుగ్రీవుడితో కపుల దుశ్చేష్టలు తెలిపిన దధిముఖుడు, వనపాలకులు

తనకు నమస్కరించి కాళ్లమీద పడిన దధిముఖుడిని చూసి, సుగ్రీవుడు, భయపడకుండా, జరిగిందేంటో చెప్పమని అడుగుతాడు. సమాధానంగా, సుగ్రీవుడి తరంలోగానీ, ఆయన అన్న తరంలోగానీ, తండ్రి తరంలోగానీ, మధువనంవైపు కూడా రాని వానరులు, ఇప్పుడు దక్షిణ దిక్కునుండి తిరిగి వస్తూ ఆ వనాన్ని పాడుచేసారని పిర్యాదు చేసాడు. వారక్కడ తేనెతాగారనీ, పళ్ళన్నీ తిన్నారనీ, తాగగా మిగిలిన తేనెను పారపోసారనీ, ఇదేమిటని అడ్డంపోయిన కావలివారిని వెక్కిరించి కొట్టారనీ, చెప్పాడు. వనపాలకులు వెళ్లి బలవంతంగా వానరులను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తే, వాళ్లు కోపంతో పిడికిళ్లతో గుద్దారనీ, కాళ్లతో కుమ్మారనీ, ముడ్లు చూపారనీ, సుగ్రీవుడు రాజన్న సంగతికూడా మరిచిపోయి ప్రవర్తించారనీ, అన్నాడు. ఇలా ఆయన విన్నవిస్తున్న సమయంలోనే, ఆమాటలువిన్న లక్ష్మణుడు, సుగ్రీవుడితో, వనపాలకుడు ఏమంటున్నాడనీ, ఎందుకు దుఃఖిస్తున్నాడనీ ప్రశ్నిస్తాడు.

జరిగిన సంగతినీ, దధిముఖుడి పిర్యాదునీ, నేర్పుగా లక్ష్మణుడికి వివరిస్తాడు సుగ్రీవుడు. మధువనంలో హనుమంతుడి అండతో, అంగదుడి ప్రోత్సాహంతో, కపులు చేసినపనిని గురించి తనదైన మాటల్లో నేర్పుగా చెప్పాడు. దక్షిణ దిక్కుగా పోయిన వానరసేనకు, ఆలోచన చెప్పేవాడు జాంబవంతుడైనప్పుడు, హనుమంతుడు రక్షకుడైనప్పుడు, ప్రభువేమో అసమాన బలుడైన అంగదుడే అయినప్పుడు, వారికప్పచెప్పిన పని సఫలమయిందనడంలో ఆశ్చర్యం లేదనుకుంటాడు. ఆ విషయమే చెప్పాడు లక్ష్మణుడితో సుగ్రీవుడు. అంగదుడు మొదలయినవారు, ఇతర వానర ప్రముఖులు, మధువనాన్ని కుప్పచేసారనీ, వద్దని అడ్డంపోయిన దధిముఖుడినీ, వనపాలకులనూ కొట్టారని కూడా చెప్పాడు సుగ్రీవుడు. వానరులు సీతాదేవిని చూడకపోయినట్లైతే, బ్రహ్మదత్తమైన మధువనాన్ని కళ్లతో చూసే ధైర్యమైనా వుంటుందా? ఈ మాటలు విన్న రామలక్ష్మణులు సంతోషంతో గగుర్పాటు పడ్డారు.

రామలక్ష్మణులకు ఇలా చెప్పిన సుగ్రీవుడు, దధిముఖుడితో వానరులు మధువనంలో స్వేచ్ఛావిహారం చేసారంటే, వారుమంచి కార్యం సాధించి వుంటారనీ, కాబట్టి వాళ్లను క్షమించాలనీ, క్షమించాననీ అంటాడు. హనుమంతుడు, ఇతరులు ప్రవర్తించిన విధం, సీతాదేవిని చూసేందుకు వారు చేసిన ప్రయత్నం, రామలక్ష్మణుల సన్నిధిలోనే తాను వినదల్చుకున్నానని వానరులందరికీ చెప్పి, వాళ్లను త్వరగా రమ్మని కబురుచేస్తాడు సుగ్రీవుడు. ఇలా చెప్పిన తర్వాత, సంతోషంతో, వికసించిన కళ్లతో, పులకరించిన దేహంతో, కనిపించిన రామలక్ష్మణులను చూసి, సీతాన్వేషణ కార్యం సఫలమయిందికదా అని ఆనందించాడు సుగ్రీవుడు.

❖ ❖ ❖

సర్గ-64

సుగ్రీవుడి దగ్గరకు వెళ్లిన అంగదాదులు

రామలక్ష్మణులకు, సుగ్రీవుడికి నమస్కరించిన దధిముఖుడు, పరిచారకులతో ఆకశానికెగిరి, ఎంతవేగంగా వచ్చాడో, అంతేవేగంగా వెళ్లిపోయాడు. మధువనంలో తేనెను నీళ్లతో కలుపుకుని తాగిన వానరులకు, మూత్రం విడిచినందున, అప్పటికి మత్తువదిలింది. ఆ వానరులలో అంగదుడిని గమనించి, అతడి వద్దకువెళ్లి, చేతులు జోడించి నమస్కరించాడు దధిముఖుడు. తాను చేసిన అపరాధాన్ని మన్నించమని వేడుకుంటాడు. వనపాలకులు తెలివితక్కువతనం వల్ల వానరులను అడ్డగించారనీ, ఆ ఉద్యానవనానికి రాజకుమారుడూ, యువరాజూ అయిన అంగదుడే ప్రభువనీ, ఆయన సొమ్ము ఆయన వాడుకుంటే అడ్డగించే అధికారం వీరికెవరికీ లేదని అంటాడు. అజ్ఞానంతో చేసిన తప్పులు క్షమించమని, వాళ్లు ఈ వనంలోకి వచ్చిన వార్తను పిన తండ్రి సుగ్రీవుడికి తెలిపి వచ్చాననీ అంటాడు. తాను సుగ్రీవుడితో వానరులు తప్పుచేసారని చెప్తే, కోపగించుకునే బదులు, సంతోషించి, వాళ్లను త్వరగా రమ్మని కబురంపాడని కూడా చెప్పాడు దధిముఖుడు.

దధిముఖుడు చెప్పిన మాటలు విన్న అంగదుడు వానరులతో, ఈ విషయాలన్నీ రామలక్ష్మణులకు కూడా తెలిసే వుంటాయనీ, ఎట్లాగూ తేనెతాగి అలసట తీర్చుకున్నాం కనుక, ఇక్కడ చేయాల్సిన పనికూడా ఏమీలేదు కనుక, పిన తండ్రిని చూట్టానికి పోదామా అని అడుగుతాడు. "మీ అందరూ ఏది చెప్తే అదే చేద్దాం. పనులు చేయడం విషయంలో నేను మీ అధీనంలో వుంటాను. నేను మీకు యువరాజునైతే అవ్వొచ్చు. ఆ అధికారం వుందికదానని మీకిష్టం లేని పని చేయమని నేను ఆజ్ఞాపించను. కార్యసాధకులైన మిమ్మల్ని వ్యర్థమైన ఆజ్ఞలతో పీడించను" అన్న అంగదుడి మాటలకు వానరులంతా సంతోషపడ్డారు. రాజైన ప్రతివాడూ, తానే సర్వం చేస్తాననీ, చేయగలవాడిననీ, మతిచెడ్డవాడిలాగా గర్వపడుతాడుకాని, ప్రభువనేవాడెవ్వడూ, ఈవిధంగా, వినయంగా మాట్లాడడని

అనుకుంటారు. ఇలాంటివాళ్లు అరుదుగా వుంటారనీ, ఇతని వినయమే భవిష్యత్తులో గొప్పమేలు చేస్తుందని భావిస్తారు.

అంగదుడి ఆజ్ఞ లేక అడుగెయ్యమనీ, ఏపనైనా ఆయన చెప్పినట్లే చేస్తామనీ, ఆయన చెప్పినట్లే సుగ్రీవుడిని చూడటానికి పోదామనీ వానరులందరూ అంటారు. "సరే" పోదామని అంగదుడనగానే, వానరులు ఆకాశమార్గాన, వేగంగా, యంత్రాలతో చిమ్మిన కొండల్లాగా, గర్జించే మేఘాల్లాగా, సుగ్రీవుడుండే ప్రదేశానికి చేరుకున్నారు. ఇంతలో సీతాదేవి వార్త తెలియరానందున, రామచంద్రమూర్తి సంతాప పడుతుంటాడక్కడ.

శ్రీరాముడికి ధైర్యోక్తులు చెప్పిన సుగ్రీవుడు

సంతాపపడుతున్న శ్రీరామచంద్రుడిని చూసిన సుగ్రీవుడు, ఆయనతో, ఓదార్పు మాటలతోనూ, ధైర్యవచనాలతోనూ, మాట్లాడాడు. "కమలాక్షా! ఊరడిల్లు. వానరులు నిస్సందేహంగా సీతను చూసొచ్చారు. గడువు దాటి కార్యం సాధించకుండా, నా ఎదుటకు వచ్చే ధైర్యం వాళ్లకు లేదు. వెళ్లినపని చేయక వెనక్కు వచ్చే పనికిమాలినవాడు కాదు అంగదుడు. కార్యసాధకులు కాకపోతే, తాతతండ్రులు రక్షించుకుంటూ వస్తున్న ఉద్యానవనంలోకి ప్రవేశించడానికి ఎన్ని గుండెలుండాలి? రఘువరా, కౌసల్యా తనయా! సీతాదేవి వార్త తెలిసింది. ఈకార్యం సాధించగలవాడు హనుమంతుడొక్కడే. ఇతరులకిది దుస్సాధ్యం. ఆ సూర్యుడిలో స్థిరమైన తేజం ఎలా వుంటుందో ఈ వానర శ్రేష్టుడిలో, శక్తి, బలం, జ్ఞానం, స్థిరంగా వుంటాయి" అంటాడు సుగ్రీవుడు.

శ్రీరాముడికి సీతాదేవి పరిస్థితిని తెలిపిన హనుమంతుడు

ఇలా రామసుగ్రీవులు మాట్లాడుకుంటున్నప్పుడు, సింహనాదాలు చేసుకుంటూ వస్తున్న వానరుల కిలకిలారావములు, ఆకాశానికి దగ్గరలోనే వినపడగానే, సుగ్రీవుడు ప్రభువు కూర్చుండే పద్ధతిలో, తోకను పొడుగ్గా చాచి కూర్చున్నాడు. వారొస్తున్న పద్దతి, ఆధ్వని, కార్య సఫలతను తెలిపే విధంగా వున్నాయి. అంగదుడినీ, ఆంజనేయుడినీ, మనస్సులో తలచుకుంటూ, వానరులు

సుగ్రీవుడి దగ్గరగా దిగారు. శ్రీరామచంద్రమూర్తితో హనుమంతుడప్పుడు సీతను గురించి సర్వస్వం తెలియ చెప్పే విధంగా, మూడే-మూడు మాటలంటాడు. "నియత-ప్రాణయుక్త-దేవి" అన్న ఆ మూడు మాటలు వింటూనే, సుగ్రీవుడు రామకార్యం ఫలించిందనీ, తన మాట చెల్లించు కున్నాననీ సంతోషించాడు. శ్రీరామలక్ష్మణులు ప్రీతిగా, ప్రియమైన మాటలు చెప్పిన హనుమంతుడిని ప్రేమగా అలాగే చాలాసేపు చూస్తుండిపోయారు.

("నియత" అంటే పాతివ్రత్య నియమం కలదనీ, "ప్రాణయుక్త" అంటే జీవించి వున్నదనీ, "దేవి" అంటే సీతాదేవి అనీ ఆ మూడు మాటలకర్థం. సీతాదేవి ప్రాణాలతో బ్రతికున్నా, శీలం చెడిందయితే చచ్చినదానితో సమానమైంది కనుక, "శీలం" కలదని "నియత" అని మొదలంటాడు. శీలం కలిగిన విషయం నిజమే! చనిపోతే శీలం వున్నా లాభం ఏమిటి? కాబట్టి జీవించే వున్నదని "ప్రాణయుక్త" అంటాడు. "దేవి" శబ్దం తనకు సీతాదేవి మీదున్న భక్తి, గౌరవం చెప్పటానికే! దేవుడి భార్య దేవి. దేవీ శబ్దం లక్ష్మి పర్యాయపదంగా అష్టోత్తర శతనామావళిలో చెప్పబడింది. రామ, దేవ శబ్దాలు సమానర్థం కలిగున్నవే! తనకామె సాక్షాత్తూ "లక్ష్మీదేవి" లాగా కనపడిందన్న భావన)

❖ ❖ ❖

సర్గ-65

సీతాదేవి లంకలో వుందని శ్రీరాముడికి చెప్పిన హనుమంతుడు

వానరులందరూ, రామలక్ష్మణసుగ్రీవుల దగ్గరకు పోయి, నమస్కరించి, సీతాదేవి రావణాసురుడి ఇంట్లో వున్న సంగతి, రాక్షసస్త్రీలు ఆమెను బెదిరిస్తున్న విషయం, రావణుడు పెట్టిన గడువు వ్యవహారామ్, సీతాదేవి పతిభక్తి గురించీ, వివరంగా చెప్పారు. సీతాదేవి క్షేమసమాచారం విన్న శ్రీరాముడు, ఆమె ఎక్కడుంది, ఏంచేస్తున్నది, తన విషయంలో ఏ నియమంతో వుంది, వివరించమని వానరులను అడిగాడు. చూసి వచ్చిన హనుమంతుడినే, ఈ విషయాలన్నీ చెప్పమని మిగిలిన వానరులంటారు. హనుమంతుడప్పుడు, సీతాదేవి వుండే దిక్కుకు తిరిగి, సీతాదేవికి వినయంగా నమస్కరించి, శ్రీరామచంద్రమూర్తితో చెప్పడం మొదలెట్టాడు.

(శుభ కార్యాలకు పనికిరాని దక్షిణ దిశ కూడా, సీతాదేవి వున్న కారణాన, హనుమంతుడికి వందనీయమయింది. అందుకే దక్షిణ దిశ అనకుండా, సీతాదేవి వుండే దిక్కంటాడు వాల్మీకి భగవానుడు, వాసుదాసకవి. మహానుభావులుండే ప్రదేశాలు కూడా పూజ్యనీయమైనవే కద!)

"నూరు యోజనాల సముద్రాన్ని దాటి, సీతను చూసే కోరికతో పోయాను. అక్కడ దేవతల విరోధి రావణాసురుడుండే లంకనే పట్టణముంది. ఆ రాక్షసరాజు ఇంట్లో, ఏ కోరికల్లేక, నిన్ను చూద్దామన్న ఒకే ఒక్క కోరికతో, ఊపిరి బిగబట్టుకుని వున్న సీతను చూశాను. మాటలను బట్టి, చేష్టలను బట్టి ఆమెలో ప్రాణముందనుకోవాలే తప్ప, రూపం చూస్తే బ్రతికున్నదానిలాగా అనిపించదు. అలాంటామెను వికార రూపాలున్న రాక్షసస్త్రీలు, ఒకరి తర్వాత ఒకరు బెదిరిస్తుంటే, దుఃఖిస్తున్నది. దుఃఖమంటే ఏమిటో తెలియక, సుఖపడాల్సిన సీత, చెప్పనలవికాని శోకంతో అశోకవనంలో వుంది".

రావణుడి అంతఃపురంలోని చెరలో చిక్కుకున్న సీతాదేవికి కాపలాగా రాక్షస స్త్రీల గుంపులున్నాయి. వెంట్రుకలన్నీ ఒకటిగ అల్లుకునిపోయిన జడతో,

కటిక నేలపై కూర్చుండే శక్తికూడా లేక, పడుకొని బాధపడుతోంది. సర్వకాల సర్వావస్థలందు నిన్ను ధ్యానించడంలోనే నిమగ్నమయింది. బాధపట్టున్న ఆమెను చూస్తుంటే, శీతాకాలం నాటి తామరతీగలాగా వుంది. దేహం కాంతిచెడి, ప్రాణాలు విడుద్దామని ఆలోచిస్తున్న సీతాదేవిని అదేసమయంలో అతికష్టం మీద చూశాను. నా రాకను ఆమెకు తెలియచేసే వుద్దేశంతో, ఇక్ష్వాకు రాజుకీర్తిని ఆమెను నమ్మించేందుకు, ఆమె వినేటట్లు స్మరించాను".

"మహామహిమగల సీతాదేవి నిన్నే మిగుల నిర్మల స్వభావంతో, మనస్సులోనే స్మరిస్తున్నది. సత్పురుషులను ప్రశంసించే భక్తి, స్వభావం, పాతివ్రత్యం, తపస్సు, ఉపవాసం వదలకుండా, అశోకవనంలో వుంది. ఇది వీరెవ్వరూ నాతో చెప్పింది కాదు. స్వయంగా నా కళ్లతో నేనే చూసాను" అంటూ, తనూ, సీతాదేవీ మాట్లాడామనటానికి గుర్తుగా చిత్రకూట పర్వతంపైన జరిగిన కాకాసుర వృత్తాంతాన్ని చెప్పాడు. చెప్పి," అక్కడ చూసిన సర్వస్వం చెప్పమన్నది సీతాదేవి. చెప్పాను. నెలరోజులెట్లాగో ప్రాణాలు నిలబెట్టుకుంటానన్నది. ఎంత శుష్కించి పోయినా, పతివ్రతా ధర్మాన్ని మాత్రం విడువకుండా, రావణుడింట్లో నిర్బంధంగా జీవిస్తున్నది. ఉన్నదున్నట్లు సర్వం నీకుతెలిపాను. నీవెట్లైనా సముద్రాన్ని దాటే ప్రయత్నం చేయి" అంటాడు. చెప్పదల్చుకున్నది చెప్పిన తర్వాత, అక్కడున్న వారందరూ నమ్మేటట్లు, సీతాదేవి ఇచ్చిన చూడామణి దివ్య రత్నాన్ని తీసి శ్రీరాముడికి సమర్పించాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-66

సీతాదేవి చూడామణి చూసి దుఃఖించిన శ్రీరాముడు

సీతను తలచుకుని, ఆమెను కౌగలించుకున్న రీతిలో, చూడామణిని రొమ్మునకు హత్తుకుని, సీతను తలచుకుంటూ, దుఃఖం పొంగిపొర్లి వస్తుంటే, లక్ష్మణ,సుగ్రీవులతో ఇలా అంటాడు శ్రీరాముడు:

"సుగ్రీవా! మనుష్యులకు అసాధ్యమై, కేవలం దేవతలే ధరించగల, ఈ చూడామణిని చూడగానే, లేగదూడను చూసిన, ఆవులాగా అయిపోయింది నా మనస్సు. దీన్ని మా మామగారు, సీతాదేవికి వివాహ సమయంలో ఆమె శిరస్సు అలంకరించాడు. శిరస్సున చూడామణితో ఆమె కాంతివంతంగా ప్రకాశించింది. దివ్యమై, సత్పురుష పూజితమై, జలంలో పుట్టిన ఈ చూడామణిని, యజ్ఞం చేస్తున్న మా మామగారికి, ఆయన మీద దయతో, సంతోషంతో ఇంద్రుడు ఇచ్చాడు ఆయనకు. దీనిని చూస్తుంటే, మా మామ జనకరాజునూ, తండ్రినీ చూసినట్లు అయింది. సీతాదేవి శిరస్సులో ప్రకాశించే దీనిని చూడగానే సీతాదేవే వచ్చినట్లుగా అనిపిస్తున్నది".

దాహంతో అలమటిస్తూ, దప్పిక గొన్నవాడికి మంచినీళ్లు పోసినట్లు, తనకు సీతాదేవి వాక్యాలను వినిపించమని ఆంజనేయుడితోనూ, సీతాదేవి లేని చూడామణిని చూడటమంటే అంతకంటే గొప్ప దుఃఖమేమన్నా వున్నదా అని లక్ష్మణుడితోనూ అంటాడు శ్రీరాముడు.

"నన్ను విడిచి సీత ఇంకొక నెల రోజులు జీవించి వుంటే, ఆమెకు మరణమే లేదు. ఎన్ని రోజులైనా బ్రతికుంటుంది. ఆ కాటుక కంటిని వదిలి ఒక్కక్షణం కూడా బ్రతికుండలేను. నేను బ్రతికుండాలంటే నన్నామె దగ్గరకు తీసుకొనిపొండి. సీత ఇలా వుందని విని కూడా, ప్రాణాలతో వుండడం నా వశం కాదు.

(అమితంగా దుఃఖించిన రాముడు, అంత దుఃఖంలో కూడా, తనను సీత దగ్గరకు తీసుకు పొమ్మంటాడే కాని, ఆమె నెందుకు తీసుకు రాలేదనికానీ, తీసుకు రమ్మని కానీ అనడు).

తన ఆత్మకు నేను ఈశ్వరుడనని సీత చెప్పింది కాని, నా ఆత్మకు ఆమే "ఈశ్వర–ఈశ్వరి" రెండూ! నా మనస్సు, ప్రాణాలు, జీవుడు, ఆమె వశంలోనే వున్నాయి. అలాంటి సీత, భయపడే స్వభావమున్న సీత, ఆ దేవి, దిగులు పుట్టించే మాటలు, దిగులు పుట్టించే రాక్షసస్త్రీల మధ్య ఎట్లా జీవిస్తున్నదో కదా! ఇదెంత అసాధ్యమైన కార్యం? ప్రాణాలతో వున్నా, మేఘాలు కమ్ముకున్న శరత్కాల చంద్రుడిలా కాంతిహీనమై పోలేదా?"

తాను వచ్చి సీత దుఃఖం పోగొట్టలేదని, ఆమె కోపంతో వున్నదా? అని ఆంజనేయుడిని అడుగుతాడు. రోగికి ఔషధం ఎలానో, అలానే తనకు హనుమంతుడి మాటలంటాడు. తేనెవంటి మాటల స్వభావంకల ఆమె, తన్నొదిలి వుండడంవల్ల, తనను ఉద్దేశించి ఏం చెప్పిందో ఆమాటలే చెప్పమని కోరుతాడు శ్రీరాముడు హనుమంతుడిని.

❖ ❖ ❖

సర్గ-67

శ్రీరాముడికి కాకాసుర వృత్తాంతాన్ని చెప్పిన హనుమంతుడు

శ్రీరాముడికోరిక ప్రకారం హనుమంతుడు సీతాదేవి చెప్పిన మాటలన్నీ వినిపిన్చాడు. గుర్తుగా చిత్రకూట పర్వతం మీద జరిగిన వృత్తాంతాన్నీ చెప్పాడిట్లా:

"నీతో నిద్రిస్తున్న సీతాదేవి ముందుగా లేచినప్పుడు తటాలున కాకి ఒకటి ఎగిరొచ్చి, ఆమె స్తనం మధ్యలో తన వాడి కొనగోళ్లతో తాకింది, గీకింది. నిద్రిస్తున్న ఆమె మేల్కొనడం గమనించిన నీవు ఆమె తొడపై తలపెట్టి నిదురపోయావు. ఇలానీవు సుఖనిద్రలో వున్నప్పుడు అదేకాకి మళ్లావచ్చి ఆమెను బాధించడం జరిగింది. ఆ ఉత్తమస్త్రీని, సీతాదేవిని, కాకి పలుమార్లు గాయం పడేవిధంగా ముక్కుతో పొడవడం వల్ల ఆమెనుండి వెలువడిన నెత్తురు సరీగ్గా నీమీదపడింది. సీతాదేవి చెప్పిన ఆ వృత్తాంతాన్ని యధాతధంగా ఆమె చెప్పిన మాటల్లోనే నీకు చెప్తా వినమని" అంటాడు హనుమంతుడు. సీతాదేవి చెప్పిన ఆమాటలు:

"పూర్వం చిత్రకూటంలోని, మందాకినీ తీరం దగ్గర నివసిస్తున్నప్పుడు, ఓనాడో కాకి, నన్ను మాంసమనుకుని, తనముక్కుతో పొడవగా, ఓ మట్టిపెళ్లను ఆ తుంటరి కాకిమీద విసిరాను. అయినా అదిపోకపోతే, కోపంతో దాన్ని తరిమి కొట్టటానికి, నా ఒడ్డాణం తీసాను. అప్పుడు నా చీర జారిపోవడం, నీవు నవ్వడం, సిగ్గుతో నేను ఆయాసపడడం జరిగింది. కాకిముక్కుతో గీకిందన్న కోపం, నువ్వు నవ్వడంతో కలిగిన సిగ్గుతో, ప్రయాసపడి వొచ్చి నీ ఒళ్లో చేరాను. అప్పుడు నా కళ్లల్లో నీళ్లు కారుతుంటే, నీవు నన్ను ఓదార్చలేదా? అట్లా అలసిపోయి, నిద్ర రాగా, నీ తొడమీద పడుకున్నాను. ఆ వెంటనే నేను లేవగా, నా తొడపైన తలవుంచి నీవు పడుకున్నావు".

"రామచంద్రమూర్తీ! నీవు నిదురించగానే, ముందు బాధపెట్టిన కాకే, నాదగ్గరకొచ్చి, నా స్తనాలను గీరి, ముక్కుతో నాకు బాధకలిగేటట్లు పొడిచింది.

ఆ గాయం నుండి రక్తంకారి, ఆబొట్లు నిదురిస్తున్న నీపైన పడ్డాయి. ఆ పాపపు పక్షిపెట్టే బాధ సహించలేక, సుఖంగా నిద్రిస్తున్న నాధుడిని, శ్రీకాంతుడిని, శత్రుమర్దనుడిని, నిన్ను లేపాను. అప్పుడు నీవు లేచి, నా స్తనములందున్న గాయాన్ని చూసి, కోపంతో, ఈ పాపం చేసినవాడెవ్వడో చెప్పు, వాడినిప్పుడే రూపుమాపెదనన్నావు. రోషంతో బుసలు కొట్టే ఐదు తలల పాముతో ఆడుకుంటానికి సాహసించిన వాడెవరని అంటూ, నాకెదురుగా వున్న కాకిని నెత్తురుతో తడిసిన గోళ్లతో చూసావు. నీవు చూడగానే, కాకిరూపంలో వున్న ఇంద్రుడి కొడుకు, గాలిలాగా కొండ దిగి పరుగెత్తసాగాడు".

"పరుగెడ్తున్న కాకిని చూసి, కోపంతో, దయను వదిలేసి, దర్భాసనంలోని దర్భను తీసి, దాన్నే బ్రహ్మాస్త్రంగా కాకిమీద వేసాడు. (అస్త్రం అంటే మంత్రించి విసిరివేసే ఆయుధం. శస్త్రం అంటే హింసించడానికో, చికిత్సకో ఉద్దేశించబడింది. నియమ నిష్టలుంటేనే అస్త్రం పనిచేస్తుంది. శస్త్రం ఒక పరికరం లాంటిది) ఆ దర్భపోచ ఆకాశంలో పోతున్న కాకిని వెంటాడింది. ఆ కాకి ముల్లోకాలు తిరిగి, ఎంతోమంది శరణు కోరింది. ఇంద్రుడు, బ్రహ్మాది దేవతలు, గొప్ప మహర్షులు, అందరూ దానిని కాపాడలేమని చెప్పారు. వేరే గతిలేక మళ్లీ తిరిగొచ్చి రాముడినే శరణుకోరింది".

"శరణు-శరణని భూమిపై సాగిలబడిన కాకిని చూసి, అది చంపబడాల్సిందే అయినా, దయతల్చి వదిలేసావు. ప్రపంచంలో, ఏ ఒక్కడైనా కాపాడలేకపోయిన ఆ కాకి నీ శరణుజొస్తే, దాన్ని చూసి నీవు, బ్రహ్మాస్త్రం వ్యర్థం కాదు, ఏమిస్తావని అడిగావు. అది తన కుడి కంటిని తీసుకొమ్మంది. ఆ భయంకర బాణం దాని కుడికన్ను హరించి వేసింది. కాకేమో చావుతప్పి కన్నులొట్టబోగా, రాముడినీ, దశరథుడినీ తలచుకుంటూ, నమస్కరిస్తూ పోయింది".

"నరేంద్రా! నాకు చిన్న బాధ కలిగితేనే, ఆ బాధ కలిగించిన కాకిపైన బ్రహ్మాస్త్రం ప్రయోగించావే! నిన్ను తిరస్కరించి, ఇంతకాలం, ఇంత బాధపెడుతున్న ఈ క్రూరుడిని ఎందుకు ఉపేక్షిస్తున్నావు? ఇలా చేస్తే, నీవు నరేంద్రుడవెట్లా అవుతావు? నీ నరేంద్రత్వానికి హాని రాదా? జగన్నాథా! నీ బలపరాక్రమ

సాహసాలెట్టివో, ఎంతటివో నేనెరుగుదును. తెలియబట్టే నీవు నన్ను తప్పక రక్షిస్తావని నమ్మి వున్నాను. అన్ని గుణాలలో దయాగుణమే శ్రేష్ఠమని నీవు నాతో చెప్పావుకదా! ఆ దయ బాధపడ్తున్న నామీద ఎందుకు చూపడం లేదు? నిన్ను నాథుడిగాగల నేను అనాథలాగా పడి వున్నానే! ఇలా చేయడం నీకు ధర్మమేనా?"

"హనుమా! సముద్రం లాంటి గాంభీర్యం కలవాడు, ప్రకాశించే పరాక్రమం గలవాడు, శత్రుసంహారంలో సమర్థుడు, ఇంద్రుడితో సమానమైన రామచంద్ర భూపాలుడు చతుస్సముద్రాలతో నిండిన భూమండలానికి భర్త. ఇలాంటివాడు, అస్త్రవిద్యలో పండితుడు, శ్రేష్టుడు, మంచి బలవంతుడు, మంచి స్వభావం కలవాడూ అయిన రామచంద్రమూర్తికి నా మీద కాస్తయినా దయవుంటే, ఎందుకొక్క అస్త్రం సంధించడు? ఉత్తమ దివ్యాస్త్రాలను కలిగి వున్న రాముడు, రాక్షసుల మీద ఎందుకు పదునైన అస్త్రాలు వేయడంలేదు? దేవదానవులు, పన్నగ గంధర్వులు, యుద్ధభూమిలో ఆయన వంకైనా స్థిరంగా చూడలేరే? ఆట్టివాడు, నామీద ప్రేముంటే, రాక్షసులను చంపడా? దీనికి కారణం ఏమీలేదు....నామీద దయ లేకపోవటమే!"

"ఆంజనేయా! రామచంద్రమూర్తి ఉపేక్ష చేసినా నన్ను తనతల్లిలాగ చూసుకునే లక్ష్మణుడు, నా వలెనే పరతంత్రుడైనా, అన్న అనుమతి తీసుకుని, నన్ను రక్షించే ప్రయత్నం ఎందుకు చేయలేదు? ఆయన పగవారిపాలిట యముడే! దోషం కల భార్యలను భర్తలు విడిచిపెట్టవచ్చుగాని, దోషం కలదైనా తల్లిని కొడుకు విడిచి పెట్టవచ్చా? అలాంటిది లక్ష్మణుడు నన్నేల విడిచిపెట్టాడు? అన్నదమ్ములిద్దరూ అగ్ని, వాయువు లాంటివారు. ఎవరూ ఓడించజాలని సమర్థులు. వారు నన్నుపేక్షించడానికి కొద్దో-గొప్పో నేనుచేసిన దుష్కృతం తప్ప ఇంకే కారణం కనిపించడం లేదు. వాళ్లలో దోషముందని ఎట్లా అనను? వారు సమర్థులే! నామీద ప్రేమలేనివారు కాదే! కాబట్టి దోషం నాదే! "

(దివ్యమంగళ విగ్రహుడూ, సత్యసంధుడూ, ధర్మజ్ఞుడూ అయిన తన భర్త శ్రీరాముడు, తనను అరణ్యానికి రావద్దని వారిస్తున్న సందర్భంగా ఆయన్ను పురుషకారంలో ఉన్న స్త్రీవి అని సీతమ్మ అనడం భగవదపచారం. వాస్తవానికి

భగవదపచారం చిన్నది. ఆ వేళ మాయలేడిని తీసుకురావడానికి వెళ్లిన రాముడు ఎంతకూ తిరిగిరాక, లక్ష్మణా! సీతా! అన్న కేకలు వినిపిస్తున్నప్పుడు సీతమ్మ లక్ష్మణుడిని తక్షణమే వెళ్లి రాముడిని రక్షించమన్నప్పుడు, లక్ష్మణుడు సీతమ్మను ఒంటరిగా విడిచి వెళ్లడు. అప్పుడు సీతమ్మ విసిగిపోయి లక్ష్మణుడిని దుర్భాషలాడుతుంది. అనరాని మాటలంటుంది. పరమ భాగవతోత్తముడైన లక్ష్మణుడిని అలా నిందించడం భాగవతాపచారం. ఇది భయంకరమైన అపచారం. ఈ రెండు అపచారాలలో రామాపచారం భగవదపచారమే అయినా చిన్నదే. లక్ష్మణాపచారం భాగవతాపచారమైనందున పెద్దది. ఇవి చేసింది సీతమ్మ)

సీత సందేశాన్ని, జరిగిన సంభాషనను శ్రీరాముడికి చెప్పిన హనుమ

శోకంతో కూడిన మాటలను, కళ్లల్లో నీరు కారుతుంటే, కలవరపడుతూ, అడుగుతున్న సీతాదేవిని చూసి, ఓదార్పు మాటలతో నేను, సీతకు కష్టకాలం పోయిందనీ, దుఃఖం అంతరిస్తుందనీ, లంకనెప్పుడు భస్మం చేయాల్నా అని రామలక్ష్మణులిద్దరూ ఎదురు చూస్తున్నారనీ, చెప్పానంటాడు హనుమంతుడు. సీతకు ద్రోహం చేసిన, రావణుడిని బంధువులతో సహా చంపి శీఘ్రంగా అయోధ్యకు రామచంద్రుడు తీసుకుపోయే సమయం వచ్చిందని కూడా చెప్పానంటాడు.

ఆమెకు ఓదార్పు మాటలతో చెప్పిన విషయాలను రాముడికి విన్నవించిన తర్వాత జరిగిన సంభాషణను కూడ చెప్పాడు. అమ్మా! రాజపుత్రీ! రామచంద్రమూర్తి జ్ఞాపకం వుంచుకునే గుర్తు ఏదైనా ఇవ్వు, అంతమాత్రం చేస్తే చాలు అని తను చెప్పగానే, దగ్గరలో వున్న రాక్షసస్త్రీలెవరూ చూడకుండా, నలుదిక్కులా కలియ చూసి, రావణుడికి తెలియకుండా వుండాలనే వుద్దేశ్యంతో, తలలో ధరించాల్సిన చూడామణిని, చీరె కొంగు ముడిలోనుండి తీసి, తనపై వున్న ప్రేమతో, తన చేతుల్లో వుంచిందంటాడు. అది తీసుకుని ఆమెతో బయల్దేరుతానని చెప్పానన్నాడు.

"ఇలా చెప్పి నా తలను సీతాదేవి పాదాలపై వాల్చి లేచాను. నా ప్రయాణ సన్నాహాన్నీ, సముద్రం దాటడాన్నీ ప్రోత్సహించిన ఆ పుణ్యాత్మురాలిని చూసి, కళ్లవెంట నీళ్లుకారి, మాట తడబడింది. సీతాదేవి నాముఖం చూసి శోకంతో ఇలా పలికింది:"

"ఆంజనేయా! రామచంద్రమూర్తిని, ఆయన తమ్ముడిని, మంత్రులతో సహా సుగ్రీవుడినీ, ఆక్కడున్న మిగతా వారందరినీ, కుశలమడిగానని చెప్పు. నన్నీ ఆపత్సముద్రంలో మునగకుండా, ఎట్లా చెప్పితే రాముడు నన్ను రక్షిస్తాడో, అట్లానే చెప్పు. నేను పడ్డ నానా కష్టాలనూ నా భర్తతో చెప్పు. వెళ్లిరా! నీకు శుభం కలుగుగాక!" అంటూ శలవు ఇచ్చింది నాకు.

"ఈ విధంగా మీ ఆర్యామణి, వరవర్ధిని, సీతాదేవి ఎంతో విషాదపడుతూ చెప్పిన మాటలివి. ఆమె జీవించి వుందని నా నమ్మకం" అంటాడు హనుమంతుడు.

❖ ❖ ❖

సర్గ-68

సీతాదేవికి, తనకు జరిగిన సంభాషణను తెలిపిన హనుమ

తన పైన శ్రీరాముడికి కల స్నేహ భావం వల్లా,రాముడి దూతనైనందువల్లా, తృప్తిలేని అనురాగంతో, నమ్మకంతో, తనతో సీతాదేవి సంభాషించిందనీ, ఆ వివరాలూ చెప్పాడీ విధంగా ఆమె మాటల్లోనూ, ఆమెకు తనిచ్చిన సమాధానంతోనూ:

"ఆంజనేయా! ఒకరోజు నువ్విక్కడుంటే, నాకొచ్చే లాభం ఏంటి? ఆ తర్వాతైనా ఎప్పటిలాగా ఏడ్వాల్సిందే కదా! నువ్వు మాత్రం ఎన్నాళ్లుంటావిక్కడ? నీకిక్కడ ఆలస్యమైతే, నీ కోసం ఎదురుచూస్తున్న రామచంద్రమూర్తి, నాకంటే ఎక్కువగా పరితపిస్తాడు కదా! నువ్వు ఇక్కడుంటే జరగాల్సిన పనులెలా జరుగుతాయి? అందుకే శ్రీరాముడి దగ్గరకు పోదల్చుకుంటే పో! మళ్లీ ఎన్నాళ్లకొస్తావో, ఏంటో! అంతవరకు నా ప్రాణం వుంటుందో, లేదో? చెప్పలేను. ఎందుకంటున్నానంటే, నిన్ను చూడగానే పోయే ప్రాణాలు నిలబడ్డాయి. మరి నువ్వు కూడా పోతే ఆ ప్రాణాలుంటాయో, పోతాయో చెప్పలేను" అంటుంది.

"నువ్వెట్లాగూ సముద్రాన్ని దాటిపోతావు. రాముడికి నా సంగతులన్నీ చెప్తావు. ఆ అన్నదమ్ములిద్దరూ, వానరసేనతో సముద్రతీరానికి వస్తారు. ఆ తర్వాత ఏం జరుగుతుందనేదే ప్రశ్న. ఎలుగుబంట్లు, వానరులు, రాజకుమారులు, అలవికాని ఆ సముద్రాన్ని ఎట్లా దాటుతారయ్యా? ఈ భూ ప్రపంచంలో, నువ్వూ, గరుత్మంతుడు, వాయుదేవుడు తప్ప ఇంక ఎవరూ ఈ సముద్రాన్ని దాటలేరని నా అభిప్రాయం. నేనాలోచిస్తున్న కొద్దీ, వారిక్కడకు రావడం, అసాధ్యమైన పనిలాగానే తోస్తున్నది. అయినా కార్యదక్షుడవైన నీకు చేయలేని పనేదీ లేదు. దీనికి ఏమని సమాధానమిస్తావు? ఎలా నెగ్గుకొస్తావో నాకు తెలియదుకాని, సాధించగలవాడివి మాత్రం నీ వొక్కడివే! ఎవరూ చేయలేరు, కీర్తినీ పొందలేరు. కాని నీవిలాచేయడం నాకు కీర్తికరం కాదు" ఇంకా ఇలా అంటుంది:

"రామచంద్రమూర్తి సైన్యంతో వచ్చి, యుద్ధంలో బల-పరాక్రమాలను ప్రదర్శించి, రావణుడిని చంపి, నన్ను అయోధ్యకు తీసుకొని పోతేనే అది నాకు కీర్తికరం. అప్పుడే నేను వీరపత్నినన్న బిరుదుకు కూడా అర్హురాలిని అవుతాను. ఇది రాముడికి సాధ్యపడుతుందా, పడదా అనేసంగతి వేరే విషయం. కాని ఇంకే విధంగా జరిగినా నాకు కీర్తికరం కాదు. నేను చెప్పినట్లు చేసి, తన బలంతో, బాణాలతో లంకను భస్మం చేసి, నన్ను వెంట తీసుకునిపోతే, నాకేకాదు, శ్రీరాముడికీ కీర్తి. ఆయన వంశానికీ కీర్తి దక్కుతుంది. నాకోసం కాకపోయినా, తనకోసమైనా నేను చెప్పినట్లు చేయాల్సిందేనని నా కోరిక. ఆడదానినైన నా ఆలోచనావిధానమిది. యుద్ధంలో శూరుడైన రామచంద్రమూర్తికి తగినటువంటి చర్య ఏదో ఆలోచించి చెప్పు".

జవాబుగా హనుమంతుడు: వానర, భల్లూక రాజైన సుగ్రీవుడు సీత నిమిత్తమై, గొప్ప సైన్యంతో రాముడికి సహాయపడేందుకు నిర్ణయించుకున్నాడనీ, ఆయనతో వచ్చేవారంతా అసమాన పరాక్రమవంతులనీ, దేవతలతో సమానులనీ, మనోవేగం కలవారనీ, దిక్కులలో, ఆకాశంలో సంచరించేవారనీ, వారంతా శీఘ్రంగా రాబోతున్నారనీ, ధైర్యం చెప్పాడు సీతకు హనుమంతుడు. వారెటువంటివారో చెప్తూ హనుమంతుడు:

"ఎంతటి కష్టకార్యమైనా ఏ మాత్రం అలసట పడకుండా చేయగలుగుతారు. పరాక్రమవంతులు. సముద్రంతో, పర్వతాలతో వ్యాపించివున్న భూమండలాన్ని ఆకాశమార్గాన చుట్టిరాగల సమర్థులు. వారికీ సముద్రం దాటడం చాలా చిన్నపని. వానరులలో సముద్రాన్ని దాటగల నాలాంటి వారు చాలామంది వున్నారు. సుగ్రీవుడి దగ్గరున్నవారందరూ నాకంటే గొప్పవారో, సమానులో కాని తక్కువైన వాడొక్కడు కూడలేదు. వారిటుపక్కకు రానందున నువ్వు వారిని చూడలేదు. నా పుణ్యంకొద్దీ నేను రాగలిగాను, నిన్ను చూడగలిగాను. అంతమాత్రాన వానరులందరిలో నేనే మొనగాడినని నీవెట్లా నిశ్చయించావు? వానరులందరిలో చిన్నవాడినీ, ఒక కోతినీ అయిన నేనే నిన్ను చూడగాలేంది, అసమాన బలవంతులైన ఇతరుల సంగతి చెప్పాలా? రాజు శత్రువుల దగ్గరకు పంపేటప్పుడు, అల్పులను మొదట పంపుతాడుకాని, మహాబలవంతులను

పంపడు కద!. ఇది రాజనీతి. ఎందుకంటే బలవంతుడు శత్రువు దగ్గర చిక్కుపడితే తన బలం తగ్గుతుంది కాబట్టి".

"రామలక్ష్మణులు ఎట్లా వస్తారా అనే సందేహం కానీ, రారని శోకించడం కానీ వదులుకో. నీవు దుఃఖించే కాలంపోయింది. నేనుపోయి చెప్పగానే ఒక్కగంతేసి, వానరులొస్తారిక్కడకు. రామలక్ష్మణులు, సూర్య, చంద్రుల్లాగా నావీపుపైకెక్కి, నీ ఎదుట నిలుస్తారు. వారి బాణాగ్నికి లంకంతా పాడైపోతుంది. రావణుడిని సేనలతో సహా చంపి రాముడు నిన్ను అయోధ్యకు తీసుకుపోతాడు. మేమెప్పుడొస్తామా అని మా రాకకొరకు ఎదురుచూస్తుండు. ఏ సాహసం చేయొద్దీలోపల. మండుతున్న అగ్నిహోత్రం లాగా రామచంద్రమూర్తిని ఇక్కడ చూస్తావు. రాక్షసుడికేగతి పడ్తుందో చూడు. కొడుకులతో, చుట్టాలతో, మంత్రులతో చచ్చిపోయి రావణుడు నేలకూలగా చూసిన నీవు దుఃఖ సముద్రపు ఒడ్డుకు చేరుకుంటావు. రోహిణి చంద్రుడిని కలుసుకున్నట్లు, నీవూ నీ భర్తను కలుస్తావు".

"అమ్మా! విల్లు, బాణాలు ధరించిన రామలక్ష్మణులు, త్వరలోనే లంకవాకిట్లో నిలుస్తారు. వారివెంట గోళ్లు, కోరలు ఆయుధాలుగా వుండే, సమర్థులైన, పర్వత సమానులైన వానరులుంటారు. రావణుడి భయం వదులు. ఏ విషయంలోనూ రామచంద్రమూర్తికంటే గొప్పవాడెవరు? లక్ష్మణుడికి సమానమైన వాడెవ్వడు? వారిరువురు అగ్ని, వాయువుల్లాంటివారు. ఈ రెండూ ఏకమైతే శత్రు నిశ్శేషం చేస్తాయి. వీళ్లిద్దరూ నీకు సహాయంగా వస్తుంటే, నీకొచ్చిన భయం లేదు. నేను పోయి రామచంద్రమూర్తిని చూడటమే ఆలస్యం. ఆ వెంటనే భయంకర వానర సమూహంతో బయల్దేరి వచ్చి శత్రువులను సంహరిస్తాడు. రాక్షసులు కాపాడుకుంటున్న ఈ లంక శాశ్వతంగా దుఃఖాల పాలుకానున్నది. ఇంద్రుడిని శచీదేవి కలుసుకున్నట్లు, నీవూ రామచంద్రమూర్తిని కలుసుకోబోతున్నావు. ధైర్యంగా వుండు".

కోరలు, గోళ్ళు ఆయుధాలుగాగల పరాక్రమవంతులైన వానరులు త్వరలోనే లంకకు రావడం, సీతాదేవే స్వయంగా చూడబోతున్నదనీ, వారి భయంకర సింహనాదాలు లంకలోని పర్వతాలలో వినపడే సమయం ఆసన్నమయిందనీ,

తాను సీతాదేవికి చెప్పానన్నాడు హనుమంతుడు. నిబంధన ప్రకారం వనవాసాన్ని గడిపి, విరోధులందరినీ చంపి, సీతాదేవితో సహా అయోధ్యలో పట్టాభిషేకం జరుపుకుంటారనీ కూడా ఆమెతో చెప్పానన్నాడు. ఇలా ఎన్నోవిధాలుగా చెప్పి, ఆమెను నమ్మించి, దుఃఖపడకుండా చేసి వచ్చానంటాడు.

(సీత శీలవతికదా! పరపురుషుడైన హనుమంతుడితో ఎలా చనువుగా మాట్లాడిందని అనుకోవచ్చు. ఆమె మాట్లాడటానికి కారణం, తన యోగ్యత కాదనీ, తనపైన శ్రీరాముడికిగల స్నేహభావమేననీ, ఆయన పంపిన దూతను కనుకనే తన మాటలను నమ్మి, ఆమె మాటలు చెప్పిందనీ హనుమంతుడంటాడు. హనుమంతుడిపై శ్రీరాముడికి ప్రేమ లేదని కానీ, ఏదో దూతగానే వచ్చాడని కానీ అనుకుని వుంటే సీత మాట్లాడేది కాదేమో! హనుమంతుడిపై శ్రీరాముడికి ప్రేముందనుకున్నా, ఆయన పంపిన దూతేనన్న నమ్మకం కుదరకపోయినా మాట్లాడకపోయేదే! ఈ రెండింటికీ హనుమంతుడు నిదర్శనాలు చూపించిన తర్వాతనే మనసు విప్పి మాట్లాడింది. అదే రావణాసురుడితో మాట్లాడినప్పుడు, గడ్డిపోచను అడ్డం వేసుకుని, వెనుక పక్కకు తిరిగి మాట్లాడిందికాని, హనుమంతుడితో లాగా ఎదురుగా వుండి మాట్లాడలేదు. దీనర్థం: భర్తకు అంతరంగిక స్నేహితులై, భర్త పంపినవారైతే, పతివ్రత కూడా పరపురుషుడితో మాట్లాడవచ్చని.

హనుమంతుడు రామచంద్రమూర్తికి సీతా వృత్తాంతమే చెప్పాడు కాని, తను పడ్డ కష్టాలను ఒక్కటైనా చెప్పలేదు. చెప్పితే ఆత్మస్తుతవుతుందనుకుంటాడు. ఇంకో విషయం: శ్రీరామచంద్రుడికి చెప్పాల్సింది సీతా వృత్తాంతం కాని, హనుమంతుడు పడ్డ ప్రయాస కాదు కదా!)

❖ ❖ ❖

వాసుదాసస్వామి సుందరకాండ ముగింపు పలుకులు

ఇలా సుందరకాండ "త" కారంతో మొదలై, "త" కారంతో ముగుస్తుంది. "తరువాత రావణాసుర" అనే పద్యంతో మొదలై, "శ్రీరామవహించే శాంతి సీత" అనే పద్యంతో ముగుస్తుంది.

(ఇదీ సుందర మందర మకరందం! చదివాం మనమందరం.....మన మందరం! ఆంధ్రవాల్మీకి అనుగ్రహ ప్రసాదం!)

"ఓమ్", "తత్", "సత్" అనేమూడు పదాలు శ్రుత్యర్థ రహస్యాన్ని బోధిస్తున్నాయి.

"ఓమ్"...... ఇంతవరకు పఠించినవారికి పూర్వకాండలలో చెప్పిన ప్రణవార్థానికి అనుష్టానం ఆకాండలలో స్పష్టంగా గోచరిస్తుంది. దానిని వివరించడానికి, ఇందులో అష్టాక్షరి మంత్రానికి అన్వయముంది. సుందర కాండలో సూచించిన పద్ధతిలో మూల గ్రంథం సమన్వయం చేసుకునేవారికి, ఈ విషయం సులభంగా అర్థమవుతుంది.

ఇక రెండవదైన "తత్".......అనేదానికీ, దాని అర్థానికీ, అన్వయం ఈ కాండ బోధిస్తున్నది. "తరువాత రావణాసుర" అని ఈ కాండ, "త" కారంతో ప్రారంభమై, "శ్రీరామ వహించే శాంతి సీత", అని "త" కారంతోనే ముగించడం జరిగింది. భగవత్ గీతావాక్యాలలో "తత్" అనేదానికి చెప్పిన అర్థానికీ,ఇందులో అన్వయం కనిపిస్తుంది. అందువల్ల, సుందరకాండ మోక్షకాములకు అవశ్య పఠనీయమని చెప్పాలి.

మూడవదైన "సత్"..... అనేదాన్ని మొదటి పద్యంలోని "సీత" అనే పదం, కడపటి పద్యంలోని "సీత" అనే పద్యం సూచిస్తున్నది. "సత్" పదానికి అర్థాన్ని గీతావాక్యమే వివరించింది. దానికీ అన్వయం సీతా చర్యలో చూడవచ్చు.

ఈవిధంగా, ముముక్షువు అయిన వాడి భావమెట్లా వుండాలి? చర్య ఎలా వుండాలి? వాడు తెలుసుకోవాల్సిన విషయమేంటి? అనే అంశాలు కూడా సుందరకాండలో స్పష్టంగా వున్నాయి. సుందరకాండ ముముక్షువులకు, బుభుక్షువులకు, నిష్కాములకు, సకాములకు, స్త్రీలకు, పురుషులకు, సేవ్యమై,

సార్థకనామం సంతరించుకున్నది. సీతారామానుగ్రహం వలన, ఆంజనేయుడు సముద్రాన్ని దాటి, రామకైంకర్యం పూర్తి చేసినట్లే, శ్రీసీతారామాంజనేయ అనుగ్రహం వల్ల, ఈ వ్యాఖ్యాత (వాసుదాసస్వామి), ఈ కాండను పూర్వ పుణ్యం వల్ల పూర్తి చేయగలిగాడు.

❖ ❖ ❖

సుందరకాండ ముగింపు పద్యాలు

"యతి మానస బి సజలాయ! యత మాన జనార్ధ నిర్వహణ సు సమర్థా!
నత సర్వభూతచయ! యిం, గిత విజ్జనవర్య! విబుధ కీర్తిత చర్యా!"

(ఇలా చెప్పడంవల్ల, ఈ గ్రంథకర్త అభిప్రాయం తెలుసుకుని దానిని నెరవేర్చాడని అర్థం).

పద్మనాభవృత్తం:

"రామా! నతాంహోవిరామా! మునీంద్రాత్మరామా! దయాసత్యధామా! నిశాట
స్తోమావలీ భీ మసంగ్రామ సీమా! విధూ మత్రిధా మాభ తేజస్సుధామా!
రామాంబు ముగ్ధామ! నీలోత్పల శ్యామ రాకేందుకా మాభ సౌందర్య ధామా!
సోమాది ముఖ్యామరారాధ్యనామా! విసుద్ధాత్మ భక్తావనోద్దామ కామా!"

అంబురహ వృత్తం:

"క్ష్మా రమణీ శరజాబ్జ భవానన సార సాహిత పద్య సం
వార సుశంసి నిజార్ధి మహోద్భుత జాఢ ధైర్య పరాక్రమా
భూరి పయోనిధి తారణ కారణ భూత నిర్జర యానవ
చ్చారుతురాత్మ సమాఖ్య నిజాశ్రిత సర్వ సౌఖ్య విధాయకా!"

సీతితిజానకీ రఘురామ చరణ సేవాసక్త, చిత్తుడై తత్కృపాసత్తికతన
వామలూరూద్భవు పాదముల్ దలదాల్చి, ప్రత్యక్ష బ్రహ్మాత్మ భవున కెరగి
యభి వాదనము సల్పి యాచార్యులకునెల్ల, వ్యాఖ్యాతలకును సాష్టాంగ మెరగి
పరమభక్తులును బ్రపన్నులు ముదమొంద స్వాంధ్ర వాల్మీకి రామాయణమున

గీ!! ఘన మహార్థంబు సుందరకాండమునకు,
వాసుదాసుండు రచియించి వ్యాఖ్యదీని
మందరమనంగ శ్రీరామచంద్ర విభున,
కర్పణము చేసె జన్మంబు సార్థకముగ.

సుందరకాండలో నేర్చుకోవాల్సిన విషయాలు

జీవాత్మ పరమాత్మల సంబంధమెలాంటిది?

జీవాత్మ తరణోపాయమెలాంటిది

జీవాత్ములకు సేవ్యుడు నిర్విశిష్టారాముడా?

సీతావిశిష్ట శ్రీరాముడా?

శిష్యాచార్య లక్షణాలు

ఆత్మావలోకనపరుడైన యోగి లక్షణం

బద్ధజీవ తారతమ్యం

యోగికి, భక్తప్రపన్నుడికి భేదం

సీత ఉపాయమా? ఉపేయమా?

నమోస్తు రామాయ స లక్ష్మణాయ,
నమోస్తు దేవ్యై జనకాత్మజాయై
నమోస్తు వాతాత్మభువే వరాయ,
నమోస్తు వల్మీకభ వాయ తస్మై.

❖ ❖ ❖

శ్రీ సుందరకాండ పారాయణం...సర్వ ఆపన్నివారణం

శ్రీ సుందరకాండలో సుందరుడు హనుమంతుడు. ఆయన రామాయణ మహామాలా రత్నం. కాగా సుందరకాండ (మందర మకరందం) మహామంత్ర మాలాభాండం. ఇందులో ప్రతిపదం, ప్రతి శ్లోకం, మంత్రబద్ధమైన చందఃగంధం. దీనిని భక్తితో చదివినా, విన్నా, నిత్యం పారాయణం చేసినా, ప్రవచించినా, క్లేశాలు, కష్టాలు తొలగిపోతాయి. రోగాలు నయమౌతాయి. భయాలు పోతాయి. మనశ్శాంతి కలుగుతుంది. అతి భయంకరమైన క్షయ, అపస్మారం, కుష్టు, ఉ న్మాదం లాంటివి దరిచేరవు. అశ్వినీదేవతలు కూడా నయం చేయలేని రోగాలు నయమౌతాయి. పుత్ర, మిత్రులతో వచ్చిన విరోధాలు శమిస్తాయి. కుటుంబ కలహాలు నశిస్తాయి. మృత్యు భయం పోతుంది. వివరాల్లోకి పొతే....ఏ ఫలం కోరి ఏది చదవాలి అనుకుంటే....

1. భూత-ప్రేతాదుల నుండి రక్షణకు..... లంకా విజయం-సర్గ 3
2. బుద్ధి మాంద్యం తొలగడానికి....హనుమ నిర్వేదం-సర్గ 13
3. పర దారా గమన దోష నివారణకు......లంకలో సీతాన్వేషణ ఘట్టం-సర్గలు 7-12
4. ఐశ్వర్య సిద్ధికి.....లంకలో సీతమ్మను హనుమ చూసిన ఘట్టం-సర్గ 15
5. దుస్వప్న దోష నివారణకు..... త్రిజటా స్వప్న వృత్తాంతం-సర్గ 27
6. సత్వగుణ సిద్ధికి....సీతారావణ సంవాదం- సర్గ 20-21
7. ఎడబాసిన బంధువుల సమాగానికి.... సీతా హనుమ సంవాదం-సర్గ సర్గ 33-40
8. ఆపదలు శాంతించడానికి.....అంగుళీయక ప్రదానం-సర్గ 36
9. తెలిసీ-తెలియక చేసిన రామాపచార దోష నివారణకు..... కాకానుగ్రహం-సర్గ 38
10. బ్రహ్మజ్ఞానం...... చూడామణి ప్రదానం- సర్గ 38
11. శత్రు జయం.....కింకరాది రాక్షసులను హనుమ వధించిన ఘట్టాలు-సర్గ 42-47

12. గృహం, వ్యవసాయ పనుల అభ్యుదయానికి...... లంకాదహన ఘట్టం-సర్గ 54
13. బ్రహ్మలోక ప్రాప్తి ...... మధువన ధ్వంసం-సర్గ 61
14. మనోవాంఛా సిద్ధికి.... సీతా సందేశాన్ని రాముడికి నివేదించడం-సర్గ 67
15. పుత్ర సంతానానికి.... 68 రోజుల పారాయణం-రోజుకు 7 సర్గలు చొప్పున
16. కన్యా వివాహం..... 68 రోజుల పారాయణం...9 రోజుల్లో ఒక ఆవృతం
17. వర్షప్రాప్తికి, కరవు నివారణకు, దారిద్ర్య నిర్మూలనకు నిత్య పారాయణం
18. యుద్ధ విజయానికి....అంగులీయక ప్రదానం-సర్గ 36
19. శని బాధా నివారణకు.....బ్రహ్మాస్త్ర బంధం నుండి విముక్తి, హనుమద్గ్రహణం-సర్గ 48
20. సర్వకార్య సిద్ధికి, సకల శుభాలకు.....నిత్య పారాయణం.

<u>నైవేద్యం</u>: పారాయణానంతరం ఆవు పాలను బాగా కాచి, గోరు వెచ్చగా చల్లార్చి, చక్కర కలిపి, శ్రీరాముడికి నివేదించాలి. అన్ని నైవేద్యాలకు ఇది ప్రతినిధి.

నవగ్రహ దోష నివారణార్థం పారాయణ క్రమం:

1. చంద్ర దోష నివారణ....చంద్రవర్ణన ఘట్టం
2. కుజుడు, గుర్వంతర దశ..... హనుమ రావణుడికి చేసిన హితబోధ
3. కుజుడు, శుక్రాంతర్దశ....... హనుమ క్షేమానికి సీతమ్మ చేసిన అగ్ని ప్రార్థన
4. రాహు, శుక్రాంతర్దశ...... హనుమ రాముడికి చూడామణిని ఇవ్వడం
5. రాహు, శని అంతర్దశ...... హనుమ రాక్షస సంహారం
6. గురు మహాదశ..... సముద్ర లంఘనం (చక్కర, పేలాలు నివేదనం)
7. గురు కేతురంతర దశ.....మధువన ధ్వంసం

8. శనితో అంతర్దశ.....బ్రహ్మాస్త్ర బంధం నుండి హనుమ విముక్తి
9. శనితో బుధుడు.....లంకా దహనం
10. శనితో శుక్రుడు.....చూడామణిని సీతమ్మ హనుమకు ఇవ్వడం
11. బుధుడు.....హనుమ శ్రీరామచంద్ర స్వరూప వర్ణన
12. బుధుడిలో కుజ భుక్తి ప్రతికూలం....సీతమ్మకు శుభ శకునాలు
13. బుధుడిలో కేతువు.... అశోకవనంలో సీతమ్మను వెతకడం
14. కేతువులో శుక్రుడు...... హనుమ రాముడికి సీతాదర్శన ఘట్టం చెప్పడం
15. శుక్రుడులో శుక్రుడు.... అంగుళీయక ప్రదానం

సకల కార్యసిద్ధికి సంపూర్ణ సుందరకాండ పారాయణం సర్వఫల ప్రదం. శ్రీ సుందరకాండ పారాయణానంతరం విధిగా శ్రీరామ పట్టాభిషేక ఘట్టం పారాయణం చేయాలి.

శ్రీ రామానుగ్రహ ప్రాప్తికి, సకల బాధా నివారణకు, సకల కార్యసిద్ధికి, సర్వ శత్రు శమనానికి, సర్వత్రా విజయ పరంపరకు, కోరికలను, కోపాన్ని నియంత్రించడానికి మంత్ర శ్లోకాలు:

1. ఆపదామప హర్తారం దాతారం సర్వ సంపదాం ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయోనమామ్యాహం ॥


2. ధర్మాత్మా సత్య సందశ్చ రామో దాశరథిర్యది ।
పౌరుషేచా ప్రతి ద్వందఃశరైనంజహిరావణమ్ ॥

3. సకృదేవ ప్రసంనాయ తవాస్మీతి చ యాచతే ।
అభయం సర్వభూతే భ్యోదదామ్యేతద్రత్వం మమ ॥

4. త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ ।
హనుమన్ యతమాస్థాయి దుఃఖక్షయహరోభవ ॥

(ఉమా సంహిత నుండి సేకరణ)

❖ ❖ ❖





తండ్రి వనం శ్రీనివాసరావు గారు–పరమ భాగవతోత్తములు, శ్రీరామ భక్తులు... తన 83వ ఏట 1998 లో పరమ పదించారు. తల్లి వనం సుశీలమ్మ గారు– సహస్ర చంద్ర దర్శనం చేసుకొని నవంబర్ 2013 లో తన 90 వ ఏట మరణించారు.

స్వగ్రామం–జన్మ స్థలం: ఖమ్మం జిల్లా, ముదిగొండ మండలం, వనం వారి కృష్ణాపురం గ్రామం. ఆగస్ట్ 15, 1947 న భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఏడాదికి, ఆగస్ట్ 8, 1948 న జననం. ఒక అక్క, ఇద్దరు చెల్లెళ్లు, నలుగురు తమ్ములు.

విద్యాభ్యాసం: సొంత గ్రామంలో మాధ్యమిక; ఉన్నత పాఠశాల చదువు ఖమ్మంలో; కళాశాల చదువు ఖమ్మం, హైదరాబాద్‌లలో; విశ్వవిద్యాలయం చదువు ఉస్మానియా, నాగపూర్‌లలో... లెక్కలు, భౌతిక–రసాయన శాస్త్రాల్లో డిగ్రీ,; పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎం.ఏ; లైబ్రరీ సైన్స్‌లో డిగ్రీ.

వివాహం: ఏప్రియల్ 30, 1969 న (స్వర్గీయ) అయితరాజు రాంరావు–రాధ గార్ల కుమార్తె విజయలక్ష్మి తో వివాహం. ఇద్దరాడ పిల్లలు (ప్రేమ మాలిని, కిన్నెర); ఒక కొడుకు (ఆదిత్య). ఆరుగురు మనుమలు, మనుమరాళ్లు

ఉద్యోగాలు– ఇతర వ్యాపకాలు: లైబ్రేరియన్‌గా వృత్తి ప్రారంభం... గవర్నర్ దగ్గర ప్రాజెక్టు అధికారిగా, ఇద్దరు ముఖ్యమంత్రుల దగ్గర పౌర సంబంధాల అధికారిగా... హస్తకళల అభివృద్ధి సంస్థలో కొన్నాళ్లు... మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివద్ధి సంస్థలో కొంత కాలం... అత్యవసర సహాయ సేవల సంస్థలో మరికొంతకాలం... ఇలా అక్కడా ఇక్కడా... ప్రస్తుతం తెలంగాణ సీఎం గారి దగ్గర సీపీఆర్వో గా.

ఆంగ్లంలో మూడు పుస్తకాలు–హైదరాబాద్, చెన్నై, గోవా (స్టర్లింగ్ పబ్లిషర్స్); ఎ సింక్రోనస్ హిస్టరీ స్క్రాప్ బుక్... తెలుగులో – తిలక్ జ్ఞాపకాలు, సుందర కాండ మందర మకరందం, బాలకాండ మందర మకరందం

Sundara kanda MANDARA MAKARANDAM

Written by: *Vanam Jwala Narasimharao*

Published by: Darshanam *Devotional Magazine*